# రేడియో జ్ఞాపకాలు

- సుధామ












శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
కౌముది ప్రచురణలు - 110









కొన్ని దశాబ్దాలపాటు ఆకాశవాణిలో వివిధ హోదాల్లో పనిచేసిన అల్లంరాజు వెంకటరావు గారు 'సుధామ'గా సాహితీ లోకంలో సుప్రసిద్ధులు. సుధామగారు కవి, రచయిత, వక్త, కాలమిస్ట్, కార్టూనిస్ట్, సాహితీ విమర్శకులు..! వృత్తి రీత్యానూ, ప్రవృత్తి రీత్యానూ ఆయన కలుసుకున్న , తెలుసుకున్న వ్యక్తుల గురించి, సందర్భాల గురించి ప్రతినెలా 'రేడియో జ్ఞాపకాలు'గా మలచి మనకి అందిస్తున్నారు. సుధామగారి ఇ-మెయిల్ - **sudhama_51@yahoo.com**

*"చేత వెన్న ముద్ద*
*చెంగల్వ పూదండ*
*బంగారు మొలతాడు*
*పట్టుదట్టి*
*సందెతాయెత్తులు*
*సరిమువ్వ గజ్జెలు*
*చిన్ని కృష్ణా నిన్ను*
*చేరికొలుతు"*



ఔనండీ! ఈ బాలగేయమే నా తొలి రేడియో జ్ఞాపకం! పాదుషావారిదీ నాదీ బోడిగుండే కాబట్టి ఇద్దరం ఒకటే అని వెనకటికి ఎవడో అన్నట్లు...గొప్పగా చెప్పుకోవాలంటే ఏ రేడియో అన్నయ్య చిన్నప్పుడు ఇచ్చిన ప్రోత్సాహంతో బాపూ ముళ్ళపూడి లాంటి మహోమహులెందరో ఇవాళ ఇంత గొప్పవాళ్ళయ్యారో, నేనంత కాకపోయినా సరే.. చిన్నప్పుడు బాలన్నయ్య అనే న్యాయపతి రాఘవరావుగారు నిర్వహించే మద్రాసు పిల్లల ప్రోగ్రాంలోనే నేను ఆయన ముందే, ముందు గొంతు విప్పాను. ఇదే ఆపజ్యం.

అప్పుడు నా వయస్సెంతారా.. నాలుగేళ్ళు నిండాయేమో! ఉమ్మడి

మద్రాసు రాష్ట్రంలోనే తెలుగువాళ్ళూ ఉంటున్న రోజులు. మా నాన్నగారు అల్లంరాజు కామేశ్వరరావుగారు వైద్య ఆరోగ్య శాఖలో గుమ్మస్తాగిరిలోనే ఉన్న మామూలు మధ్యతరగతి జీవియే. మా అమ్మ రాజేశ్వరమ్మ చెప్పిన ప్రకారం నాకు లీలగా గుర్తున్న మేరకు (ఈ లీల, సుశీల ఎవరు అని అడక్కండి) మేం అద్దెకుండే టి.నగర్‌లోని పక్కింటి 'మామి'యే మద్రాస్ రేడియో స్టేషన్‌కు పిల్లల ప్రోగ్రాంలో పాల్గొనడానికి వెళ్ళడానికి కారణం.

ప్రోగ్రాం అయ్యాక పాల్గొన్న పిల్లలందరకూ, తీసుకొచ్చిన వారితో బాటుగా, రేడియో క్యాంటిన్‌లో ఇడ్లీ సాంబారూ, కాఫీ గ్రటాలిస్తారని ఆ 'మామి'గారికే తెలుసు! ఆవిడకు సదరు ఇడ్లీ తినాలనిపించడమే కాదు పిల్లల పట్ల ప్రేమ తినిపించడం కూడా ఇష్టమైన విషయం కనుకనే మా అమ్మను - నన్నూ, అన్నయ్యనూ పిల్లల ప్రోగ్రాంలో పాడించేందుకు ఉత్సాహపరిచింది. టి.నగర్ నుంచి ఎగ్మూరులోని ఆలిండియా రేడియో స్టేషన్‌కు రిక్షాలో అమ్మా, ఆ మామీ, అన్నయ్య రాధాయినీ, నన్నూ ఒళ్ళో కూచోబెట్టుకుని ఓ ఆదివారం పాడించడానికి తీసుకు వెళ్ళారు.

1956.. ఆ సంవత్సరం.. ఉగాది వెళ్ళాకే కాబోలు రేడియోలో అలా పాడడానికి వెళ్ళాను.పెరిగి పెద్దవాణ్ణయ్యాక ఆలిండియా రేడియోలోనే ఉద్యోగం చేస్తానని ఊహకయినా అప్పుడు వచ్చి ఉండదు కదా!.. ఇంతకీ ఆ జ్ఞాపకపు అసలు విషయం చెప్పాలిగా మరి... అప్పట్లో రికార్డింగులూ అవీ లేవు కదా! అప్పటికప్పుడు పాడేయడమే వాటినే లైవ్ ప్రోగ్రాంలు అంటారు. ఎవరెవరు ఏమేం పాడతారో ముందుగా వినిపించాలి. అసలు కార్యక్రమం కన్నా ముందు రిహార్సల్స్ అన్నమాట. అలా పాడించి పేర్లు రాసుకునేవారు. అసలు ప్రోగ్రాం అప్పుడు మైకు ముందుకు రకరకాల ఆటలపాటల నవ్వుల పువ్వుల వ్యాఖ్యానాలతో రేడియో అన్నయ్య ఒక్కొక్కరికీ అవకాశం కల్పించేవారు. పాల్గొనే పిల్లల పాటలు పద్యాల మధ్య కథలు, కబుర్లు, నాటికలు ఉంటూండేవి.



చిన్నప్పుడు సుధామ

అలా రిహార్సల్స్ చేస్తునప్పుడు ఆరోజు అన్నయ్యగారు నేను చదివిన చేత వెన్నముద్ద పద్యం విని ఆఖరున నవ్వేసారు. ఆ తరువాత కొంచెం కోపం తెచ్చుకుని అలా కాదు సుమా అని చెప్పారు. సరేనని బుద్ధిగా తలఊపాను. అసలు ప్రోగ్రాం మొదలయింది. మధ్యలో ఎప్పుడో మైకు ముందుకు నన్ను పిలిపించారు. 'నీ పేరేంటోయ్' అన్నారు అన్నయ్యగారు. తడుముకోకుండా అల్లంరాజు వెంకట్రావ్ అని బిగ్గరగా చెప్పేశాను. "అబ్బ! అల్లంలా చాలా ఘాటుగా చెప్పావురా" అని ఏం పాడతావ్ అన్నారు. చేతవెన్నముద్ద అన్నాను. పాడు అన్నారు. పాడేసాను. రిహార్సల్స్‌లో ఆయన నన్ను సవరించినా అది అప్పచెప్పడంలో నాకు అలవాటైన తడబాటు ప్రకారం 'చిన్ని కృష్ణా నిన్ను చేరి కొలుతు' అనడానికి 'చిన్నికృష్ణా నిన్ను చేరి కోతులు' అని చదివానట అప్పుడుకూడా! అయితేనేం అందరూ తప్పట్లు కొట్టేశారు. కొలుతు అనదాన్ని కోతులు ఎందుకు వర్ణవ్యత్యం చేసి చదివానో నాకేం తెలుసు? బహుశా పిల్లమనసు కోతికొమ్మచ్చి అంటే ఇదేనేమో అని ఇప్పుడు రమణగారి కోతికొమ్మచ్చి చదువుతుంటే నాకలా అనిపించేస్తోంది.

ఆ రోజు అన్నయ్య ఏం చదివాడో నాకు గుర్తులేదు. మొత్తానికి ప్రోగ్రాం తర్వాత క్యాంటిన్‌లో టిఫినీలు పుచ్చుకోవడం మాత్రం గుర్తుంది! అలా రేడియోలోకి రేడియో అన్నయ్య న్యాయపతి రాఘవరావుగారి నిర్వహణలో పిల్లల ప్రోగ్రాంలో చేత వెన్న ముద్ద 'చేరికోతులు'గా చదవడంతో మొదలయింది నా రేడియో అనుబంధం.

తెలుగువారికొక రాష్ట్రం కోరిన అమరజీవి త్యాగ ఫలంగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడిన కొద్ది నెలల్లోనే అన్నయ్యా, అక్కయ్య ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రానికి తరలి వచ్చేశారు. మేం కూడా ముందు కర్నూల్ రాజధాని అనడంతో మద్రాసు నుండి మకాం ఎత్తేసి కర్నూల్‌కు

వచ్చి ఓ పదిరోజులున్నామో లేదో! రాజధాని.. కర్నూలుకాదు హైదరాబాద్ అన్నారు. సామాను పూర్తిగా విప్పకుండానే.. లారీతో, హైదరాబాద్.కి మా కుటుంబమంతా తరలి వచ్చింది.

రేడియో అన్నయ్య, అక్కయ్య న్యాయపతి రాఘవరావు, కామేశ్వరిగారు హైదరాబాద్‌లో రేడియో ప్రోగ్రాంలు నిర్వహించడమే కాదు, మద్రాసునుండి ఆంధ్రబాలానంద సంఘం హైదరాబాద్ నారాయణగూడాలో ఏర్పరిచారు. మళ్ళీ హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రంలో పిల్లల ప్రోగ్రాంతో నేను అన్నయ్యగారిని కలుసుకోవడం జరిగింది. ఐతే ఈ మాటు ఓ నాటకంతో వెళ్ళాను. హైదరాబాద్‌లో పలు బాలానంద సంఘాలకు అన్నయ్యగారే ప్రోత్సాహం ఇచ్చి స్థాపితమయ్యేలా చేశారు. ఆంధ్ర బాలానంద సంఘానికి శాఖలుగా కొన్నీ, రేడియో ప్రోగ్రాంలు ఇస్తూ పలు కార్యక్రమాలు నిర్వహిస్తూ మరికొన్ని సంఘాలు పనిచేస్తుండేవి. హైద్రాబాద్‌లో ముందు కాచీగూడలో అద్దె ఇంట్లో ఉండేవాళ్ళం. సుల్తాన్ బజార్ క్లాక్ టవర్ స్కూల్ ఎదురుగా ఇంకో చిన్న బడివుండేది. అందులో ఒకటి నుంచి నాలుగు తరగతులు చదివి, ఆ తర్వాత నారాయణ గూడా కేశవ్ మెమోరియల్ హైస్కూల్లో ప్రవేశ పరీక్ష రాసి, డబుల్ ప్రమోషన్‌తో ఒకేసారి ఆరోక్లాసులో చేరాను. ఇంతలో ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి మద్రాసునుండి తరలి వచ్చిన ప్రభుత్వోద్యోగులకు గవర్నమెంట్ క్వార్టర్స్ అలాట్ చేసే సంవిధానంతో, వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున మా నాన్నగారికి మలక్‌పేట గవర్నమెంట్ క్వార్టర్స్‌లో M.C.270 ఇల్లు కేటాయించబడింది. అలా అద్దె ఇంటినుండి గవర్నమెంట్ క్వార్టర్స్‌కు తరలి వచ్చాం. అప్పట్లో దానికి 'ఆంధ్రాకాలనీ' అని కూడా పేరుండేది. గవర్నమెంట్ బడి పెట్టారందులోనే. ఆ కాలనీలోనే ప్రభుత్వోన్నత పాఠశాలలో ఏడవతరగతిలో చేరాను. బడి, కాలనీ కూడా చాలా సందడిగా ఉండేవి. మా తరగతిలో రాధ అనే ఓ అమ్మాయి ఉండేది. తను క్వార్టర్స్‌లోనే ఉండే వాళ్ళ మేనత్తగారింట్లో ఉండేదని గుర్తు. ఆ రాధావాళ్ళ దగ్గర చుట్టం అయిన ఆవిడ పేరు 'పద్మ'. ఆవిడపేరిటనే 'పద్మాబాలానంద సంఘం' అని ఉండేది. సెక్రటేరియట్‌లో మంచి హోదాలో అప్పటికే ఉన్న శ్రీ మంగు అప్పారావుగారు ఆ పద్మగారి భర్త. రాధ కారణంగా ఆ 'పద్మా బాలానంద సంఘాని'కి వచ్చిన రేడియో ప్రోగ్రాంలో, పాల్గొనే అవకాశం నాకు కలిగింది. సంఘం తరుపున 'భక్తధ్రువుడు' నాటకం వేయడానికి రేడియో స్టేషన్‌కు వెళ్ళాం. అలా హైదరాబాద్ ఆకాశవాణిలో మొదటడుగుపెట్టాం.




అప్పట్లో ప్రోగ్రాం ఇచ్చేవాళ్ళను రేడియో స్టేషన్‌కు తీసుకువెళడానికి హైదరాబాద్‌లోనూ రేడియో వాన్ వచ్చేది. అలా పద్మా బాలానంద సంఘానికి రేడియోవాళ్ళు వాన్ పంపితే, పిల్లలందరూ అందులో బిలబిలా ఎక్కివెళ్ళాం! ఆ ప్రోగ్రాం కోసం అంతకు ముందు వరుసగా నాలుగయిదుసార్లు మంగు అప్పారావుగారింట్లో రిహార్సల్స్! ఇంతకీ నాటకంలో 'ధ్రువుడు' ఎవరనుకుంటున్నారు నేనే! నాటకం డైలాగ్స్ ఎవరిది వాళ్ళు రాసుకోవాలి. అంతకుందు పాత్ర మాట్లాడే చివరి వాక్యాలు స్పష్టంగా రాసుకుని, వాళ్ళు ఏ వాక్యం తరువాత మనపాత్ర సంభాషణ ఉంటుందో, అదంతా ఓ పద్ధతిలో రాసుకునేవాళ్ళం. ఎవరి పాత్ర వారిదే అయినా, మొత్తం అందరి సంభాషణలూ అందరికీ వచ్చేశావనుకోండి! అది వేరే విషయం. ధ్రువుడు తన తండ్రి అయిన ఉత్తానపాదుడిని 'తండ్రీ!' అని సంబోధించాలి. ఏమిటో! ఆ 'డ్రీ' కింద రావత్తు మరీ గట్టిగా పలుకుతున్నానని పద్మగారు నాచేత చక్కగా పలికేలా రిహార్సల్స్ చేయించారు. కంగారుపడకండి! ఈసారి కార్యక్రమంలో తప్పుగా

పలకలేదు. సరిగానే పలికి నిజంగానే నాటకంలో హీరో అనిపించుకున్నాను. అయితే ఒక్కటి మటుకు ఆ నాటకం రిహార్సల్స్‌కు వెళ్ళిన సందర్భంలోని అంశం నాకు గుర్తుండిపోయింది.

అప్పట్లో కాలనీకి పదిహేనురోజులకోసారి ఎడ్లబండి మీద బట్టలు పట్టుకెళ్ళి ఉతికి ఇస్త్రీ చేసి తెచ్చే రజకులు, వారం వారం తైల సంస్కారం చేసే క్షురకులు ఇంటికే వస్తుండేవారు. పొదిపట్టుకుని మా ఇంటికి నెలకోసారి వచ్చే క్షురకుని పేరు అప్పారావే. పద్మా బాలానంద సంఘానికి తీసుకెళ్ళిన రోజు మంగు అప్పారావుగారు నాతో మా నాన్నగారు తనకు తెలుసుననీ, తన పేరు మా నాన్నగారికి చెబితే గుర్తిస్తారనీ ఆయన పేరు నాకు చెప్పినప్పుడు - పరధ్యానంగా విని, మంగు అప్పారావు అని ఆయనంటే - మా ఇంటికొచ్చే క్షురకుని పేరుగా పొరపడి, ఆ వృత్తి నామాన్ని ఆయన ఇంటి నామంగా చెప్పి 'అదేనా' అని ఆయనను అడగడం గుర్తొచ్చి, ఇప్పటికీ నవ్వు వస్తుంది! సిగ్గేస్తుంది!! వారు సహృదయులు కనుక ఈ తెలియని కోతి చేష్టలను మన్నించిన మహనీయులు మరి.

ధ్రువుడు నాటకం వేయడానికి వెళ్ళినప్పుడు అన్నయ్యగారు గుర్తుపట్టారని నేననుగానీ, వారు చూపిన ఆప్యాయతకు ఆయనకు మేమంతా దగ్గరనే గొప్ప భావన కలిగి, ఆనందం వేసింది! ఇంతకీ రేడియో జ్ఞాపకాలు అంటూ నా జీవిత చరిత్ర మొదలెట్టాననుకోకండి. నా బాల్యం రేడియోతో అనుబంధితమైందని తలుచుకోవడం ఒక తలచుకోవడం ఒక మధురానుభూతి! ఇంతకూ - అప్పటిదాకా అసలు మా ఇంట్లో రేడియోనే లేదు తెలుసా! మధ్యతరగతి జీవికి ఆ రోజుల్లో ఇంట్లో రేడియో ఒక లగ్జరీ లాంటిదే! నాన్నగారు మా ఇంటికి రేడియో కొనితెచ్చినప్పుడు నేను హైదరాబాద్‌లో లేను. వేసవి సెలవులకు అమ్మమ్మ తాతయ్యగారువుండే అనకాపల్లికి వెళ్ళాను. అప్పుడొచ్చింది రేడియో కొన్నట్లుగా తాతయ్యగారికి నాన్నగారు రాసిన పోస్ట్‌కార్డ్. నా ఆనందం ఏమని చెప్పను!...





## 2

**యాభై ఏళ్ళ క్రితం** మధ్య తరగతి ఇళ్ళల్లో రేడియో కొనడం అంటే ఓ లగ్జరీయే. అప్పుడు రేడియో కొంటే ఏటేటా లైసెన్స్ కట్టాల్సివచ్చేది. లైసెన్స్ ఫీజు ఏడాదికి పదిహేను రూపాయలు కామోసు ఉండేది. అప్పట్లో ప్రతి ఇంట్లోనూ కొత్తకాలెండర్ అంటే మర్ఫీ రేడియో వాళ్ళు ఇచ్చింది ఉండడం గొప్ప. ఆ క్యాలెండర్ మీద మర్ఫీ బేబీ బొమ్మ నోట్లో వేలేసుకుని ఉండేది. అలాంటి ముద్దులు ఒలికే బాబు కావాలని పడగ్గదిలో కొత్తదంపతులు ఆ క్యాలెండర్‌ను గోడకు పెట్టుకుంటుండేవారు కూడాను.

మా నాన్నగారు కొన్నది మాత్రం ఫిలిప్స్ రేడియో. అప్పట్లో సరికొత్తగా ఆ కంపెనీ రేడియోలు మార్కెట్లోకి దిగాయి. అప్పటికింకా ట్రాన్సిస్టర్ల హవా లేదు. రేడియో పెద్దసైజుల్లోనే ఉండేది. అయితే వాటిల్లో పలు మోడల్స్ ఉండేవి. నాన్నగారు కొన్న ఫిలిప్స్ రేడియో మోడల్ ఇలా ఉండేది.



టేబుల్ మీద టేబుల్ క్లాత్ పరిచి మధ్యలో రేడియో అమర్చి ప్రక్కన ఓ ఫ్లవర్ వాజ్ పెట్టడం అప్పట్లో డ్రాయింగ్ రూముకు ఒక పెద్ద అలంకరణ.


అమ్మమ్మ,తాతగారు

ఇంతకీ నాన్నగారు రేడియో కొన్నారన్న వార్త పోస్టు కార్డు ద్వారా నాన్నగారు వాళ్ళ మామగారికి అంటే మా తాతయ్యగారికి రాసిన కార్డులో సమాచారం ద్వారా తెలిసింది. మా తాతయ్యగారు అంటే అమ్మ నాన్నగారు ద్విభాష్యం సత్యనారాయణమూర్తిగారని ఆయుర్వేద వైద్యులు. అనకాపల్లిలో చింతలూరు వారి వేంకటేశ్వర ఆయుర్వేద నిలయం బ్రాంచికి ఆయన అధిపతి. ఆయుర్వేదమందుల అమ్మకం, వచ్చిన రోగులకు ఆయుర్వేద వైద్యం ద్వారా చికిత్స చేయడం చేస్తుండేవారు. ఆయనకు చింతలూరు డాక్టర్ గారని ఊరిలో పేరుండేది. తాతయ్యగారి కొట్లో మధ్యాహ్నాలు పొట్లాలకు కాగితాలు చింపి ఇవ్వడం లాంటివి

చేస్తుండేవాళ్ళం. నాన్నగారు రాసిన కార్డు చదవమని నాకు తాతయ్యగారు ఇవ్వగా అది చదివి 'రేడియో కొన్నారటండీ' అని సంతోషంతో నేను గట్టిగా అరచి ఎగిరి గంతేయడం వచ్చినవారితో బిజీగా ఉన్న తాతయ్యగారు నా అరుపుకి విసుక్కోవడం చిన్నగానే గదమాయించడంకూడా నాకు గుర్తే!

మా పెద్దమామయ్య గదిలో రేడియో ఉండేది. కానీ అది చాలా అపురూపమైన వస్తువు. మా పెద్దమామయ్య మృదంగం, మోర్సింగ్ వాయించేవాడు. తనూ ఆయుర్వేదం వైపే. రేడియోలోనూ, సినిమాల్లోనూ మృదంగం వాయిస్తుండే సరిపల్లి వెంకటరమణ మృదంగ విద్వాంసుడు. కోలంక వెంకట్రాజు గారి శిష్యుడు. సరిపల్లి వెంకటరమణ మా మామయ్యకి మంచిమిత్రుడు. అనకాపల్లి మా ఇంటి వీధి చావిడి అరుగుల మీద వాళ్ళ వాద్య కచేరీలు నాకు బాగా గుర్తే! ఆ తరువాత సరిపల్లి వెంకటరమణ నేను హైదరాబాద్ ఆకాశవాణిలో కార్యక్రమ నిర్వహణాధికారిగా ఉండగా సంగీత కచేరీలకు వచ్చినప్పుడు రికార్డింగుకు ముందో వెనుకో నన్ను కలిసి మా మామయ్య గురించి అడుగుతుండేవాడు. అప్పటికే సరిపల్లి వెంకటరమణ క్రమంగా మృదంగవాద్యం చేతులు స్వాధీనం తప్పి తగ్గించేసారు. వాళ్ళ అమ్మాయి అనురాధ మంచి వేణుగాన విద్వాంసురాలు. గ్రేడెడ్ ఆర్టిస్టు.


పెద్ద మామయ్య


అనకాపల్లిలో ఇల్లు

చిన్నప్పుడు రేడియోలో 'కుంకుమరేఖ' సినిమాలోని పాటలు వస్తూంటే నాకు వెంకటరమణ గుర్తొచ్చేవారు. ఎందుకంటే అనకాపల్లిలో నాకు ఆయన పరిచయం అయినప్పుడు తాను ఆ సినిమాల్లోని పాటలకు వాద్యకళాకారునిగా మృదంగం వాయించానని చెప్పాడు. అది గాఢంగా మనసులో నాటుకుని 'సినిమా సంగీతం వాళ్ళు నాకు తెలుసునోచ్!' అని గర్వంగా ఉండేది. మా పెద్దమామయ్య రేడియోలో ఎక్కువ సంగీత కచేరీలే వినేవాడు. ద్విభాష్యం సూర్యనారాయణమూర్తి ప్రొప్రయిటర్ రాజేశ్వరీ ఆయుర్వేదనిలయం అని తాను సొంతంగా నడుపుతుండేవాడు. ఇంటి అరుగులమీద మందులు నూరే కల్వాలు, లేహ్యాల పరిమళాలు ఇంకా తాజాగా ఉన్నాయి. అనకాపల్లి శారదా గ్రంధాలయంలో పుస్తకాలు బాలమిత్ర, చందమామలు చదవడానికే కాదు హాలులో జరిగే సంగీత కచేరీలకు అందునా వెంకటరమణ మృదంగ వాద్య సహకారం ఇచ్చేవయితే పెద్దమామయ్యతో వెళ్ళేవాళ్ళం. నేనూ మా బావ ప్రసాదు ఆ గాత్ర సంగీత కళాకారుడూ 'తననానా' అంటూ ఏదో సంగతులు వేసి పాడుతుంటే 'పెదనాన్నా' అని ఏడుస్తున్నాడు అని తెలీక నవ్వుకునే వాళ్ళం. ఇంతకీ ఈ వైనం ఎందుకంటే సంగీతం, సంగీతవాద్యాలు అన్న విషయాలు, సంగీత కళాకారుల గురించీ ఆ నాడు ప్రాతిపదికలు పడడం వల్లనే కార్యక్రమ నిర్వహణాధికారి ఉద్యోగంలో, అందునా సమన్వయకర్త అంటే 'పెక్స్‌కో'గా ఉన్నప్పుడు కొన్ని జ్ఞానదాయక ప్రయోజనాలు సమకూడాయని స్మరించుకోవడానికే.

వేసవి సెలవులకు వెళ్ళినప్పుడు మా పెద్దమామయ్య సంగీతం, మా చిన్నమామయ్య (దేవుడు మాస్టారు అని మా వెంకటేశ్వరరావు మామయ్యకి హిందీ మాష్టరుగా పేరు) గోరు పెంచి వేసే నఖ చిత్రాలు, మా తాతయ్యగారు గుండ్రంగా రాసే అక్షరాలు, వేసే బొమ్మలు, మా అమ్మమ్మ చెప్పే కథలు కబుర్లు, నూతి దగ్గర స్నానాలు ఇవన్నీ బాల్య మధురిమలే. రేడియో అలా బాల్యం నుండీ పెనవేసుకుంది.



హైదరాబాదులో పద్మాబాలానంద సంఘం మా కాలనీలోనే ఉండేదని చెప్పానుగా! ఆ తరువాత ఆంధ్ర బాలానంద సంఘం నల్లకుంట శాఖను జె.పూర్ణచంద్రరావుగారు నిర్వహిస్తుండేవారు.

ఆయన మంచి రచయిత. పిల్లల నాటకాలు బాగా రాసేవారు. ఓ లిఖిత పత్రికను కూడా వారి దగ్గర చూసాను. వాళ్ళ పిల్లలు జయశ్రీ శ్రీకర్, ప్రభ, రాజ్యశ్రీ పూర్ణ, వాళ్ళంతా బాలానందం సభ్యులే. పూర్ణచంద్రరావుగారు రాధాస్వామీ సత్సంగి. మా నాన్నగారు, మా అమ్మగారివల్ల మా తాతయ్యగారి కారణంగా సత్సంగి అవడం వల్ల నల్లకుంట బ్రాంచి సత్సంగానికి మమ్మల్ని తీసుకెడుతుండేవారు. అలా వారితో పరిచయం కలిగి ఆంధ్రబాలానంద సంఘం నల్లకుంట పక్షాన మేమూ రేడియో పిల్లల ప్రోగ్రామ్స్‌లో పాల్గొనేవాళ్ళం. 'బాలచంద్రుడు' అనే సీరియల్ నాటకం వేశాం. నేనే బాలచంద్రుడిని. మా అన్నయ్య నాగమనాయకుడు. పూర్ణచంద్రరావుగారి అమ్మాయి ప్రభ మాంచాలగా వేసింది. ఆ నాటకం రిహార్సల్స్, ప్రసారం ఒక తీపి గుర్తు.

రేడియో కార్యక్రమాల్లో పాల్గొన్నా అప్పుడు అన్నీ లైవ్ ప్రోగ్రాంలే కనుక మనం పాల్గొన్నట్లు రేడియోలో విన్నవాళ్ళు చెప్పి మెచ్చుకోవడం వినడం తప్ప మనని మనం రేడియోలో వినడం రికార్డెడ్ ప్రోగ్రాం వేస్తే తప్ప కుదరదు కదా! నిజానికి రేడియోలో తానుగా వినే అదృష్టం అన్నయ్య రాధాయిదే నల్లకుంట బాలానంద సంఘం వారే సాయంకాలం గ్రామసీమల్లో వారానికోరోజు ప్రసారమవుతుండే బాలవాణి పిల్లల కార్యక్రమంలో ఏదో ఓ నాటకంలో పాత్ర ధరించినప్పుడు దాన్ని ముందుగా రికార్డు చేసి ప్రసారం చేసారు. అన్నయ్య గొంతు అన్నయ్యతోబాటు రేడియోలో విన్న థ్రిల్లే మొదటిది. నాకు గుర్తుండి పిల్లల కార్యక్రమంలో పాల్గొన్న నా గొంతు నేను వినడం బాలానంద సంఘం తరపున అన్నయ్యగారు (రేడియో అన్నయ్య న్యాపతి రాఘవరావుగారు మా అన్నయ్య కాదు స్మీ) ఓ దసరాకి రవీంద్రభారతి వేదిక మీద కార్యక్రమాలు పిల్లలచే ప్రదర్శింప చేసినపుడు నల్లకుంట బాలానంద సంఘం తరపున 'సతీసక్కుబాయి' నాటకం మేం వేయగా దానిని రికార్డు చేసి తర్వాత ప్రసారం చేయగా వినడమే. మొట్టమొదటిసారి రవీంద్రభారతి వేదిక ఎక్కడం ఎంత గర్వంగా అనిపించిందో ఆ రికార్డింగ్ రేడియోలో వినడమూ అంత ఆనందంగా అనిపించింది. ఆ నాటకంలో సక్కుబాయి గురువుని నేను. కాషాయ వేషం, గడ్డం తంబురా చిడతలు... కళ్ళముందు ఇంకా కదలాడతాయి కానీ అప్పట్లో ఫోటోలు అవీ అంతగా ఎక్కడివి? ఉన్నా మనకు ఓ కాపీ సంపాయించుకునే, భద్రపరచుకునే ఆలోచనా, తెలివితేటలు లేవు కదా! అదోరకం మాలోకమేననాలి!

ఇంత శ్రద్ధగా రేడియో కార్యక్రమాలు పిల్లలకు నాటకాలు రాసి మా చేత వేయించీ ఎందుకు పూర్ణచంద్రరావుగారు వంటి వారు చేస్తున్నారో తెలిసేది కాదు. కచ్చితంగా అది వినోద, వికాస, బాలానంద సేవా దృక్పధం అన్నది నిజమేగానీ రేడియోవాళ్ళు పిల్లలచేత నాటకాలు వేయించే బాలానంద సంఘాలకు కొంత పారితోషికం కూడా ఇస్తారని తర్వాత తర్వాత తొలిసారిగా తెలిసింది. అయితే అప్పుడు డబ్బు మీద కాపీనం కేవలం డబ్బు దృష్టి ఆ పెద్దలెవరికీ లేదనేది సత్యం. పిల్లలను పోగేసి వారిని కళాత్మకంగా తీర్చిదిద్దే ఆ నాయకత్వ వైఖరి నాకు మనసుకు బాగా నచ్చింది.

మాకాలనీలో ఇరుగుపొరుగు ఇళ్ళల్లో ఉండే చిన్నపిల్లలను పోగుచేసి నేనూ వాళ్ళకు ఆటా, పాటా నేర్పించాలనే సంకల్పం ఎప్పుడు పుట్టిందో తెలీదుగానీ నాచుట్టూ చేరే పిల్లల సంఖ్య ఏర్పడసాగింది. పైగా నేను చదివే గవర్నమెంట్ స్కూలు ప్రక్కనే మేముండే మలక్ పేటకాలనీ M.C.270 ఇల్లుండేది. మా గది కిటికీలోంచి మాక్లాసు కనిపించేది. మా అమ్మను ఆ కిటికీ దగ్గర చూసే అవకాశం ఉండేది. ఇదంతా నేను ఎనిమిదో తరగతి చదివేంతవరకే. తొమ్మిదోతరగతి తర్వాత అనుకుంటాను పిల్లలకు బడి సరిపోవడం లేదని రోడ్డుకవతల దూరంగా ఉండే ఓ బిల్డింగ్ స్కూలు తరగతులకు తీసుకున్నారు. బడిపిల్లలు మధ్యాహ్నాల్లో మా ఇంటికి వచ్చి తలుపు కొట్టి మంచినీళ్ళు అడగడం, మా టీచర్ దారం తెమ్మందండీ అంటూ రావడం జరుగుతుండేది. చిన్న తరగతుల పిల్లలు, మా ఇంటి చుట్టుప్రక్కల చిన్నపిల్లలు చేరికవుతుండేవారు. "ఆ చిన్నపిల్లలతో ఆటలేమిటిరా ఎప్పుడూ. పెద్దవాళ్ళతో స్నేహం చెయ్యి" అని నాన్నగారు అప్పుడప్పుడు మందలిస్తుండేవారు. "కానీ నేను పెద్దపిల్లలతోనే తిరిగి చిన్నపిల్లలతో స్నేహం చేయకూడదంటే ఆ పెద్దపిల్లలూ నేను వాళ్ళకన్నా చిన్నపిల్లాడిని కనక నాతో స్నేహం చేయక వాళ్ళకంటే పెద్దపిల్లల స్నేహం కోసం చూస్తే ఇంక స్నేహాలు కుదిరేదెలా" అనే లాజిక్‌తో చిన్నపిల్లలను చేరదీస్తూండేవాడిని.



## 3

ఒక్కొక్కసారి అనిపిస్తుంది. ఆ రోజుల్లో బాల్యం ఎంత బాగుండేదో కదా అని! ఇవాళ్టి పిల్లల బాల్యానికీ, నాటి బాల్యానికీ బోలెడు తేడా! ముఖ్యంగా - ప్రకృతితో, పరిసరాలతో, ఇరుగుపొరుగులతో మమేకం కాగల, ఒక అద్భుతమైన జీవలక్షణం - నాటి బాల్యంలో ఉందనీ, నేడు బాల్యాన్నీ ఓ యాంత్రికత కమ్మేస్తోందనీ, అనిపిస్తుంటుంది. అప్పటి కయ్యది ప్రస్తుతం! ఇప్పటికియ్యది ప్రస్తుతం అంటారా! - వదిలేయండి! తేహినో దివసాగతాః -

ఒకే కాలనీలో ఉండేవాళ్ళమేమో, స్కూల్లో, తరగతిలో పిల్లలే, బడి అయిపోయాకా - ఆటపాటలతో, స్నేహితులుగా, సాయంకాలాలు గడిపే వీలు బోలుడుండేది! ఇళ్ళల్లోంచి తల్లులు పిలిచేదాకా - రోడ్ల మీద ఆటలే ఆటలు!! అప్పుడు ఆటలేమిటి? - నేలాబండా, బచ్చాలు, కబడ్డీ, రింగు, దొంగాటా.. ఇళ్ళల్లోనే కూచుని అయితే క్యారమ్స్, వైకుంఠపాళి, అష్టాచెమ్మా, చింతపిక్కలు ఇలాంటివే! స్కూల్లో డ్రిల్లు పిరియడ్ ఉండేది. అప్పుడు మాత్రం వాలీబాల్, ఫుట్ బాల్, పెద్ద డ్రమ్ము వాయిస్తుంటే - గజ్జెలున్న కర్రలతో వ్యాయామం... ఇలాంటివి ఉండేవి! డ్రాయింగ్ పిరియడ్, కార్పెంటరీ పిరియడ్, క్రాఫ్ట్ పిరియడ్ (డ్రాయింగ్ పిరియడ్‌తో కలిపే), లైబ్రేరీ పిరియడ్ ఉండేవి. లైబ్రేరీ పిరియడ్‌లో ఇంటికి పుస్తకం ఇచ్చేవారు. చదివి మళ్ళీ లైబ్రేరీ పిరియడ్ రోజు పుస్తకం తిరిగి ఇవ్వాలి. చూచివ్రాత (కాపీరైటింగ్), డిక్టేషన్ క్లాసులూ ఉండేవి.



అప్పట్లో నా చేతి రాత గుండ్రంగా ఉండేది. నా రాతను తరువాత తరువాత ఇలా మార్చేసింది - ప్రభావం చేసిన బాపు రాత అని వేరే చెప్పాలా! ఇపుడు గుండ్రంగా రాయాలంటే స్పీడ్ రాదు.

మా లైబ్రేరీ పిరియడ్ తీసుకునే తెలుగు మాష్టారు కృష్ణమూర్తిగారు - స్కూల్లో లైబ్రేరీలో ఉన్న బుక్స్ లిస్ట్ అంతా, ఓ క్యాటలాగ్‌లా రాయడంకోసం, నన్నువాళ్ళింటికి పిలిపించి - పాలు, అరటి పండ్లు ఇచ్చి, నా చేతిరాతతో ఆ పట్టిక చేయించడం, గ్రంధాల

పేర్లూ వాటి రచయితల పేర్లూ రాయడంతో - సాహిత్యంతో తొలిపరిచయాలు కలగడం మరిచిపోలేని విషయం! 'చూచివ్రాత' తరగతిలో పుస్తకంలోంచి ఏదయినాఒక పేజీ రాసి చూపించాలి. పుస్తకంలోంచి చూసి కాకుండా నేను సొంతంగా ఏదో రాయడం మొదలుపెట్టాను. మాష్టారు దానిని ప్రోత్సహించడం విశేషం! అక్కడ 'చేతిరాతే' ప్రధానంగానీ, ఏం రాసానన్నది కాదు అని, ఏం రాసినా ఆయన అభినందించడంతో - ఊహించిరాసే రచనకు బీజాలు పడ్డాయి. అలాగే బొమ్మలువేయడం, మనుషుల్నీ, పరిసరాల్నీ నాకు చేతనైన గీతల్లో గీయడం చేసేవాడిని. డ్రాయింగ్ పిరియడ్ ఇష్టంగా ఉండేది.

నేనేకాదు! ఇలాంటి ఆసక్తులతో ప్రతి తరగతిలోనూ కొందరు పిల్లలుండేవారు. పదవతరగతిలో డ్రాయింగ్ కాంపిటేషన్ జరిగినప్పుడు, రాధాబాయిగారనే మా అమ్మగారి స్నేహితురాలి భర్త మంచి చిత్రకారులుండేవారు. ఆయన దగ్గర నేర్చుకుని, నేను వేసిన వివేకానందుడి పెన్సిల్ గీతల బొమ్మకు సెకండ్ ప్రైజు వచ్చింది. (ఓ వైపు బుగ్గ వాచినట్లుందని వేసిన నాకే అనిపించింది కానీ.. గప్ చిప్!!) చెప్పానుగా! నా క్లాసుపిల్లలు, చిన్నక్లాసుల పిల్లలతో కలిసి కాలనీలో ఉన్న స్నేహితులమంతా ఆటలేకాదు, కొందరం చిన్న చిన్న నాటకాలు వేయడం మొదలుపెట్టాం! మా ఇంట్లోని హాల్లోనే కొంత భాగం వేదికగా చేసి, అమ్మచీరనో, దుప్పటినో తెరలా కట్టి, ఆ తెరముందు ప్రేక్షకులుగా పిల్లల్నీ, పిల్లల తల్లుల్నీ కూచోబెట్టి, వేదికకు వెనుకగా ఉండే బెడ్‌రూంలోనో, ప్రక్కగా ఉండే బాల్కనీలోనో బొగ్గు, పసుపు, కుంకుమ, ఆకురసాలు రంగులుగా చేసి, మేకప్‌లు వేసుకుని, డ్రామాలు వేసేవాళ్ళం! ఆడపిల్లలు పాటలు పాడుతూ, డ్యాన్సులు చేసేవారు. మా అమ్మగారు (అల్లంరాజు రాజేశ్వరమ్మ పుట్టింటి పేరు ద్విభాష్యం లెండి) పాటలు, డ్యాన్స్‌లు నేర్పేవారు వాళ్ళకు. ఇల్లు పిల్లలతో కోలాహలంగా ఉండేది!

అలానే పదేళ్ళవయసులోనే 'విజ్ఞానజ్యోతి' అని ఓ లిఖిత పత్రిక ప్రారంభించాను. దానికి ప్రేరణ మా అమ్మగారి పేరున్న రబ్బరు స్టాంప్‌ను స్టాండ్ పాడ్ పై అద్ది, కాయితం మీద ముద్రించాలనే సరదాయే అంటే ఆశ్చర్యపోకండి! అప్పట్లో రబ్బర్ స్టాంప్‌లు, లెటర్ హెడ్స్ ఓ గొప్ప! మధ్యతరగతి బ్రతుకులు కనక - మా నాన్నగారు (కామేశ్వరరావుగారు) అమ్మ పేరున ఎల్.ఐ.సి. ఏజెన్సీ తీసుకుని, పరిచయస్తులతో జీవితభీమా చేయించి, ఆ కమీషన్ డబ్బులు - వేన్నీళ్ళకు చన్నీళ్ళలా ఉపయోగపడతాయని కష్టపడేవారు. ఆ తరువాత



అన్నయ్యకూడా ఎల్.ఐ.సి. ఏజెంట్‌గా కొన్నాళ్ళు చేసాడు. ఏజెంట్స్‌గా వాళ్ళపేర రబ్బరు స్టాంపులుండేవి. 'విజ్ఞానజ్యోతి'లో - అమ్మ రబ్బర్ స్టాంపే మాకు తొలి 'ముద్రణ' ఆనందం! చేత్తో చిన్న చిన్న కవితలు, కథలు, బొమ్మలూ నావీ, స్నేహితులవీ అందులో ఉండేవి! నేను కాలేజీలో చేరేవరకు కూడా- ఆ పత్రిక స్కూల్లో పిల్లల మధ్య, బడి అయ్యాక- పిల్లల ఇళ్ళల్లో తిరుగుతుండేది. మాష్టార్లూ, తల్లితండ్రులు కూడా 'చదువుకొమ్మని'గట్టిగా చెబుతూనే, ఈ తీరికవేళల వ్యాసంగాన్ని ప్రోత్సహిస్తుండేవారు.




ఓ వేసవి సెలవులకు 1964లో - అనకాపల్లి వెళ్ళినప్పుడు అక్కడనుంచి యలమంచిలి, కొత్తపల్లి వెళ్ళాం. యలమంచిలిలో మా మామయ్యలు (మా అమ్మ కజిన్స్) ద్విభాష్యం సూర్యం, ద్విభాష్యం రాజేశ్వరావ్ మంచి కథకులు. ద్విభాష్యం రాజేశ్వరావ్ మామయ్య, కోర్ మాండల్ ఫెర్టిలైజర్స్‌లో ఉన్నతశ్రేణి అధికారిగా రిటైరై, విశాఖలో ఇప్పటికీ తన సాహితీవ్యాసంగం సాగిస్తున్నాడు. కొత్తపల్లి శ్రీలక్ష్మి గణపతి ఆయుర్వేద నిలయం చాలా ప్రసిద్ధం. అల్లంరాజు పేరాజుశర్మ గారు మా ముత్తాతగారు గొప్ప ఆయుర్వేద వైద్యులు. వారి విగ్రహం గండపెండేరాలతో ఇప్పటికీ ఉప్పాడ కొత్తపల్లిలో ఉంది. కొత్తపల్లి ఇల్లు చాలా పెద్ద లోగిలి. పాత సినిమాల్లో జమిందార్ల ఇల్లులావుండేది. అక్కడ మా బాబాయ్‌లు, పిన్నిలూ అయ్యే పెద్దపిల్లలూ, బావలూ

మరదళ్ళు అయ్యే చిన్నపిల్లలూ ఉండేవారు. అందరం వేసవి సెలవులకు కూడి, 'ఇల్లు తీసి పందిరివేయడం' అంటారే! అలా కోలాహలంగా ఆడుకునేవాళ్ళం. మా కొత్తపల్లి ఇంటి పెరటి తోటలో బావి, కుందేళ్ళు, తాబేళ్ళు, నెమళ్ళు ఉండేవి. హైదరాబాద్ మహాపట్నం నుంచి వచ్చిన పట్నం పిల్లలుగా మాకు సాటిపిల్లల్లో ఓ హోదా, గౌరవం, అభిమానం ప్రత్యేకించి ఉండేవి! అక్కడ ఓ రోజు పిల్లలు ఏవేవో ఆటలాడుతున్నాం. అందులో ఒకటి మేడమెట్లమీంచి దిగడం అంటే - విమానంలోంచి దిగడం అన్నమాట! నేను నెహ్రూగారిని. విమానంలోంచి దిగుతున్నాను. చివరి మెట్టు చూసుకోక - 'ధన్'మని అడుగుతడబడి, పడిపోయాను. తోటిపిల్లలందరూ' నెహ్రూగారు పడిపోయారు, నెహ్రూగారు పడిపోయారు' అని అరిచారు. నెహ్రూ అంటే భారతప్రధానిగా నాడు పిల్లలందరికీ ఎంతో సన్నిహితమైన 'చాచా'గా, భావన ఉండేది. "ఆఫ్టర్ నెహ్రూ హూ?" అనది రాజకీయంగా కూడా నాడు ఒక పెద్ద ప్రశ్నగా ఉండేది, మేం ఆ ఆట ఆడుకున్న రోజు మధ్యాహ్నం రెండున్నరకే - నెహ్రూగారు మరణించారన్న వార్త రేడియోలో వచ్చింది. ఆ రోజు 27 మే 1964. నెహ్రూగారు పోయారని నిజంగా మేం కంట తడిపెట్టాం!




సెలవులయి జూన్ లో బడులు తెరిచేసరికి హైదరాబాద్ చేరుకున్న నేను, అప్పట్లోనే నెహ్రూగారిపట్ల పిల్లలకుగల ఆ అకారణ, పిచ్చి ఆరాధనతోనే అనుకోండి - 'అమర్ జవహర్ బాలానంద సంఘం' అని ఓ బాలానంద సంఘం పెట్టాను . అనకాపల్లిలో మా బావ ద్విభాష్యం మెహతా ప్రసాద్ కూడా బాలానంద సంఘం పెట్టి ఈ సంఘానికి దాన్ని బ్రాంచిగా భావించాం అన్నమాట!

హైదరాబాద్ మలక్‌పేటకాలనీలో మా 'అమర్ జవహర్ బాలానంద సంఘం'కు మంచి పేరొచ్చింది. తల్లితండ్రులు తమ పిల్లలను చేర్పించేవారు. ఆటలు, పాటలు, నాటికలు, పుస్తకపఠనాలు, చిన్నపిల్లలకు పాఠాలు చెప్పడాలు ఓహ్! కార్యక్రమాలు ఎన్నెన్నో. మా అమ్మ, నాన్నగారు అడ్డుచెప్పక ప్రోత్సహించేవారు. విశ్వనాథ సూర్యనారాయణ (నేడు ప్రముఖ స్త్రీవాద కవయిత్రి జయప్రభ భర్త) వాళ్ళ అమ్మా నాన్నలకు ఒక్కడే కొడుకు. చిన్నప్పట్నుంచీ మేం మంచిఫ్రెండ్స్! నా కన్నా చిన్నతరగతిలో ఉండేవాడు. దాదాపు ఓ పాతిక ముప్పైమంది పైగా సభ్యులుండేవారు. ఇంకా మలక్ పేటకాలనీలో - 'గణపతి నవరాత్రులు' తొమ్మిది రోజులు వైభవంగా చేసేవారు. సాయంత్రాలు సాంస్కృతిక కార్యక్రమాలుండేవి. నేను కాలేజీలో చేరాక పి.యు.సి అయ్యేవరకూ కూడా బాలానంద సంఘం నడిపి, ఆ తరువాత యువకుడిని అయిపోయాయని ఇంక స్వస్తిచెప్పాను. 'అమర్ జవహర్ బాలానంద సంఘం' తరపున నేనే స్వయంగా పిల్లలను రేడియో స్టేషన్‌కు తీసుకువెళ్ళి, కార్యక్రమాల్లో పాల్గొనేలా చేసేవాడిని. రేడియో అన్నయ్యగారు మా బాలానందం పిల్లల్ని ఎంతగానో ప్రోత్సహించారు. పద్యాలు, పాటలు చెప్పించడం, ఉత్తరాలు చదివించడం చేసేవారు.

నాకు బాగా గుర్తున్న మా బాలానందసంఘపు రేడియో ప్రోగ్రాం - 'భారతదేశం - చైనా భూతం' అనే నాటిక. అప్పట్లో హఠాత్తుగా వచ్చిన చైనా యుద్ధం దేశభక్తిని ప్రోది చేసిన ఓ జాతీయ సంఘటన. 'హిందూ చీనీ భాయ్ భాయ్' అనే నినాదం మనకు చైనా పట్ల శత్రువైఖరి లేదని చాటేది. వారే మన మీద అనవసరంగా కయ్యానికి కలుదువ్వుతున్నారని చైనాను 'డ్రాగన్' గా అభివర్ణించిన సందర్భంలో - నేనే ఓ చిన్న నాటిక రాసి మా అమర్ జవహర్ బాలానంద సంఘం పిల్లలతో వేయించినప్పుడు నాటికలో వేయించినప్పుడు, అయిదుపదినిముషాల చిన్న నాటికే అయినా, రేడియో అన్నయ్య దానికి వెనకాల సౌండ్ ఎఫెక్ట్స్ ఇవ్వడం - "హిందూ చీనీ భాయ్ భాయ్" అని చివర్లో పిల్లలందరిచేత అనిపించడం ఓ గొప్పజ్ఞాపకం!

ఓ ఏడాది మా కాలనీలో గణపతినవరాత్రి ఉత్సవాలు జరిగినప్పుడు ఓ సాయంకాలం సాంస్కృతిక కార్యక్రమాలు మా అమర్ జవహర్ బాలానంద సంఘానికి కేటాయించారు. వేదిక మీద - వందలాది కాలనీవాసుల సమక్షంలో, పిల్లలు నృత్యాలు, నాటికలు ప్రదర్శించి ప్రశంసలందుకున్నాం. అంతా పిల్లలతో ప్రదర్శనలిచ్చినందుకు కాలనీ సంఘం వారు మాకు ఆ సంవత్సరం 65 రూపాయలు



Amar Jawahar Balananda Sangham
M. C. 270, Malakpet Colony, Hyderabad.-36.

Head Office:
Malakpet Hyd.

Malakpet,
HYDERABAD.

Date..........................

President:
Smt. A.Rajeswaramma
Secretary:
Sri A. Venkata Rao
Joint Secretary:
Sri V. Suryanarayana

Branches:

Secretary:

Joint Secretary:
M. Naga Raja Rao

A. Dayal Das

పారితోషికం ఇవ్వడం, ఆ డబ్బులతోనే సంఘానికి ఓ క్యారంబోర్డు, కొన్ని గ్రంథాలయ పుస్తకాలు కొనడం, గొప్పగా లెటర్ హెడ్ ప్రింట్ చేయించడం మరుపురాని మధుర అనుభూతులే మరి. ఆ లెటర్ హెడ్ ప్రతి ఇప్పటికీ దాచుకున్నా.

వారం వారం శని, ఆదివారాల్లో బాలానందం, బాలవినోదం అని రేడియోలో పిల్లల ప్రోగ్రాలు ప్రసారం అయ్యేవి. శనివారం చిన్నపిల్లల కార్యక్రమం. ఆదివారం కొంచెం పెద్దపిల్లల కార్యకమంగా ఉండేది. వాటి ప్రారంభం, ముగింపులకు - రెండువైపులా కార్యక్రమం ముందూ వెనుకా సిగ్నేచర్ ట్యూన్స్‌గా పాటలుండేవి. 'రారండోయ్! రారండోయ్! బాలబాలికలు రారండోయ్! బాలవినోదం వినరండోయ్! హైదరాబాదూ బాలలమూ, జైహిందంటూ పిలిచాము, రైరైమంటు రారండోయ్! రేడియో ప్రోగ్రాం వినరండోయ్!" అనే ప్రారంభగీతం -"చాలునిక, ఆటలు మనపాటలు"..అనే ముగింపు గీతం అత్యంత ప్రసిద్ధాలు ! ప్రారంభ గీతంతో రేడియోలముందు ఉత్సాహంగా చేరి కార్యక్రమం వినడం, అయిపోయి ముగింపు గీతం రాగానే, అప్పుడే అయిపోయిందా' - అని వచ్చేవారానికి ఎదురు చూడడం జరిగేది.



## 4

**వృత్తిరీత్యానూ,** ప్రవృత్తి రీత్యానూ కలుసుకున్న, తెలుసుకున్న వ్యక్తులగురించి, సందర్భాల గురించీ - మాటాడుకుందామనే ఈ రేడియో జ్ఞాపకాల రాతలు! ఆకాశవాణి వృత్తిలోకి ప్రవేశించడానికి ముందు బాల్యం నుండీ నా ప్రవృత్తి తదనుగుణంగా ఎలా ఉంది, ఆ సందర్భాలు ఏమిటి అన్నదే ప్రస్తుతం కబుర్లాడుతున్నాను! అంచేత నా గురించే చెప్పుకుంటున్నట్లు అనిపించడం సహజం! ఇంకాస్త భరిస్తూండండి మరి!

ఓ మాట చెప్పనా! ఆ రోజుల్లో పత్రికలు, రేడియో మాత్రమే - విజ్ఞాన, వినోద, వికాస మాధ్యమాలు. రేడియో అంటే ఆకాశవాణి మాత్రమే! ఇప్పటిలా ప్రైవేట్ ఛానల్స్ గట్రా లేవుకదా! టీ.వీ కూడా 1980 లదాకా తెలియదనే చెప్పాలి. మరి, అలాంటి నేపథ్యంలో, ఆ రోజుల్లో, ఆకాశవాణిలో ఉద్యోగం, అందునా కేంద్రప్రభుత్వం ఉద్యోగం లభించడం అంటే - నల్లేరు మీద బండినడకేమీ కాదు! నిజానికి 1978 లో ఆకాశవాణిలో నేను ఉద్యోగినయ్యే వేళకే - రేడియోలో హేమాహేమీలు ఎందరో రిటైరయ్యారు. బుచ్చిబాబు, గోపీచంద్, ఆచంట జానకీరాం, కృష్ణశాస్త్రి, బందా, స్థానం, దాశరథి, న్యాయపతి రాఘవరావు, కామేశ్వరి (రేడియో అన్నయ్య, అక్కయ్య), మునిమాణిక్యం వీరెవరూ రేడియోలోలేరు. కుర్రాడిని కనక వీరిలో ఎవరితోనూ రేడియోలో నేను కలిసి పనిచేయలేదు! కానీ ఒక్క గోపీ చంద్, జానకీ రాం గారలు తప్ప - మిగతా అందరినీ నేను చూసాను. వారిలో కొందరికి నేనూ తెలుసు. ఒక పిల్లవాడిగా, యువకునిగా నన్ను వారిలో అభిమానించిన వారున్నారు. అందుకు కారణం - నేను ఆకాశవాణిలో ఒక ట్రాన్స్‌మిషన్ ఎగ్జిక్యూటివ్‌గా ఉద్యోగంలో చేరకముందే, చిన్నపిల్లవానిగా బాలానందం రోజులనుంచీ రేడియోతో సంబంధం ఏదో రకంగా ఉన్నవాడినే. అంతేకాక క్యాజువల్ ప్రొడక్షన్ అసిస్టెంట్‌గా - కాలేజీలో చదువుకుంటూనే రేడియోలో 1978కు ముందు కొన్ని సంవత్సరాలు (విడతల వారీగా) పనిచేసాను. అందువల్ల ప్రస్తుతం ఆ ముందటి సందర్భాలూ, నా అభిరుచులూ, ప్రవృత్తీ నన్ను ఆకాశవాణి ఉద్యోగిగా ఎలా మార్చాయి అనే నేపథ్యం వివరించడం - సందర్భోచితమే అనుకుంటున్నాను. ఏ పరిస్థితులు, ఏ వాతావరణం, నన్ను రేడియోకి లాక్కువెళ్ళిందో చెప్పడం 'రేడియో జ్ఞాపకాలు'లో ముఖ్యమైన భాగమనే అనుకుంటున్నామరి. ఏమంటారు?

నా హెచ్.ఎస్.సి హాల్‌టికెట్ ఫోటో



సరే! సంగతుల్లోకి వచ్చేద్దామా మరి! 'అమర్ జవహర్ బాలానంద సంఘం' - నేను కాలేజీలో చేరేవరకు నడిపాను. మలక్ పేట ప్రభుత్వోన్నత పాఠశాల నుండి 1965లో హెచ్.ఎస్.సి పాసయ్యాను. పదవతరగతి తర్వాత అప్పుడు హయ్యర్ సెకండరీ సర్టిఫికెట్ పరీక్ష (హెచ్.ఎస్.సి) ఉండేది. అది పబ్లిక్ ఎగ్జామ్! స్కూల్లో ప్రతి తరగతిలో చివర జరిగే వార్షిక పరీక్షలూ, ఆ తరువాత పై తరగతికి ప్రమోట్ అవ్వడం - మామూలుగా జరిగే సంగతి. కానీ 'హెచ్.ఎస్.సి పబ్లిక్ ఎగ్జామ్' - వేరే పరీక్ష సెంటర్‌లో రాయాలి. పేపర్లు కూడా మన స్కూలు టీచర్లు దిద్దరు" అంటే - అప్పట్లో పిల్లలకు అదెంత పెద్ద పరీక్షో మీరు ఊహించుకోవచ్చు! పైగా పదిహేను సంవత్సరాలు నిండితేగానీ ఆ పరీక్ష రాయడానికి ఉన్నత విద్యాశాఖ ఒప్పుకునేది కాదు. 1951 నవంబర్‌లో పుట్టిన నాకు 1965 మార్చిలో జరిగే పరీక్షలకు పధ్నాలుగవ ఏడు ఇంకా నడుస్తోంది. మెడికల్ సర్టిఫికెట్ ఏదో పెడితే, ప్రత్యేక గుర్తింపుతో అంగీకరిస్తారని తెలుసుకుని, మా నాన్నగారు మెడికల్ డిపార్ట్ మెంట్ కనుక, నేను ఆ పరీక్షరాసి పాసయ్యాను. అదో క్రెడిట్టే మరి!

నా మొదటి కార్టూన్




బడిలో నేను తరగతిలో పొట్టివాడికిందే జమ! నిక్కరు, చొక్కాలే కదా ఆ రోజుల్లో! హెచ్.ఎస్.సి. హాల్ టిక్కెట్టు కోసం కొంచెం పెద్దవాడిలా కనిపించడానికి 'టై' కట్టుకుని ఫోటో తీయించుకుని అప్లికేషన్‌కు జతచేయమని, మా హెడ్మాష్టర్ గారే సలహా ఇచ్చారు! బాలానంద సంఘంతో, విజ్ఞాన జ్యోతి లిఖిత పత్రికతో స్కూల్లో కొంచెం గుర్తింపు ఉండేది కదా! స్కూలు వార్షికోత్సవాల్లో 'పన్నాబాయి' హిందీ నాటికలో పన్నాకుమారునిగా, అలాగే పేరు గుర్తులేదుగానీ ఓ చారిత్రక నాటకంలో - పొడుగాటి ఒరలోంచి పొట్టి కత్తిలాగే హాస్యసైనికుడిగా నటించడం, ఖవ్వాలి పాటలు పాడడం కూడా గుర్తే! మా కాలనీ గణపతి నవరాత్రి ఉత్సవాల్లో సెక్రటేరియట్ అసోసియేషన్ వాళ్ళు వేసిన 'దొంగవీరుడు' లాంటి నాటకాలు చూడడం, నేనూ, విశ్వనాథ సూర్యనారాయణ మరికొందరం మిత్రులం - 'ఏక్ దిన్ కా సుల్తాన్' వంటి నాటికలు వేయడం గొప్పలు చెప్పుకోవడం కోసం అనుకోకండి, పాఠశాలదశలోనే ఆ రోజుల్లో విద్యార్థుల్లోని ప్రతిభ - అది సాహిత్య, నాటక, చిత్రకళాది రంగాలకు చెందినది ఏదయినా ఎలా ప్రోత్సహించబడేదో, ఎలాంటి టెన్షన్లూ లేకుండా ఆడుతూపాడుతూ రోజులు గడవడానికి ఎక్కువ వీలుండేదో చెప్పడానికే తలుచుకుంటున్నాను.




అప్పట్లో ఫస్ట్‌క్లాస్, సెకండ్ క్లాస్, థర్డ్ క్లాస్ స్టూడెంట్స్ అనేది మాత్రం కేటగిరీ! పర్సంటేజ్‌లూ, పాయింట్లూ ఇప్పట్లా ఊదరగొట్టేవి కావు. ఫస్ట్‌క్లాస్ స్టూడెంట్స్ తీరే వేరు! నేనెప్పుడూ థర్డ్‌క్లాసుకూ, హయ్యర్ సెకండ్ క్లాసుకూ మధ్యలో వాడినే. బొమ్మలు గీయడం, నాటకాలు వేయడం, పిల్లల్ని పోగేసి బాలానందం అంటూ ఆడడం, లిఖిత పత్రిక అంటూ రాస్తూకూచోవడం.. ఇవి అమ్మ నాన్నలచేత తిట్టించిన సందర్భాలు లేవని అనను గానీ, నా మార్కుల స్థాయి ఏమిటో వారికి తెలుసుకనుక, "బాగా చదువుకో! బొమ్మలు అవీ

కూడెడతాయా, గుడ్డెడతాయా?" అని ఓ ప్రక్కన తిడుతూనే, చూసీచూడనట్లుగా ఊరుకుంటూ, ఓ మంచి బొమ్మ వేసినా, మరే కళాత్మక పని చేసినా 'బావుందిరా' అనేవారు. నాన్నగారికి కోపం తక్కువే అయినా, అది మా అన్నయ్య మీద ఒకసారి చూసాను కాబట్టి జాగ్రత్తపడేవాడిని. ఆరుగురు పిల్లల్లో నేను కొంచెం అర్భకుని కిందే జమ! పొట్టిగా ఉండేవాడిని కూడాను.

అచ్చులో వచ్చిన నా మొదటి కవిత


నే రాస్తా!

ఒకే ఒకే కోతి కొమ్మచ్చిలా నేనూ ఎటో ఎటో గెంతుతున్నట్లున్నా... వదిలేయండి! స్కూల్లోని ఒక సంగతి మటుకు చెప్పేసి కాలేజి యువవాణి కబుర్లకు వెళ్ళిపోతానే... మా స్కూల్లో కృష్ణమూర్తిగారి తర్వాత, వెంకటేశ్వర శర్మగారని పెద్ద తరగతిలో ఇంకో తెలుగుమాష్టారుండేవారు. రామబ్రహ్మంగారనే లెక్కల మాష్టారంటే మటుకు హడలిపోయేవాళ్ళం. చేతివేళ్ళు ముడిపించి వెనక్కి తిప్పమని, లెక్కతప్పు చేస్తే, డస్టర్ తో కొట్టేవాడాయన. పేను బెత్తాలు ఝుళిపించే వైఖరీ ఉండేది. 'దండం దశగుణం భవేత్' అని - తల్లితండ్రులూ, గురువులూ విశ్వసించిన కాలంకదా అది! అలాగే మా హెడ్మాష్టర్ వెంకటేశ్వర్రావ్ గారన్నా హడలిపోయేవాళ్ళం. మాక్లాస్ టీచర్ లక్ష్మి మటుకు చాలా మంచివారు. రైలు పట్టా ముక్కలాంటి గంటను మ్రోగించే ప్యూన్ 'పెంటయ్య' కూడా బాగా గుర్తే! 'మన బడినడుపున దెవ్వరురా?' అని తెలుగువాచకంలో ఉంటే - మా చెల్లి, బడిగంట కొట్టే పిరియడ్ల పద్ధతే బడినడపడం అనుకుని - 'పెంటయ్య' అని సమాధానం ఇచ్చింది కూడాను.

మా తెలుగు మాష్టార్ల చొరవతో - స్కూలు వార్షికోత్సవానికి ఆచార్య దివాకర్ల వేంకటావధాని గారు వచ్చి 'వసుచరిత్ర' లోని ఓ ఘట్టం వివరిస్తూ ప్రసంగించడం ఆనాటి మా లేత బుర్రల మీద మంచి సాహిత్యాభిరుచిని కలిగించింది! గిరికను తండ్రి హిమవంతుడూ, తల్లి శుక్తిమతీనదీ - ఎలా గారాబంగా పెంచారో ఆయన 'వసుచరిత్ర' పద్యం చెప్పి విశ్లేషించిన తీరు ఇప్పటికీ నా కనులముందు కదలాడుతూంది! ఆ ప్రసంగ సారాంశం నా లిఖిత పత్రికలో వార్తలా రాసుకున్నా కూడాను. అదే ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారి దగ్గర ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎం.ఏ తతగతుల్లో ప్రత్యక్ష విద్యార్థిని అవుతాననీ, ఆ తరువాత యువభారతి సంస్థ ఆయనకు ఒకసారి సన్మానం చేసినపుడు ఆ సన్మాన పత్రాన్ని నా అక్షరాలంకరణతో రాస్తానని గానీ, వృత్తిరీత్యా రేడియోలో ఆయన ప్రసంగాలు రికార్డు చేస్తాననిగానీ అప్పుడు నాకు తెలియదుకదా! ప్రాచీన సాహిత్యంపట్ల పాఠశాల వార్షికోత్సవంలో 'దివాకర్ల'వారి ప్రసంగమే అభిరుచిని. పెంచింది. సైన్సు అంటే కొంచె ఇష్టముండేది గానీ, లెక్కలంటే భయమే! అక్షరం ఆకర్షించినంతగా అంకెలు ఆకర్షించలేదు నన్ను - నాటికీ, నేటికీ!

ఆచార్య దివాకర్ల వేంకటావధాని గారు



హెచ్.ఎస్.సి తరువాత, హైదరాబాదులోని వివేక వర్ధనీ కళాశాలలో పి.యు.సి (ప్రీ యూనివర్సిటీ కోర్స్) లో చేరి బై.పి.సి తీసుకున్నాను. నాన్నగారికి తాను వైద్య ఆరోగ్యశాఖలో ఉండడం వల్ల, పిల్లల్లో ఒక్కరైనా 'డాక్టరీ' చదివితే బాగుణ్ణని ఉండేది! అన్నయ్య బి.కామ్ చేసాడు. నేను పి.యు.సిలో కెమిస్ట్రీలో పదిమార్కులు తగ్గి పరీక్ష తప్పడంతో,లెక్కలు, సైన్సు ఈ రెండూలేని చదువే చదువుతానని ఇంట్లో హఠం చేసి - ప్రాచ్యకళాశాలలో డిప్లమో ఇన్ ఓరియంటల్ లాంగ్వేజెస్‌లోకి తరువాత మారిపోయాను.

పి.యు.సిలో ఒక్కసారిగా బోధన సైతం ఆంగ్లమాధ్యమం అయ్యేసరికి, అంతవరకూ అంటే హెచ్.ఎస్.సి వరకు తెలుగు మాధ్యమంలో చదువుకోవడం వలన చాలా ఇబ్బంది పడిపోయిన విద్యార్థుల్లో నేనొకడిని. నిడదవోలు సర్వేశ్వరరావు గారి తెలుగు పిరియడ్ అంటే మాత్రం ప్రాణం లేచి వచ్చేది. ఆయన నిడదవోలు వెంకటరావుగారి అబ్బాయి. నిడదవోలు వెంకట్రావు, వసంత రావు వెంకటరావు వీళ్ళ పాఠాలు హైస్కూల్ పాఠ్యపుస్తకాల్లో చదువుకున్నాం. పి.యు.సి చదువుతున్నపుడు తెలుగు పుస్తకంలో పానుగంటి లక్ష్మీనరసింహారావుగారి సాక్షి వ్యాసాలలోని 'స్వభాష' పాఠం ఉండేది. జంఘాల శాస్త్రి - తెలుగులో మాట్లాడలేనని ఆంగ్లంలో ఉపన్యసించే ఓ పెద్దమనిషిని చూసి ఉపన్యసించినట్లుగా సాగే ఆ వ్యాసం, నాటినుంచి నేటివరకూ నేను అభిమానించే రచన! మీలో ఎందరు చదివారో నాకు తెలియదుగానీ, 'స్వభాష' సాక్షి ఉపన్యాస వ్యాసం మీరు చదివి ఉండకపోతే తప్పక చదవండి. ప్రతి తెలుగువాడూ తప్పక చదవి తీరవలసిన అద్భుతవ్యాసం అది!

వివేకవర్ధని కాలేజీలో పి.యు.సిలో చేరిన వెంటనే మామూలుగా నిక్కరు, చొక్కా వేసుకు తరగతికి వెళ్ళగా, అంతా నవ్వడం, కాలేజీకి ప్యాంటు వేసుకు వెళ్ళాలని గ్రహించి, ఇంట్లో పోరి ఆ తరువాత పైజమాలు, ప్యాంట్లు ధరించి వెళ్ళడం ఎలా మర్చిపోతాను! ఎన్.సి.సి.లో చేరడానికి నా ఎత్తు సరిపోకపోవడంతో, నాకు తగిన ఎన్.సి.సి ఖాకీ డ్రెస్సూ, బూట్లూ లేక లాభంలేదని ఎన్.సి.సి సారు నన్ను పొమ్మనడం గుర్తే. పొడుగవ్వాలని దూలాలు పట్టుకు వ్రేలాడేవాడిని కూడాను! పి.యు.సి నుండి ప్రాచ్యకళాశాల డిప్.ఓ.యల్ లో చేరేవరకు రెండుమూడేళ్ళు రేడియో కేంద్రంతో ఎలాంటి ప్రత్యక్ష సంబంధంలేదన్న మాట వాస్తవం.






## 5

**1967వ సంవత్సరం** నా జీవితంలో ఒక ప్రభావోపేతమైన సంవత్సరం! ఒక విధంగా చెప్పాలంటే - రేడియోలో పనిచేయడానికి కావలసిన 'క్వాలిఫికేషన్స్' సంతరించుకోవడానికి, ఆ ఏడాదే శ్రీకారం చుటింది! సాహిత్య, సాంస్కృతిక రంగాలకు బలమైన పునాదులువేసుకునేందుకు నాకు అవకాశాలు సమకూడిన సంవత్సరం అది!

హైదరాబాద్ 'వివేకవర్ధనీ' కళాశాలలో పి.యు.సి చదువుతునపుడే - దారిలోనే ఉండే, తుర్రేబాజ్‌ఖాన్ రోడ్డు (కోఠీ)లోని 'బాలబంధు' ప్రతికా కార్యాలయంలో నా రచనలు ఇస్తుండటం, ఆ పక్షపత్రికలో అవి వస్తూండటం జరిగేవి. 1965 డిసెంబర్ ఒకటవ తేదీ 'బాలబంధు'లో అచ్చులో నా తొలిరచన - 'చెడుసహవాసం' అనే కథ వచ్చిందని చెప్పానుగా! 'బాలబందు నుండి నా రచనా ప్రయాణం - కార్టూన్లు, కవితలు, ఛందోబద్ధ పద్యాలు, బొమ్మలుగా సాగింది. అప్పట్లో 'ప్రతిభ అనే విజయవాడ నుంచి వచ్చే వారపత్రిక, మద్రాసునుండి వస్తుండే 'ఆంధ్రపభ' వారపత్రికలో, విజయవాడనుండి వచ్చే 'ఆంధ్రజ్యోతి' వారపత్రిక, ఎక్కువగా కార్టూన్లు వేస్తూ ఉండేవాడిని. ప్రధానంగా నా ఆసక్తి కవితా రచనే. విరివిగా కవితలూ వచ్చేవి. 'కృష్ణాపత్రిక', 'ప్రజామత'లో ఛందోరచనలు చేశాను.

సుల్తాన్ బజార్‌లోని 'శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం' గ్రంధాలయంలో - పుస్తకపఠనాభిలాష తీర్చుకుంటుండేవాడిని! పి.యు.సి వదిలేసి, ప్రాచ్య విద్య డిప్లొమాలో - ఆంధ్ర సారస్వత పరిషత్తు పాచ్యకళాశాలలో 1967 లోనే చేరాను. హైదబాద్ తిలక్ రోడ్‌లో మా కాలేజీ ఉండేది. నల్లకుంటలో మరో ఓరియంటల్ కాలేజీ ఉండేది గానీ, భవనసముదాయాలూ అవీ - సారస్వత పరిషత్తువే ఆకర్షణీయంగా ఉండేవి! అది సాయం కళాశాల కనుక, నాలాంటి రెగ్యులర్ విద్యార్థులే కాక, వివిధ ఉద్యోగాలు చేసుకుంటూ - అభిలాషతో సాయంకళాశాలలో ప్రాచ్య విద్యాభ్యాసానికై చేరినవారూ ఉండేవారు! నేను చేరినప్పటికి 'శ్రీ సరిపల్లె విశ్వనాధ శాస్త్రి'గారు, ఆచార్య రవ్వా శ్రీహరిగారు అధ్యాపక బృందంలో ఉండేవారు. సంస్కృతం కూడా ఒక పాఠ్యాంశం. ఇంగ్లీష్ తరగతులు శౌరయ్యగారు తీసుకునేవారు.

కళాశాలకు సుల్తాన్ బజార్ మీదుగా నడుచుకుంటూ వెళ్ళేవాడిని. మలక్ పేట కాలనీనుండి కోఠీవరకు బస్సులుండేవి. సుల్తాన్ బజార్‌లోని అప్పటి దిల్ షాద్ టాకీస్ (భాషానిలయం ప్రక్కనే ఉండేది) ఎదురుగా 'చుక్కాని' వారపత్రిక కార్యాలయం, ప్రెస్ ఉండేవి. శ్రీ

కాశీనాధుని సుబ్రహ్మణ్యంగారు దాని ఎడిటర్. చుక్కానికి తొలిసారిగా 'బంగారు పాళీలు' పేర, రచయితలను పరిచయం చేసే శీర్షిక, అలాగే 'గళ్ళనుడికట్టు' శీర్షికలను నిర్వహించే అవకాశం కలిగింది! భాషానిలయం, చుక్కాని, సారస్వత పరిషత్తు అవీ అప్పటి నా ప్రధాన కూడళ్ళు. రేడియో క్వాలిఫికేషన్స్‌కు మొదళ్ళు.




ఇక 1967లోనే - 'యువభారతి' సంస్థతో పరిచయం ఒక గొప్ప మలుపు. శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం'మేడమీద పరామర్శ విభాగంలో, ప్రతినెలా  మొదటి, మూడవ ఆదివారలలో యువభారతి సాహిత్య సమావేశాలు మధ్యాహ్నం 2.30 నుండి అయిదు వరకూ జరిగేవి. డెక్కన్ క్రానికల్ రోజూ వేసే సిటీ డైరీలో ఓ ఆదివారం, ఆ విషయం చూసి, ఒంటరిగానే వెళ్ళి, మేడమీద సమావేశం గదిముందు కొంచెం సందిగ్ధంగా - 'లోపలకు వెళ్ళాలా, కూడదా' అని తచ్చాడుతుండగా, సూర్యనారాయణగారనే ఆయన నన్నులోనికి ఆహ్వానించి, కూర్చోమని, 'అతిధి పరిచయ పత్రం'నింపమని కాగితం ఇచ్చారు. అందులో యువభారతి సరస్వతి ముద్రతో; పేరు, చిరునామా, అభిరుచులు నింపే కాలమ్స్ ఉన్నాయి. అవి నింపి ఇచ్చాక, యువభారతి నాటి సమావేశం, 'మాణిక్యవీణాం' అనే శ్లోకమే సరస్వతీ ప్రార్ధనగా ఎవరో పాడగా మొదలైంది! వెనువెంటనే వారు "నేటి సమావేశానికి వచ్చిన అతిధులు" అని నాలాగే వచ్చిన మరి ముగ్గురు నలుగురిని కూడా ముందు పరిచయం చేసి, ఆహ్వానం పలికి, సమావేశ కార్యక్రమాలను మొదలు పెట్టడం నన్నెంతగానో ఆకట్టుకుంది! వచ్చిన అతిధిని సభలో పరిచయం చేసి, తమలో ఒకడిగా అలాకలుపుకోవడం నాకు నచ్చింది!! అది "ఒక వేదికా, ఎదురుగా ప్రేక్షకులూ" అన్న రీతి సభగా కాక, అందరూ మెత్తటి పరుపులవంటి వాటిమీదే, రౌండ్‌గా, క్రిందే కూర్చుని నిర్వహించిన సభ! 'క్లుప్తగోష్ఠి' అనే కార్యక్రమ తొలి అంశం! ఒక డబ్బాలో వివిధ విషయాలను చీటీలపై రాసి ఉంచి, ఎవరిముందు ఆ డబ్బా ఉంచితే, వారు అందులో చేతికొచ్చిన ఓ చీటీ తీసుకుని, అందులో విషయం మీద రెండు నిముషాల సేపు మాట్లాడాలి! అధ్యక్షా!, క్లుప్తగోష్ఠి నిర్వాహకా" అనే సంబోధనతో ప్రారంభించాలి. ఒక నిముషం నలభై సెకన్ల తరువాత, ఓ హెచ్చరిక మ్రోత మోగిస్తారు. మిగతా ఇరవై సెకండ్లలో మాట్లాడటం ముగించాలి. అతిధుల ముందుకు ఆ డబ్బాను పంపి మాట్లాడించారు. నేను నాటి 'క్లుప్తగోష్ఠి'లో దేన్ని గురించి ప్రసంగించానో ఇప్పుడు గుర్తులేదుకానీ, పదిపదిహేనుమంది మాట్లాడాక, వచ్చినవారందరికీ ఇవాళ క్లుప్తగోష్ఠిలో మాట్లాడిన వ్యక్తులలో మీరు ఎవరిని ఉత్తమ వక్త అనుకుంటున్నారో వారి పేరు ఇవ్వబడిన చీటీలో వ్రాసి అందచేయమని అందరికీ తెల్ల చీటీలు పంచారు.

ఇంతలో 'నా ఊహాపథంలో' అనే, అంతకుముందు సమావేశంలో ఇవ్వబడిన అంశం - 'కలలు' గురించి స్వీయరచనలు రాసి తెచ్చి చదివే కార్యక్రమంలో - సభ్యులు తమ రచనలు వినిపిస్తుండగా, క్లుప్తగోష్ఠి ఉత్తమ వక్త పత్రాలను ఆ కార్యక్రమం నిర్వాహకులు లెక్కించసాగారు!. ఒకప్రక్క కొందరు తమ రచనలు వినిపిస్తుండగానే, నేనూ ఓ చిన్న కవిత 'కలలు' గురించి రాసి వినిపించాను. అది అవగానే - 'క్లుప్తగోష్ఠిలో నేడు ఎన్నికయిన ఉత్తమ వక్త'. అంటూ నా పేరు ప్రకటించి, అందరిముందూ ఒక పుస్తకాన్ని సంస్థ అధ్యక్షులు, క్లుప్తగోష్ఠి నిర్వాహకుల సంతకాలతో బహుమతిగా ఇచ్చారు. అలా నేనందుకున్న గ్రంథం శ్రీశ్రీ 'మహాప్రస్థానం'! నాకు పదహారేళ్ళ వయసులో స్ఫూర్తినిచ్చిన కవిత్వం. 'మహాప్రస్థానం' రాయడానికి ముందు 1930 లో శ్రీ శ్రీ టైఫాయిడ్ జ్వరపడ్డాడట! 'మహాప్రస్థానం' చదివేసరికి నాకు నిజంగానే స్వరం వచ్చింది. పదహారేళ్ళ వయసులో, కేవలం తెలుగు భాషమీద మమకారంతోనే - లెక్కలు, సైన్సులేని ప్రాచ్యవిద్యాకళాశాలలో చేరి, అప్పుడప్పుడే పత్రికల్లో కార్టూన్లు, కావితలు రాస్తూ, సాహిత్య సమావేశాలకు హాజరవ్వాలని ఉత్సహిస్తున్న నాకు - అలా 'యువభారతి' సంస్థతో పరిచయం, 'మహాప్రస్థానం' బహుమతి 1967 లో జీవితంలో సంక్రమించిన గొప్ప ప్రభావాలు!

ఆనాటి సమావేశం ముగిసి వచ్చేస్తుండగా - 'యువభారతి' వారు, తమ చిరునామా రాసి వున్న ఓ పోస్ట్‌కార్డ్ నిచ్చి, నాటి సమావేశం గురించి ఏమనుకుంటున్నదీ ఇంటి నుంచి రాసిపంపమని కోరారు. నేను రాసిన జవాబుకు తిరిగి లేఖ రాస్తూ, యువభారతి 'వంగపల్లి విశ్వనాథం'గారు 'నీలాంటి యువకుల అవసరం సంస్థకు ఎంతయినా ఉంది. వీలుంటే ఫలానారోజు సాయంత్రం భాషానిలయం ప్రక్కన కేఫ్‌కు రమ్మని' లేఖరాశారు. అలా వెళ్ళడం - ఆయన మాటలకు ఆకర్షితుడనై సంస్థ సభ్యుడిని కావటం జరిగాయి! నేను వెళ్ళిన ఆ తొలి సమావేశంలోనే కాళోజీ నారాయణరావు, జి.వి.సుబ్రహ్మణ్యం, ఇరివెంటి కృష్ణమూర్తి వంటి ప్రముఖులున్నారు. చక్రవర్తి వేణుగోపాల్ సమావేశంలో 'ఎంకిపాట' పాడటం, 'అనవసరంగా వక్తల ప్రసంగాలలో నేడు దొర్లిన ఆంగ్లపదాలు - వాటికి తెలుగు సమానార్థకపదాలు' అని ఒకరు చివర్లో వివరించిన వైనం నాకు ఇంకా గుర్తే!



కాలేజీ చదువు పాచ్యకళాశాలే అయినా - డాక్టర్ కె.కె. రంగనాథాచార్యుల గారివల్ల అభ్యుదయ భావస్ఫూర్తి ఇనుమడించింది! నిజానికి దిగంబరకవులుతో ఆయనకు సన్నిహిత పరిచయాలుండేవి. ఆయన్ను అప్రకటిత ఏడవ దిగంబర కవి అని అనేవారూ ఉండేవారు. ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రాచ్య కళాశాలకు ఆయన తరువాత ప్రిన్సిపాల్ అయ్యారు. వార్షిక సూచిక 'నెలవంక' - తొలిసంచిక కాలేజీ పక్షిన 1968 - 69 వెలువరించడం, అందుకు నిర్వహించిన వ్యాస రచనపోటీలో పాల్గొన్న నన్ను, ఉపసంపాదకునిగా నియమించడం జరిగింది! శ్రీ శ్రీ మహాప్రస్థానం పై వ్యాసం, 'నే దిగంబరకవిని' అనే కవిత 'నెలవంక' తొలిసంచికలో నా రచనలు.

అలా అలా 'యువభారతి'తో అనుబంధం, కళాశాల ద్వారా అంతర్ కళాశాలల పోటీలలో వాటిల్లో పాల్గొంటూ విద్యార్థిలోకంలో నేను ప్రాచుర్యం పొందడం జరుగుతూ వచ్చాయి. పెరుగుతూ వచ్చాయి. 'చుక్కాని'లో శీర్షికా నిర్వహణం ఒక పత్రికా రచయితను చేసింది నన్ను.

అల్లంరాజు వెంకటరావుగా ఉన్న నేను - అంతకు ముందు బాలరచయితగా 'భావ్యశ్రీ' పేర కొద్దిపాటి రచనలు చేసినా, 1967 లోనే 'సుధామ' అన్న కలంపేరు పెట్టుకున్నాను. అదెందుకు ఎలా జరిగిందో నేనిప్పుడు కచ్చితంగా చెప్పలేను. మా ఇంట్లో వారంతా నిబద్ధిత 'రాధాస్వామి సత్సంగులు' అని చెప్పానుకదా! సాయంత్రం సత్సంగంలోని ఒక ప్రార్థనా శబ్దంలోని 'లోక అలోక పావుం సుఖధామా' అనే వాక్యంలోంచి 'ఖ' తొలిగించి, 'సుధామ' అని గ్రహించానని చెప్పాలి. సుధామ అన్న పేరులో 'ధా'కు వత్తులేక, 'దా' అని ఉంటే - అది కృష్ణుని బాల్యమిత్రుడైన సుదాముడు (కుచేలుడు చక్కని దండలు అల్లేవాడట) అవుతుందిగానీ, 'సుధామ' అంటే 'సుధా' అనగా అమృతం, 'మ' అంటే మయుడు అనే దృష్టితో - సుధామ అంటే అమృతమయిన విష్ణువు, చంద్రుడు అనే భావం ఒకవంకా, మరోవంక 'సు' అనగా మంచి, 'ధామ' అంటే భవనం, నివాసప్రదేశం అనే అర్థంలో 'నేను వసించే చోటు 'సువ్యవస్థ' కావాలనే ఆకాంక్షతో' అభ్యుదయ భావన గలదిగానే - ఆ కలం పేరు గ్రహించాను. చెప్పానుగా! మహాప్రస్థానం ప్రభావం, కళాశాల ప్రభావం, యువభారతి, చదివింది సంప్రదాయ విద్యయే అయినా, ఒక సమ్యక్ దృష్టిని స్వీకరించి, కొంత వామపక్షభావజాలం వైపు ఆ యువకునిగా ఉన్న దశలో మొగ్గేటట్లు చేశాయి. రాధాస్వామి సత్సంగం మౌలిక సూత్రాలు, నియమాలు - పూర్తి శాఖాహారులు కావడం, కుల వివక్ష లేకపోవడం. అన్నిరకాలవారూ కలిసి సత్సంగం, సేవల్లో పాలుపంచుకోవడం నాకూ నచ్చాయి! కానీ నేను ఆ మతావలంబకుడిగా 'ఉపదేశం' తీసుకోలేదు.

నేను ఆంధ్రసారస్వత పరిషత్తు ప్రాచ్యకళాశాల డిప్.ఓ.యల్ రెండవ సంవత్సరం చదువుతుండగా, ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం వారు అప్పట్లో 'తరుణభారతి' పేరిట ప్రసారమయ్యే యువజనుల కార్యక్రమంలో పాల్గొనమని కాలేజీకి కాంట్రాక్ట్ పంపారు. కాలేజీ పక్షాన యువ విద్యార్థిగా 1970 ఫిబ్రవరి 27 రాత్రి 7.45 కు ప్రసారమైన కార్యక్రమంలో విద్యార్థులం మొదటగా రేడియో ప్రోగ్రాం ఇచ్చి, వస్తూ వస్తూ ప్రిన్సిపాల్ డా.కె.కె.రంగనాధాచార్యులు గారితో ఫోటో తీయించుకున్నాం! ఈ ఫోటోలోని డి.చంద్రశేఖర్ రెడ్డి ఆ తరువాత ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రాచ్యకళాశాలకే ప్రిన్సిపాల్ అయ్యి, పదవీ విరమణ తరువాత ప్రస్తుతం 'ఎమెస్కో' ప్రధాన సంపాదకుడిగా ఉన్నాడు. సి.లక్ష్మణరావు (పతంగే) కూడా ఎమెస్కోలో ఉన్నాడు. వి.రాఘవరావు 'రఘుశ్రీ'గా ప్రసిద్ధుడు! కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ గా చేసి ప్రస్తుతం జంటనగరాలలో మానస ఆర్ట్ థియేటర్స్ పేర సాహిత్య, సాంస్కృతిక రంగాలలో విశేషకృషిచేస్తున్నాడు.

1967 లో నేను సంపాదకునిగా 'యువమిత్ర' అనే లిఖిత మాసపత్రిక ప్రారంభించి, దాదాపు పది సంవత్సరాలు బాటు (మధ్యలో స్వల్ప విరామాలు తీసుకున్నా) నిర్వహించాను. చేతివ్రాతతో ఉండే పత్రికే అయినా, సచిత్రంగా ఒక మామూలు - ఆనాటి




'యువ', 'జ్యోతి' మాసపత్రికల్లా తీర్చిదిద్దేవాళ్ళం! శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం, ఉస్మానియా విశ్వవిద్యాలయాలలో వారం, పదిరోజులు పాఠకులు చదువుకునేలా త్రిప్పుతుండేవాడిని. ప్రత్యేకమైన ఫోల్డర్‌లో పెట్టి గ్రంథాలయాధిపతులు 'యువమిత్ర'ను ఇతర పత్రికల్లా పాఠకులు చదివేందుకు అందుబాటులో ఉంచేవారు. ఆ లిఖిత పత్రిక చివర్లో ఒక చిన్న సైజులో తెల్లకాగితాల పుస్తకం పెట్టి, అందులో చదివిన వారి అభిప్రాయాలు నమోదు చేయమనేవాళ్ళం. 'యువమిత్ర' ను పద్మభూషణ్, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత అయిన నేటి డా.సి.నారాయణ రెడ్డిగారు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ




కార్యదర్శిగా పనిచేసిన యువభారతి అధ్యక్షులయిన నాటి యూనివర్సిటీ లెక్చరర్ కీ.శే. ఇరివెంటి కృష్ణమూర్తి గారలు కూడా ఎంతో అభినందించారు. డా ఎన్. గోపి (మాజీ వైస్ ఛాన్సలర్, తెలుగు విశ్వవిద్యాలయం) అమ్మంగి వేణుగోపాల్ యువకులుగా 'యువమిత్ర' కార్యాలయమైన మా ఇంటికివచ్చి రచనలు ఇచ్చి వెళ్ళడమూ జ్ఞాపకమే. ఎన్నో లిఖిత పత్రికలకు 'యువమిత్ర' స్ఫూర్తి అయింది నాడు..

1970 లో కాలేజీ నుండి సమర్పించిన రేడియో కార్యక్రమం, ఆనాటి ఆకాశవాణి ప్రొడ్యూసర్ శ్రీ వేలూరి సహజానంద గారికి - నా పట్ల అభిమానాన్ని కలిగించింది. నా వాచకం, నా రచన ఆయన అభినందనలకు నోచుకోవడంతో, సాహిత్య కార్యక్రమాలతో ఒక కవిగా ప్రత్యేకించి విడిగా నన్ను ఆహ్వానించడం మొదలుపెట్టారు ఆయన.

అలా 1970 నుండి వరుసగా రేడియో కార్యక్రమాలలో తరచుగా పాల్గొంటూ మొదట క్యాజువల్ బేసిస్ మీద, రేడియోలో పనిచేసే అవకాశం పొందడం జరిగింది.




# 6

**యువకవిగా,** రచయితగా, ప్రసంగ కర్తగా, ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో 1970 నుండీ పాల్గొంటూ, విరివిగా కార్యక్రమాలు ఇచ్చానంటే, దానికి తొలి ప్రోత్సాహం - ఆనాడు ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో తెలుగు కార్యక్రమాల అధిపతిగా ఉన్న - వేలూరి సహజానంద గారిదే! అప్పట్లో - పంచ వర్ష ప్రణాళికల ద్వారా దేశాభివృద్ధిని గూర్చిన ప్రసారాలు రూపొందించడానికి కూడా ఆయనే ప్రొడ్యూసర్ గా ఉండేవారు. అసలు 'వేలూరి' వారి వంశం అంటేనే - పాండిత్యానికీ, సృజనాత్మక సాహిత్యానికీ వన్నెగాంచింది! దాదాపు దశాబ్ద కాలం పాటు హైదరాబాద్ కేంద్రంలో తెలుగు విభాగం నిర్వహించిన ఆయన రచయితగా ప్రసిద్ధులు కావడం మాత్రమే కాదు, ఎందరినో ప్రోత్సహించి ఆకాశవాణి ద్వారా వెలుగులోకి తెచ్చారు. ఆయన ప్రోత్సహించిన యువకవుల్లో నేనొకడిని కావడం నాకు ఆనందదాయకం!


యువకునిగా నేను



'యువభారతి' సాహితీ సాంస్కృతిక సంస్థ అయిదవ వార్షికోత్సవాల సందర్భంగా యువభారతి తృతీయ ప్రచురణగా 'వీచికలు' కవితాసంకలనం - నలుగురి సభ్యుల రచనలతో ప్రచురితమైంది. యువభారతి తొలి ప్రచురణ అయిన అనుముల కృష్ణమూర్తి గారి 'సరస్వతీ సాక్షాత్కారం నాటికి నాకు సంస్థతో పరిచయం లేదు గానీ, నేను యువభారతికి పరిచయమైన తర్వాత ద్వితీయ ప్రచురణగా వచ్చిన ఖలీల్ జీబ్రాన్ 'ది ప్రాఫెట్' కు శ్రీ కాళోజీ నారాయణరావుగారి అనువాదం 'జీవనగీత' (మానవాళి నివాళులెత్తవలసిన కారుణ్యోపనిషత్తు)గా ప్రచురితమైంది సికింద్రాబాద్ 'జీరా'లోని వంగపల్లి విశ్వనాథంగారింట్లో - కాళోజీగారు చెబుతూ ఉండగా, 'జీవనగీత' ప్రెస్ కాపీని నా చేతిరాతతో రూపొందించడం, ఆ తరువాత రోజుల్లోనే - 'నా గొడవ'తో ప్రముఖ ప్రజాకవిగా పేరొందిన కాళోజీగారితో సాన్నిహిత్యం, ఉత్తర ప్రత్యుత్తరాలు మరుపురానివి జీవితంలో.


డా॥సి.నారాయణ రెడ్డి  శ్రీ ఇరువెంటి కృష్ణమూర్తి

'వీచికలు' కవిత సంకలనంలో యువభారతి అధ్యక్షులైన డాక్టర్ ఇరివెంటి కృష్ణమూర్తిగారు, చక్రవర్తి వేణుగోపాల్ అని ఆ నాటికే పత్రికలద్వారా ప్రసిద్ధుడైన యువభారతి సభ్యుడైన మరో కవి, అల్లంరాజు వెంకట్రావుగా నేను, వంగపల్లి విశ్వనాథం ఈ నలుగురు కవుల సంకలనం అది. పుస్తకంలో నాలుగు భాగాలుగా - ఒక పింక్ కాగితం మీద ఆ కవి, అతని వివరాలు విభాగంగా ముందు జతపరుస్తూ, ప్రచురించిన ఆ కవితా సంకలనం - 1968 అక్టోబర్ 2 బుధవారం సాయంత్రం 6.30 కు హైదరాబాద్ సుల్తాన్ బజార్ లోని శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయంలో డా.సి.నారాయణరెడ్డిగారు ఆవిష్కరించారు. శ్రీ కాళోజీ గారే నాటి సభకు అధ్యక్షులు. అన్నట్లు 'వీచికలు' కవితా సంకలనం ముఖ చిత్రం కూడా నాదే! నారాయణరెడ్డిగారు మాట్లాడుతూ - 'బొమ్మలో కవిత రాస్తాడు. కవితలో బొమ్మ గీస్తాడు' అని ప్రశంసించడం గుర్తే నా గురించి. 'ఆంధ్రప్రభ' వారపత్రికలో ఆరుద్ర, 'ఆంధ్రజ్యోతి' వీక్లీలో పురాణం దానిని సమీక్షించారు. ఒక పుస్తక సమీక్ష మీద పాఠకుల ఉత్తరాలు ప్రచురించే 'అభిప్రాయవేదిక'లో పాఠకులు చర్చించడం ఆంధ్రజ్యోతిలో 'వీచికల'మీదే సాగింది. పురాణం చక్రవర్తి గురించీ, నా గురించీ చేసే విమర్శ సరికాదనీ, మా కవితలే సంకలనంలో బాగున్నాయనీ, పురాణంగారు శ్రద్ధగా పరిశీలించినట్లులేదనీ, పాఠకులు ఉత్తరాలు రాయడం, పురాణంగారే వాటిని పాఠకుల ఉత్తరాల శీర్షికలో కొన్ని వారాలు వరుసగా ప్రచురించడం ఓ విశేషం! ఆకాశవాణి విజయవాడ కేంద్రం నుండి శ్రీ కోటగిరి విశ్వనాథరావుగారు వీచికలపై చేసిన సమీక్ష - "శ్రీ వెంకట్రావుగారు నేటి పరిస్థితులను చమత్కారవంతంగా విమర్శించిరి" అంటూ ధరల గురించిన కవితను కోట్ చేయడం, డిసెంబర్ 24 వ తేదీన ప్రసారమైంది. అప్పట్లో విజయవాడ ఆకాశవాణిలో కార్యక్రమ నిర్వహణాధికారిగా వున్న శ్రీ గుంటూరు రఘురాం (తరువాత డిప్యూటీ డైరెక్టర్ జనరల్ దాకా వెళ్ళారు) ఆ సమీక్ష ప్రతిని యువభారతికి పంపారు. రేడియో కార్యక్రమాల పక్షపత్రికగా ఆ నాడు వెలువడుతుండే 'వాణి'లో - ఆ సమీక్ష ప్రచురితమైంది కూడాను! ఆ తరువాత 1968 నవంబర్ లో ఆంధ్రప్రదేశ్ రైటర్స్ పబ్లికేషన్స్ అకాడమీ ప్రచురించిన 'భావసౌరభాలు' కవితా సంకలనంలోనూ, స్పందన సాహితి పక్షాన శ్రీ గుత్తికొండ సుబ్బారావు వెలువరించిన 'స్పందన' కవితాసంకలనంలోనూ, నా కవితలు చోటు చేసుకున్నాయి. కార్టూన్లు, కవితలు పత్రికల్లో విరివిగా వస్తుండేవి.





వేమూరి ఆంజనేయ శర్మగారిని ఇంటర్వ్యూ చేస్తూ నేనూ ఎస్.పి.సుధ

ఆ రోజుల్లో విరివిగా జరిగే జంటనగరాల్లోని పలు సంస్థల కవి సమ్మేళనాల్లో యువకవులమంటే - కె.శివారెడ్డి, నేను, గంధం జోయల్, గులాం యాసీన్, రఘుశ్రీ, శాంతిస్వరూప్, వంటి వారం ఉండేవాళ్ళం. ముఖ్యంగా చందమామపై మానవుడు అడుగు పెట్టిన సందర్భంగా, 1969 సెప్టెంబర్ లో 23 వ తేదీన ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, నవ్య సాహితీ సమితి రవీంద్రభారతి కళాభవన్ హాలులో నిర్వహించిన కవి సమ్మేళనంలో దాశరథి, శేషేంద్ర, బోయి భీమన్న, కుందుర్తి, ముదిగొండ వీరభద్రమూర్తి, శశాంక, కేశవ పంతుల , టి.వి భద్రిరాజు దివాకర్ల, అరిపిరాల విశ్వం వంటివారితో బాటుగా సినారె ప్రారంభించిన ఆ కవి సమ్మేళనంలో నా కవిత బహుధా ప్రశంసలు పొందింది. ( పదమూడు పేజీల ఆ సుదీర్ఘ కవిత స్రవంతి మాసపత్రికలో వచ్చింది తర్వాత) 'కృష్ణాపత్రిక' 'ప్రజామత'లలో ఛందోబద్ధ కవితలు రాస్తూనే, 1969 లోనే వచన కవితా రచనవైపుకు మరలి, 1970 నుండి పూర్తిగా 'ఫ్రీవర్స్'లోనే

రాయడానికి 'కుందుర్తి'గారు కూడా ఒక ప్రేరణ! ఆయన మాకాలనీలోనే మలక్ పేట M.C.15 లో ఉంటుండేవారు. 'ఆంధ్రప్రదేశ్' మాసపత్రికలో సంపాదకులుగా ఉంటూ, కుందుర్తి ఆంజనేయులు గారే నా చేత 'చిత్రప్రకృతి' అనే కావ్యంపై మొదటిసారిగా గ్రంధ సమీక్ష చేయించారు. ఆ వేళావిశేషం ఏమిటో గానీ - ఇప్పటికి వివిధ పత్రికల్లో సుమారు వెయ్యి పుస్తకాల దాకా రివ్యూలు చేసి ఉంటాను.

నా ఈ కృషిని అంతా వేలూరి సహజానంద గారు గమనిస్తూ ఉన్నారని మొదటిసారిగా వ్యక్తిగతంగా 1970 లో 'రసమంజరి' కార్యక్రమంలో పాల్గొనడానికి ఆకాశవాణి కాంట్రాక్ట్ అందడంతో నాకు అర్ధమైంది! రేడియోలో తొలిసారిగా పారితోషికం వ్యక్తిగతంగా అందుకున్నది యువకవిగా - 1970 లోనే.

ఆ ఏడాదే ఏప్రిల్ లో ఉగాది రోజున "ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్ధి రచయితల సంఘం" శశాంక గారు గౌరవ అధ్యక్షులుగా స్థాపించబడింది. అడపా రామారావు కార్యదర్శి. నేను సహాయ కార్యదర్శి. న్యూసైన్స్ కళాశాలలో, బద్రుకా కళాశాలలో సమావేశాలు జరిగేవి. ఉస్మానియా యూనివర్శిటీ అనుబంధ కళాశాలలో సమావేశాలు జరిగేవి. ఉస్మానియా యూనివర్శిటీ అనుబంధ కళాశాలల వారందరూ సంఘంలో సభ్యులే. 'జ్యోత్స్న' పేరిట వార్షిక సంచికను కూడా సంఘం వెలువరించింది. అప్పుడు పాలకోడేటి సత్యనారాయణ దాని సంపాదకుడు. 1971 మార్చి 21 న శ్రీ వేలూరి సహజానంద గారు ముఖ్య అతిధులుగా శశాంక గారి అధ్యక్షతన జరిగిన విద్యార్ధి రచయితల కవి సమ్మేళనంలో - స్థానిక కళాశాలలనుండి నా కవిత 'నీడలు'కు ప్రధమ బహుమతి లభించింది. మరోమారు డా.దేవరాజు మహరాజు తెలంగాణా యాసలో రాసిన 'ఉగాది' కవితకు బహుమతి లభించింది. విద్యార్ధి కవులను ప్రోత్సహించింది సంఘ అధ్యక్షులుగా శశాంకగారూ, ఆకాశవాణిలో సహజానందగారు, సి.నారాయణరెడ్డిగారు స్ఫూర్తిగా ఉండేవారు కవులకు.



అలాగే శేషేంద్ర! ఆకాశవాణి ఆహూతుల సమక్షంలో ఉగాది సమ్మేళనాలు నిర్వహిస్తుండేది. ఏటా గణతంత్ర దినోత్సవం సందర్భంగా 'జాతీయ కవిసమ్మేళనం' ప్రసారమవుతుంది. ఒక్కొక్క భాషనుండి ఒక్కొక్క కవిని ఎంపికచేసి, సర్వభాషా కవి సమ్మేళనాన్ని న్యూఢిల్లీలో నిర్వహించేవారు. ఆ కవితలన్నీ అన్ని బాషల్లోకి అనువాదమై ఆయా కేంద్రాలనుండి ప్రసారమవుతాయి. జాతీయ కవి సమ్మేళనం కవితల తెలుగు అనువాద కార్యక్రమం - ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రమే రూపొందించి, ప్రసారం చేయగా రాష్ట్రంలోని అన్ని కేంద్రాలు రిలే చేస్తాయి. సహజానంద రేడియోలో కోపల్లె శివరాం, గులాం యాసీన్, గంధం జోయెల్, శివారెడ్డి ప్రభృతులను కూడా ప్రోత్సాహిస్తుండేవారు. ఒక ఉగాదికి కవి సమ్మేళనంలో శివరాంకు అవకాశం కలిగించి, నా దగ్గరకు వచ్చి "నీకు ఇవ్వలేదు అను కుంటున్నావేమో అబ్బాయ్! నీ కోసం ఓ ముఖ్యమైన తాయిలం దాచి ఉంచాను" అని నవ్వుతూ చెప్పి, ఆ వెంటనే వచ్చిన 'జాతీయ కవి సమ్మేళనంలో' ఓ ఒరియా కవిత అనువాదాన్ని నా చేత చేయించి ప్రసారం చేశారాయన! (ఒరియా నాకు వచ్చనుకోకండి! ప్రతి అన్యభాషా కవితకూ - ఆంగ్ల, హిందీ అనువాదాలను ఢిల్లీ కేంద్రం పంపిస్తుంది! వాటి ఆధారంగా తెలుగులో కానీ, అన్య ప్రాంతీయ భాషల్లోగానీ, అనువాదాలు కవులచేతే చేయించడం చేస్తారు.)

ఆకాశవాణి హైదరాబాద్ 'బి' కేంద్రంలో 'యువవాణి' ఛానెల్ 20 డిసెంబర్ 1970 లో ప్రారంభమైంది. అంతకుమునుపు యువజనుల కోసం హైదరాబాద్ 'ఎ' కేంద్రంపైనే 'తరుణ భారతి' అని ఓ గంట ప్రోగ్రాం ప్రసారమయ్యేది. అదికాక అందరికీ ఉద్దేశించిన - 'రసమంజరి', 'ధ్వని' వంటి సాహిత్య కార్యక్రమంలో పెద్దల సరసన వేలూరి సహజానందగారు - మాకూ స్థానం కల్పించారు. 'యువవాణి' మొదలు పెడదాం అనుకున్నప్పుడు, రేడియోలో క్యాజువల్ పద్దతిలో పనిచేసేందుకు అనౌన్సర్లను, ప్రొడక్షన్

అసిస్టెంట్లనునియమించడానికై ఒక 'శిక్షణ' వంటిది ఇచ్చారు. అలా రేడియోలో కార్యక్రమాలను రూపొందించడానికి - రికార్డింగ్, డబ్బింగ్, వ్యాఖ్యానం వంటివి నేర్చే తొలి బ్యాచ్ లోనే, నాకు అవకాశం లభించింది! శాంతి స్వరూప్, శశిధర్, శోభాశంకర్, ఉమాపతివర్మ, శివరాం, హనుమంతరావు, గుడ్లవల్లేటి సుబ్బారావ్, సి.హెచ్.శాంత, బి.వెంకట్రావ్ ఆ తరువాత కృష్ణమూర్తి, జీడిగుంట నాగేశ్వర్రావ్, ఉష, కృష్ణారావ్, రఘుశ్రీ, ఉమాకాంత్ ఇలా చాలామంది కూడా బ్యాచ్‌లుగా పని నేర్చారు.

'యువవాణి' కార్యక్రమాలు మొదలయ్యాక, ఆ సంఖ్య ఇబ్బడి ముబ్బడి అయ్యింది! యువవాణి కని శిక్షణ ఇచ్చినా, ప్రధానంగా నేను ఆ రోజుల్లో - కుటుంబ సంక్షేమ శాఖ ఎక్స్‌టెన్షన్ ఆఫీసరుగా ఉన్న శ్రీమతి జి.వరలక్ష్మి గారి సెక్షన్ లో ఎక్కువ కాంట్రాక్ట్‌లు పొందుతుండేవాడిని. పధ్నాలుగు రోజులకు ఎనభై రూపాయలు చెల్లించేవారు. కోపల్లె శివరాం, ఉమాపతి వర్మ, నేను ఫ్యామిలీ ప్లానింగ్ సెక్షన్లో చాలాకాలం ముగ్గురమే రొటేషన్ లో పనిచేసేవాళ్ళం! కాంట్రాక్ట్ ఏ సెక్షన్‌లో ఉన్నా - అందరూ






అన్నీ చేస్తుండేవాళ్ళం! రికార్డింగులు, డబ్బింగులు, వాయిస్ ఓవర్లు, బయటకు వెళ్ళి కార్యక్రమాలు రికార్డ్ చేసుకొచ్చే ఓ.బీ కవరేజ్ లు ... ఇలా కార్యక్రమాల రూపకల్పనలో మాకు సాంకేతిక శిక్షణ కూడా అలవడింది! మా సృజనాత్మకతతో ఎన్ని రకాల కార్యక్రమాలను.... అధికారులిచ్చిన అవకాశాలతో చేసేవాళ్ళమో! 'యువవాణి' అంటే - 'ఎర్న్ వైల్ యూ లెర్న్' అన్న నినాదంతో, ఒక ప్రక్క చదువుకుంటూనే, మరో ప్రక్క ఈ చిరు ఆదాయవనరులతో హ్యాపీగా గడిచేది! ఒకరు కాంట్రాక్ట్ పూర్తయి చెక్ పుచ్చుకున్నారంటే అది అందరికీ వేడుకే! రేడియో కేంద్రం పక్కనే ఉండే 'జమ్ జమ్' ఇరానీ కేఫ్‌లో టీలు, బన్ మస్కాలూ, బషీర్ బాగ్ చౌరస్తాలోని మోహినీ రెస్టారెంట్ లో - అర్ధరాత్రి అల్పాహారాలూ ఒకటే సందడిగా ఉండేది!! రేడియో ఆకాశవాణి మున్ముందు ఒక మత్తులా ఆవహించేది! కాంట్రాక్ట్‌లో ఉన్నాలేకపోయినా - అక్కడే తిరుగుతూ ఉండేవాళ్ళం. మా మైత్రీ బంధాలు బలపడింది అక్కడే !ఇంగ్లీష్, ఉర్దూ, తెలుగు యువవాణి కార్యక్రమాలు విస్తరించి ఉండేవి. అలా యువవాణి పరిచయాలతో దంపతులైన వారూ ఉన్నారు. తెలుగు యువవాణిలో పనిచేసే భార్గవిని, ఇంగ్లీష్ యువవాణిలో పనిచేసే రఘురాం ప్రేమించి పెళ్ళాడి - ఆ తరువాత ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ ప్రధానన్యాయమూర్తుల హోదాకి ఎదిగాడు.

మేం క్యాజువల్ గా పని చేస్తున్న రోజుల్లోనే ప్రొడక్షన్ అసిస్టెంట్లుగా జి.జె రవివర్మ, సతీష్ పర్మినెంట్ ఉద్యోగులుగా జాయిన్ అయ్యారు. వారికి రికార్డింగులు, డబ్బింగులు తొలిశిక్షణ మా దగ్గరే! రవివర్మ గొప్ప డ్రామా వాయిస్‌తో అద్భుతంగా నాటకాల్లో వేశాడు. ప్రొడ్యూసర్ స్పోర్ట్స్ అనుకుంటా అయ్యి, ఆ తర్వాత బదిలీకావడంతో ఆకాశవాణి వదిలి, విదేశీ సువార్తా ఛానల్ కు దేనికో అధిపతిగా వెళ్ళిపోయాడు!

శ్రీ వేలూరి సహజానందగారితో బాటు శ్రీ కేశవపంతుల నరసింహ శాస్త్రి, జి.రఘురాం, బాలకృష్ణ అయ్యంగార్, టి.వి.ఆర్.కె.సుబ్బారావ్, రాజ్‌గోపాల్, ఎన్.వి.ఎస్.ప్రసాదరావు, అజర్ అఫ్సర్, రావూరి భరద్వాజ, దండమూడి మహీధర్, వింజమూరి సీతాదేవి, సునందినీ ఐప్, ధర్మజ్ఞాని, అరుణాచలం, తిరుమలశెట్టి శ్రీరాములు, మల్లాది నరసింహ శాస్త్రి, వట్టం సత్యనారాయణ, రతన్ ప్రసాద్, నండూరి విఠల్, శారదా శ్రీనివాసన్, ఎం.జి. శ్యామలాదేవి, భువనేశ్వరి, ఇందిరాదేవి, ఇందిరా బెనర్జీ, జలసూత్రం సీతాదేవి, నిర్మలా వసంత్, జ్యోత్స్న, ఇలియాస్, జ్యోత్స్నా దేవి, డి.వెంకట్రామయ్య, వెంపటి రాధాకృష్ణ, మట్టపల్లి రావు, ఉమాపతి బాలాంజనేయ శర్మ, వారణాసి రామమూర్తి రేణు, దయావంతి, కె.చిరంజీవి, పాలగుమ్మి విశ్వనాధం, చిత్తరంజన్, గోవర్ధన్, ఎం.ఎస్.రావు, తురగా జానకీరాణి, మధుసూధన్ రావ్, నరసింహాచార్యులు, వేదగిరి శర్మ, ఇ.యల్.నారాయణ, చల్లా ప్రసాదరావు, ప్రయాగ వేదవతి, వై.

రాఘువులు, బి.జి.ఎస్.రావు, జీడిగుంట రామచంద్రమూర్తి, వసీం అక్తర్, రాణి, పి.యస్.ఆర్.ఆంజనేయశాస్త్రి, సురమౌళి, వాడ్రేవు పురుషోత్తం, మంచాళ జగన్నాధరావు ఓహ్! ఎన్ని పేర్లని చెప్పను... నేను 1978 లో ట్రాన్స్‌మిషన్ ఎగ్జిక్యూటివ్‌గా ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం వివిధభారతిలో చేరకుముందు, క్యాజువల్ గా ఏప్రిల్ 1971 నుండి ఆగస్ట్ 1975 వరకూ ఓ ప్రక్క చదువుకుంటూనే, పత్రికల్లో కవితలూ, కార్టూన్లు వేస్తూనే, పుస్తకాలకు ముఖచిత్రాలు గీస్తూనే, రేడియోలోనూ పనిచేస్తూ ఎందరితోనో పరిచయాలు పొందడం జరిగింది. రేడియో కార్యక్రమాల్లో పాలుపాల్గొనడం జరిగింది. కాంట్రాక్ట్‌లో ఉన్నప్పుడు మా గళంగానీ, కలంకానీ ఎవరయినా వినియోగించుకోవచ్చు కనుక, వారు అడిగిందే తడువుగా - ఉత్సాహంగా - నాటకాల్లో వేయడం, వాఖ్యానాలు చెప్పడం, స్క్రిప్ట్‌లు రాసిపెట్టడం, కవితలు వినిపించడం చేస్తుండేవాళ్ళం. ఆ రోజుల్లోనే - దాశరధి, ప్రముఖ హాస్య కథారచయిత మునిమాణిక్యం నరసింహారావు, ప్రముఖ హిందీ తెలుగు సాహితీ వేత్త శ్రీ వేమూరి ఆంజనేయ శాస్త్రిగార్లను 'యువవాణి'లో పరిచయం చేసే అవకాశం నాకు ఇంటర్వ్యూ ప్రోగ్రాములతో కలిగింది. 1975 లో కరీం నగర్ లో బిషప్ సాలమన్ జూనియర్ కళాశాల లెక్చరర్ గా వెళ్ళేంతవరకూ ఈ క్యాజువల్ కాంట్రాక్ట్‌లు చేస్తూనే వచ్చాను అవకాశం దొరికినప్పుడల్లా...



## 7

1971 నుండి 1975 సగం వరకూ ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో క్యాజువల్ ప్రొడక్షన్ అసిస్టెంట్‌గా చేసిన రోజులు నిజంగా మరుపురానివి. అదొక ఊపు! యువకునిగా ఒక ఉత్సాహం. ఉరకలు వేసే సంరంభం! మిత్రబృందం అంతా అలాగే ఉండేవారం. ఎన్నో పరిచయాలు! యువమిత్రుల కోలాహలం. పెద్దవారి ఆదరణ. నిజంగా రేడియో ఒక ‘మత్తు‘లానే ఆవహించింది. చదువులు పూర్తయినా, ఎందరో వేరే ఉద్యోగాల కోసం ప్రయత్నాలు కూడా చేయకుండా, ఎప్పటికైనా రేడియోలోనే పర్మనెంట్ కాకపోతామా అని పనిచేసేవారుండేవారు. కాంట్రాక్టులో లేకపోయినా రేడియో స్టేషన్ లోనే కాలం గడిపేస్తుండేవారు. వేరే వ్యాసంగం అంటే పత్రికారచన, సాహిత్య సమావేశాలు వంటివి లేకపోతే నేనూ అలాగే వ్రేలాడే వాడినేమోగానీ, నాకు ఇతరత్రా వ్యాపకాలు, ఇంకా కాలేజీ చదువు సాగుతుండడంవల్ల నేను కాంట్రాక్ట్‌లో ఉన్నప్పుడు విధిగా వెళ్ళి కాంట్రాక్ట్ ఉన్నన్ని రోజులూ శ్రద్ధగా, ఉత్సాహంగా పనిచేసేవాడిని. లేకపోతే మటుకు – కొందరిలా రేడియో స్టేషన్‌నే పట్టుకుని వ్రేలాడక నా సాహిత్య వ్యాసంగం చూసుకునేవాడిని.



కథకు వేసిన బొమ్మ

‘యువభారతి‘ సంస్థకు సహ సమావేశకర్తగా, సహకార్యదర్శిగా, ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థి రచయితల సంఘం సహకార్యదర్శిగా, ఇవికాక నవ్య సాహితీ సమితి, తారకా ఆర్గనైజర్స్, వై.ఎం.సి.ఏ. వక్తృత్వ సాహిత్య సమితి, చైతన్య ఆర్గనైజర్స్ వంటి సంస్థల కార్యకలాపాల్లో పాల్గొనేవాడిని. ‘చుక్కాని‘ పక్షపత్రిక దాదాపు నేనేది రాసినా స్వీకరించేది! దాని సంపాదకులు కాశీనాథుని సుబ్రహ్మణ్యంగారు పత్రిక గెటప్, కూర్పు చూడమని ప్రోత్సహించేవారు. కోర్టు ప్రకటనలే ఆ పత్రికకు వచ్చే ఆదాయం. న్యూస్ ప్రింట్

కోటా ఉండేది కాబట్టి పెద్దగా అమ్మకాలు లేకపోయినా, కొద్దిపాటి చందాదారులతో సాగిపోయేది. చుక్కాని సుబ్రహ్మణ్యంగారు 'వాస్తు'లో గొప్ప ప్రావీణ్యం పొంది, తదనంతర కాలాన చాలా ఖ్యాతి గడించారు! దేశవిదేశాల్లో వాస్తు శాస్త్రజ్ఞునిగా రాణించారు. "దమ్మిడీ పారితోషికం లేకపోయినా ఆ రోజుల్లో మీరు మా పత్రికను ఎంతో ప్రోత్సహించారు" అని తదనంతరకాలాన కలిసినపుడు ఆయన అనేవారు కానీ, నిజానికి రాసినదల్లా అచ్చు వేసి మా 'అచ్చు' సరదా తీర్చింది ఎక్కువగా అదే! పోతుకూచి సాంబశివరావుగారు 'విశ్వ రచన' మాసపత్రిక అరవై డెబ్బై పేజీలతో వస్తుండేది. అందులోనే మొదటిసారి కథలకు బొమ్మలూ, ముఖచిత్రాలూ వేశాను. రేడియో పరిచయాలతో యువమిత్రులను చుక్కానిలో 'బంగారు పాళీలు' శీర్షికన పరిచయం చేస్తుండేవాడిని.





శ్రీమతి శారదా అశోక్‌వర్ధన్

ఆ రోజుల్లో 'కుటుంబ నియంత్రణ ప్రచారం' ఎక్కువగా ఉండేది. 'ఇద్దరు లేక ముగ్గురు చాలు' అనే నినాదంతో మొదలై, 'మేమిద్దరం మా కిద్దరు' దాకా వచ్చి, 'బాబు అయినా పాప అయినా ఎవరైనా ఒక్కటే' అని 'సింగిల్ ఛైల్డ్ నార్మ్' దాకా క్రమేపీ ఆ ప్రచారం మారుతూ రావడం తెలిసిన సంగతే! యువకుల్లోనే కుటుంబ సంక్షేమ స్ఫూర్తి కలిగించాలనేది ఒక 'మిషన్'గా ఉండేది. ఆకాశవాణి ఆహూతుల సమక్షంలో స్టేషన్ ప్రాంగణంలోనే స్టేజి, షామియానా వేసి కుటుంబ నియంత్రణ కవి సమ్మేళనం ఒకటి పెద్ద ఎత్తున చేసింది. శ్రీమతి శారదా అశోక్‌వర్ధన్ గారు అప్పుడు రేడియోలో కుటుంబ సంక్షేమ శాఖలో పనిచేస్తుండేవారు. ఆవిడ స్వయంగా కవయిత్రి, కథకురాలు. ఆవిడ ఆ కవిసమ్మేళన నిర్వహణకు ఎంతగానో శ్రమించారు. కుర్రవాళ్ళం చాలామంది అందులో పాల్గొన్నాం. శ్రీమతి శోభాశంకర్ (కుమారి.వై.శోభారాణి) ఓ మంచి కవితను వినిపించడం నాకు గుర్తుంది. తను తరువాత ఆంధ్రాబ్యాంక్‌లో ఆఫీసర్‌గా చేసింది. కార్టూనిస్ట్ శంకు (ఎస్.బి.శంకర కుమార్)ని వివాహమాడింది. దూరదర్శన్‌లో వార్తలు చదివిన వారిలో మొదటి బ్యాచ్‌లోనే శోభ ఉంది. శాంతిస్వరూప్, ఇరగవరపు సూర్యనారాయణ, యం.సి.వి శశిధర్, డి.చక్రపాణి, పాలంకి కల్యాణి వీరంతా ఆ కవి సమ్మేళనంలో పాల్గొన్నారని గుర్తు! 'చెల్లాయికో ఉత్తరం' అనే కవితతో నేనూ పాల్గొన్నాను. ఆ కవితకు మంచి రెస్పాన్స్ వచ్చింది. రేడియో కార్యక్రమాల పక్షపత్రిక 'వాణి'లో ఫోటో కూడా వేశాడు మాది. ఎడమ వైపు పైన పక్కకు తిరిగిన తలకాయ నాదే



అని ఆ ఫోటో చూసుకు ఆనందించాను. ఫీల్డ్ ఆఫీసర్ శారదా అశోక్ వర్ధన్ ఎంతో మెచ్చుకున్నారు కవితకు.

అప్పట్లో రేడియో కార్యక్రమాల్లో పాల్గొన్నవారికి ఫోటోలు తీసే సంప్రదాయం బానే ఉండేది. ఆ ఫోటోలు 'వాణి'లో వేస్తుండేవారు. ప్రసారం కాబోయే కార్యక్రమాల వివరాలు ముందుగా తేదీ, సమయం, వివరాలతో సహా ప్రచురించి తూ.చా తప్పక అదే వేళకు ప్రసారం చేయడం జరిగేది (ఏ ఢిల్లీ కేంద్రం రిలేలో అడ్డం రాకపోతే) రేడియో స్టేషన్ లో ఫోటోలు తీయడానికి నాంపల్లి స్టేషన్ వెనక సందులో ఉండే 'ఫ్లోరా స్టూడియో' వాడు ఎక్కువగా వచ్చేవాడు. ఫోటోల సరదా ఉన్నవాళ్ళు తమకు ఫోటో ఏదయినా కార్యక్రమ రికార్డింగు సందర్భంగా తీయబడితే, కాపీ కోసం అక్కడికి వెళ్ళి డబ్బులిచ్చి తెచ్చుకునేవారు. ఫోటోలు సేకరించుకోవాలన్న పెద్ద ఆరాటం లేకపోవడంతో - నేనలా చాలా సేకరించుకోనేలేదు. మునిమాణిక్యం గారిని ఇంటర్వ్యూ చేసిందీ, అలాగే కొన్ని సీరియల్ నాటకాల్లో వేసినదీ ఫోటోలు సేకరించుకుని ఉంటే బావుండేదని తర్వాత తర్వాత అనిపించింది. ఐతే 'వాణి'కోసం పంపడానికి, రేడియో స్టేషన్ లో డిస్ప్లే బోర్డులో పెట్టడానికి ఒకటెండు కాపీలు వచ్చేవేమో! 'డిస్ప్లే' నుంచి తీసేసాక, మా మీద అభిమానంతో - కార్యక్రమ నిర్వహణాధికారులైన బాలకృష్ణగారో, రఘురాంగారో, టి.వి.ఆర్.కె. సుబ్బారావుగారో ఎప్పుడైనా ఓ ఫోటో కాపీ ఇస్తుండేవారు. లేదా 'వాణి'లో ప్రచురింపబడిన ఫోటో కత్తిరింపు దాచుకునేవాడిని. అదో సరదా!


ప్రయాగ వేదవతిగారితో సుధామ

ఆకాశవాణిలో 20 డిసెంబర్ 1970 లో 'యువవాణి' ప్రారంభమైందని చెప్పానుకదా. ఏటా డిసెంబర్ లో ఆ రోజు యువత అంతా కూడి వార్షికోత్సవ వేడుక చేసుకున్నాం కొన్నేళ్ళు! 'యువవాణి' విభాగానికి ప్రొడ్యూసర్ పోస్ట్ వచ్చినప్పుడు నేనూ అప్లయ్ చేశాను. "బాగా చేశావటగా ఇంటర్వ్యూ. నువ్వే వస్తావనుకుంటున్నారు" అని శ్రీమతి శారదా శ్రీనివాసన్ గారు నాతో అనడం గుర్తే. అప్పటికే అనౌన్సర్ గా చేరి డ్యూటీ ఆఫీసరయిన శ్రీ పాలకుర్తి మధుసూదనరావు, అప్పుడే రేడియోలో కొత్తగా ప్రొడక్షన్ అసిస్టెంట్‌గా చేరిన రవివర్మ, శ్రీ ప్రయాగ వేదవతి, నేను ఆ పోస్ట్‌కి రికమెండ్ అయిన ప్యానెలట! రేడియోలో వినోదాల వీరయ్యగా ప్రసిద్ధులైన ప్రయాగ నరసింహశాస్త్రిగారు దివంగతులయ్యారు. అందువల్ల అని కాదుగానీ, మొత్తానికి ఆ పోస్ట్ ప్రయాగ వేదవతికి వచ్చింది. ఆ పోస్ట్ కూడా మొదటి మూడేళ్ళ కాంట్రాక్ట్ జాబే. వేదవతి అందుకే తర్వాత యు.పి.ఎస్.సి నుండి ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్‌గా సెలక్ట్ అయి మెయిన్ స్ట్రీమ్ లోకి వచ్చారు.

వేదవతి - అప్పటికి ఆమె కుమారియే! ప్రయాగ వేదవతి కాదు, 'వేగవతి' అన్నంత ఉత్సాహంగా పనిచేసేవారు. రాత్రింబగళ్ళు కష్టపడి తెలుగు యువవాణిని తీర్చిదిద్దింది తాను. ఎందరెందరో యువతీయువకులను ప్రోత్సహించింది. వైవిధ్య భరితమైన కార్యక్రమాలను రూపొందించింది. అంతకుముందు బాలకృష్ణ, టి.వి.ఆర్.కె సుబ్బారావ్ వంటివారలు యువవాణిని చూసారు. ఇంకా మరికొందరు ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్‌లూ చూసారు. వేదవతి యువవాణి ప్రొడ్యూసర్‌గా ఉండగా అనేక కొత్తకార్యక్రమాలు రూపొందించింది. అందరినీ 'అన్నగారు' 'అన్నగారు' అని పిలవడం నాడు తనకు అలవాటు. అప్పుడు అసిస్టెంటు స్టేషన్ డైరెక్టర్‌గా ఉండి, తర్వత డైరెక్టరయిన శ్రీనివాస్ గారు 'అందరినీ అలా పిలిచేట్లయితే నీకెలా పెళ్ళవుతుందమ్మాయ్" అని నవ్వుతూ కోప్పడేవారు. కానీ ఎంతో శ్రద్ధ తీసుకుని సహకరించి ప్రోత్సహించేవారు. వేదవతి కుమారస్వామిగారిని వివాహమాడి డైరెక్టర్ స్థాయికి ఎదిగి, విశాఖపట్నం ఆకాశవాణి డైరెక్టర్ గా

ఉండగా గత ఏడాదే స్వచ్ఛంద విరమణ చేసారు. శాంతి స్వరూప్ న్యూస్ యూనిట్ లోనూ, కృష్ణమూర్తి తెలుగు శాఖలోనూ, కోపల్లె శివరాం, నేనూ, ఉమాపతి వర్మ కుటుంబ సంక్షేమ విభాగంలోనూ ఎక్కువ 'కాంట్రాక్ట్'లు చేశాం!

కోపల్లె శివరాం మంచి స్ఫురద్రూపి, ఎర్రగా, ట్రిమ్‌గా ఉండేవాడు. పాటలు బాగా రాసేవాడు. సిగరెట్టు అలవాటుండేది. సిగరెట్టు ప్యాకెట్టులోని ముచ్చిరేకు వెనుక తెల్లటి భాగంలో - స్ఫురించగానే పాట పల్లవి రాసేసేవాడు. అలాగే అదే కాగితంలా, తన భావాలు నమోదు చేసేందుకు అప్పటికప్పుడు వాడేసేవాడు. 'రోడ్డు దాటాలన్నా ఆటో పిలుస్తాడు' అన్నంత దర్జాగా ఉండేవాడు. తానేమీ సంపన్నుడు కాడు. 1969 లో ఆకాశవాణికి - కుటుంబ నియంత్రణ గురించి రెండుపాటలు రాయడంతోనే పరిచయమయ్యాడు. అది మొదలు ఎన్ని పాటలు రాసాడో! 'త్రిపథ', 'అవంతిక' వంటి సంగీతరూపకాలు, ఇది చల్లని తల్లిరా, ప్రణయానికి చల్లదనం (గజల్) మొదలైనవి చిత్తరంజన్ సంగీత పరచినవి ఉన్నాయి. 1962 లోనే 'రత్నగర్భ' అనే దినపత్రిక ఏలూరులో నడిపాడు. చక్కని చిత్రకారుడు కూడా. 1965 -66 ప్రాంతంలో 'జ్యోతి' మంత్లీలో ఆర్టికల్స్‌కు బొమ్మలు వేశాడు. డిఫెన్స్‌లో కొంతకాలం చేసి ఆఫీసర్‌తో దెబ్బలాడి ఉద్యోగం వదిలేసాడని చెప్పేవారు. ఆ తరువాత సినిమాలకు పాటలు రాసే స్థాయికి ఎదిగాడు. పెండ్యాల సంగీతం సమకూర్చగా 'గాలివాన' చిత్రంలో 'గలగలమని నవ్వకే సొగసు కరిగిపోతుంది', 'తరంమారింది' చిత్రంలో 'రాముడే దేవుడైతే' అనే పాట (సంగీతం జి.కె.వెంకటేష్), 'ఇంటింటి రామాయణం' చిత్రంలో 'ఈ తరుణము వలపే శరణము' వంటి పాటలు ప్రాచుర్యం తెచ్చాయి. ఉషాకిరణ్ మూవీస్ వారికీ, డైరెక్టర్ హనుమాన్ ప్రసాద్ చిత్రాలకూ పాటలు రాశాడు. మనిషి అందగాడు క్రిందే జమ కాబట్టి సహజంగానే అమ్మాయిలు ఆకర్షితులయ్యేవారు. చలనచిత్రాలలో అవకాశాలతో బాటు మధుసేవనం కూడా వచ్చిందేమో! ఎప్పుడూ నవ్వుతూ, హుషారుగా తెల్లటి బట్టల్లో మెరిసిపోతూ కనబడేవాడు. 1975 లో నేను కరీంనగర్ లెక్చరర్ ఉద్యోగానికి వెళ్ళిపోయాక, మళ్ళీ 1978 లో ఉద్యోగిగా ఆకాశవాణిలో నేను చేరేటప్పటికే శివరాం ఎంతో ఎత్తుకు ఎదిగాడు! వాళ్ళావిడ టీచర్‌గా పనిచేసేది. తాను ఒక పర్మనెంట్ ఉద్యోగం లేక చాన్నాళ్ళు బేఫికర్‌గా తిరిగినా, చివరకు ఆంధ్రప్రదేశ్ ఓపెన్ యూనివర్సిటీలో ఉద్యోగి అయ్యాడు. నిజంగా గొప్ప సృజనశీలి. మంచి పాటల రచయిత.



కోపల్లె శివరాం

క్యాజువల్స్‌గా ఒకే సెక్షన్‌లో రొటేషన్ పద్ధతిగా పనిచేశామని చెప్పానుగా శివరాం, ఉమాపతి వర్మ, నేనూ. 1986 లో నెల సరిగా గుర్తులేదు... ఓ ఆదివారం ఉమాపతి వర్మ ఫోన్ చేశాడు.. "నేను ఇక్కడ నిజాం హాస్పిటల్‌లో ఉన్నాను. శివరాం మరణించాడు. నువ్వు అర్జంటుగారా! నేను మిగతా పనులు చూస్తా"నని. డ్యూటీ ఆఫీసర్‌గా చేస్తున్న నేనప్పుడే నా షిఫ్ట్ ముగించుకోవడంతో వెంటనే వెళ్ళాను. వర్మ వాళ్ళ వాళ్ళకు చెప్పడానికి వెళ్ళాడు. ఎక్కువసేపు గదిలో ఉంచడానికి వీల్లేదని హాస్పటల్ వాళ్ళు అనడంతో, కాగితాల మీద సంతకం చేసి అతని బాడీని నేను స్ట్రెచర్ మీద క్రిందకు తెచ్చాను. వర్మ అంబులెన్స్ తెచ్చాడు. సన్నటి చినుకు కురుస్తుండగా బాడీని వాళ్ళింటికి తరలించాం..

మిత్రుడు కోపల్లె శివరాం పోయాడంటే ఇప్పటికీ నమ్మబుద్ధికాదు. ఛాతీలో నొప్పి అనిపిస్తే స్వయంగా హాస్పటల్‌కు వెళ్ళి జాయినయ్యాడంట. అతని ముఖం మీద చిరునవ్వును మృత్యువు కూడా మాయం చేయలేకపోయింది. శివరాం పోయి కూడా పాతికేళ్ళవుతోంది. పోయేటప్పటికి తనకు నలభై నాలుగేళ్ళే ఇప్పటికీ 'గాలివాన', 'ఇంటింటిరామాయణం' వంటి సినిమాల్లో పాటలు

శివరాం రాసినవి అప్పుడప్పుడు వినబడుతుంటాయి. ఎన్ని లలితగీతాలు రాసాడో!! శివరాం పాటలన్నీ ఓ పుస్తకంగా తేవాలని మిత్రుడు కలగ కృష్ణమోహన్ (ఆ రోజుల్లో శివరాంకు కుడిభుజమంత సన్నిహితుడు) ప్రయత్నించాడు కానీ, సాధ్యపడినట్లులేదు.

ఆకాశవాణిలో ఉద్యోగం రాలేదన్న కారణంగా కూడా రైలుపట్టాల క్రింద పడి మరణించిన కిషన్‌రావ్ అనే క్యాజువల్ కూడా అప్పుడప్పుడు గుర్తొస్తుంటాడు. జ్ఞాపకాలంటేనే తీపిచేదుల సమ్మిశ్రణం కదా!



# 8

1982 దాకా భారతదేశంలో పూర్తి స్థాయిలో టెలివిజన్ ప్రసారాలు మొదలవలేదు. అంచేత అప్పుడు ఆకాశవాణిదే వైభోగం! ప్రజాజీవనంలో నిత్యం పెనవేసుకుపోయిన సాధనం - ఆకాశవాణి. ఆ రోజుల్లో ఆకాశవాణి స్టూడియోకి వెళ్ళడం అనేది కూడా ఓ గొప్ప ఘనత! గేటుదాటి లోనికి వెళ్ళగలిగినవాడు పొంగిపోయేవాడు! రేడియో స్టేషన్ చూడటానికి కూడా జనం అనుమతి తీసుకుని వస్తుండేవారు.

దేశ ప్రజలనుద్దేశించి ప్రధాని అయినా, రాష్ట్రపతి అయినా ప్రసంగించాలంటే - వారే ఢిల్లీలోని ఆకాశవాణి కేంద్రానికి వెళ్ళేవారు. అలాగే రాష్ట్రాలలో గవర్నర్‌లు కానీ, ముఖ్యమంత్రులు కానీ సందేశం ఇవ్వాలంటే - రేడియో కేంద్రానికి వచ్చి రికార్డింగులో పాల్గొనేవారు. వారు అలా తరలిరావడం అప్పట్లో ఆనవాయితీగా సాగేది. వారు బహిరంగ సభలలో ప్రసంగించితే మాత్రం ఆకాశవాణి బృందమే అక్కడకు వెళ్ళి, రికార్డ్ చేసుకువచ్చి, ఆ కార్యక్రమం పై రేడియో నివేదిక ప్రసారం చేస్తూండడం జరిగేది. మహాత్మా గాంధీ గారు స్వయంగా ఆకాశవాణి కేంద్రంలో ప్రసంగించిన మొదటి, ఆఖరి సందర్భం ఒకే ఒక్కటి!... 1947 నవంబర్‌12న పాకిస్థాన్ నుండి వచ్చిన శరణార్థులను ఉద్దేశించి రేడియోలో ప్రసంగించారు. కురుక్షేత్ర కేంద్రంగా ఆయన చేసిన ఆ ప్రసంగం గుర్తుగా నేటికీ - ఆకాశవాణి ఆరోజుని పబ్లిక్ సర్వీస్ బ్రాడ్ కాస్టింగ్‌డే గా జరుపుకుంటోంది. ఆకాశవాణి కేంద్రాన్ని మహాత్మాగాంధీ సందర్శించిన సందర్భం అదొక్కటే!

ఇప్పుడు రోజులు మారిపోయాయి. చాలా ఏళ్ళ క్రితమే ఆ ప్రముఖులు ఆకాశవాణి కేంద్రానికి వచ్చి ప్రసంగించడం బదులు, రేడియో బృందమే స్వయంగా వారి కార్యాలయానికో, గృహానికో వెళ్ళి రికార్డింగు చేసుకు వచ్చి ప్రసారం చేయడం మొదలైంది.

ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం స్టూడియోకి గవర్నర్లూ, ముఖ్యమంత్రులూ వచ్చి ప్రసంగించడం నాకు గుర్తుంది. 1983లో తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడినప్పుడు కూడా - నాటి ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావ్ హైదరాబాద్ స్టూడియోకి వచ్చి, తమ సందేశాన్ని రికార్డు చేయడం, సినిమాల్లోలాగా టేక్‌లు, కట్స్‌లు.. ఫలానా పేరా చదివిన వాటిలో ఫలానా కట్ 'ఓకే' అంటూ -

సమయం తీసుకోవడం కూడా గుర్తే! నాకు తెలిసి ఒక సందర్భంలో ఆయన రేడియోలో ఏదో ప్రసంగిస్తానంటే, ప్రత్యేక సందర్భాలలో కాక అలా ముఖ్యమంత్రి కోరినప్పుడు రాష్ట్ర ప్రజల నుద్దేశించి రేడియో ప్రసంగం చేయవచ్చునా, అనే అనుమానంతో నాటి డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నాయన ఆయనతో కుదరదని చెప్పి, ఆ తరువాత నిర్ధారణ కోసం ఢిల్లీ డైరెక్టరేట్‌కు రాసారు. విషయం ఇందిరాగాంధీ దాకా వెళ్ళింది. బహుశా అప్పుడే - ముఖ్యమంత్రి తన రాష్ట్రంలో, అవసరమైనట్టైతే ఎప్పుడైనా రేడియోలో ప్రసంగించడానికి వీలుకల్పిస్తూ, నియమాన్ని ఏర్పరిచారు. అది అవకాశంగా తీసుకుని - ఎన్.టి.రామారావు తాను స్టూడియోకి రాకుండా, తనవద్దకే ఏ సందర్భంలోనైనా, ఆకాశవాణి వారిని పిలిపించుకుని తన ప్రసంగం రికార్డు చేసుకునే విధానం మొదలుపెట్టారు. నిజానికి స్టూడియోలో రికార్డింగు చేసినప్పుడు వచ్చే ప్రసారం వేళ 'క్వాలిటీ'కి, వారి వద్దకు వెళ్ళి రికార్డు ముందుగా చేసి ప్రసారం చేయడానికి బోలేడు తేడా ఉంది.


రంగనాయకమ్మ గారి 'స్వీట్ హోం' సీరియల్ నాటకంలో

అప్పట్లో ఆకాశవాణి కేంద్రప్రభుత్వం నిర్వహణలోనిది కనుక - రాష్ట్ర ప్రభుత్వం నేరుగా జోక్యం చేసుకునే వీలుండేదికాదు. రాష్ట్ర మంత్రులైనా తమ పెత్తనం ఏమీచూపే వీలుండేది కాదు సరికదా, ఆకాశవాణి ప్రసంగ ప్రసారానికి ఆహ్వానిస్తూంటే దాన్ని కేంద్ర ప్రభుత్వ ఆదేశమన్నట్లుగా సంభావించి ప్రసారం రికార్డింగుకు తరలివచ్చేవారు. కుదరకపోతే సంజాయిషీ కూడా ఇచ్చుకున్న సందర్భాలున్నాయి.

రాష్ట్ర మంత్రులు తమ తమ శాఖల గురించి అసెంబ్లీలో లేవనెత్తే ప్రశ్నలకు సమాధానాలు చెప్పడం వేరు, ప్రజల ముందుకు వచ్చి వారిముందు సమాధానాలు చెప్పడం వేరు. రెండోది ఎప్పుడోగానీ సాధ్యమయ్యే సంగతి కానేకాదు. కానీ దానిని ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం 1970 దశకంలోనే సాధ్యం చేసి చూపించింది! ఆ రోజుల్లో పంచవర్ష ప్రణాళికా కార్యక్రమాలను, తెలుగు విభాగాన్ని ఆకాశవాణిలో చూస్తుండే వేలూరి సహజానందగారే - రేడియో ప్రాంగణంలోనే టెంట్ వేసి, వేదికకల్పించి, పలుశాఖల మంత్రులను రావించి, ఆహూతుల సమక్షంలో, ప్రజల ప్రతినిధులుకు పృచ్ఛకులు నేరుగా ప్రశ్నవేయగా, వారు సమాధానం చెప్పే కార్యక్రమాన్ని ఒకటి నిర్వహించారు. దాని పేరు "మంత్రుల సదస్సు" నాడు విద్యాశాఖా మంత్రిగా ఉన్న శ్రీ మండలి వెంకటకృష్ణారావుగారూ, అలాగే భాట్టం శ్రీరామ మూర్తి గారూ, కళావెంకటరావుగారు మొదలైన (అందరి పేర్లూ అస్సలు గుర్తులేవుగానీ, చాలామంది మంత్రులు) ఆ సదస్సులో పాల్గొని ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. అప్పట్లో అదొక సంచలన ప్రోగ్రాం!




అప్పుడు నేను ప్రాచ్య కళాశాలలో ఎం.ఓ.యల్ చదువుతున్నాను. విశ్వవిద్యాలయంలోని ఎం.ఏ తెలుగుతో సమానంగా ఎం ఓ.యల్ గుర్తింపబడడానికి ప్రాచ్యకళాశాల విద్యార్థులం చాలా ఆందోళనలే చేపట్టాల్సివచ్చింది. నిజానికి 'ఎం.ఏ' కన్నా, 'ఎం.ఓ.యల్' స్టాండర్డ్ ఎక్కువ! వ్యాకరణం, సంస్కృతం, ప్రాచీన కావ్య పరిచయం, భాషా పటుత్వం నాడు ప్రాచ్య కళాశాల విద్యార్థులకు ఎక్కువగానే ఉండేది. అప్పట్లో 'ఎం.ఏ' కన్నా, 'ఎం.ఓ.యల్' స్టాండర్డ్ ఎక్కువ! వ్యాకరణం, సంస్కృతం, ప్రాచీన కావ్య పరిచయం, భాషా పటుత్వం నాడు ప్రాచ్య కళాశాల విద్యార్థులకు ఎక్కువగానే ఉండేది. కానీ కారణం ఏదయినా - అప్పట్లో 'ఎం.ఏ' అంటే ఉండే

గౌరవం 'ఎం. ఓ .యల్ కు' ఉండేది కాదు. 'ఎం.ఏతో' సమానంగా 'ఎం.ఓ.యల్‌ను' గుర్తించడం గురించి 'మంత్రుల సదస్సు'లో నాటి విద్యాశాఖామాత్యులు మండలివారిని నేను ప్రశ్నించడం, ఆయన దానికి 'తప్పక పరిశీలిస్తామని' సానుకూల సమాధానం ఇవ్వడం జరిగింది. అది జరిగిన కొద్దికాలానికే - నిజంగానే 'ఎం.ఏ'తో సరిసమానంగా 'ఏం.ఓ.యల్' గుర్తింపబడి, ఉద్యోగాది అవకాశాలకు ఎం.ఓ.యల్ విద్యార్థులనూ పరిగణనలోనికి తీసుకుని రాసాగారు! అలా ఆ సందర్భంగా 'మంత్రుల సదస్సు' ఫోటోలో వేదికమీద నేను ప్రశ్నిస్తూ ఉండగా తీసిన ఫోటోలో - కుడివైపు క్రిందవేదిక మీద కూర్చుని మండలివారు, భాట్టం వారు ముఖాలు కనబడుతుంటాయి. 'మంత్రుల సదస్సు'లో వివిధ ప్రజాసమస్యల మీద, ఆయా రంగాలకు చెందిన మంత్రులు అప్పటికప్పుడు సమాధానాలిచ్చారు! అదొక మరుపురాని చారిత్రాత్మక కార్యక్రమం.



యువమిత్రుల బృందం

వేలూరి సహజానందగారు ఏ కార్యక్రమం చేసినా ప్రత్యేక శ్రద్ధ వహించేవారు. ఆ రోజుల్లో ఏటా రిపబ్లిక్‌డేకు జరిగే జాతీయకవి సమ్మేళనం తెలుగు అనువాదాల కార్యక్రమం ఆయనే చూసేవారనీ, నాకు ఓ ఏడాది ఒరియా కవితానువాదానికి అవకాశం కల్పించారనీ ముందే చెప్పానుకదా! నేను తెలుగులోకి 'ఒక్కనూరేళ్ళతరువాత' అని అనువాదం చేసిన ఆ కవిత - రికార్డింగ్ సమయంలో 'శైశవము' అన్నపదం నా చేత నాడు స్పష్టంగా ఉచ్చరింపబడేలాగా చేయడానికి ఆయన తీసుకున్న శ్రద్ధ, నా గొంతు చేతితో నొక్కి, ఆ పదంలోని రెండవ 'శ' స్పష్టంగా అనిపించడానికి, ఓర్పుగా పడిన శ్రమ నేటికీ నా కళ్ళముందు సాక్షాత్కరిస్తున్నాయి. నాడు ఆయన నేర్పిన సంవిధానం నాకెన్నటికీ మరుపురాని మధురానుభూతి! 'రసమంజరి'లో, నా చేత పలుకవితలు రాయించి ప్రసారం చేసారు. అలాగే పోతుకూచి సాంబశివరావుగారూ, కుందుర్తిగారూ రాసిన వచనకవితా నాటికల్లో నాకూ అవకాశం కల్పించారు ఆయన. అలా 'క్యాజువల్'గా పనిచేసే రోజుల 'రేడియో శిక్షణే' శబ్దమాధ్యమంలో రాణింపుకు నాంది అయింది అన్నది నిజం.

అనౌన్సర్ పోస్టుకు ఒకటి రెండుసార్లు ప్రకటన వచ్చినా, నేను అప్లయ్ చేయలేదు. దానికి కారణం ఒకటుంది. ప్రాచ్యకళాశాలలో 'బి.ఓ.యల్' డిగ్రీ చేసి, ఇంగ్లీష్ పేపర్ విడిగా ప్రత్యేకించి రాసి, 'బి.ఏ' డిగ్రీ కూడా పుచ్చుకుని, బి.ఏ. బి.ఓ యల్ అవగానే ఎంప్లాయ్ మెంట్ లో రిజిస్టర్ చేయించా. ఆ రోజుల్లో ఎంప్లాయిమెంట్ ఎక్చేంజ్ ద్వారానే ప్రభుత్వోద్యోగాలకు అవకాశాలు లభించేవి. వాళ్ళు పంపిన ఇంటర్వ్యూ కాల్ లెటర్స్ ననుసరించి, వ్రాతపరీక్షలు మౌఖిక పరీక్షలు ఎవరు పెట్టినా హాజరై, ఉద్యోగయత్నాలు చేసుకోవలసి వచ్చేది! అప్పట్లోనే శ్రీశైలం ఈగల పెంట జూనియర్ కాలేజీలో లెక్చరర్ పోస్టుకు నాకు పిలుపు వచ్చింది. నగరజీవితం, రేడియో చిరుద్యోగం బాగా ఎంజాయ్ చేస్తూ, 'ఎం.ఓ.యల్' చదువుతున్న నేను - బి.ఓ.యల్ కే జూనియర్ లెక్చరర్ ఆఫర్ రాగా, నేను పోస్టు గ్రాడ్యుయేషన్ 'ఎం.ఓ.యల్', 'ఎం.ఫిల్' గట్రా చదివితే - ఏ డిగ్రీకాలేజీలోనో, యూనివర్సిటీలోనో గొప్ప ఉద్యోగం వచ్చేస్తుందనుకున్నాను.

పోస్టుగ్రాడ్యుయేషన్ పూర్తిచేసి తీరాలనీ అప్పుడే జాబ్ గురించి ఆలోచించాలనీ అనుకున్నాను. ఇంట్లో వాళ్ళు కూడా దానినే ప్రోత్సహించారు.

మా నాన్నగారికి రేడియోలో నేను క్యాజువల్ గా నిజంగా పనిచేస్తున్నానా లేక, ఊరికే ఇల్లొదిలి బలాదూర్ తిరుగుతున్నానా అని ఓసారి అనుమానం వచ్చింది కాబోలు. ఆకాశవాణి కేంద్రానికి చూసి రమ్మని మా తమ్ముడు 'దయాల్ దాస్'ని పంపించారు. వాడు వాడి ఫ్రెండ్స్‌తో స్టూడియో చూసే మిషతో వచ్చాడు. "ఫలానా రోజు రాత్రి ఫలానా టైముకి రేడియోలో నా గొంతు వస్తుంది. నాన్నగారిని వినమను" అని చెప్పాను నేను. నా చదువు సంధ్యలకు రేడియో కార్యక్రమాలు కూడా అవరోధాలు కారాదన్నదే మా నాన్నగారి తపన! నిజానికి మా అన్నయ్య రాధాకుమార్ అప్పటికే బి,కాం పూర్తిచేసి చిరుద్యోగం ఏదో చేస్తూండేవాడు. తను నాకన్నా ముందే రేడియో ప్రోగ్రాంలు కొన్ని ఇచ్చాడు కూడాను 'రాధాయి' కలం పేరుతో రాసేవాడు. ఆ తరువాత 'సిండికేట్ బ్యాంక్' ఉద్యోగిగా, నిజామాబాద్ జిల్లా బోధన్ లో పనిచేసి ఆపై హైదరాబాద్ లోనే చాన్నాళ్ళు పనిచేసి, ట్రాన్స్‌ఫర్లూ అదీ గిట్టక, బ్యాంక్ పరీక్షలూ, ఆఫీసర్ పోస్టులూ అని వెంపర్లాడక, మొజుంజాహి మార్కెట్, చార్మినార్ వంటి బ్రాంచిల్లో పనిచేసి, అయిదారేళ్ళుండగానే, స్వచ్ఛంద పదవీ విరమణ చేసాడు. బ్యాంకులు ఆనాడు ఆఫర్ చేసిన 'గోల్డెన్ షేక్ హ్యాండ్' తనకు ఉపకరించింది. ఆ తరువాత షేర్ల సరదా, ఆధ్యాత్మిక సత్సంగ సేవ తనది!

రేడియోలో క్యాజువల్ గా పనిచేసే యువతీయువకులమంతా - డిసెంబర్ లో ఏటా యువవాణి దినోత్సవంగా కలిసేవారం అని చెప్పానుకదా. ఓ ఏడాది ద్వారకా హోటల్లో అలా అందరం కలిసి వేడుక చేసుకున్నాం. ఆ తరువాత మళ్ళీ ఎందుకో అలాంటి సమావేశాలు జరుగలేదు. రేడియోలో అప్పటికే అనౌన్సర్‌గా పనిచేస్తున్న ఆకెళ్ళ సత్యనారాయణమూర్తి, వాళ్ళావిడ అనౌన్సర్ శ్రీమతి సీతాదేవి, అలాగే తురగా జానకీరాణిగారు, మా యువ బృందంతో బాగా కలిసిపోయే వారు కనుక, వారిని కూడా మా వేడుక విందులో కలుపుకునే వారం! యువబృందం, యువతుల బృందం ఆ సందర్భంగా విడివిడిగా ఫోటోలు దిగాం. యువకుల బృందంలో జి.రఘురాం, శాంతిస్వరూప్, కాశీనాధ్, వసంత భాను, కృష్ణమోహన్, అనంత్‌రాం, ఉమాపతి వర్మ, సుబ్బారావ్, బదరీనాథ్, శ్యాం, వై రామకృష్ణారావ్, శ్రీరామ్, త్రిపురనేని రాంగోపాల్ (గోపీచంద్ గారి అబ్బాయి), మంత్రవాది సుధాకర్, విశ్వేశ్వరరెడ్డి, కె.హనుమంతరావ్, సుబ్రహ్మణ్యం, సి.వి.ఎల్.నరసింహారావ్, ఈమని కృష్ణారావ్, కె.వి.కామేశ్వరరావ్, రమాసత్యనారాయణ, రామలింగయ్య, సుందరశాయి, పిల్లల మూర్తి ఇలా చాలామందిమి ఉన్నాం. వీళ్ళందరి గురించీ ముమ్ముందు సందర్భాలు వచ్చినప్పుడు వివరిస్తాను. నేడు వివిధ రంగాలలో ప్రసిద్ధులైనవారు వీరిలో ఉన్నారు మరి.


యువవాణి క్యాజువల్ యువకులతో

అలాగే యువతుల బృందంలో - అటు తురగా జానకీరాణి, ఇటు ఆకెళ్ళ సీతాదేవిలతో - ఫోటోలో భార్గవి, సి.మృణాళిని, సి.హెచ్.శాంత, పరిమళ, జొన్నలగడ్డ శకుంతల, కె.బి.లక్ష్మి, శాంతి, సంధ్యారాణి, గీత, తురగా ఉషారమణి, శోభ (జానకీరాణిగారి పిల్లలు) కానవస్తారు. మృణాళినీ, శకుంతల, కె.బి.లక్ష్మి, పరిమళ, ఉషారమణీ, శోభ వీరంతా ఇవాళ వారివారి రంగాలలో ఖ్యాతిగాంచారు. ఆ విశేషాలూ ముమ్ముందు కబుర్లలో చెబుతా! ఈ ఫోటోల్లో లేనివారూ, ఎందరో రేడియోలో నాడు పరిచయస్తులు కలిసి పనిచేసినవారూ ఉన్నారు. చెప్పానుగా, 1975 వరకూ ఈ క్యాజువల్ ఉద్యోగం - కాంట్రాక్ట్‌లతో ఆకాశవాణిలో సాగింది. అదే సమయంలో 'ఉపగ్రహ దూరదర్శన్ కేంద్ర ప్రసారాలు' హైదరాబాదులో మొదలయ్యాయి. గుల్బర్గాలో కన్నడం కార్యక్రమాల ప్రసారం, హైదరాబాద్ లో తెలుగు కార్యక్రమాల ప్రసారం. బేస్ ప్రొడక్షన్ సెంటర్‌గా ఇక్కడి నుండే రూపొంది జరుగుతుండేవి. ప్రొడక్షన్ అసిస్టెంట్‌గా - టెలివిజన్‌లోనూ, అలాగే నాటి టీవీ డాక్యుమెంటరీల తెలుగు వ్యాఖ్యాతగానూ కూడా క్యాజువల్‌గా పనిచేసాను. ఎం.ఓ.యల్ పూర్తి చేసి ఆ తరువాత ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ఎం.ఏ(తెలుగు)లో చేరి మొదటి సంవత్సరం పూర్తిచేయడంతోనే ఉద్యోగం వైపు దృష్టి మరలింది.

యువవాణి క్యాజువల్ యువతుల బృందం





## 9

**ఉస్మానియా విశ్వవిద్యాలయం** ఆర్ట్స్ కళాశాలలో ఎం.ఏ మొదటి సంవత్సరం చదువుతూండగానే, అప్పటికే ఎం.ఓ.యల్ పూర్తిచేసిన నాకు - 'ఎం.ఓ.యల్'ను 'ఎం.ఏ'తో సమానంగా అన్నింటా ప్రభుత్వం గుర్తించడంతో, ఉద్యోగం మీద గాలిమళ్ళింది! ప్రేమ వ్యవహారంతో జీవితంలో త్వరగా స్థిరపడాలన్న ఒక తాత్కాలికోద్వేగంకూడా దానికి కారణం కావచ్చు. ఆకాశవాణిలో ఉద్యోగం అన్న విషయం పెద్దగా ఊహకూ, ఆశకూ కూడా రాలేదు కానీ, అకడమిక్ రంగంలో ఉపన్యాసక వృత్తి మీద మాత్రం ఉబలాటం ఉండింది! కాలేజ్ సర్వీస్ కమీషన్ పరీక్షలంటూ అప్పటికింకా ఏమీ ప్రకటించకపోవడంతో, ఏదయినా ప్రైవేట్ కళాశాలలోనయినా చేరాలనే ఉద్దేశ్యం కలిగింది. కవిగా, కార్టూనిస్టుగా, రచయితగా సాహితీ రంగంలో ఒకింత గుర్తింపూ, ఆకాశవాణిలో క్యాజువల్‌గా చేసిన అనుభవం, ఉన్న పోస్టుగ్రాడ్యుయేషన్ డిగ్రీ నాకు ఉద్యోగం తెచ్చివ్వగలనన్న ధీమా కలిగింది. అంతే! ప్రయత్నాలు మొదలుపెట్టాను.

ఒక పేపర్ లో ప్రకటన ఆధారంగానే కరీంనగర్‌లో సి.ఎస్.ఐ హైస్కూలు వాళ్ళు కొత్తగా జూనియర్ కాలేజీని స్థాపించి, ఇంటర్మీడియట్ విద్యార్థుల బోధనకై అన్ని సబ్జెక్టుల్లోనూ 'లెక్చరర్ పోస్టులకు అభ్యర్థులను ఆహ్వానించడంతో - నేనూ దరఖాస్తు చేశాను. బహుశా 1975 మే నెలాఖరుకో, జూన్ మొదట్లోనే సరిగ్గా గుర్తులేదుగానీ, ఇంటర్వ్యూకి హాజరు కమ్మని లేఖ వచ్చింది! అంతకు ముందెప్పుడూ కరీంనగర్ వెళ్ళినవాడిని కాదు. "నగరంలోనే ఏదో ఉద్యోగం దొరుకుతుంది జిల్లాలకు పోవలసిన అవసరమేముంది" అని మాటల్లో ధ్వనింపచేసిన మా నాన్నగారు, ఇంటర్వ్యూకి వెళ్ళడం గురించి డబ్బులు అడిగితే, "చూద్దాంలే రేపుకదా" అని ఆఫీసుకు వెళ్ళిపోయారు. నాకు చిన్నపాటి ఉక్రోషం వచ్చింది.

కానీ ఆ మధ్యాహ్నమే పోస్ట్‌మ్యాన్ నా పేర వచ్చిన ఎం.ఓ తీసుకునివచ్చాడు. ఆంధ్రప్రదేశ్ మాసపత్రికలో నా కార్టూన్లకూ, సమీక్షకూ పారితోషికంగా 80 రూపాయల ఎం.ఓ వచ్చింది. ఇంకనేం! మరునాటికి కరీంనగర్‌కు బస్ టికెట్ కొనేసుకున్నాను. ఆ మరునాడే ఇంటర్వ్యూ. ఉదయమే బయలుదేరి కరీంనగర్ వెళ్ళాను. కరీంనగర్ బస్టాండ్‌కి దగ్గరలోనే ఉంది కాలేజి. ఆ కాలేజీ పేరు బిషప్

సొలమన్ కళాశాల. క్రిస్టియన్ ఆర్గనైజేషన్ వారిది. ప్రాంగణం, భవనం విశాలంగానే ఉన్నాయి. అన్ని సబ్జెక్టులకూ అదే రోజు ఇంటర్వ్యూలు కావడంతో, వచ్చిన అభ్యర్థులతో కిటకిటలాడుతున్నట్లే ఉంది! ఉదయం పదింటికి వెడితే - నన్ను ఇంటర్వ్యూ చేసేవేళకి సాయంత్రం మూడు దాటింది. ఇంటర్వ్యూ గదిలో దాదాపు పధ్నాలుగు మంది సభ్యులున్నారు. అందులో బిషప్, బర్సర్, ప్రిన్సిపాల్, ఆర్గనైజేషన్ కార్యవర్గీయులు కాక సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్స్ కూడాను!

నా సర్టిఫికెట్లు అవీ పరిశీలించి, మామూలు కుశల ప్రశ్నలతో, తెలుగులో ఒకటి రెండు వ్యాకరణాంశాలు అడిగారు. చెప్పాను. ఆ తరువాత ఏదయినా పద్యం చదివి వివరించమన్నారు. ఆంధ్రమహాభారతంలోని మొట్టమొదటి తెలుగుపద్యం (శ్రీవాణీ గిరిజాశ్చిరాయ అనే సంస్కృత శ్లోకం తరువాత వచ్చేది) "రాజకులైక భూషణుడు" రాగయుక్తంగా చదివి వినిపించాను. నా పద్యపఠనం వారికి నచ్చింది. అందులో ఒకాయన - మీరు పద్యం చదివిన పద్ధతి శ్రీ ఉత్పల సత్యనారాయణాచార్య గారి వలె ఉందన్నారు. నేను ఉత్పలవారి వలనే చదివాను. చదవడంలో ఓ శ్రావ్యత, స్పష్టతతోబాటు, అర్థావబోధకు ఆ వైఖరి బాగుంటుంది! ఉత్పలగారు పద్యపఠనంలో శ్రోతృ జనరంజకులు. "ఇదే పద్యం డా.సి.నారాయణరెడ్డిగారైతే ఎలా చదువుతారు" అని అడిగారు ఇంటర్వ్యూ చేసే వారిలో ఒకరు.

ఆ పద్యం డా.సి.నారాయణరెడ్డిగారు - ఆయన ఉద్యోగానికి ఇంటర్వ్యూకి వెళ్ళినప్పుడు భారతంలో మొట్టమొదటి తెలుగుపద్యం ఏది అని అడిగితే తాను చెప్పినట్లుగా మాకు ఎం.ఏ తరగతిలో చెప్పడం నాకు బాగా గుర్తు! సినారె గారిలాగా అదే పద్యం మళ్ళీ చదివి వినిపించాను. యూనివర్సిటీలో నారాయణరెడ్డిగారూ, దివాకర్ల వెంకటావధానిగారు, బి.రామరాజుగారు, నాయని కృష్ణకుమారిగారు, పల్లా దుర్గయ్యగారు, జి.వి సుబ్రహ్మణ్యంగారు, రవ్వా శ్రీహరిగారు మాకు పాఠం చెప్పగా, నేరుగా శిష్యులుగా విన్న అదృష్టం మాది.




"నారాయణరెడ్డిగారు.... అయితే మీకు బాగా తెలుసునన్నమాట! వార్షికోత్సవం అయితే ఆయనను తీరుకురాగలరా" అని అడిగారు ఒకరు. "ఆయన కరీంనగర్ జిల్లా హనుమాజీ పేట వాస్తవ్యులే కదండీ పుట్టుకతోనే" అన్నాను నేను. 1974 లో యువభారతి పక్షాన నేను, డా.నాగినేని భాస్కరరావు కలిసి ప్రచురించిన కవితా సంకలనం 'మేం' నల్ల అట్టపై మా చిత్రంతో ఎర్రటి అక్షరాలతో నా ఫైలులో కనిపించడం చూసి ఒకాయన - కమ్యూనిజం భావజాలం ఉన్నట్లుందితనికి" అని పక్క సభ్యులతో పేర్కొనడం గమనించాను. అంతటితో - "ఇంటర్వ్యూ పూర్తయింది. ఏ విషయమూ తెలియజేస్తాం. వెళ్ళవచ్చు" అన్నారు. తెలుగు లెక్చరర్ పోస్ట్‌కు నాలాగా ఇంటర్వ్యూకి వచ్చినవారు పన్నెండు మంది ఉన్నారనుకుంటా ఆ వేళ. క్రిస్టియన్ అభ్యర్థి ఎవరో ఆ పోస్ట్‌కు ఉన్నారనీ, ఆయననే ఎలాగూ ఎంపిక చేస్తారనీ, అనుకోవడమూ విన్నాను! "అది మనకొచ్చే ఉద్యోగం కాదులే" అనుకుని, ఆ సాయంత్రమే బయలుదేరి హైదరాబాద్ వచ్చేశాను.



BISHOP SOLOMON JUNIOR COLLEGE
KARIMNAGAR.

CHURCH OF SOUTH INDIA | DIOCESE OF DORNAKAL | CHURCH COMPOUND KARIMNAGAR ANDHRA PRADESH.

Letter No.......... Date..........

This is to Certify that Sri.A.Venkata Rao B.A. M.O.L is working as Junior lecturer in Telugu in this inistitution since August 1975.

Sri.Venkatarao is also actively developing literary & extra curricular interest among the students.

His present Salary is

| | |
|---|---|
| Basic - | Rs. 430-00 |
| D.A (37%) | Rs. 159-10 |
| HRA (7½%) | Rs. 32-25 |
| Total | 621-35 |

His Conduct is Satisfactory. We have no objection for his future programmes.

Principal. 27/1/77
Principal
Bishop Solomon Junior College
KARIMNAGAR-505001, A.P.

వారంరోజులకల్లా కరీంనగర్ నుండి టెలిగ్రాం వచ్చింది. "అప్పాయింటెడ్ జాయిన్ ఇమ్మీడియట్లీ" అని, ఆ ఆనందం చెప్పలేనిది!! మరునాడు బయలుదేరుదామనుకుంటూండగా - మళ్ళీ ఓ టెలిగ్రాం - "డోంట్ జాయిన్. వెయిట్ ఫర్ ఫర్దర్ ఆర్డర్స్" అని. బహుశా వాళ్ళ క్యాండిడేట్‌కే ఇద్దామనుకుంటున్నారేమో అనుకున్నాను. కానీ పెద్దగా ఏమీ క్రుంగిపోలేదు. ఆ తరువాత వారం పదిరోజుల కనుకుంటా "యూ హేవ్ సెలెక్టడ్ జాయిన్ ఇమ్మిడియట్లీ" అని మరో టెలిగ్రాం వచ్చింది. ఆగస్టు 8 వతేదీన అనుకుంటాను 1975 లో కరీంనగర్ బిషప్ సొలమన్ జూనియర్ కాలేజీలో తెలుగు లెక్చరర్ గా చేరాను. ప్రభుత్వ డిగ్రీ కళాశాల అయిన

ఎస్.ఆర్.ఆర్ డిగ్రీ కళాశాల ఉన్న ఏరియాలో ఒక ఉడిపి లాడ్జ్ ఉండేది. అందులో నెలసరి అద్దెకు రూములు లభిస్తాయని తెలిసింది. అద్దె రూముకు నెలకు నూట ఇరవై అని గుర్తు. టేబుల్, రెండు మంచాలున్న ఒక రూములో - సుబ్రహ్మణ్యం అని బాటనీకి ఎంపికయిన అతనూ, నేనూ కొన్నాళ్ళు కలిపి తీసుకున్నాం. ఆ తరువాత విడివిడిగా సింగిల్ రూమ్స్‌కు షిఫ్ట్ అయ్యాం! ఎనభై రూపాయలు కాబోలు ఇచ్చేవాళ్ళం! భోజనం ఖర్చులు వేరే - సూట్‌కేస్‌లో బట్టలు తెచ్చుకుంటే చాలు. వారం వారం హైదరాబాద్ వెళ్ళి వస్తూండేవాడిని మొదట్లో. ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్, సెకండియర్ సైన్సు, ఆర్ట్స్, కామర్స్ గ్రూప్ స్టూడెంట్లందరికీ కలిపి నేను కామన్ క్లాస్ తీసుకునేవాడిని. వందమంది ఫస్టియర్ స్టూడెంట్స్ ఉండేవారు మూడు గ్రూపులకీ కలిపి. సెకండ్ ఇయర్ లో కూడా అంతకు ముందే కాలేజీగా అప్‌గ్రేడ్ చేయడం వల్ల ఓ నలభైమంది ఉండేవారు.

నిజంగా అక్కడ పని చేసిన రెండేళ్ళూ చాలా హ్యాపీగా గడిచాయి! విద్యార్థులు అభిమానించేవారు. లెక్చరర్లు అంతా కుర్రబ్యాచే ఒక్క ప్రిన్సిపాల్ గారు తప్ప అంతా యువక బృందమే! నేను ఎగ్జామినేషన్ ఇన్‌ఛార్జిగా, లైబ్రెరీ ఇన్‌ఛార్జిగా కూడా ఉండేవాడిని. టైం టేబుల్ కూడా కొన్నాళ్ళు నేనే వేసేవాడిని. అందువల్ల శనివారం మధ్యాహ్నం క్లాసులేకుండా, ఉదయమే పిరియడ్స్ తీసుకుని కరీంనగర్‌లో బస్సెక్కి హైదరాబాద్ వచ్చేసేవాడిని. 1975 ఆగస్టు నుండి 1977 దసరాల ముందువరకూ ఆ కాలేజీలో పనిచేశాను. డిగ్రీ కళాశాల అధ్యాపకులూ, అప్పుడు కరీంనగర్ ఉమెన్స్ కాలేజీలో పనిచేస్తుండిన అంపశయ్య నవీన్, పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లోని ప్రముఖ కవి, సినీరచయిత వడ్డెపల్లి కృష్ణ, ప్రభుత్వ కార్యాలయంలో పనిచేసే నటుడు శ్రీ డి.ఎస్.ఎన్ మూర్తి వీరందరితో తరచుగా కలవడం జరుగుతుండేది. నవీన్, నేను దాదాపు వారం వారం కలిసేవాళ్ళం. ఎస్.ఆర్.ఆర్ కళాశాలకు కరీం నగర్ లో విశ్వనాథ సత్యనారాయణగారు పనిచేసిన కాలేజీగా కూడా, గొప్ప గౌరవం ఉండేది! ఆ కళాశాలలో నా చేత ప్రభుత్వకళాశాల ప్రిన్సిపాల్ నరసింహారావుగారు అభ్యుదయ కవిత్వం మీద ఓ ప్రసంగం చేయించడం కూడా మరుపురాని విషయం, విద్యార్థులు నా ఉపన్యాసానికి అధికోత్సాహం చూపారు. ఎక్కడ స్టూడెంట్స్ సంప్రదాయ విముఖులైపోతారో అన్నట్లు, కార్యక్రమంలో లేకున్నా వెంటనే ఆయన మళ్ళీ ఉద్బోధ ప్రసంగం చేయడం గురించి ఆ విద్యార్థులే చెప్పారు.

కాలేజీలో లెక్చరర్స్‌తో



సరే! ఇంతకీ ఎందుకోసం ఉద్యోగం గురించి అంత త్వరపడ్డానో, 'ఉద్యోగం పురుషలక్షణం'గా నిరూపించుకో తాపత్రయ పడ్డానో... ఆ ప్రణయ వ్యవహారం వైఫల్యం చెందింది. నగర జీవనం బాగా అలవాటైన నాకు కరీంనగర్‌లో ఉద్యోగం హాయిగానే, సంతృప్తికరంగానే ఉన్నా మానసికంగా ఉత్సాహం పోయింది. కరీంనగర్ లో ఉన్నా ఆకాశవాణి కార్యక్రమాల్లో నేను పాల్గొనడానికి కాంట్రాక్టులు వస్తూండేవి. వెళ్ళి సాహిత్య సంచికా కార్యక్రమాల్లో, కవితా గోష్టుల్లో పాల్గొంటూనే ఉండేవాడిని. (1975 గణతంత్ర దినోత్సవ సందర్భంగా ఒరియా కవితను తెలుగులోకి అనువదించి, జాతీయ కవి సమ్మేళనంలో పాల్గొన్నానుగా! 'ఒక్క నూరేళ్ళ తరువాత' అనే ఆ కవితానువాదం నాకు కాలేజీలో మంచి ప్రాచుర్యం తెచ్చింది) కాలేజీలో కూడా విద్యార్థులచేత 'రచన' అనే లిఖిత పత్రికను నిర్వహింపచేసేవాడిని. వారిలో సాహిత్యాభిరుచి కొంతమేరకయినా కలిగించగలిగాను. ఆ కాలేజీలో పనిచేసింది రెండేళ్ళే అయినా, అప్పుడు నా దగ్గర చదువుకున్న విద్యార్థులు కొందరు.. డాక్టర్‌గా, ఇంజినీర్‌గా పనిచేస్తున్నామనీ, కొందరు వ్యాపార రంగంలో రాణిస్తున్నామనీ పాతిక ముప్పై ఏళ్ళ తరువాత నన్ను గుర్తుంచుకుని పలకరించడం మహదానందం కాక మరేమిటి? అధ్యాపక వృత్తిలోని ఆ మధురిమ సాటిలేనిది!

1977 ప్రారంభంలో అనుకుంటాను. ఆకాశవాణిలో ట్రాన్స్‌మిషన్ ఎక్జిక్యూటివ్ పోస్ట్‌లకు వ్రాత పరీక్ష, ఇంటర్వ్యూ జరిగితే హాజరయ్యాను. మా ప్రిన్సిపాల్ గారు అభ్యంతరం లేదని సర్టిఫికెట్ ఇచ్చారు. ఆకాశవాణిలో క్యాజువల్‌గా చాన్నాళ్ళు పనిచేసినా, 'డ్యూటీ ఆఫీసర్' అని వ్యవహరించే పోస్ట్ - అసలుకి 'ట్రాన్స్‌మిషన్ ఎక్జిక్యూటివ్' అని ఇంటర్వ్యూకి వెళ్ళేంతదాకా తెలియలేదంటే, ఎంత అమాయకంగా, అజ్ఞానంగా ఉండేవాళ్ళమో తలుచుకుని నవ్వొస్తుంది ఇప్పుడు!! ఇంటర్వ్యూ అయితే అయ్యిందిగానీ, ఎంతటికీ ఫలితాలు రాలేదు. నా మానసిక దైన్యాన్ని అధిగమించడానికి, చదువే తరుణోపాయం అనిపించింది. ఎలాగయినా పరిశోధనా రంగంలోకి వెళ్ళాలన్న ఆకాంక్ష ప్రబలింది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలోనే 'ఎం.ఫిల్'కు అప్లయ్ చేసి, సీటు లభించడంతో కరీం నగర్‌కు 'గుడ్ బై' చెప్పాలని నిశ్చయించాను. ఈలోగా హైదరాబాద్‌లో 'ఈనాడు' దినపత్రికలో సబ్ ఎడిటర్‌గా కూడా అవకాశం వచ్చింది.











## 10

**ఆకాశవాణి దూరదర్శన్‌లు** కలిసి ప్రసారభారతిగా స్వయం ప్రతిపత్తి పేర 1997 సెప్టెంబర్ 15 నుండి అమల్లోకి వచ్చాయి. శ్రీ ఐ.కె.గుజ్రాల్ భారతప్రధానిగా, యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం అధికారంలో ఉండగా, నాటి సమాచార నాటి సమాచార ప్రసార శాఖా మంత్రి శ్రీఎస్. జైపాల్ రెడ్డి - శ్రీ నిఖిల్ చక్రవర్తి అధ్యక్షులుగా ప్రసారణ, మంత్రి శ్రీ ఎస్.ఎస్.గిల్ సి.ఇ.వో గా, ప్రసారభారతి బోర్డును ప్రకటించారు. ఏ ముహూర్తాన ఆ నిర్ణయం జరిగిందోగానీ - నాటినుండే అప్పటికే టీవీ ప్రభావం పెరుగుతూ, క్రమేపీ ప్రైవేట్ ఛానెళ్ళు, ప్రైవేట్ ఎఫ్.ఎం.రేడియో ఛానెళ్ళు వచ్చి ఆకాశవాణి, దూరదర్శన్‌ల వైభవప్రాభవాలు మందగించడం మొదలైందని అనవచ్చు.

కార్యక్రమ నిర్వహణకు ఉద్దేశించిన ఏ ఉద్యోగాలూ కూడా భర్తీ కాలేదు సరికదా ఏర్పడే ఖాళీలకు కొత్తనియామకాలు అనే మాటే లేకుండా పోయింది. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ పరీక్షల ద్వారా ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ స్థాయి నుండి పోస్టులను భర్తీ చేయడం జరిగేది. అది కూడా ఆగిపోయింది. ప్రొడక్షన్ అసిస్టెంట్‌లు, ట్రాన్స్‌మిషన్ ఎగ్జిక్యూటివ్‌లు స్టాఫ్ సెలక్షన్ కమీషన్ ద్వారా జోనల్ పద్ధతి రిక్రూట్‌మెంట్‌లు పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా జరిగేవి.

తొలి రోజుల్లో కేవలం డిగ్రీలతో నిమిత్తం లేకుండా ప్రతిభ ప్రాతిపదికగా ఆకాశవాణిలో ప్రొడ్యూసర్లను, మరికొన్ని ఇతర పోస్టులను భర్తీ చేసేవారు. సౌత్‌జోన్‌కు స్టాఫ్ సెలక్షన్ కమీషన్ మద్రాస్‌లో ఉంటుంది. అయితే విశేషం ఏమిటంటే 1978 లో ట్రాన్స్‌మిషన్ ఎగ్జిక్యూటివ్‌లుగా మేము ఆకాశవాణి ఉద్యోగులం అయింది స్టాఫ్ సెలక్షన్ కమీషన్ ద్వారా కాదు. మా తరువాత బ్యాచ్ నుండి ఆ కమీషన్ రిక్రూట్‌మెంట్స్ మొదలయ్యాయి. హైదరాబాద్‌లోనే వ్రాత పరీక్ష, ఇంటర్వ్యూ జరిగి ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి ప్రతిభ ప్రాతిపదికగా ట్రాన్స్‌మిషన్ ఎగ్జిక్యూటివ్‌లుగా నియామకమైన చివరి బ్యాచ్ మాదేనని చెప్పాలి. మేం చేరేనాటికి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, కడప నాలుగు రేడియో కేంద్రాలే. మా ముందు బ్యాచ్‌లవారు ట్రాన్స్‌మిషన్ ఎగ్జిక్యూటివ్‌లుగా దేశంలోని వివిధ ప్రాంతాలలో పనిచేసినవారే. దేశంలోని ఏ ఆకాశవాణి కేంద్రానికయినా బదిలీ చేసే షరతు మీదే మా నియమకాలు జరిగాయి. మా 1978 బ్యాచ్ ట్రాన్స్‌మిషన్ ఎగ్జిక్యూటివ్స్ ఎనిమిది మందికీ ఆంధ్రప్రదేశ్‌లోని కేంద్రాల్లోనే నియామకాలు లభించాయి.

శ్రీయుతులు కళాకృష్ణ, నేను, ఎస్.అనంత పద్మనాభరావ్, దుర్గారాజ్, శ్రీమతులు పద్మజా నిర్మల, పుట్టపర్తి నాగపద్మిని, ఎస్.శారద, శ్రీ ఏల్చూరి మురళీధర్ ఆ బ్యాచ్‌లో ఎంపికయినవారం. అప్పుడు హైదరాబాద్ కేంద్ర స్టేషన్ డైరెక్టర్‌గా ఉన్న శ్రీ పుల్లెల వెంకటేశ్వర్లుగారి ఆధ్వర్యంలోనే మేం అందరం హాజరయిన అభ్యర్థుల సమూహం నుండి ఎంపికయ్యాం. ఒకే కులం నుండి ఎక్కువ మందిని ఎంపిక చేశారన్న వాదుని కూడా ఆయన ఆ తరువాత ఎదుర్కొన్నారనే మాట కూడా వచ్చింది.

శ్రీ వెంకటేశ్వర్లుగారికి కేంద్ర సంచాలకులుగా గట్టివాడనే పేరుండేది. ఎటొచ్చీ ఆయనకు అప్పటికే వినికిడి శక్తి లేదు. చెవిలో మిషన్ పెట్టుకునేవారు. గట్టిగా మాట్లాడితే తప్ప వినబడేది కాదట. ఇంటర్వ్యూలో ఆయన ఎక్కువగా ప్రశ్నించిన గుర్తులేదు. సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్‌గా ఇంటర్వ్యూ బోర్డులో ఒకరుగా డా.జి.విసుబ్రహ్మణ్యంగారున్నారు. ఆయనే సాహిత్యం గురించీ అదీ మమ్ములను ప్రశ్నలడిగారు. 1977 లోనే ఈ ఇంటర్వ్యూలు అదీ జరిగినా చెప్పానుగా ఫలితాలు ఓ పట్టాన రాలేదు. అయినా నేను ఎం.ఫిల్ పరిశోధనకు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సీట్ రావడంతో కరీంనగర్‌లో జూనియర్ కాలేజీ లెక్చరర్‌గా రాజీనామా చేసి వచ్చేశాను. పరిశోధన కోసం రాజీనామా చేస్తున్నాని ప్రిన్సిపాల్‌గారికి లెటర్ ఇచ్చినప్పుడు ఆయన పరిశోధనానంతరం ఉద్యోగానికి తిరిగి వస్తానని బాండ్ రాసిస్తే నా ఉద్యోగంలో లీవ్ వేకెన్సీగా వేరెవరినైనా తీసుకుంటామనీ, నీ ఉద్యోగం నీకు అలాగే ఉంచుతామనీ కూడా అన్నారు. బిషప్ అందుకు వారికి అనుమతించారని కూడా అన్నట్లు గుర్తు. కానీ నేనే తిరిగి వెళ్ళే ఉద్దేశ్యం లేక రాజీనామా చేసేసి 1977 అక్టోబర్ దసరా సెలవులకు పూర్తిగా హైదరాబాద్ వచ్చేశాను. లెక్చరర్‌గా బోధనా వృత్తికి అక్కడికి ఫుల్‌స్టాప్ పడింది.

హైదరాబాద్ ఈనాడు దినపత్రికలో సబ్ ఎడిటర్ పోస్ట్‌కు అవకాశం వచ్చింది. రామోజీరావుగారు ప్రధానంగా అధిపతి అయినా సంపాదక వ్యవహారాలు అప్పుడు శ్రీ గజ్జెల మల్లారెడ్డి గారు చూస్తుండేవారు. ఆయన స్వయంగా కవి, వక్త, పరిశోధకుడు, మంచి పాత్రికేయునిగా అప్పటికే పేరొందినవారు. ఆయనే సబ్ ఎడిటర్‌గా చేరమని నన్ను ప్రోత్సహించారు. అప్పటికే ఎం.ఫిల్ పరిశోధనలో జాయిన్ అయ్యాను. అప్పుడు ఎం.ఫిల్ సెమిస్టర్ సిస్టంలో ఉండేది. విధిగా తరగతులకు హాజరుకావాలి. ఆ తరువాతే సిద్ధాంత గ్రంథ రచన చేయడమనేది. అలా తరగతులు హాజరవ్వాలంటే ఈనాడు పత్రికవాళ్ళు అనుమతి ఇస్తే బానే ఉండేది. కానీ ప్రైవేట్ యాజమాన్యం వారు కొత్తగా చేరే ఉద్యోగిని పనిగంటలకు సవరింపులు చేసి తరగతులుకు హాజరయ్యే అవకాశం ఎందుకు కల్పిస్తారు? అంచేత ఉద్యోగమా? పరిశోధనా? అన్న దానిలో నేను పరిశోధననే ఎంపిక చేసుకున్నాను. ఈనాడులో చేరలేదు. అప్పుడు ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాలలో రెగ్యులర్ ఎం.ఫిల్ పరిశోధక విద్యార్థులతో బాటు ఎఫ్.ఐ.పి ప్రోగ్రాం క్రింద (ఫాక్యులిటీ ఇంప్రూవ్ మెంట్ ప్రోగ్రాం ప్రణాళికలో) అప్పటికే కళాశాలల్లో డిగ్రీ పై స్థాయి ఉపన్యాసకులుగా ఉన్న కొందరు కూడా సెలవుపై ఇక్కడ


ఉస్మానియా విశ్వవిద్యాలయం



విద్యార్థులుగా వచ్చి చేరినవారుండేవారు. ప్రతిరోజూ అందరం తరగతులకు విధిగా హాజరవ్వాల్సి ఉండేది. మాకు అప్పుడు ఆచార్య బిరుదు రాజు రామరాజుగారు తెలుగు శాఖాధ్యక్షులు. ఆగస్టు 1977 సెషన్ పరిశోధక విద్యార్థులుగా ఎఫ్.ఐపి ప్రోగ్రాం క్రింద వచ్చిన ఉపన్యాసకులైన విద్యార్థులతో కలిపి ఓ పన్నెండుమంది పైనే ఉండేవాళ్ళం. సెమిస్టర్ సిస్టం తరగతులను ఆచార్య డా.సి.నారాయణరెడ్డి, డా.జి.వి సుబ్రహ్మణ్యం, ఆచార్య నాయని కృష్ణకుమారి, ఆచార్య రవ్వా శ్రీహరి, ఆచార్య ఎం.కులశేఖర రావ్ గార్లు ఆచార్య రామరాజుగారితో సహా తీసుకునేవారు. పరిశోధనా పద్ధతుల గురించి, పరిశోధనాంశాల విశ్లేషణారీతుల గురించి కూడా బోధించేవారు. తరగతులు ఎంతో ఆసక్తిగా సాగేవి. ఉస్మానియా విశ్వవిద్యాలయం లైబ్రేరీలో గంటలు గంటలు గడిపిన పఠనా సమయాలు, క్యాంటిన్లలో క్యాంపస్ వృక్షఛాయల్లో కబుర్ల కాలక్షేపాలు అన్నీ స్మరణీయాలే. నలుగురైదుగురం నేరుగా పరిశోధక విద్యార్థులం తప్ప మిగతావారంతా అప్పటికే కళాశాలల్లో బోధనానుభవం ఉన్న లెక్చరర్లే. నాకు ఆంధ్ర సారస్వత పరిషత్ ప్రాచ్య కళాశాలలో సహపాఠి అయిన మాడభూషి రంగాచార్య మాత్రం రైల్వేలో సీనియర్ కాషియర్‌గా పనిచేస్తూ మాతో ఎం.ఫిల్ చేశాడు. మా అందరివీ విభిన్న పరిశోధనాంశాలు. అప్పుడు ఇద్దరు ఎం.రంగాచారిలు ఒక ఎం.శ్రీ రంగాచార్య ఉండేవారు. మాడభూషి తెలుగు కథానిక - బుచ్చిబాబు అన్న అంశంపై పరిశోధన


GOVERNMENT OF INDIA
COMMERCIAL BROADCASTING SERVICE
ALL INDIA RADIO : HYDERABAD.
* * *

No. 21 (AV)78-G/CBS/3172 Dated : 1-6-1978

ORDER

With reference to his application dated 27-5-1978 accepting the offer of appointment to the post of Transmission Executive, Shri. A.Venkata Rao is appointed to the post of Transmission Executive in the office of the Station Director, Commercial Broadcasting Service, All India Radio, Hyderabad in the time Scale of Rs. 425-15-500-EB-15-560-20-640-EB-20-700-25-750, with effect from 1-6-1978 (Forenoon) on purely Temporary Capacity.

Aziz Qureshi
STATION DIRECTOR ( C ). 1/6.78

Shri. A.Venkata Rao,
M.S. 86,
Malakpet Colony,
Hyderabad - 500036.

చేయడం వల్ల తనను కథానిక రంగాచారి అనేవాళ్ళు. ఇమేజరీ ఇన్ ప్రోగ్రెసివ్ తెలుగు పొయెట్రి (తెలుగు అభ్యుదయ కవిత్వంలో భావచిత్రాలు) అన్నది నా పరిశోధనాంశం. మా ఫస్ట్ సెమిస్టర్ అయ్యే తరుణానికి అంటే 1978 జనవరి ముగిసేసరికి ఆకాశవాణిలో ట్రాన్స్‌మిషన్ ఎగ్జిక్యూటివ్‌గా సెలక్ట్ అయిన వర్తమానం అందింది. అది కేంద్ర ప్రభుత్వోద్యోగం కనుక చేరడానికి ముందు అనేక ఫార్మాలిటీస్ ఉంటాయి. ఎంపికయిన అభ్యర్థి ఏ నేరచరితా లేనివాడని పోలీస్ వెరిఫికేషన్ కూడా జరగాలి కనుక పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు వాళ్ళు ధ్రువీకరణ చేయమని పత్రాలు పంపడం, వాళ్ళు గతంలో మనం ఎక్కడెక్కడ నివసించిందీ, పనిచేసిందీ ఆ వివరాలన్నీ అడిగి అన్నిరకాలుగా నడతను సరియైనదిగా ధ్రువీకరించుకుని ఆకాశవాణి వాళ్ళకి తెలియజేస్తే అప్పుడు వాళ్ళా నియామకపత్రాలు పంపుతారు. ఈలోగా ఎంపికయిన అభ్యర్థి మెడికల్ పరీక్ష కూడా చేయించుకుని అర్హతా పత్రాన్ని సమర్పించాలి. ఈ తతంగం అంతా గడిచేసరికి మరో మూడు నెలలు పైగా పట్టింది. చివరకు మే 1978 లో నాకు ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం వివిధ భారతి వాణిజ్య భాగంలో ట్రాన్స్‌మిషన్ ఎగ్జిక్యూటివ్‌గా చేరమని నియామక పత్రాలు వచ్చాయి. కమర్షియల్ బ్రాడ్ కాస్టింగ్ స్టేషన్ (సి.బి.ఎస్) ఒక ప్రత్యేక కేంద్రంగా హైదరా బాద్‌లో స్టూడియో ప్రసార విభాగం ఒక్కచోటే ఉన్నా ఆఫీసు మాత్రం ప్రత్యేకించి ఉండేది. దానికి వేరే డైరెక్టర్. ఆకాశవాణి హైదబాద్ ప్రధాన కేంద్రం డైరెక్టర్ వేరు. సి.బిఎస్ డైరెక్టర్ వేరు. అప్పట్లో వివిధభారతి (సిబిఎస్) కేంద్రానికి శ్రీ అజీజ్ ఖురేషీ స్టేషన్ డైరెక్టర్. ముస్లిం. తెలుగు తెలుసు కానీ ఉర్దూలో నిష్ణాతుడు. చాదర్ ఘాట్ ఇవతల మలక్ పేట స్టేషన్ ఎదురుగా ఉండే ప్రాంతంలో ఆయన ఇల్లుండేది. మనిషి కరుకుగా ఉండేవాడు (నాకు ఉద్యోగంలో

కొత్తకాబట్టి అలా అనిపించేదేమో ఎక్కువగా) అయినా రసికుడుగా చెప్పుకునేవారు. అప్పుడు ఆకాశవాణి వివిధ భారతి వాణిజ్య ప్రసార విభాగం ఆఫీస్ లకడీకా పూల్ బ్రిడ్జి దాటాక మహావీర్ హాస్పటల్ సందు ఎదురుగా ఎ.సి.గార్డ్స్‌లో ఉండేది. మే'25 నో 26నో నాకు అప్పాయింట్ మెంట్ కాయితాలందాయి. మే'27 న జాయిన్ అవుదామని వెడితే ఆయన ఇవాళ కాదు జూన్'1 న జాయిన్ అవ్వమని చెప్పాడు. హైదరాబాద్ ప్రధాన కేంద్రానికి వేసిన కళాకృష్ణ మే'31నే చేరిపోయాడు. ఏల్చూరి మురళీధర్, పద్మజా నిర్మల, ఎస్.శారదలకు విజయవాడ కేంద్రంలో చేరమనీ, పుట్టపర్తి నాగపద్మినిని కడప కేంద్రంలో చేరమనీ, దుర్గా రాజ్‌కు ముందు విశాఖలో చేరమనీ, నన్ను హైదరాబాద్ వివిధ భారతి కేంద్రంలో చేరమనీ ఆర్డర్లు. నా తొలి స్టేషన్ డైరెక్టర్ శ్రీ అజీజ్ ఖురేషీ గారి ఆదేశాలమేరకు జూన్ ఒకటో తేదీ 1978లో ట్రాన్స్‌మిషన్ ఎగ్జిక్యూటివ్‌గా ఆకాశవాణి హైదరాబాద్ వివిధ భారతి వాణిజ్య ప్రసారవిభాగంలో జాయినింగ్ రిపోర్టిచ్చా. ఉదయం ప్రసారాలు ప్రారంభించింది లగాయితు అర్ధరాత్రి కార్యక్రమాలు ముగిసేంతవరకూ కూడా ఎగ్జిక్యూటివ్‌లు మూడు షిఫ్టులలో రోజూ మారే షిఫ్ట్ పని గంటల్లో పనిచేయాలి. డ్యూటీ ఆఫీసర్ అని వ్యవహారంలో వారిని పేర్కొంటారు. అనౌన్సర్లను గైడ్ చేయడం, ప్రసారమయ్యే కార్యక్రమాలను విని గ్రేడింగ్‌లు వేయడం, ప్రసారం సాఫీగా సాగేలా చూడడం మౌలిక విధులు.

డ్యూటీ ఆఫీసర్లకు, అనౌన్సర్లకు కార్యక్రమ నిర్వహణాధికారి రోజువారీ డ్యూటీలు వారం వారం ముందుగా నిర్ధారిస్తారు. సాధారణంగా సీనియర్ అనౌన్సర్ల డ్యూటీ ఛార్ట్, సీనియర్ ట్రాన్స్‌మిషనో ఎగ్జిక్యూటివ్ డ్యూటీ ఆఫీసర్ల ఛార్ట్‌నూ ప్రిపేర్ చేస్తే వారి విధులను కో ఆర్డినేట్ చేసే ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ సరిచూసి ఏవయినా మార్పులు, చేర్పులు కావలంటే చేసి నిర్ధారించడం జరుగుతుంది. ఆదివారం నుండి శనివారం వరకూ డ్యూటీలు చూపుతూ గురు, శుక్రవారాలనాటికే డ్యూటీ చార్ట్‌లు సిద్ధమైపోతుంటాయి. ఆఖరి నిముషం మార్పులు ఏమయినా సంబంధిత అధికారులు లేదా నేరుగా స్టేషన్ డైరెక్టర్ అనుమతితోనే మార్చుకోవాల్సి ఉండేది. రోజుకు మూడు షిఫ్టులు ప్రతి షిఫ్ట్‌కు ఒక ట్రాన్స్‌మిషన్ ఎగ్జిక్యూటివ్ (డ్యూటీ ఆఫీసర్) ఇద్దరు అనౌన్సర్లు ఉండేవారు. అలాగే ఇంజనీరింగ్ విభాగం వారూ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు కంట్రోల్ రూంలో షిఫ్ట్ పద్ధతుల్లోనే పనిచేస్తారు. గ్రూప్.డి ఉద్యోగులు, కారు డ్రైవర్లు వీరికి అలానే షిఫ్టులు. ఆ రోజుల్లో పదినుండి సాయంత్రం అయిదువరకూ పనిగంటల మామూలు వేళల్లో తప్పితే మిగతా ఉదయం, సాయంకాలం, రాత్రి సమయాల్లో ట్రాన్స్‌మిషన్ ఎగ్జిక్యూటివ్‌కే బాధ్యతలెక్కువగా ఉండేవి. ఢిల్లీ రిలేలు, ఆకస్మికంగా వచ్చే పరిణామాలు వీటినన్నింటినీ ఒక్కోసారి సంబంధిత కార్యక్రమ నిర్వహణాధికారులు లేకపోతే నేరుగా స్టేషన్ డైరెక్టర్‌తో ఫోన్‌లో సంప్రదించి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉండేది. వార్తా విభాగం వారు కూడా వార్తలు చదవడానికి వెళ్ళే ముందూ, చదివి వచ్చాకా, అలాగే ప్రత్యక్షప్రసారాలకు వచ్చే సంగీత కళాకారులు, వారికి పక్కవాయిద్యాలూ అవీ అందించే షిఫ్ట్ డ్యూటీల నిలయ విద్వాంసులూ అందరూ డ్యూటీ ఆఫీసర్‌కు రిపోర్ట్ చేయాల్సిందే! తుఫాన్ హెచ్చరిక కేంద్రాలనుండి వర్తమానం వస్తే డ్యూటీ ఆఫీసరే స్టేషన్ డైరెక్టర్‌కి చెప్పి వాతావరణ హెచ్చరికల ప్రసారనిమిత్తం రాత్రంతా ప్రసారాలు పొడిగించవలసి రావడం, చివరినిముషాల్లో అనౌన్సర్ల డ్యూటీలు అవీ సరిచేయడం చేయవలసి వచ్చేది.







Memo.No.
11/1/85-S.VII

DUTIES OF TRANSMISSION EXECUTIVES

The Programme Cadre in AIR and Doordarshan starts from the post of Transmission Executive. The duties of the Transmission Executives are multi-farious in nature. These are broadly indicated below:-

1. The Transmission Executive is placed incharge of the Station's transmissions and he functions as the Duty Officer. He coordinates between the performing artists/talkers, the programme presentation staff and the Engineers. He is responsible for collection and issue of all the programme material and their broadcast according to the programme cue sheet. Outside office hours he is also placed incharge of duty vehicles and functions as contact officer assisting the Station Director.

2. The Transmission Executive is responsible for carefully watching the various items of programmes broadcast and preparing the Daily Report in form AIR-p-29. Any deviations from the scheduled programmes are noted in the form each day and a consolidated report for a month sent to the Director General, All India Radio and Doordarshan, by the 1st week of next month.

3. The Transmission Executive should evaluate programmes at All India Radio Stations/Offices and Doordarshan Kendras and enter their assessment in the column "Remarks for Card Index" of the Daily Report for the day's broadcast/telecast. The assessment should be discussed in the next programme meeting and modified or revised in the light of comments of Senior Programme Officers concerned etc. in the meeting. Thereafter the final assessment should be entered in the Card Index(AIR-P-34).

4. Those Transmission Executives who are on duty in the morning shift should attend the programme meeting to be held on that day. These Transmission Executives will later apprise their colleagues, that is, other Transmission Executives, of the discussion held and decisions taken in the meeting, which concern them.

5. Detailed entries should also be made in the Studio Log Book(AIR-P-30) by the Transmission Executives. Great care should be taken in making entries in this book as it is the main initial record for making payments to artists, talkers, gramophone record companies etc. Every entry in the Log Book should be initialled by the Transmission Executives in Column 10. While making entries of Broadcast of tapes he should also indicate when possible the date of recording in the Studio Log Book so that the Accountant could complete the entries in the separate Pay Order Book(for pre-recorded programmes) and ensure that all such programmes are broadcast

6. Payments to artists are made by the officer on duty who issues the certificate of broadcast(AIR-A-1).

8. The undelivered cheques and undisbursed cash pertaining to artists who do not turn up and the receipts in cases where payments have been actually made should be sent by the officer on duty along with the Log Book and all documents to the Accounts Section the next day for further action.

9. The preparation of statistics of Western and Indian Music broadcast during the month for transmission to the Director General is also the responsibility of the Transmission Executive.

10. The Transmission Executive should record, dub, edit and playback programmes of all kinds. He assists in the production of programmes of all kinds, and preparation of newsreels whenever necessary. He should maintain register of blank tapes, recorded tapes etc. according to the system in force. He is also expected to take part in the plays and features.

11. The Transmission Executive also should assist in the preparation of news material for the Press, Radio and Doordarshan and sub-editing of news in English and other Indian Languages. He is also expected to prepare the analysis of English and Indian languages Press Reports, editorials etc. and translation of English language material into Indian languages and vice-versa.

12. Wherever required, the Transmission Executive should write scripts of plays, features, talks, stories etc. for all categories of programmes; edit and adapt material to be broadcast; read scripts and take part in their presentation, maintain catalogues of scripts and background material for reference etc.

13. The Transmission Executive is also expected to write announcements, check and select broadcast materials, translate news summary and assist supervisory staff in auditioning of music artists and drama voices.

## 11

'ట్రాన్స్‌మిషన్ ఎగ్జిక్యూటివ్' అన్నది - ఉద్యోగం. 'పోస్టు' వ్యవహారంలో 'డ్యూటీ ఆఫీసర్' అంటే అతడే! ఆకాశవాణిలో కానీ, దూరదర్శన్ లో కానీ, ప్రోగ్రాం క్యాడర్ అనేది 'డ్యూటీ ఆఫీసర్‌తోనే మొదలు! అనౌన్సర్లు, ప్రొడక్షన్ అసిస్టెంట్లు వీరంతా మొదట్లో నేరుగా కేంద్రప్రభుత్వోద్యోగులుగా పరిగణించబడేవారు కాదు.

డ్యూటీ ఆఫీసర్లుగా షిఫ్ట్ డ్యూటీల్లో పనిచేసేవారమని చెప్పాను కదా! అనౌన్సర్లు, ఇంజనీర్లు, ట్రాన్స్‌పోర్ట్ స్టాఫ్, గ్రూప్'డి' స్టాఫ్ కూడా షిఫ్ట్ డ్యూటీల్లో పనిచేస్తారు. అంచేత ఉదయం పదినుండి సాయంత్రం అయిదుదాకా అన్నట్లు కాక, తెల్లవారు ఝామున అయిందింటి నుంచి - రాత్రి పన్నెండింటి వరకూ రోజుకు మూడు షిఫ్ట్‌ల్లో పనిచేసే వీరందరూ, ముఖ్యంగా ఉదయం, రాత్రి - మిగతా స్టాఫ్ అంతా ఇళ్ళలో ఉన్నా, తాము మాత్రం ఉద్యోగ బాధ్యతల్లో జీవించేవారే!
కేంద్ర ప్రభుత్వం ఉద్యోగం! అందునా కొత్తగా చేరడం! అందువల్ల ఉత్సాహం, పట్టుదల ఎంత ఉండేవో, పై ఆఫీసర్లు, ముఖ్యంగా నాకు స్టేషన్ డైరెక్టర్ గురించి అంత 'జంకూ' ఉండేది. వివిధ బారతై వాణిజ్య ప్రసార విభాగం

స్టేషన్ డైరెక్టరయిన శ్రీ అజీజ్ ఖురేషీ ఇంటినుంచి రాత్రి పదకొండింటికి కూడా ఫోన్ చేసి ప్రసారంలో ఓ అరనిమిషం ఎందుకు గ్యాప్ వచ్చిందనో, ఆ విరామ సంగీతం సరిగ్గా వినిపించలేదనో, ఫలానా అనౌన్సర్ ఉందా? వెళ్ళిందా? ఉంటే ఓ సారి ఫోన్ దగ్గరకు పిలువు. అనో, 'ఝుమాయించి' అడుగుతుండేవాడు.

డ్యూటీ ఆఫీసర్ అంటే ఓ పాపాల భైరవుడిలా అన్నింటికీ బాధ్యుడు వాడే అన్నట్లు, బాధ్యతలు నిర్వర్తించవలసి ఉండేది! అనౌన్సర్ టైంకి రాకపోతే ట్రాన్స్‌మిషన్ ప్రారంభించడం దగ్గర్నుండి, ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ మరచిపోతే ప్రోగ్రాం సమకూర్చుకోవడం నుంచి, డైరెక్టర్‌కు కారు పంపడం దగ్గర్నుంచి, రాత్రి ట్రాన్స్‌మిషన్ అయ్యాక - అనౌన్సర్లు, ఇంజినీర్లు స్త్రీలు అయితే వారికి వెహికల్ డ్రాపింగ్‌కు ఉందా లేదా వరకూ అన్నీ చూసుకుని, మరునాడు ఉదయం డ్యూటీ ఆఫీసర్లకూ, అనౌన్సర్లకు ఏవయినా అత్యవసర సూచనలుంటే వ్రాసిపెట్టి వెళ్ళడం చేయాల్సిందే! అసలు ట్రాన్స్‌మిషన్ ఎక్జిక్యూటివ్‌ల (డ్యూటీ ఆఫీసర్ల) డ్యూటీలు అంటూ ఇవ్వబడిన వివరణాత్మక పట్టికలో కొన్ని భాగాలు చదివితే ఎంత బాధ్యతాయుతమో మీకే తెలుస్తుంది అనుకుంటాను.

ఉద్యోగంలో చేరిన కొత్తలో నేను



'డ్యూటీ ఆఫీసర్' అంటే - మేం క్యాజువల్‌గా పనిచేసే రోజుల్లోనే, కొందరిని చూసి భయపడేవాళ్ళం! అందులో 'జయరత్' అని ఒకాయన ఉండేవారు. ఆయన సూటూ, బూటూ టైకట్టుకుని డ్యూటీ ఆఫీసర్ చైర్‌లో కూర్చుంటే - అద్దం వెనకనుండి స్టూడియో ఎంట్రన్స్ తలుపు తీయగానే ఆయన కనబడితే చాలు - కోపల్లె శివరాం వంటివాడే (కొన్నాళ్ళు మిలటరీలో చేశాట్ట!) "ఓర్నాయనో!' అనుకునేవాడు. స్టూడియోలోకి వెళ్ళాలంటే - డ్యూటీ ఆఫీసర్‌కి రిపోర్ట్ చేసి వెళ్ళాల్సిందే! ప్రసార సామాగ్రి అంతా లైబ్రరీ నుంచి డ్యూటీ రూముకు వచ్చినప్పుడు తీసుకుని భద్రపరిచేదీ, అనౌన్సర్లు ఆ మెటీరియల్‌ను అనౌన్సర్ బూత్‌లోకి తీసుకువెళ్ళేముందు చెక్ చేసుకునేది డ్యూటీ ఆఫీసరే! ఉదయం, రాత్రి ప్రసారాల్లో ఉండే - ప్రత్యక్ష ప్రసారాలు, అంటే లైవ్ ప్రోగ్రాంలుకు చెందిన సంగీత కళాకారులు, వాద్య కళాకారులు డ్యూటీ రూంలో రిపోర్ట్ చేసే వెళ్ళాలి. అలాగే రికార్డింగులు జరిగాక, రికార్డింగు జరిగినట్లుగా ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్ సర్టిఫై చేసాక, ఆర్టిస్టులకు చెక్‌లు (పారితోషికం) పంపిణీ చేసేదీ, లైవ్ ఆర్టిస్టులకు చెక్‌లు ఇచ్చేదీ డ్యూటీ ఆఫీసరే, అన్నింటికన్నా ముఖ్యం ప్రసారమవుతున్న ప్రతికార్యక్రమం వినడం! అనౌన్సర్ల పొరపాట్లు, కార్యక్రమాల్లో పొరపాట్లు, విద్యుత్ ప్రసార అంతరాయాలు, వార్తల్లో ముఖ్యాంశాలు ఇవన్నీ శ్రద్ధగా విని రిపోర్ట్ చేయాల్సింది మేమే! ఎంత సీనియర్ అనౌన్సర్లయినా - డ్యూటీ ఆఫీసర్‌కు తమ అనౌన్స్‌మెంట్స్ స్క్రిప్ట్ ముందుగా రాసి చూపి సంతకం తీసుకోవాల్సి ఉండేది! ముందురోజు ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్ (కో ఆర్డినేటర్) చూసి సవరించిన అనౌన్స్‌మెంట్సయినా, ఆఖరి నిముషం మార్పు చేర్పులు ఉంటే సవరించి చూడాలి డ్యూటీ ఆఫీసర్.

నాకు ముందు నుండీ రాత్రి ఎంతసేపయినా మేల్కోవడం అలవాటుండేది గానీ, తెల్లవారు ఝామునే లేవాలంటే బద్ధకంగా ఉండేది. కానీ డ్యూటీ ఆఫీసర్‌గా పనిచేసిన పదమూడు సంవత్సరాల కాలంలో - ఉదయం డ్యూటీలంటే - ముందురోజు సాయంత్రం నుండే - మెదట్లో 'టెన్షన్' ఉండేది! మిత్రులెవరయినా సెకండ్‌షో కాదు, ఫస్ట్‌షోకు వెడదామన్నా - "అమ్మో! రేపు నాకు మార్నింగ్ డ్యూటీ" అనేవాడిని. ఉదయం లేవలేనేమోనని భయమన్నమాట! అందునా మలక్ పేట కాలనీ నుంచి అసెంబ్లీ ఎదురుగా సైఫాబాద్‌లోని ఆకాశవాణి కార్యాలయం స్టూడియోకి వెళ్ళాలంటే మాకేమీ ట్రాన్స్‌పోర్ట్ లేదు. ఉదయం అయిదింటికి కాలనీలో ఫస్ట్‌బస్ క్యాచ్ చేసి వెళ్ళాల్సిందే! అంటే నాలుగింటికే లేచి, మొహం కడిగి, స్నానం చేసి మరీ వెళ్ళేవాడిని! మా నాన్నగారు ఉదయమే లేచి, ఆఫీసుకు వెళ్ళే నాకు, తాను ఎన్నిమార్లు కాఫీ కలిపి ఇచ్చి, త్రాగి వెళ్ళమన్న సంఘటనలు ఇప్పటికీ కనులముందు కదలాడేవే! వేసవి కాలం ఉదయం డ్యూటీలంటే హుషారుగా

ఉండేది కానీ, వానాకాలం, చలికాలమే మా చెడ్డ ‘ఇది‘గా ఉండేది! చలికాలం అందరూ హాయిగా మునగదీసుకుని పడుకుంటే - స్వెట్టర్లు, మఫ్లర్లు చుట్టుకు వెళ్ళాలంటేనూ (ఆ రోజుల్లో హైదరాబాద్ చలి మరీ ఎక్కువగా ఉండేది. ముఖ్యంగా మాప్రాంతంలో), అలాగే వానాకాలం రెయిన్ కోటు, టోపీ వేసుకువెళ్ళాలంటేనూ ఒక్కసారి మిగతా వారితో పోల్చుకుంటే ఉక్రోషం వచ్చేది! పైగా పండగా, పబ్బం అంటూ లేదు! పండగనాడు అందరికీ సెలవయినా షిఫ్ట్ డ్యూటీ వాళ్ళు డ్యూటీ పడినప్పుడు వెళ్ళాల్సిందే! తరువాత ఎప్పుడో ‘కాంపెన్ సేటరీ ఆఫ్‘ ఇచ్చేవారు. లేదా ‘ఓవర్ టైం అలవెన్స్‘ వచ్చేది. అప్పట్లో మా సి.బి.ఎస్(కమర్షియల్ బ్రాడ్ కాస్టింగ్ సర్వీస్)లో పెళ్ళికాని కుర్రవాడిని నేనే! మిగతా ముగ్గురు డ్యూటీ ఆఫీసర్లూ కె.ఎస్.రామానుజం, అట్లూరి వెంకట్రావ్ చౌదరి, జి.ఆర్.విఠల్ రావు వయసులోనూ అనుభవములోనూ పెద్దవాళ్ళు. రామానుజానికి మటుకు నేను ఉద్యోగంలో చేరాకే పెళ్ళయిందని గుర్తు. పొడుగ్గా, అందంగా ఉండేవాడు. వెంకట్రావ్ చౌదరి అయితే లోకల్ డైరెక్టర్ జనరల్ అన్నట్లుండేవాడు. అతని ఢిల్లీ పరిచయాలు అలాంటివి అని చెప్పుకునేవారు. విఠల్ రావ్ సిస్టమేటిగ్గా పనిచేసేవాడు. రామానుజంది కుశాలు వ్యవహారమే. అంచేత వినాయకచవితి ఉదయం, దీపావళి రాత్రి డ్యూటీలంటే నాకే!


కె.ఎస్.రామానుజం,
ఇలియాస్,అహ్మద్

నేను చేరిన వెంటనే మొదటి వారంలో అబ్జర్వేషన్ డ్యూటీలు వేసారు. ఓ థర్డ్ ట్రాన్స్‌మిషన్ డ్యూటీకి (అంటే సాయంత్రం 4.30 నుండి 11.30 అప్పుడు) అబ్జర్వేషన్‌కు వెళ్ళినప్పుడు - రామానుజం ఆ షిఫ్ట్ డ్యూటీ ఆఫీసర్‌గా వచ్చాడు. ఓ ప్లాస్టిక్ బుట్టలో నాలుగు గిన్నెల క్యారేజీ, మంచినీళ్ళ క్యాను, గ్లాసు, స్టీలు కంచం, రసాల మామిడిపండూ తెచ్చుకున్నాడు. డ్యూటీలో విరామంలో డిన్నర్ కన్నమాట! నేను నిజంగా ఆశ్చర్యపోయాను! ఏ వార్తలు ప్రసారమయ్యే అరగంటలోనో (అది ఢిల్లీ రిలే సమయం కనుక) మెయిన్ హెడ్డింగ్స్ అవగానే, లేకపోతే ఏదయినా నేషనల్ ప్రోగ్రాం సమయంలోనో, స్టూడియోలో రాత్రి భోజనం షిఫ్ట్ డ్యూటీవాళ్ళు చేసేవారు. అంత తాపీగా, రసాల మామిడిపండుతో రామానుజం ఎలా తినేవాడో!

నేను మాత్రం షిఫ్ట్ డ్యూటీల్లో పనిచేసినంత కాలం - రాత్రి షిఫ్ట్ అయినా, ఎంత లేటయినా, ఇంటికే వచ్చి భోజనం చేసేవాడిని. ఉదయమే వెళ్ళాల్సివస్తే మధ్యాహ్నం వచ్చి తినడం, మధ్యాహ్నం షిఫ్ట్ అయితే ఇంట్లో తినేసి వెళ్ళిపోవడం చేసేవాడిని. మార్నింగ్ షిఫ్ట్ అయి తే ఏడు అయ్యేసరికి మొదట్లో ‘జంగయ్య‘ అని గ్రూప్ డి‘ అతను టిఫిన్ పొట్లాలు తెచ్చిపెట్టి, తానే కాఫీ కలిపి ఇచ్చేవాడు. ‘జంగయ్య కాఫీ‘ అంటే - కప్పూ సాసరూ మనచేతిలో పెట్టి, చెంచాతో కప్పులో కాఫీ, పంచదార కలిసిందో లేదోనని తెగ తిప్పుతూండడం అందరికీ తలుచుకునే ఘటనే!

ఆ రోజుల్లో హైదరాబాద్ ‘ఎ‘, ‘బి‘ కేంద్రాల డ్యూటీ రూం, మెట్లెక్కి స్టూడియో తలుపులు తెరుచుకుని లోనికి రాగానే ఎడమవైపుగానూ, హైదరాబాద్ ‘సి‘ అంటే - మా వివిధభారతి కమర్షియల్ బ్రాడ్ కాస్టింగ్ డ్యూటీ రూం కుడివైపు ఉండేవి. మా కార్యాలయం, జీతాలు మటుకు అప్పట్లో ఏ.సి. గార్డెన్స్‌లోని ప్రైవేట్ భవనంలో ఉండేవి. ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్‌లు అయిన శ్రీసి.వేదగిరి శర్మ, శ్రీ ఎన్.సి. (నల్లాన్ చక్రవర్తుల) నరసింహాచార్యులు గారు అక్కడికి ఇక్కడికీ రోజూ తిరిగేవారు. కార్యక్రమాల రికార్డింగూ, డబ్బింగూ, అడ్వర్టైజ్ మెంట్స్ వ్యవహారాలూ ఇక్కడ సైఫాబాద్ అసెంబ్లీ ఎదురుగా స్టూడియోలోనే ప్రసారాలతో సహా జరిగేవి. ఏమయినా ఆ రోజులు తలుచుకుంటే ముప్పిరిగొనే స్మృతులు అనేకం!

ప్రసారమైన ప్రతికార్యక్రమం, ప్రతిపాటా, దాని వివరాలూ, అలాగే ప్రతిప్రకటనా, దాని వ్యవధీ, అన్నీ లాగ్ బుక్‌లో డ్యూటీ ఆఫీసరే ఎప్పటికప్పుడు ఎంట్రీ రాయాలి. 'ట్రాన్స్‌మిషన్ రిపోర్ట్' అనే దానికి చాలా ప్రాముఖ్యం ఉండేది! 'నథింగ్ టు రిపోర్ట్' అని రాయగలిగామంటే గొప్ప ఊపిరి తీసుకున్నట్లే. ప్రతి కార్యక్రమానికీ గ్రేడింగ్ వేయాలి. ఈ రిపోర్ట్‌లు, గ్రేడింగ్‌లు మరుసటి రోజు ఉదయం స్టేషన్ డైరెక్టర్ సమక్షంలో జరిగే ప్రోగ్రాం మీటింగ్ లో చర్చకు వచ్చి, డ్యూటీ ఆఫీసర్ వేసిన - ఎ,బిప్లస్, బి, బిమైనస్, సి వంటి గ్రేడ్ ఏదయినా అంగీకరించడమో, చర్చించి నలుగురి అభిప్రాయం మేరకు మార్చడమో జరిగేది! ఆకాశవాణిలో ప్రోగ్రాం గ్రేడింగులకు - ముఖ్యంగా సంగీతం, డ్రామా విషయలో ఎంతో ప్రాధాన్యం ఉంది. 'ఎ' గ్రేడ్ ఆర్టిస్టు అయినా - ఫెర్ ఫార్మెన్స్ బాగా లేకపోతే, డ్యూటీ ఆఫీసర్ ఏ - 'బి' గ్రేడో వేయవచ్చు! అలాగే ప్రసంగకర్తలకు కూడా వారి ప్రసంగాలకు - విషయం, అభివ్యక్తి విధానం అనుసరించి గ్రేడింగ్ వేయడం ఉండేది. డ్రామా అయితే - డ్రామా స్క్రిప్టు మొదలుకుని, అందులో పాల్గొన్న ప్రతి కళాకారుడికీ విడివిడిగా గ్రేడింగ్ చూపాలి. అలాగే - సంగీతం, పాటల విషయంలో కూడాను కళాకారులు పాల్గొన్నవారందరికీ మార్కింగ్స్ వేయాలి.

సరే! శ్రోతలకు వినబడే గొంతులు మాత్రం అనౌన్సర్లవే ప్రధానంగా! అయితే డ్యూటీ ఆఫీసర్లుగా అందరం కాకపోయినా మాలో చాలామందిమి - మా గళాలతో కార్యక్రమాల్లో పాల్గొనీ, నాటకాలు వేసీ, పలుకార్యక్రమాలు రూపొందించి శ్రోతలకు పరిచితులమయ్యాం! నేను సి.బి.ఎస్ డ్యూటీ ఆఫీసర్ గా ఉండగా - వివిధభారతి వాణిజ్య ప్రసార విభాగం అనౌన్సర్లుగా శ్రీమతి. ఎస్. శమంతక మణి కృష్ణమోహన్ (పండా శమంతక మణిగా ప్రసిద్ధం), శ్రీమతి, నిర్మలా వసంత్, శ్రీ ఉమాపతి బాలాంజనేయ శర్మ, శ్రీమతి జ్యోత్స్న, శ్రీమతి. కె.ఇందిరా బెనర్జీ, శ్రీ ఆకెళ్ళ సత్యనారాయణ మూర్తి, శ్రీ సయ్యద్ ఇలియాస్ అహ్మద్, శ్రీమతి ఆకెళ్ళ సీతాదేవి ఉండేవారు. షిఫ్ట్ డ్యూటీలలో వీరికి డ్యూటీ ఆఫీసర్‌గా పనిచేసాను. వారందరికీ నేనంటే ప్రేమ, అభిమానం, గౌరవం ఉండేది. కుర్రవాడినయినా, అప్పటికే చిత్రకారుడిగా, రచయితగా, కవిగా, వక్తగా బయటి సాహిత్య ప్రపంచంలో గుర్తింపు వుండడం వల్ల వారు నా అభిప్రాయాలను, సలహాలను గౌరవించి ఆదరించేవారు. వారంతా కూడా (ఒకరిద్దరు తప్ప) క్రమశిక్షణలో, ఉద్యోగ నిర్వహణలో, కళాసాహిత్యాది విషయాల్లో, తమ కార్యక్షేత్రమైన అనౌన్సర్ ఉద్యోగంలో - తమకు తాము సాటి అనిపించుకున్నవారే! జ్యోత్స్నకు సాంసారిక ఈతి బాధలున్నా - ఆ గళంలో మైకు ముందు శ్రోతలకు ఎన్నడూ ధ్వనించేది కాదు. జలసూత్రం సీతాదేవి ఆకెళ్ళ సత్యనారాయణ మూర్తిని పెండ్లాడి ఆకెళ్ళ సీతగా మారింది. (ఆ జంట అతను విజయవాడ, ఈమె ఇక్కడ కొన్నాళ్ళు) ఇందిరా బెనర్జీ సంపన్నురాలు. "ఆవిడకసలు ఉద్యోగం అవసరమేముంది? ఏదో కారు పెట్రోల్ ఛార్జీలకోసం చేస్తున్నది" అనుకునేవాళ్ళు కుర్రాళ్ళు! ఉమాపతి బాలాంజనేయ శర్మ మంచి విద్వత్తు ఉన్నవాడు. పద్యం రాయగలవాడు. జ్యోతిషంలో నిపుణుడు. నే చేరిన కొత్తలో తొలిసారి నా ఉద్యోగంలో అతనితోనే భేటీపడింది! 'జనరంజని' సినిమా పాటల కార్యక్రమంలో ఏ పాటలు వేస్తున్నదీ, వాటికి అనౌన్స్ చేస్తున్న వివరాలూ, ముందుగా రాసి డ్యూటీ ఆఫీసర్ సంతకం తీసుకోవాలి. అప్పట్లో సినిమాల అడ్వర్టైజ్ మెంట్లు ఉండేవి. అప్పుడంతా రేడియోనే కదా! పాత సినిమాలు రిలీజయితే వాటికీ పంపిణీదారులు ప్రకటనలిచ్చేవారు. అలాంటి ప్రకటన ఉంటే - సదరు సినిమా పాటమాత్రం, వెంటనే ఆ కార్యక్రమంలో, మేం వేయకూడదన్న నియమం ఉండేది. అంచేత స్క్రిప్ట్ విధిగా ముందు తనిఖీ చేయించుకోవాల్సిందే !


కె.ఇందిరా బెనర్జీ

ఓ మాటు కార్యక్రమం ఇంకో అయిదు నిమిషాల్లో మొదలవుతుందనగా తను స్క్రిప్ట్ నా టేబుల్ మీద పెట్టివెళ్ళాడు. నేను సరిచూసి హైదరాబాద్ 'ఎ' డ్యూటీ రూం దగ్గర ఫోనేదో వస్తే అందుకోసం వెళ్ళాను. తను 'స్క్రిప్ట్ నేను సంతకం చేయక అట్టేపెట్టుకున్నా'నని వచ్చి వాదనకు దిగాడు. మరో అనౌన్సర్ నిర్మలా వసంత్ ముందుగానే తన స్రిప్ట్ అప్రూవ్ చేయించుకుని కార్యక్రమం మొదలెట్టింది. ఆఖరి నిముషంలో రాసి, నెపం నా మీద తను వేయాలని చూసాడు. విషయం పై ఆఫీసర్ల దాకా వెళ్ళింది! నేను ఉద్యోగంలో చేరిన కొత్తవల్ల, నాదే తప్పంటారేమోనని భయపడ్డాను గానీ, నరసింహాచార్యులు గారు విషయం అర్థం చేసుకుని, హైదరాబాద్ ఎ,బి డ్యూటీ ఆఫీసర్లు, గ్రూప్ 'డి' వారూ - శర్మే నా మీద అనవసరంగా అరిచాడని చెప్పడంవల్ల కూడా అతనికే మెమో ఇచ్చారు. చెప్పే విషయం ఏమిటంటే - కళా సాహిత్య రంగాలకు చెందినదే అయినా, ఆకాశవాణీ ఓ ప్రభుత్వ కార్యాలయమే! కార్యక్రమాల రూపకల్పన ఒక ఆఫీసు పనే! కాబట్టి అన్ని ఆఫీసుల్లాగానే ఇక్కడా అడ్మినిస్ట్రేషన్ బ్యూరోక్రసీ ఉండనే ఉంటుందని చెప్పడమే ఉద్దేశం! అయినా ఆకాశవాణి ఆకాశవాణే! అది మిగతా ఆఫీసుల్లా జీతంకాక, కీర్తి ఇచ్చేది!


యు.బి.శర్మ



## 12

**డ్యూటీ ఆఫీసర్ గా చేరింది** ఆకాశవాణి హైదరాబాద్ వివిధ భారతి వాణిజ్యప్రసార విభాగంలోనే అయినా, కార్యక్రమాలలో నేను పాల్గొనడం, రచించడం, రూపొందించడం ప్రధాన కేంద్రంలోనూ జరుగుతూ ఉండేవి. 'స్టాఫ్' కాబట్టి ఉచితంగా సేవలు తీసుకోవచ్చు కనుక అధికారులకూ, అవకాశాలు అందిపుచ్చుకుని ఉద్యోగంలో సంతోషాన్ని, తృప్తినీ పొందగలవీలుంది కాబట్టి మాకూ, ఎలాంటి అభ్యంతరాలకూ తావులేదు!

వివిధభారతిలో ఉదయం ఓ గంటా, మధ్యాహ్నం ఓ అరగంటా, అలాగే రాత్రి ఒక గంటా మినహాయించి నేను చేరిన కొత్తలో తెలుగు కార్యక్రమాలు మరేమీ లేవు. మిగతా రోజంతా బొంబాయి నుండి హిందీ కార్యక్రమాలే రిలే జరుగుతూండేవి. అయితే ప్రసారమయ్యే హిందీ కార్యక్రమాలు అన్నీ నేరుగా రిలేకాదు కానీ.. ఆ టేపులు బొంబాయి నుండి ముందుగా వస్తూండేవి. ఇక్కడ అనౌన్సర్లు వాటిని ప్లే చేస్తూ, లోకల్‌గా బుక్ అయిన వాణిజ్యప్రకటనలను - ఆ కార్యక్రమంలో సరైన విరామాలు తగిన సమయానికి ఇస్తూ, ఆ సమయంలో ప్రకటనలు వేయవలసి ఉండేది. ఆ తర్వాత ఉదయం 'అర్చన' అని ఓ పావుగంట తెలుగు భక్తిగీతాలు, ఉదయం జనరంజని, మధ్యాహ్నం జనరంజని, రాత్రి జనరంజని శ్రోతలు కోరిన సినిమా పాటల కార్యక్రమాలు, మధ్యాహ్నం పన్నెండు గంటలకు 'మణిమాల' కార్యక్రమాలూ వివిధభారతిలో ప్రసారమయ్యేవి. పండుగలకూ, ప్రత్యేక సందర్భాలకు ప్రసారమయ్యే 'ప్రత్యేక జనరంజని' కార్యక్రమాన్ని సినీ ప్రముఖులతో రూపొందించడం జరిగేది. వారు స్టూడియోకు వచ్చినప్పుడు ఉండే కళకళలు వేరే చెప్పాలా?

అప్పట్లో వాణిజ్య ప్రకటనలు కేవలం వివిధభారతి వాణిజ్య ప్రసార విభాగంలోనే ఉండేవి. ప్రధానమైన హైదరాబాద్, ఎ,బి కేంద్రాల ద్వారా ప్రసారమయ్యే కార్యక్రమాల్లో ఆ రోజుల్లో ప్రకటనలు ఏమీ ఉండేవి కావు. అంచేత వివిధభారతి కుండే స్పెషాలిటీయే వేరు! అప్పట్లో ప్రైవేట్ ఛానల్స్ ఏమీ లేవుకూడా కదా! అంచేత వ్యాపారరంగంలోనూ వివిధభారతి రేడియోనే 'రారాజు!' 'స్పాట్స్,' 'జింగిల్స్' అనే - పది పదిహేను సెకన్ల నుండి - నిమిషం వరకూ ఉండే ప్రకటనలూ, అనౌన్సరే చదివే ఏడు సెకండ్ల (పదిహేను పదాలలోపు ప్రకటనగా) 'టైం చెక్' కాక, పదినిముషాల నుండి - పావుగంటవరకూ ముఖ్యంగా రాత్రివేళల్లో 'నీరాజనం' పేరిట ప్రాయోజిత కార్యక్రమాలు

(స్పాన్సర్డ్ ప్రోగ్రాంలు) ప్రసారం అయ్యేవి. స్థానికంగా రేడియో ఏజెన్సీల ద్వారా, బయటనే రికార్డు చేసి వ్యాపార దారులు వాటిని వివిధభారతి కేంద్రం ద్వారా ప్రసారం చేయడానికి 'టారిఫ్' ప్రకారం డబ్బు చెల్లించేవారు. ఆయా ప్రకటనలకు ప్రసార సమయాలు నిర్దుష్టంగా పేర్కొనబడి, 'స్పాట్స్ క్యూ షీట్' కార్యక్రమాల క్యూషీట్‌తో బాటు ప్రత్యేకంగా ఉండేది! కచ్చితంగా ఆ సమయంలో ఆ ప్రకటనలు ప్రసారం కావలసిందే 'సి.బి.ఎస్' డ్యూటీ ఆఫీసర్‌గా ప్రత్యేక శ్రద్ధ వాటి ప్రసారం మీదే అనివార్యంగా ఉండాలి! అనౌన్సర్ మరిచిపోతున్నట్టు అనిపిస్తే వెళ్ళి గుర్తుచేసి సమయం మించిపోకుండా ఆయా ప్రకటనలు వెళ్ళేలా చూసేవాళ్ళం. అంతేగానీ ఎప్పుడు తప్పు జరుగుతుందా, ట్రాన్స్‌మీషన్ రిపోర్ట్ రాసి బాధ్యులకు మెమోలు ఇప్పిద్దామా.. అనే వైఖరి ఉండేది కాదు.


ఆకెళ్ళ సత్యమూర్తి

తన అనారోగ్యం వల్ల శ్యమంతకమణి, 'కేరేజాట్'తనం వల్ల ఇందిరా బెనర్జీ - అప్పట్లో ఉన్న అనౌన్సర్లలో కొంత భిన్నంగా తోచేవారు! సిగరెట్ కాల్చుకోవడం కోసం బయటికొచ్చి సత్యమూర్తి ఎప్పుడయినా స్టూడియోలోకి మళ్ళీ సమయానికి చేరక, కొంత నిర్లక్ష్యం వల్ల ఉమాపతి కూడా డ్యూటీలో ఉన్నారంటే అప్రమత్తంగా ఉండాల్సిన అగత్యం ఎక్కువగా నేను ఫీలయ్యేవాడిని! జోత్స్న, సీతాదేవి, నిర్మలా వసంత్, ఇలియాస్, సత్యమూర్తి ఉంటే కొంత నిశ్చింతగా అనిపించేది. షిఫ్ట్ డ్యూటీలు కాబట్టి 'మా డ్యూటీ ఆఫీసర్ ఎవరు' అని అనౌన్సర్లూ, 'మాతో షిఫ్ట్‌లో అనౌన్సర్లు ఎవరు' అని డ్యూటీ ఆఫీసర్లూ.. చూసుకోవడం మామూలే! అలాగే లైక్ మైండెడ్ ఇంజినీర్లూ షిఫ్ట్‌లో ఉంటే ట్రాన్స్‌మిషన్ సాఫీగా సాగిపోతుంది. ప్రసారమాధ్యమం ఏదయినా ఒక 'సమిష్టికృషి'. అందరూ కలసి పని చేసేది అశేష శ్రోతజనావళి కోసం! మొదట్లో అనౌన్సర్లు, డ్యూటీ ఆఫీసర్ల ఛార్ట్‌లు వారం వారం ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్ కో ఆర్డినేటర్('పెక్స్‌కో'అంటాం) గా ఉండే వేదగిరి శర్మ వేసేవారు. ఆయనకు మద్యపాన వ్యసనం ఉండేది. దానిని సాకుగా చేసుకుని ఆయనను 'ఖుషామత్' చేసి, తమ ప్రయోజనాలు నెరవేర్చుకున్న వాళ్ళున్నారంటారు.


ఆకెళ్ళ సీతాదేవి

డ్యూటీ ఆఫీసర్ అనబడే ట్రాన్స్‌మిషన్ ఎక్జిక్యూటివ్ ను 'ట్రెక్స్' అనీ, ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్‌ను 'పెక్స్' అనీ, కో ఆర్డినేటర్‌ని 'పెక్సికో' అనీ, అలాగే అసిస్టెంట్ స్టేషన్ డైరెక్టర్‌ని 'ఏఎస్. డి' అనీ, స్టేషన్ డైరెక్టర్‌ను 'ఎస్.డి' అనే పొడి అక్షరాలతో వ్యవహరించడం ఆకాశవాణి ఆనవాయితీ! అనౌన్సర్, ప్రొడక్షన్ అసిస్టెంట్ లను అలానే వ్యవహరించగా, స్క్రిప్ట్ రైటర్స్‌ని 'ఎడిటర్'గా వ్యవహరించేవారు. న్యూస్ యూనిట్ లో న్యూస్ ఎడిటర్లు మళ్ళీ వేరు. గ్రామీణ కార్యక్రమాలకూ, కుటుంబ సంక్షేమ కార్యక్రమాలకూ సంబంధించి 'ఎఫ్.ఆర్.ఓ' అని ఫీల్డ్ రిపోర్ట్ ఆఫీసర్లు, 'ఈవో' అని ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్లు ఉండేవారు.

వివిధ భారతిలో మధ్యాహ్నం ప్రసారం ప్రారంభంలోనే ఓ అరగంట 'మణిమాల' కార్యక్రమం ఉండేది. ఏదో అంశం మీద రోజూ సినిమా పాటలతో అనౌన్సర్లు సమర్పించే కార్యక్రమమే అది! నేను చేరిన కొత్తలోనే కొత్తగా ఆ కార్యక్రమం మొదలయ్యింది. 'నిర్మలా వసంత్' కోసం మణిమాల స్క్రిప్టు నేనే రాసిపెట్టాను - ఆవిడ కోరగా. ఆవిడ వాటిని ప్రెజెంట్ చేసేది. 'జనప్రియ'లో ఆదివారం బయటి కళాకారుల చేత కార్యక్రమాలు రూపొందించేవారం. అలాగే 'వినోదవల్లరి'లో హాస్యనాటికలు ప్రసారమవుతూండేవి. మేం డ్యూటీలో ఉండగా వీలు చిక్కినప్పుడల్లా అడిగిన వారికి లేదనకుండా వాటిల్లో పాత్రలకు గళాలు ఇస్తూండేవాడిని. జూన్ 1978లో చేరానా! 'కృష్ణాష్టమి' రోజునే 'లీలాబాలుడు' అనే రూపకాన్ని కొన్ని భాగవత పద్యాలూ, సినిమా పాటల సమాహారంతో ఓ సంగీత రూపకంలాగా పాత్రలు - సంభాషణలతో బాటు నేను రచించి ప్రసారం చేశాను. అరగంటసేపు ప్రసారమైన ఆ కార్యక్రమంలో మా పెక్స్ నరసింహాచారి, మెయిన్ స్టేషన్ అనౌన్సర్ గా ఉన్న జ్యోత్స్నదేవి (జ్యోత్స్న కాదు - ఈవిడవేరు), శమంతక మణి, గోవిందాచారి, చిత్తరంజన్, నేను, ఛాయాదేవి(గాయని), సత్యమూర్తి పాల్గొన్నాం.

'లీలాబాలుడు' పేర బాలకృష్ణుని లీలలతో కూడిన ఆ రూపకానికి శ్రోతల నుండి మంచి ప్రశంసలభించింది. దాని డబ్బింగ్‌లో నాకు అనౌన్సర్ సత్యమూర్తియే బాగా సహకరించిన జ్ఞాపకం! ఉద్యోగంలో చేరిన కొత్తలో వివిధ భారతిలో ఆ ప్రోగ్రాం నాకూ, శ్రోతలకూ బాగా గుర్తున్న కార్యక్రమం. హైదరాబాద్ ప్రధాన కేంద్రం నుండి ప్రసారమయ్యే 'కార్మికుల కార్యక్రమం' - అప్పుడు శ్రీ ఉపద్రష్ట కృష్ణమూర్తిగారు 'పెక్స్'గా చూస్తుండేవారు. అందులో 'నెల్లు-పొల్లు' పేరిట 'స్టాక్ క్యారెక్టర్'గా నేను చేసేవాడిని. కార్మిక సంబంధవిషయాలతో ఆ కార్యక్రమానికి స్క్రిప్టు సమకూర్చేవాడిని. నాటికల్లో చిన్న చిన్న పాత్రలకు ఇచ్చే గాత్రధారణలూ, అత్యవసర అనువాదాలు, ప్రభుత్వ పథకాల ప్రసార సందేశాలు నినాదాలు ఇవన్నీ రాయడం.. మామూలే!

అప్పట్లో కుటుంబ సంక్షేమ కార్యక్రమాలకు రేడియోలో చాలా ప్రాధాన్యం ఉండేది. కుటుంబ సంక్షేమ పక్షోత్సవాలని పదిహేనురోజులు వరుసగా ప్రత్యేక కార్యక్రమాలు ఆ ఏడాది ప్రసారం చేసినప్పుడు హైదరాబాద్ 'ఎ' కేంద్రం నుండి 'కుటుంబ బడ్జెట్' అనే వాక్చిత్రం రచించి ప్రసారం చేశాను. చేరిన ఆరునెలల్లోగానే చేసినవే ఇవన్నీ! అలాగే 'తోరణం' పేరిట బయట పిల్లల వైద్య నిపుణులైన కొందరి ఇంటర్వ్యూలు చేసి ఓ డాక్యుమెంటరీ రూపకం ప్రసారం చేసాను. ఓ.బి(ఔట్ సైడ్ బ్రాడ్ కాస్ట్) ప్రోగ్రాం అంటారు దాన్ని.


ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 33

బాలలం మేం ఒక్కటే

★

సుధామ

కళ్ల లెరుగని వాళ్ళము
ఎల్ల లెరుగని వాళ్ళము
బాలలం మేం ఒక్కటే
లోకమూ మా కొక్కటే

గోధుమ రంగున కొందరు
పసుపువన్నె ఇంకొందరు
తెలుపు, నలుపు, యాపిల్ ఎరుపు
ఏ రంగయినా ముచ్చట గొలుపు

కళ్లలెరుగని వాళ్ళము
ఎల్ల లెరుగని వాళ్ళము
బాలలం మేం ఒక్కటే
లోకమూ మా కొక్కటే ★

[UNICEF రూపొందించిన అంతర్జాతీయ బాలల సంవత్సర గీతానికి స్వేచ్ఛానుసరణం.]

1978 - బాలసాహితీవేత్తగా నాకు ఇప్పటికీ ఒక గుర్తింపు నిలిపిన సంఘటనా ఆ సమయంలోనే జరిగింది. 1979 వ సంవత్సరాన్ని అంతర్జాతీయ బాలల సంవత్సరంగా ప్రకటించి యునిసెఫ్, పిల్లలకోసం ముందు నుండీ తదనుగుణంగా కార్యక్రమాల ప్రసారానికి హేతువయ్యింది. 1978 లో హైదరాబాద్ 'ఎ'లో అప్పుడు బాలానందం, బాలవినోదం, మహిళా కార్యక్రమాలు చూస్తున్న ప్రొడ్యూసర్ శ్రీమతి తురగా జానకీరాణిగారు ఓ ఆదివారం కార్యక్రమానికి 'దేశదేశాల్లో బాలలు' అని ఓ స్క్రిప్టు రాయమని యునిసెఫ్ వారి ఆంగ్ల మెటీరియల్ ఇచ్చారు. ఆ కార్యక్రమం ప్రసారం అయింది. ఆ సందర్భంగానే యునిసెఫ్ కరదీపికలో ఎనభై పంక్తుల ఒక వివరణాత్మక సందేశం వంటిది ఇంగ్లీష్‌లో చదివినప్పుడు కలిగిన స్ఫూర్తితో జానకీరాణిగారు కోరిన మీదట పాట ఒకటి రచించాను.

"ఎల్లలెరుగని వాళ్ళమూ కల్లలెరుగని వాళ్ళమూ
బాలలం మేం ఒక్కటే లోకమూ మాకొక్కటే"




అనే పల్లవితో రూపొందిన ఆ గీతం అంతర్జాతీయ బాలగీతంగా, తెలుగుపాటగా ప్రసిద్ధమైంది. యునిసెఫ్ గీతానికి అనువాదం అన్నాం కానీ, కేవలం ఆ స్ఫూర్తితో తెలుగులో స్వతంత్ర్యంగా నే రాసిన గేయమే అది! చిత్తరంజన్ గారు దానికి సంగీతం సమకూర్చగా - ఆ ఏడాది నవంబర్ 14 న బాలలదినోత్సవం సందర్భంగా రవీంద్రభారతి వేదికపై వందమంది పాఠశాల విద్యార్థులు దానిని గానం చేశారు. అంతకు ముందు రేడియోలో పాటగా రూపొందినప్పుడు ఆ పాటపాడినవాళ్ళలో అప్పుడు పిల్లలుగా ఉన్న నేటి లిటిల్ మ్యుజీషియన్ అకాడమీ వ్యవస్థాపకుడు ప్రముఖ గాయకుడు శ్రీ కె.రామాచారి, టివీ, సినీ సంగీత దర్శకుడు శ్రీ బంటి కూడా ఉన్నారు. ఆ పాట 1979 లో పాఠశాల విద్యార్థుల కార్యక్రమంలో 'ఈ పాట నేర్చుకుందా'గా చిత్తరంజన్ గారితో నేర్పించబడి ప్రసారమైంది. దానితో పాఠశాల వార్షికోత్సవాల్లో, వేడుకల్లో అది చోటు చేసుకుంది. ప్రస్తుతం 'పెద్దబాలశిక్ష' గ్రంథంలో కూడా పిల్లల పాటగా అది నమోదు కావడం, అన్నింటికన్నా ముఖ్యంగా ఎందరెందరి పిల్లలకో.. వారు నచ్చే, మెచ్చే పాడుకునే పాటగా రూపుదాల్చడం

నాకెంతో ఆనందం కలిగించే విషయం! ఉద్యోగంలో చేరిన ఆరునెలలలోపే నాకు చిరయశస్సును తెచ్చిపెట్టిన ఈ ఘటన జరగడం కేవలం అదృష్టం. పెద్దల ఆశీర్వచనం. అంతే..!


శ్రీమతి నిర్మలా వసంత్

శ్రీమతి నిర్మలా వసంత్ 'మణిమాల' కార్యక్రమాలకు తొలుత సహకరించిన నేను - ఉద్యోగంలో చేరడానికి ముందునుండే వివిధభారతిలో అయిదునిమిషాల మధు-లత రెండు పాత్రల సంభాషణగా - సీరియల్‌గా ప్రసారమవుతూ వచ్చిన 'పూలజల్లు' కార్యక్రమానికి పలు స్క్రిప్ట్‌లు రాసి, మధు-లతలుగా వేసిన ఇలియాస్ - జ్యోత్స్నలు ఆ కార్యక్రమం ద్వారానే సన్నిహితమై, నిజజీవితపు జంటగా మారడానికి ప్రేరకాంశాల్లో భాగమైనాననుకుంటుంటాను! అప్పటికే ముగ్గురు పిల్లల తల్లి అయిన జ్యోత్స్నను ఆమె అనుభవిస్తున్న సంసారపు నరకం నుండి సముద్ధరించి, తన ఏకైక పత్నిగా స్వీకరించడం 'ఇలియాస్ అహ్మద్' సంస్కారంగానే నేనెప్పుడూ భావిస్తాను! అనౌన్సర్స్ జంటగా వారిదో విశిష్టగాథే!



## 13

**నేను ఆకాశవాణిలో చేరడమే** వివిధభారతి వాణిజ్య ప్రసార విభాగంలో కావడంతో - అనివార్యంగా సినిమా పాటలతో, సినిమాలతో అభిరుచి, ఆసక్తి ఏర్పడింది. ప్రసారాలలో అధికభాగం హిందీ, తెలుగు సినిమా పాటలు వినడమే కదా! అప్పటిలో ఆకాశవాణి ఒక్కటే నిరక్షరాస్యుడిని కూడా చేరే ప్రసార మాధ్యమం కావడంతో సినిమా నిర్మాతలు రేడియోలో సినిమాల ప్రకటనలూ, సినిమాల ప్రాయోజిత కార్యక్రమాలూ ప్రసారం చేసేవారు. అందుకు వాళ్ళకయ్యే ఖర్చు కూడా ఆనాటి 'టారిఫ్'ల ప్రకారం తక్కువే! ప్రయోజనం మాత్రం ఎక్కువ. తెలుగు సినిమా ప్రాయోజిత కార్యక్రమాలతో పాటు, ఈనాడు గ్రూప్ వారి 'ప్రియా' పచ్చళ్ళకు కూడా వ్యాపారాత్మకంగా 'ఆదివిష్ణు'వంటివారు చేసిన హాస్య రచనలతో ప్రాయోజిత కార్యక్రమాలు ప్రసారం అయ్యేవి. అవన్నీ చాలా పాప్యులర్.

అప్పట్లో వివిధభారతి హైదరాబాద్‌లో లైబ్రేరియన్‌గా ఉన్న ఎం.శ్యామసుందరి, అనౌన్సర్ ఆకెళ్ళ సీతాదేవి తెలుగు సినిమా పాటలకు ఒక రెడీ రిఫరెన్స్ అన్నట్లుండేవారు. ఫలానా పాట ఏ చిత్రంలోదని అనుమానం వచ్చినా, పాడిన వారి గురించయినా, ఆఖరకు ప్రొడక్షన్స్ గురించి కూడా - అందరికన్నా ఎక్కువ తక్షణ సమాచారం వారు ఇద్దరూ టక్కున చెబుతూండేవారు!

నిజానికి నా చిన్నప్పుడు నేను సినిమాలు చూసింది చాలా తక్కువ. నేను హె.ఎస్.సి ప్యాసయి కాలేజీకి వచ్చేనాటికి నేను చూసిన సినిమాలు మహా అయితే ఓ ఎనిమిదో పదో. స్కూల్లో ఉండగా 'కాబూలీవాలా' నేను చూసిన తొలి సినిమా. 'ఝనక్ ఝనక్ పాయల్ బాజే', 'దో ఆంఖే బారాహాత్' స్కూలింగ్ రోజుల్లోనే చూశాను. వేసవి సెలవులకు మా అమ్మమ్మా వాళ్ళ ఊరు అనకాపల్లికో, మా బాబాయ్‌గారి - కాకినాడకో వెడితే సినిమాలు చూడడం ఉండేది. 'సంసారం', 'మాయాబజార్', 'లవకుశ' అలా చూసినవే! మా నాన్నగారు అప్పటికే ఎక్కువ ఆధ్యాత్మిక మార్గంలో ఉండేవారు కనుక, అందునా ఇంట్లో ఆరుగురు పిల్లలం కనుక, ఆనాటి ఆర్థిక పరిస్థితుల దృష్ట్యాకూడా అయివుండవచ్చు - అసలు ఇంట్లో సినిమాలు చూడడానికి ప్రోత్సహించేవారు కాదు. 'సెకండ్ షో' చూడడం అంటేనే ఒక విప్లవ చర్య క్రింద జమ అన్నమాట!



నేను కాలేజీలో చేరాక ఆంధ్రప్రభ, ఆంధ్ర జ్యోతి వంటి వాటిల్లో కార్టూన్లు వేయడం వల్ల, అయిదురూపాయలూ, పదిరూపాయలూ పారితోషికాలు వస్తూండేవి 'ఎం.ఓ'లుగా. దానితో కొంచెం స్వతంత్రంగా సినిమాలు చూడడం చేసేవాడిని. ముందుగా టిక్కెట్టు రిజర్వ్ చేసుకుని 1970లో బాపూగారి 'బాలరాజుకథ' సినిమా చూడడం, అప్పుడు కౌంటర్లో బాపు కార్టూన్లతో సినిమా ప్రచారపు చిన్నపుస్తకం, గణపతి బొమ్మ ఇవ్వడం బాగా గుర్తు! ఆ చిన్ని పుస్తకం ఎక్కడో పోయింది గానీ, ఆ గణపతి బొమ్మ 'బాలరాజు కథ' అని ఎలక దగ్గర ముద్రించి పంచింది ఇప్పటికీ ఉంది నాటి తీపి గుర్తుగా.

ఇంతకీ ఈ సంగతంతా ఎందుకంటే 'వివిధభారతి'లో ఉద్యోగం - సినిమాల పట్ల అభిరుచి పెంచిందని చెప్పడానికి. ఈనాడు గ్రూప్ వారి 'సితార' సినీవారపత్రికకు రేడియోలో వార్తలు చదివిన శ్రీ పన్యాల రంగనాథరావుగారే తొలుత కొన్నాళ్ళు ఎడిటర్‌గా ఉన్న విషయం చాలామందికి తెలియకపోవచ్చు! ఆ తరువాత మా మిత్రుడు, కథా రచయిత కొంపెల్ల విశ్వం 'సితార' చూసేవాడు. ఆపై ప్రముఖ కథా రచయిత శ్రీకంఠమూర్తి సితార సంపాదక బాధ్యతలు వహించాడు. కీ.శే శ్రీకంఠమూర్తి కారణంగానే - నాకు ఆర్ట్ సినిమా గురించీ, ప్రత్యామ్నాయ సినిమా మాధ్యమం గురించీ తెలిసింది. 'కాడు', 'సంస్కార' వంటి కన్నడ చిత్రాలు తనే నాకు చూపించాడు. తాను ఒరిజినల్‌గా 'కన్నడిగ'.

శ్రీకంఠ మూర్తే నన్ను సినిమా సమీక్షకునిగా చేశాడు. 'సితార' లో సినిమా సమీక్షలు గుడిపూడి శ్రీహరి చేస్తున్న రోజుల్లోనే - నా చేత కూడా శ్రీకంఠమూర్తి సినిమా సమీక్షలు రాయించాడు. థియేటర్‌లో మొదటిరోజు సినిమా విడుదలకాగానే టిక్కెట్టు కొనుక్కుని చూసి శుక్రవారం చూసిన ఆ కొత్త సినిమా సమీక్ష, శనివారం ఉదయం పదింటికల్లా రాసి అందచేయాల్సి ఉండేది. సినిమా విలేఖరులకు ప్రివ్యూలు, ప్రెస్‌మీట్ల స్థాయికి వెళ్ళడం ఆ తరువాత సంగతి! షిఫ్ట్ డ్యూటీల సుఖం ఏమిటంటే - శుక్రవారం మార్నింగ్ డ్యూటీ చేస్తే, మళ్ళీ శనివారం ఏ నైట్ డ్యూటియో ఉండేది! అంచేత మొదటి ఆట సినిమా విడుదలైన శుక్రవారం చూసేసి శనివారం ప్రొద్దున్నే ఆ అడిగిన సినిమా మీద రివ్యూ రాసిచ్చేవాడిని. సినిమా పజిల్స్ ఇవ్వడమూ అప్పుడే మొదలుపెట్టాను.


సినీ మా రివ్యూ
ఎన్నెన్నో మలుపులు
కన్నవారిల్లు

మొదలు వివిధభారతిలో చేరడం, సితారలో సినిమా సమీక్షలు తరచు రాస్తూండడం 1978లోనే. నాకు గుర్తుంది - 'సితార' వారపత్రికలో 'కన్నవారిల్లు' సినిమా పై నా తొలి సమీక్ష జూన్ నాల్గవ తేదీ సంచికలో వచ్చింది. అప్పటినుంచి నెలకు ఒక సినిమా అయినా తప్పక రివ్యూ రాస్తూండేవాడిని. వృత్తికి కూడా సినిమా పరిజ్ఞానం అవసరం కావడంతో సినిమాల గురించీ, పాటల గురించీ, సినీకవులు, రచయితలు, కళాకారుల గురించి ఆసక్తిగా షెడ్యూలింగ్‌కూ ఉపయోగపడుతుందని డ్యూటీ ఆఫీసర్‌గా నేను ఒక రిజిష్టర్ పెట్టి, అందులో టాపిక్ వైజ్‌గా, పండుగలకు సంబంధించీ - సినిమాల్లో ఉన్న పాటల పట్టికలు నేను రూపొందించా కూడా. "సినిమాల్లో హాస్య పాత్రలు" అంటూ శ్రీకంఠమూర్తి నా చేత వ్యాసం రాయించి 1978 జూన్ 11 సితారలో ప్రచురించి, సమీక్షలకే కాక సినీవ్యాసాలకూ శ్రీకారం చుట్టించాడు. ఆ వెనువెంటనే 'సినిమాల్లో నేపథ్య

సంగీతం' గురించిన వ్యాసం, తొలి సినీవ్యాసాలలో నేను రాసిన వాటిల్లో ఒకటి.

సినిమాల ఈ పరిజ్ఞానం - 'మణిమాల', 'జనప్రియ' వంటి కార్యక్రమాలు రూపొందించి ప్రసారం చేయడానికి సహకరించింది. జ్యోత్స్నలాంటి సీనియర్ అనౌన్సర్ కూడా నాతో సంప్రదించి, నాకు స్క్రిప్ట్ రాసి చూపి, సలహాలు తీసుకోవడం సరదాగా ఉండేది! సినిమా ప్రకటనలు వివిధ భారతిలో బుక్ చేసే రేడియో కమర్షియల్స్ ఏజెన్సీవారు స్టేషన్ డైరెక్టర్‌కూ, మా పై అధికారులైన ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్‌లకూ అప్పట్లో సినిమా పాస్‌లు కూడా అప్పుడప్పుడు ఇస్తూండేవారు. శ్రీ అజీజ్ ఖురేషి ఇంటిమీదుగానే నేను మా ఇంటికి వస్తూండవలసి ఉండేది కనుక, ఆయన ఇంట్లో పాస్‌లు ఒకటి రెండుసార్లు నేను అందచేయడమూ గుర్తు! ఆయనంటే మొదట్లో కొంచెం 'జంకు' ఎక్కువగా ఉండేది. ఒకసారి జ్యోత్స్న మధ్యాహ్నం డ్యూటీలో ఉండగా నేను డ్యూటీ ఆఫీసర్‌గా ఉన్నాను. 'జనరంజని' శ్రోతలు కోరిన పాటల్లో - పాటవేయడానికి ముందు కోరిన వారి పేర్లు చదువుతూ, "ఓల్డ్ మలక్ పేట్ నుండి అజీజ్ ఖురేషి" అని చదవడంతో - అనౌన్సర్ బూత్‌కు డ్యూటీ రూం నుండి వెంటనే వెళ్ళాను. అనౌన్సర్ బూత్‌లో ఖురేషిగారు ఎదుటగా కుర్చీలో కూర్చుని నేను రావడంతోనే 'డ్యూటీఆఫీసర్‌గా నువ్వెంత శ్రద్ధగా మానిటర్ చేస్తున్నావో చూద్దామని నేనే నా పేరు చదవమన్నాను" అన్నాడు నవ్వుతూ. అలాంటి తమాషాలు, తలతిక్కలు ఆయనకుండేవి. కొంత 'ఆడపిచ్చి' కూడా ఉందని చెప్పుకునేవారు. జ్యోత్స్న, ఇలియాస్‌లను ఆయన చాలా ఇబ్బంది పెట్టడం, వాళ్ళమీద, వాళ్ళు డ్యూటీల్లో ఉండగా చిన్న తప్పు జరిగినా డ్యూటీ ఆఫీసర్ల చేత ట్రాన్స్‌మిషన్ రిపోర్టులు రాయించి, మీటింగ్‌లో న్యూన పరచడం జరిగేది. నిజమో, పుకారో నాకయితే తెలీదుగానీ -"నేనూ ముస్లింనే. ఇలియాస్ మాత్రమే కాదు" అంటూ ఓ సారి చెయ్యిపట్టుకోబోయాడని చెప్పుకునేవారు. ఏమయినా జీవితంలో ఎన్నో ఢక్కామొక్కీలు తిని రాటుదేరిన జ్యోత్స్న, అనౌన్సర్‌గా శ్రోతల అభిమానపాత్రమైన వ్యక్తి! శారదా శ్రీనివాసన్ గారి తరువాత జ్యోత్స్న గళానికి అంతటి అభిమానపాత్రత ఉండేది. నేనూ, తనూ కలిసి ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో అయిదారు సంవత్సరాలు 'పరిచయపత్రం' శ్రోతల ఉత్తరాలకు జవాబులు కార్యక్రమం చేసాం ఆ తరువాత.


జ్యోత్స్న


ఇలియాస్

1979 ఫిబ్రవరిలో ట్రాన్స్‌మిషన్ ఎక్జిక్యూటివ్స్ అనబడే డ్యూటీ ఆఫీసర్లకు హైదరాబాద్‌లోనే రిఫ్రెషర్స్ కోర్సు జరిగింది. ఢిల్లీలో ప్రధాన శిక్షణా కేంద్రంగా ఉండగా హైదరాబాద్‌లో కూడా ప్రాంతీయ శిక్షణా విభాగం ఉంది. మా వివిధభారతి ఆఫీసు మేడమీదనే RTI (p) రీజనల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (ప్రోగ్రామ్స్) కూడా ఉండేది. మద్రాసు, పాండిచ్చేరి, బెంగుళూరు, గుల్బర్గా, ధార్వాడ, మంగుళూరు నుండి కూ వచ్చిన 'ట్రెక్స్'లు దాదాపు ఓ పదిమందికి పైగా, ఆ శిక్షణలో పదిరోజులు కలిసి గడపడం, వివిధ రాష్ట్రాలలో ఆకాశవాణి కేంద్రాలలో ట్రాన్స్‌మిషన్ నిర్వహణాధికారులుగా మా అనుభవాలను కలబోసుకోవడం, జరిగింది. 'నయగరా' కవుల్లో ఒకరయిన కీ.శే.ఏల్చూరి సుబ్రహ్మణ్యంగారి అబ్బాయి శ్రీఏల్చూరి మురళీధర్ కూడా విజయవాడ ఆకాశవాణిలో మాలానే డ్యూటీ ఆఫీసర్‌గా చేస్తూ, ఆ ట్రైనింగ్‌లోనే కలిసాడు. ఆ తరువాత కొన్నేళ్ళకు తను ఢిల్లీ శ్రీ వెంకటేశ్వరా విద్యాలయానికి లెక్చరర్‌గా వెళ్ళిపోయాడు. తను మంచి విద్వత్తుగలవాడు. ఆ శిక్షణా కేంద్రానికి డైరెక్టర్‌గా శ్రీ భద్రవ్రత గారున్నారప్పుడు. ఆకాశవాణి కేంద్రానికి (హైదరాబాద్ ప్రధాన కేంద్రానికి) శ్రీ జె.డి. బవేజా డైరెక్టర్‌గా ఉండేవారు. శ్రీ నండూరి విఠల్ అప్పటికి దూరదర్శన్ కేంద్రం డైరెక్టరయ్యారు. అప్పటికే ఆకాశవాణి నుంచి రిటైరయిన స్టేషన్ డైరెక్టర్లు శ్రీ బాలాంతరపు రజనీ కాంతరావుగారు, శ్రీ అయ్యగారి వీరభద్రరావుగారు, అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉన్న శ్రీపి.శ్రీనివాసన్ గారు - ట్రాన్స్‌మిషన్‌కూ, కార్యక్రమాలకూ సంబంధించిన తరగతులు తీసుకున్నారు. డ్యూటీస్ గురించీ, రోజువారీ సమస్యలగురించీ, ఆకాశవాణి ప్రజా


శ్రీఎన్.సి.నరసింహాచార్యులు


భద్రవ్రత

సంబంధాలగురించీ, మైక్రోఫోన్లు, స్టూడియోల సంవిధానం గురించి స్టేషన్ ఇంజినీర్, అలాగే క్యూషీట్స్, లాగ్‌బుక్స్, ప్రోగ్రాం తయారీ వంటివాటితో... నేను వృత్తిరీత్యా పాల్గొన్న ఆ శిక్షణా తరగతి, మొదటిది కావడంతో, నాకు ఎంతో ఉత్సాహకారకంగా గుర్తుండిపోయింది!




నేను వివిధ భారతిలో ట్రాన్స్‌మిషన్ ఎక్జిక్యూటివ్‌గా ఉండగా మాకు పెక్స్(కో) (ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్ కో ఆర్డినేటర్)గా ఉన్న శ్రీఎన్.సి.నరసింహాచార్యులుగారు (శ్రీ నల్లాన్ చక్రవర్తుల నరసింహాచార్య) ఎంతో సిస్టమాటిక్‌గానూ, ఎంకరేజింగ్‌గానూ ఉండేవారు. ఆయన పనిచేసే విధానం ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉండేది. నేను ఆకాశవాణిలో తదనంతర కాలంలో 'పెక్స్‌కో' అయ్యాక, ఆయన మార్గాన్నే అనుసరించినందునే మంచిపేరే తెచ్చుకోగలననుకుంటూ ఉంటాను ఇప్పటికీ. 'చక్రవర్తి' పేర ఆయనకూడా 'దాసవర్యాః కనకః' వంటి సంస్కృత నాటికలు రాసి, ప్రసారం చేసినవారు. తొలుత కొహిమా వంటి నార్త్‌ఈస్ట్ ప్రాంతాల్లో, విజయవాడలో డ్యూటీ ఆఫీసర్‌గా చేసి, ప్రమోషన్ మీదనే ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్‌గా వివిధభారతిలో చేస్తుండేవారు. వృత్తిపరంగా నాకు ఎలాంటి సలహా, సంప్రదింపులయినా అప్పట్లో ఆయననుండే పొందేవాడిని. నేను ఉద్యోగంలో చేరాకనే ఉస్మానియా యూనివర్సిటీలో ఎం.ఫిల్ పూర్తి చేయగలిగానంటే - అందుకు ఆయన సహకారమూ ఓ కారణం! 2007 జనవరిలో వివిధభారతి హైదరాబాద్ కేంద్రం నుండే నేను పెక్స్‌కోగా, డి.డి.ఓగా ఉండగా ఆయన డైరెక్టర్‌గా రిటైరవడం ఓ చిత్రం!




## 14

1979 **అంతర్జాతీయ బాలల సంవత్సరం.** ఆ ఏడాది ఆకాశవాణిలో - పిల్లల విద్య - వికాసం - ఆరోగ్యం మొదలయిన అనేక పార్శ్వాలను గురించి బోలెడు కార్యక్రమాలు ప్రసారం అయ్యాయి. నా 'బాలలం మేం ఒక్కటే' - గీతం అంతర్జాతీయ గీతంగా, రేడియోలోనే కాదు, అనేక పాఠశాలల్లోనూ ప్రాచుర్యం పొందింది. 'ఈ పువ్వులను పూర్తిగా వికసించనిద్దాం' అనే రూపకం ఒకటి - వీధి బాలల సమస్యలను గురించి కూడా బయటి ఇంటర్వ్యూలతో రూపొందించి, వివిధభారతి నుండే జూన్'19 న ఆ ఏడాది నేను ప్రసారం చేసాను. అలాగే నవంబర్ 14, 1979 న మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్ కేంద్రం నుండి పిల్లల కార్యక్రమంలో పిల్లల ఆరోగ్యం, ముఖ్యంగా టీకాల ప్రాధాన్యం తెల్పుతూ, నేను రాసిన సంగీత రూపకం (ఒక పాట కథ లాంటిది) 'ఒకనాటి కల' ప్రసారమయింది. టీకాలు పిల్లలకు స్నేహితులనీ, పాఠశాలల్లో టీకాలు వేస్తూండే నాటి సదుపాయాన్ని పిల్లలు వదులుకోరాదనీ, చేసిన ఆ రచనకూ మంచి ప్రాచుర్యం వచ్చింది. దానిని పిల్లలు రవీంద్ర భారతి వేదిక మీద అభినయించారు. 1979 ప్రారంభంలోనే జనవరి 9 న మా వివిధభారతి మణిమాలలో 'బాలలారా రండి' అనే కార్యక్రమం నేను రచించి, రూపొందించి, ప్రసారం చేసి అంతర్జాతీయ బాలల సంవత్సరానికి స్వాగత కార్యక్రమం చేసాను. మార్చి 28 న కార్మికుల కార్యక్రమంలో కూడా 'బాల్యం' గురించి నేను రచించిన స్కెచ్ ప్రసారమయింది.

"అమ్మా చూడే బడి ఎగ్గొట్టి
వచ్చేసిందే మన చెల్లాయి
చెప్పకుండా పారిపోతే
తప్పుకదమ్మా! అసలు తప్పుకదమ్మా.."

అంటూ చెల్లెలిపై అన్న పితూరీతో మొదలయ్యే 'ఒకనాటికల' సంగీత రూపకంలో టీకాలకు భయపడి పారిపోయి వచ్చిన పిల్ల కలలో - 'టీకాలం మేం టీకాలం - స్నేహితులం మీ స్నేహితులం - భయమెందుకు ఓ పిల్లల్లారా - మీ బాగుకోరే మేం ఉన్నాం' అంటూ డి.టి.పి, ఓరల్ డ్రాప్స్, మొదలైన వాటిగురించి వివరించడం జరిగింది. నాటి రేడియో అక్కయ్య తురగా జానకీరాణిగారు

తర్వాతకాలంలో దీన్ని పాలగుమ్మి విశ్వనాథం గారిచే పునస్సంగీత పరచి, ఓ ఇంటర్నేషనల్ బ్రాడ్ కాస్టింగ్ పోటీలకు పంపించారు కూడాను. అక్కడా అది ప్రశంసలు పొందింది.


CERTIFICATE

Certified that this Dissertation is a bonafied record of work done by Sri A. Venkata Rao, B.A., M.O.L., a student of M. Phil., under my guidance and supervision during the academic year 1977-1980, at the department of Telugu, Osmania University, Hyderabad.

Hyderabad
Dt. 25-8-80.

Dr. ARIPIRALA VISWAM M.A., Ph.D.
Telugu Lecturer, New Science College
Deptt. of Telugu, Osmania University
HYDERABAD




1980 లో మార్చి తరువాత ఒకటి రెండు నెలలు విడతల వారిగా సెలవు తీసుకుని, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నేను చేస్తున్న ఎం.ఫిల్ పరిశోధన "తెలుగు అభ్యుదయ కవిత్వంలో భావచిత్రాలు" (IMAGERY IN PROGRESSIVE TELUGU POETRY) సిద్ధాంత గ్రంధ రచన దాదాపుగా పూర్తిచేసాను. నాకు గైడ్ డా.అరిపిరాల విశ్వంగారు. ఆయన న్యూసైన్స్ కళాశాలలో పనిచేస్తుండేవారు. మంచికవిగా ప్రసిద్ధులు. వారూ, ఎ.మురళీధర్ వంటి వారూ నిఖిలేశ్వర్ వంటి యువకవులకు (అప్పటికి నిఖిలేశ్వర్ కాదు, కె.యాదగిరి రెడ్డియే! దిగంబర కవుల్లో చేరాక ''నిఖిలేశ్వర్' అయ్యాడు) ఎంతో స్ఫూర్తిగా ఉండేవారు. ఇంటర్నేషనల్‌గా కూడా ఇంగ్లీషులోనూ కవిత్వం రాసి అరిపిరాల విశ్వం కవిగా ఖ్యాతితో ఉండేవారు. అయితే అప్పటికే విశ్వంగారు తాత్త్వికతలోకి ప్రయోగించి, 'పరంపరా' అనే కేంద్రాన్ని కూడా నిర్వహిస్తూ, దాదాపు పూర్తిగా ఆధ్యాత్మిక, తాంత్రిక మార్గంలోకి మళ్ళారు. తనకు నా తరువాత ఇంక ఏ విద్యార్థినీ పరిశోధనకు పంపవద్దని, యూనివర్సిటీకి ఉత్తరం రాసి, నా చేతనే అందింపచేసారు కూడాను! ఆయన నా సిద్ధాంత గ్రంథం ప్రత్యక్షరం చదివారు. ఒక అధ్యాయం రాయడానికి రెండు నెలలు... ఆయన ఆమోదానికై తిరిగాను. "నీకు ఎం.ఫిల్. డిగ్రీ ఎలాగయినా వచ్చేస్తుంది. దానికేం ఫర్వాలేదు. కానీ నీ సిద్ధాంత రచన ప్రామాణికంగా ఉండాలి. నువ్వు రాయగలవు" అని నేను డీలా పడిపోకుండా ప్రోత్సహించి, తన స్వంత లైబ్రెరీ నుండి ఇంగ్లీషు పుస్తకాలు ఎన్నో రిఫరెన్స్‌కు ఇచ్చారాయన.


డా.అరిపిరాల విశ్వం

ఆ తరువాత డా.అరిపిరాల విశ్వం తాను 'స్వామీ ఆనందఘన'గా మారిపోయారు. శశాంకగారి కుమారుడైన నేటి దూరదర్శన్ కార్యక్రమ నిర్వహణాధికారి ఓలేటి పార్వతీశం ఇటీవల చెప్పేంతవరకూ నాకు తెలియనే లేదు, అరిపిరాల 2011 జనవరి మొదట్లోనే అనంతపురం నుండి కార్లో హైదరాబాద్ వస్తూ రోడ్డు ప్రమాదంలో మరణించారని. 'రేపటి స్వర్గం', 'మనస్,' 'హళేబీడు' వంటి తన కావ్యాల ద్వారాకవిగా, అందునా ఒక గొప్ప తాత్త్విక కవిగా డా.అరిపిరాల విశ్వంగారు (ఆయనకేమీ పట్టదన్నమాట నిజమేగానీ) నిజంగా పొందవలసినంత గుర్తింపు, కవిగా పొందకుండా, ఒక విస్మృత కవిగానే మిగిలిపోవడం సాహిత్య ప్రపంచంలో ఒక లోటే! కవిగా ఆయన ఎంత సహృదయుడు కాకపోతే - 1983 లో నేను జాతీయకవిగా తెలుగుకు ప్రాతినిధ్యం వహిస్తూ, ఆకాశవాణి జాతీయకవి సమ్మేళనానికి ఎన్నికైనప్పుడు మిగతా భాషల్లోకి అది అనువదితమై ప్రసారమయ్యేందుకు, నా కవితను తనే ఆంగ్లంలోకి అనువదించి ఇస్తారు! ఒక శిష్యుడిపై గురువుకు అంత వాత్సల్యం ఉండడం, తానూ కవియై ఉండి శిష్యుడి అభివృద్ధిని అభినందించడం నా అదృష్టమే మరి! ఆయన అజ్ఞాతంగా తన తాంత్రిక ప్రపంచంలోకి వెళ్ళిపోయి, అటునుంచి అటే ఈ లోకం నుండే నిష్క్రమించడం ఇంకా నమ్మశక్యంగానే లేదంటే నమ్మండి! విశ్వం అనంత విశ్వంలో కలిసిపోయారు.

నా రెండేళ్ళ ప్రొబేషన్ పిరియడ్ పూర్తయ్యాక, 1980 జూన్‌లో ఆకాశవాణి వివిధభారతి వాణిజ్య ప్రసార విభాగంలో ట్రాన్స్‌మిషన్ ఎక్జిక్యూటివ్‌గా అఫీషియేటింగ్ కెపాసిటీలోకి వచ్చాను. నేను నా ఉద్యోగ, నా పరిశోధనలలో బిజీ అయి, వివాహం మాట తలపెట్టకపోవడంతో, మా అమ్మా నాన్నగారూ మేనరికం వంటిదే అయిన మా తమ్ముడి సంబంధాన్ని స్థిరపరచాల్సి ఉందనడంతో; తన

వివాహం చేసేయమనీ, నాకు ఉద్దేశం లేదనీ కచ్చితంగా చెప్పాను. అందువల్ల నా కన్నా ముందే మా తమ్ముడి వివాహం మా అమ్మ కజిన్ బ్రదర్ కూతురితో 1980 డిసెంబర్ లో జరిగింది. వాడికి పుట్టిన కూతురు 'సుషమ' నన్ను 'బాబాయ్' అనే అంటుంది. కొందరు మునుపు తండ్రిని బాబాయ్ అనేవారు. మా దగ్గర తండ్రి తమ్ముడినే బాబాయి అనడం అలవాటు.

1980 ఆగస్టు 29 న డా.అరిపిరాల విశ్వంగారు నా సిద్ధాంత రచనను సర్టిఫై చేయగా, ఉస్మానియా విశ్వవిద్యాలయానికి ఎం.ఫిల్ పట్టా పూర్తిచేసేందుకు సమర్పించాను. భావచిత్రాల గురించి పరిశోధించడానికి డా. జి.వి సుబ్రహ్మణ్యంగారు ప్రేరణ ఇవ్వగా, అప్పుడు తెలుగు శాఖాధిపతిగా ఉన్న డా.బిరుదురాజు రామరాజుగారు అనుమతినిచ్చారు. డా.అరిపిరాల విశ్వంగారు గైడ్ చేశారు. ఆ ముగ్గురూ ఇప్పుడు ఈ లోకంలో భౌతికంగా అదృశమైపోయారు. అవిస్మృత సారస్వత మూర్తులు. ఆ ముగ్గురూ నేను నిర్వహించిన రేడియో కార్యక్రమాలలో వచ్చి పాల్గొనడం ఉద్యోగంలో నాకు తృప్తి మిగిల్చిన వాటిల్లో ఒకటి.


రవివర్మ

1980 లో రేడియోలో నేను చేసిన కార్యక్రమాల్లో మా వివిధభారతిలో మే' 18న జనప్రియ కార్యక్రమంలో నేను రచించి సినిమా పాటలతో రూపొందించిన 'ఆకాశానికి అటూ - ఇటూ' అనే కార్యక్రమం ఒకటి. అందులో విశేషం - ఆ రూపకంలోని స్త్రీ - పురుష కంఠాలు శ్రీమతి శారదా శ్రీనివాసన్, శ్రీ జి.జె. రవివర్మలవి కావడం. నా రచన అని వారిద్దరూ ఎంతో ఇష్టంగా వారి స్వరాలు ఇచ్చారు. రవివర్మది కూడా చాలా మంచి కంఠస్వరం. గొప్ప డ్రామా వాయిస్! స్పోర్ట్స్ విభాగంలో ప్రొడక్షన్ అసిస్టెంట్‌గా ముందు చేరినా, ఆ తరువాత అదే విభాగానికి ప్రొడ్యూసర్ అయ్యాడు. కానీ తన ఆసక్తి ఎక్కువగా నాటకాల మీదనే గాలిబ్, వేమన వంటి పాత్రలను రేడియోలో రక్తికట్టించిన గళం తనది. నాతో బాటు మా బ్యాచ్‌లోనే సెలక్ట్ అయి విజయవాడలో చేరిన పి.వి.శారద బదిలీ మీద హైదరాబాద్ వచ్చేసింది. తను వచ్చి చేరిన కొత్తల్లోనే నేను రాసిన 'జీవనజ్యోతి' అనే రూపకంలో ఆసక్తిగా అప్పటికే వివాహమై గర్భిణిగా ఉండి కూడా పాల్గొనింది.


పి.వి.శారద

వివిధభారతిలో ఉద్యోగమయినా హైదరాబాద్ 'ఎ' కేంద్రం కార్యక్రమాలలో పాల్గొనడం జరుగుతూండేదని చెప్పానుగా! ఆపద్ధర్మంగా 'గాంధీమార్గం' చదువుతూండడం, భావవాహిని, రాగం - భావం కార్యక్రమాలకు స్క్రిప్ట్స్ రాసి చదవడం, నాటకాల్లో అవసరార్థం చిన్న చిన్న పాత్రలకు గళం ఇవ్వడం, యువవాణిలో కృష్ణశాస్త్రి, వీరేశలింగంపై ప్రసంగాలు చేయడం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజతోత్సవాలు 1980 లోనే మొదలవడంతో - కేంద్ర, రాష్ట్ర అభివృద్ధి అంశాలకు సంబంధించి ప్రసారం చేయాలని ఆదేశించిన దాదాపు నూటయాభైకి పైగా స్లోగన్స్, జింగిల్స్ రచించడం 1980లోనే. ఇదీ గుర్తున్న ఓ విషయం.

1981 లో వివిధభారతి స్టాఫ్ కన్సల్టేటివ్ కమిటీ ఒకటి ఏర్పరచి, స్టేషన్ డైరెక్టర్ శ్రీ అజీజ్ ఖురేషి నన్నూ అందులో సభ్యుడిని చేశారు. ప్రతి రెండునెలలకోసారి వివిధభారతి వాణిజ్య ప్రసార విభాగం హైదరాబాద్ ఉద్యోగుల సాధకబాధకాల గురించి సమావేశాలయ్యేవి. సమావేశాలేమయినా - ఆయన వ్యవహార సరళి ఆయనిదే!..

'ఈ మాసపు పాట' అని లలిత సంగీత విభాగం ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం నుండి ఒక పాటను, ఈనెలపాటగా ఏ నెలకు ఆ నెల కొత్తగా రాయించి, రూపొందించి ప్రసారం చేయడం ఒక ఆనవాయితీ! ఈ మాసపు పాటగా తను పాట రాయాలని కవులకూ, ఆ పాటకు రూపకల్పన చేయాలని సంగీత దర్శకులకూ, పాడాలని గాయనీ గాయకులకూ ఒక అభిలాషగా ఉంటూండేది. అది ఒక 'ప్రిస్టేజియస్' కార్యక్రమంగా భావించేవారు. మే'1981లో నా చేత అలా ఈ మాసపు పాట రాయించారు. ఒక దేశ భక్తి గీతాన్ని ఈ మాసపు పాటగా ప్రసారం చేయడం కోసం అలా రాసిన పాటే -

"స్వాతంత్ర్యం నా పేరు.

భారతం నా ఊరు
ప్రతి నిత్యం మహోదయం
నా హృదయం కోరు"


వి.రతన్ ప్రసాద్,


పి.వి.సాయిబాబా

అన్న పల్లవితో అప్పటికి వర్ధిష్ణు సంగీత దర్శకుడైన శ్రీ పి.వి.సాయిబాబా సంగీత దర్శకత్వంలో రూపొంది ప్రసారమైంది. ఎవరు పాడారో ఇప్పుడు నాకు గుర్తులేదు. అలాగే ఓ పావుగంట నాటిక రాసి నేనే దర్శకత్వం వహించింది. హైదరాబాద్ 'ఎ' కేంద్రం నుండి 26.3.81 న ప్రసారమయింది. దానిపేరు 'ఇదండీ వరస'. అందులో చిన్నక్క, ఏకాంబరంగా ప్రసిద్ధులైన శ్రీమతి వి.రతన్ ప్రసాద్, వట్టం సత్యనారాయణ కూడా పాల్గొన్నారు. వివిధభారతిలో ఉంటూ ప్రధాన కేంద్రంలో నేనిలా కార్యక్రమాలు రూపొందించడం కొందరికి చిత్రంగా తోచేది! ఇవేమీ విద్యుక్త ఉద్యోగ ధర్మంలో భాగాలు కావు.


వట్టం.సత్యనారాయణ

నిజానికి ట్రాన్స్‌మిషన్ ఎక్జిక్యూటివ్‌లుగా నాతోబాటు వివిధభారతిలోనే నాడున్న శ్రీ జి. విఠలరావు వంటివారు కేవలం తమ విధులకే అంటిపెట్టుకుని షిఫ్టులు చేసి వెడుతూండేవారు కూడాను. ఇది విత్తం కోసం కానే కాదు. ప్రవృత్తిలో ఆనందప్రదమైన 'చిత్తం' కోసం అంతే!




## 15

పత్రికల్లో 'కాలమ్' నిడివి ఎలా ప్రధానమో, రేడియోలో 'కాలం' అంటే, 'ప్రసారసమయ వ్యవధి' కూడా అంత ప్రధానం! ఒక పదిహేను సెకన్ల అంతరాయం కలిగినా - ఎంతో సేపుగా రేడియో ఆగిపోయినట్లు శ్రోతలకు అనిపించేది. ఇప్పుడు పదిహేను సెకండ్లకు రేడియోలో ఒకసారి ఒక ప్రకటన, అందునా పొద్దున్నే జనరంజని వంటి ఏ సినిమా పాటలమధ్యలో ప్రసారం చేయాలంటే - ఆరేడు వందల రూపాయలు కనీసంగా ప్రకటనదారుడు చెల్లించాల్సి ఉంటుందంటే, ప్రతిసెకనుకూ ఎంత విలువో ఆలోచించండి మరి!

విద్యుత్ ప్రసారంలో అంతరాయంవల్ల కూడా ఒక్కోసారి కార్యక్రమాల ప్రసారానికి విఘాతం కలుగుతుండేది. స్టూడియోలో కరెంట్ పోవడానికీ, ట్రాన్స్‌మీటర్‌లో పవర్ పోవడానికీ తేడావుంది. ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం 'ట్రాన్స్‌మిషన్ టవర్లు' హయ్యత్ నగర్‌లో ఉన్నాయి. రేడియో కేంద్రానికీ, ట్రాన్స్‌మిషన్ చోటుకీ పదిహేను కిలోమీటర్ల దూరం ఉండేది. స్టూడియోలో కాక ట్రాన్స్‌మిషన్ సెంటర్లో కరెంట్ పోతేనే, ప్రోగ్రాం రేడియోలో వచ్చేది కాదు. స్టూడియోలో టేప్ మామూలుగానే తిరుగుతూండేది. ట్రాన్స్ మీటర్లలో విద్యుత్ వచ్చాకే మళ్ళీ కార్యక్రమం వినిపించేది. ఎప్పుడయినా నగరంలో బంద్‌లూ, అందునా ఆ రోజుల్లో రాజకీయ పరిస్థితులవల్ల తరుచుగా కర్ఫ్యూలు వంటివీ నగరంలో విధించడం జరుగుతూండేది. అటువంటప్పుడు - ప్రత్యామ్నాయంగా, ప్రసారాల భద్రత నిమిత్తం, కార్యక్రమాల టేప్‌ల కాపీలు ముందుగా ట్రాన్స్‌మీటర్లుకు కూడా పంపడం జరిగేది. స్టూడియోలో ఏమయినా అవాంఛిత పరిస్థితులు ఎదురైనా, ట్రాన్స్‌మీటర్స్ నుండి ప్రసారాలు సాగేవి. అక్కడ అత్యవసర విధులకు ఒకరిద్దరు మనుషులను ముందుగానే పంపుతూండేవారు. శ్రీఎన్.టి.రామారావు తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడక ముందు - రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ముఖ్యమంత్రులను మార్చే సంస్కృతితో, అంతకు ముందు మర్రి చెన్నారెడ్డి, జలగం వెంగళరావ్‌ల కాలంలోనూ - ఎక్కువగా ఉండేవి. ఎన్.టి.ఆర్ పాలనలో గణనీయంగా కర్ఫ్యూలు తగ్గిపోయాయన్నది వాస్తవం! రామ్‌లాల్ గవర్నర్‌గా ఉన్నప్పుడు ఎన్.టి.ఆర్ ని పదవీచ్యుతుని చేసిన సందర్భంలో నగరం అట్టుడికింది - సరే! ఆ రాజకీయాలు అలా ఉంచేద్దాం! ఇంతకీ విషయం - ఎటువంటి పరిస్థితుల్లో నయినా ఎన్ని ఆందోళనలూ, ఉద్యమాలు జరుగుతున్నా, వరదలు, తుఫాన్ల ప్రకృతి బీభత్సాలు వంటివి ఏవి ఎదురయినా - రేడియో ప్రసారాలకు అంతరాయం కలుగకూడదనేదే ధ్యేయంగా ఉండేది.

"విద్యుత్ ప్రసారంలో అంతరాయం కారణంగా కార్యక్రమంలో ఫలానా సమయం నుండి ఫలానా సమయంవరకూ అంతరాయం కలిగినందుకు చింతిస్తున్నాం" అని అనౌన్సర్లు ప్రకటించిన సందర్భాలు ఎన్ని ఉంటూండేవి. డ్యూటీ ఆఫీసర్‌గా - మా డ్యూటీలో ఉన్నప్పుడు నిరంతరాయంగా రేడియో వింటూండడమే ప్రధానమైన డ్యూటీ! అంచేత ట్రాన్స్‌మిటర్లో కరెంట్ పోయినప్పుడు - ఎంతసమయానికి తిరిగి కార్యక్రమం పునరుద్ధరించబడిందో నోట్ చేసి, కంట్రోల్ రూంలో ఇంజనీర్లచేత ఆ సమయం నిర్ధారించుకుని, అనౌన్సర్ బూత్‌లో అనౌన్సర్స్‌కు చెప్పి 'రిగ్రెట్ అనౌన్స్ మెంట్స్' కూడా సాధ్యమైనంత త్వరగా శ్రోతలకు చెప్పించవలసి ఉండేది.

నాకు బాగా గుర్తు! ఒకవేళ విద్యుత్ లోపంకాక మరే సాంకేతిక లోపాల కారణంగా ప్రసారానికి అంతరాయం కలిగినా, ఒకవేళ దాని వ్యవధి ఎక్కువగా ఉన్నట్లయితే స్టేషన్ డైరెక్టర్ గారికి అది మామూలు పనివేళలు కాకపోయినా, ఇంటికి ఫోన్ చేసి తెలియపరచాల్సి


శ్రీ బవేజా

ఉండేది. ఒకసారి అలాగే - ప్రధాన కేంద్రానికి శ్రీ బవేజా గారు డైరెక్టరుగా ఉండగా, ఆయన తరుచు స్టూడియో విజిట్స్‌ను (ఆఫీసు పనివేళలు అంటే వారికి పదినుంచి అయిదు అని కాక) పొద్దున్నో, రాత్రో వచ్చేవారు. ఒకరోజు ఆయన ఉదయమే అలా స్టూడియోకి వచ్చినప్పుడు - చాలాసేపుగా ప్రసారానికి అంతరాయం ఉండడంతో నేను చేతిలో ట్రాన్సిస్టర్ సెట్‌తో - కంట్రోల్ రూంలో కనుక్కుని, డ్యూటీ రూం ఫోన్ నుంచి మా సి.బి.ఎస్ డైరెక్టర్ గారికి ఫోన్ చేద్దామని వస్తూంటే - బవేజాగారు "క్యోం బాగ్ రహే హో! క్యాహువా" అంటూ ఎందుకలా పరిగెడుతున్నావ్? ఏమయింది? అని అడిగారు. ట్రాన్స్ మిషన్‌లో అరగంటపైగా అంతరాయం ఉందని చెప్పాను. ఆయన నవ్వుతూ "రహ్నేదో! లిజనర్స్ విల్ బి హ్యాపీ" అన్నారు. ఆయన అంత జాలీగా, తేలిగ్గా తీసుకోవడం నాకు భలే ఆశ్చర్యం అనిపించింది అప్పుడు. నిజమే! ట్రాన్స్ మిషన్‌లో బ్రేక్ ఉందని కేవలం నేను కంగారు పడడంలో అర్థం ఏముంది? నేను చేయగలిగిందేమీ లేదు. అయినా ఏమిటో 'ఆత్రం' అన్నమాట! బవేజాగారు హాయిగా విలాసంగా ఉండేవారనీ, ఆయనను అప్పట్లో గ్రామస్తుల కార్యక్రమం చూసే ఎన్. ప్రసాదరావుగారు పీపాలో ముంచి తేల్చినట్లుగా నిత్యం పార్టీలలో ఖుషామత్ చేసేవారనీ, వాళ్ళమ్మాయికి ఆయన హయాంలోనే రేడియోలో అందుకే అనౌన్సర్ ఉద్యోగం ఇప్పించుకోగలిగారనీ, కొందరు వ్యాఖ్యానిస్తూ ఉండేవారు.


ఎన్. ప్రసాదరావు

శ్రీ ప్రసాదరావుగారు మంచి భారీమనిషి. గంభీరంగా కనిపించేవారు. ఏదో సినిమాలో తరువాత ఒక ప్రధాన పాత్ర కూడా వేశారు. 'హరిశ్చంద్ర' పేరిటి సాంఘిక చిత్రం అని లీలగా గుర్తు. "మన ఇంతోటి కార్యక్రమాలూ ఓ అరగంట వినబడకపోతే కొంపలేం మునిగిపోవు. శ్రోతలు హమ్మయ్య ఓ అరగంట వ్యవధానం దొరికింది.. ప్రసారలహోరునుండి అని పైగా సంతోషిస్తారు" అని బవేజాగారు ఆ మాట అన్నాక - డ్యూటీ రూములో ఉండి, రేడియో వింటూ, జరిగే పొరబాట్లకు, నేను తెగ టెన్షన్ పడిపోయే స్థితి నుండి, 'అంతటి హోదాలో ఉన్న డైరెక్టర్ గారే అంత లైట్‌గా ఉన్నారే' అన్న భావనవల్ల, నిజంగా నేనూ కొంత కుదుటపడ్డాననే చెప్పాలి. మా విద్యుక్త ధర్మాన్ని మేం ఎన్నడూ ఏమరలేదు గానీ, ఊరికే టెన్షన్ పడిపోవడం తగదని గ్రహింపు కలిగింది.

శ్రీ బవేజాగారి తర్వాత ఎస్. రాజారాం గారు హైదరాబాద్ కేంద్రానికి స్టేషన్ డైరెక్టర్ గా వచ్చినట్లు జ్ఞాపకం! ప్రముఖ సంగీత విద్వాంసులు మైసూర్ వాసుదేవాచారి మనుమడు రాజారాంగారు. ఆయన కూడా మంచి మృదంగ విద్వాంసులట. రాజారాంగారు చాలా సింపుల్‌గా ఉండేవారు. ఆయన ఆఫీసు కారు వాడడం చాలా తక్కువ. ఎందరో రోజూ ఆఫీసుకి రావడానికి, పోవడానికి కూడా కారు వాడుతూంటే, డైరెక్టర్‌గా ఉన్న రాజారాంగారు ఆఫీస్ కారులో ఇంటినుంచి డ్యూటీకి రావడం, పోవడం చేసేవారు కాదు. సాయంత్రం ఆఫీసు కాగానే - చంకలో బ్యాగ్ ఇముడ్చుకుని, నడిచే వెళిపోతూ ఉండేవారు. శ్రీరాజారాంగారు కన్నడిగులు. ఆయన హయాంలోనే నేను

సి.బి.ఎస్ (కమర్షియల బ్రాడ్ కాస్టింగ్ సర్వీస్) నుండి ప్రధాన ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రానికి బదిలీ అయ్యాను. ఆ బదిలీ వెనుక ఓ కథ ఉందని నాకు తెలిసింది -

డ్యూటీ ఆఫీసర్లుగా మా కన్నాముందు 1976 లో చేరిన వారిలో శేషం రామానుజాచార్యులు, మంత్రవాది సుధాకర్, విద్యాలంకార్ మొదలయిన వాళ్ళున్నారు. శేషం కడప నుండీ, సుధాకర్ విశాఖ నుండీ ముందుగా అక్కడ పనిచేసి బదిలీ అయి హైదరాబాద్ వచ్చారు. మంత్రవాది సుధాకర్ కూడా కన్నడిగయే! మహబూబ్ నగర్ అచ్చం పేటతో అతని అనుబంధం. కాంగ్రెస్ పార్టీ భావజాలం కలవాడు. అచ్చం పేటలో - 'రేడియో ఉద్యోగిగా అతను రాజకీయ కలాపాల్లో పాత్ర వహించడం ఏమిట'ని ఎవరో అతనిమీద ఒక కరపత్రం వేసారుట. అది రాజారాం గారికి పంపించారుట. సుధాకర్ మీద ఏదో చర్య తీసుకున్నట్లు చూపక తప్పని పరిస్థితుల్లో - తనూ కన్నడిగయే కనుక, ఆ అభిమానంతోనూ - సుధాకర్‌ను బదిలీ చేస్తున్నట్లుగా వారికి సమాధానం చెప్పి, ప్రధానకేంద్రం నుండి సుధాకర్‌ని 'సి.బి.ఎస్'కు మార్చి, ప్రధాన కేంద్రంలో పనిచేయడానికి నేనైతే ఎక్కువ ప్రయోజనం అని నన్ను సి.బి.ఎస్ నుండి ప్రధాన కేంద్రానికి బదిలీ చేసారని తెలిసింది. 'తంతే బూరెల బుట్టలో పడినట్లు' పనిభారం ఎక్కువగా ఉండే ప్రధాన కేంద్రం నుండి 'సి.బి.ఎస్' కు మారడం, సుధాకర్‌కు అతని సామాజిక సేవా కార్యక్రమాలకు మరింత లాభదాయకమే అయింది. నాకు సి.బి.ఎస్ కన్నా పని ఒత్తిడి పెరిగినా, నాకు ఆసక్తిదాయకమైన సాహిత్యాది అంశాలతో ముడిపడినవి కావడం వల్ల ఆనందంగానే ఇమిడి పోయాను. అయితే ఈ బదిలీ రాజారాం గారు ఢిల్లీ కేంద్రం, డైరెక్టరేట్‌కు చెప్పి చేయించారట! మా సి.బి.ఎస్ కు అప్పుడు అజీజ్ ఖురేషి డైరెక్టర్‌గా లేరు. ఆయన బదిలీ అయిపోయి, ఎస్. కృష్ణమూర్తిగారని అసిస్టెంట్ స్టేషన్ డైరెక్టర్ ఒకరు సి.బి.యస్ హెడ్ గా ఉన్నారు. 1982 ఏప్రిల్ 15న వివిధ భారతి వాణిజ్య ప్రసార విభాగం నుండి బదిలీ అయి, 16 వతేదీన ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం ట్రాన్స్‌మిషన్ ఎగ్జిక్యూటివ్‌గా చేరాను. 1981 - 82 లో వివిధభారతి నుండి వచ్చేసే ముందు జీవితంలో మరుపురాని కార్యక్రమాలు రేడియో ప్రసారాలకు సంబంధించి నేను కొన్ని చేయడం, నాకు చాలా ఆనందం, సంతృప్తి కలిగించిన సంగతులు!



సుధాకర్



Government of India
Commercial Broadcasting Service
All India Radio: Hyderabad

No.1(3)/82-S/CBS Dated 15-4-1982.

ORDER

Consequent on his transfer to ~~the Station Director~~, All-India Radio, Hyderabad vide Director General, All India Radio, New Delhi Order No.5(8)/82-SI dated 30-3-1982 Sri.A.Venkat Rao, Transmission Executive is relieved of his duties at this office on the afternoon of 15th April 1982 with instructions to report himself to the Station Director All India Radio, Hyderabad after availing joining time as admissible under rules.

He should return all the Govt. articles i.e. library books, Identity card, C.G.H.S. card etc.

S. Krishnamurthy 15/4/82
Assistant Station Director(c)

Sri.A.Venkat Rao,
Transmission Executive,
Commercial B'Casting Service,
All India Radio,
Hyderabad- AP.

అందులో ప్రముఖమైనది - మహాకవి శ్రీశ్రీ తో గంటన్నర వ్యవధి కార్యక్రమంగా దుందుభి ఉగాదికి ఆకాశవాణి హైదరాబాద్ వివిధ భారతి వాణిజ్య ప్రసార విభాగంలో ప్రత్యేక జనరంజని శ్రీశ్రీతో పరిచయ కార్యక్రమం. శ్రీశ్రీ గారితో రికార్డింగు సందర్భంగా ఇష్టాగోష్ఠిగా గడిపిన సమయం, ఆకార్యక్రమ ప్రసారం మరుపురానివి. "శ్రీశ్రీతో సుధామ" పేర ఆ ఇంటర్వ్యూ పూర్తి పాఠం విరసం ప్రచురించిన శ్రీశ్రీ 'ప్రజ'గ్రంథంలో నమోదయింది. కార్యక్రమంలో సందర్భోచితంగా శ్రీ శ్రీ రాసిన సినిమా పాటలు కూడా వినిపించాం.



(శ్రీశ్రీతో వ్యాసకర్త)

వివిధ భారతి నుండి వచ్చేసేముందు అక్కడే చేసిన కార్యక్రమాల్లో మరొకటి - 'మాటల పాటల పేటిక', అంత్యాక్షరి కార్యక్రమాన్ని రేడియోలో సినిమా పాటలుతో ఆకెళ్ళ సీతాదేవి, నేనూ సంభాషిస్తూ చేసిన కార్యక్రమానికి మంచి ప్రతిస్పందన శ్రోతలనుండి లభించింది. రికార్డులలోని పాటల పల్లవులనే 'అంత్యాక్షరి'గా మేమిద్దరం వినిపిస్తూ, సరదా సంభాణతో రూపొందించిన ఆ కార్యక్రమాన్ని, ఇప్పటికీ శ్రోతలు గుర్తుచేస్తూంటారు కొందరు. అలాగే వివిధభారతి అనౌన్సర్ మట్టపల్లిరావు ఆకాశవాణి జాతీయ బహుమతి ఎంట్రీలకు పంపి రెండవ బహుమతి పొందిన 'ప్రశ్న' రూపకంలో - ఒక ముఖ్య పాత్ర పోషించాను నేను.






## 16




**ఆకాశవాణి కళలకు నిలయం** అన్నమాట నిజమేగానీ, అందులో పనిచేసేవారికి అది - 'ఆఫీసే' అన్న సంగతి మరిచి పోకూడదు. ఇప్పుడంటే - 'ప్రసారభారతి' వ్యవస్థలో భాగంగా అంటున్నారుగానీ, ఆ రోజుల్లో అదీ ఒక ప్రభుత్వకార్యాలయమే! అంచేత - గవర్నమెంట్ ఆఫీసుల్లో సాధారణంగా కానవస్తూండే ఉద్యోగ సంబంధిత సమస్యలూ, క్యాడెర్ల మధ్య వ్యత్యాసాలూ, పాక్షికతలూ.. అక్కడా ప్రతిబింబిస్తూండడం మామూలే. అనౌన్సర్లకూ, డ్యూటీ ఆఫీసర్లకూ ఇమ్మీడియట్ 'బాస్' అంటే - 'పెక్స్(కో)' అనబడే ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్ కో ఆర్డినేషన్ వ్యక్తే! సెలవు రికమెండ్ చేయాలన్నా, పనులు పంపకం చేయాలన్నా, పనిలో లోపాలు జరిగినప్పుడు శ్రీముఖాలు (మెమోలు) ఇవ్వాలన్నా, ప్రాధమికంగా పెక్స్(కో)కే హక్కు అన్నట్లుండేది. ఆ రోజుల్లో అనౌన్సర్లూ, డి.ఓలు (డ్యూటీ ఆఫీసర్లు) నేరుగా ఎ.ఎస్.డి (అసిస్టెంట్ స్టేషన్ డైరెక్టర్), ఎస్.డి. (డైరెక్టర్)లతో కలవడం అనేదే అరుదుగా జరిగేది.



శ్రీ గోపాల్

నేను హైదరాబాద్ ప్రధాన కేంద్రానికి బదిలీ అయి 1982 ఏప్రిల్ 15 మధ్యాహ్నం అక్కడ చేరేనాటికి, శ్రీ గోవర్ధన్ పెక్స్(కో) గా ఉండేవారు. అంతకుముందు శ్రీ గోపాల్ వంటివారు కూడా హైదరాబాద్ 'ఎ' లో పెక్స్(కో)గా చేసినవారే! శ్రీ గోపాల్ అంటే ఎవరో మీకు తెలియాలంటే - 'శంకరాభరణం' సినిమా గుర్తుచేయాలి. శంకరాభరణంలో హార్మోనియం మీద అమ్మాయికి సామజవరగమన కృతిని 'కొత్తప్రయోగం' అంటూ నేర్పించిన దాసు మాష్టారిగా వేసి, శంకరశాస్త్రి చేత తిట్లు తిన్న పాత్ర ధరించినది ఆయనే. శ్రీ గోపాల్ మంచి నటుడు కూడాను. మద్యం వంటి వ్యసనం వల్ల త్వరగా ప్రాణం కోల్పోయిన ప్రతిభావంతుల్లో ఆయనొకరు! ఆయనపోయాక వాళ్ళ పెద్దమ్మాయి 'ఇందిర', ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో సి.జి

(క్లర్క్ గ్రేడ్)గా చేరింది. నేను డ్యూటీ ఆఫీసర్ నుండి పదోన్నతి పొంది 1990లో ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో ఉషశ్రీగారి తర్వాత తెలుగు సాహిత్య విభాగాన్ని ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్‌గా చూసినంతకాలం, ఇందిరయే - నాకు ప్రోగ్రాం సెక్రెటరీగా చేసింది. నాకంటే బాగా చిన్నమ్మాయి కనుక అలా అంటున్నాగానీ, నిజంగా మంచి సౌమ్యురాలు. పనిమంతురాలు. సరే! విజయవాడ ఘట్టంకు వెళ్ళాక ఆ సంగతులు చెప్పుకుందాం. ఓ క్రమంలో పోతున్నాం కదా -


శ్రీ గోవర్ధన్

శ్రీ గోవర్ధన్ గురించి కదూ చెబుతున్నా! ఆయన ఎత్తుగా, మంచి బలిష్ఠంగా ఉండేవాడు. ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్ అంటే తాము పనులు చేయనక్కర్లేదనీ, 'ఎక్జిక్యూటివ్' చేయించడమే తమపని అనీ, అలా చక్కగా 'పెత్తనం' చేయగల 'కళా' కొందరికే ఉండేది. గోవర్ధన్ గొప్ప కార్యక్రమాలు ఏవీ చేసిన గుర్తునాకు లేదు గానీ, ప్రోగ్రాం ఎడ్మినిస్ట్రేషన్ మాత్రం బాగా చేసేవాడు.

ప్రసారమవుతున్న కార్యక్రమాలూ, వాటి వివరాలూ అంటే ఆ కార్యక్రమం పేరు, ప్రసంగమైతే ప్రసంగకర్త, నాటకమైతే రచయిత పేరూ, పాత్రధారుల పేర్లూ, సంగీతమైతే గాయనీగాయకులూ, వాద్యబృందం, కీర్తనలూ వాటి వివరాలూ, ఆ కార్యక్రమం ఎప్పుడు రికార్డు చేయబడిందీ, ఆ ఆర్టిస్టులకు పారితోషికాలు చెల్లించబడ్డాయాలేదా, అది రికార్డు చేయబడిన టేప్ నెంబర్, ఆ కార్యక్రమం మొదటిసారిగా ప్రసారమవుతోందా, లేక పునఃప్రసారమా, సమయం, ప్రసార వ్యవధి ఇవన్నీ కూడా పేర్కొంటూ.. డ్యూటీ ఆఫీసర్ ఓ పుస్తకంలో వివరాలన్నీ నమోదు చేయడం జరుగుతుంది. ఆ పుస్తకానికే 'లాగ్ బుక్' అని పేరు. ఇవాళ్టి లాగ్‌బుక్ మర్నాడు మీటింగులో పెక్స్ చూసి, సంతకం చేసి, ఎ.ఎస్.డియో లేక నేరుగా ఎస్.డియో కూడా సంతకం చేసాక అక్కౌంట్స్ సెక్షన్స్ ఏ.వో కు (అకౌంట్స్ ఆఫీసర్‌కు) పంపడం జరిగేది. పేమెంట్స్ వివరాలన్నీ వారు చెక్ చేసుకుని, 'డ్యూస్' ఏవయినా ఉంటే - తదనుగుణమైన చర్యలు తీసుకునేవారు. ఇలా అక్కౌంట్స్ సెక్షన్‌కు పరిశీలనార్థం లాగ్ బుక్ వెళుతుంది కనుక, డ్యూటీ రూంలో లాగింగ్ సౌలభ్యం కోసం, సోమ, బుధ, శుక్రవారాల వివరాలకు ఒక లాగ్ బుక్, మంగళ, గురు, శని, ఆదివారాలకోసం మరో లాగ్ బుక్‌నూ ఉండేవి. "అలా హైదరాబాద్ 'ఎ', 'బి', 'సి' కేంద్రాలకు విడివిడిగా ఉండేవి. ట్రాన్స్‌మిషన్ అవుతున్న సమయంలోనే - కార్యక్రమం ప్రసారం అవడంతోనే, ఆ వివరాలన్నీ 'లాగింగ్' చేయాల్సి ఉండేది. ప్రసారం చేసేసిన టేప్స్‌ను ఎప్పటికప్పుడు అనౌన్సర్స్ డ్యూటీ రూంకు వెనక్కు పంపగా, ఆ టేప్స్‌లోని క్యూషీట్స్‌ను పరిశీలించి, పేమెంట్ పొజిషన్స్ రికార్డింగు తేదీ వంటి వివరాలను రాస్తూండడం జరుగుతుంటుంది.


డ్యూటీ రూం రేడియో

స్టేషన్ డైరెక్టర్ ఎప్పుడైనా డ్యూటీరూం 'ఆకస్మిక తనిఖీ'కి వస్తే ముందు చూసేది లాగ్ బుక్‌నే.! కొందరు డ్యూటీ ఆఫీసర్లకు ప్రసారం కాకుండానే వివరాలు నింపే 'త్వర'కాగా, మరికొందరికి ప్రసారమై గంటా రెండుగంటలు గడచినా వివరాలు నింపని 'తాపీదనం' ఉండేది. ఎప్పటికప్పుడు, అప్‌టుడేట్‌గా, టైమ్‌గా ఉండాలనేది అధికారులు ఆశించేది! నా బోటి వాళ్ళు సీట్‌కు అంటిపెట్టుకుని, అలా రాస్తూండడం కూడా క్రమశిక్షణ పాటించని కొందరికి నచ్చేది కాదు. ఓ డైరెక్టర్ ఆకస్మిక తనిఖీకి వచ్చి - ప్రసారం పూర్తికాకుండానే వివరాలన్నీ లాగింగ్ చేసేసి, ఎవరితోనో ముచ్చట్లాడుతున్న ఒక డ్యూటీ ఆఫీసర్ గురించి, ఆ లాగ్ బుక్‌లోనే 'కామెంట్' రాసి, టైం వేయడం నాకు ఇప్పటికీ గుర్తుంది.

ప్రధాన కేంద్రానికి బదిలీ అయివచ్చిన కొత్తలోనే ఒకసారి హైదరాబాద్ 'బి' లాగ్ బుక్ విషయంలో - ఓ సోమవారం పొద్దున్న, డ్యూటీ రూంలో అప్పుడు శని ఆదివారాల లాగ్ బుక్‌లు కూడా ఉంటాయి కనుక, మంగళవారం కూడా వాడే దానిలో పొరపాటున సోమవారం మొదటి ట్రాన్స్‌మిషన్ వివరాలు రాసినందుకు, గోవర్ధన్ గారు నాకు హెచ్చరిక పత్రం ఇవ్వడం గుర్తుంది! అదేమంత గొప్పనేరంకాదన్నమాట నిజమేగానీ, ఆ రోజుల్లో క్రమశిక్షణకున్న ప్రాధాన్యత దృష్ట్యా అది తప్పిదమే! అలాంటి పొరపాట్లు ఎందరో,

ఎన్నోమార్లు చేసినా, ఏమీ అనని పెక్స్(కో)లూ ఉన్నారు. నేను ప్రధానకేంద్రానికి రావడం ఎందుకో నచ్చని ఆయన ఆ పనిచేసారని, కొందరన్నారుగానీ నేను దానిని ఒప్పుకోను! ఆయన అలా గుర్తుచేసినందువల్లనే, క్రమశిక్షణలో నేను మరింత గురుతర బాధ్యతలోకి మళ్ళగలిగాను అని ఒప్పుకుతీరాలి!

మీకు తెలిసే ఉండచ్చు - శ్రోతల ఉత్తరాల కార్యక్రమం ఒక విశేష ప్రాచుర్యం ఉండిన కార్యక్రమం ఆ రోజుల్లో, 'ఉభయకుశలోపరి', 'చిత్తగించవలెను', 'ముఖాముఖి', 'పరిచయపత్రం' ఇలా శ్రోతల ఉత్తరాలకు జవాబులు కార్యక్రమం 'లేఖావళి' పలుపలు కేంద్రాలలో పలుపలుపేర్లతో ప్రసారమవుతూండేది. అప్పుడన్నీ పోస్ట్‌కార్డులు, ఇన్‌లాండ్ లెటర్లేకదా! రోజూ రేడియోకేంద్రంకు ప్రసారమయ్యే కార్యక్రమాల మీద బోలెడు ఉత్తరాలు వచ్చేవి. ఆదివారం రాత్రి 'పరిచయ పత్రం' శ్రోతల ఉత్తరాలకు జవాబులు కార్యక్రమం ఉండేది. సాధారణంగా ఒక అనౌన్సర్ ఉత్తరాలు చదువుతుంటే, కార్యక్రమ నిర్వహణాధికారులెవరో ఆ కార్యక్రమానికి నిర్దేశింపబడి, వారు సమాధానాలు ఇస్తూండేవారు. నేను చేరేటప్పటికి హైదరాబాద్ 'పరిచయపత్రం' కార్యక్రమాన్ని చిన్నక్కగా ప్రసిద్ధి పొందిన వి.రతన్ ప్రసాద్‌గారు చదువుతూండేవారు. కార్యక్రమ నిర్వహణాధికారి నేరుగా పాల్గొకపోయినా, సమాధానాలు రాసి ఇస్తే, వాటిని అనౌన్సరే పరిచయపత్రం సమర్పిస్తూ, చదవడమూ జరిగేది! అయితే వారం వారం ఉత్తరాలను ఆడియన్స్ రీసెర్చి విభాగం ద్వారా సేకరించుకోవడం, కార్యక్రమాల వారీగానో లేక తేదీల వారీగానో విడదీసుకోవడం, సమాధానాలు అవసరమైనవీ, సందేహాలతో కూడినవీ అయిన వాటికి - సంబంధిత కార్యక్రమ అధికారుల నుండి సమాధానాలు సమీకరించుకోవడం, పరిచయపత్రం ఒక స్క్రిప్ట్‌గా రాసి, పెక్స్‌కో సంతకం తీసుకుని, రికార్డు చేసో, లేక లైవ్‌గానో ప్రసారం చేయడం జరుగుతూండేది. ఎందరో శ్రోతలు పరిచయపత్రానికి "లేఖలు రాస్తూ - పత్రికల్లో ఉత్తరాలు రాసిన పాఠకులు తదనంతరకాలాన రచయితలుగా ఎదిగినట్లు, ఎందరో శ్రోతలు పరిచయపత్రానికి.." ముందు కార్యక్రమాలపై తను అభిప్రాయాలు రాసే శ్రోతలుగా ఉంటూ, ఆ తరువాత క్రమేపీ కార్యక్రమాల్లో పాలు పంచుకునే దిశగా ఎదిగి రాణించినవారున్నారు.



Government of India
All India Radio : Hyderabad
***

No.Hyd.16(6)/82-P6 Dated: 13.5.1982

MEMO

It is seen from the Log Book entries that Shri A. Venkat Rao (Sudhama), Transmission Executive has wrongly entered the broadcast details of I Transmission of Hyderabad 'B' on Tuesday the 11th May, 1982 in the Log Book meant for Mondays. It is a very serious matter. The Duty Officer should be more careful and keep up the sanctity of the Log Book and should not enter as he pleases.

He is advised to be more careful in his duties.

Programme Executive (CO),
for Station Director.

Shri A. Venkat Rao (Sudhama),
Transmission Executive,
All India Radio,
Hyderabad.

ఒకరోజు హఠాత్తుగా గోవర్ధన్ గారు "వచ్చే ఆదివారం పరిచయపత్రం నువ్వు చెయ్యాలి" అన్నారు. బహుశా రతన్ ప్రసాద్‌గారు ఏ సెలవులోనే ఉండడం వలన, నాకు చెప్పారనుకున్నాను. మరో అనౌన్సర్‌కు కాక, డ్యూటీ ఆఫీసర్‌గా పనిచేస్తున్న నాకు అప్పచెప్పడం మరీ ఆశ్చర్యంగా అనిపించింది! 1982 జూన్ 13న 'పరిచయపత్రం' డ్యూటీ అలా నాకు అసైన్ చేయబడింది. రతన్ ప్రసాద్‌గారు తననుండి ఆ కార్యక్రమం తొలగించినందుకు కళ్ళనీళ్ళెట్టుకుని - 'బాబూ! నీకిచ్చినందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. నువ్వు కాబట్టి నాకు బాధలేదు" అని నా రెండు చేతులూ పట్టుకుని, అప్పగింతలు పెట్టినట్లుగా అన్న దృశ్యం, నాకింకా కదలాడుతోంది!! అలా 'పరిచయపత్రం' నాకు అప్పచెప్పడం.. చెప్పడం... 1990 లో ప్రమోషన్ మీద వెళ్ళేంతవరకూ కూడా, సుమారు ఏడెనిమిది సంవత్సరాలు నేను నిర్వహించాను. శ్రోతలతో అనుబంధ పటిష్ఠతకు అదే వేదిక! లీలాబౌడేకర్ అనే మహిళ స్టేషన్ డైరెక్టర్‌గా వచ్చినప్పుడు - 'పరిచయపత్రం'లో ఎ.ఎస్.డి పాల్గొనాలని అప్పుడు



అసిస్టెంట్ స్టేషన్ డైరెక్టర్‌గా ఉన్న ఆర్. అనంత పద్మనాభరావుగారికి ఆదేశిస్తే, ఆయన తనగొంతు పీలగా ఉంటుందని సుధామే కొనసాగిస్తాడనీ ఆమెను ఒప్పించారు. అలాగే శ్రీ కేశవ్ పాండే అనే స్టేషన్ డైరెక్టర్ గారుండగా ఆయనతో నేను స్వయంగా "ఈ కార్యక్రమం పెద్ద భారంగా ఉందనీ అందునా ఏడాదిగా నా సింగిల్ వాయిస్‌లో కార్యక్రమం సమర్పిస్తున్నానీ" చెబితే - ఆయన కార్యక్రమం మాత్రం నా నుండి తీసివేయకుండా, నీకు కావలసిన లేడీ అనౌన్సర్ గొంతును సహాయికంగా తీసుకో! నేను డ్యూటీలు వేయమంటాను. అని నన్నే కొనసాగించమన్నారు. అప్పుడు అనౌన్సర్ జ్యోత్స్నతో కలిసి మేం ఇద్దరం అయిదారేళ్ళు 'పరిచయపత్రం' నిర్వహించాం మా ఇద్దరిగళాల్లో.

అసలు డ్యూటీ ఆఫీసర్‌గా నేరుగా కార్యక్రమాల ప్రసారాల్లో గళం ఇవ్వడం అనేది ఉద్యోగబాధ్యతల్లో విధాయకం కాదు. అవసరార్థం ఏ అనౌన్సరో ట్రాన్స్‌మిషన్‌కు ఆలస్యంగా వస్తే, మరే అనౌన్సరూ లేకపోతే, ప్రసారం ప్రారంభించడానికి అనివార్యంగా ఏ ఓపెనింగ్ అనౌన్స్‌మెంట్లో చేయాల్సివచ్చేది! వివిధభారతిలో ఉండగానూ, హైదరాబాద్ 'బి' కేంద్ర కార్యక్రమాలు ఉదయం ప్రసారం అప్పుడూ, అలా నేను మొదలుపెట్టిన సందర్భాలూ ఉన్నాయి. 'విఠల్ రావ్' అనే డ్యూటీ ఆఫీసర్ ప్రభాత ప్రసార ప్రారంభం అనౌన్స్‌మెంట్స్ నా గొంతులో ఓ టేప్‌లో రికార్డు చేసి పెట్టుకుని, తనెప్పుడైనా ఆపద్ధర్మంగా ఆ పనిచేయాల్సి వస్తే, ఈ టేప్ ఉపయోగించేవాడు.

'లాగ్‌బుక్'లో శ్రద్ధగా, నేను కుదురైన అక్షరాలతో రాయడమూ, ఇలా అసలు పెక్స్‌లు చేయవలసిన 'పరిచయపత్రం' శ్రోతల ఉత్తరాలకు జవాబులు వంటి కార్యక్రమం డ్యూటీ ఆఫీసర్‌గా నేనే చేయటమూ.. అదీ చూస్తూ.. ప్రముఖ వేణుగాన విద్వాంసులూ, ఆకాశవాణిలో సంగీత విభాగం ప్రొడ్యూసర్ అయిన శ్రీ ఎన్. ఎస్. శ్రీనివాసన్ గారు (శ్రీమతి శారదా శ్రీనివాసన్ గారి భర్త) "సుధామా! మేం చేయవలసిన చాకిరీ నువ్వు చేస్తున్నావేంటయ్యా" అని జోక్ చేస్తూండేవారు. వారు తమిళులు కదా! తమిళులను 'అరవలు' అనడమూ, 'అరవ చాకిరీ' అనేమాటా ప్రాచుర్యంలో ఉండేది కావడమూ తెలిసిన సంగతే కదా! అంచేత నాది 'అరవ చాకిరీ' అని ఆయన తమాషా చేసేవారన్నమాట.

అన్నట్లు ఆకాశవాణిలో విద్యావిభాగంలో ప్రముఖ హాస్య రచయిత మునిమాణిక్యం నరసింహారావుగారు కొన్నాళ్ళు పనిచేశారు. ఆ తరువాత ఆయన ఆంధ్రసారస్వత పరిషత్ పండిత శిక్షణా కేంద్రానికి ప్రిన్సిపాల్ గా చేశారు. ఒకసారి ఆయన చాలామంది స్టూడెంట్స్‌ల పుస్తకాలు దిద్దడానికి తీసుకెడుతూ ఉంటే, రామానుజరావుగారో ఎవరో - "అదేంటి మాష్టారూ! అలా 'గాడిద' బరువు మోసుకెడుతున్నారు" అని అడిగారట. ఒక క్లాసులోని దాదాపు నలభైమంది విద్యార్థుల నోట్స్‌లు అవి. దానికి మునిమాణిక్యంగారు నవ్వుతూ - "ఒక్క గాడిదది కాదండీ! నలభై గాడిదల బరువు" అన్నారు.





'గాడిద బరువు', 'అరవ చాకిరీ' అనేవి వృత్తిలో భరించి నేను చేసానని ఎవరైనా అంటే - నేను వృత్తి చేసినన్నాళ్ళూ తృప్తిగా, ఆనందంగా, బరువు అనుకోకుండానే చేసాను. నేను పుట్టింది 'ఖర'నామ సంవత్సరంలోనే. గాడిద పేర ఉన్న ఒకే ఒక్క తెలుగు సంవత్సరం 'ఖర'. సర్వీస్‌లో ఉంటే ఆకాశవాణిలో ఈ ఖరనామ సంవత్సరం నవంబర్‌లో అరవై ఏళ్ళు నిండి రిటైరయ్యేవాడిని! కానీ ముప్ఫై ఏళ్ళు ఉద్యోగం తృప్తిగా చేసి, ఇక చాలనుకునే, 2008 ఆగస్టులో స్వచ్ఛంద పదవీ విరమణ చేశాను నేను.

కిరణ్‌ప్రభగారి సహృదయ ఆత్మీయ కాంతిమయ ప్రేరణ కారణంగానే ఈ జ్ఞాపకాలు మీతో పంచుకుంటున్నాను. నిజానికి రేడియో జ్ఞాపకాల్లో ఇప్పుడే అసలయిన ఘట్టాలు మొదలు. ప్రముఖుల పరిచయాలూ అవీను..! 'ఖర' శ్రీకరమూ, శుభకరమూ కావాలని 'ఖర' నామ సంవత్సర జన్మమడినయిన నేను - ఉగాది శుభాకాంక్షలు చెప్పడం ఔచిత్యమేకదండీ!



## 17

**ఆకాశవాణి - ఆహూతుల సమక్షంలో** కార్యక్రమాలు చేయడం, ఆ రోజుల్లో చాలా విరివిగా ఉండేది. స్టూడియో నాలుగుగోడల మధ్య కాకుండా, ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం ప్రాంగణంలోనే - ఉగాది కవిసమ్మేళనాల వంటివి, ప్రేక్షకుల సమక్షంలో నిర్వహించడం - రేడియోలో నేను చేరకముందు నుండీ కూడా బాగా జ్ఞాపకం! అప్పుడు నౌబత్ పహాడ్ మీద తెల్లటి ఒక మంటపం మాత్రమే ఉండేది. ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం లోంచి ఆ కొండప్రాంతం అంతా వెనుకగా విస్తరించుకు ఉండేది. బిర్లా ప్లానిటోరియం 'నక్షత్రశాల' కూడా తరువాత నిర్మితమైంది.

రేడియో కేంద్రంలోకి ప్రవేశించగానే ఎడమవైపుగా విశాలమైన లాన్స్ ఉండేవి. గేటులోంచి లోపలికి వెళ్ళగానే - ఆ లాన్స్‌కు ముందుగా కొంచె ఎడమవైపుగా ఓ చెట్టూ, దాని ప్రక్కగా ముందుకు ఓ వేదిక ఉండేవి. ఎడమవైపు సెక్యూరిటీ రూమ్ వరుసలోనే న్యూస్ యూనిట్, యువవాణి మూడు భాషల విభాగాలూ వరుస గదుల్లో ఉండేవి. ఆ వేదికపైనే షామియానా అదీ వేసి, ఓసారి ఉగాదికి జరిగిన కవిసమ్మేళనం నాకు బాగా గుర్తు! కె.శివారెడ్డి, దేవీప్రియ, నేను మేమంతా వెనుకగా కొండరాతి బండమీద కూచుని ప్రేక్షకులుగా ఆ కవిసమ్మేళనం వేడుకగా విన్నాం. కుందుర్తి - 'నాక్కొంచెం విశ్వాసమివ్వండి' అనే కవిత, వేగుంట మోహన్‌ప్రసాద్ 'తుఫాన్ వస్తే ఏం చెయ్యాలి' అనే కవిత, దాశరథిగారి రుబాయిలూ నన్ను బాగా ఆకర్షించినవి.

కేవలం కవి సమ్మేళనాలే కాదు. స్త్రీల కార్యక్రమాలూ, పిల్లల కార్యక్రమాలూ ప్రేక్షక జన సమ్మర్థం దృష్టిలో పెట్టుకుని, 'రవీంద్ర భారతిలో' జరిగేవి! సంగీత సమ్మేళనాల సంగతి చెప్పనే అక్కర్లేదు!

ఒకొక్కసారి - పండుగలనాడు ప్రసారానికై, వారం పదిరోజులముందే - ఆహూతుల సమక్షంలో, కార్యక్రమాల నిర్వహణ జరిగేది. ఆకాశవాణి ఆనవాయితీ ననుసరించి కార్యక్రమం అయిపోయిన వెంటనే, వేదిక దిగి ప్రక్కకు రాగానే, వారి పారితోషికాల చెక్కులను డ్యూటీ ఆఫీసర్లుగా మేము ఓచర్లమీద సంతకం తీసుకుని, కళాకారులకి ఇవ్వడం జరిగేది. రెవిన్యూ స్టాంప్ కళాకారులే ఓచర్ మీద పెట్టి సంతకం చేయాలి! వారి దగ్గర రెడీగా ఉండదు కాబట్టి, మేమే అక్కౌంట్ సెక్షన్ లో రెవిన్యూ స్టాంపులు తగినన్ని తీసుకుని, కళాకారులకు

ఇచ్చి, ఓచర్ పై అతికింపచేసి, సంతకం చేయించేవాళ్ళం. వందలాది రూపాయల పారితోషికం తీసుకున్నా - రెవిన్యూ స్టాంపు ఇరవై పైసలు (అప్పట్లో అంతే) ఇవ్వడానికి.. చిల్లరలేదనో, 'స్టాంపు మీరే పెట్టాలి కదా!' అనో డబాయించే కళాకారులూ ఉండేవారు. రెవిన్యూ స్టాంపు తాలూకు డబ్బులు మర్నాడు అక్కౌంట్ సెక్షన్‌లో మా జేబుల్లోంచి ఇచ్చుకున్న సందర్భాలు బోలెడు!!

బాలానంద సంఘం రోజుల్లో నాటకాల్లో పాత్రలు ధరించడం రేడియోలోనే కాక, స్టేజి మీద కూడా వేసామని మునుపే చెప్పానుగా! అలా రేడియోలో చేరాక - రంగస్థలం మీద ఓ నాటకంలో పాల్గొన్నది 1982 లోనే మొదటిసారి. 1982 అక్టోబర్ 21 గురువారం సాయంత్రం ఆరున్నరకు ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం 'రవీంద్రభారతి' వేదికపై 'రంగవల్లి' స్త్రీల కార్యక్రమాన్ని ఆహూతుల సమక్షంలో దసరా పండుగ సందర్భంగా నిర్వహించింది. ఆనాటి కార్యక్రమంలో లలితా హరిప్రియగారల దేవీ కీర్తనలు, కోటమాధవి, గంగరాజు సుశీలాదేవిగార్ల కవితా పఠనం, డా. పి. యశోదారెడ్డిగారు ఏకపాత్రాభినయ రూపకంలా చెప్పిన 'మా లక్ష్మి ముచ్చట్లు', ఆ తరువాత 'ఒక్క నిముషం మాట్లాడండి' అని స్త్రీలకు నిర్వహించిన క్లుప్త గోష్ఠిలో - ఎ.జి.ఆఫీస్ కల్చరల్ అసోసియేషన్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మహిళా ప్రగతి సేవా సమాజం, టెలిఫోన్ లేడీస్ రిక్రియేషన్ క్లబ్బు, జ్యోతిర్మయి ఎల్.ఐ.సి లేడీస్ క్లబ్బు సభ్యులు పాల్గొన్నారు. ఒక నాటిక లేకపోతే కార్యక్రమం రక్తికట్టదంటూ భావించి, స్త్రీల కార్యక్రమాలను నిర్వహిస్తున్న రేడియో అక్కయ్య శ్రీమతి తురగా జానకీ రాణిగారే - 'వివాహము సంభవించెను' అనే హాస్యనాటిక రాసారు. హాస్యరస సంభాషణలతో - ప్రేమకట్నం అంశాలతో జానకీ రాణిగారు రాసిన ఆ నాటకంలో - చిన్నక్క, ఏకాంబరాలుగా ప్రసిద్ధులైన శ్రీమతి వి.రతన్ ప్రసాద్, వట్టం సత్యనారాయణ, ఒక పరిణత వయస్కుడి పాత్రలో నేనూ, నాలాగే డ్యూటీ ఆఫీసర్ అయిన కుమారి నాయని హైమవతి, యువకుని పాత్రలో అడ్మినిస్ట్రేషన్ విభాగంలోని (ప్రసాద్ ఎవరో అనుకుంటా) తనూ పాల్గొన్నాం. నాటకం శ్రోతలను బాగా ఆకట్టుకుంది. నా గెటప్ కుర్రాడి నుండి - తలనెరసిన పెద్దవాడి పాత్ర అయింది. ఎన్.టి రామారావ్ వయస్సే అయినా గుమ్మడి వృద్ధపాత్రలు వేసి మెప్పించలేదా! పాత్ర ప్రధానం అయినది కావడంతో, చిన్నదైన హీరో వేషం కన్నా, ఇదే బాగా మెప్పించగలనని జానకీరాణిగారు కోరి - మరీ వేయించినందుకు - మంచి ప్రశంసలే లభించడం ఆనందదాయకం! స్టాఫ్ మెంబర్లే ఇలా నాటకాలు వేయడం ఆకాశవాణిలో ఆనవాయితీయే! జాతీయ పోటీల్లో పాల్గొన్న హేమాహేమీలయిన నటులు ఆకాశవాణిలో ఉన్నారు.


శ్రీమతి తురగా జానకీ రాణి



అంతెందుకు! సినీనటులు రాళ్ళపల్లి, ఎల్.బి.శ్రీరాం, రావికొండలరావు, రాధాకుమారి, తనికెళ్ళ భరణి, సుత్తి వీరభద్రరావు, నిర్మలమ్మ వంటివారెందరో రేడియో నాటకాల్లో పాల్గొనగా, రేడియో కళాకారులెందరో స్థానం వారు, బందావారు, నండూరి విఠల్, సి. రామ్మోహన్ రావ్, కోకా సంజీవరావు, పాండురంగ, డి.వెంకట్రామయ్య, మాడుగుల రామకృష్ణ, జయప్రకాష్ లాంటి వారెందరో రేడియోలోనే కాక, రంగస్థలం మీద నాటకాలు వేసారు. అక్కినేని నాగేశ్వరరావ్, శారదా శ్రీనివాసన్ ఓ రేడియో నాటకంలో వేయడం నాకు గుర్తు! శారదా శ్రీనివాసన్ గారు - 'బంగారు కలలు' సినిమాలో వహీదా రెహమాన్‌కు డబ్బింగు చెప్పి, ఆ పాత్రను తన గొంతుతో రాణింపచేయడమూ గుర్తు!! కానీ శారదగారి గొంతు అశేషజనావళికి పరిచితం కావడం వల్ల, వహీదా రెహమాన్ కాక ప్రేక్షక శ్రోతలకు 'శారద'గారే వినిపించారు!

ట్రాన్స్‌మిషన్ ఎక్జిక్యూటివ్స్ - అంటే డ్యూటీ ఆఫీసర్లు కొందరిని, కార్యక్రమం విభాగాలకు సహకరించేందుకు, బాధ్యతలు బదలాయించి, డ్యూటీ రూమ్ విధులు కాక, పనివేళల్లో రోజూ సంబంధిత కార్యక్రమ విభాగం రికార్డింగు, డబ్బింగు వంటి పనులకు కేటాయించడం కూడా జరుగుతూండేది. తెలుగు ప్రసంగ విభాగానికి సహకరించేందుకు - అప్పటికే కొంత అస్వస్థతకు గురైన డా.రావూరి భరధ్వాజగారికి, ప్రొడక్షన్‌లో సహకరించేందుకు, నన్ను నియమించారు. అయితే ఆ ఒక్క విభాగమే కాకుండా, కుటుంబ సంక్షేమ విభాగం ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్‌గా ఉన్న శ్రీ అరుణాచలం (మొదలి) గారికి కూడా నియుక్తుడిని చేసారు. షిఫ్ట్ డ్యూటీలు వల్ల తెల్లవారు జామునే రావడం, రాత్రి పొద్దుపోయేదాకా ఉండడం డ్యూటీ రూం డ్యూటీల్లో అనివార్యం. అదే సెక్షన్లో నియమించినప్పుడు - పదినుంచి అయిదుదాకా - ఆఫీసువేళల్లా పనిచేయడమే కనుక, కొందరు సెక్షన్ డ్యూటీలకోసం ఆరాటపడేవారు కూడాను! నాకు అనుకోకుండా ఆ కేటాయింపు జరిగింది కొన్నాళ్ళు.

తెలుగు విభాగానికి నేను సహాయకారిగా ఉంటానని వారు భావించడానికి కారణం ఉంది. ఆర్టిస్టు ఎవరయినా సమయానికి రాకపోతే - ఆ ప్రసంగమో, సృజన రచనో అదే విషయం మీద రాసేసి, ప్రెజెంట్ చేసే కుతూహలం, సామర్థ్యం మాకుండేది. జిల్లా సమాచార లేఖలు కూడా డ్యూటీలో ఉండి నేను చదివిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. అంచేత వార్తావిభాగం వారికీ - అవసరానికి ఉపయోగపడేవాడిని.

1982లో ఎన్నికలకు ముందే ఎప్పుడో సరిగ్గా గుర్తులేదుకానీ, నేను మధ్యాహ్నం డ్యూటీలో ఉండగా శ్రీ రావూరి భరద్వాజ గారు వచ్చి - "రేపటి కవితాస్రవంతి కార్యక్రమానికి గుంటూరు శేషేంద్రశర్మ గారు రికార్డింగుకు ఇవాళ వస్తానన్నారు గానీ, అనారోగ్యం కారణంగా రాలేకపోతున్నానని కబురు చేసారు. రేపటి కార్యక్రమంలో మరో కవిత వెళ్ళాలి. అంచేత ఇవాళ నువ్వు ఒక కవిత రాసి రేపు పట్టుకురా! రికార్డు చేసి ప్రసారం చేద్దాం" అన్నారు. సరేనని, ఆ రాత్రి 'ఎండలో సామాన్యుడు' అనే కవిత రాసి, మర్నాడు రికార్డు చేసి ప్రసారం చేశాం. రాష్ట్రానికి ఎన్నికలు జరగడానికి ముందు. ఎన్.టి.రామారావు తెలుగుదేశం పార్టీ పెట్టి ఎన్నికలకై ప్రభంజనంలా సంచరిస్తున్న వేళ. కాంగ్రెస్ విధానాల తాపానికీ, మాటమాటకి ముఖ్యమంత్రులను మార్చుతున్న గారడీ గమ్మత్తులకూ ప్రజలు విసుగెత్తుతున్నవేళ - ఎండలను, ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రాసిన ఆ కవిత శ్రోతలను అలరించింది. బహుశా ఏప్రిల్, మేలలో ఎప్పుడో రాసిందది. ఆకాశవాణి ప్రతి ఏటా రిపబ్లిక్‌డే సందర్భంగా ముందురోజు అంటే జనవరి 25 రాత్రి సర్వభాషా కవిసమ్మేళనం - 'జాతీయ కవి సమ్మేళనంగా 1951 నుండి ఢిల్లీలోనో, మరో ప్రధాన కేంద్రంలోనే ఆహూతుల సమక్షంలో నిర్వహిస్తూ వస్తోంది. ఒక్కొక్క భాషనుండి - ఒక్కొక్క కవిని ఎంపిక చేసి, పిల్చి, ఆయా భాషల కవితలను హిందీలో అనువదింపచేసి, మూల భాషా కవులనూ ఆహ్వానించి ఆహూతుల సమక్షంలో జరిపిన ఆ కవిసమ్మేళనాన్ని, ఢిల్లీ నుండి నేరుగా ప్రసారం చేయగా, అన్ని భాషల కవితలనూ - ప్రాంతీయ భాషల్లోకి అనువదించి, అదే వేళకు ప్రాంతీయ కేంద్రాలనుండి - ఆయా భాషల్లో ప్రసారం చేసే ప్రముఖమైన కార్యక్రమం 'జాతీయ కవిసమ్మేళనం'. ప్రతి మూడు నెలలకూ జరిగే గ్రూప్ ఫోర్ స్టేషన్ల కో ఆర్డినేషన్ మీటింగులో - ప్రతికేంద్రమూ తాను ప్రసారం చేసిన కవితల్లోంచి రెండు ఎంపిక చేసి తెచ్చి, కమిటీ ముందు పెట్టడమూ, సమన్వయ కమిటీ అన్నిటిలోంచి రెండిటిని ఎంపిక చేసి, వాటి హిందీ ఇంగ్లీషు అనువాదాలతో డైరెక్టరేట్ జనరల్ కార్యాలయానికి ఢిల్లీ పంపడం


శ్రీ రావూరి భరద్వాజ



జరుగుతుంది. సంవత్సరంలో - అలా ఒక్కొక్క భాషనుండీ తమకు చేరిన కవితల నుండి - భాషకు ఒకటి చొప్పున, కవితను, ఢిల్లీ స్థాయిలో కమిటీ ఉత్తమంగా నిర్ణయించి, ఆ ఏడాది 'జాతీయ కవి'గా ఆ భాషకు ప్రాతినిధ్యం వహించేందుకు, ఆ ఎంపికయిన కవిని ఆహ్వానించడం జరుగుతుంది. రాజ్యాంగంలో గుర్తింపబడిన అన్ని భాషల కవితలూ, వాటి హిందీ అనువాదాలూ ఆయా కవులు ఆహూతుల సమక్షంలో వినిపించగా, ప్రతి కవిత కూడా మిగతా భారతీయ భాషల్లోకి ఆయా భాషా కవులచే ప్రత్యేకించి ప్రాంతీయంగా అనువదింపచేయబడి, జనవరి 25 వ తేదీ రాత్రి దాదాపు 90 నిమిషాల పాటు ప్రసారం చేయడం నేటికీ ఆనవాయితీగా సాగుతోంది. జాతీయ కవి సమ్మేళనంకు ఎంపిక కావడం అంటే 'జాతీయ కవి'గా గొప్ప గుర్తింపు, హోదా! రేడియోలో ప్రసారం అయిన వాటిలో


శ్రీ రాజారాం

ఉత్తమమైనవి లేవని భావిస్తే, ఆయా ప్రాంతీయ భాషా పత్రికల్లో వచ్చినవాటిల్లోంచి ఉత్తమమైనదిగా - కమిటీ భావించినవాటిని కూడా, కేంద్ర కమిటీకి పంపవచ్చు. 'జాతీయ కవిసమ్మేళనం'లో లబ్ధప్రతిష్టులైన కవులెందరో పాల్గొన్నారు. అయితే - ఆకాశవాణి ఉద్యోగిగా పనిచేస్తూ, జాతియ కవి సమ్మేళనానికి తెలుగు భాషా కవిగా ఎంపికయిన తొట్టతొలుత వాడిని నేనే కావడం నాకు గర్వకారణం! అప్పుడు డైరెక్టర్‌గా పనిచేస్తున్న రాజారాంగారే శ్రీ రావూరి భరద్వాజ్ గారిని "మంచి కవిత అయినప్పుడు స్టాఫ్‌ది మాత్రం పరిశీలనకు పంపితే తప్పేం ఉంది. ఎంపిక చేసేది ఎలాగూ కేంద్ర కమిటీయే కదా! సుధామ కవిత పంపించండి" అని చెప్పారని - డా.రావూరి భరద్వాజగారు స్వయంగా చెప్పి, డైరెక్టర్ మాట తీసేయడం ఇష్టంలేకనే కాదు కవితను ఆయనా ఇష్టపడి, పరిశీలనకు పంపడం, 1983 లో ఆకాశవాణి జాతీయ కవిసమ్మేళనానికి నేను తెలుగుకవిగా ఎంపిక కావడం జరిగింది.

అనువాదం చేసి పంపడానికి నా కవితను పరిశీలకు పంపడం, 1983 లో ఆకాశవాణి జాతీయ కవిసమ్మేళనానికి నేను తెలుగుకవిగా ఎంపిక కావడం జరిగింది. అనువాదం చేసి పంపడానికి నా కవితను పరిశీలకుల కోసం హిందీలో శ్రీ దండమూడి మహీధర్, ఇంగ్లీష్ లో నా ఎం.ఫిల్ గైడ్ డా.అరిపిరాల విశ్వంగారు అనువదించారు.


G. Raghuram
(RAGHU RAM)
Station Director
All India Radio
Chandigarh-160019.

CHANDIGARH - 160019
14-12-82

My dear Sudhama,

Heartiest congratulations to you for having been selected as a 'National poet' (Telugu) for the National Symposium of poets - 1983.

Wish you all the best and bright future.

With good wishes,
Yours sincerely
G. Raghuram
14/12/82

1983 జనవరి 24న న్యూఢిల్లీ జనపథ్‌లోని, నేషనల్ మ్యూజియం ఆడిటోరియంలో ఆ ఏడాది ఆహూతుల సమక్షంలోకవి సమ్మేళనం జరిగి, అన్ని భాషల కవులూ తమ తమ భాషల్లో వేదికపై నుండి తమ కవితలు వినిపించడం, మూలభాషా కవి చదివిన వెంటనే హిందీ అనువాద కవులు వినిపించడం జరిగింది. అన్నిభాషల నుంచి ఎన్నికయిన కవులూ, వారి కవితలు హిందీలోకి అనువదించడానికి ఎంపికయిన అనువాదకుల వివరాలతో ఆహ్వాన పత్రం రూపొందింది. "డాక్టర్ కువార్ బేచైన్" అనే హిందీకవి నా 'ఎండలో సామాన్యుడు' కవితను హిందీలోకి కవిత్వీకరించి, వేదికపై నేను తెలుగులో చదివిన వెంటనే వినిపించగానే, ప్రేక్షకుల కరతాళధ్వనులు, "కవిత చాలా బాగుందని" కాశ్మీరీ కవి వెంటనే వేదికపై నన్ను కౌగిలించుకోవడం ఓ మధురస్మృతి! నేను ఆకాశవాణి స్టాఫ్‌గా కవిసమ్మేళనంలో పాల్గొన్నందువల్ల, వెయ్యిరూపాయలపైగా పారితోషికం నాకు అందరు కవుల్లాగా ముట్టదు. ఎటొచ్చీ - రాను పోను ఫస్ట్‌క్లాస్ రైలు ఛార్జీలు, ఓ అఫీషియల్ పార్టిసిపేషన్ సర్టిఫికెట్‌లాంటిదే లభించినా, అసలు జాతీయకవి సమ్మేళనానికి తొలిసారి స్టాఫ్ గా ఎన్నికయిన అరుదైన గౌరవం ఎవరికి దక్కింది తెలుగువాడిగా నాకు గాక! ఆ తరువాత ఇంద్రగంటి శ్రీకాంత శర్మగారి కవిత ఓ ఏడాది పరిశీలనకు వెళ్ళింది అని విన్నాను. చానాళ్ళ తరువాత మళ్ళీ అలా జాతీయ కవి సమ్మేళనానికి నాలుగేళ్ళ క్రితం కాబోలు - అనౌన్సర్ గా ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలోనే పనిచేస్తున్న పైడి తెరేష్ బాబు ఎంపికై పాల్గొన్నాడు.

నేను 'జాతీయ కవి సమ్మేళనా'నికి ఎన్నికయిన విషయం - డిసెంబర్‌లో 1982 తెలియగానే, హైదరాబాద్‌లో అంతకు ముందు పెక్స్‌కోగానూ, విజయవాడ తెలుగు సాహితీ విభాగంలోనూ పని చేసిన శ్రీ జి రఘురాంగారు పదోన్నతిపై స్టేషన్ డైరెక్టర్‌గా 'ఛండీ ఘడ్' స్టేషన్‌లో పనిచేస్తూ కూడా - అంతటి హోదాలో ఉండి, డ్యూటీ ఆఫీసర్‌గా ఉన్న నేను జాతీయకవిగా ఎంపికయినందుకు అభినందిస్తూ లేఖరాయడం, ఆయన అభిమానానికి, గొప్ప సంస్కారానికీ నిదర్శనం! మొదటిసారి రిపబ్లిక్‌డే పెరేడ్‌ను ఆ 1983లోనే నేను చూశాను. మరో విశేషం - ఆ ఏడాది, అప్పుడే 'తెలుగుదేశం' పార్టీ తొమ్మిదినెలల కాలంలోనే అఖండంగా ఎదిగి, ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించి, రాష్ట్రంలో ఎన్.టి.రామారావు తెలుగుదేశం పార్టీ అధినేతగా ముఖ్యమంత్రిగా పదవి చేపట్టారు. ఆయన పదవీ ప్రమాణ స్వీకారం రేడియో నివేదికను కూడా నేను చేయడం, ఆయన అధికారంలోకి వచ్చాక ఢిల్లీ వెళ్ళడంతో అంతవరకూ మద్రాసీలుగా వ్యవహరింపబడే 'తెలుగువాడు' ఎన్.టి.ఆర్ ఘనత వల్ల, తెలుగువాడిగా ఆత్మగౌరవం పొందడం, ప్రత్యక్షంగా చూసి, అనుభవించి, ఆనందం పొందే అవకాశం కలిగింది! మిత్రుడు వసంత భాను (డా. సి.మృణాళిని భర్త) అప్పుడు కుటుంబ సంక్షేమం ట్రైనింగ్‌కు ఢిల్లీలో ఫ్యామిలీ వెల్ఫేర్ గెస్ట్ హౌస్‌లో ఉండి, నన్ను అతిథిగా ఉంచుకోవడం, కవిసమ్మేళనానికి తనూ రావడం, ఇద్దరం కలిసి గణతంత్ర దినోత్సవ వేడుకలనూ, పెరేడ్ విన్యాసాలనూ చూడడమూ మరపురాని క్షణాలే! ఆకాశవాణి ఢిల్లీ వార్తలు చదివే శ్రీ కందుకూరి సూర్యనారాయణగారు - కవిగా నన్ను గౌరవంతో వారింటికి ఆహ్వానించి, మునిర్కాలోని వారి గృహంలో భోజనం పెట్టడమూ గుర్తే! అరుదైన గౌరవానికి ఆస్కారం అలా లభించింది.



శ్రీ జి.రఘురాం



శ్రీ కందుకూరి సూర్యనారాయణ



| भाषा | कवि | हिन्दी रूपान्तरकार कवि |
|---|---|---|
| संस्कृत | डा० श्रीधर भास्कर वार्णेकर | मधुर शास्त्री |
| असमिया | हरि बरकटकी | कन्हैयालाल नंदन |
| उड़िया | डा० सौभाग्यकुमार मिश्र | रमानाथ अवस्थी |
| उर्दू | कुमार पाशी | |
| कन्नड़ | डा० बुद्दन्ना हिंगमिरे | श्रीकांत जोशी |
| कश्मीरी | वासुदेव रेह् | डा० अयूब प्रेमी |
| गुजराती | चंद्रशंकर भट्ट 'शशिशिवम्' | रमेश गौड़ |
| तमिल | कु० टी० पलनीअम्माल | डा० शांति सुमन |
| तेलुगू | ए० वेंकटराव 'सुधामा' | डा० कुंवर बेचैन |
| पंजाबी | डा० जगतार | सूर्यभानु गुप्त |
| बंगला | डा० मानस रायचौधुरी | बाल स्वरूप राही |
| मराठी | डा० एन० डी० महानोर | वीर सक्सेना |
| मलयालम | पी० भास्करन | सर्वेश्वर दयाल सक्सेना |
| सिन्धी | एम० कमल | कुमार शिव |
| हिन्दी | ठाकुर प्रसाद सिंह | |
| हिन्दी | प्रणवकुमार बंद्योपाध्याय | |



జాతీయ కవిసమ్మేళనానికి సుధామ ఎన్నిక

హైదరాబాదు, జనవరి 20: ఏటా రిపబ్లిక్ దినోత్సవాల సందర్భంగా ఆకాశవాణి నుండి జనవరి 25 వ తేదీ రాత్రి గం. 9.30 లకు ప్రసారమయ్యే జాతీయ కవి సమ్మేళనానికి తెలుగు భాషనుండి ప్రముఖ యువకవి శ్రీ సుధామ ఈసారి ఎన్నికైనారు. న్యూఢిల్లీలో ఈనెల 24 న జరిగే "జాతీయ కవిసమ్మేళనం"లో అయన పాల్గొంటారు. ప్రముఖకవి, విమర్శకుడు కార్టూనిస్టు అయిన శ్రీ సుధామ ఎం. ఏ. ఎం. ఫిల్. పట్టభద్రుడు. శ్రీ సుధామ ఆకాశవాణి హైదరాబాదు కేంద్రంలో ట్రాన్స్‌మిషన్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నారు.

ఆంధ్రపత్రిక జనపత్రిక 21.1.83 సంచిక



# 18

**దుందుభి ఉగాదికి రేడియోలో శ్రీ శ్రీ తో** నా పరిచయ కార్యక్రమంగా రూపొందించి ప్రసారం చేసిన 'ప్రత్యేక జనరంజని', ముప్ఫై రెండేళ్ళ వయసులోనే 'జాతీయకవి'గా తెలుగుదేశం ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పడిన ఏడాదే న్యూఢిల్లీకి వెళ్ళడం, రేడియోలోనూ, బయట సాహితీ రంగంలోనూ అప్పట్లో నాకు బాగా గుర్తింపు తెచ్చిపెట్టాయి. 'సితార'లో వారం వారం నా కొత్త సినిమాల సమీక్షలు కూడా రెగ్యులర్‌గా రావడం కూడా అప్పుడే మొదలయింది. కె.విశ్వనాథ్ దర్శకత్వంలో విడుదలైన 'సప్తపది' సినిమా హీరోయిన్ 'సబిత'ను నేను చేసిన ఇంటర్వ్యూని - నాకు చాలామంది బాగుందని గుర్తుచేస్తూండేవారు! నేను వివిధభారతి నుండి ప్రధాన కేంద్రానికి బదిలీ అయి వచ్చేశానుగా! వివిధభారతి స్టూడియో అసెంబ్లీ ఎదురుగా ఉండే భవనంలోనే ఉన్నా, కార్యాలయం ఆఫీసు మాత్రం ఏ.సి.గార్డ్స్‌లో ఉండేది. సబిత ఫాదర్ పోలీస్ డిపార్ట్ మెంట్‌లో పనిచేసేవారనీ, ఒకసారి వివిధ భారతి కార్యాలయానికి వెళ్ళి నా గురించి వాకబు చేసారనీ, బహుశా నేను ఎలిజిబుల్ బ్యాచులర్‌ని కాబట్టి, పెళ్ళి సంబంధం గురించే అయివుంటుందనీ, మిత్రులు సరదాగా ఆటపట్టించడమూ గుర్తుంది! వాళ్ళ ఫాదర్ ఎందులో చేస్తారో, అసలాయన ఆఫీసుకెళ్ళారో లేదో, అదంతా అబద్ధమూ, వట్టి పుకారేననీ నేననుకుంటూ ఉంటాను.



రేడియో సృజనాత్మక కార్యాలయం కనుక, అందునా రచయితలూ, కవులూ, నటులూ, రకరకాల కళాకారులకు నెలవు కనుక, స్త్రీ పురుష పరిచయాలూ, సంబంధాల గురించి - కొన్ని వాస్తవ కథనాలూ, అనేక పుకార్లూ చెలరేగుతూండడం మామూలే. 'ప్రసారప్రముఖులు' అనే గ్రంథం రాసిన డా.ఆర్.ఎ.పద్మనాభరావుగారు ఆ గ్రంథంలో ప్రసార దంపతులు గురించి రాసి చివర్లో - "వీరేగాక కలిసి మెలసి పనిచేయడం వల్ల పరస్పరాకర్షితులై దంపతులకన్నా మిన్నగా ప్రవర్తించిన వారెందరో ఆయా కేంద్రాలలో ఉన్నారు. వీరిని ప్రసార ప్రేమికులనవచ్చు. ఇది



డా.ఆర్.ఎ.పద్మనాభరావు



ఆకాశవాణి ప్రత్యేకత" అని కొంటెగా రాసినా, అలాంటి కథనాలకూ కొదవలేదు! యువవాణి రోజులనుంచీ - అలా పరిచయమై, తదనంతరం వివాహాలు చేసుకున్నవారూ, తమకు పెళ్ళయ్యీ - ఇతరులతో తిరుగుతూ, తమ జీవితాల మాట ఎలా ఉన్నా, అవతలి వారి జీవితాలను పాపం! అతలాకుతలం చేసినవారూ ఉన్నారు. డ్యూటీ ఆఫీసర్‌గా మాతో పనిచేసిన హైమవతికి వివాహం కాకపోవడానికి, ఈనాడు తను దాదాపుగా ఒంటరిగా పిచ్చిదానిలా మిగిలిపోవడానికీ - అలాంటి ఒకరు కారణంగా చెప్పుకోవడమూ ఉంది!

అదృష్టవశాత్తూ - నా గురించి నాకు తెలిసి, అలాంటి పుకార్లూ, సంబంధాలు అంటగట్టడాలూ ఏమీ లేవు! "రాముడు బుద్ధిమంతుడు" వ్యవహారంగానే ఉండేది. (నా వెనకాల ఏమన్న ఎవరన్నా అనుకునుంటే నాకు తెలియక ఉండేదంటారా?) సరే! చెప్పానుగా! నా దృష్టి వివాహం వైపు లేకుండేదని. ఎం.ఫిల్ రీసెర్చిలో బాగా శ్రద్ధపెట్టి, 1982 లోనే ఎం.ఫిల్ పూర్తిచేసేసానుకూడా. పి.హెచ్.డి.కి రిజిష్టర్ కూడా చేసాను. ఉస్మానియాలోనే. ప్రధాన కేంద్రానికి బదిలీ అయిరావడంతో, పని ఒత్తిడి పెరిగింది. నాకున్న సహజ ఆసక్తుల వల్లకూడా - కార్యక్రమాల తయారీలో, అనేక విధాలుగా కూరుకుపోయాను! వారం వారం శ్రోతల ఉత్తరాలకు జవాబులు 'పరిచయ పత్రం'కు వేలాదిగా లేఖలు వస్తూండేవి. దాని స్క్రిప్ట్, సమర్పణ బాధ్యత నాదే అలా నిరంతరం ఏదో వ్యాపకంతో బిజీగా ఉండేవాడిని. బయట సాహిత్య సభలకు కూడా నన్ను విశేషించి గౌరవంగా ఆహ్వానిస్తూండేవారు! అధ్యక్షునిగా, ముఖ్యఅతిథిగా ఆ రోజుల్లోనే పాల్గొన్న సభలెన్నో ఉన్నాయి. 1983 జనవరిలో జాతీయకవి సమ్మేళనంలో పాల్గొని తిరిగిరావడంతోనే, నా చేత ప్రధాన కేంద్రంలో, ఆ ఏడాది చాలా కార్యక్రమాలు సాహితీపరమైనవి చేయించారు. ఉదయం 7.45కు ఆ రోజుల్లో ప్రసారమైన 'రాగం - భావం' కార్యక్రమంలో విశేషించి స్క్రిప్టు రాయడం, పాల్గోవడం జరిగేది. అదీగాక - రాత్రి 7 గంటలకు ప్రసారమయ్యే 'భావవాహిని'లో, వారం వారం ఒక కాలమ్ లాగా ('రేడియో కాలమ్'లా) నా రచన వినిపిస్తూండేవాడిని. శ్రీమాన్ పుట్టపర్తి నారాయణాచార్యుల గారి అమ్మాయి, డ్యూటీ ఆఫీసర్‌గా కొలీగ్ అయిన పుట్టపర్తి నాగపద్మిని కూడా వారంలో ఓ రోజు 'భావవాహిని' రాసి సమర్పిస్తూ ఉండేది. ఒక దశలో కొన్నాళ్ళు - పరస్పరం 'ఉత్తర ప్రత్యుత్తరం' అన్న బాపతుగా 'భావవాహిని' విషయాలను ఎంపిక చేసుకుని, మేం ప్రసారం చేయడం కూడా గుర్తే! కవిసమ్మేళనాలకూ, సంగీత సమ్మేళనాలకు నేను వాఖ్యాతగానూ వ్యవహరించేవాడిని. నాటకాల్లో పాత్రలు వేసేవాడిని. ప్రాంతీయ వార్తల అనంతరం ఆ రోజుల్లో నిరుద్యోగులకు ఉద్యోగ సమాచారం అందించే "ఉద్యోగ వార్తలు" జీడిగుంట రామచంద్రమూర్తిగారూ, లేకపోతే నేనూ మా గళంలోనే అందించేవాళ్ళం!



నాగపద్మిని

1983 జూలై 24 న ఆదివారం మధ్యాహ్నం మూడింటికి ప్రసారమయ్యే గంట నాటకం ఒక దానిని 'రాఘవ' రచించిన 'సాయన్న బావి'ని నేను ప్రొడ్యూస్ చేసాను. ఆదివారం మధ్యాహ్నం గంట నాటకం ప్రొడ్యూస్ చేయడం అదే నాకు తొలిసారి! అదీ ఒక ఘనతే ఆ రోజుల్లో మరి! రవివర్మ, శారద శ్రీనివాసన్, నేనూ కలిసి నటించిన రేడియో నాటిక ఆ ఏడే ప్రసారమైంది. పిల్లలకోసం 'వంటింట్లో విప్లవం' అనే కార్టూన్ కవితా నాటిక బాలల దినోత్సవ సందర్భంగా 1983 లోనే రచించి ప్రసారం చేసాను. దానిని రవీంద్రభారతి వేదిక మీద బాలబాలికలు ప్రదర్శించారు.

ఆకాశవాణికి - ఢిల్లీలో ప్రధానంగానూ, మిగతా కొన్నిచోట్ల ప్రాంతీయంగానూ 'శిక్షణా సంస్థలు' ఉన్నాయని ముందే చెప్పానుగా! రేడియోలో పనిచేసే ట్రాన్స్ మిషన్, ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్‌లకు అలాంటి వివిధ శిక్షణాతరగతులకు అఫీషియల్‌గా పంపుతూండేవారు. అనౌన్సర్లకు కూడా శిక్షణా తరగతులుండేవి. ట్రాన్స్ మిషన్ ఎక్జిక్యూటివ్‌గా మొదటిసారి అలా బయట ప్రాంతంలో శిక్షణ నిమిత్తం వెళ్ళింది - 1983 21 ఫిబ్రవరి నుండి, మార్చి 3 వ తేదీవరకు - కర్ణాటక రాష్ట్రంలోని 'ధార్వాడ్' కేంద్రంలో. మద్రాసు, పాండిచ్చేరి, కోయంబత్తూర్, బెంగుళూర్, త్రివేండ్రం, మైసూర్, గుల్బర్గా, విశాఖపట్నం నుంచి వచ్చిన మిత్రులూ అక్కడ శిక్షణ పొందాం! విశాఖ

నుంచి పాల్గొన్న కె.జి.ఆనందబాబుది మంచి డ్రామా వాయిస్. తర్వాతి కాలంలో ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్ అయ్యాడుకానీ విపరీతమైన తాగుడుకు బానిసై, సర్వీస్ లో ఉండగానే పోయాడు. ధార్వాడ్ ట్రైనింగ్‌లో పాల్గొన్న అక్కడ ట్రాన్స్‌మిషన్ ఎక్జిక్యూటివ్.. హెచ్.ఆర్.కమల కర్ణాటక సాహిత్య అకాడమీ అవార్డుపొందిన రచయిత్రిగా ఎదిగింది. గుల్బర్గా నుంచి వచ్చిన 'శ్రీ బెల్లక్కి' తరువాత డైరెక్టర్ స్థాయికి ఎదిగాడని విన్నాను.


డా.ఇరివెంటి కృష్ణమూర్తి

రీజనల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ హైదరాబాద్‌కు అప్పుడు పి.యు. అయూబ్ అధిపతిగా ఉండేవారు.

సాహిత్య రంగాన ఆ ఏడాదే యువభారతి సంస్థకు డా.ఇరివెంటి కృష్ణమూర్తిగారు అధ్యక్షులుగా, ముగ్గురు ఉపాధ్యక్షులలో డా.తిరుమల శ్రీనివాసాచార్యులు, కె.బి.లక్ష్మితో బాటు నేనూ ఒకడిగా ఎన్నికయ్యాను. 'నందిని' అనే మాసపత్రికను యువభారతి బులిటెన్‌గా వెలువరించేది. పెళ్ళి శుభలేఖలు, పిల్లల బర్త్‌డే కార్డులు ఎన్నో చిత్రకారునిగా నేను డిజైన్ చేస్తూండేవాడిని. "వంద శుభలేఖలు రూపొందించిగానీ నువ్వు శుభలేఖ ఇవ్వవేమిటోయ్. నీ పెళ్ళెప్పుడు మరి" అని శ్రీమతి శారదా శ్రీనివాసన్ గారు నవ్వుతూ అడుగుతుండేవారు.

తమాషాగా నేను వివాహం చేసుకున్న వ్యక్తి రేడియోలో పనిచేసే ఆమెయే కావడం తదనంతరం జరిగింది. అలాగని మాకు ముందుగానే కలిసిపని చేయడం, పరిచయం ఉండడం జరిగిందనుకోకండి! పెద్దలు కుదిర్చిన సంబంధమే, మేమూ ఇష్టపడి చేసుకున్నదయింది.

ఆకాశవాణి కార్యక్రమాల తెలుగు పక్షపత్రిక 'వాణి' కి సంపాదకులుగా - డి. రాధాకృష్ణమూర్తిగారు విజయవాడలో పనిచేసేవారు. ఆయనా సర్వీసులో ఉండగానే పోయారు.


కె.బి.లక్ష్మి

వారి అబ్బాయిల్లో ఒకరైన 'ప్రభాకర్' కె.బి.లక్ష్మి భర్త అయిన కె.వి. కామేశ్వరావ్‌కు మేనమామకొడుకు. లక్ష్మి, కామేశ్వరావ్ యువభారతి నుండీ స్నేహితులు. అలాగే వారి వివాహం అయ్యింది. లక్ష్మి నాకు ఎం.ఏ లో క్లాస్ మేట్ కూడాను. ప్రముఖ రచయిత్రిగా, విపుల, చతుర సంపాదకురాలిగా రేడియో టీవీ వ్యాఖ్యాత్రిగా, కె.బి లక్ష్మి చాలామందికి తెలిసిన సాహితీ మూర్తియే!

శ్రీ రాధాకృష్ణమూర్తిగారి అబ్బాయి అయిన ప్రభాకర్ ఒకసారి నేను డ్యూటీలో ఉండగా వచ్చి - "మా పిన్నిగారి కూతురికి డ్యూటీ ఆఫీసర్‌గా మద్రాస్ స్టాఫ్ సెలక్షన్ ద్వారా ఉద్యోగం వచ్చిందండీ! మిమ్మల్నడిగితే ఆ పోస్టులో సాధక బాధకాలు తెలుస్తాయని మా కామేశ్వరావ్ బావ చెబితే వచ్చా"నంటూ వచ్చాడు. "షిఫ్ట్ డ్యూటీలుంటాయనీ, సాహిత్యాది ఆసక్తులుంటే ఫరవాలేదనీ ఎటొచ్చీ ఏ కడపలాంటి చోటో కాకుండా, మంచి కేంద్రంలో అయితే బాగుంటుందనీ" అతనితో నేనన్నాను. "తను ఎం.ఏ ఇంగ్లీష్ ఆంధ్రాయూనివర్సిటీ గోల్డ్ మెడల్ అనీ, నాట్యకళాకారిణి అనీ ఆమె పేరు ఉషారాణి అనీ" చెప్పాడు. హైదరాబాద్ మెయిన్ స్టేషన్ కనుక - అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌ని కలిసి ప్లేస్ ఆఫ్ పోస్టింగ్ గురించి కనుక్కోమని సలహా ఇచ్చాను. మిత్రుడూ, అనౌన్సర్ అయిన కపర్ది వాళ్ళనాన్నగారు శ్రీ ఇ.వి.ఎస్.ఎన్. మూర్తిగారు అప్పుడు ఏ.ఓ (అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్)గా చేస్తూండేవారు. ఆయన 'ఉషారాణికి కడపలోనే పోస్టింగ్ వచ్చిందని' చెప్పారని ప్రభాకర్ వచ్చి చెప్పాడు.

తను 1983లో ఆకాశవాణి కడప కేంద్రంలో చేరి, ప్రభాకర్ వాళ్ళ తమ్ముడు మురళి మెడికల్ రిప్రజెంటేటివ్‌గా విజయవాడలో పనిచేస్తున్నాడని, తమ కాకినాడకు - కడపకన్నా విజయవాడ పోస్టింగ్ అయితే బాగుంటుందని - కడపలో చేరిన ఏడాదిలోగానే, విజయవాడకు బదిలీ అయి, విజయవాడ ఆకాశవాణిలో డ్యూటీ ఆఫీసర్‌గా చేరింది. అప్పట్లో ప్రోగ్రాం సమ్మరీ ట్యాలీ చేసుకోవడానికి, ముఖ్యమైన నాలుగు కేంద్రాల రిలే కార్యక్రమాల గురించీ, ఉదయ ప్రసారానికి ముందే - విజయవాడ, విశాఖ, కడప వంటి కేంద్రాల డ్యూటీ ఆఫీసర్లు లైన్లో హైదరాబాద్ డ్యూటీ ఆఫీసర్స్‌తో మాట్లాడుతూండేవారు. మేమిద్దరం అలా మాట్లాడుకున్నదీ తక్కువేననుకోండి.

తను విజయవాడలో చేరిన తరువాతేననుకుంటా - ఒకసారి ప్రభాకర్ తన ఫోటోతో కామేష్ ద్వారా నన్ను పెళ్ళి సంబంధం ప్రస్తావనకై ఆకాశవాణికి వచ్చాడు. నేను ఆమె ఫోటోనైనా చూడకుండానే, "నాకు వివాహ ఉద్దేశ్యం లేదని" ప్రభాకర్‌ని త్రిప్పి పంపించడమూ గుర్తుంది. కానీ ఏదైనా 'ఘటన' కదా!

ఉషారాణిని పెంచుకున్న తల్లితండ్రులు - మా తల్లితండ్రులులాగానే రాధాస్వామీ సత్సంగులు! నేను తప్ప, మా ఇంట్లో అందరూ ఇప్పటికీ ఆ మార్గానుయాయులే! ఒకసారి 'దయాల్బాగ్'లో ఉషారాణి చేసిన నృత్యాన్ని మా అమ్మా నాన్నగారూ చూసారట! మా అమ్మగారికి తనపై సదభిప్రాయ ఏర్పడింది. ఇంతలో ఆమె (పెంపుడు) తల్లి తండ్రులు మా వాళ్ళని నాతో పెళ్ళి సంబంధం గురించి ప్రస్తావించడం జరిగిందట! శ్రీఎస్.ఎల్.నరసింహంగారని ఆయన కాకినాడలో 'తెలుగు ప్రేమ ప్రచారక్' సంపాదకులుగా ఉండేవారు. ఉషారాణి చిన్నప్పటినుండీ వారి దగ్గరే పెరిగింది. అసలు తండ్రి హనుమంతరావు గారు - జంషెడ్ పూర్ టాటా కంపెనీలో చేసేవారు. తరువాత నాగ్‌పూర్‌లో ఉండేవారు.


ఉషారాణి

ఇంతకీ విషయం, దయాల్బాగ్ వెళ్ళివచ్చిన మా అమ్మా నాన్నగారూ - నేను తనను వివాహమాడితే బాగుండునని మాటాడుకోవడం విన్నాను! మిత్రుడు కామేశ్వరావ్, అలాగే ప్రియమిత్రుడు విశ్వనాథ సూర్యనారాయణ భార్య అయిన ప్రముఖ కవియిత్రి జయప్రభ ద్వారా కూడా ఉషారాణి గురించి వింటూ వచ్చాను. మా నాన్నగారికి తాను రిటైర్ కాకముందే నా వివాహం చేయాలన్న సంకల్పం చాలా గాఢంగా ఉండేది! నేను చూపుతున్న విముఖత కారణంగా - ఒక విధంగా మేనరికమే అయిన, మా తమ్ముడు దయాల్ దాస్ వివాహం, నాకన్నా ముందే జరిగింది. నా కోసం తన వివాహం వాయిదా వేయవద్దని నేను గట్టిగా అన్నాను కూడా! అందువల్ల మా తమ్ముడి పెళ్ళి నాకన్నా ముందుగా జరిగింది.

నాలాగానే డ్యూటీ ఆఫీసర్‌గానే పనిచేస్తున్న ఉషారాణిని 1984 డిసెంబర్‌లో విజయవాడలో వ్యక్తిగతంగా కలుసుకోవడం, 1985 జనవరి 26 గణతంత్రదినోత్సవం 'వసంత పంచమి' నాడే, మా వివాహం మొత్తానికి కాకినాడలో జరగడం అలా మేం ప్రసార దంపతులం కావడం ఘటించింది.

' రేడియో జ్ఞాపకాలు లో హైదరాబాదు కేంద్ర స్టేషన్ డైరెక్టర్ రాజారామ్‌గారి గురించి ప్రస్తావించిన చోట వుంచిన ఫోటో శ్రీరాజారామ్ ది కాదు. మారో డైరెక్టర్ శ్రీగణేషన్‌గారిది. పొరబాటును మన్నించాలి. పొరపాటు ఫోటో పెట్టిన విషయం గుర్తించి చెప్పిన ఆకాశవాణి రిటైర్డ్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీ చలపతిరావు గారికి కృతజ్ఞతలు - సుధామ



మిత్రసాహితి

సాహితీ సాంస్కృతిక సంస్థ

ఖైరతాబాదు, హైదరాబాదు - 4.

Regd. No. 27/81

దుందుభి ఉగాది సందర్భముగ నిర్వహించు

యువ కవి సమ్మేళనం

అధ్యక్షులు : శ్రీ సుధామ, AIR

ముఖ్య అతిథి : శ్రీ మోహన్ [illegible]

[illegible]

తేది 20-3-82 సమయము : ఉదయం గం॥ 8-30 ని॥లకు

స్థలం : శాఖా గ్రంథాలయము ఖైరతాబాదు

మాడభూషి అనంతం, అధ్యక్షులు — [illegible] — పి. యస్. ఆర్. ఆంజనేయులు, కార్యదర్శి



పాల్గొను యువ కవులు

శ్రీ విశ్వనాథ సూర్యనారాయణ
శ్రీమతి జయప్రభ
కుమారి జె. సుబ్బలక్ష్మి
శ్రీ గులాంగౌస్
కుమారి వై. శాంతి
శ్రీ రమణ
శ్రీ జగన్నాథశర్మ
శ్రీ కమలాసనరావు
శ్రీ పింగళి జగన్నాథరావు

శ్రీమతి కె. బి. లక్ష్మి
శ్రీ వేంకట్రామారెడ్డి
శ్రీ ఆనంద్
శ్రీ శ్యామ్ సుందరమూర్తి
శ్రీ మోహన్ కుమార్
శ్రీ చెన్నప్ప యస్.
శ్రీ వసంత కృష్ణ
శ్రీ దేసు వేంకటేశ్వర్లు
శ్రీ రాజేశ్వరరెడ్డి

శ్రీ మహేందరరెడ్డి
శ్రీమతి ఇందిర, SBI
శ్రీ మకరాంక
శ్రీ అమాతి రవీంద్ర
శ్రీ నరహరిదేవ్ (హిందీ)
శ్రీ రసశ్రీ
శ్రీ బి. రవికుమార్
శ్రీ కస్తూరి వేణుగోపాల్
శ్రీ శ్రీధర్

అశోకా స్టోర్సు ఖైరతాబాదు వారి అభినందనలతో

ఫోన్ నెం. 220596



యువభారతి నూతన కార్యవర్గము

(1983 - 84)

అధ్యక్షుడు : డా॥ ఇరివెంటి కృష్ణమూర్తి

ఉపాధ్యక్షులు : 1. డా॥ తిరుమల శ్రీనివాసాచార్యులు
2. శ్రీ ఎ. వెంకటరావు (సుధామ)
3. శ్రీమతి కె. బి. లక్ష్మి

కార్యదర్శి : శ్రీ ఎ. రామలింగేశ్వరరావు

సహకార్యదర్శులు : 1. శ్రీ వై. వి. వివేకానంద
2. శ్రీ ఎ. రవీంద్ర
3. శ్రీ డి. వి. హనుమంతరావు

కోశాధికారి : శ్రీ ఎస్. వి. ప్రభాకరరావు

కార్యవర్గ సభ్యులు : 1. శ్రీ ఎస్. వెంకటేశ్వరరావు
2. శ్రీ ఎస్. పాండురంగారెడ్డి
3. శ్రీ ఎమ్. అనంతాచార్య
4. [illegible]
5. [illegible]
6. శ్రీ కె. కామేశ్వరరావు
7. శ్రీమతి కె. కృష్ణకుమారి

సమావేశకర్త : డా॥ వి. విశ్వనాథం




# 19

**భార్యాభర్తలు ఇద్దరూ ఒకే ఆఫీసులో పనిచేయడం** వల్ల కొన్ని సుఖాలూ ఉంటాయి, కొన్ని కష్టాలూ ఉంటాయి. పైగా ఇద్దరిదీ ఒకే హోదా అయితే, ఒక విధంగా - పనిచేయడంలో, ఇతరులు పోల్చి చూడడం కూడా ఉంటుంది. అదృష్టవశాత్తూ ఉషారాణికీ, నాకు కూడా పని విషయంలో అధికారులు ఏనాడూ వేలెత్తి చూపే విపత్కర పరిస్థితులు రాలేదు. ఇద్దరమూ పనిమంతులుగానే గుర్తించబడ్డాం. అయితే ఉష హడావుడి పడుతూ, పరుగులు పెడుతూ, చలాకీగా పనిచేసే ఉద్యోగిని అయితే, నేను కొంత సౌమ్యంగా, నెమ్మదస్తుడిగా, తీర్చిదిద్దినట్లు పనిచేసేవాడిగా అనుకునేవారు.

మా వివాహం నాటికి తను విజయవాడ ఆకాశవాణిలో డ్యూటీ ఆఫీసర్ అయితే, నేను హైదరాబాద్ కేంద్రంలో డ్యూటీ ఆఫీసర్‌ని. విజయవాడ డైరెక్టర్‌గా అప్పుడు శ్రీ పి. ఆర్. రెడ్డిగారు, హైదరాబాద్ డైరెక్టర్‌గా మిస్.లీలా బౌడేకర్ ఉన్నారు. మా నాన్నగారూ అమ్మా, మిత్రులు అనుకుంటుండడం వల్ల, ఒకసారి విజయవాడ వెళ్ళి, తనను చూసి మాట్లాడమని మిత్రులు కృష్ణారావ్, కామేశ్ కూడా గట్టిగా అని, వారే నాతో బాటు తోడుగా బయలుదేరి రాగా, 1984 డిసెంబర్ మూడు రాత్రి బయలుదేరి నాలుగోతేదీ విజయవాడ వెళ్ళాం. హోటల్లో దిగాం. కామేశ్, కృష్ణారావు అప్పుడు ఉషతో బాటువున్న ఆమె (పెంపుడు) తల్లిగారి దగ్గరకు వెళ్ళి దయాల్బాగ్‌లో మీరనుకున్న అబ్బాయి, అమ్మాయిని చూడడానికి వచ్చాడనీ, ఎటొచ్చీ ఇక్కడ ఇంటికి రానన్నాడనీ చెప్పి, ఉషతో మాట్లాడి సాయంత్రం తన డ్యూటీ అయ్యాక, 'కృష్ణా బ్యారేజి' దగ్గర మేం కలిసే ఏర్పాటు చేసారు. నేను మధ్యాహ్నం ఆకాశవాణికి ఫోన్ చేసినప్పుడు డ్యూటీలో ఉన్న తనే ఫోన్ ఎత్తింది. అప్పుడు క్రికెట్ మ్యాచ్ ఏదో జరుగుతూండడం వల్ల "స్కోర్ ఎంత" అని అడిగాను. రేడియోలో క్రికెట్ కామెంటరీ ప్రసారమవుతున్నప్పుడు, అప్పటికి ఇంకా టీవీ విస్తృతం కాలేదు కనక, చాలామంది స్కోర్ గురించి డ్యూటీ రూమ్‌కు ఫోన్ చేయడం


మిస్.లీలా బౌడేకర్

మామూలే! ఆట మీద ఆసక్తిలేకపోయినా, ఏ డైరెక్టరో ఫోన్ చేసి డ్యూటీ ఆఫీసర్ రేడియో మానిటర్ చేస్తున్నాడో లేదో తెలుసుకోవడానికైనా, 'స్కోర్' అడిగే అవకాశం ఉంది కనుక, శ్రద్ధపెట్టేవాళ్ళం! కానీ డ్యూటీ రూంలో ఇతర పనులూ, వేరే ఫోన్‌లు అటెండవుతూ, కంటిన్యూగా, అప్ టు డేట్ స్కోర్ ఫాలో కావడం అంత సులభమేమీ కాదు! ఉష నా గురించి వినడం, ఉదయం దినపత్రిక కాలంలో నా ఫోటో చూడడమూ ముందే జరిగిందట.



సరే! ఆ సాయంత్రం వాళ్ళింటి నుంచి కామేశ్ తనను తీసుకురాగా, కృష్ణారావూ, నేను కృష్ణాతీరం చేరాం. కామేశ్, కృష్ణారావ్, మేం ఇద్దరం మాట్లాడుకోవడానికి మమ్మల్ని వదలి, దూరంగా వెళ్ళారు. ఉష, నేను కృష్ణా బ్యారేజ్ మీద ఈ చివరనుంచి ఆ చివరి వరకూ నడుచుకుంటూ మాట్లాడుకున్నది - సగం ఆఫీసు కబుర్లే ముందు! నా ఆశలూ, ఆశయాల గురించీ, అభిరుచుల గురించి, జరిగిన నా వైఫల్యాల గురించీ తనకు చెప్పాను. ఆ తరువాత అంతా వాళ్ళింటికి వెళ్ళి వాళ్ళ అమ్మగారిని కూడా కలిసి, ఆ రాత్రే కృష్ణారావ్, కామేశ్, నేను హైద్రాబాద్ తిరిగివచ్చాం. అమ్మా నాన్నగార్లకు వారికి నచ్చిన అమ్మాయిని నేను వివాహం చేసుకుంటానని చెప్పడం ఎంతో ఆనందం కలిగించింది. ఆ తరువాత పెద్దవాళ్ళు కలిసి మాట్లాడుకోవడం, ఎటువంటి ఆడంబరం లేకుండా, కట్నం ప్రమేయం లేకుండా, కొంతమేరకు సత్సంగ పద్ధతిలోనే, జనవరి 26, 1985న మా వివాహం కాకినాడలో జరిగింది. కొందరు సన్నిహిత మిత్రులు పెళ్ళికి తరలివచ్చారంతే! కేవలం పదిహేను రోజులు మాత్రమే సెలవు తీసుకుని, వివాహానంతరం వెంటనే బెంగుళూర్, మైసూర్ 'హనీమూన్' అన్నట్లుగా వెళ్ళివచ్చి, మా, మా ఉద్యోగాల్లో చేరిపోయాం! ఆరునెలలలోగా తనకు హైదరాబాద్ బదిలీ కాకపోతే, తను ఉద్యోగం మానేయాలని కూడా అనుకున్న సందర్భం ఉంది. మా హైదరాబాద్ డైరెక్టర్ లీలా బొడేకర్ గారు - నన్ను అభిమానించే డైరెక్టర్. ఆవిడే విజయవాడ డైరెక్టర్ పి.ఆర్.రెడ్డి గారితో మాట్లాడి, ఉషను హైదరాబాద్ బదిలీ చేయాలనీ చెప్పి, డైరక్టరేట్ నుంచి మూడు నెలలు తిరక్కుండానే, ఉషకు హైదరాబాద్ పోస్టింగ్ వచ్చేలా చూసారు. పి.ఆర్.రెడ్డిగారు కూడా ఉష పట్ల అభిమానం గలవారే.. డైరెక్టర్లు ఇద్దరూ, ముందు అవతలి వారు, మేం ఒకేచోట కలిసి పనిచేసే పోస్టింగులకోసం ప్రయత్నించాలని, ముందు ఎవరికి వారు పంతం పట్టినా, చివరకు లీలా బొడేకర్ - హైదరాబాద్‌లోనే ఉషకు పోస్టింగ్ ఆర్డర్లను పట్టుబట్టి రప్పించారు.



బెంగుళూర్, మైసూర్ లో

లీలా బొడేకర్ గారికి వివాహం కాలేదు. ఆవిడ 'స్పిన్‌స్టర్'(బ్రహ్మచారిణి)గానే ఉండిపోయింది. బొంబాయి నుంచి వచ్చిందావిడ. మరాఠీ మాతృభాష అనుకుంటా! కొంచెం పొట్టిగా, కొద్దిపాటి స్థూలంగా ఉండేవారు. కానీ పనిలో తెగదిట్ట. ముఖ్యంగా క్రమశిక్షణ, పని విషయంలో. డ్యూటీ రూం 'క్యూషీట్'లో, చేత్తో ఒక్క అక్షరం రాయడమనేది ఉండకుండా, అన్ని వివరాలూ పక్కాగా టైప్‌చేసి ఉండాలనేది ఆవిడ సిద్ధాంతం. ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్‌లు అడ్వాన్స్‌గా పక్కా ప్లాన్ చేసుకుని, సమయానికి రికార్డింగులు, డబ్బింగులు చేసి, కార్యక్రమాల వివరాలు క్యూ షీట్ లో కచ్చితంగా టైప్ అయి ఉండేలా చూసుకోవడానికి, చాలా శ్రమించాల్సి వచ్చేది. చివరి నిముషం

మార్పులను ఆవిడ తేలిగ్గా తీసుకునేది కాదు ఓ రోజు ఉదయం డ్రైవర్ ఒకరు వేళకు రాలేదని తెలిసి, పదింటికి అతను వచ్చేవేళకు, ముందు తనే వచ్చి, 'మెమో'టైప్ చేయించి అతని చేతిలో పెట్టింది. అలాగని ఆవిడ కర్కోటకురాలేమీ కాదు. స్టాఫ్ తో సరదాగా ఉండడమూ, స్టాఫ్ ఫ్యామిలీస్‌తో పిక్నిక్‌లు ప్లాన్ చేయడమూ, ఆకాశవాణి క్లబ్‌ను యాక్టివ్‌గా ఉంచడమూ చేసేవారు! కానీ పని దగ్గర పనే! ఒకరోజు అనౌన్సర్ జ్యోత్స్న ఆవిడని రాత్రి భోజనానికి ఇంటికి పిలిస్తే వెళ్ళి, సరదాగా గడిపి, ఆ మర్నాడు మీటింగ్‌కు 'జ్యోత్స్న' అయిదునిముషాలు ఆలస్యంగా వస్తే, 'గెటౌట్' అన్న మనిషి లీలాబౌడేకర్.

అలాగే - షిఫ్ట్ డ్యూటీ స్టాఫ్ వచ్చేవేళలూ, వెళ్ళే వేళలూ నిఘా వేసేవారు. సెక్షన్ స్టాఫ్, అడ్మిన్ వాళ్ళు ఎన్నింటికి వస్తున్నారో తెలుసుకోవడానికి, వరుసగా మూడురోజులు ఆకాశవాణి గేట్ ముందు కుర్చీ వేసుకు కూర్చుని, స్టాఫ్ ఆర్టిస్టులు ముఖ్యంగా.. సంగీతం, డ్రామా విభాగాల కళాకారులు పనివేళలు పాటించడంలోని అలసత్వాన్ని గుర్తించి, ఆవిడంటే భయపడేలా చేసింది! ఆవిడకు పెళ్ళికాలేదు కనుక - సంసారుల బాధలు తెలియవనీ, ఫ్యామిలీ ప్రాబ్లమ్స్ ఆవిడకు అర్థం కావనీ కామెంట్ చేసేవారు. కానీ అడ్మినిస్ట్రేషన్ విషయంలో ఆవిడ కచ్చితంగా ఉండేది. క్లరికల్ స్టాఫ్‌లో - మరాఠీ కుర్రాడు 'కాంత్'ని ప్రోత్సహించి, డిగ్రీ పాస్ చేయించి, వాడికి అనౌన్సర్ ఉద్యోగం వచ్చేలా చేసిందావిడే! పనిచేయని కార్యక్రమ నిర్వహణాధికారులను వారికి తెలిసి వచ్చేలా, బదిలీలు చేయించిందీ, అదే సమయంలో పనిమంతులను ప్రోత్సహించిది కూడా ఆవిడే! నాగార్జున సాగర్ లో 'బాలల దినోత్సవం' ఏర్పాటు చేయించి, ఆహూతుల సమక్షంలోని ఆ కార్యక్రమానికి పాల్గొనే పిల్లలతో బాటు తానూ వచ్చి, నాగార్జున సాగర్ మ్యూజియం చూడడంలో, పడవ షికారులో కేరింతలు కొట్టిందీ ఆవిడే

డ్యూటీ ఆఫీసర్లను పొట్టిపేర్లతో పిలవడం ఆవిడకలవాటు. విద్యాలంకార్‌ను 'విద్యా' అనీ, దుర్గారాజ్‌ని 'దుర్గా'అని, నన్ను 'సుధా' అని, కళాకృష్ణని 'కళా' అని అలా మమ్మల్నందరినీ ఆడపేర్లతో పిలవడం ఆవిడకదో సరదా! డ్యూటీరూం సక్రమంగా పనిచేస్తే, డ్యూటీ ఆఫీసర్లకూ, అనౌన్సర్లకూ ఎలాంటి అసౌకర్యాలు లేకపోతే ట్రాన్స్‌మిషన్ సజావుగా, శ్రోతృజనరంజకంగా సాగుతుందని ఆవిడ విశ్వాసం! అందుకు తగ్గట్లు డ్యూటీ రూంకు ఇబ్బందులు కలగకుండా సహకరించేది. చివరి నిమిషం నిర్ణయాలు - డ్యూటీ ఆఫీసర్, ఢిల్లీ రిలే వంటి కార్యక్రమాల గురించి తీసుకోవడానికి స్వేచ్ఛనిచ్చి సమర్థించేది.. డ్యూటీ రూంలో అప్పుడు డ్యూటీ ఆఫీసర్లు పలు రిజిస్టర్ రాసి నిర్వహించవలసి వచ్చేది. S.O.S (తప్పిపోయినవారి వివరాల ప్రకటనల) రిజిస్టర్, డీవియేషన్ రిజిస్టర్ (వాణిలో పేర్కొన్నదానికి బదులు వేరేది ఏది వెళ్ళినా సరే!) వెదర్ రిజిస్టర్, ఆర్.ఎన్.ఛానల్ రిజిస్టర్, డెవలప్ మెంట్ ప్రోగ్రామ్స్ రిజిస్టర్‌తో బాటు న్యూస్ రిజిస్టర్ కూడా ఉండేది. వార్తల్లోని ముఖ్యాంశాలను న్యూస్ రిజిస్టర్‌లో నమోదు చేయాల్సి ఉండేది. అడ్వైజ్ రిజిస్టర్లు వంటివీ ఉండేవి. రోజూ మీటింగ్ తరువాత, ఆ రిజిస్టర్లన్నీ డైరెక్టర్‌గారి టేబుల్ మీదకు చేరేవి. ఆవిడ క్లాసు పుస్తకాలు దిద్దినట్లు, వాటిని దిద్దడం మాకు ఆశ్చర్యం కలిగించేది! దుర్గారాజ్ ఇంగ్లీష్‌లో హెడ్‌లైన్స్ రాస్తే - ఆ విషయమూ, ఆ రాత కూడా అర్థమై చావవనుకునేది. 'ఫ్రెష్ ఫిట్టింగ్ బిట్వీన్ ఇరాన్ అండ్ ఇరాక్' అని ఏక వాక్య పంక్తి వార్తలు రాసినా - 'ఫైటింగ్'కు 'ఫిట్టింగ్'అని రాసి, ఆవిడకు చికాకు తెప్పించేవాడు. "నీ ఇంగ్లీష్ చదివితే దుర్గా! నా భాషపోయేట్లుంది" అని గోలపెట్టేది వాడితో. పొద్దున్న రాగానే, సాయంత్రం వెళ్ళేటప్పుడూ విధిగా డ్యూటీ రూముకు వచ్చి వివరాలు అడిగి, అందరూ వచ్చారా లేదా అని వాకబు చేసి, సాయంత్రం తాను ఎటయినా వెడుతూంటే, అది ముందే చెప్పి, రిలేలు ఇంపార్టెంట్‌వి ఏవయినా ఉంటే, డ్యూటీ ఆఫీసర్‌నే కార్యక్రమం బట్టి తననే నిర్ణయం తీసుకోమని హామీ ఇచ్చి, వెడుతూండేవారు. డైరెక్టర్ - మిస్ లీలా బౌడేకరే మెప్పుపొందిన ఓ సందర్భం గుర్తుకు వస్తోంది.

దూరదర్శన్ ఆర్టిస్ట్ సూరిబాబు డిజైన్ చేసిన మా పెళ్ళిశుభలేఖ




# కృష్ణా బారేజి

సంధ్యా సమస్యల చీకటి కాటుక
రేఖలవేళ
రేపటి సుదా ఉషస్సులను స్వప్నించడానికి
నాలుగు కళ్ళూ, రెండు గుండెలూ
నీ అలల మీంచి తేలివచ్చిన గాలుల్లోంచి
ఆశల ఊపిరి బంధాలను అదుముకుంటూ
పదాల అర్థాల్లోంచి అవగాహనల్ని
మనసు కాన్వాసు మీద (స్ప్రే) చేసుకుంటూ,
ఒక వర్ణ చిత్రం కోసం నడిచి వెళ్ళినప్పుడు
కృష్ణవేణీ!
నీ జలధారలు వారికి క్రొత్త జీవనం ఇవ్వాలని
నీ ప్రవహించావా!
ఆ విరామాలకూ, మంచి చెడులకూ
అన్నింటికీ ఒకేలా ప్రవహించే నీ గుండె
ఎవర్ని ఆశీర్వదించి నీ ఒడ్డున
చెంగలి నవ్వ పదులతో జీవన మిస్తుందో
మే మూహించావా!

ఇవాళ
నువ్వు నిల్చిన వారధితో
ఆశయాల సారధితో
ఆశల పథంలో జీవనరథం
ఆనందంతో ఉరకలు వేస్తోంది చూడు
ఇవేళవారి
అనుభూతుల అనుభవాలు
నిత్య చైతన్య ఉషస్సుల తృష్ణ
జీవితం ప్రవహించే
సదా సుధాతరంగాల కృష్ణ
కృష్ణవేణీ! నీ బారేజి
వసంతంలో వికసించి పెనవేసుకున్న మల్లెజాజి
ప్రదక్షిణ చేసే జీవన వాహిన్ని
ఏకత్రితమైన ఎద స్వరాల
ప్రేమసుధా ఉషస్సు.

-సుధామ

ఆంధ్రప్రభ
వారపత్రిక
ఉగాది ప్రత్యేక సంచిక
27/3/85

# ఆదివారం ఉదయం

జనవరి 20, 1985 2

## హ్యూమర్‌మరాలు

### హాయిలొలికే హోర్డింగులు!

3



-సుధామ





## 20

**మిస్.లీలా బౌడేకర్ స్టేషన్ డైరెక్టర్‌గా** ఉన్న కాలంలో అడ్మినిస్ట్రేషన్ చాలా స్ట్రిక్ట్‌గా ఉండేది. ఆవిడ హయాంలోనే చాలాకాలంగా కేంద్రంలో ట్రాన్సఫర్లు లేక పాతుకుపోయినట్లుగా ఉన్న ప్రోగ్రాం, ఎక్జిక్యూటివ్‌లు ఎందరో విధిగా బదిలీలు చవిచూడాల్సివచ్చింది. శాస్త్రి, పాత్రో, కృష్ణమాచారి, చౌదరి వీరంతా కదలికలు చవిచూడకుండా తప్పింది కాదు. వారికి బదిలీలు 'డ్యూ' కనక వెళ్ళక తప్పదని డైరెక్టరేట్ ఆదేశాలను తూచా తప్పక అమలుపరిచింది ఆవిడ.




నడుం మీద చెయ్యివేసుకుని నిర్భయంగా మాట్లాడేది ఆవిడ. ఆవిడ డ్రింక్ చేస్తుందని చెప్పుకునేవారుగానీ నిజానిజాలు మాకు తెలియదు. ఆవిడ మహరాష్ట్రియన్ అనీ, ముంబయ్ నేపథ్యంగా గల చోటునుంచి వచ్చిందనీ చెప్పానుగదా! ఆవిడ టైంలో మా డ్యూటీ రూమ్ చాలా నియమబద్ధంగా ఉండేది. ఆవిడకు తెలియకుండా డ్యూటీ ఆఫీసర్లు డ్యూటీలు పరస్పరం మార్చుకోవడానికి కూడా కుదిరేది కాదు. ఆవిడ దగ్గర డ్యూటీ చార్ట్ కాపీలు ఇంట్లోకూడా ఉండేవి. అలాగే ఒకసారి రాత్రి డ్యూటీలో నేను, ఉష ఉండగా ఇన్స్పెక్షన్‌కు వచ్చిన ఆవిడ రామానుజాచారి బదులు ఉష డ్యూటీలో ఎందుకుందని అడిగింది. చివరి నిముషంలో రామానుజాచారికి ఏదో ప్రాబ్లమ్ వస్తే పెక్స్‌కోని రిక్వెస్టు చేస్తే ఉషకు ఆ డ్యూటీ వచ్చింది. అది పెక్స్‌కో బౌడేకర్ గారికి ఇన్‌ఫార్మ్ చేయడం మర్చిపోయినట్లున్నారు. అప్పుడు ఆవిడ మర్నాడు మీటింగ్‌లో రామానుజాచారిని మందలించింది. ఉష ఫ్యామిలీవేలో ఉందని ఆవిడకు తెలిసి తనకు అలా ఇబ్బందికరమైన అదనపు డ్యూటీలు వేయడం తగదని మానవీయతతో పలికిందావిడ. ఆవిడెంత సానుకూలంగా మా పట్ల ఉండిందో ఆ తరువాత వచ్చిన డైరెక్టర్ శ్రీ సెల్వంగారు కొందరి చెప్పుడు మాటలకు లోబడి మాకు కొంచెం ఇబ్బంది కలిగించిన సందర్భం తరువాత చెబుతాను.

లీలా బొడేకర్ నన్ను అమితంగా మెచ్చిన ఒక సంఘటన ఉంది. నిజానికి వృత్తిలో భాగంగా నేను చేసిన పనే అయినా నేను అంకిత భావంతో దానిని నిర్వర్తిస్తున్నానని ప్రశంసించారు ఆవిడ. 23 జూన్ 1985 న మాంట్రియల్ నుండి లండన్ హీత్రో విమానాశ్రయం మీదుగా న్యూఢిల్లీ పాలెం అంతర్జాతీయ విమానాశ్రయానికి వస్తున్న బోయింగ్ 747-237బి ఎయిర్ ఇండియా విమానం బాంబింగ్‌కు గురై అందులో ప్రయాణిస్తున్న 329 మందీ మృత్యువాతపడ్డారు. 'కనిష్క' విమాన ప్రమాదంగా చరిత్రలో తీవ్రవాద దాడికి గురి అయిన సంఘటన అది. కెనడియన్ దేశపు భద్రతాలోపం అందుకు హేతువు అనీ సిక్కు మిలిటెంట్లు 'బబ్బర్ ఖల్సా' సంస్థ తీవ్రవాదులా పనిచేశారనీ దానిపై తీర్పు క్రిందటేడాది జూన్ 17 దాకా వెలువడనే లేదు. ఆ కేసు ముగియడానికి అన్నాళ్ళు పట్టింది.



'కనిష్క'



'కనిష్క' ప్రయాణీకుల్లో ఇరవైరెండుమంది భారతీయులు కూడా ఉన్నారు. మృతుల వివరాలు తెలుసుకునేందుకు ఢిల్లీ, ముంబయ్ విమానాశ్రయాల్లో ప్రత్యేక కౌంటర్లు పెట్టి ఫోన్ ద్వారా తెలుసుకునేందుకు నెంబర్లు కూడా ఇచ్చారు. ఉదయం వార్తల్లో కనిష్క విమాన ప్రమాదం వార్తలు చెబుతూ ఆ నెంబర్లు కూడా ఢిల్లో వార్తల్లో ప్రకటించారు. డ్యూటీ రూంలో మేం రాసే రిజిష్టర్లలో న్యూస్ రిజిస్టర్ కూడా ఒకటి అనీ న్యూస్ బులిటెన్ల హెడ్ లైన్స్ తప్పక అందులో మేం రాస్తూవుండేవాళ్ళమనీ ముందే చెప్పానుకదా! ఆ ఉదయం డ్యూటీలో ఉన్న నేను న్యూస్ మానిటర్ చేస్తూ రిజిస్టర్‌లో ఆ వార్తను ఫోన్ నెంబర్లతో సహా రాశాను. ఆ రోజుల్లో ఆకాశవాణి నుండే ఎప్పటికప్పుడు తాజా సమాచారం వెలువడేది. పత్రికల్లో మర్నాడు కానీ కొన్ని వార్తలు కవర్ అయ్యే అవకాశమే లేదు ఆనాడు. శ్రీమతి బొడేకర్ ఆ రోజు మామూలుగా పదింటికి ఆఫీసుకు వచ్చి తన రూములో కూర్చోగానే ఫోన్ మ్రోగింది. ఎవరో ముంబయ్‌లో వాళ్ళ తాలూకు వారు కనిష్క ప్రమాదం గురించి ఆవిడను వాకబు చేస్తూ ఆ విమానంలో తమవారు ప్రయాణించారనే భావనతో ఆందోళనగా విషయం తెలుసుకోవడం ఎలా అని ఆవిడని ప్రశ్నించారట. ఆవిడకూ ఏం పాలుపోక కనుక్కొని చెబుతానందిట. రాగానే డ్యూటీరూం రిజిష్టర్లు ఆవిడ టేబుల్ మీదకు వెళ్ళడం, ఆవిడ వాటిని చూడడం రోజూ జరిగే విషయమే! అలా ఆవిడ న్యూస్ రిజిస్టర్ తిరగేయగానే ఫోన్ నెంబర్లతో సహా నేనావార్తను రిజిస్టర్‌లో రాయడం ఆ నెంబర్లను అండర్ లైన్ చేయడం కూడా గమనించి బొంబాయి వాళ్ళవాళ్ళకు ఆ నెంబర్లు చెప్పారట. రిజిస్టర్ లో ఆవిడ గ్రీన్ ఇంక్‌తో అక్కడ 'వెరీగుడ్' అని రాసారు. మీటింగ్‌లో ఆ విషయం ప్రస్తావించారు. పిల్లల క్లాస్ నోట్స్‌లు చూసి 'వెరీగుడ్' అని టీచర్ రాసినట్లు రాయడం ఏమిటని అనిపించినా మా డ్యూటీ ఆఫీసర్లయిన కొలీగ్స్ అందరూ, అలాగే పెక్స్‌లూ కూడా అభినందించారు. ఆ నెంబర్లు రిజిస్టర్‌లో రాయక వట్టి 'కనిష్క' విమాన ప్రమాదం సంగతి ఒక్కటే నేను రాసినా చెల్లుతుంది. కానీ నేనలారాయడం వెంటనే ఆవిడకు బొంబాయిలో ఆందోళన చెందుతున్న వారికి చేరవేసేందుకు ఉపకరించడం జరిగింది. అందువల్ల ఆవిడ మరింతగా అభిమానించింది.

ఆవిడ ఎంతోకాలం హైదరాబాద్ కేంద్రంలో లేదు ముంబయ్‌కే మళ్ళీవెళ్ళిపోయిందని గుర్తు. స్టేషన్ డైరెక్టర్ స్థాయినుంచి ఆకాశవాణి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ స్థాయికి ఎదిగి ఆవిడ అవివాహితగానే చివరకు బ్రెయిన్ కాన్సర్‌తో మరణించిందని తెలిసింది. ఆవిడ హైదరాబాద్ నుంచి వెళ్ళిపోయిన సంవత్సరం తరువాత అనుకుంటా ఒక్కసారి మాత్రం దీపావళికి ఆవిడనుండి శుభాకాంక్షలు అందాయి. హైదరాబాద్ డైరెక్టర్‌గా ఉండగానే ఆవిడ తన విజిటింగ్ కార్డు ఇంగ్లీషులోనూ, హిందీలోనూ కూడా నా చేతివ్రాతతో రాయించుకుని అచ్చువేయించుకుంది. స్టేషన్ డైరెక్టర్ రూమ్‌లోకి డ్యూటీ ఆఫీసరే వెళ్ళవలసిన అవసరమే ఆ రోజుల్లో తక్కువగా తటస్థించేది. ఆవిడ డ్యూటీరూంకు సాయంత్రం వెళిపోతూనో, ఉదయ రావడంతోనేనో వచ్చి కాసేపు కబుర్లు చెప్పి వెళ్ళేవారు. సరదాగా

మాట్లాడడం, ఆవిడే టీ తెప్పించి త్రాగించడం కూడా జరిగేది. కానీ ఆవిడంటే ఒకరకమైన గౌరవంతో కూడిన జంకు ఉండేదన్నమాట నిజం! ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం మహిళా డైరక్టర్లలో అన్యభాషీయురాలయినా మరిచిపోలేని వ్యక్తిత్వం ఆవిడది.

1985 లో జ్ఞాని జైల్‌సింగ్ భారతదేశ అధ్యక్షులుగా ఉండి జూలైలో హైదరాబాద్ పర్యటనకు వచ్చినప్పుడు జూలై 23న 'మిధానీ' సందర్శించిన సమావేశాన్ని డ్యూటీ ఆఫీసర్‌గా ఉన్న నేనే కవర్ చేసి ఆ రాత్రి ప్రెసిడెంట్ పర్యటనపై రేడియో నివేదికను నేనే రూపొందించి నా వ్యాఖ్యానంతోనే ప్రసారం చేసాను. ఆ బాధ్యత ఆవిడ నాకే అప్పగించారు. ప్రధానులు, ముఖ్యమంత్రి ఇలా వి.ఐ.పిల సమావేశాలను ఎన్నింటినో కవర్ చేసేందుకు కార్యక్రమ నిర్వహణాధికారులకు ట్రాన్స్ మిషన్ ఎక్జిక్యూటివ్‌లయిన డ్యూటీ ఆఫీసర్‌లు సహకరించడం ఉండేదిగానీ అలా పూర్తి బాధ్యత మాకే అప్పగించడం నాడు అరుదే అయితే అవన్నీ ఎంతో ఆనందంగా, గర్వంగా చేసానని చెప్పగలను.

నా శ్రీమతి ఉషారాణి డ్యూటీ ఆఫీసర్‌గా విజయవాడ నుండి రాగానే మా నాన్నగారు కీ.శే.అల్లంరాజు కామేశ్వరరావుగారు మాకు బాధ్యతలు తెలిసిరావాలని మలక్ పేట కాలనీలోని మా గవర్నమెంట్ క్వార్టర్ కూడా ఉమ్మడిగా ఉండడానికి చాలదని వెంటనే వేరు కాపురం పెట్టించారు. అలా మొదటగా పంజగుట్ట శ్రీనగర్ కాలనీ రోడ్డులో ఓ చిన్న రెండు గదుల ఇంటిలో మా జీవితం మొదలైంది. మాకు దగ్గరలోనే మిత్రుడు కామేష్, లక్ష్మిల ఇల్లుండేది. ఇద్దరిదీ షిఫ్ట్ డ్యూటీల ఉద్యోగమే. అప్పుడు పెక్స్‌కోలుగా ఉన్న వారు మాకు హైదరాబాద్ ఎ,బిలకు కలిపి ఒకే షిఫ్ట్ చేసుకోడానికి సహకరించేవారు. విద్యాలంకార్ డ్యూటీ ఛార్ట్ వేస్తే సాధ్యమైనంత మటుకు మాకు ఒకే షిఫ్ట్ పడేలా చూసేవాడు. నాకు ముందు నుంచీ ఏ షిఫ్ట్ అయినా ఇంట్లో భోంచేయడమే అలవాటు. ఉష, నేను కలిసి షిఫ్ట్ చేసినప్పుడు తను క్యారేజ్ తెచ్చినా ఒక్కోసారి అది ఇంటికి తీసుకువెళ్ళాకే నాకు తినడం జరిగేది. పొద్దున్న ఇద్దరం ఒక షిఫ్ట్ చేసినప్పుడు పదింటికి మీటింగ్ అయిపోయి మా షిఫ్ట్ ముగిసాక కూడా నేను ఏ స్క్రిప్టు రాస్తూనో, మాటామంతి, భావవాహిని రికార్డింగులంటూనో మధ్యాహ్నం దాటేదాకా ఉండిపోతూంటే పాపం ఉష ఆకలితో ఉంటూ ఇద్దరం కలిసి ఇంటికి వెళ్ళవచ్చని నిరీక్షిస్తూండే సందర్భాలుండేవి. తను 'కన్సీవ్' చేసాక కూడా పాపం అలా ఆలస్యమవుతూండేది. అయినా తను ఎదురు చూసేది కలసి వెళ్ళేందుకు. తను సహకరించడం వల్లనే నేను రేడియోలోనైనా ఎన్నో కార్యక్రమాలు చేయగలిగాను.

1985 లో ఉగాదికి ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు సందేశాన్ని రికార్డు చేయడం, ఆ మార్చినెలలోనే రాత్రి నాటకాలు శ్రీ వై. యాదగిరిరావు 'సినిమాపిచ్చోడు', శ్రీ భరణి 'తూర్పుతిరగండి' అలాగే తరువాత 'మనిషి - మనీషి', డిసెంబర్‌లో కుటుంబ సంక్షేమంకు చెందిన విభాగంలో సాయంత్రం ఎల్.సుబుద్ధి రాసిన 'ద్రోహం' అనే సీరియల్ నాటకం ప్రొడ్యూస్ చేసాను. జూలై'12 న రవీంద్రభారతిలో ఆహూతుల సమక్షంలో జరిగిన లలిత సంగీత కార్యక్రమానికి, ఆగస్టు'15కు నిజామాబాద్‌లో చేసిన కవిసమ్మేళనానికి నేనే వ్యాఖ్యాతగా వ్యవహరించాను. అప్పట్లోనే డా.పి.ఎస్.గోపాలకృష్ణ ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్‌గా 'తలపుల పందిరి' అనే ఒక విశేష కార్యక్రమానికి రూపకల్పన చేసి నన్నూ, శారదా శ్రీనివాసన్‌గారినీ ఆ కార్యక్రమ వ్యాఖ్యాతలుగా వినియోగించారు. స్వాతంత్ర్యోద్యమంలో తెలుగు సాహితీ వేత్తల పాత్ర అనే ఒక సాహిత్య సంచికా కార్యక్రమానికి 18.12.85న నేను సంపాదకునిగా ప్రసారం చేసాను. ఆక్టోబర్‌లో రవీంద్రభారతిలో ఆహూతుల సమక్షంలో జరిగిన కార్యక్రమంలో జానకీరాణిగారు రాసిన 'శమయేవ జయతే' అనే నాటకం రంగస్థలం మీద ప్రదర్శించాం.


మా నాన్నగారు


స్నేహిత్‌తో ఉష

నవంబర్ చివర్లో అనుకుంటా ఉష పురిటికి వాళ్ళ

కాకినాడకు వెళ్ళింది. ఆ ఏడాదే మా నాన్నగారి చిరకాల కోరిక అయిన మలక్ పేట బ్రాంచికి రాధాస్వామి సత్సంగం హుజూర్ వారు రావడం నెరవేరింది. ఆ తరువాత నాన్నగారు గురువుగారి పర్యటనతో కర్నూల్‌కు ఏదో వెళ్ళివచ్చి కామెర్ల వ్యాధికి గురి అయ్యారు. 29.12.1985న ఉష కాకినాడలో చిరంజీవిని ప్రసవించింది. వాడికి మేం 'స్నేహిత్' అని పేరుపెట్టి ఆ సమాచారం కార్డు ద్వారా బంధుమిత్రులకు అక్కడినుండి పంపుతూ నాన్నగారికీ కార్డుపంపాం. నేను తిరిగి హైదరాబాద్ వచ్చాక నాన్నగారు "చాలా పెద్దవాడివై పోయావురా" అన్నారు. నాన్నగారికి కామెర్లు తగ్గినట్లే తగ్గి ముదరబెట్టి కాలేయం దెబ్బతిని 1986 జనవరిలో భోగి రోజు ముందు రాత్రి ఆయన చివరగా లే సెక్రటరీ అండ్ ట్రెజరర్‌గా పనిచేసి ఎన్.టి.ఆర్ పుణ్యమా అని 55 ఏళ్ళకే రిటైరయిన హైదరాబాద్‌లోని నల్లకుంట కోరంటి హాస్పటల్ అనే ప్రభుత్వ ఆసుపత్రిలో ఓ పూటంతా కోమాలో ఉండి రాత్రి ఒంటిగంట ప్రాంతంలో అస్తమించారు. మాకు బాబు పుట్టిన సంగతి, వాడికి 'స్నేహిత్' అని పేరు పెట్టిన సంగతి తెలుసు. కాని మా బాబుని చూడకుండానే ఆయన మృతిచెందడం జీవితంలో నాకు ఒక తీరని విషాదమే.






శాంతి శిశువులు

జన్మించినందుకు జన్మనిచ్చి
అక్షరమై చిరంజీవతాన్ని నిల్పడం
యువతిని మాతృమూర్తిని చేసి
భవితకు ఇరువురి ప్రతినిధిగా
సృష్టిని చేసి పెంచడం
సహజ ధర్మమే అయినా
అందులో ఎంతటి ఆనందం
మనిషిగా ఎంతటి పరిపూర్ణత్వం
అణువులతో యుద్ధాలను కాదు
శిశువులను రూపొందిస్తే
ప్రపంచ శాంతికి
ప్రతి మాతృమూర్తీ, పురుషచక్రవర్తీ
సహకరించినట్లే
సమరాలు మదనకేళీ సమీరాలై
శిశోదయ విజయాలు లభిస్తే
రానున్న శతాబ్దాలు
శాంతినిలయాలై తరిస్తాయి
ఒకరో ఇద్దరో శిశువులు కుటుంబానికి
స్థిర శాంతి చైతన్య విసువులు
విశ్వ కుటుంబానికి.

సుధామ
హైదరాబాదు



21

నేను చేరాక ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం స్టేషన్ డైరక్టర్లలో మిస్. లీలాబౌడేకర్ అయిదవవారు. నేను పనిచేసిన తొలి మహిళాడైరక్టరూ ఆవిడే! మేము డ్యూటీ ఆఫీసర్లుగా ఎంపిక కావడానికి కారణమైన శ్రీ పుల్లెల వేంకటేశ్వర్లుగారు - వివిధభారతిలో 1978 జూన్ 1న నేను చేరిన వెంటనే, ఇరవై రెండో తారీఖున - నార్త్ నుంచే వచ్చిన శ్రీ జె.డి. బవేజా గారికి బాధ్యతలు అప్పచెప్పి, ఢిల్లీ వెళ్ళిపోయి, డి.డి.జి అయ్యారు. శ్రీ బవేజా గారు 1981 మార్చి అయిదు వరకూ ఉండి, ఆపై బదిలీ అయిపోయారు. ప్రముఖ సంగీత విద్వాంసులు మైసూర్ వాసుదేవా చార్ మనుమడు అయిన శ్రీ ఎస్. రాజారాంగారు 1981 సెప్టెంబర్ 25న డైరెక్టర్‌గా వచ్చారు. డైరెక్టర్‌లు లేనప్పుడు అసిస్టెంట్ డైరెక్టర్లే బాధ్యత వహించేవారు. చెప్పానుగా! - రాజారాంగారి హయాంలోనే - 1982 లో నేను ఏప్రెల్ 15న ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రానికి వివిధ భారతి నుండి బదిలీ అయి చేరానని! శ్రీ రాజారాం గారు 1983 జనవరి 31 వరకూ చేసారు. ఆ తర్వాత మళ్ళీ అసిస్టెంట్ డైరెక్టర్ల హయాం కొన్ని నెలలు జరిగి, 1983 ఆగస్టులో శ్రీ కేశవ్. పి. పాండే డైరెక్టర్‌గా వచ్చారు. ఆయన పట్టుమని రెండునెలలు కూడా లేరు. 1983 డిసెంబర్ 19 న మిస్.లీలా బౌడేకర్ స్టేషన్ డైరెక్టర్ గా వచ్చి, 1985 జూలై అయిదు వరకూ ఉన్నారు. ఆ తర్వాత ఆవిడా ముంబయ్ బదిలీపై వెళ్ళిపోయి, డి.డి.జి. అయి, కొంతకాలానికి పదవిలో ఉండగానే, క్యాన్సర్‌తో పరమపదించారు. ఎక్కువ భాగం ఉత్తర భారతీయులే వస్తున్న సమయంలో స్టేషన్ డైరెక్టర్ గా - 1985 ఆగస్టు 12న, శ్రీ జె.సెల్వం హైదరాబాద్ కేంద్రంలో చేరారు. 85 ఏప్రిల్ నాటికే 'ఉష' విజయవాడ నుండి హైదరాబాద్‌కు బదిలీ అయివచ్చిందంటే - భార్యాభర్తలు ఒక చోట పనిచేసే ఆ అవకాశం ఇక్కడ మిస్. లీలా బౌడేకర్, అక్కడ విజయవాడ కేంద్రం డైరెక్టర్ శ్రీపి.ఆర్. రెడ్డిగారల పుణ్యమే!


శ్రీ రాజారాం


శ్రీ కలగా కృష్ణమోహన్,

శ్రీ పి.ఆర్.రెడ్డిగారికి కూడా 'స్ట్రిక్ట్' ఆఫీసర్ గా పేరుండేది! ప్రేమించి పెళ్ళి చేసుకుని డ్యూటీ ఆఫీసర్లుగా అప్పుడక్కడ విజయవాడలో శ్రీ కలగా కృష్ణమోహన్, శ్రీమతి పనిచేస్తూండేవారు - దంపతులుగా. ఎందుకో - రెడ్డిగారికీ, ఆ దంపతులకూ అంతగా పడలేదు! దానితో వాళ్ళు సతాయింపులకు గురయ్యేవారు! ఉష కూడా అక్కడ డ్యూటీ ఆఫీసర్‌గా చేసేది కదా! ఆ దంపతులు తనకు మంచి మిత్రులే. కృష్ణమోహన్, పరిమళలకు కొడుకు పుట్టాడు. (వాడి పేరు వాళ్ళు 'సుధామ' అనే పెట్టారు కూడాను) ఆ సుధామను చిన్నప్పుడు ఉష ఎత్తుకు ఆడించింది కూడాను. వాళ్ళతో చనువుగా ఉంటుందని, ఉషలో కూడా తప్పులెన్నడానికి, పి.ఆర్.రెడ్డిగారు చూసేవారనీ, కానీ తానెక్కడా ఆ అవకాశం ఇవ్వలేదనీ, ఆయనే చెప్పారు; తనను విజయవాడనుండి హైదరాబాద్‌కు రిలీవ్ చేసినప్పుడు. రెడ్డిగారు నేనంటే అభిమానంగా ఉండేవారు.


పరిమళ, సుధామ

మూడు నెలలకో పర్యాయం అన్ని (రాష్ట్రంలోని) కేంద్రాల డైరెక్టర్ల సమావేశం అయ్యే గ్రూప్ ఫోర్ స్టేషన్లకో ఆర్డినేషన్ మీటింగులు హైదరాబాద్‌లో జరిగినప్పుడు, విజయవాడనుండి ఉదయమే రెడ్డిగారు వచ్చేసేవారు! అలా ఒకసారి వచ్చినప్పుడు నేరుగా డ్యూటీ రూమ్‌కు వచ్చి, తొమ్మిదింటికి ప్రసార సమాప్తి కాగానే, నన్ను వెంటపెట్టుకుని ('గోపీ హోటల్'.. అప్పట్లో అది చాలా ప్రసిద్ధం. ముఖ్యంగా గోపీ హోటల్ ఇడ్లీ.. అరిటాకులో వేసి, చక్కటి కొబ్బరి చట్నీ, అల్లప్పచ్చడీ, కారప్పొడీ, చిన్న ప్రమాణపు గిన్నెలో నెయ్యితో సహా సర్వ్ చేసేవాడు. అందరూ ఆ హోటల్ ఇడ్లీ అంటే ఇష్టపడేవారు. రెడ్డిగారికి కూడా గోపీ హోటల్ ఇడ్లీ ఇష్టం కాబట్టి, నన్ను కూడా) తీసుకెళ్ళి తినిపిస్తూ, విజయవాడలో ఆ దంపతుల వల్ల తన మనక్షోభ గురించి నా దగ్గర ఏకరువు పెట్టారు. ఉష ట్రాన్స్‌ఫర్ విషయంలో ముందు కొంచె బెట్టు చూపినా, లీలా బౌడేకర్ గారి ఒత్తిడితోనూ, ఆయనకూ మాపై గల అభిమానంతో, అంగీకరించి, మా వివాహం జనవరిలో అయితే, 1985 ఏప్రెల్ కల్లా ఉషకు బదిలీ ఆర్డర్లు వచ్చేలా చేశారు వాళ్ళు. శ్రీపి.ఆర్ రెడ్డిగారు కూడా ఆ తరువాత ఛత్రపూర్ ఏదో బదిలీ అయ్యి, ఆపై వరంగల్‌లో ఆకాశవాణి కేంద్రం ఏర్పడడంతో, దానికి తొలి స్టేషన్ డైరెక్టర్‌గా వెళ్ళారు. అక్కడ వృత్తిలో ఉండగానే, వరంగల్‌లోనే ఆయన గుండెపోటుతో తనువు చాలించారు. ఆ తరువాత రెడ్డిగారి కుమారుడు శంకరరెడ్డికి విజయవాడలో 'క్లరికల్ కేడర్' పోస్ట్ లభించింది! అప్పట్లో యువవాణి ప్రోగ్రాం సెక్రటరీగా తొలుత పనిచేసిన శంకరరెడ్డి, ఇప్పుడు హైదరాబాద్ కేంద్రంలో అడ్మినిస్ట్రేషన్ విభాగంలో పనిచేస్తున్నాడు

మిస్. లీలా బౌడేకర్ తరువాత 1985 ఆగస్టు 12న శ్రీ జి. సెల్వంగారు ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం స్టేషన్ డైరెక్టర్‌గా వచ్చిన తమిళుడు. బౌడేకర్ గారు నన్ను అభిమానించడం తెలిసిన, అది గిట్టని కొందరు, సెల్వంగారికి మా మీద ఏదో మాటలు మోసారని విన్నాం. బహుశా అందువల్లనేనేమో - ఆయన మాపట్ల సుముఖంగా, సానుకూలంగా ఉండేవాడు కాదంతగా! అలాగని మమ్మల్ని ఇబ్బందులపాలు చేసాడనీ అనలేం. కానీ మాకు అది సంఘర్షణా కాలమే! మా నాన్నగారు పోవడం, ఉషా, నేనూ పంజగుట్టకాలనీ దగ్గరగా - వేరింటి కాపురం ఉంటూ, పసివాడయిన మా బాబు 'స్నేహిత్'ను ఇద్దరం షిఫ్ట్ డ్యూటీల్లో (విడివిడిగా వేయించుకుంటూ) మేమే చూసుకోవడం చేసేవాళ్ళం. మా స్నేహిత్‌కు అప్పుడు మేం ఇద్దరం ఒకేసారి ఇంట్లో కనిపిస్తే చిత్రంగానే తోచేది. నేను ఏ ఉదయమో షిఫ్ట్ చేసి రాగానే, బాబుని నాకు అప్పగించి, తాను నేను దిగిన ఆటోలోనే ఉష డ్యూటీకి వెళ్ళేది. మా స్నేహిత్‌కు రెండేళ్ళు దాటేంతవరకు అలా మేమే ఇద్దరం వాడి ఆలనా పాలనా వంతులవారీగా, ఇంట్లోనూ షిఫ్ట్ పద్ధతిలో చూసుకోక తప్పేది కాదు! ఒకసారి నేను పదినుంచి అయిదువరకూ డ్యూటీ చేసాను. నేను వెళ్ళి, మూడో షిఫ్ట్ డ్యూటీకి ఉషను ఇంటినుండి పంపించాల్సి ఉంది. అప్పుడు అర్జెంటుగా ఏదో బయట రికార్డింగుకు ఓ.బి కి వెళ్ళమని అప్పుడు కార్యక్రమం నిర్వహణాధికారిగా ఉన్న శ్రీ కలివేలు ఆఖరి నిముషంలో

అదనపు డ్యూటీ భారం వేసాడు. ఉష నైట్ డ్యూటీకి రావాల్సి ఉందనీ, ఆవిడ డ్యూటీ రద్దు చేసేట్లయితే, వెళ్ళడానికి నాకు అభ్యంతరం లేదనీ చెప్పినా, ఆవిడ డ్యూటీతో నిమిత్తం లేకుండా, నేను ఓ.బీకి(ఔట్ సైడ్ బ్రాడ్ కాస్టింగ్) వెళ్ళాల్సిందేనని హఠం వేసి, నేను వెళ్ళనన్నానని డైరెక్టర్ సెల్వంగారికి రిపోర్ట్ చేసాడు. ఆయన నన్ను పిలిచి – 'ఎందుకు వెళ్ళవని' దబాయించారు. మా బాబుని మేమే చూసుకోవాలనీ, నేను వెడితే తప్ప ఉష డ్యూటీకి రాలేదనీ, నేను చెప్పి బ్రతిమలాడాను. బహుశా ఒక డైరెక్టర్ ముందు నా కంటనీరు తిరిగిన సందర్భం అదేనేమో! శ్రీ.కలివేలు తనను మిస్ గైడ్ చేసాడని గ్రహించిన ఆయన, ఆఖరికి నేను ఎలాగూ ఆ రోజు డ్యూటీ చేశాను గనుక, అదనపు డ్యూటీ బాధ్యత తప్పించి, వెంటనే ఇంటికి వెళ్ళి ఉష ఆఫీసుకు వచ్చేలా చూసుకోమని అన్నాడు.

కానీ ఎంతయినా సెల్వం గారి పట్ల నాకు సదభిప్రాయం అంతగా ఏర్పడలేదు. మంచి కార్యక్రమ దక్షుడే – ఆయనా! విరామ సంగీతంగా కార్యక్రమానికీ కార్యక్రమానికీ నడుమ వినిపించే ఫిల్లర్స్ కూడా 'ఔచితీవంతంగా' ఉండాలనేవాడు! ఆయన 1987 నవంబర్ 30 వరకూ హైదరాబాద్ కేంద్ర డైరెక్టర్‌గా చేసారు. సెల్వం గారి సమయంలో శ్రీ మానికొండ నిత్యానంతరావ్, గోర్ఖిండి అనే ఇద్దరు అసిస్టెంట్ డైరెక్టర్లూ ఉండేవారు. "ఓహ్హోహ్హో" అంటూ నిత్యానందరావు గారు జాలీగా కనబడేవారు గానీ, మాటిమాటికీ "సి.ఆర్ (కాన్ఫిడెన్షియల్ రిపోర్టు) రాసేది నేనే జాగ్రత్త" అన్న బెదిరింపులతో, పెద్ద సామర్థ్యం ఉన్నట్లు కనబడకుండానే, చాకచక్యంగా నెట్టుకు వచ్చేవారు. ఆ తరువాత ఆయన ప్రాంతీయ శిక్షణా కేంద్రం అధిపతి కూడా అయ్యారు హైదరాబాద్‌లో.

శ్రీ సెల్వం మరీ వింతగా తోచేవారు కూడా మొదట్లో! డ్యూటీ ఆఫీసర్‌గా నేను ఉదయం డ్యూటీలో ఉండగా ఓ రోజు, తనకు కారు డ్రైవర్ చేత హోటల్ నుంచి ఇడ్లీ పంపమని ఫోన్‌లో ఆర్డర్ వేసాడు. ఆఫీస్ కార్ డ్రైవర్‌ని పంపి, ఆయన ఇంటికి అలాగే – నేనే డబ్బులు చెల్లించి కొని మరీ పంపిస్తే – నాకు వెంటనే ఫోన్ చేసి "నేను సింగిల్ ఇడ్లీ అడిగాను నువ్వు రెండు పంపావేంటి" అని గదమాయించాడు. ఆయన ఫ్యామిలీతో కాక, ఒంటరిగానే ఉండేవాడు. రోజూ ఉదయం టిఫిన్ పంపడం, ఆయన ఇంటిలో నీటి సౌకర్యం లేకపోతే, డ్రమ్ముల్లో ఆఫీసు కుళాయి నుండి నీరు పట్టి, కార్లో పెట్టి పంపించడం – చేయవలసి వచ్చేది. ఇంత చేసినా దేనికోదానికి కొంచెం కస్సుబుస్సులాడేవాడు! ఆయన బదిలీపై వెళ్ళేముందు ఓసారి నా దగ్గరకు వచ్చి – తాను నన్ను సరిగా అర్థం చేసుకోలేకపోయాననీ, కొందరి మాటలు విని తప్పుగా వర్తించాననీ, స్వయంగా 'సారీ' చెప్పడం ఆయన వ్యక్తిత్వంలోని విశేషమే! కానీ అప్పటికే పడవలసిన మా కష్టాలు పడనే పడ్డాం. ఆయన రిటైరయిన తరువాత ఒక మారు రీజనల్ ట్రైనింగ్ సెంటర్‌లో – రిసోర్స్ పర్సన్‌గా లెక్చర్‌కు వచ్చి, క్లాసులో ఉపన్యసించి వెడుతూ, అందుకోసం ఆయన తయారు చేసుకున్న నోట్స్‌ను, నాకు ఇచ్చేసి – " ఇది నీ దగ్గరుంటేనే సద్వినియోగమవుతుంది" అని చెప్పి మరీ వెళ్ళడం మరుపురాని విషయమే! జి.సెల్వంగారి టైంలో పెక్స్‌లుగా ఉన్న శ్రీ వి.వి.శాస్త్రి, శ్రీ ఆర్.విశ్వనాథం, శ్రీ పి.ఎస్. గోపాలకృష్ణ అనంతర కాలంలో డైరెక్టర్‌లయ్యి హైదరాబాద్‌లో పనిచేశారు.



శ్రీ జి.సెల్వం

శ్రీ అహ్మద్ జలీస్, కుమారి సురయ్యా బేగం, కె.కలివేలు, జె. ఆర్.సి.ప్రాత్తో, ఎన్.సి.నరసింహాచార్యులు, డా.రవిశంకర్, శ్రీమతి అన్వర్ జహాన్, శ్రీమతి జె. శకుంతల వీరంతా అప్పుడు శాస్త్రి, విశ్వనాథం, గోపాలకృష్ణలతో బాటు కార్యక్రమ నిర్వహణాధికారులుగా ఉండగా, డా.రావూరి భరద్వాజ, శ్రీఎన్.ఎస్.శ్రీనివాసన్, శ్రీమతి.తురగా జానకీ రాణి, శ్రీ వైరాఘవులు, శ్రీ.జి.జె.రవివర్మ ప్రొడ్యూసర్లుగా, శ్రీ కె.వి. సుబ్బారావ్ ఫార్మ్ అండ్ హోమ్ ఎఫ్.ఆర్.ఓగా, శ్రీ ఎం.అరుణాచలం ఫ్యామిలీ వెల్ఫేర్ ఈ.ఓ, డా.కె.బి.గోపాలం సైన్స్ ఆఫీసర్లుగా పనిచేస్తూండేవారు.

శ్రీయుతులు. ఎస్. రామారావు, శ్రీ కళాకృష్ణ, నేను, శ్రీమతి నాగపద్మిని శ్రీమతి. వై.శారద, శ్రీమతి బషీర్ కుర్బాన్ అలీ, శ్రీకె. సతీష్ సెక్షన్లలో ప్రొడక్షన్ అసిస్టెంట్లుగా, శ్రీయుతులు శేషం రామానుజాచార్యులు, శ్రీ ఆర్. దుర్గారాజ్, శ్రీ ఆర్. శ్రీనివాస రెడ్డి, శ్రీ జి.ఎస్. ఇలీషా, శ్రీ నెల్సన్ మూర్తి శ్రీమతులు కె.వినయమణి, శ్యామసుందరి, ఉషారాణి, హైమవతి – వీరంతా డ్యూటీ రూములోనూ


ఎం.జి.శ్యామలాదేవి

పనిచేస్తూండేవారం. అసిస్టెంట్ ఎడిటర్లుగా శ్రీ జె. రామచంద్రమూర్తి, శ్రీ అస్లాం ఫర్షోరి, శ్రీ దండమూడి మహీధర్, శ్రీ.ఎన్.వి.ఎస్ రామారావు - వీరంతా బాధ్యతలు నిర్వర్తిస్తూండేవారు. అప్పుడు డా.ఆర్.ఎ.పద్మనాభరావుగారు అసిస్టెంట్ డైరక్టర్‌గా ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలోనే పనిచేసేవారు. తెలుగుదేశం ప్రభుత్వం 1983లో ఏర్పడి, శ్రీయుత ఎన్.టి.రామారావు ముఖ్యమంత్రిగా ప్రభుత్వం నెరపుతున్న కాలం అది. అంతకు ముందు నగరాన్ని ఒణికించే బందీల వంటివి తగ్గు ముఖం పట్టాయి కూడా! ఉదయ తరంగిణిలో శుక్రవారాల్లో ఉదయం ఫ్యామిలీ డైలాగ్ నేనే రాసి, శ్రీమతి. ఎం.జి.శ్యామలాదేవి 'తల్లి'గా, నేను 'కుమారుని'గా, కలివేలు 'మామయ్య'గా పాల్గొంటూండే వాళ్ళం. నాగపద్మిని, శకుంతల వంటివారు కూడా నాకు చెల్లెలుగానో స్నేహితంగానో పాత్రధారణం చేస్తూండేవారు. అప్పుడే డా.పి.ఎస్. గోపాలకృష్ణగారు పక్షం రోజులకొకసారి 'తలపుల పందిరి' అనే కార్యక్రమాన్ని రూపొందించి, అందులో వ్యాఖ్యానం శ్రీమతి శారదా శ్రీనివాసన్ గారి చేతా, నా చేతా పలికింపచేసేవారు. సెప్టెంబర్'86 వరకూ 'తలపుల పందిరి' సాగింది. అలాగే వినియోగదారుల కార్యక్రమంలోనూ నా రచనో, గళమో ఉంటూండేది.


శ్రీ పి.ఆర్.రెడ్డి(విజయవాడ స్టేషన్ డైరెక్టర్)


ఆకాశవాణి హైదరాబాద్ పాతబిల్డింగ్



## 22

**ట్రాన్స్‌మిషన్ ఎక్జిక్యూటివ్‌గా షిఫ్ట్‌లో** పనిచేయడంలో ఓ సుఖం ఉంది. ఇవాళ పొద్దున్న తెల్లవారుజామునే వచ్చి, మొదటి షిఫ్ట్‌లో చేసామంటే, మళ్ళీ మర్నాడు - ఏ నైట్ షిఫ్టో, లేకపోతే నాకు మంగళవారం వీక్లీ ఆఫ్‌గా ఉంటే, సోమవారం ఉదయం చేస్తే, మళ్ళీ బుధవారం రాత్రివరకూ అఫీషియల్ షిఫ్ట్ లేకపోతే, బోలెడు తీరిక కిందే జమ! అయినా కార్యక్రమాలనేకంతో మమేకం అవడం వల్ల, ఆ స్క్రిప్ట్‌లు రాసుకోవడమో, వ్యాఖ్యానాలకూ, నాటకాల్లో పాత్రలకూ, గళం ఇస్తూండడమో చేస్తూ, ఆకాశవాణి కేంద్రంలోనే సమయం గడుస్తూండేది.

ట్రాన్స్‌మిషన్ ఎక్జిక్యూటివ్‌లను డ్యూటీరూమ్‌లో డ్యూటీలకు కాక, సెక్షన్లకు 'అసిస్ట్' చేయడానికి - ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్‌లకూ, ప్రొడ్యూసర్లకూ సహాయకంగా నియమించడం ఉండేది. అటువంటప్పుడు జనరల్ షిఫ్ట్‌లోనే ఉండి, ఆ 'అసిస్ట్' చేయాల్సిన విభాగం తాలూకు రికార్డింగులు, డబ్బింగులు అవీ చేస్తూ, ఆ సెక్షన్ పనులకు అంటిపెట్టుకు ఉండాలి. ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్ ఆ పనులు మాకు అప్పచెప్పి, తమ పనులు తాము చేసుకుంటూండేవారు. నాన్నగారు పోయేటప్పటికి (1986లో) నేను అలా తెలుగు విభాగం డా.రావూరి భరద్వాజగారికీ, కుటుంబ సంక్షేమ విభాగం శ్రీ మొదలి అరుణాచలం గారికీ వారి విభాగం కార్యక్రమాలకు అసిస్ట్ చేస్తూండేవాడిని. ఆ విభాగాల తాలూకు ఔట్ సైడ్ బ్రాడ్ కాస్టింగ్ ప్రోగ్రాములకు కూడా వెడుతూండేవాడిని.

మా బాబు స్నేహిత్‌ను కనడానికి ఉష పురిటికి వెళ్ళివచ్చేంతవరకూ కూడా నేను డ్యూటీరూమ్‌లో లేను. ఇలా విభాగాలవైపే ఉన్నాను. ఉష వచ్చాక మా బాబుని మేం ఇద్దరమే చూసుకోవాలి కనుక, షిఫ్ట్ డ్యూటీలే అనుకూలం కనుక, మే'1986కు మళ్ళీ డ్యూటీరూమ్‌కు, పెక్స్‌కోను రిక్వెస్ట్ చేసి రావడం జరిగింది. అలా షిఫ్ట్‌లలో పనిచేస్తున్నప్పుడే ఇంట్లో తనో, నేనో ఒకరు ఉండి, బాబు ఆలనాపాలనా చూసుకోవాలి కనుక, అదనపు డ్యూటీలు చేయడం కుదిరేది కాదు. అందువల్ల 'ఓవర్ టైం డ్యూటీలకు ఎప్పుడూ

ప్రాకులాడలేదు. ఓవర్ టైం చేస్తే అదనపు డబ్బు, లేకపోతే అదనపు సెలవో లభిస్తుంది కానీ, 'అదనపు సంపాదన యావ,' ఎప్పుడూ లేదు. అందువల్ల తీరికదొరికితే, బాబుతో హ్యాపీగా గడపడమే కోరుకునేవాళ్ళం!

మేము పంజగుట్టకాలనీ ఇంటినుండి మెహదీపట్నం ఎల్.ఐ.సి కాలనీలో ఓ అద్దె ఇంటికి మారడం జరిగింది. శ్రీ నరసింహాచార్యులు, శ్రీ జి.కె.మరార్(పెక్సలు), డా.కె.బి గోపాలం (సైన్స్ ఆఫీసర్) అప్పట్లో మెహదీపట్నంలోనే ఉండేవారు. కాలనీ చాలా ప్రశాంతంగా ఉండేది కానీ, అప్పట్లో దొంగల భయాలు ఎక్కువ అక్కడ. కానీ ఇల్లు అనుకూలంగా ఉండేది. బస్సుస్టాండు కొద్దిదూరంలో ఉండేది. తెల్లవారు ఝాము డ్యూటీ ఉంటే - ఉషను బస్సుస్టాండు దాకా నేను దింపిరావడానికయినా, బాబుని ఇంట్లో పెట్టి తాళం వేసి వెళ్ళిరావాల్సిందే! బాబుని చూసుకోవడానికి ఉషకు సాయం ఉండడానికి ఎవరయినా పనిపిల్ల దొరుకుతుందేమో అని చూసాం! ఆఖరికి ఆకాశవాణి అనౌన్సర్ శ్రీమతి. జ్యోత్స్నగారే - అప్పట్లో 'సరిత' అని మాకో అమ్మాయిని చూసిపెట్టారు. దానిని చూస్తే పని అమ్మాయి అని ఎవరూ అనుకోరు. తెల్లగా, కళగా మా కూతురే అన్నట్లుండేది. అదీ చిన్నదే ఓ తమ్ముడిని ఆడించినట్లు బాబుని ఆడించేది, వాడిపనులు చూసేది గానీ, ఉషకు వంటింట్లో సాయం చేసేంత పెద్దదికాదు. అయినా అది ఉండడం మాకు కొంత రిలీఫ్ ఇచ్చింది. 1987 లో నవంబర్ నెలాఖరు వరకు జి.సెల్వంగారే స్టేషన్ డైరెక్టర్. చెప్పానుగా! ఆయనకు మొదట్లో మా మీద సదభిప్రాయం ఉండేది




కాదని. అలాంటి ఆఫీస్ టెన్షన్స్ సమయంలో ఇంట్లో 'సరిత' మాకు అదనపు బాధ్యతగా అనిపించినా, ఒత్తిడి ఉండేదికాదు. 1988 ఫిబ్రవరి 23న సెల్వంగారి తర్వాత టి.ఎన్.గణేశన్ హైదరాబాద్ డైరెక్టర్ గా వచ్చారు. ఆయన 1991 డిసెంబర్ నెలాఖరు వరకూ ఉన్నారు గానీ, ఆయన హయాంలోనే ఉష యు.పి.ఎస్.సి ద్వారానూ, నేను డిపార్ట్‌మెంటల్‌గానూ ప్రమోషన్లు పొంది, ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్‌లమయ్యాం. సైన్స్ ఆఫీసర్ల క్యాడెర్ కలిపివేయడం వల్ల - కె.బి గోపాలంగారు 'అసిస్టెంట్ స్టేషన్ డైరెక్టర్'గా అయ్యింది గణేశన్‌గారి సమయంలోనే! ఆయన దాదాపు ఓ ఏడాది పాటు వ్యక్తిగత హోదాలో అమెరికావెళ్ళినప్పుడు, గోపాలంగారికే బాధ్యతలు అప్పచెప్పి వెళ్ళారు కూడాను.

చెప్పానుగా! సెల్వం గారు మనిషి ఎలాంటివారైనా కార్యక్రమాల పట్ల మంచి అవగాహన, అభిరుచిగలవారు. ఆయనే అప్పట్లో డ్రామా ప్రొడ్యూసర్‌గా ఎంపికయిన శ్రీ వై.రాఘవులుగారిచేత రోజూ ఉదయం అయిదు నిముషాలు 'న్యాయనినాదం' పేర "వందనాలు.. వందనాలు" అని పాడుతూ - సాంఘిక, సామాజిక అంశాలమీద చైతన్యదాయకమైన కార్యక్రమాన్ని రూపొందింపచేసారు. రాఘవులుకు అది మంచి పేరు తెచ్చింది. అలాగే వినియోగదారుల కార్యక్రమాలకు చక్కని రూప కల్పన చేయించారు సెల్వం. 'తెలుసుకుందాం' శీర్షికన నెలనెలా ఒక అంశం మీద, ప్రతిరోజూ ఉదయం స్టాఫ్‌లో ఒకరి చేత స్క్రిప్ట్ రాయించి, ప్రెజెంట్ చేయించింది ఆయనే! డ్యూటీరూంలో ట్రాన్సిమిషన్ ఎక్జిక్యూటివ్‌లుగా చేస్తూకూడా, నేను, కళాకృష్ణ, నాగపద్మిని 'తెలుసుకుందాం'లో ఎక్కువగా పాల్గొన్నాం!




1986లోనే వినియోగదారుల రక్షణ చట్టం అమలులోకి రావడంతో - ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం 'ఉదయతరంగిణి' మార్నింగ్ ఇన్ఫర్మేషన్ సర్వీస్‌కు, ప్రత్యేకంగా పెక్స్‌గా డా.కె.విజయ నేనూ మా వేతనాలు కూడా సెపరేట్ పే.రోల్ కాయితాలమీద తీసుకోవడం గుర్తుంది. వినియోగదారుల కార్యక్రమం పట్ల మేం శ్రద్ధపెట్టి కార్యక్రమాలు రూపొందించేవాళ్ళం. 'తెలుసుకుందాం'లో ప్రతిశనివారం డిసెంబర్'86లో తెలుసుకుందాం అంటూ వినియోగదారుల చట్టం విషయాలు ప్రసారం చేయడానికి, నేను ఆ విషయాలు ఆసక్తిగా అధ్యయనం చేసాను కూడాను!

శ్రీ సెల్వంగారు ఉగాది సందర్భంగా 'పౌష్టికాహారం' మీద ఈ మాసపు పాట చేయమన్నారని (1986 ఏప్రిల్‌లో) చిత్తరంజన్ గారు నాతో అంటూ, "ఉగాది నెలలో అదెలాగో తెలీడంలేదు అని ", ఓ పాటరాసిపెట్టమని నన్నడిగారు. మావిచివురులే కోయిలకూ, జామపండ్లే చిలుకకూ, వాటి గాత్రమాధుర్యానికీ, అందానికి దోహదమయ్యాయనే ఎత్తుగడతో -

ఆమని పాటలు పాడే
ఈ వన కోయిల కబురేమిటి
చిలుకల కులుకులు తెలిపే
సందేశం సొబగేమిటి

అనే పల్లవితో నేను రాసిన పాట, శ్రీ సురేంద్రనాథ్ కాలే సంగీతంలో శ్రీమతి. ఆర్.ఛాయాదేవి పాడగా, 1986 ఏప్రిల్ ఈ మాసపు పాటగా ప్రసారమై శ్రోతలను అలరించింది. ఈ మాసపు పాటలు రాయడం కవులకు ఒక ఇష్టమైన పని కానీ ఇలా విషయం నియంత్రించి రాయమనడం, సెల్వంగారి ఆదేశం మేరకు నా పాలబడిందన్నమాట! "బ్రతుకంతా వసంతమై జీవించగ ప్రజలారా - బలవర్ధకం ఆహారం తీసుకోండి ప్రతిరోజూ" అని ఓ చరణం కనబడ్డాకగానీ, ఆయన అప్రూవ్ చేయలేదుట! అప్పుడు శ్రీమతి జె. శకుంతల లలితసంగీతం పెక్స్‌గా ఉన్నట్లు గుర్తు. చిత్తరంజన్ గారు నా మీద నమ్మకం ఉంచి, మొత్తానికి అలా గట్టెక్కాం ఆ నెల.

అదే ఏప్రెల్ నెలలోనే నేను 'సావిత్రి', 'అమెరికా అల్లుడు' అనే నాటికల్లో పాత్రలు ధరించాను. ఆ ఏడాది 'సమస్య విడింది', 'నాట్యరాణి' మొదలైన నాటకాల్లో, 'హేలీతోక చుక్క' మీదా 'గ్రహవాణి' గురించి సైన్సు కార్యక్రమాల్లో పాలుపంచుకున్నాను. 'విజ్ఞాన లహరి' స్క్రిప్ట్‌లు చదివాను బోలెడు.

సాహిత్యపరంగా 1986 మే'7న ప్రసారం చేసిన రవీంద్రనాథ్ ఠాగూర్‌పై సంచికా కార్యక్రమం, ఏప్రిల్ రెండున రాయప్రోలు వారిపై సంచికా కార్యక్రమం నా సంపాదకీయ వ్యాఖ్యానాలతో రూపొందించి ప్రసారం చేయడం జరిగింది. రాయప్రోలు వారితో రికార్డింగు సంగతి మళ్ళీ ప్రత్యేకించి ముచ్చటిస్తాను. అదో మరుపురాని అనుభవం.

'ఈనాడు' దినపత్రికలో కార్టూన్లు వేస్తూ 'శ్రీధర్' మంచి పేరు తెచ్చుకున్నాడు అప్పటికే. 1986 జూన్'13న ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో 'శ్రీధర్'తో నేను చేసిన పరిచయ కార్యక్రమం ప్రసారం అయింది. తను రేడియోకి రావడం అదే మొదలు అని తను అన్నట్లు గుర్తు! 'పత్రికలు - పాఠకులు' అనే అంశంపై కార్మికుల కార్యక్రమంలో ఓ చర్చను అరుణాచలంగారు నా చేత చేయించడం కూడా గుర్తు.


శ్రీటంగుటూరి అంజయ్య

అప్పటి కేంద్ర ప్రసారశాఖా మంత్రి శ్రీ గాడ్గిల్ పాల్గొన్న ఉగాది కార్యక్రమానికీ, 1986 ఫిబ్రవరి 14న హైదారాబాద్‌లో జరిగిన త్యాగరాజ ఆరాధనోత్సవానికీ రేడియో నివేదికతో నేను రూపొందించినవే! ప్రఖ్యాత ఇంజనీర్ శ్రీ కె.ఎల్.రావు గారు 1986 మే 19న మరణించినప్పుడు, మాజీ ముఖ్యమంత్రి శ్రీటంగుటూరి అంజయ్యగారు 1986 అక్టోబర్ 20న మరణించినప్పుడు 'ట్రిబూట్స్ ప్రోగ్రాం'లు చేశాను. కార్మికుల కార్యక్రమం, కుటుంబ సంక్షేమ కార్యక్రమాలకు తెలుగు సాహిత్య విభాగంతో బాటుగా 'అసిస్టెట్' చేశాను ఆ రోజుల్లో. సెల్వంగారు బదిలీ అయి సెలవంటూ వెళ్ళిపోయాక, గణేశన్ గారు వచ్చేంతవరకూ అసిస్టెంట్ స్టేషన్ డైరక్టర్ నిర్వహణలోనే కేంద్రం నడిచింది ఓ మూడునెలలు.

1987లో రెండువందల నలభై నాలుగు ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్ పోస్ట్‌లకు యు.పి.ఎస్.సి, ఢిల్లీలో ఇంటర్వ్యూలు దేశవ్యాప్తంగా నిర్వహించింది. మూకుమ్మడిగా చాలామంది డ్యూటీ ఆఫీసర్లం ఆ పోస్ట్‌లకు దరఖాస్తు చేసుకున్నాం.






## 23




**యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్** - ఆకాశవాణికి నేరుగా ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్‌లను సెలక్ట్ చేయడానికి, అప్పట్లో ఢిల్లీలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తూండేది. అసిస్టెంట్ స్టేషన్ డైరెక్టర్, స్టేషన్ డైరెక్టర్ స్థాయి పోస్ట్‌లకు నేరుగా రిక్రూట్ మెంట్ జరిగేది కానీ, ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్‌ల సంఖ్యే దేశవ్యాప్త కేంద్రాలన్నింటికోసం, వివిధ క్యాటగిరిల్లో కనుక, అధికంగా ఉండేవి. నేను 1978లో రేడియోలో చేరిన కొత్తలో అంటే - 1979లో, ఓసారి అలా ఇంటర్వ్యూకి వెళ్ళాగానీ, అప్పుడు డా.పాలకుర్తి మధుసూదనరావు, భీమయ్య మా హైదరాబాద్ కేంద్రం నుండి డ్యూటీ ఆఫీసర్లుగా చేస్తూనే, యు.పి.ఎస్.సి పెక్స్‌లు అయ్యారు. నేనుకాలేదు.



ఆచార్య బిరుదురాజు రామరాజు

నేను చెప్పిన డా.విజయగారు, అలాగే మాతో డ్యూటీ ఆఫీసర్ గా చేసిన డా. పి.నాగపద్మినిగారూ 1987 మార్చిలో జరిగిన యు.పి.ఎస్.సి ఇంటర్వ్యూల్లోనే నెగ్గి, పెక్స్‌లు అయినవారే! డా. విజయగారు మటుకు నేరుగా అంతకు మునుపు రేడియోలో ఏ అనుభవం లేకుండా సెలక్ట్ అయినవారు కాగా, పద్మినిగారు డ్యూటీ ఆఫీసర్‌గా చేస్తూ, నేరుగా పెక్స్ పోస్ట్‌కు అప్లై చేసుకుని, యు.పి.ఎస్.సిలో ఎంపికయ్యారు. అప్పుడు ఇంటర్వ్యూ బోర్డులో తెలుగు సభ్యునిగా డా.బి.రామరాజుగారున్నారు. పుట్టపర్తి నారాయణాచార్యులగారి పట్ల వారికి అభిమానం కూడాను! ఆకాశవాణితో ఏదో విధంగా సంబంధం ఉండి ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్‌లుగా ఎంపికయినవారికీ, నేరుగా యు.పి.ఎస్.సి పెక్స్‌లుగా వచ్చినవారికీ కూడా, బోలెడు తేడా పనిలో కనిపించుతూ ఉండేది! ఆ ఏడాదే నాకు ఆఖరి ఛాన్సు - వయఃపరిమితి దృష్ట్యా. నిజానికి నేను ఇంటర్వ్యూ బాగా చేసాను గానీ, తెలుగు

సభ్యునిగా ఉన్న రామరాజుగారు నన్ను ఒక్క ప్రశ్న అడగలేదు. మిగతా సభ్యులకు నా గురించి ఏమీ చెప్పి ఉండకపోవచ్చునేమో కూడా! ఉస్మానియా యూనివర్సిటీలో ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారి తరువాత ఆయనే అధిపతి అయ్యారు. యువభారతి ద్వారా అవధానిగారికీ, మాకుగల సాన్నిహిత్యం రామరాజుగారికి తెలిసిందే! అయినా ఎక్కడి రాజకీయాలు అక్కడ ఉండడంలో ఆశ్చర్యమేముంది? నేను యు.పి.ఎస్.సిలో పెక్స్‌గా ఎంపికకాలేదు మొత్తానికి.

ఆ తరువాత 1989లో యు.పి.ఎస్.సి ఇంటర్వ్యూలు జరిగినప్పుడు, వయోపరిమితిని అప్పుడే అధిగమించడం వల్ల నేను అప్లై చేసుకునే అవకాశమే కలగలేదు! ఆ ఏడాది నా శ్రీమతి ఉషారాణి యు.పి.ఎస్.సి ద్వారా ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్ అవడం మాత్రమే కాదు, ఆలిండియా సీనియారిటీలో తెలుగువారిలో ప్రథమంగా నిలవడం నాకు చాలా ఆనందం కలిగించింది! ఇంతలో పరిణామాలు మారి, ట్రాన్స్‌మిషన్ ఎక్జిక్యూటివ్స్ నుంచి ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్‌లను నూరు శాతం డిపార్ట్‌మెంట్ ప్రమోట్ చేయాలని సుప్రీం కోర్టు ఆదేశాలు రావడంతో, ఆ తర్వాత నేరుగా యు.పిఎస్.సి ఇంటర్వ్యూలు ఈ పోస్ట్‌లకు జరగడం నిలిచిపోయింది. 1989లో జరిగిన ఆ యు.పి.యస్.సి ఇంటర్వ్యూ ఫలితాలు వెలువడి, అందులో ఎంపికయినవారు ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్‌లుగా జాయిన్ కావడం అనేది 1991 లోనే జరిగింది. ఉషారాణి అలా నేరుగా 'పెక్స్'అయి, విజయవాడలో కార్యక్రమ నిర్వహణాధికారిగా - మే'1991లో చేరగా, నాకు డిపార్ట్‌మెంట్ ప్రమోషను ఇస్తూ - 1991 జూన్ 11న ఢిల్లీ నుంచి మాకు ఆర్డర్లు వచ్చాయి. దాదాపు పదమూడేళ్ళు డ్యూటీ ఆఫీసర్లుగా పని చేసాక, అలా ప్రమోషన్లు ఇస్తూ డ్యూటీ ఆఫీసర్ల క్యాడర్ నుంచి ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్ కేడర్‌కు ప్రమోట్ చేయడం జరిగింది అప్పుడు.

1978లో డ్యూటీ ఆఫీసర్లుగా ఎంపికయిన మా బ్యాచ్ నుండి డా.నాగపద్మిని, డా పి.వి శారద యు.పి.ఎస్.సి ద్వారా పెక్స్‌లు అయ్యారుగానీ, డిపార్ట్‌మెంట్ ద్వారా మిగతావారం 1991లోనే ప్రమోట్ అయ్యాం! అయితే పెక్స్‌లుగా సీనియారిటీ వారికే ఉంటుంది. ఉష పెక్స్ అయిన రెండు నెలల్లోగానే, డిపార్ట్ మెంట్ ద్వారా నేనూ పెక్స్ కావడం జరిగింది. అయినా తనదే సీనియారిటీ అనుకోండి! ఏమయినా ఆ పరిమాణం ఆనందాన్నే కలిగించింది.

ఉష ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్‌గా 1991 మేలో చేరిందిగా. విజయవాడకు తననూ, స్నేహిత్‌నూ తీసుకువెళ్ళి, అక్కడ ఇల్లూ అదీ చూసి, అప్పట్లో వాళ్ళ అత్తయ్యా - మామయ్య అయ్యే - కొల్లూరు రామారావు దంపతులకు చెప్పి, తను జాయిన్ అయ్యాక నేను హైదరాబాద్ వచ్చాను. జూన్ లో నా ప్రమోషన్ ఆర్డర్లు వచ్చాయి. అయితే నన్ను నేను కర్నూల్ ఆకాశవాణి కేంద్రానికి పోస్ట్ చేసారు. ఉష విజయవాడ నేను కర్నూల్ అయితే ఎలా అని నేను విజయవాడ కేంద్రానికి పోస్టింగ్‌కు ప్రయత్నించాలనుకున్నాను. మా అత్తగారు ఉషకు తోడుగా విజయవాడ చేరారు.


శేషం రామానుజాచార్య

1976లోనే డ్యూటీ ఆఫీసర్స్‌గా చేరిన వారిలో శ్రీ శేషం రామానుజాచార్యకూ మాతోబాటే ప్రమోషన్ లభించి, తనకు విజయవాడ పోస్టింగ్ వచ్చింది. అయితే తన ఫ్యామిలీ అంతా హైదరాబాదే విజయవాడకు బదులు కర్నూల్ అయితే తనకు కొంచెం అనుకూలంగా ఉంటుందని రామానుజాచార్య భావించాడు. విజయవాడ కేంద్రంలో ఉండేటంత పని ఒత్తిడి స్థానిక కేంద్రం అయిన కర్నూల్‌లో ఉండదు కూడాను! దానితో శేషం రామానుజాచార్యా, నేనూ, మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్‌కు అప్లై చేస్తే ప్రయోజనం ఉంటుందని ఆఫీసు పెద్దలు అనడంతో, మేం ఇద్దరం డైరెక్టరేట్‌కు మా మ్యూచ్‌వల్ ట్రాన్స్‌ఫర్ అభ్యర్ధనను పంపించాం. అప్పట్లో రఘురాంగారు.. ఢిల్లీలో ఉండేవారు. నిజానికి ఆయన ప్రమోటీల పోస్టింగ్ సమయంలోనే 'సుధామకు విజయవాడ వేయండి వాళ్ళ శ్రీమతి అక్కడ ఉంది' అని చెప్పారటగానీ, 'సుధామ' అని కాక అఫీషియల్ గా 'ఎ.వెంకటరావు' అనేది నా పేరు, లిస్ట్‌లో అలాగే ఉంటుంది కనుక, రఘురాంగారి కమ్యూనికేషన్ తెలియక, నాకు కర్నూల్ వేసేసారట ముందు! మొత్తానికి ఎలాగయితేనేం

రామానుజాచారి సహకరించి, మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్‌కు ముందుకు రావడం వల్ల, మా అభ్యర్ధన మన్నించబడి, 1991 జూన్ 20న పంపిన మా లెటర్ కు జూలై11 న మార్పుల ఆర్డరీ ఢిల్లీ నుండి అందింది. పదమూడు మంది ప్రమోటీల అభ్యర్ధనలు ఇలాంటివి మన్నిస్తూ ఆ ఆర్డర్‌లో నన్ను విజయవాడ కేంద్రానికీ, రామానుజాచార్యులను తను కోరిన కర్నూల్‌కు పోస్ట్ చేసారు. అదే ఆర్డర్‌లో మా మరో సన్నిహిత డ్యూటీ ఆఫీసర్ మిత్రుడు మంత్రవాది సుధాకర్‌ను కొత్తగూడెం బదులుగా తను కోరిన వరంగల్‌కు, విజయవాడలో డ్యూటీ ఆఫీసర్లుగా ఉండి ప్రమోట్ అయిన శ్రీ ఎస్. ఎ. పద్మనాభరావుని కడపకు బదులుగా తిరుపతి కేంద్రానికీ, ఎం.బాబూరావుని ఆదిలాబాద్‌కు బదులు హైదరాబాద్‌కు వేసారు.

నాకు ప్రమోషన్ వచ్చిందనీ కర్నూల్‌కు వేసారనీ - ముందు తెలిసినదగ్గరనుంచీ, తిరిగి విజయవాడకు పోస్టింగ్ మారేంతవరకూ


Government of India
All India Radio : Hyderabad
* * *

No.Hyd.1(3)/91-S. Dated: 16.7.1991.

ORDER

Consequent on his promotion as Programme Executive at All India Radio, Vijayawada Vide DG, AIR order No.60/91-SI(B) communicated vide No.4(289)/91-SI(B), dated 11.6.91 and subsequent modification issued vide order No.70/91-SI(B) communicated vide No.4(289)/91-SI(B), dated 11.7.91 Sri A.Venkat Rao, Transmission Executive of this station is relieved of his duties at this station on the afternoon of 16.7.1991 with instructions to report himself for duty at All India Radio, Vijayawada.

(L.D.SAWANT)
ADMINISTRATIVE OFFICER
for SUPERINTENDING ENGINEER.

Copy to:
1. Sri A.Venkat Rao, Transmission Executive, All India Radio, Hyderabad. He should return all Govt. articles such as Identity card, CGHS Card, Library Books/Tapes, Stores articles etc., and ensure before leaving the station that nothing remains outstanding against him.
2. The Director General (Shri I.L.Bhatia, DDA-by name), SI(B) Section, All India Radio, Akashvani Bhavan, Parliament Street, New Delhi-110001.
3. The Station Director, All India Radio, Vijayawada. Sri A.Venkat Rao has availed 2 days casual leave and No RH during the current financial year.
4. Accounts Section (2 copies), All India Radio, Hyderabad.
5. Hindi Officer, All India Radio, Hyderabad for Hindi Version.
6. PA to Station Director.
7. Personal file.
8. Service Book.
9. Spare Copies ( 5 copies).

for SUPERINTENDING ENGINEER.

ఒక ప్రక్క ఏమవుతుందోననే ఆందోళన ఉన్నా, 1991లోనే ఎన్నికలు రావడంతో, పూర్తిగా రేడియోలో ఆ పనుల బిజీలో నిమగ్నం కాక తప్పలేదు. అలా చేతినిండా పని ఉండడం మంచిదే అయింది! అప్పుడు టి.ఎన్ గణేశన్‌గారు ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం స్టేషన్ డైరెక్టర్. ఆయన మధ్యలో కొన్నాళ్ళు అమెరికా సెలవు మీద వెళ్ళడంతో, సైన్స్ ఆఫీసర్ గా ఉండి ఆ క్యాడర్ ను అసిస్టెంట్ స్టేషన్ డైరెక్టర్ క్యాడర్‌లో కలిపివేయడంతో, ఎ.ఎస్.డి అయిన డా కె.బి.గోపాలంగారు భారం వహించారు అసిస్టెంట్ స్టేషన్ డైరెక్టర్‌గా. శ్రీవి.వి.శాస్త్రిగారు కూడా అప్పుడు అసిస్టెంట్ స్టేషన్ డైరెక్టర్‌గా చాలా సమర్ధవంతంగా గోపాలం గారి కన్నా ముందు నుంచీ ఉన్నారు. గణేశన్ గారి తరువాత ఆకాశణి హైదరాబాద్ కేంద్రం స్టేషన్ డైరెక్టర్‌గా శ్రీ వి.వి.శాస్త్రిగారే 1992లో జనవరి 6న ప్రమోషన్ మీద జాయిన్ అయ్యారు. మేం పెక్సలం అయిన 1991 డిసెంబర్ నెలాఖర్‌కు గణేశన్ గారు పదవీ విరమణ చేసిన గుర్తు! అప్పటికి నేను విజయవాడ కేంద్రంలో జూలై`17న కార్యక్రమనిర్వహణాధికారిగా చేరిపోయాననుకోండి!


డా కె.బి.గోపాలం

నేను ప్రమోషన్ మీద విజయవాడ ఆకాశవాణి కేంద్రానికి తరలి వెళ్ళిబోయే ముందు చివరి రెండు ఏళ్ళు కూడా ట్రాన్స్‌మిషన్ ఎక్జిక్యూటివ్‌గా ఉన్నా, దాదాపు ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్స్ చేసే పనులు అనేకం అధికంగా చేయడం జరుగుతూనే వచ్చింది. హైదరాబాద్ రేడియోలో ఆరేడేళ్ళకు పైగా (`పరిచయపత్రం` శ్రోతల ఉత్తరాలకు జవాబులు) డ్యూటీ ఆఫీసర్‌గా ఉంటునే చేసిన నేను, 1988 మార్చి 6 తరువాత ఆ బాధ్యతలనుండి విముక్తమయ్యాను. అప్పట్లో శ్రీ మానికొండ నిత్యానందరావురు కూడా అసిస్టెంట్ స్టేషన్ డైరెక్టర్‌గా ఉండేవారు అని చెప్పానుగా! ఆ మేలు చేసింది ఆయనే!


శ్రీ శంకర్ దయాళ్ శర్మ

ఉదయ తరంగిణిలో శుక్రవారాల్లో ఫ్యామిలీ డైలాగ్ రాసి, స్టాక్ క్యారెక్టర్ గా ఎం.జి. శ్యామలాదేవి గారు తల్లిగా - మరో పాత్రతో జరిపే సంభాషణలు, 1988లో మంచి పాపులర్ అయ్యాయి! 1988లో శ్రీ పి.వి.రమణగారు, శ్రీ చల్లా ప్రసాదరావుగారు `పెక్స్‌కో`లుగా ఉండేవారు. 1989 ఫిబ్రవరిలో డ్యూటీ రూమునుండి మళ్ళీ తెలుగు టాక్స్, డెవలప్ మెంట్ టాక్స్, శుక్రవారాల ఉదయ తరంగిణి, ట్రైబర్ వెల్ఫేర్ ప్రోగ్రాములకు నన్ను అటాచ్ చేసారు. అప్పుడు ఉషకు కూడా ఇంగ్లీష్ టాక్స్, ఫోక్ మ్యూజిక్ సెక్షన్లు అలాట్ చేసారు. మా బాబు స్నేహిత్‌ను అప్పుడే `క్రెష్`లో చేర్చాం. ముందు మెహదీ పట్నం దగ్గర ఓ ప్రైవేట్ `క్రెష్`లోనూ, ఆ తరువాత ఏ.జి.ఆఫీస్ వారి శిశు సంరక్షణ ప్రదేశంలోనూ చేర్చాం. వాడూ

సరదాగా వెళ్ళేవాడు. 1989 మార్చి 29న నాటి వైస్ ప్రెసిడెంట్ శ్రీ శంకర్ దయాళ్ శర్మగారి రాష్ట్ర పర్యటనపై రేడియో నివేదిక నా గళంతో ఇవ్వడం గుర్తుంది.

1990 లో నాటకాల ప్రొడక్షన్లూ, స్రవంతి వయోవృద్ధుల కార్యక్రమాలూ చేశాను. ఆ ఏడాదే బహుశా నా సర్వీస్‌లో రెండోసారి అనుకుంటా - 'ఎల్.టి.సి'మీద, కుటుంబంతో న్యూఢిల్లీ వెళ్ళి వచ్చింది! 1990 చివర్లో రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులవల్ల హైదరాబాద్‌లో కర్ఫ్యూలు కూడా తరుచుగా ఉంటూండేవి. అయినా విధులకు హాజరుకాక తప్పదు కనుక - కష్టనష్టాలెన్నో పడ్డాం! యువవాణి ఎంట్రీకి జాతీయ బహుమతి లభించిన ఆనందాన్ని పురస్కరించుకుని అంటూ స్టేషన్ డైరెక్టర్ శ్రీ గణేశన్ గారు 1991 ఫిబ్రవరి 20న ఆకాశవాణి స్టాఫ్ అంతటికీ 'అశోకా హోటల్'లో పార్టీ ఇచ్చారు! ఒక స్టేషన్ డైరెక్టర్ అలా స్టాఫ్‌కు సరదాగా విందు ఇవ్వడం అదే నేను చూడడం! ఆ తరువాత 'ఏప్రిల్'1991లో ఆయన ఎలక్షన్ ప్రసారాలకు పకడ్బందీగా సమాయత్తం చేసారు. ఎ.ఎస్.డి.గా గోపాలంగారికి బాధ్యతలప్పచెప్పి వెళ్ళారు.

నా ప్రమోషన్ వార్త తెలిసాక కూడా ఎన్నికల హడావుడి అంతా ముగిసాక గానీ రిలీవ్ చేయమని గోపాలం గారు చెప్పారు. సరే! మా మ్యూచువల్ ట్రాన్సఫర్ ప్రయత్నం అదీ (రామానుజాచారితో) ఎట్టకేలకు ఫలించి, 1991 జూలై 16 వ తేదీ ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం - ట్రాన్స్‌మిషన్ ఎక్జిక్యూటివ్ స్థాయి నుండి, ప్రమోషన్ మీద 'ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్'గా ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో చేరేందుకు రిలీవ్ అయ్యి, 17.7.1991 విజయవాడ ఆకాశవాణి కేంద్రంలో కార్యక్రమ నిర్వహణాధికారిగా జాయిన్ అయ్యాను.




## 24

**ఏదయినా చేయడానికి గానీ, చేయించడానికీగానీ,** తద్వారా - నిజంగా రేడియోకి చేసిన 'కంట్రిబ్యూషన్' ఏదయినా ఉందని చెప్పుకోవడానికి గానీ అవకాశం ఉన్న మంచి పోస్టింగ్ "ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్" అనబడే కార్యక్రమ నిర్వహణాధికారి ఉద్యోగం. కార్యక్రమాలను రూపకల్పన చేయడం, రూప కల్పన చేసిన కార్యక్రమాలకు తగినట్లుగా - రచయితలను, కళాకారులను, వివిధ రంగాల ప్రముఖులను ఎంపిక చేసుకోవడం, వారితో ఆ కార్యక్రమాలను రూపొందించి, ప్రసారం చేయడం కార్యక్రమ నిర్వహణాధికారి ప్రధాన బాధ్యత. రికార్డింగ్స్‌లో వాటిల్లో సహకరించడానికి - ఒక ప్రొడక్షన్ అసిస్టెంట్, కాంట్రాక్ట్‌లూ, కరస్పాండెన్స్ వంటివి చేయడానికి ఒక ప్రోగ్రాం సెక్రటరీ ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్‌లకు ఆయా విభాగాలకు సహాయకులుగా నియుక్తులై ఉంటూంటారు. మూడు నెలలకు ముందుగానే ప్రోగ్రాంలు ప్లాన్ చేసి, ఒక షెడ్యూల్ తయారు చేసి, స్టేషన్ డైరెక్టర్ చేత ఆమోదింపచేసుకుని, ఢిల్లీకి కూడా ఆ షెడ్యూల్ పంపాలి. ఇతర ప్రధాన కేంద్రాలకు కూడా ఒక ప్రతిని పంపే ఆనవాయితీ ఉండేది.


కులకర్ణిగారితో

1991 జూలై 17న నేను విజయవాడ కేంద్రంలో ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్‌గా చేరేటప్పటికి అక్కడ శ్రీ జి. కులకర్ణిగారు స్టేషన్ డైరెక్టర్‌గా ఉన్నారు. ఆయన తెలుగువాడు కాకపోయినా, కార్యక్రమాల పట్ల మంచి అభిరుచి కలిగినవారు. 'అడ్మినిస్ట్రేటర్'గా కూడా నిక్కచ్చి మనిషి' కొంచెం దైవభక్తి, పాపభీతి, చిత్తశుద్ధి గల మనిషే! తెలుగు రాకపోయినా - స్క్రిప్ట్స్ అవీ కూడా ఆయన అప్రూవల్ తీసుకుని కానీ, ప్రసంగకర్తలయినా - వారి ప్రసంగాలు రికార్డు చేయడానికి అంగీకరించేవారు కాదు. తెలుగు వచ్చిన ఎవరి సహకారమో తీసుకుని - కొన్నింటిని మరీ నిశితంగా పరిశీలించేవారు! అలా అప్రూవల్‌కు నా చేత చదివించినవీ ఉన్నాయి.

కార్యక్రమ నిర్వహణాధికారిగా స్టేషన్ డైరెక్టర్‌గారితో నిరంతర అనుసంధానం తప్పదు.

ప్రతిరోజూ ఉదయం 'ప్రోగ్రాం మీటింగ్‌కు అందరూ విధిగా హాజరు కావాలి! డ్యూటీ ఆఫీసర్లుగా ఉన్నప్పుడు - 'అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకాలు అవీ ఉండేవి. కానీ ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్‌లు రోజూ 'ప్రోగ్రాం మీటింగ్'కు అటెండ్ కావడం అనేదే అటెండెన్స్! వేరేగా రిజిస్టర్‌లో సంతకాలు చేయడం ఏమీ ఉండదు. ఎందుకంటే ఏ రోజుకారోజు సంతకాలు చేయవలసినవీ, నిర్వహించాల్సినవీ ఎన్నో కాగితాలు ఉంటూనే ఉంటాయి. 'లే అవుట్' రిజిష్టర్లు, 'ప్రపోజల్' రిజిష్టర్లు వంటి కార్యక్రమం నిర్వహణకు సంబంధించిన వాటితో నిత్యం పనే! వాటిల్లో - అసిస్టెంట్ స్టేషన్ డైరెక్టర్‌కూ, స్టేషన్ డైరెక్టర్‌కూ పంపవలసిన రోజు వారీ కాగితాలు ఎన్నెన్నో! కులకర్ణిగారు పునఃప్రసారానికి విముఖంగా ఉండేవారు నిత్య నూతన కార్యక్రమాలతో శ్రోతలను అలరింపచేయాలనేవారు. సమయానికి ఒక కార్యక్రమం రికార్డింగు తాలూకు ప్రసంగ కర్త, కళాకారుడో రికార్డింగ్‌కు రాలేదనీ అందువల్ల రేపటి కార్యక్రమం కొత్తది సిద్ధంగా లేదనీ, మునుపటి దేదయినా పునఃప్రసారం చేస్తామనీ అంటే - 'యాంపిల్ టైమ్ ఈజ్ దేర్! ఎంటైర్ నైట్ ఈజ్ విత్ యూ'' అంటూ మర్నాటి ఉదయం ప్రసారం కావలసిన కార్యక్రమం అయినా, కళాకారుడో, వక్తో దొరకకపోతే - మీరే స్వయంగా రాసి, చదివి, రూపొందించి, ప్రసారం చేయమంటూండేవారు. ప్రమోషన్ రాగానే - అలాంటి డైరెక్టర్ గారి దగ్గర పనిచేసినందువల్లనే నిత్యనూతనంగా ఆలోచించడం, కార్యక్రమాలు రూపకల్పన చేస్తూ ఎప్పటికప్పుడు కొత్తవి ప్రసారం చేసే ఉత్సాహంతో ఉండగలగడం సాధ్యమయింది. అలాగని ఆయన పునఃప్రసారాలను నిషేధించారని అనడం లేదు. ఎంతో మంచి కార్యక్రమమూ, ఎంతో విధాయకమూ అయితేనే రిపీట్ ప్రోగ్రాంలు ఓకే చేసేవారు ఆయన. అదో మంచి పద్ధతి.

ఆకాశవాణి 'విజయవాడ'కేంద్రం అంటేనే తెలుగు కార్యక్రమాలకు పెట్టింది పేరు. హైదరాబాద్ కేంద్రం 'డక్కనీ' పునాదులతోనూ, ఒక 'కాస్మోపాలిటన్' కల్చర్‌తో ఉన్నది కావడమూ, విజయవాడ కేంద్రమే తెలుగుకు నడిబొడ్డుగా రాణించడమూ జరిగింది. 1948లో సరిగ్గా డిసెంబర్ ఒకటవతేదీ ఆకాశవాణి విజయవాడ కేంద్రం స్థాపనతో, ఆంధ్రదేశంలో తెలుగు కార్యక్రమాల ప్రసారం మొదలయింది. హైదరాబాద్‌లో 1933లో ప్రైవేట్ రేడియో కేంద్రం మొదలై, 1935 ఫిబ్రవరి 3న నిజాం నవాబు దానిని స్వాధీనం చేసుకుని, 'దక్కన్ రేడియో' పేరున 1939 జూలై నుండి అభివృద్ధి పరిచినా, 1950 ఏప్రిల్ ఒకటో తేదీన మాత్రమే హైదరాబాద్ లోని 'దక్కన్ రేడియో' ఆలిండియా రేడియో (ఆకాశవాణి) స్వాధీనమయింది. 1955లో నిజాం నుండి భారత ప్రభుత్వం ఆధీనంలోకి వచ్చింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడ్డాక 1954 లోమద్రాసు నుండి ప్రారంభమైన - తెలుగులో ప్రాంతీయవార్తలు 1956లో ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం నుండి ప్రసారానికి తరలించబడ్డాయి. హైదరాబాద్ ప్రాంతీయ వార్తా విభాగానికి అదనంగా విజయవాడలో ఒక ప్రాంతీయ వార్తవిభాగం మాత్రం 1981 నుండి మొదలయింది. కానీ తెలుగు కార్యక్రమాల విషయంలో మాత్రం విజయవాడే హైదరాబాద్ కన్నా ప్రసారాల్లో అగ్రగామిగా కాలవాచిగానే కాదు, నాణ్యతా ప్రమాణాల పరంగానూ వాసిగాంచుతూ వచ్చింది! రేడియో కార్యక్రమాల వివరాలు తెలిపే 'వాణి' పక్షపత్రిక కూడా విజయవాడ నుండే (మద్రాసు నుంచి తరలించబడి) వెలువడేది. 1948 నుండి కూడా 'విజయవాడ'కేంద్రం తెలుగు కార్యక్రమాలకు పెట్టింది పేరుగా, వేసింది పీటగా రాణించింది. అందుకు తగినట్లే విజయవాడ ఆకాశవాణిలో పనిచేసిన సాహిత్య, సంగీత దిగ్దంతులున్నారు. రజని వంటి వారు వైభవ ప్రాభవాలు అద్దారు దానికి.



విజయవాడ ఆకాశవాణిలో తెలుగు కార్యక్రమాల ప్రొడ్యూసర్‌గా ఉన్న 'ఉషశ్రీ' గారి తరువాత - ఒక కార్యక్రమ నిర్వహణాధికారిగా అక్కడ తెలుగువిభాగాన్ని 1991 నుండి ఓ నాలుగేళ్ళకు పైగా చూసే భాగ్యం నాకు కలిగింది! 1995 ఆగస్టు చివరలో మళ్ళీ హైదరాబాద్ వచ్చేవరకూ - చివరి ఒక ఆరేడునెలలు వివిధభారతి విభాగాన్ని చూసాకానీ, అంతకు ముందు నా విజయవాడ వృత్తి ఉద్యోగ కాలమంతా, తెలుగు విభాగం నిర్వహణాధికారిగానే ఉన్నాను. నేను

వెళ్ళేసరికి శ్రీ ఇంద్రగంటి శ్రీకాంత శర్మగారు స్క్రిప్ట్ రైటర్ - అసిస్టెంట్ ఎడిటర్‌గా పనిచేస్తూ స్టేషన్ డైరెక్టర్ ఆదేశం మేరకు - అంతవరకూ తగిన స్టాఫ్ పోస్టింగులు జరగనందువల్ల, ఆ విభాగం చూస్తూండేవారు. కార్యక్రమ నిర్వహణాధికారులు కాకపోయినా అలా చూసే వైయుక్తిక బాధ్యతలు కేంద్రం అవసరాల మేరకు - స్టేషన్ డైరక్టర్లు ట్రాన్స్‌మిషన్ ఎక్జిక్యూటివ్‌లకు కూడా అప్పచెబుతూండడం ఉండేది. అప్పట్లో శ్రీకాంత శర్మగారే ఉదయం 'సూక్తిసుధ' స్క్రిప్ట్, రాసి, రోజూ శ్రోతలకు వినిపించేవారు. ఆ స్క్రిప్ట్ కులకర్ణిగారు అప్రూవ్ చేసినట్లు సంతకం పెడితేగానీ రికార్డు చేయడం కుదిరేదికాదు. శర్మగారు ఎంతో (అ) సహనంతో డైరెక్టర్ రూమ్‌లోంచి 'అప్రూవ్' అయి రావాల్సిన ఆ స్క్రిప్ట్' కోసం ఎదురు చూడడమూ గుర్తుంది! సంస్కృత విభాగాన్ని కూడా శర్మగారు నిర్వహించేవారు, నేను చేరగానే కులకర్ణిగారు తెలుగు, సంస్కృత విభాగాలను నాకు అప్పగించారు. సహృదయులు, గొప్ప సాహితీవేత్త, పండితులు అయిన శ్రీకాంత శర్మగారి దగ్గరే సంస్కృత విభాగం ఉంచమనీ, ఓ ట్రాన్స్‌మిషన్ ఎక్జిక్యూటివ్‌ను తెలుగు విభాగానికి నాకు సహాయంగా నియమించమనీ కులకర్ణిగారిని నేను కోరగా - ఆయన దానికి అంగీకరించారు. శ్రీకాంత శర్మగారికి ఆ తరువాత రెండేళ్ళకు కార్యక్రమ నిర్వహణాధికారిగా ప్రమోషన్ రావడం, ఆయనను నిజామాబాద్ బదిలీ చేయడం, ఢిల్లీలోని స్టాఫ్ ట్రైనింగ్ లో మేం కలిసి పాల్గొనడం, నిజంగా మరుపురాని విషయాలు! మా ట్రైనింగ్ ముచ్చట్లు మున్ముందు వస్తాయిలెండి..!!


ఇంద్రగంటి శ్రీకాంత శర్మగారితో

శ్రీ కులకర్ణిగారు స్టేషన్ డైరక్టర్‌గా, షెడ్యూల్స్ ముందుగా పూర్తి వివరాలతో ఇచ్చి తీరాలన్న నియమాన్ని తూ.చా పాటింపచేసేవారు. అసిస్టెంట్ డైరెక్టర్ ద్వారా - పెక్స్ (ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్) అవి స్టేషన్ డైరెక్టర్‌కు సబ్‌మిట్ చేయాలి. డా.పి.ఎస్.గోపాలకృష్ణ గారు, శ్రీ శబరి నాథన్ గారు మేం విజయవాడలో ఉండగా ఎ.ఎస్.డిలుగా ఉన్నారు. 'పెక్స్'లుగా విజయవాడలో మేం యంగ్ బాచ్‌గా శ్రీ ముకుంద శర్మ, వసుమతి, ఉషారాణి, నేను, ఇంకా అప్పుడు పెక్స్‌లుగా పెద్దలయిన శ్రీ రమామోహన్ రావ్, విజయ భూషణ శర్మ, రత్నాకర బాబు, పాండురంగ, అగ్రికల్చరల్ ఆఫీసర్‌గా హనుమంతరావు, హిందీ విభాగంలో సరోజా నిర్మల, రాజేశ్వరి, 'పెక్స్'కోగా ప్రయాగ వేదవతిగారు కలిసి పనిచేసాం! అప్పుడు డ్యూటీ ఆఫీసర్లుగా - కలగ కృష్ణమోహన్, మంత్రవాది మహేశ్వర్, డి.రాజారెడ్డి, ఖుద్దూస్, రాజారావు, సి.హెచ్.మహేష్, రాజేంద్ర ప్రసాద్, వసంతకుమారి, విజయ కుమార్ బాబు వీరంతా ఉండేవారు. ఎం.వి.వరప్రసాద్ కూడాను. అలాగే చెన్నూరి రాంబాబున్నూ.

ఇక ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో వివిధ భారతి విభాగంతో కలుపుకుని అనౌన్సర్లుగా పనిచేస్తున్నవారంతా హేమాహేమీలే! పేరి కామేశ్వరరావు, లింగరాజశర్మ, కోకా సంజీవరావు, వాసుదేవ మూర్తి, పన్నాల సుబ్రహ్మణ్య భట్టు, డి.ఎస్.ఆర్.ఆంజనేయులు, ఎస్.బి.శ్రీరామమూర్తి, మాడుగుల రామకృష్ణ, కుసుమ.బి.రావు, విజయకుమారి, జె.వి.యల్ కామేశ్వరి, మల్లాది సూరిబాబు వీరందరూ శ్రోతలకు చిరపరిచితులే! విజయవాడ వార్తావిభాగంలో అప్పుడు కొప్పుల సుబ్బారావు, ప్రయాగ రామకృష్ణ వార్తలు చదువుతూండేవారు.

విజయవాడ కళల కాణాచి. సాహిత్య సంగీతాలకే కాదు, వివిధరంగాలకు చెందిన ప్రముఖులు విజయవాడలో ఉండడమూ, పైగా హైదరాబాద్‌తో పోలిస్తే - విజయవాడ నగరం రాకపోకలకు అనువుగా, దూరాభారాలంతగా లేనిదిగా, ఏ సమయంలో నయినా కళాకారులను సంప్రదించడానికీ, వారిని స్టూడియోకి రప్పించడానికీ అనువుగా ఉండేది. అంచేత ఏ కార్యక్రమం తలపెట్టినా - ఆర్టిస్టులకోసం ఇబ్బంది అనేది ఉండేది కాదు. పైగా ఎంతో సహృదయంతో ఎప్పుడయినా అందుబాటులో ఉంటూ, రేడియోపట్ల ఎంతో ఆదరాభిమానాలతో ఉండేవారు అందరూ. అది నిజంగా గొప్ప సంపత్తి.




నిజంగా - కార్యక్రమ నిర్వహణాధికారిగా నా పునాదులు విజయవాడలో పడడం, అందునా కులకర్ణిగారి వంటి స్టేషన్ డైరెక్టర్ మొదటిగానే తగలడం వల్లనే - చక్కని పనిచేసే సంస్కృతి, ఉద్యోగ బాధ్యతల నిర్వహణా దక్షతతో బాటుగా మంచి కార్యక్రమాలు రుపొందించి ప్రసారం చేసిన గొప్ప సంతృప్తి ఒనగూడింది. ఎందరో లబ్ధప్రతిష్ఠులు పనిచేసిన సంస్థలో పనిచేస్తున్నాననీ - వారంత సామర్ధ్యం లేకున్నా - ఆకాశవాణి ప్రతిష్ఠకు తీసికట్టు కారాదనీ, చేతనైనంతగా కష్టపడి పనిచేశాం! కార్యక్రమ నిర్వహణాధికారిగా విజయవాడలో నేను రూపొందించిన కార్యక్రమాలూ, ముందుకు తీసుకు వెళ్ళిన కార్యక్రమాలూ తలుచుకోవడం ఎప్పటికీ ఆనంద హేతువులే!! విజయవాడలోనే 'బి.హై' గ్రేడ్ డ్రామా వాయిస్ ఆర్టిస్టు అయ్యాను కూడా.



## 25

**కొత్త ఎప్పుడూ ఉత్సాహంగా ఉంటుంది.** 'కొత్త ఒక వింత పాత ఒక రోత' అన్నమాట ఉన్నదే కదా! దాదాపు పదమూడు సంవత్సరాలు డ్యూటీ ఆఫీసర్‌గా షిఫ్ట్ డ్యూటీల్లో పనిచేసి, పదోన్నతి మీద కార్యక్రమ నిర్వహణాధికారిగా - హడావుడి హైదరాబాద్ నుండి తరలి, ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో చేరడం, చేరినప్పుడు స్టేషన్ డైరెక్టర్‌గా ఉన్న కులకర్ణిగారు కూడా ఒక నియమ బద్ధ ప్రోత్సాహకర అధికారి కావడం, కొత్త కార్యక్రమాల గురించి చర్చిస్తూ, నా బోంట్ల ప్రతిపాదనలను మన్నిస్తూ, సహకరించడం - కొత్త ఉద్యోగ బాధ్యతల్లో ఉత్సాహాన్ని కలిగించేది.


విజయవాడ ఆకాశవాణి కేంద్రం

ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్ (కార్యక్రమ నిర్వహణాధికారి) అంటే ఒత్తిడి ఉండేదే! మూడు నెలల ముందుగానే కార్యక్రమ ప్రణాళిక వేయడం, డైరెక్టర్‌చే అంగీకరింపచేసుకున్నాక - నిర్వహిస్తున్న విభాగానికి కేటాయించిన సమయాల్లో, ఆయా కార్యక్రమాల ప్రసారానికి వక్తలు, కవులు, రచయితలు, కళాకారులు, విషయ నిపుణులను ఎంచుకోవడం, నెలవారీ 'లే అవుట్' రూపొందింప చేసుకుని, ప్రపోజల్స్ రాసి, కళాకరులను ఆహ్వానిస్తూ కాంట్రాక్టులు పంపడం, నిర్దేశించిన రికార్డింగు తేదీల్లో - వారు వచ్చాక - కార్యక్రమం రికార్డు చేయడం, వారి పారితోషికాలు రికార్డింగు అయిన వెంటనే సమయానికి అందేలా చూడటం, రికార్డు చేసిన కార్యక్రమాలను ప్రసార తేదీల

కనుగుణంగా లైబ్రేరీలో ఇచ్చి, దినవారి ప్రోగ్రాం క్యూషీట్స్‌లో ఆ వివరాలన్నీ ముందుగానే ఉండేలా చూసుకోవడం, ముఖ్యమైన కార్యక్రమాలకు ముందునుంచే రేడియోలోనూ, అవసరమైతే పత్రికలద్వారానూ ప్రచారం చేస్తూండడం, నిర్దేశించిన సమయానికి నిర్దుష్టంగా - ఎటువంటి సాంకేతిక పొరపాట్లూ లేకుండా - కార్యక్రమం ప్రసారం అయ్యేలా జాగ్రత్త వహించడం ఇవన్నీ ఉద్యోగంలో బాగాలే సుమండీ! ఇవన్నీ చేశాం.

ఒక కార్యక్రమ ప్రసారం - అనుకున్న సమయానికి అనుకున్న తేదీకి తప్పక ప్రసారం కావలసిందే! అత్యవసర పరిస్థితుల్లో ప్రసార తేదీ ఆ తరువాత ఎప్పటికో వాయిదా పడచ్చుగానీ, 'ప్రీపోన్' చేసి ముందుగా వేయడం కుదరదు. అలాగే రికార్డింగ్, సమయానికి జరగక - ప్రసార తేదీకి కార్యక్రమం అందించలేకపోతే, పాత కార్యక్రమాన్ని ఏదయినా పునః ప్రసారం చేద్దామన్నా, దానికి కేంద్ర సంచాలకుల అనుమతి తీసుకోవాలి! ముందే చెప్పానుగా! - అప్పటి డైరెక్టర్ 'కులకర్ణి'గారు ఈ విషయంలో అంటే పునః ప్రసారాల విషయంలో సుముఖులు కారని' అంచేత ఒక కార్యక్రమానికి విషయ నిపుణునిగా అనుకున్న ఆర్టిస్టు దొరకకపోతే, ప్రత్యామ్నాయంగా మరో ఆర్టిస్టుని ఎంపికచేసుకుని, దానికి ముందుగానే డైరెక్టర్ పర్మిషన్ తీసుకుని, కార్యక్రమం సిద్ధం చేయాల్సి ఉండేది. ఇదంతా ఆచరణలో - అనుకున్నంత తేలికకాదు.

ఇక కొన్ని కార్యక్రమాలు ప్రత్యక్ష ప్రసారాలే! రికార్డు చేయడం ఉండదు. అప్పటికప్పుడు ఆర్టిస్టు 'లైవ్' చేయవలసినవే. ప్రసార సమయానికి ముందుగా వారు స్టూడియోలో ఉండేలా చూసుకోవాలి. వారు రావడం ఏ మాత్రం ఆలీసం అవుతున్నా - ఇక్కడ 'నిర్వహణాధికారికి' టెన్షనే! ఎవరిమీదో బాధ్యత నెట్టివేయడం కాక, స్వయంగా ఒడిదుడుకులకూ బాధ్యత వహించవలసిందే.

'కొత్త బిచ్చగాడు పొద్దెరగడు' అన్న సామెతలాగా - కొత్త ఉద్యోగపు 'ఉత్సాహం' ఆఫీస్‌కు ఎక్కువ అంకితం అయ్యేలానే ఉండేది. 'ఆకాశవాణి' - బయటివారికి ఎంత 'సృజనాత్మక సంస్థ' అయినా, ఉద్యోగులకు దానితో బాటు ప్రధానంగా 'ఆఫీసే' కదా! ఆఫీసు నియమనిబంధనలకు లోబడుతూనే - 'సృజనాత్మకత' చూపాలి. కేవలం జీతంకాక, పేరు ప్రతిష్ఠలు కూడా ఇచ్చే సంస్థ అంటే 'మీడియా' రంగంలోనిదే కదా! అందునా ఆ రోజుల్లో 'ఆకాశవాణి'కే పెద్దపీటాయె!

చేరగానే విజయవాడ ఆకాశవాణిలో 'తెలుగు కార్యక్రమ విభాగ నిర్వహణాధికారిగా - నాకు ప్రధానంగా కేటాయించబడిన కార్యక్రమాలు తెలుగు ప్రసంగాలుతో బాటుగా, పరిచయ కార్యక్రమాలూ, కవిత్వం, కథలు, పుస్తక సమీక్షలు, వినియోగదారుల కార్యక్రమాలు, వారం వారం అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర సంఘటనల వార్తా విశ్లేషణ కార్యక్రమం 'నడుస్తున్న చరిత్ర', 'లైవ్' కార్యక్రమాలుగా 'సరసవినోదిని', (సమస్యాపూరణం) 'టెలిఫోన్ ముఖాముఖి' (శ్రోతలు ఫోన్ ద్వారా అడిగిన ప్రశ్నలకు వివిధ రంగాల నిపుణులు ఆయా నిర్దేశిత అంశంపై ఇచ్చే సమాధానాలు) ఆదివారం మధ్యాహ్నల్లో ధారావాహిక ప్రవచనాల 'కథాలహరి' కార్యక్రమం, ఆహూతుల సమక్షంలో నిర్వహించే కార్యక్రమాలు, ప్రముఖులు అంటే రాష్ట్రపతి, ప్రధాని ప్రభృతులు వచ్చినప్పుడు వారు పాల్గొనే సభలకు హాజరై, రికార్డు చేసి, 'నివేదిక'లు రూపొందించి ప్రసారం చేయడం, ఔట్ సైడ్ బ్రాడ్ కాస్ట్ కార్యక్రమాలూ వీటికి కార్యక్రమ నిర్వహణాధికారిగా పనిచేసాను. పదోన్నతి తొలి నాలుగేళ్ళ పైగా కాలం - విజయవాడ ఆకాశవాణిలోనే ముందుగా, స్టేషన్ డైరెక్టర్లు శ్రీ జి.కె.కులకర్ణి, శ్రీమతి.దుర్గాభాస్కర్, శ్రీ ఆర్.ఎ.అనంత పద్మనాభరావుగారల ఆధ్వర్యంలో పనిచేయడం, నాకొక గొప్ప 'వ్యక్తిత్వ వికాసమే'! అనంత పద్మనాభరావుగారి దగ్గర కార్యక్రమ నిర్వహణాధికారిగా ఎక్కువకాలం లేకున్నా - ఆ సమయంలో నన్ను ఆయన తెలుగు విభాగం నుంచి మార్చి, వివిధభారతి వాణిజ్య విభాగానికి కార్యక్రమ నిర్వహణాధికారిని చేసారు. కానయితే 'ఉదయరేఖలు' కార్యక్రమం వారంలో ఒకరోజు నన్ను చూడమన్నట్లు గుర్తు!

ముందుగా శ్రీ కులకర్ణిగారి హయాంలో కార్యక్రమ నిర్వహణాధికారిగా నా 'ప్రాతిపదికలు' తలుచుకోదగినవి! ముఖ్యంగా గోదావరి పుష్కరాలు, నంద్యాలలో ప్రధాని పర్యటన, నంది అవార్డుల ఫంక్షన్ వంటి 'ఈవెంట్స్' ఆయన డైరెక్టర్‌గా ఉండగానే.

వినియోగదారుల కార్యక్రమం 'వేదన - నివేదన' అనే పేరుతో నే వెళ్ళే సరికే సాగుతుండేది. పేరుకు దానికి ఒక కార్యక్రమ నిర్వహణాధికారి ఉన్నా, విజయవాడలోని వినియోగదారుల సంఘానికి చెందిన ఒకాయనే శ్రోతల సందేహాలు కూడా వారి ఆఫీసు చిరునామాకే వచ్చేలా చూసుకుంటూ, దాదాపు ఆయన 'మొనోపలీ'గా దానిని సాగిస్తూండేవారనీ, ఆయన డైరెక్టర్ కులకర్ణిగారికి చాలా సన్నిహితుడనీ - ఆ కార్యక్రమ బాధ్యత తీసుకోగానే నాకు విజయవాడ పరిధిలోకి వచ్చే వివిధ జిల్లాల వినియోగదారుల సంఘాల నిర్వాహకులు కూడా తెలిపారు. వినియోగదారుల ప్రశ్నలకు - ఆ చట్టం క్రిందకు వచ్చే వివిధరంగాల సమస్యలకు సంబంధించిన పరిష్కారాలకు - నిపుణులుచే సమాధానాలిప్పించే కార్యక్రమంతో బాటు, ఉదయం పూట ఓ అయిదు నిమిషాలు వారం వారం వినియోగదారులకు సూచనలు ప్రసారం అయ్యేవి. ఆ స్క్రిప్టులు ఆయనే అప్పట్లో రాసేవారు. ఆకాశవాణి కార్యక్రమం ఒక బయటి వ్యక్తి (ఉద్యోగికాని) ఆధ్వర్యంలోకి వెళ్ళడం సరికాదని, దానిని నియంత్రించి, పరిధిలోకి తీసుకురాగలగడం, డైరెక్టర్ కులకర్ణిగారిని ఒప్పించి, నా నిర్వహణా సంవిధానంలోకి తేగలడం, నాకు గొప్ప తృప్తి కలిగించిన విషయం! 'వేదన - నివేదన' అన్న పేరు తొలగించి ఆ కార్యక్రమాన్ని 'వినియోగదర్శిని'గా శ్రోతృజనసమాదరణకు మలచగలిగాను! ఉదయం వినియోగదారులకు చేసే సూచనలు స్క్రిప్టు నేనే రాసాను. 1986లో వినియోగదారుల చట్టం ఏర్పడినప్పుడే - ఆకాశవాణి హైదరాబాద్‌లో 'డ్యూటీ ఆఫీసర్'గా ఉండే నేను వినియోగదారుల కార్యక్రమాలతో సాన్నిహిత్యమేర్పరుచుకోవడం, డాక్టర్ కె.విజయగారు కార్యక్రమ నిర్వహణాధికారిగా ఉండగా, ఆవిడకు సహకారంగా - ఆ కార్యక్రమాలకు పనిచేయడం జరిగిందని మునుపే చెప్పానుగా! అందువల్ల 'వినియోగదర్శిని' రూపొందించే విధానానికి ఆ అనుభవం నాకు తోడ్పడింది. డైరెక్టర్‌కు సన్నిహితులైన ఆ వ్యక్తి ఈ పరిణామానికి మొదట్లో ఎంతగానో 'కినిసి' నాపై కొంత అపవాదు, సహాయ నిరాకరణ వైఖరి అవలంబించినా, ఆ తరువాత మామూలయ్యారు. నాటక విభాగం చూసే కార్యక్రం నిర్వహణాధికారి 'పాండురంగ' ఆయన ఆసక్తి ఎక్కువ నాటకాలవైపే కనుక, వినియోగదారుల కార్యక్రమ నిర్వహణ నేను రాకముందు ఆయనకు అప్పగించడం వలన - ఆయన తనపనుల సానుకూలతకు, ఆ వినియోగదారుల సంఘ నిర్వాహకునిపై ఆధారపడి, 'భరోసా'గా ఉండటం వల్ల కలిగిన స్థితి అది! నా ప్రధాన అభిరుచీ తెలుగు సాహిత్య ప్రసంగ విభాగమే అయినా, ముందునుంచీ 'కన్స్యూమర్స్ ప్రోగ్రామ్స్' పట్ల నాకు కలిగిన శ్రద్ధాసక్తులు 'వినియోగదర్శిని' ఉపయుక్త కార్యక్రమంగా శ్రోతల అభిమానం పొందేందుకు పనిచేసేలా చేసాయి. శ్రీమతి దుర్గాభాస్కర్‌గారు డైరెక్టర్‌గా ఆకాశవాణి విజయవాడలో ఉన్న సుమారు రెండేళ్ళకాలమూ స్వర్ణయుగంగానే - ఆవిడా భావిస్తారు. 'ఉదయరేఖలు' కార్యక్రమం మార్నింగ్ ఇన్ఫర్మేషన్ సర్వీస్‌గా విజయవాడలో అప్పుడే ఒక 'కాంపోజిట్ ప్రోగ్రాం'గా రూపుదిద్దుకుంది.




నిజానికి విజయవాడ రేడియో జ్ఞాపకాల విషయాలే కార్యక్రమ నిర్వహణాధికారిగా పదోన్నతిలో నా తొలినాళ్ళు కాబట్టి - ఎక్కువగా వెంటనంటి ఉంటాయి మరి! ఏ విషయం, ఏది, ఎక్కడ, ఎలా, మొదలెట్టాలా అని ఆలోచించాల్సి వస్తోంది. సరే! 1991 జూలైలో కదా నేను చేరింది! బుధ, శుక్రవారాల్లో ప్రధానంగానూ, మంగళ, గురువారాల్లో అప్పుడప్పుడూ - రాత్రి 9.16కు ప్రధానంగా తెలుగు ప్రసంగాలుండేవి. కులకర్ణిగారు నెలనెలా ఒక ప్రధాన శీర్షిక క్రింద ప్రసంగాలు అప్పటికే చేయించమన్నారట! జూలై 91 లో "ప్రమాణం - పరిణామం" అన్న శీర్షిక క్రింద ప్రసారమైన తొలిప్రసంగం 'వేద ప్రామాణ్యం నేటికి తగినదేనా' అనే అంశం మీద


ప్రసాదరాయ కులపతిగారు

డాక్టర్ ప్రసాదరాయ కులపతిగారు చేసింది. అప్పట్లో ఆయన గుంటూరులోనే ఉండేవారు.

'శ్రీనాథ పీఠం' వారిదే! ఇప్పుడు కుర్తాళం పీఠం స్వామీజీగా, శ్రీ సిద్ధేశ్వరానంద భారతీ స్వామిగా ప్రఖ్యాతులైన వారే పూర్వాశ్రమంలో ప్రసాదరాయకులపతిగారు. రెండవ ప్రసంగం - 'భారతీయ పురాణాల్లో మత సామరస్యం' గురించి శ్రీ కోటగిరి విశ్వనాధరావుగారు, ఆ తరువాత వారం 'భగవద్గీతలో కాయకర్మ' గురించి శ్రీ మల్లాప్రగడ శ్రీ రంగారావు (మచిలీపట్నం)గారు ప్రసంగించారు. అదే నెలలో 'మొహర్రం' పండుగ రావడంతో - నూతక్కి గ్రామంకు చెందిన శ్రీ షేక్ హమీదుల్లా షరీఫ్ గారు చక్కని


శ్రీ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్

తెలుగులో 'మొహర్రం ప్రాముఖ్యత' గురించి ప్రసంగించడం ముచ్చటేసిన తొలి అచ్చరువే! రాత్రి 9.16కే 'కవితాహారం' అని ఇద్దరు కవుల కవితలు వస్తూండేవి. నేను చేరిన నెల అవనిగడ్డ పద్య కవి శ్రీ దాసి బసవయ్యగారు, సాగి రంగరాజు గార్ల కవితలు ప్రసారమయ్యాయి. 'సరసవినోదిని' సమస్యాపూరణం కార్యక్రమాన్ని ఆ నెల శ్రోతలు పంపిన పూరణలు చదివి వినిపిస్తూ, కొత్త సమస్యను సంధిస్తూ శ్రీ పాలపర్తి శ్యామలానంద ప్రసాదుగారు నిర్వహించారు. ఆయన కవి, పండితుడు, అవధానికూడాను. ఆదివారం మధ్యాహ్నం 12.05కు 'కథాలహరి' లో 'వామన పురాణం' నుంచి వారం వారం ధారావాహికంగా కథ ప్రవచనం శ్రీ ఏలూరిపాటి అనంతరామయ్యగారిది అప్పుడే ప్రారంభం అయింది. రచన ఆయనదే కానీ, రేడియో అనుసరణ, ప్రవచనం ఆకాశవాణిలో అనౌన్సర్‌గా ఉన్న శ్రీ పేరి కామేశ్వరరావుగారు చేసారు. అనంతరామయ్యగారి ఆరోగ్యం అప్పుడు కొంత దెబ్బతినడమే కారణం! ఆ తరువాత ఆయనకోలుకుని, నేనుండగానే - 1992 అక్టోబర్‌లో ప్రారంభించి పదమూడువారాలు నా ఆధ్వర్యంలోనే 'మార్కండేయ పురాణం' కథ ప్రవచనం చేసారు! మూడు నెలల షెడ్యూల్‌లో - జూలై, ఆగస్టు, సెప్టెంబర్‌ల షెడ్యూల్ నేను చేరేసరికే రూపొందిందే అయినా, వాటి నిర్వహణా బాధ్యత, రికార్డింగులు, మార్పుచేర్పులూ అవసరమైన మేర చేసుకునేలా మలుచుకోవడం.. వెంటనే స్వీకరించడం జరిగింది. అంటే ఆగస్టు'91 నుండి, ప్రసారమయ్యే నా నిర్వహణలోని కార్యక్రమాల రికార్డింగు, ప్రసారాల బాధ్యత, స్క్రిప్టులు ప్రసారానుకూలంగా ఉన్నాయో లేదో చూసుకోవడం, ఆరిస్టులతో సంప్రదింపులు, రోజువారీ మీటింగులూ చర్చలూ అన్నీ మొదలయ్యాయన్నమాట.


ధర్మ సందేహాలు, రామాయణ భారత ప్రవచనాలతో తెలుగింటి పేరుగా నిలిచిన ఉషశ్రీ తో పి. రామమోహనరావు

శ్రీమతి కె.ఇందిర (శంకరాభరణంలో వేసిన మా ఆకాశవాణి ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్ 'శ్రీ గోపాల్'గారి అమ్మాయి) నాకు ప్రోగ్రాం సెక్రటరీగా, బహుశా 'రాజారెడ్డి' కాబోలు.. డ్యూటీ ఆఫీసర్‌గా ఉన్న తను, మా సెక్షన్‌కు ప్రొడక్షన్ అసిస్టెంట్‌గా పనిచేసారు. అక్టోబరు 1991 నుండి మొదలయ్యే షెడ్యూల్ రూపకల్పనతో - ఆకాశవాణి విజయవాడ తెలుగు విభాగంలో నా పాత్ర అనండి, నా ముద్ర అనండి మొదలయినట్లన్నమాట! ఉషశ్రీగారు నిర్వహించిన విభాగం అది. శ్రీకాంత శర్మగారు పక్కనే ఉన్నారు. ఉషశ్రీ గారు ఒకప్పుడు రామాయణ ప్రవచనం, ధర్మ సందేహాలు కార్యక్రమం చేసిన సమయంలోనే 'కథాలహరి' పేర ధారావాహికలు ప్రవచన పద్ధతిలో మొదలయ్యాయి! 'ఉత్తరరామాయణం' ప్రవచనంగా 'కథాలహరి'లో నేను చేసిన తొలి

'షెడ్యూల్'. కావలి -'జవహర్ భారతి'లో తెలుగు అధ్యయన విభాగం అధిపతిగా ఉన్న డా. జె.వి.సుబ్బారాయుడు గారికి - ఆయన ఆ విషయమ్మై రూపొందించిన ప్రవచనాల స్క్రిప్ట్, పరిశీలించి, ప్రతిపాదించడం, జరిగింది. సెప్టెంబర్'1991లో 'కథాలహరి' ప్రవచనాల రికార్డింగు కోసం ఆయన ఆకాశవాణి నుంచి కాంట్రాక్ట్ అందుకోగానే - రికార్డింగుకు అనుకున్న వేళకు రావడం, ఆయన చేత కథా ప్రవచనం ధారావాహికలను రికార్డింగ్ చేయడం జరిగింది. నేను తొలిగా చేసిన ఆ ముఖ్య కార్యక్రమానికి ఆయన నుండి అందిన లేఖలు. నాకు కలిగించిన ఆనందం అవిస్మరణీయం!. ఆ లేఖలు ఆయన సహృదయ దర్పణాలే గానీ.. నా గొప్పకాదు. కావలస్తే ఆ లేఖలు మీరూ చదవండి! ఆనంద హేతువులే అని మీరు అంటారని నా నమ్మకం. ఆ లేఖలు దిగువున విడిగా పొందుపరచడం జరిగింది.


విజయవాడ వినియోగదారుల సహాయక సమితి ఛీఫ్ - కో ఆర్డినేటర్ శ్రీ వి.వి.సత్యనారాయణ మూర్తి


9.9.91



V. SUBBARAYADU,
M.A., Ph.D.

JAWAHAR BHARATI,
(AUTONOMOUS COLLEGE)
KAVALI-524 202
NELLORE DT. A.P.

25.9.91






## 26

**విజయవాడ ఆకాశవాణిలో చేరాక** జూలై నెలలోనే నేను కడపకు మొదటిసారిగా వెళ్ళాను. తమాషాగా అది ఆఫీసు పనిమీదేమీకాదు. వ్యక్తిగత గౌరవహోదాలోనే. 1990లో నేను నలభయ్యేవ ఏట అడుగుపెట్టిన సందర్భంగా ఆ నవంబర్‌లో మొదటిసారిగా




మొత్తం ముప్ఫై ఆరు కవితలతో 'అగ్నిసుధ' కవితా సంకలనం ప్రచరించాను. అంతకు ముందు 1974లో మిత్రుడు డాక్టర్ నాగినేని భాస్కర్ రావ్, నేను కలిసి 'మేం' కవితాసంకలనం వెలువరించినా అచ్చంగా నాదంటూ ఒక కవితాసంపుటి మొదటిసారిగా ప్రచురించింది 'అగ్నిసుధ'యే! 1980 నాటికి మొత్తం కవిత్వపు ట్రెండే మారిపోయింది. చాన్నాళ్ళుగా కవిత్వం రాస్తున్నా నాదంటూ ఒక సంకలనం పుస్తకరూపంలో అంతవరకూ ప్రచురించకపోవడానికి ఆర్థిక వనరులేకాక ఆ విషయంపై అంత శ్రద్ధ లేకపోవడమూ ఒక కారణం. ప్రముఖ కవి, రచయిత, చిత్రకారులు శ్రీ శీలా వీర్రాజుగారి ప్రోద్బలం చేయడమేకాక నా కవితల ఎంపిక బాధ్యత కూడా ఆయనే తీసుకుని ముఖచిత్రం కూడా సంతరించి పెట్టారు. నా కవిత్వమే నా గురించి చెప్పాలన్న ఉద్దేశం కలవాడిని కనుక దానికి ఏ ప్రముఖుని చేతా ముందుమాట అంటూ ఏమీ రాయించడం జరగలేదు.

'అగ్నిసుధ' సంకలనానికి మంచి సమీక్షలే వచ్చాయి. 'విశాలాంధ్ర'లో సోమసుందర్, 'ఈనాడు'లో డా.ఏటుకూరి ప్రసాద్, 'ఆంధ్రజ్యోతి'లో ద్వానాశాస్త్రి, 'ఇండియాటుడే'లో జి.రాజశుక్ మొదలైనవారి సమీక్షలే కాక సాధారణంగా తెలుగు పుస్తకాలను పట్టించుకోని ఆంగ్లపత్రికల్లో కూడా అగ్నిసుధ సమీక్షలు రావటం నాకు ఆనందం కలిగించింది. 'త్రివేణి' ఆంగ్ల త్రైమాసికలో డాక్టర్ ధారా రామనాథ శాస్త్రిగారు, 'ది హిందూ'లో గంధం అప్పారావ్, 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్'లో శ్రీమతి డా.భార్గవి పి.రావు అగ్నిసుధను సమీక్షించారు. శ్రీ బి.రాజలింగం ఐ.ఏ.యస్ అధ్యక్షులుగా వడ్డెపల్లి కృష్ణ ప్రధాన కార్యదర్శిగా ఉన్న కలహంసి ఆర్ట్స్

సాహిత్య సాంస్కృతిక సంస్థ 'కలహంసి - బాబయ్య స్మారక అవార్డును' 1991 మే నెలలో జరిగిన హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లోని సభలో డా.సి.నారాయణ రెడ్డి చేతులమీదుగా ప్రదానం చేసారు. డా.ఎన్.గోపి ఆ సభలో 'అగ్నిసుధ' కావ్య ప్రసంగం చేసారు.



కడపజిల్లా ముద్దునూరులోని ఉమ్మడిశెట్టి కుటుంబ సభ్యులు ప్రముఖ కవి రాధేయ వ్యవస్థాపకులుగా ఉమ్మడిశెట్టి సాహిత్య అవార్డును 1988లో నెలకొల్పారు. మొదటిసారిగా సౌభాగ్య 'కృత్యాదవస్థ'కు 1989లో శిఖామణి 'మువ్వల చేతికర్ర'కు లభించిన ఉమ్మడి శెట్టి సాహితీ అవార్డు 1990 సంవత్సరానికి నా 'అగ్నిసుధ'కు లభించినట్లు ఒకరోజు ఉదయం రేడియోలోని ప్రాంతీయ వార్తల్లోనే విని ఆనందోద్విగ్నితకు లోనయ్యాను. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య చిలకలూరిపేట ఉపాధ్యక్షులు శ్రీమతి. టి.వాణీ రంగారావు అభినందిస్తూ లేఖ రాయడమూ గుర్తుంది.

ఇంతకూ అసలు విషయం 1991 జూలై 28 ఆదివారం కడప పట్టణంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు ప్రదాన సభ జరిగింది. విజయవాడ నుండే వెళ్ళి ఆ అవార్డును శ్రీ జానుమద్ది హనుమచ్ఛాస్త్రిగారి చేతుల మీదుగా అందుకున్నాను. కవిగా పొందిన ఆ అవార్డుల ఉత్సాహంకూడా విజయవాడ తెలుగు విభాగం నిర్వహణకు నాకు 'బూస్ట్'నిచ్చింది.

అప్పట్లో ఇంకా సెల్‌ఫోన్‌ల ప్రభంజనమూ లేదు, ప్రైవేట్ రేడియో ఛానెల్స్ ఊసూలేదు. కానీ విజయవాడ ఆకాశవాణిలో టెలిఫోన్ ముఖాముఖి కార్యక్రమానికి మంచి ఆదరణ లభించింది. రాత్రి 9.30 నుండి ఓ అరగంట పాటు ప్రత్యక్ష ప్రసారంగా శ్రోతలు ఫోన్‌లో అడిగిన ప్రశ్నలకు ఆయారంగాల విషయ నిపుణులు అప్పటికప్పుడు సమాధానాలిచ్చేవారు. దానికోసం స్టూడియోలో విషయనిపుణులు కూర్చుని ఉండగా ఫోన్‌లో వచ్చిన శ్రోతల ప్రశ్నలను అప్పటికప్పుడు రికార్డు చేస్తూ వెంట వెంటనే విషయ నిపుణులకు, శ్రోతలకు కూడా వినిపింపచేసి ఆ వెంటనే వారి సమాధానం ప్రత్యక్ష ప్రసారం చేసేవారం. విషయ నిపుణులతోబాటు స్టూడియోలో నేను కూర్చుని ఉండగా ప్రొడక్షన్ అసిస్టెంట్స్ బృందం ఆ ఫోన్స్‌లో ప్రశ్నలు రికార్డు చేసి వెంటనే ప్లే చేయడం అదీ చేసేవారు. నెలకొకసారి నిర్వహించే ఆ కార్యక్రమానికై వివిధ విషయరంగ నిపుణులను ఎంపిక చేయడం, వారిని సమయానికి సన్నద్ధం చేయడం ఆ రోజుల్లో మరీ శ్రమతో కూడిన పనే అయినా శ్రోతలు తెగ ఫోన్లు చేసేవారు. అరగంటలో కనీసం ఓ పదిహేను ఇరవై శ్రోతల ప్రశ్నలకయినా సమాధానాలు ఇప్పించేవాడిని. ప్రశ్న ఎంత క్లుప్తంగా, సూటిగా ఉండాలని నిర్దేశించేవారమో అంత సూటిగా అదే సమయంలో స్పష్టంగా సమాధానాలు విషయ నిపుణులు ఇవ్వవలసి ఉండేది.

నాటి విజయవాడ నగర మేయర్ శ్రీ జంధ్యాల శంకర్ గారితో



91 ఆగస్టులో టెలిఫోన్ ముఖాముఖిలో వినియోగదారుల సమస్యల మీదే సమాధానాలిప్పించడం జరిగింది. అప్పుడు ఆంధ్రజ్యోతి దినపత్రికలో వినియోగదారుల కాలమ్ నిర్వహిస్తున్న శ్రీ నందకిశోర్ విజయవాడ కన్స్యూమర్ సమాఖ్య శ్రీపి.వి.వి.సత్యనారాయణ మూర్తి గార్ల సమాధానాలే ఆ నెలలో ప్రసారమయ్యాయి. ఆ మరుసటినెల సెప్టెంబర్ లో జీవితభీమాకి సంబంధించిన శ్రోతల సందేహాలకు ఎల్.ఐ.సి ఆఫ్ ఇండియా మచిలీపట్నం మేనేజర్, మార్కెటింగ్ మేనేజర్ శ్రీ పి.ఎన్.శాస్త్రి, శ్రీసి.ఎస్ మాధవరావుగార్లు సమాధానాలివ్వగా అక్టోబర్ కార్యక్రమాన్ని అప్పుడు విజయవాడ మేయర్‌గా ఉన్న డాక్టర్ జంధ్యాల శంకర్ గారితో రూపొందించి

ప్రసారం చేసాం. మేయర్ గారితో టెలిఫోన్ ముఖాముఖి అనేసరికి విజయవాడ పౌరులు ఉత్సాహంగా స్పందించారు. అలాంటి కార్యక్రమం అప్పటికి కొత్తేమరి. ఆ తరువాత తరువాత కదా దూరదర్శన్‌లో చంద్రబాబు రేడియోలో వలెనే ప్రజలతో ముఖాముఖి కార్యక్రమాల్లోకి దిగింది.

సరే ఆగస్టు'1991 కార్యక్రమాల గురించి కదా చెబుతానన్నది. రేడియోలో చర్చాకార్యక్రమాలకు కూడా మంచి ఆదరణ శ్రోతల నుంచి ఉండేది. సాధారణంగా పుస్తకప్రచురణ సంస్థలంటే కేవలం లాభాపేక్ష దృష్టి కలిగినవేనన్నమాట నేడు ప్రచులితంగా ఉంది. అయితే ఆ రోజుల్లోనూ ప్రచురణ సంస్థలు వ్యాపారమే చేస్తున్నా సాహిత్యం పట్ల అనురక్తి, ఒక శ్రద్ధ ఉండిన ప్రచురణకర్తలుండేవారు. ఆగస్టు 19, 1991 రాత్రి 9.30కు నేను 'ప్రచురణ సంస్థల సాహితీసేవ' అనే ఒక చర్చాకార్యక్రమాన్ని రూపొందించి ప్రసారం చేసాను. ప్రముఖ సంపాదకులు, పాత్రికేయులు విశాలాంధ్ర పత్రికకు నాడు సంపాదకులుగా ఉన్న శ్రీ సి.రాఘవాచారిగారు, ఉత్తమ పఠనాభిరుచిని పెంచిన బాపు, రమణల సన్మిత్రుడు నవోదయ పబ్లిషర్స్ అధినేత శ్రీ.ఎ. రామ్మోహన్‌రావ్, అలాగే ఆంధ్రప్రభ సంపాదకులుగా పనిచేసిన వావిళ్ళ వారిని కూడా ఎరిగిన శ్రీ కూచిమంచి సత్యసుబ్రహ్మణ్యంగారు, ఒక మహిళా పాఠకురాలిగా శ్రీమతి. మంగళగిరి ప్రమీలదేవి ఆ చర్చలో పాల్గొన్నారు.


శ్రీ సి.రాఘవాచారి


(నవోదయ) శ్రీ రామ్మోహన్

91 సెప్టెంబర్‌లో టెలిఫోన్ ముఖాముఖి జీవితభీమా గురించి ప్లాన్ చేసి, చర్చా కార్యక్రమం బ్యాంకింగ్ వ్యవస్థ గురించి చేయాలనిపించి బ్యాంకింగ్ వ్యవస్థలో నూతన పరిణామాలు గురించి ఇండియన్ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ రీజనల్ మేనేజర్లు ఎ.ఎస్.దీక్షిత్, ఆర్.లక్ష్మణరావ్, ఎం.కామేశ్వరరావు గార్లతో మచిలీపట్నం నోబెల్ కళాశాల ఆర్థిక శాస్త్ర విభాగం అధిపతి కె.బాలకోటేశ్వర రావుగారి అనుసంధానంతో ప్రసారం చేయడం జరిగింది. అప్పుడప్పుడే క్రెడిట్ కార్డులు, ఎ.టి.ఎంలు, ఇంటర్నెట్‌లకు మూలబీజాలు పడుతున్నాయి. అలాగే అక్టోబర్'91 చర్చాకార్యక్రమంగా 'ఆటల అభివృద్ధికి అవరోధాలేమిటి' అనే అంశంపై క్రికెట్ క్రేజ్ ప్రక్కన పెట్టి అథ్లెటిక్స్, బ్యాట్‌మింటన్, కోకో వంటి ఆటల కోచ్‌లు కె.వి.శంకర్రావు, పున్నయ్య చౌదరి, కుమారి. వి.ఝాన్సీలను జిల్లా స్పోర్ట్స్ అధారిటి ఆఫ్ ఇండియా సెక్రటరీ కె.ప్రభాకర్ రెడ్డి ప్రధానవ్యక్తిగా చర్చ ప్రసారమైంది. జాతీయక్రీడ అయిన 'హాకీ' ఎలా నిరాదరణకు గురి అవుతున్నదీ, ఆటలంటే ఒక్క క్రికెట్ మాత్రమే కాదనీ అంతర్జాతీయంగానూ, ఒలంపిక్స్‌లనూ రాణించడానికి ఆటలో అభివృద్ధి ఎలా చేయగలం అనే అంశంపై ఆసక్తికర చర్చే జరిగింది.

జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్ర విశేషాలను వారం వారం 'నడుస్తున్న చరిత్ర' పేరిట ప్రతి శనివారం రాత్రి ప్రసారం చేసే కార్యక్రమానికి లైవ్ కాదుగానీ తాజా పరిణామాలు కూడా చెప్పాలని ప్రసారానికి ఓ మూడు నాలుగు గంటల ముందు రికార్డు చేసిన సందర్భాలు ఉన్నాయి. పత్రికా జర్నలిస్టులే ఆ కార్యక్రమం సమర్పించేవారు. శ్రీ చల్లా అనంత పద్మనాభస్వామి (ఆంధ్రప్రభ) శ్రీకె. చక్రవర్తి (ఆంధ్రజ్యోతి) బి.ఎల్.నారాయణ (డక్కన్ క్రానికల్) వంటివారే కాక సీనియర్ పాత్రికేయులు, రచయిత అయిన శ్రీ రెంటాల గోపాలకృష్ణగారు కూడా అక్టోబర్'12న నడుస్తున్న చరిత్ర సమర్పించడం నాకు గుర్తుంది. రిటైరయినా ఆయన శ్రద్ధ, నిబద్ధతా గొప్పవి. ప్రముఖ కవయిత్రి, రచయిత్రి రెంటాల కల్పన వారి అమ్మాయేననుకుంటా! అలాగే నరసరావుపేట నుండి యూనివర్సల్ కన్స్యూమర్ అసోసియేషన్‌కు చెందిన శ్రీడి.హరగోపాలరావు గారు వారం వారం వినియోగదారుల ప్రశ్నలకు సమాధానాలివ్వడానికి ఆగస్టులో వచ్చారు.


శ్రీ రెంటాల గోపాలకృష్ణగారు

ఇక సాహిత్య కార్యక్రమాల విషయానికి వస్తే అప్పట్లో ఆంధ్రజ్యోతి దిన పత్రికలో సబ్ ఎడిటర్‌గా ఉన్న (ఇప్పుడు 'మాభూమి' మాసపత్రిక, హైదరాబాద్ సంపాదకులు) శ్రీపానుగోటి కృష్ణారెడ్డి ఆగస్టులో గ్రంధావలోకనంలో మధురాంతకం రాజారాంగారి కథల పుస్తకంపై మంచి సమీక్ష చేసారు. సెప్టెంబర్‌లో విజయవాడ శారదా కళాశాల తెలుగు లెక్చరర్ శ్రీ బాపట్ల రాజగోపాలశర్మ కొత్త రామకోటయ్య రాసిన భాగవత ప్రభ వంటి నాలుగు ఆధ్యాత్మిక గ్రంధాలను సమీక్షించగా, గుంటూరు జె.కె.సి.కళాశాల లెక్చరర్ శ్రీ పులిచర్ల సుబ్బారావు గారు కూడా గ్రంధావలోకనం కార్యక్రమం పట్ల ఆసక్తి చూపారు. ప్రముఖ కవి పింగళి లక్ష్మీకాంతంగారి పుత్రులు అయిన శ్రీ పింగళి వెంకట కృష్ణారావుగారు ఆగస్టులో సరస వినోదిని కార్యక్రమం నిర్వహించారు. శ్రీ కావూరి పూర్ణచంద్రరావుగారు సెప్టెంబర్‌లో శ్రోతలు రాసిపంపిన సమస్యాపూరణ పద్యాలను సరస వినోదినిలో ప్రెజెంట్ చేశారు. ప్రసంగ పరంపరను ఒక అంశం ఆధారితంగా రూపొందించే వాళ్ళమని చెప్పాకదా! హద్దులు - సరిహద్దులు పేర ఆగస్టులో హాస్యప్రసంగాలులో ప్రముఖ రచయిత శ్రీ దర్భా బాబూరావుగారు 'ముగింపు తేదీ దగ్గరపడితే' అనే అంశం మీద, శ్రీవి.మధుసూధనరావు 'జుట్టురాలేవేళ' గురించి ప్రసంగించారు. సెప్టెంబర్‌లో 'అణగారిన అతివలు - అమృతహృదయులు' అనే ప్రసంగాల మకుటంతో ప్రముఖ పాత్రికేయులు శ్రీ పరకాల పట్టాభిరామారావు గారు, 'అబలత్వం పుట్టుకలోనా? పెంపకంలోనా' అనీ, 'స్త్రీలు - న్యాయ వ్యవస్థ గురించి' అడ్వొకేట్ డి.బాలగారు, 'స్త్రీలు - నిరక్షరాస్యత' గురించి శ్రీ వెలగా వెంకటప్పయ్యగారు తమ ప్రసంగాలందించారు. ఆగస్టు నెలలో ప్రముఖ పాత్రికేయులు శ్రీ తుర్లపాటి కుటుంబరావుగారు టంగుటూరి ప్రకాశం పంతులుగారి వద్ద కొంతకాలం సహాయకులుగా పనిచేసారని గ్రహించి 'ప్రకాశంతో నా జ్ఞాపకాలు' అనే అంశంపై ఆయనను ఇంటర్వ్యూ చేసాను. సెప్టెంబర్ 10 విశ్వనాథ సత్యనారాయణ గారి జన్మదినం కనుక సరిగ్గా అదేరోజు రాత్రి 'మా నాన్నగారి సాహితీయాత్ర' అని విశ్వనాథ కుమారుడు విశ్వనాథ పావనిశాస్త్రితో పరిచయ కార్యక్రమం చేశాను. అప్పుడే పావనిశాస్త్రి మంచి మిత్రుడయ్యాడు. కాలం ఆ తరువాత అవన్నీ ఎగరేసుకుపోయింది 'కవితాహారం' పేరిట ప్రసారం చేసే కార్యక్రమంలో సెప్టెంబర్‌లో డా.పాపినేని శివశంకర్, శ్రీ రావి రంగారావు తమ కవితలను వినిపించారు. కవులుగా అప్పటికే లబ్ధప్రతిష్ఠులవుతున్న కవులు వాళ్ళు.


శ్రీ తుర్లపాటి కుటుంబరావుగారు


శ్రీ రావి రంగారావు

1991లోనే జరిగిన ఒక ప్రత్యేక సందర్భం గోదావరి పుష్కరాలు. నిజానికి గోదావరి రాజమండ్రి దగ్గర. రాజమండ్రి విజయవాడ ఆకాశవాణి పరిధిలోకి రాదు. అది విశాఖపట్నం ఆకాశవాణి పరిధిలోనిది. కానీ కొవ్వూరు పశ్చిమగోదావరిలోది కనుక పశ్చిమ గోదావరి విజయవాడ కేంద్ర పరిధిలో ఉండడం వల్ల స్వతహాగా ఆధ్యాత్మిక చింతనాసక్తి ఎక్కువగా ఉంటూండిన డైరెక్టర్ కులకర్ణిగారు గోదావరి పుష్కరాలకు ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించి కొవ్వూరు కేంద్రంగా రికార్డింగులు అవీ చేసి ప్రసారం చేయాలని సమాయత్తం చేసారు. గోదావరి పుష్కరాల కవరేజ్ మరచిపోలేని ఒక గొప్ప అనుభవం. అందులో భాగస్వామ్యం కావడం ఆనంద సంధాయకం. ధవళేశ్వరంలో ఉండిన శ్రీ సుందర చైతన్యానంద స్వామి వారిచే గోదావరి పుష్కర ప్రాశస్త్యం అనే ప్రసంగం ఆగస్టు 13న, 23న గౌతమీ మహాత్యం గురించి కొవ్వూరు సంస్కృత కళాశాలకు చెందిన శ్రీ దోర్భల ప్రభాకర్ శర్మగారి ప్రసంగం ప్రత్యేకించి తొలుత విశేష ప్రసంగాలుగా ప్రసారం చేయడం జరిగింది.


డా.పాపినేని శివశంకర్
















## Enjoyable anthology

**AGNI SUDHA by Sudhama, pages 100. Copies can be had from Sakhikumari Publications, 16-11-310/9/1, Saleemnagar colony, Malakpet, Hyderabad - 36. Rs. 20.**

Accessibility to printing facilities has tempted quite a few people to compile their works in a hurry. Those who can write a few lines in the name of modern verse have started converting them into books. Fortunately, *Agni Sudha* does not come under this category. Sudhama's exposure to the media has definitely helped him acquire the maturity essential for good poetry writing. *Agni Sudha* is his first book of poems.

This anthology has around forty poems. Many of them reflect social awareness. *Spruha* laments about the apathetic society "which has sight but no vision, which walks on the road without any aim." Sudhama's two poems about death, *Evaraina Pothe* and *Mruthyuvu* are not empty lamentations. They define life in a profound way. Life is a thoughtful elegy, the poet says. In *Appudu*, the erotic imagery is very neatly clothed in aestheticism. *Kudaradu* projects his definition of good poetry.

On the whole, *Agni Sudha* is an enjoyable set of poems. Sudhama is indeed versatile. His masculine tone combined with a robust optimism is a striking feature of this anthology.

*Bhargavi P. Rao*






## 27


'గోపాదాల రేవు

**గోదావరి పుష్కరాలంటే 'కొవ్వూరు'** కూడా కళకళలాడుతూంటుంది. 'గోపాదాల రేవు' పరమ పుణ్య ప్రదేశం. పశ్చిమ గోదావరిలో గోదావరి నదీస్నానాలు, కొవ్వూరు కేంద్రంగానే భక్తులు తరలివచ్చి కావిస్తూంటారు. 'కొవ్వూరు' అసలు పేరు 'గోవు ఊరు'. అనగా గోవులతో విరాజిల్లే ఊరు అని. బ్రిటిష్ వారి కాలంలో గోవును వాళ్ళు 'కౌ' అంటారు గనుక, 'గోవూరు'ను 'కొవ్వూరు'గా వ్యవహరించడంతో, ఆ పేరే స్థిరపడిందని ఓ కథనం. కొవ్వూరు రాజమండ్రిలను కలుపుతూ ప్రస్తుతం మూడు బ్రిడ్జిలున్నాయి. పాత బ్రిడ్జి సర్ ఆర్థర్ కాటన్ కట్టించిందన్న విషయం అందరికీ తెలిసిందే 1991 లోనే కొత్త రైల్వే బ్రిడ్జి నిర్మాణం మొదలయింది.

కొవ్వూరు గోపాద క్షేత్రం ప్రసిద్ధమైంది కనుక గోదావరి పుష్కరాలను ఆగస్టు, సెప్టెంబర్ (11.9.91)లో ఆకాశవాణి విజయవాడ


ఓ.బి.వ్యాన్

కేంద్రం కులకర్ణిగారి చొరవ కారణంగా విశాఖ కేంద్రానికే వదిలేయకుండా పుష్కర కార్యక్రమాలు రోజువారీగా విజయవాడ నుండి కూడా ప్రసారం చేసాం. ఆ చేయడం కూడా ఒక విశిష్టతను చేకూర్చుకుంది. అందుకు కారణం ఆదిలాబాద్ రేడియో కేంద్రానికని ఉద్దేశించిన 'ఓ.బి.వ్యాన్'ను డైరెక్టరేట్ అనుమతితో మొదట కులకర్ణిగారు విజయవాడకు తెప్పించారు. అందుకు అప్పటి విజయవాడ సూపరింటెండెంట్ ఇంజినీర్ గారి చొరవకూడా కారణం అనుకోండి. ఆ ఓ.బీ వ్యాన్‌లో రికార్డింగ్ సౌకర్యం మాత్రమే కాక కార్యక్రమం డబ్బింగ్ చేసుకునే సౌలభ్యం కూడా ఏ.సీ సదుపాయంతో బాటు సమకూర్చబడింది. ఆ వ్యాన్‌ను అప్పట్లో నంద్యాలలో జరిగిన నందీ అవార్డు ఫంక్షన్ కవరేజ్‌కు కూడా నేను

తీసుకువెళ్ళాను. గోదావరి పుష్కరాల సందర్భంగా కొవ్వూరుకు ఆ వ్యాన్ తీసుకువెళ్ళి, గెస్ట్ హౌస్‌లో మేం రూములు తీసుకుని పుష్కర సౌకర్యాలు, భక్తుల అనుభవాలు - అనుభూతులు, ఆలయాల విశేషాలు మొదలైనవన్నీ రూపొందించి ప్రసారం చేసాం. పుష్కర సమయం కావడం వల్ల బోలెడు జనసమ్మర్ధం ఉండేది. పుష్కర సౌకర్యాలు చూసే అఫీషియల్స్ ఇంటర్వ్యూలు అవేకాక స్వామీజీల ఆధ్యాత్మిక ప్రవచనాల వంటివి కూడా రికార్డు చేసి ప్రసారానికి పంపేవాళ్ళం.




1991 గోదావరి పుష్కరాలనగానే నాకు గుర్తుకు వచ్చే మరో తమాషా సంగతి ఉంది. కొవ్వూరులో పుష్కర కార్యక్రమాలు చేస్తున్న సమయంలోనే ఓ మధ్యాహ్నం వేళకు, పేరు సరిగ్గా గుర్తులేదుకానీ ఒక ఆశ్రమానికి వెళ్ళాం. ఆశ్రమం చాలా ప్రశాంతంగా ఉంది. అక్కడ భక్తులకు అన్నదానం అదీ కూడా జరిగినట్లు గుర్తు. అక్కడ కాషాయ వస్త్రాలతో, గడ్డాలూ మీసాలతో ఆశ్రమ నిర్వాహకులైన స్వామీజీని కలిసాం. ఆయన పేరు వాడ్రేవు గవర్రాజు. ఆ పేరు వినగానే నాకు నా చిన్నప్పుడు రైల్వే స్టేషన్లలోనూ, హిగిన్ బాదమ్స్ పుస్తకాల షాపుల్లోనూ కాలక్షేపానికి కొని వినోదిస్తూ ఉండే పత్రిక 'పకపకలు' గుర్తుకొచ్చింది. 'పకపకలు' అనే ఆ హాస్యపత్రిక సంపాదకుల పేరు వాడ్రేవు గవర్రాజు. మాటల్లో స్వామీజీతో నేను అదే విషయం చెప్పాను. ఆయన నవ్వి 'ఆ వాడ్రేవు గవర్రాజు'ని తానేననీ, పూర్వాశ్రమంలో పకపకలు పత్రిక నడిపింది తానేననీ చెప్పడంతో నిజంగానే నేను ఆశ్చర్యపోయాను. ఒక హాస్యపత్రికా సంపాదకుడు అలా ఆధ్యాత్మిక సంపన్నుడైన స్వామీజీగా మారిపోతాడని ఎలా ఊహించగలను. ఆయన చాలా ఆత్మీయంగా పలకరించి మాకు భోజన సౌకర్యం కూడా ఆ రోజు కల్పించారు. గోదావరి పుష్కరాలకు స్పెషల్ ఆఫీసర్‌గా అప్పుడు ఉమామహేశ్వరరావ్‌గారనే ప్రభుత్వ అధికారి ఉన్నట్లు జ్ఞాపకం. ఆయన చాలా యంగ్ అండ్ డైనమిక్‌గా కనిపించారు. మా ఆకాశవాణికి స్పెషల్ ఇంటర్వ్యూ ఇవ్వడమే కాక మేం ప్రసారం చేసిన పుష్కరాల కార్యక్రమాలకు ప్రశంసలు కూడా అందించారు. స్టేషన్ డైరెక్టర్ కులకర్ణిగారు కూడా ఒక రోజు కొవ్వూరులో ఆ సందర్భంగా వచ్చి మాతో ఉన్నారు. కొవ్వూరులోని గౌడమఠాలు, సాయిసేవా కేంద్రాలు తలపెట్టి నిర్వహించిన సేవా కార్యక్రమాలను కూడా రేడియోలో కవర్ చేసాం.

అలా విజయవాడ ఆకాశవాణిలో చేరిన నెల్లాళ్ళలోనే గోదావరి పుష్కరాలు రావడం, సంబంధిత కార్యక్రమాల నిర్వహణలో ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్ గా పాలుపంచుకోవడం మరుపురాని సంగతే. గోదావరి పుష్కరాల సందర్భంగా కొవ్వూరు నుంచి రాజమండ్రి కూడా వెళ్ళి అక్కడి సంరంభం కూడా చూసి వచ్చాం.

1991 సెప్టెంబర్ లో 6,7,8 తేదీలలో ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ, తెలుగు విశ్వవిద్యాలయం కలిసి కృష్ణా జిల్లా కూచిపూడిలో కూచిపూడి నృత్యోత్సవాలు నిర్వహించింది. అది కూడా నే వెళ్ళిన కొత్తల్లో జరిగిన ఒక ప్రధానమైన ఈవెంటే! మూడురోజుల నృత్యోత్సవంపై తొమ్మిదో తేదీ రాత్రి ఒక నివేదికను ప్రత్యేకంగా ప్రసారం చేయడం జరిగింది. ముందునుంచీ నాకు హాస్యం పట్ల మక్కువ ఎక్కువ. నేనో కార్టూనిస్టును కూడా కదా! అంచేత నా షెడ్యూల్స్‌లో తప్పక హాస్య ప్రసంగాలు కొన్నయినా ఉండేలా చూసుకునేవాడిని. రేడియోలో హాస్యప్రసంగం అంటే వినడంతోనే ఆహ్లాదంగా ఉండాలి మరి. విజయవాడ ఆకాశవాణిలో శ్రీ పన్నాల సుబ్రమణ్య భట్టు 'రేడియో చెళుకులు' కార్యక్రమంతో హాస్యానికి మంచి ఊపునిచ్చారు. అవి ఎంతో ప్రసిద్ధమయ్యాయి. తను వాటిని ఓ పుస్తకంగా అంతకు మునుపే ప్రచురించినట్లు గుర్తు (అంటే ప్రసారమయ్యాకనే సుమా!)

అక్టోబర్ 91లో 'అనుకున్నంత తేలిక కాదు' అనే ఒక హాస్య శీర్షిక పెట్టి అబద్ధాలాడడం, భార్యతో బజారుకు, పుస్తకం దాచుకోవడం లాంటి అంశాలపై ప్రసంగాలు ప్రసారం చేయడం జరిగింది. గుంటూరులో మాజీ ఎం.ఎల్.సి.గా చేసిన శ్రీ మన్నవ గిరిధరరావుగారు వ్యక్తిగా సౌజన్యశీలి, మంచి హాస్య చతుర భాషణులు. 'అబద్ధాలాడడం తేలికా' అనే ప్రసంగం (9.10.91) ఆయన

చేసారు. అలాగే ఇప్పుడు స్వాతి వారపత్రికలో వారం వారం రాజకీయ విశ్లేషణలు చేస్తున్న డా.దుగ్గరాజు శ్రీనివాసరావు 'వాసు' పేర మంచి కార్టూనిస్ట్, హాస్యశీలి కూడాను. బ్యాంక్ లో పనిచేస్తూండేవారు. భార్యతో బజారుకు అనే అంశంపై చాలా సరదా ప్రసంగం (16.10.91) చేసారాయన. అలాగే ఇంద్రగంటి శ్రీకాంత శర్మ గారికి మంచి మిత్రుడు అయిన శ్రీ పి.వి.ఎస్.ఎస్.ఆర్.శాస్త్రి కొవ్వూరు మండలం కుమారదేవంలో గ్రామపంచాయితి ఎక్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ఉండేవారు 'పరహస్తం గతః' అని పుస్తకం గురించి (23.10.91)న ఆయన ఓ సరదా ప్రసంగం చేసారు.


కడియాల రామమోహన రాయ్

శ్రీ కడియాల రామమోహన రాయ్ తెలుగు సాహిత్య విమర్శకునిగా మంచిపేరు పొందినవారు. గుంటూరు జె.కె.సి కళాశాలలో లెక్చరర్‌గా ఉండేవారు. అక్టోబర్‌లో గాంధీ జయంతి సందర్భంగా 'తెలుగు కవుల దృష్టిలో గాంధీజీ' అనే అంశం ఇస్తే కాదనక, మంచి విశ్లేషణ చేసారు. నూజివీడు డా.ఎం.ఆర్.అప్పారావుగారు "గాంధీ మా ఊరొచ్చారు" అని తలుచుకుంటూ చేసిన జ్ఞాపకాల ప్రసంగం గాంధీ జయంతి రాత్రి ప్రసారం చేయడమూ గుర్తుంది. అప్పారావుగారి ఉయ్యూరు గార్డెన్స్ ఇంటిని దర్శించడమూ మరుపురాని విషయమే!

ఆహూతుల సమక్షంలో కార్యక్రమాలు నిర్వహించడంలో ఆంధ్రదేశాన విజయవాడ కేంద్రానిదే 'రికార్డు' అనాలి. అందునా శ్రీనివాసన్‌గారు డైరెక్టర్‌గా ఉండగా విజయవాడ ఆకాశవాణి చేసినన్ని ఆహూతుల సమక్షంలో కార్యక్రమాలు మరేకేంద్రమూ చేయలేదంటే అతిశయోక్తి కూడా కాదేమో!

నేను కార్యక్రమ నిర్వహణాధికారిగా ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో తుమ్మలపల్లి కళాక్షేత్రం విజయవాడలో ఏర్పాటు చేసి నిర్వహించిన తొలి ఆహూతుల సమక్షపు కార్యక్రమం 1991 దీపావళి సందర్భంగా జరిపిన కవిసమ్మేళనమే. రాష్ట్రంలోని ఇతర కేంద్రాలనుండి ఒక్కొక్క కవిని ఎంపిక చేసి పంపమని, విజయవాడ జోన్ నుండి ఆరుగురిని కలుపుకుని మొత్తం పధ్నాలుగు మంది కవులతో నవంబర్ అయిదు 1991 ఉదయం పదినుండి పదకొండున్నరవరకు ప్రసారం చేయడం కోసం అక్టోబర్ 23 బుధవారం సాయంత్రం ఆహూతుల సమక్షంలో విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన ఆ కవి సమ్మేళనంలో ఒక యువకునికి కూడా 'యువకవి' ప్రాతినిధ్యం కల్పించాలని భావించి అంతవరకు యువవాణిలో తన కవితలు వినిపిస్తూండే 'భల్లం సూర్యనారాయణ మూర్తి' అనే యువకుడికి ఈ కవి సమ్మేళనంలో పాల్గొనే చోటు కల్పించడం జరిగింది. దానికి దీటుగానే మంచి కవిత రాసి ప్రేక్షకులను తను మెప్పించాడు. నేడు ఎస్.ఆర్.భల్లంగా తెలుగు కవితా ప్రపంచంలో అతన్ని పాఠకులు సైతం ఎరుగుదురు. ఆ కవిసమ్మేళనంలో కరుణశ్రీ డా.జంధ్యాల పాపయ్యశాస్త్రి, శ్రీ ఎస్.వి.భుజంగరాయశర్మ, దాసి బసవయ్య, నాగభైరవ కోటేశ్వరరావు గారలు, సోమసుందర్ కుమారుడు, కవి అయిన శశికాంత్ శాతకర్ణి (అప్పుడు విజయవాడలో బాలజ్యోతి మాసపత్రిక సంపాదకునిగా పనిచేస్తూండేవాడు) విజయవాడ కవులుగా హైదరాబాద్ నుండి డా.జె.బాపురెడ్డి, కడపనుండి శ్రీ నరాల రామారెడ్డి, ఆదిలాబాద్ నుంచి శ్రీ కాంచనపల్లి రత్నాకర్, అనంతపూర్ నుండి శ్రీ కోగిరి జై సీతారాం, తిరుపతి నుండి డా.జవ్వాద్ హుస్సేన్, కొత్తగూడెం నుండి శ్రీ దిలావర్, నిజాంబాద్ నుండి ఎస్. పాండురంగశర్మ, వరంగల్ నుండి ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య నాటి దీపావళి కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు. ఆ కవి సమ్మేళనంలో పాల్గొన్న మహనీయమూర్తులు ఈనాడు కొందరు మనమధ్య లేరంటే


నాగభైరవ కోటేశ్వరరావు


పేరాల భరతశర్మ గారితో సుధామ


కరుణశ్రీ

నిజంగా దిగులు వేస్తుంది కూడాను. కరుణశ్రీ భుజంగ రాయశర్మ, నాగభైరవ వంటి పెద్దలు నాడు చూపిన వాత్సల్యం అలాగే శ్రీ పేరాల భరతశర్మ గారు ఆ తర్వాత విశ్వనాధ జయంతి పండుగకూ వచ్చినపుడు వారితో గడిపిన క్షణాలు ఎలా మరువగలను. ఆనాటి కవి సమ్మేళనం గురించి ఎస్.ఆర్.భల్లం ఇప్పటికీ గుర్తుచేసుకుంటూంటాడు.

'అగ్నిసుధ' కవితా సంపుటికి 1990 ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు నాకు రాగా ఆ మరుసటి సంవత్సరం 1991కి గాను ఆ అవార్డు స్వీకరించింది తన 'ఇవాళ' అనే కవితాసంపుటికి గాను శ్రీ అఫ్సర్.




అఫ్సర్ ఇప్పుడు ఆస్టిన్ టెక్సాస్ యూనివర్సిటీలో ఆచార్యునిగా ఉన్నాడు కానీ అప్పుడు అంటే నేను విజయవాడలో చేరిన కొత్తలో ఆంధ్రభూమి దినపత్రికలో సబ్-ఎడిటర్గా పనిచేస్తూండేవాడు. 'అక్షరం' పేర ఆంధ్రభూమిలో సాహిత్యంకు ఒక మంచి ఒరవడి కూర్చింది తానేకావచ్చు. సెన్స్ అండ్ సెన్సిబిలిటీ ఇన్ మోడరన్ తెలుగు పొయెట్రీ అని నా మొదటి షెడ్యూల్లో వేసి 'ఆధునిక కవిత స్పృహ-సృజన' అనే అంశం పై అఫ్సర్ ప్రసంగం 1991 నవంబర్ 8 రాత్రి ప్రసారం చేయడం జరిగింది. అప్పటికింకా అతని జీవితంలోకి కల్పనా రెంటాల అడుగు పెట్టిందో లేదో నాకు గుర్తులేదు. రెంటాల గోపాలకృష్ణగారు 'నడుస్తున్న చరిత్ర' కార్యక్రమం ఇవ్వడానికి వచ్చినపుడు కాసేపయినా కబుర్లాడి వెళ్ళేవారు.

నేటికి ఇరవైరెండేళ్ళ క్రితమే "పుస్తక పఠనాసక్తి నశిస్తోందా" అనే సందేహం ఉందనడానికి నిదర్శనం ఆ అంశం మీద నేను నవంబర్'15 న నవోదయ పబ్లిషర్ ఎ.రామమోహన్ రావ్ గారి చేత చేయించిన ప్రసంగమే. 1980ల తరువాత సాహిత్యంలో మార్పులెన్నో రావడం ఎంత వాస్తవమో, సరళీకృత ఆర్థిక విధానాలంటూ దేశంలో అడుగుపెట్టాక అసలు జనజీనంలో అనూహ్యామైన మార్పులు వచ్చాయి. యువత కెరీర్కు ప్రాముఖ్యం ఇవ్వాల్సిన అగత్యం అధికమై వారిలో సాహిత్యం, కళలపట్ల ఉదాసీనత, తూష్ణీభావం చోటు చేసుకోనారంభించాయి అనిపిస్తుంది. పాఠ్యపుస్తకాలు తప్ప ఇతర పుస్తకాలు ముఖ్యంగా సాహిత్య గ్రంధాలపట్ల పఠనాసక్తి క్రమేపి సన్నగిల్లే ప్రమాదం ఏర్పడుతూ వచ్చింది. ఆ విషయాన్ని రామ్మోహన్ రావుగారు ఒక ప్రచురణకర్తగా కూడా పంచుకున్నారు.




## 28

**ఒక రచయితగా, చిత్రకారునిగా,** తాత్త్వికునిగా 'సంజీవ్‌దేవ్'గారు సాహిత్య ప్రపంచంలో విశిష్టమైన వ్యక్తి. నేను కాలేజీ రోజుల్లోనే ఆయన 'రసరేఖలు' వంటి గ్రంధాలు చదివి ఎంతో స్ఫూర్తిపొందాను. ఆయన 'తుమ్మపూడి'లో నివసించేవారని తెలుసు. డిసెంబర్'1991లో 'వాగ్వైభవ విలాసము' అన్న శీర్షికన ప్రసంగ పరంపరను ఆ నెలలో ప్రసారానికి తలపెట్టినప్పుడు 'మాట - మౌనం' అనే అంశంపై డా.సంజీవదేవ్‌గారికి కాంట్రాక్ట్ పంపించాను.


డా.సంజీవదేవ్‌గారితో సుధామ

'నేనొకడిని ఇలా ఉన్నానని ఇంకా గుర్తించి ఈ కాంట్రాక్ట్ పంపించిందెవరు చెప్మా' అంటూ ఆ ప్రసంగం చేయడానికి అంగీకరించిన అనుమతి పత్రం పంపుతూ రికార్డింగుకు అనుకున్న తేదీకే ఆయన తరలి వచ్చారు. ఆ మహానుభావుడిని మొదటిసారి ముఖతః చూసి, కలిసి, కొంత సమయం ఆయనతో గడపడం మరిచిపోలేని అంశం. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎం.ఏ చదువుతుండగా సంజీవదేవ్‌గారు 'పారాసైకాలజీ' మీద ఓ ప్రసంగం సైకాలజీ డిపార్ట్‌మెంట్‌లో చేసినప్పుడు ఆ విభాగ ఆచార్యులు మన్మోహన్ రెడ్డి నాకు ఆహ్వానం అందించగా వెళ్ళి ఆయన ప్రసంగం వినడం జరిగింది. కానీ అప్పుడాయనతో ముఖతః మాట్లాడే అవకాశం, చొరవ రెండూ లేక పోయాయి. సైలెన్స్ అండ్ స్పీచ్ ఫ్రం పాయింట్ ఆఫ్ ఎ ఫిలాసఫర్‌గా 1991 డిసెంబర్ నాలుగవతేదీ ఆకాశవాణి విజయవాడ కేంద్రం నుండి డాక్టర్ సూర్యదేవర సంజీవ్ దేవ్ గారి ప్రసంగం ప్రసారం చేసే అవకాశం నాకు కలిగింది. 'మాట - మౌనం' అనే వారి ప్రసంగం శ్రోతలనెంతగానో ఆకట్టుకుంది. ఆ తరువాత నేనుండగా సంజీవ్‌దేవ్ గారు రంగులు - రాగాల గురించి, చిత్రకళ గురించి మరికొన్ని ప్రసంగాలకు వచ్చారు. రంగు రంగుల ఇంక్‌లు వాడుతూ ఆయన లేఖలు రాసేవారు. నాకు ఆయన అలా స్వయంగా రెండు మూడు

ఉత్తరాలు రాసారు. ఆయనవే కాదు అలా ప్రముఖులు కొందరు రాసిన ఉత్తరాలను భద్రపరచుకునే స్పృహ అప్పట్లో నాకు లేకపోవడంతో ఆ విలువైన లేఖలను నేను పోగొట్టుకున్నాను. కాళోజీగారు, ఇస్మాయిల్‌గారు, పురాణంగారు, సోమసుందర్ గారు ఇలా కొందరు ప్రముఖులు రాసిన లేఖలు భద్రపరచుకోలేకపోయానని ఇప్పుడనిపిస్తూంటుంది. సంజీవ్‌దేవ్ గారు చాలా సౌమ్యులు. వచ్చినప్పుడల్లా ఎంతో చిరునవ్వుతో పలకరించేవారు. డిసెంబర్‘1991 లో ప్రసారమైన వాగ్వైభవ విలాస ప్రసంగాలలోనే ప్రముఖ రచయిత ‘హితశ్రీ’గారు (శ్రీ ఎం.వి.ఎన్.ప్రసాదరావు) ‘భాష - భావం‘ గురించి (18.12.91) ‘నోరు మంచిదైతే ఊరు మంచిది‘ అన్న సామాజిక కోణం నుంచి నాడు విజయవాడ సివిల్ కోర్ట్స్ ప్రిన్సిపల్ సెషన్ జడ్జ్‌గా ఉన్న శ్రీ పి.జగన్నాధనాయుడు గార్లచే ప్రసంగాలు చేయించాను.

అలాగే డిసెంబర్‌లో వచ్చే మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా విజయవాడలో ప్రముఖ అడ్వకేట్, ముఖ్యంగా క్రిమినల్ కేసుల లాయర్‌గా పేరొందిన శ్రీ కర్నాటి రామమోహనరావుగారి ప్రసంగం ప్రసారమైంది. అప్పట్లో శ్రీ కర్నాటి రామమోహనరావు గారు మాట్లాడితే ఆయన వాయిస్ స్ప్లిట్ అయిపోయేది. అంటే కొంచెం సేపు గంభీరమైన మగగొంతుకగా మధ్యలో హఠాత్తుగా పీలగా ఆడగొంతుకలా ధ్వనించేది. కార్యక్రమానికి ప్రసంగ కర్త పేరు సూచించిన శ్రీకాంత శర్మగారు ఆ విషయం నాకు చెప్పలేదు. బహుశా మరిచిపోయి ఉంటారు. అయితే ఆయన ప్రసంగం జాగ్రత్తగా ఒక క్రమపద్ధతిలో డబ్బింగ్ చేసి ప్రసారం చేయడం మరిచిపోలేను. అలా ఆయన గొంతు స్ప్లిట్ వాయిస్‌గానే కొనసాగిందో బాగుపడిందో తర్వాత నాకు గుర్తురాలేదు కానీ ఆయన స్క్రిప్ట్ మటుకు తీసుకుని వేరే నిలయకళాకారునిచేత చదివించి తర్వాత నేను ప్రసారం చేసినట్లు గుర్తుంది.

పత్రికల్లో వారఫలాలు రాసే జ్యోతిషవేత్తలలో డా.పి.ఏ రామన్‌గారు ఒకరు. ఆయనకు మంచి పేరుంది. విజయవాడ సత్యనారాయణపురం నర్రావారి వీధిలో ఆయనకు భావనాచార్య ఆస్ట్రలాజికల్ రీసెర్చి ఇనిస్టిట్యూట్ ఒకటుండేది. సాధారణంగా ఆ రోజుల్లో రేడియోలో జ్యోతిషవేత్తల ప్రసంగాలు కానీ, వారఫలాలు ప్రసారం చేయడం గానీ ఉండేది కాదు. మూఢనమ్మకాలను పెంచేదిగా కాక శాస్త్రీయతకు రేడియో పట్టం కట్టాలనే భావన ఉండేది. జ్యోతిషం ఓ శాస్త్రం కాక మూఢనమ్మకమనే భావనే ప్రచురితంగా రేడియోలో ఉండేది. అయితే ఆస్ట్రాలజీ, కాలం గురించి, మాట్లాడటం కూడా శాస్త్రీయతకు హేతువుకూ సంబంధించిందేననే ఉద్దేశ్యంతోనే డిసెంబర్ సంవత్సరాంతం కనుక 1991 వెళ్ళిపోయి 1992 కొత్త సంవత్సరం వస్తున్న సందర్భంగా ‘భవిష్యత్ స్పృహ‘ అనే ఒక ప్రసంగం డా. పి.ఏ రామన్‌గారి చేత చేయించి (27.12.91) ప్రసారం చేయడం జరిగింది. కాలం గురించీ మనిషికి భవిష్యత్ స్పృహ ఉండడం వలసిన ఆవశ్యకత గురించి ఆయన చక్కని ప్రసంగమే చేశారు.


చిత్రమైన బొమ్మలు శ్రీ నందగిరి శ్రీనివాసరావు తో నందగిరి

సాహిత్యమేకాక చిత్రకళాది అంశాల మీద కూడా తెలుగు విభాగంలో శ్రద్ధ పెట్టాం. చిన్నప్పుడు మేం స్కూల్లో చదువుతున్న రోజుల్లో ప్రత్యేకంగా క్రాఫ్టు పిరియడ్ ఉండేది. కాగితాలు కత్తిరించి అందమైన డిజైన్‌లుగా రూపొందించడం, బొమ్మలు చేయడం నేర్పేవారు. నిజంగా అదొక గొప్పకళ. జపాన్ వారు కాగితాల కత్తిరింపు కళలో ప్రపంచఖ్యాతి పొందారు. తెనాలిలోని సబ్‌కోర్ట్‌లో అమీనాగా పనిచేసే ఒకాయన ఇలాంటి కాగితాలతో బొమ్మల తయారీలు చేసేవారు. పాఠశాలలు కొన్నింటిలో అలాంటి ప్రదర్శనలు కూడా చేసారట. 1991 డిసెంబర్ 13న ‘చెత్తకాగితలతో చిత్రమైన బొమ్మలు‘ అనే అంశంపై ఆయనతో ఒక పరిచయ కార్యక్రమం ప్రసారం చేసాం. ఆయన పేరు శ్రీ నందగిరి శ్రీనివాసరావు. ఆయనకు ఆ కార్యక్రమం ఇచ్చినందుకు ఆయన ఎంత సంతోష

పడిపోయారో చెప్పలేను. మా బాబు స్నేహిత్ అప్పుడు రెండో క్లాసు కాబోలు చదువుతున్నాడు. నేను వద్దంటున్నా వినక ఆయన అలా కాగితాలతో తయారు చేసిన సైకిల్ బొమ్మ ఒకటి స్నేహిత్‌కు ప్రెజంట్ చేసారు కూడాను. మరో విశేషం ఏమిటంటే ఆ బొమ్మల తయారీకి ఆయన ఎలాంటి జిగురూ వాడేవారు కాదు. పిన్నింగ్ చేయడం కూడాలేదు. అంతా కాగితంతోనే. నిజంగా అదో అద్భుత ప్రతిభేమరి!

డా.బాబాసాహెబ్ అంబేద్కర్‌ని స్వయంగా చూసి ఆయనతో కొంతకాలం మెలిగిన శ్రీ కోనాడ సూర్యప్రకాశరావుగారనే అప్పటికే ఎనభై ఆరేళ్ళ వృద్ధుడిని "అంబేద్కర్ చాటిన సామాజిక విలువలు" అనే అంశం గురించి పరిచయ కార్యక్రమాలు రూపొందించి ప్రసారం చేయడం (17.12.91) కూడా గుర్తున్న ఒక మంచి జ్ఞాపకమే. డాక్టర్ అశోక్ కోనాడ అని వారి అబ్బాయి అనుకుంటా ఆయనను స్వయంగా దగ్గరుండి తీసుకువచ్చారు.


టెలిఫోన్ సమస్యల మీద 'టెలిఫోన్ ముఖాముఖి'

భారతి పత్రికలో తన వ్యాసాల ద్వారా సుప్రసిద్ధులైన రచయిత, అప్పట్లో పి.బి.సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్‌గా చేస్తున్న డా.నాగళ్ళ గురుప్రసాదరావుగారు ఓ నాలుగు పుస్తకాలు ఇచ్చి సమీక్ష చేయమంటే గ్రంథ సమీక్ష కార్యక్రమంలో పాల్గొనడానికి రావడం ఆయన ఔదార్యమే. ఇప్పుడు సినీ నిర్మాణ పరిశ్రమలో పేరొందిన చావా సుధారాణి అప్పట్లో స్టేట్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ సభ్యురాలిగా చురుకుగా పాల్గొనే కుమారియే! వినియోగదారుల ప్రశ్నలకు ఆనెల జవాబులు తనే ఇచ్చారు. ఆ నెలలో టెలిఫోన్ ముఖాముఖి కార్యక్రమం టెలిఫోన్ సమస్యల మీదనే నిర్వహించడం జరిగింది. విజయవాడ టెలిఫోన్స్ డిపార్ట్‌మెంట్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీ సి. గోవర్ధన్‌గారు, డి.ఇ. టెలిఫోన్స్ (మెయిన్‌టైనెన్స్) శ్రీ ఎన్. ఎస్. వి. ఆర్. కృష్ణమూర్తిగారు (2.12.91) ఆ రాత్రి ఫోన్‌లో శ్రోతలు అడిగిన టెలిఫోన్స్‌కు చెందిన సమస్యలకు సందేహాలకు సమాధానాలిచ్చారు.

ఇవాళ భక్తి టీవీ ఛానెల్స్‌లో విరివిగా కనిపిస్తూ ఆధ్యాత్మిక ప్రసంగాలు చేస్తున్న, ధర్మ సందేహాలు తీరుస్తున్న విదుషీమణి శ్రీమతి. టి.కె.చూడామణిగారు సాహిత్యం పట్ల ముఖ్యంగా పద్యం పట్ల మంచి శ్రద్ధ, ఆసక్తి కలవారు. అప్పట్లో రేడియోలో సరసవినోదిని సమస్యా పూరణ కార్యక్రమాన్ని నిర్వహించిన స్త్రీ అంటూ ఉంటే ఆమెయేనేమో! డిసెంబర్‌లో ఆవిడ చేత 'సరసవినోదిని' నిర్వహింపచేయడం జ్ఞాపకమే.


శ్రీమతి. టి.కె.చూడామణి

ఇలా ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో కార్యక్రమ నిర్వహణాధికారిగా మొదటి ఆరునెలల కాలం పూర్తయి 1992 కొత్త సంవత్సరం ప్రస్థానం సాగింది. కులకర్ణిగారు సంచాలకులుగా, శ్రీ శబరి నాథన్ అసిస్టెంట్ స్టేషన్ డైరెక్టర్‌గా కార్యక్రమాల పర్యవేక్షణ సాగేది. శ్రీ శబరినాథన్ అంతకుముందు సి.ఐ.డి. డిపార్ట్‌మెంట్‌లో పనిచేసి రావడర వల్లనో ఏమో, మేం వేసిన కార్యక్రమ షెడ్యూల్స్‌ను, మేం ఎవరెవరిని కార్యక్రమాలకు పిలుస్తున్నాం అనే దాని గురించి నిశితంగా విచారిస్తూండేవారు. వైయుక్తిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని రేడియో కార్యక్రమాల్లో పాలుపంచుకునే కళాకారులని, వారికి సముచిత ప్రతిభాపాటవాలు లేకపోయినా ఆహ్వానించే నైజం కొందరు కార్యక్రమ నిర్వహణాధికారుల్లో ఉంటుందన్న సంగతి అప్పుడే అర్థమైంది కూడా. ఏనాడు నేను ఆ దృష్టితో వ్యవహరించలేదని నాగుండెల మీద చెయ్యి వేసుకుని నేను చెప్పడమే కాదు నా సర్వీస్‌లో ఏ

పై అధికారి కూడా నన్ను అలాంటివాడిగా ఆరోపణ చేయక నిజాయితీ అధికారిగానే గుర్తించడం సంతోష హేతువు. కొత్త కొత్త కార్యక్రమాల రూపకల్పన, అందుకు తగిన టాలెంట్ హంట్ నాకు ఉత్సాహంగా ఉండేది. పునఃప్రసారాలు కాక నిత్యం తాజా కార్యక్రమాలు ప్రసారం చేయాలని కులకర్ణిగారు పట్టుగా ఉండడం కూడా అలా నిరంతర చైతన్యంగా ఉండడానికి హేతువయ్యింది.




## 29

**ఆరోజుల్లో రేడియోనే ప్రధాన శ్రవణ మాధ్యమం కాబట్టి** పత్రికల్లో రేడియోలో ప్రసారమయ్యే రోజువారీ కార్యక్రమాల వివరాలు ప్రచురిస్తూండేవారు. అంతేకాదు రేడియో కార్యక్రమాలపై సమీక్షలను కూడా ప్రచురిస్తూవుండేవారు. శ్రీవాత్సవ, ఆర్.ఎమ్.చల్లా వంటివారు రేడియో కార్యక్రమాలపై చేసే సమీక్షలు చాలా అర్ధవంతంగానూ, విలువైనవిగానూ భావింపబడేవి. ప్రసారాల్లోని లొసుగులను కూడా వారు చూపుతూ ఉండేవారు. నేను 1967లో నెలకొల్పి సుమారు ఓ దశాబ్దం పాటు నడిపిన యువమిత్ర లిఖిత మాసపత్రికలో కూడా కొన్నాళ్ళు 'రేడియో ఏమంటోంది' శీర్షికన రేడియో కార్యక్రమాలను సమీక్షించడం జరిగేది. అప్పటికి నేను రేడియోలో ఉద్యోగిగా మున్ముందు చేరబోతాననే ఊహ కూడా లేదు లెండి!

రేడియో కార్యక్రమాల సమీక్షలు సరే! మరి పత్రికల గురించీ, వాటిల్లో వస్తున్న విషయాల గురించీ సమీక్షల మాటేమిటి పత్రికలన్నీ సజావుగానే ఉన్నాయా? పత్రికలవారు పత్రికల గురించి పాఠకుల ఉత్తరాలులాంటివి ప్రచురిస్తూంటారు కరెక్టేగానీ ఒక పరిశీలనాత్మక సమీక్షలుంటే బాగుంటుందనే ఆలోచన కలిగి రేడియోలో ఒక కార్యక్రమంగా పత్రికల గురించి సమీక్షించే ఒక కార్యక్రమానికి నేను రూపకల్పన చేశాను. 'పత్రికల్లో ఈనెల' అనే ఆ సరికొత్త కార్యక్రమాన్ని 1992 జనవరిలో ప్రారంభించి ప్రతినెలా చివరి సోమవారం ఉదయం 7గంటల 15 నిముషాలకు ఓ పది, పదిహేను నిముషాల వ్యవధి కార్యక్రమంగా చేయడం మొదలుపెట్టాము. పత్రికల్లో ఆ నెలలోని అంశాలను సమీక్షించడానికి బయటి ప్రాతికేయ రచయితలనే ఆహ్వానించడం జరిగేది. అయితే కథలు, కవిత్వము వంటి వాటిని కాక ముఖ్యంగా పత్రికల సంపాదకీయాల గురించీ, ఎడిట్ పేజీలో వచ్చే రాజకీయ, సాంఘిక అంశాల గురించీ విశ్లేషణాత్మకంగా ఈ కార్యక్రమం ఉండేది. కార్యక్రమానికి మంచి ఆదరణే శ్రోతలనుంచి లభించింది. అయితే ఈ కార్యక్రమం ఒక్క ఏడాది పాటే సాగింది. ఆ తరవాత ఆ స్థానంలో కొత్త పుస్తకాల సమాచారం తెలిపే 'పుస్తకదర్శిని' కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడం జరిగింది.

'పత్రికల్లో ఈనెల' కార్యక్రమం కొనసాగించక పోవడానికి ప్రధాన కారణం అప్పట్లో ప్రజాశక్తి దినపత్రిక సంపాదకులుగా ఉన్న మోటూరు హనుమంతరావు గారు రాసిన లేఖ స్టేషన్ డైరెక్టర్ కులకర్ణిగారికి కొంత వెరపు కలిగించడమే. ఇంతకీ మోటూరి హనుమంతరావుగారు పార్లమెంటు సభ్యులు కూడాను. ఆయనకు 'పత్రికల్లో ఈనెల' కార్యక్రమం నచ్చలేదనికాదు. ఎంతగానో నచ్చింది. కానీ 1992 జూలై నెల కార్యక్రమంలో అనుకుంటాను నెల్లూరులో ఉండే పాత్రికేయ రచయిత శ్రీ పాయసం సుబ్రహ్మణ్యం అని గుర్తు. ఆనెల ఆ కార్యక్రమాన్ని సమర్పిస్తూ పత్రికా సంపాదకీయాల్లో నాటి సమకాలీన ఒక అంశం గురించిన వివిధ సంపాదకీయల విశ్లేషణ చేసాడు.

అయితే ఆ అంశంపై మోటూరి హనుమంతరావుగారు సంపాదకులుగా ఉన్న ప్రజాశక్తి సంపాదకీయం గురించి ప్రస్తావించలేదని ఆయనకు అలక వచ్చింది. సుబ్రహ్మణ్యంగారు ఆ సంపాదకీయాన్ని చూసి ఉండలేదు. అన్ని పత్రికలూ ఆసాంతం గమనించడం ఒక్కోసారి సాధ్యం కాకపోవచ్చు కూడా కదా! కానీ పార్లమెంట్ సభ్యుని హోదాలో ఆయన లెటర్ హెడ్ మీద హనుమంతరావుగారు ఈ విషయం ఎత్తి చూపుతూ డైరెక్టర్ గారికి లెటర్ రాసారు. తమ సంపాదకీయాన్ని ప్రస్తావించకపోవడం గురించి పేర్కొన్నారు. ఆయన నిజానికి ఘాటైన పదజాలం ఏమీ వాడలేదు. కానీ ప్రజాశక్తి సంపాదకీయం పేర్కొనకపోవడం సరికాదు అని రాసారు. హనుమంతరావుగారి నుండి లేఖ రాగానే డైరెక్టర్‌గారు నన్ను పిలిచి ఎందుకలా జరిగింది అని అడిగారు. కార్యక్రమం సమర్పించిన ఆయన దృష్టికి ప్రజాశక్తి వచ్చి ఉండకపోవచ్చని చెప్పాను. అది కావాలని చేసిన నిర్లక్ష్యం కాదనీ, పత్రికలో ఈ నెల కార్యక్రమంలో మునుపు అనేకమార్లు ప్రజాశక్తి సంపాదకీయాలు ఉదహరించిన విషయం కూడా సోదాహరణంగా చూపాను. డైరెక్టర్‌గారు మోటూరి వారికి సమాధానం రాసి ఆ లేఖను స్వయంగా ఆయనను కలిసి ఇమ్మనమని నాకే చెప్పారు. అలా వెళ్ళి మోటూరి వారిని కలిసే భాగ్యం కూడా కలిగింది. ఆయన కాఫీ కూడా త్రాగించి బాగానే మాట్లాడారు. తమ సంపాదకీయాల గురించి కూడా ప్రత్యేక శ్రద్ధతో పరిశీలించవలసిందిగా కోరారు. ఆ విషయమే డైరెక్టర్‌గారికి చెప్పాను. ఆ తర్వువాత కూడా ఆరునెలలపాటు పత్రికల్లో ఈ నెల కార్యక్రమం ప్రసారమైంది గానీ ఆ తరువాతి షెడ్యూల్ వేస్తున్నప్పుడు "అనవసర వివాదాలు వచ్చే వీలున్న కార్యక్రమం ఎందుకు మార్చేయమని" ఆయన అనడంతో గ్రంధ సమీక్ష కార్యక్రమం విడిగా ఉన్నా అనేక పుస్తకాలు సమీక్షార్థం ఆకాశవాణికి అందుతూండడంతో అన్నింటినీ సమీక్షించే వీలు, సమీక్షకు ఒదగని, అంతగా ఆవశ్యకతలేని గ్రంధాలను కేవలం క్లుప్తంగా కొత్తపుస్తకాల సమాచారంగా అందిస్తే బాగుంటుందనే భావనతో పత్రికల్లో స్వీకారంలాంటి కాలమనే కొంత సంక్షిప్త పరిచయంగా కొత్తపుస్తకాల సమాచారం తెలిపే 'పుస్తకదర్శిని' కార్యక్రమాన్ని రేడియోలోని స్టాఫే ప్రెజెంట్ చేసే రీతిగా మలచి 1993 ఫిబ్రవరి నుంచే 'పత్రికల్లో ఈనెల' కార్యక్రమం స్థానంలో విజయవాడ ఆకాశవాణిలో ప్రసారం చేయడం చేసాను.



మోటూరి హనుమంతరావుగారు

'పత్రికల్లో ఈ నెల' ఆపివేయడం బాగులేదని శ్రోతలు లేఖలు రాసారు కూడాను. డా.పాపినేని శివశంకర్, డా.గుమ్మా సాంబశివరావ్, డా,మల్లీప్రియ నాగరాజు, శ్రీ పులిచేరి రామమోహనరావు, శ్రీ మన్నవ గిరిధరరావు, పి.గోపిరెడ్డి, శ్రీ పచ్చిపులుసు వెంకటేశ్వర్లు, శ్రీ పాయసం సుబ్రహ్మణ్యం, డా.జి.వి.పూర్ణచంద్, నిశాపతి, శ్రీ ఎండి.సౌజన్య డా.జి.హరిశ్చంద్రప్రసాద్, శ్రీ కోటపాల్ దేవరాజ్ వీరంతా 'పత్రికల్లో ఈనెల' కార్యక్రమాన్ని సమర్పించినవారే.

శ్రీ మోటూరి హనుమంతరావుగారు మార్క్సిస్టు లీడర్‌గా ఎంతో ప్రఖ్యాతులు, 1917 గుంటూరు వెల్లటూరులో జన్మించిన ఆయన 1937లో కమ్యూనిస్ట్ పార్టీలో చేరారు. 1964 నుండి 1982 వరకు సి.పి.ఐ(ఎం) రాష్ట్రకార్యదర్శి ఆయనే. ఇప్పుడు హైదరాబాద్‌లోని ప్రజాశక్తి బిల్డింగ్ ఆయన పేరునే ఉంది. ఆయన పోయినప్పుడు విజయవాడ ఆకాశవాణి ప్రత్యేక శ్రద్ధాంజలి కార్యక్రమాన్ని కూడా ప్రసారం చేసింది.

కొత్త ప్రసంగ కర్తలు, రచయితల గురించి ఒక 'హంట్' ఎప్పుడూ చేస్తూండడం నాకు ఇష్టంగా ఉండేది. రేడియోకి అలాంటి కొత్తవారెందరినో నేను పరిచయం చేశానని వారు చెబితేనే తర్వాత నాకు తెలిసేది కూడాను. అప్పట్లో పత్రికల్లో విద్యావిషయిక వ్యాసాలు రాస్తూ కృష్ణాజిల్లా వీర్లపాడునుండి మల్లెల సూర్యనారాయణగారు అని ఒకరుండేవారు. పత్రికలో ఆయన పేరు చూసే జనవరి 1992లో 'పాత్ర-బాధ్యత' అనే అంశంపై కూర్చిన ప్రసంగ పరంపరలో 'ప్రజాస్వామ్యంలో విద్యావేత్త' అనే ప్రసంగం ఆయనచేత చేయించడం జరిగింది. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వోద్యోగి, ప్రజాస్వామ్యంలో సంఘసేవకుడు అని ఆ పరంపరలోని మరి రెండు ప్రసంగాలు.


ప్రసేన్

అప్పట్లో ఆంధ్రభూమిలో సబ్ ఎడిటర్గా పనిచేస్తూండే ప్రసేన్ 10.1.92 రాత్రి 9.16కు 'కవిత్వంలో ప్రతీకగా సూర్యుడు' అనే అంశంపై ప్రసంగం చేయడం నాకు గుర్తుంది. ప్రసేన్ అద్భుతమైన కవిత్వం రాసాడు. పాత్రికేయునిగానే కాక కవిగా పేరొందాడు. కొన్నాళ్ళు హైదరాబాద్ లోనూ పనిచేశాడుగానీ ఆ తరువాత ఖమ్మం వృత్తిరీత్యానే తరలివెళ్ళాడు. ఆంధ్రభూమి వదిలేశాడు ఆ తరువాత.

విజయవాడ కె.బి.ఎన్కళాశాలలో లెక్చరర్గా డా.కొండముది హనుమంతరావుగారు పనిచేస్తూండేవారు. ఆయన ఆ తరువాత సినీరచయితగానూ వాసికెక్కారు. విభిన్న విషయాల మీద ఆయన రచనలు చేసారు. 24 జనవరి 92న "సూక్ష్మబుద్ధి బోధనవల్ల వస్తుందా" అనే అంశం మీద ఆయన ప్రసంగించారు. పర్సనాలిటీ డెవలప్ మెంట్ గురించి అవగాహన అప్పుడప్పుడే రచనల రూపంలో రావడం జరుగుతూండేది ఆయన చేసిన ఆ ప్రసంగం శ్రోతల సమాదరణ పాత్రమైంది.


చలసాని దత్తుగారితో

గుంటూరు గోవాడలో స్వాతంత్ర్య సమరయోధుడుగా శ్రీ పావులూరి శివరామకృష్ణయ్యాగారు రేడియో కార్యక్రమాల పట్ల అమితాసక్తితో ఉండేవారు. సర్వోదయ దినోత్సవ నేపథ్యంలో పేదరిక నిర్మూలనా మార్గాల గురించి ఆయన భావాలను శ్రోతలతో పంచుకున్నారాయన (29.1.92) విజయవాడలో అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శన కార్యదర్శిగా అప్పట్లో ప్రముఖ పారిశ్రామిక వేత్త శ్రీ చలసాని దత్తుగారుండేవారు. 'పారిశ్రామిక భవిష్యత్తుకు పునాదులు' గురించి ఆయనతో 31.1.92న ప్రసారమైంది నేను చేసిన పరిచయ కార్యక్రమం. వినికిడి శక్తి కొంచెం తక్కువగా ఉన్నా ఆయన నా ప్రశ్నలను బానే పట్టుకుని సమాధానాలిచ్చారు.

విజయవాడలోనే మొట్టమొదటగా సినిమా థియేటర్ మారుతీ సినిమా టాకీస్ను 1921 లో పోతిన శ్రీనివాసరావుగారు నిర్మించారనే విషయం థియేటర్ల నిర్మాణ చరిత్రలోని ప్రధాన అంశమే. ఇప్పుడిప్పుడు అనేకం సినిమా థియేటర్లు మూతపడిపోవడం కొన్ని ఫంక్షన్ హాల్స్గా మారిపోతే కొన్ని కూలగొట్టబడి కమర్షియల్ కాంప్లెక్స్లుగా మారిపోవడం కనబడుతున్న పరిణామమే. ప్రేక్షకుడు సినిమా థియేటర్కు వెళ్ళి సినిమా చూడడం అంటే ఆ మూడుగంటలూ వేరే లోకంలో ఉన్నట్లే భావన ఉండేది. ప్రేక్షకులకు థియేటర్ యాజమాన్యం సరియైన సౌకర్యాలు కల్పించాలి ఏ.సి థియేటర్లు కూడా మధ్యలో


సినీ ఎక్జిబిటర్స్ సంస్థ నాయకులతో ముఖాముఖి

ఏ.సిని నిలుపుదలచేయడం వంటివి జరుగుతూంటాయి. సినిమా ప్రేక్షకుల సమస్యల మీద జనవరి 1992లో టెలిఫోన్ ముఖాముఖి కార్యక్రమాన్ని ప్రత్యక్షప్రసారం చేస్తూ ఫోన్ ద్వారా ప్రేక్షకులడిగిన ప్రశ్నలకు విజయవాడ సినీ ఎక్జిబిటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నాటి 'అప్సర' థియేటర్ అధిపతి శ్రీ కడియాల వెంకటేశ్వరరావు, అలాగే అసోసియేషన్ కార్యదర్శి జైహింద్ టాకీస్ అధినేత శ్రీ దోనేపూడి బ్రహ్మేశ్వరరావు గార్లచేత సమాధానాలు ప్రసారం చేయడం జరిగింది. సినిమా ప్రేక్షకుల సమస్యల మీద అలా కార్యక్రమం ప్రసారం చేయడాన్ని శ్రోతలు ప్రత్యేకించి అభినందించారు కూడాను.

ఏటా ప్రసారమయ్యే జాతీయకవి సమ్మేళనం ఆకాశవాణి కార్యక్రమాలలో ఒక విశిష్టమైనదని ముందే చెప్పుకున్నాంగా! ఇతర భాషా కవితల తెలుగు అనువాదాలు ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రమే అనువదింప చేసి ప్రసారం చేస్తుంది. అందువల్ల హైదరాబాద్‌లోని కవులకే తెలుగు అనువాదాలు చేసే అవకాశం ఎక్కువ. అదే సౌకర్యంగా కార్యక్రమ రూపకల్పనకు ఉంటుంది. కానీ నేను విజయవాడలో ఉండగా 1992లో ప్రసారమైన జాతీయ కవిసమ్మేళనంలో మరాఠీ కవిత అనువాదానికి గుంటూరు నాగార్జున విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న ప్రముఖ కవి శ్రీ అడిగోపుల వెంకటరత్నం గారిని సూచించి పంపడం జరిగింది. అలా జాతీయకవి సమ్మేళనంలో అనువాద కవిగా తొలిసారి అడిగోపుల వెంకటరత్నం గారిచేత మరాఠీ కవితను తెలుగులోకి అనువదింపచేసి విజయవాడ కేంద్రంలోనే రికార్డు చేసి పంపడం జరిగింది. ఆ విషయాన్ని నిరంతర కవిగా సాగుతున్న అడిగోపుల ఇప్పటికీ గుర్తుచేసుకుంటుంటారు. 1992 సంక్రాంతికి కడపలో నిర్వహించిన కవిసమ్మేళనానికి 'మోనా' (పి.మోహనరావు), హైదరాబాద్‌లో మార్చిలో జరిగిన ఉగాది కవి సమ్మేళనానికి శ్రీ పువ్వాడ తిక్కన సోమయాజి, విశాఖ పట్నంలో ఆగస్టులో జరిగిన స్వాతంత్ర్య కవిసమ్మేళనానికి స్ఫూర్తిశ్రీ '(టి.భాస్కరరావు) విజయవాడ ఆకాశవాణి ప్రతినిధులుగా వెళ్ళి పాల్గొన్నారు. ఆహూతుల సమక్షంలో 1993 సంక్రాంతికి రాష్ట్రస్థాయి కవిసమ్మేళనం విజయవాడ ఆకాశవాణి నుండి నేను నిర్వహించాను. 1992 జనవరి రెండున ప్రకాశం జిల్లా గిద్దలూరులో నాటి ప్రధాని శ్రీపి.వి.నరసింహారావుగారు చేసిన పర్యటనను నేనే కవర్ చేసి రేడియో నివేదిక రూపొందించి మర్నాడు (3.1.92) రాత్రి ప్రసారం చేయడం ఒక మరచిపోలేని జ్ఞాపకమే. ఆ నివేదికకు కొనసాగింపుగా ప్రధాని 'కోయిలకుంట్ల' పర్యటనపై కడప కేంద్రం నివేదిక ప్రసారమైంది.


శ్రీ అడిగోపుల వెంకటరత్నం



## 30

**పెద్దవారు అనుకునే కొందరు కవులు,** రచయితల తత్త్వం విచిత్రంగా ఉంటూ ఉంటుంది. మనం ఊహించని కోణాలు వారినుండి ఆవిష్కృతమైనప్పుడు అబ్బురపడటమో, అవాక్కుకావడమో జరుగుతూంటుంది. అలాంటి అనుభవమే ఒకటి ప్రముఖ కథా రచయిత కీ.శే భమిడిపాటి రామగోపాలం నుండి నాకు ఎదురైంది. జనవరి'92 చివర్లో ఓ ఆదివారం పూట నేను లబ్బీపేట పైడయ్య వీధిలోని ఓ ఇంట్లో అద్దెకుంటున్న రోజుల్లో, కవిమిత్రుడు వి.వి.సత్యప్రసాద్ (సినీదర్శకుడు శ్రీవి.ఎన్.ఆదిత్యగారి తండ్రి) భమిడిపాటి రామగోపాలంను వెంటబెట్టుకుని ఇంటికొచ్చాడు. 'ఇట్లు మీ విధేయుడు' అన్న భ.రా.గో కథా సంకలనానికి ఆ ఏడాది కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు లభించింది. ఫిబ్రవరి ఆరో తేదీ భరాగో పుట్టిన రోజు. బహుశా ఆ ఏడాది షష్టిపూర్తి కూడా అనుకుంటా. ఆ సందర్భంగా సరిగ్గా తన పుట్టినరోజు నాడు ప్రసారం అయ్యేలా, అకాడమీ అవార్డు పొందిన భరాగోతో ఓ పరిచయ కార్యక్రమం రికార్డు చేసి ప్రసారం చేయమని అడగడానికి వచ్చారు.







విజయవాడలో ముందునుండీ ఓ మంచి సంప్రదాయం ఆకాశవాణిలో ఉంది. ఎవరయినా ప్రముఖులు వస్తే విజిటింగ్ ఆర్టిస్టుగా వారిని రికార్డు చేసి ప్రసారం చేయడం జరిగేది. ఎటొచ్చీ రానుపోను ఖర్చులు ఇచ్చేవారం కాదుగానీ, వారికి ఇవ్వాల్సిన పారితోషికం ఇచ్చేవారం. నిజానికి ఆ రచయితో, కళాకారుడో వసించే ఊరు బట్టి, వారు ఆకాశవాణి ఏ కేంద్రం పరిధిలోకి వస్తారో, అక్కడనుంచే వారి సేవలు ఉపయోగించుకుని కార్యక్రమాలు ప్రసారం చేయడం నియమం. ఇలా విజిటింగ్ ఆర్టిస్టులుగా రికార్డుచేసినప్పుడు వారు ఏ కేంద్రం పరిధిలోకి వస్తారో వారినుండి వీరికి ఎంత పారితోషికం చెల్లిస్తున్నారు అన్నది టెలిగ్రాంలో ఓ కోడ్ ద్వారా సమాచారం

రప్పించుకుని ఆ పారితోషికం చెల్లించడం జరిగేది. ఎందుకంటే సంగీతం, డ్రామా కళాకారులకే కాదు ప్రసంగ కర్తలకూ ఒక గ్రేడ్ ఉంటుంది. ప్రారంభంలో కృష్ణశాస్త్రిగారికీ, చనుబాల కవి కృష్ణయ్యకీ ఒకటే రేటు అని పారితోషికం గురించి గోరాశాస్త్రిగారు ఒకసారి ఓ వ్యాసంలో చమత్కరించిన విషయం కొంత నిజమే అయినా, ప్రముఖులకు ఇంక్రిమెంట్‌లా ఇచ్చి పారితోషికం పెంచి ఇవ్వడం అనేది కొంతమేరకు స్టేషన్ డైరెక్టర్ పరిధిలోనూ మరికొంత అధిక మొత్తం చెల్లించడానికి డైరెక్టరేట్ పరిధిలోనూ, సిఫార్స్ చేసి ఆమోదింపచేసుకునే సంగతి కూడా కార్యక్రమ నిర్వహణాధికారి ఉద్యోగ బాధ్యతలోని అంశమే! అంతే కాదు అలా విజిటింగ్ ఆర్టిస్టుగా ఒకరిని రికార్డు చేయాలన్నా డైరెక్టర్ గారి దగ్గర నోటి అప్రూవల్ కాక, నోటింగ్ అప్రూవల్ కూడా తీసుకోవాల్సి ఉండేది.

మామూలు పనిదినాల్లో అయితే కేంద్రానికి వచ్చిన అలాంటి విజిటింగ్ ప్రముఖులెవరినయినా డైరెక్టర్‌గారి దగ్గరకు తీసుకెళ్ళి పరిచయం చేసి వారి ఆమోదం తీసుకుని రికార్డు చేయవచ్చు. కానీ ఆదివారంనాడే రికార్డు చేయాలనీ, రాత్రికి మళ్ళీ ఆయన వైజాగో, హైదరాబాదో వెళ్ళి పోవాల్సిన అగత్యం ఉందని సత్యప్రసాద్ నన్ను ప్రాధేయపడ్డాడు. భరాగో కూడా రిక్వెస్ట్ చేశాడు. డైరెక్టర్ కులకర్ణిగారి ఆమోదం మరునాడు తీసుకోవచ్చనే ధైర్యంతో అందునా కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ఎలాగూ ప్రముఖుడూ కనుక డైరెక్టర్ గారు కాదనరనే విశ్వాసంతో, వెంటనే వారిని స్టూడియోకు తీసుకెళ్ళి నేనే భ.రా.గోని ఇంటర్వ్యూ చేసి డ్యూటీలో ఉన్న డ్యూటీ ఆఫీసర్ చేత రికార్డింగ్ చేయించి, కాంట్రాక్ట్ మీద, వోచర్ మీదా భరాగో సంతకాలూ అవీ తీసుకున్నాను. తన పుట్టినరోజు అయిన ఆరవతేదీ రాత్రే ప్రసారం అయ్యేలా చూడమని భరాగో కోరాడు. ఆ రోజు గురువారం అయింది. నిజానికి నా తెలుగు టాక్స్ ఛెంక్ గురువారం రాత్రిలేదు కూడానూ! అయినా నేను మర్నాడు డైరెక్టర్‌గారికి ఫైల్ పుటప్ చేసి స్పెషల్ పర్మిషన్‌తో, ఆ రాత్రి 8.30 సమయం నాకు కేటాయింప చేసుకుని, భరాగో ఇంటర్వ్యూ సరిగ్గా ఆయన పుట్టినరోజు రాత్రే ప్రసారం చేయించాను. భరాగో విశాఖపట్నం ఆకాశవాణి కేంద్ర పరిధిలోకి వస్తాడు కనుక, విశాఖపట్నం కేంద్రానికి తన రెమ్యూనిరేషన్ ఎంతో తెలుపమని టెలిగ్రాం ఇచ్చాను. అక్కడనుండి సమాధానం రాగానే, అంత మొత్తానికీ చెక్కు తయారు చేయించి భరాగోకు అందేలా చేశాను. కార్యక్రమం బాగా వచ్చింది. అకాడమీ అవార్డు పొందిన వెంటనే ఇంటర్వ్యూ ప్రసారం చేసిన ప్రశంసా వచ్చింది.

ఇది జరిగిన పదిరోజులకే ఓ రోజు డైరెక్టర్ కులకర్ణిగారు తన రూమ్‌కు పిలిచి, భరాగో రాసిన ఉత్తరం చూపించారు. ఆయన నేరుగా డైరెక్టర్‌కు రాసిన లేఖలో తనకు తక్కువ పారితోషికం ఇచ్చారనీ, కార్యక్రమ నిర్వహణాధికారిగా నేను తనను ఏదో తక్కువ చేసినట్లుగా లేఖ రాసాడు. నేను కులకర్ణిగారికి విశాఖపట్నం వారు ఆయనకు నిర్దేశించిన పారితోషికాన్నే ఇచ్చినట్లుగా వారి టెలిగ్రాం అదీకూడా చూపాను. అకాడమీ అవార్డు గ్రహీతలకు, వైస్ ఛాన్స్‌లర్లకూ ఆ ప్రత్యేక సమయంలో కొంత అధిక మొత్తం పారితోషికంగా ఇవ్వవచ్చని ఆ తరువాతే డైరెక్టరేట్ ఫీస్ట్రక్చర్‌లో ప్రత్యేకంగా నిర్దేశించడం జరిగింది. ఏమయినా భరాగో నాకు లేఖ రాసినా, పారితోషికం విషయంలో తన అసంతృప్తిని నేరుగా నాకు వ్యక్తపరిచినా, నేను సంతోషించేవాడిని. అలాకాక ఒక నా మీద ఫిర్యాదులాగా డైరెక్టర్‌గారికి నేరుగా రాయడం నాకు బాధేసింది. పైగా ఆదివారం నాడు వచ్చినా డైరెక్టర్‌గారి అనుమతి తర్వాత పొందవచ్చని నేను ధైర్యం చేసి భరాగో మీద గల అభిమానంతో, మిత్రుడు సత్యప్రసాద్ ప్రత్యేకించి ఆయనను వెంటబెట్టుకు ఇంటికి వచ్చి మరీ కోరాడన్న భావంతో కూడా రికార్డు చేసి, ప్రత్యేకంగా 'ఛెంక్' తీసుకుని భరాగో పుట్టినరోజునాడే కార్యక్రమం ప్రసారం చేసానన్న కనీస భావన అయినా లేకుండా డబ్బుల గురించి అలా రాయడం నాకు నచ్చలేదు. కానీ భరాగో ఎంతగొప్ప కథా రచయిత, హాస్య రచయిత అయినా డబ్బుల విషయంలో కాపీనం ఉన్నవాడు అని ఆ తర్వాత పలువురు కూడా చెప్పారు నాకు.

నిజానికి భరాగో అంటే నాకు చాలా అభిమానం. మా మామయ్య, ప్రముఖ కథారచయిత ద్విభాష్యం రాజేశ్వరరావ్ నేను కుర్రాడిగా కాలేజీలో చదువుతున్న రోజుల్లోనే విశాఖలో భరాగోతో నాకు పరిచయం కావించాడు. రాజేశ్వరరావ్, భ.రా.గో, కడియాల రామమోహన్ రాయ్, నేను విశాఖ సముద్రతీరంలో ఓ రోజు అర్ధరాత్రి పదకొండునుండి తెల్లవార్లూ కబుర్లతో కాలం గడపడం అప్పుడే

భరాగో నోట సైగల్, భానుమతిల పాటలు విని ఆయన ప్రతిభకు అబ్బురపడటం, హాస్యోక్తులతో ఆయన సంభాషించడం నా మీద చెరగని ముద్రవేసిన మధుర జ్ఞాపకాలే. అసలు ఆ మధుర స్మృతి బంధం వల్లనే అంతటి రచయిత, ప్రసిద్ధుడు నా ఇంటికి స్వయంగా వచ్చి అభిలషించాడనే ఆనందంతో, ఒక విధంగా 'ఔట్ ఆఫ్ ది వే' గానే ముందు వెళ్ళి ఆయనను రికార్డు చేసినందుకు, డైరెక్టర్‌గారు పిలిచి పారితోషికం విషయంలో నన్ను తప్పిదం చేసినట్లుగా అడిగేలా లేఖ రాసిన భరాగో అంటే అప్పటినుంచీ ఆయన డబ్బు కాపీనం విషయం తెలిసాక నాకు గౌరవభావం పోయిందననుగానీ తగ్గిపోయిందన్నది నిజం! అయితే అది నేనేమీ మనసులో పెట్టుకోలేదు. రచయితగా ఆయనను అభిమానించడం, అవసరమైనప్పుడు ఆయన గురించి రాయడం, ఆయన పుస్తకాలు సమీక్షించడం సహృదయంతో కొనసాగింది కూడాను. ఐతే రచయితలు ఇలా కూడా ఉంటారని మొదటిసారి నాకు అర్థమయింది మటుకు ఆ అనుభవంతోనే.

విజిటింగ్ ఆర్టిస్టులను రికార్డు చేయడం విషయంలోనే కాదు, విజయవాడలో ఉన్న ప్రముఖులే అయినా వారు రాజకీయంగానో, ప్రభుత్వాధికారికంగానో ప్రసిద్ధులైనప్పుడు వారు రికార్డింగ్‌కు వచ్చే విషయం గురించి డైరెక్టర్‌గారికి చెప్పడం, రికార్డింగ్‌కు ముందో, వెనుకో ఆ ప్రముఖులను డైరెక్టర్‌గారికి చెప్పడం, రికార్డింగ్‌కు ముందో, వెనుకో ఆ ప్రముఖులను డైరెక్టర్‌గారి రూముకు తీసుకెళ్ళి పరిచయం చేయడం, ఆయన ఏ టీ, కాఫీలో వారికి ఆఫర్ చేయడం కూడా ఆ రోజుల్లో అనివార్యంగా జరుగుతుండే విషయం.




విజయవాడలో వంగవీటి మోహనరంగా హత్య ఓ గొప్పసంచలనం. రాజకీయంగా అప్పటి సంఘటన తాలుకు ప్రకంపనలు నేటికీ అప్పుడప్పుడు తలెత్తుతూంటాయి. వంగవీటి మోహనరంగా గారి భార్య వంగవీటి రత్నకుమారి. ఆవిడ అప్పట్లో శాసనసభ్యురాలుకూడాను. మార్చి ఎనిమిదవతేదీ అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా ఆవిడతో ఇంటర్వ్యూ కార్యక్రమం తలపెట్టాను. నాకు కార్యక్రమ నిర్వహణాధికారిగా ఇంకా ఏడాది కూడా కాని కొత్తకనుక ఆవిడ రికార్డింగ్‌కు వస్తున్న విషయం డైరెక్టర్‌గారికి ముందుగా ఇంటిమేట్ చేయలేదు. రికార్డింగ్‌కని ఆవిడ కార్లో ఆకాశవాణి గేటులోంచి లోపలికి వస్తూంటే వంగవీటి రత్నకుమారి ఆకాశవాణిలోకి ఇలా వచ్చేస్తున్నారేమిటని అక్కడి సెక్యూరిటీ గార్డుతో సహా క్షణం అంతా నివ్వెరపోయారట. నేను ఆవిడని రిసీవ్ చేసుకుని మామూలుగా స్టూడియోకి తీసుకువెళ్ళి రికార్డింగ్ చేసాను. ఆ రోజు ఆవిడతోబాటు శ్రీ కాట్రగడ్డ రాజగోపాలరావుగారు వచ్చారు. ఆయన ప్రతిభ వారపత్రిక సంపాదకునిగా నేను ముందే హైదరాబాద్‌లో విని ఉన్నాను. ప్రతిభ, ప్రగతి పత్రికలలో ఆయన సంపాదకునిగా ఉండగా నా రచనలు వచ్చాయికూడాను. ఆ మాటకు వస్తే అచ్చయిన నా రెండో కవిత, నాకు అప్పట్లో యువకవిగా ముందు గుర్తింపు తెచ్చిన 'కనీస కోర్కెలు' అనే కవిత ప్రతిభలో అచ్చయినదే!




శ్రీ కాట్రగడ్డ రాజగోపాలరావుగారు రాజకీయంగా కూడా వంగవీటి రత్నకుమారి గారికి సన్నిహితమని ఆయన పట్ల ఆవిడకు గౌరవప్రపత్తులనీ నాకు అప్పుడే తెలిసింది. రికార్డింగుకు తరువాతైనా వాళ్ళని డైరెక్టర్‌గారి దగ్గరకు తీసుకెళ్ళాలని తెలియక మామూలుగా చెక్ ఇప్పించి వీడ్కోలు నేనే చెప్పేసాను. వంగవీటి రత్నకుమారి ఆకాశవాణికి రికార్డింగుకు వచ్చారని డైరెక్టర్‌గారికి వార్త చేరకుండా ఎలా ఉంటుంది. అయితే కులకర్ణిగారు నన్ను పిలిచి ఏమీ కేకలు వెయ్యలేదు. కానీ అలాంటి వారు వచ్చినపుడు ఓ ముక్క తన చెవిన వేస్తూండమని సౌమ్యంగా చెప్పారు. వారిని కలవాలన్న కుతూహలం తనకేమీ లేదులెమ్మని నవ్వుతూ చెప్పారు. బ్రతుకు జీవుడా అనుకున్నాను.

అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా మహిళా సభ్యురాలు శ్రీమతి వంగవీటి రత్నకుమారితో నేను చేసిన పరిచయ కార్యక్రమం 1992 మార్చి ఎనిమిది ఆదివారం ఉదయం పది గంటల నలభై నిమిషాలకు ప్రత్యేకంగా ప్రసారమైంది. ఆవిడ ఆ ఇంటర్వ్యూలో సుధామగారూ అంటూ నా పేరుని పలుమార్లు ప్రస్తావించడం సంభాషణలో నాకింకా గుర్తుంది.

ఫిబ్రవరి 1992లో నెలవారీ ప్రసంగ విషయం పరంపరలో 'పేరులో ఏముంది?' అనే శీర్షికతో మూడు ప్రసంగాలు ప్రసారం అయ్యాయి. పేరు గురించీ, శబ్దలక్షణ శాస్త్రం అంటే ఏమిటన్న దాని గురించీ 'స్ఫూర్తిశ్రీ'గా పేరు వడసిన టి.భాస్కరరావుగారు (12.2.92 9.16pm) మాట్లాడారు. 'స్థలనామాల చరిత్ర' గురించి నాగార్జున యూనివర్సిటీకి చెందిన డా.యార్లగడ్డ బాలగంగాధరరావుగారు (19.2.92), 'ఇంటిపేర్ల ఇంపుసొంపు' గురించి శ్రీమతి. జి.యోగ ప్రభావతీదేవి ప్రసంగించారు. తెలుగు పరిశోధకులకు ఓ జిల్లాయో ఏదో తీసుకుని అక్కడి గ్రామనామాల గురించి సిద్ధాంత వ్యాసాలు రాయడం ఓ సుళువైన పరిశోధనాంశంగా మారిపోయిందని కొందరు చమత్కరిస్తూండటం కద్దు.


ఆకాశవాణి వ్యవసాయ కార్యక్రమాల ప్రారంభోత్సవం 7-6-1966
గుమ్మలూరి సత్యనారాయణ, వినోదాల వీరయ్య బృందం

గుమ్మలూరు సత్యనారాయణగారు ఆకాశవాణిలో వ్యవసాయ విభాగంలో పనిచేసి పేరొందిన వ్యక్తి. వ్యవసాయ కార్యక్రమాలకు కూడా సాహిత్య, సంగీత సుగంధాలనద్దినవారు. నేను చేరేప్పటికే ఆయన రిటైరై చాలా రోజులయిందిగానీ, ఆయనకు సాహిత్యాభిరుచి ఎక్కువ. అది దృష్టిలో పెట్టుకునే 'నేటి సమాజానికి రామాయణం' అనే అంశం వారికి ప్రసంగం కొరకు సూచించినప్పుడు ఆయన ఎంతో సంతోషించి ఓ మంచి ప్రసంగం చేసారు రేడియోద్వారా (21.2.92). ఆ తరువాత ఆయన నన్నెంతగానో అభిమానించారు. తన సమగ్ర జీవిత విశేషాలు గ్రంథంగా రాసి ఆవిష్కరించినప్పుడు, నేనే పుస్తక పరిచయం చేయాలని కోరి మరీ ప్రసంగింపచేసారు. ఔషధమొక్కల గురించీ, ఆయుర్వేదం గురించీ నిష్ణాతులైన డా.కొప్పుల హేమాద్రిగారికి కవిత్వాసక్తి. శ్రీ మానాప్రగడ వెంకట సుబ్బరాయ కవిగారితో బాటు కవితాఝరి కార్యక్రమంలో తమ కవిత వినిపించే అవకాశం కలిగించినందుకు (7.2.92) ఆయన ఎంతో సంతోషించారు. ఒక రంగంలో నిష్ణాతులైనా వారికి సరదా అయిన భిన్నమైన దాంట్లో చిన్నపాటి గుర్తింపు, ప్రశంస లభించినా ఎంత ఆనందం కలుగుతుందో వేరే చెప్పాలా!!

'సీతయు కృష్ణయు జనించె శ్రీరామునకున్', 'సంగీతమె నరకమగు రసజ్ఞునకెందున్', 'జారుల జూచి వందనము సల్పిరి భక్తులు ముక్తి కంతకై' వంటి సమస్యలపై శ్రోతలు రాసిపంపిన పూరణ పద్యాలతో ఆ నెల సరసవినోదిని సమస్యాపూరణ కార్యక్రమాన్ని శ్రీ ఎన్.బసవలింగం, డా.చివుకుల సుందరరామశర్మ ఆసక్తికరంగా నిర్వహించారు.


అన్నదానం చిదంబరశాస్త్రి

పనిచేసే సంస్కృతి మందగిస్తోందని ఈ 2012లో అనుకోవడంకాదు ఇరవైఏళ్ళ క్రితమే 1992లోనే ఫీలయ్యి 'పనిచేసే సంస్కృతిని పెంచుకోవడం ఎలా?' అనే చర్చాకార్యక్రమం 17.2.92 రాత్రి 9.30కు ప్రసారం చేయడం జరిగింది. శ్రీ అండవిల్లి సత్యనారాయణగారు, ప్రొడక్టివిటీ కౌన్సిల్‌కు చెందిన శ్రీవిడి.ఎస్. ప్రకాశరావు, లండన్‌లో ఎం.బి.ఐ.ఎ చేసి రిటైర్డ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అయిన శ్రీ టి.ఉమామహేశ్వరరావు, బ్యాంకు ఉద్యోగి శ్రీ జి.డి.ఎస్.ఎ.విఠల్ బాబాగార్లు ఆ చర్చా కార్యక్రమంలో పాల్గొన్నారు.

కథాలహరి ఆదివారం మధ్యాహ్నం ధారావాహికలో అప్పుడు ప్రసారమైన పరాశర సంహిత

నుండి ఆంజనేయుని కథలతో శ్రీ అన్నదానం చిదంబరశాస్త్రిగారు అప్పట్లో హిందీ ఆఫీసర్‌గా విజయవాడ ఆకాశవాణిలోనే పనిచేస్తున్న శ్రీమతి సరోజా నిర్మల శిష్యురాలిగా చేసిన కథా ప్రవచనాలు ఆంజనేయుని గూర్చిన విస్తృత కథాంశాలతో శ్రోతలను అలరించాయి. ఆ ప్రవచన భాగాలనన్నింటినీ ఆయన ఆ తరువాత గ్రంథరూపంలో ప్రచురించారు కూడాను. ఫిబ్రవరి ' 1992 టెలిఫోన్ ముఖాముఖి కార్యక్రమంలో ఆర్థోపెడిక్ సమస్యల గురించి శ్రోతల సందేహాలకు ఆ వైద్య రంగ ప్రముఖులైన డా.పి.జె.బ్రహ్మానందం, డా.వి.భాస్కరరావుగారలు సమాధానాలిచ్చారు.


ఆర్థోపెడిక్ సమస్యల గురించి ముఖాముఖి కార్యక్రమం



# 31

**సాధారణంగా తెలుగు విభాగపు రేడియో** ప్రసంగాలలో వివిధ సాహిత్య ప్రక్రియల పరమైనవీ, అలాగే సామాజిక, రాజకీయ, ఆర్థిక విషయపరమైనవీ ఎక్కువగా ఉండేవి. చిత్రకళ, శిల్పం, ఫోటోగ్రఫీ వంటి వాటికి సంబంధించి - టీవీలో ఉదాహరణాత్మకంగా దృశ్య సహితంగా చూపే వీలుంటుంది కాబట్టి, ఆ మాధ్యమంలో నప్పినట్లు, ఆ దృశ్యకళలు శ్రవణ మాధ్యమంలో నప్పవు అనే భావనతోనేమో, వాటి గురించిన ప్రసంగాల పట్ల నిర్వహణాధికారులు అంత శ్రద్ధపెట్టినట్లు తోచదు. కానీ ఒక నాటకాన్నే కేవలం శ్రవ్యనాటికగా రాణింపచేసే సామర్థ్యం ఆకాశవాణి మాధ్యమానికి ఉన్నప్పుడు, సమర్థులైన ప్రసంగ కర్తలు రేడియోలో శిల్ప చిత్రకళల గురించి మాట్లాడలేక పోవడం, అవి ప్రసంగాలుగా శ్రోతల ఆదరణకు పాత్రం కాకపోవడం అంటూ జరగదు అని విశ్వసించినవాడిని కనుక, కార్యక్రమ నిర్వహణాధికారిగా - నా 'షెడ్యూల్స్'లో ఆ ప్రక్రియాపరమైన ప్రసంగాలకూ స్థానం కలిపించేవాడిని. షెడ్యూల్ అప్రూవ్ చేయవలసిన అసిస్టెంట్ స్టేషన్ డైరెక్టర్ శబరినాథన్ గారు ఒకసారి "ఇలాంటివి వేస్తావెందుకు? అవి నప్పవు" అని అసమ్మతి తెలియచేసినా, నేను డైరెక్టర్ కులకర్ణిగారికి చెప్పినప్పుడు, ఆయన వాటికి సమ్మతి తెలియజేసి, షెడ్యూల్‌ను "వెరీగుడ్" అంటూ అంగీకరించారు.



'ఫోటోగ్రఫీ-ఒక కళ' అనే అంశం గురించి అలా, తాను ఛార్టెడ్ ఎక్కౌంటెంట్ అయినా - ఆ కళలో నిష్ణాతులై, ఛాయాచిత్రాల గురించిన మంచి సైద్ధాంతిక అవగాహన కూడా కలిగిన శ్రీ డి.సుందర రామారావు గారి ప్రసంగం 1992 మార్చి 6న ప్రసారమైంది. ఇక చిత్రకళ గురించి సంజీవ్ దేవ్ వంటి రచయిత, చిత్రకారులు స్వయంగా చేసిన ప్రసంగాలు శ్రోతలను అలరించిన విషయం వేరే చెప్పాలా? అలాగే శ్రీ ఉల్చి గారిచేత 'శిల్పకళ' మీద చేయించిన ప్రసంగం కూడా నాకు బాగా గుర్తుంది.

ప్రతి ఏటా మార్చి 27 రంగస్థల దినోత్సవం కదా! ఆకాశవాణి అద్భుతంగా నాటక వారోత్సవాలు జరుగుతాయి. ఆ వివరాలతో ఒక 'బులిటెన్' కూడా ప్రచురించడం ఆనవాయితీ. నేను నాటక విభాగాన్ని కార్యక్రమ నిర్వహణాధికారిగా ఎప్పుడూ చూడకపోయినా, పలునాటకాల్లో పాత్రలు ధరించడం, కొన్ని నాటికలు రచించడం, కొన్ని ప్రొడ్యూస్ చేయడం కూడా చేసాను. 'నాటకాంతం హి సాహిత్యమ్' అనే మాటకూడా ఉంది కదా! నాటక ప్రక్రియ గురించిన ప్రసంగాలు, చర్చలు నేను తెలుగు విభాగం ద్వారా నిర్వహించే అవకాశం కలిగింది. రంగస్థల దినోత్సవ సందర్భంగా ఓ ప్రసంగాన్నో, చర్చనో నేను ప్రసారం చేస్తూండేవాడిని. విజయవాడలో అడ్వకేట్, ప్రముఖ నటులు అయిన శ్రీ ఎన్.లక్షణరావుగారిచేత 27.3.92న నేను 'బాలలకు, వయోజనులకు నాటకరంగం' అనే ఒక విలక్షణ ప్రసంగం చేయించడం జరిగింది ఆ నెలలోనే డా.ప్రసాదరాయకులపతిగారు (ఇప్పుడు కుర్తాళం పీఠాధిపతి అయిన స్వామీజీ) 'కవియుగళం కవనీయత' అని, తెలుగు సాహిత్యంలో జంటకవులుగా సుప్రసిద్ధులైన వారి కవిత్వ వైదుష్యాన్ని గురించి ప్రసంగించగా ప్రసారం చేయడమూ గుర్తుంది. (20.3.92 9.16pm)


శ్రీ వాకాటి

'కవిసమ్రాట్' అనే బిరుదు శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారిదే! కానీ తనను తాను కవిసమ్రాట్‌గా సంభావించుకుని, చెలామణీ అయిన వారు శ్రీ పైడిపాటి సుబ్బరామ శాస్త్రిగారు. విశ్వనాథ వారు ఆయనకు జ్ఞానపీఠ్ వచ్చాక హైదరాబాద్‌లోని శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయంలో రామాయణంపై చేసిన ప్రసంగాలను రికార్డు చేయడం కోసం ఆకాశవాణి పక్షాన నేను వెళ్ళడం గుర్తుందికానీ, ఆయనను స్టూడియోకి పిలిచి నేను రికార్డు చేసే అవకాశం కార్యక్రమ నిర్వహణాధికారిగా నాకు దొరకలేదు. ఎందుకంటే అప్పటికి ఆయన కీర్తిశేషులు. కానీ ఈ కవిసామ్రాట్ పైడిపాటి సుబ్బరామ శాస్త్రిగారిని - 'కవితాఝురి' కార్యక్రమంలో రికార్డు చేసి 1992 మార్చి 4 న ప్రసారం చేయడం జరిగింది. అప్పటికి ఆయనా పెద్దవారే! కానీ మంచి కంఠంతో, మంచి పద్యాలే రాసి వినిపించారు. మార్చి 13న - ఆంధ్రజ్యోతిలో అప్పుడు సబ్ ఎడిటర్ గా పనిచేస్తున్న పొనుగోటి కృష్ణారెడ్డి (ఇప్పుడు 'మా భూమి' మాసపత్రిక సంపాదకులు) కేతు విశ్వనాథ రెడ్డి కథల పుస్తకం మీదా, డా.ఏటుకూరి ప్రసాద్ రాసిన తాపీ ధర్మారావ్ జీవితం రచనలు గ్రంథం మీదా, డా.తుర్లపాటి రాజేశ్వరి రాసిన స్వాతంత్ర్యానంతర తెలుగు నవల అనే గ్రంథం మీద చక్కని సమీక్షలు రాసి 'గ్రంథావలోకనం' కార్యక్రమంలో వినిపించారు.

స్త్రీ శిశుసంక్షేమ శాఖవారితో ముఖాముఖి


మార్చి 8 అంతర్జాతీయ మహిళాదినోత్సవం కదా! అంచేత ఆ నెల "టెలిఫోన్ ముఖాముఖి" కార్యక్రమాన్ని స్త్రీ శిశుసంక్షేమ శాఖ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీమతి కృపావేణి ప్రకాశరావు, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారిణి శ్రీమతి డి. సావిత్రీదేవి గార్లతో రూపొందించి శ్రోతలు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిప్పించడం జరిగింది. (2.3.92) చిత్రంగా ఎందుకో, సాధారణంగా అధిక సంఖ్యలో ఫోన్లు వచ్చే ఆ కార్యక్రమానికి - నాడు ఫోన్ కాల్స్ ఎక్కువగా రాకపోవడంతో - విషయ విస్తరణను వారిచేతే ఎక్కువసేపు చేయించి మాట్లాడించవలసి వచ్చింది. కానీ వారు మాత్రం ఎంతో సంతోషించారు!

"అంబేద్కర్ ఆశించిన ఆదర్శ సమాజం సాధ్యమా"? అనే అంశంపై - మార్చి 16 రాత్రి 9.30కు ఒక చర్చా కార్యక్రమం రూపొందించి ప్రసారం చేయడం జరిగింది. గుంటూరు ఏ.సి. కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్ శ్రీ పి.భాస్కరరావు, చిలువేరు ఎం.పి.పి. స్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీ బి.మోజెస్ ప్రభాకర్, మహమ్మద్ ఇద్రిస్, దళిత రచయితల సంఘం (ద.ర.సం) కో ఆర్డినేటర్ శ్రీమతి ఎం.స్వర్ణలతాదేవి ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు. చర్చ ఆసక్తికరంగా సాగి శ్రోతలను అలరించింది.

1992 ఏప్రిల్ నెలను నా 'రేడియో కెరీర్'లో నేను బాగా గుర్తుపెట్టుకుంటాను. ఎందుకంటే కార్యక్రమ నిర్వహణాధికారిగా నా ఉద్యోగంలో నాకు ఎంతో సంతృప్తిని కలిగించిన మాసం అది. తెలుగు సాహితీ రంగంలోని ప్రముఖులు కొందరితో నేరుగా 'ఇంటరాక్ట్' అయిన గొప్ప సందర్భాలు ఆ నెలలోనే వచ్చాయి. అందులో ప్రముఖంగా చెప్పుకోవలసింది ప్రముఖ కథారచయిత చాగంటి సోమయాజులు గారిని. ప్రత్యక్షంగా వారిని కలిసింది, ఆయనను స్టూడియోకి పిలిచి రికార్డు చేయగలిగిందీ అప్పుడే అప్పుడు 'ఆంధ్రప్రభ' వారపత్రికకు శ్రీ వాకాటి పాండురంగారావుగారు సంపాదకులుగా ఉండేవారు. ఉగాది సందర్భంగా ఆంధ్రప్రభ కథల పోటీ నిర్వహించి, అందులో బహుమతి గ్రహీతలకు - విజయవాడలో ఒక సభపెట్టి, ఆ నగదు బహుమతులను చా.సో గారి చేతుల మీదుగా అందచేసింది. ఆ సందర్భంగా ఎందరో కథారచయితలూ, కథాభిమానులూ ఆ సభకు తరలి వచ్చారు.


చాసోగారు


డా.మిక్కిలినేని రాధాకృష్ణ మూర్తి

చాగంటి సోమయాజులు గారిని స్వయంగా ఆ సందర్భంగా కలుసుకుని, ప్రత్యేకంగా స్టూడియోకి ఆహ్వానించగానే, ఆయన ఆదరంతో అంగీకరించి వచ్చారు. 'కథ వెనుక కష్టం' అనే శీర్షికతో ఆయనను ఆంధ్రప్రభ సంపాదకులు శ్రీ వాకాటి పాండురంగారావుగారితో ఇంటర్వ్యూ చేయించి, 10.4.92 రాత్రి ప్రసారం చేయడం జరిగింది. రికార్డింగుకు వచ్చినప్పుడు ఆయనతో రెండు మూడు గంటలు గడపడం, వారి కథనొకటి చాసోగారి కంఠస్వరంలోనే రికార్డు చేయడం మరిచిపోలేను! చాసోగారిని వాకాటి వారిచేత ఇంటర్వ్యూ చేయించి, 'కథల కథా కమామిషు' అనే శీర్షికన శ్రీ వాకాటి పాండురంగారావుగారిని స్వయంగా నేనే ఇంటర్వ్యూ చేసి, ఆ కార్యక్రమాన్ని 24 వ తేదీ రాత్రి తొమ్మిదింబావుకి ప్రసారం చేయడం జరిగింది. తన సహజ చమత్కార ధోరణిలో గంభీరమైన విషయాలను కూడా వాకాటి వారు ఆ ఇంటర్వ్యూలో చెప్పారు. 'నటరత్నాలు' వంటి అద్భుతగ్రంథం రచించిన వారూ, స్వయంగా రంగస్థల, సినీనటులూ అయిన డా.మిక్కిలినేని రాధాకృష్ణ మూర్తిగారిని ఆ నెలలోనే శ్రీ కోకా సంజీవరావు (విజయవాడ ఆకాశవాణి అనౌన్సర్) గారిచే ఇంటర్వ్యూ చేయించి - ఈ మూడు ఇంటర్వ్యూలూ ఆ నెలలో 'ముఖే ముఖే సరస్వతి' పేర పరిచయమాలికగా వారం వారం ఆ నెలలోనే ప్రసారం చేయడం ఓ విశేషమే మరి నాకు. ఒక గొప్ప మరుపురాని విషయమే!





శ్రీ మాకినేని బసవపున్నయ్య

గుంటూరు తూర్పుపాలెం రేపల్లెకు చెందిన సి.పి.ఎం నేత శ్రీ మాకినేని బసవపున్నయ్యాగారు ఏప్రిల్ 12, 1992 ఆదివారం న్యూఢిల్లీలో అస్తమించారు. ఆ నేతకు శ్రద్ధాంజలి కార్యక్రమాన్ని పదమూడవ తేదీ రాత్రి ఎనిమిదింటికి ప్రసారం చేసాం. ఆ సందర్భంగా రాజ్యసభ సభ్యులు శ్రీ మోటూరి హనుమంతరావు, సి.పి.యం సెంట్రల్ కమిటీ సభ్యులు శ్రీ నండూరి ప్రసాదరావు, పత్రికా సంపాదకులు శ్రీ తుర్లపాటి కుటుంబరావు, తెలంగాణ పోరాట నాయకురాలూ, నాటి ఆంధ్రప్రదేశ్ మార్క్సిస్టు పార్టీ మహిళావిభాగం అధ్యక్షురాలు శ్రీమతి. మల్లు స్వరాజ్యం, స్వాతంత్ర్య సమరయోధులు పాత్రికేయులు శ్రీ కాట్రగడ్డ రాజగోపాలరావుగార్లను కలిసి వారి శ్రద్ధాంజలిని రికార్డు చేసి ప్రసారం చేసాం. హైదరాబాద్ నుండి సి.పి.ఎం. స్టేట్ సెక్రటేరియట్ సభ్యునిగా నాడుండిన శ్రీ మధుగారి శ్రద్ధాంజలిని కూడా తెప్పించుకుని, కార్యక్రమంలో ప్రసారం చేయడం జరిగింది. విజయవాడలో కార్యక్రమం నిర్వహణాధికారిగా నేను చేసిన మొదటి శ్రద్ధాంజలి కార్యక్రమం అదేనేమో!


శ్రీ త్రిపురనేని హనుమాన్ చౌదరిగారితో

ఆ ఏప్రెల్ నెలలోనే శ్రీ త్రిపురనేని హనుమాన్ చౌదరిగారితో మొదటిసారి కలిసే వీలు కలిగింది. టెలికం జనరల్ మేనేజర్గా, విదేశ సంచారనిగమ్ మేనేజింగ్ డైరెక్టర్గా పనిచేసి

రిటైరయిన ఆయన హైదరాబాద్ నుండి విజయవాడకు వచ్చిన సందర్భంగా - ఆకాశవాణికి రావడంతో, ఆయనను ఇంటర్వ్యూ చేసే అవకాశం నాకు కలిగింది. "టెలికాం చట్టం నాడు - నేడు" అనే అంశంపై టి.హెచ్. చౌదరిగారితో పరిచయ కార్యక్రమం 24.4.92 రాత్రి 8.15కు ప్రసారమైంది.

'మో'గా ప్రసిద్ధుడైన ప్రముఖ కవి శ్రీ వేగుంట మోహన్ ప్రసాద్ గారిచేత 'షేక్స్పియర్ నాటక కథలు' పేరిట షేక్స్పియర్ నాటకాలలోని పదమూడింటిని కథలుగా తెలుగులో రాయించి, ఆదివారం మధ్యాహ్నం 'కథాలహరి' కార్యక్రమంలో ఆ నెలలోనే ప్రసారం


శ్రీ వేగుంట మోహన్ ప్రసాద్

చేయడం మొదలు పెట్టడం కూడా మరిచిపోలేని సంగతే! మోహన్ ప్రసాద్ - తరువాత వాటిని గ్రంథరూపంలో ప్రచురించి, నాకు కృతజ్ఞతలు కూడా పుస్తకంలో రాసి అచ్చేసి, తన సంతకంతో ఒక ప్రతిని కానుకగా ఇచ్చాడు. 'మో' రాసిన ఆ షేక్స్పియర్ నాటక కథలను కథాపఠనం చేసి, శ్రోతలకు రక్తికట్టించింది ఆకాశవాణి విజయవాడ కేంద్రం అనౌన్సర్ అయిన శ్రీ కోకా సంజీవరావు గారే! శ్రీ అండవిల్లి సత్యనారాయణగారు కూడా మరికొన్ని నాటక కథలను రేడియోకి ప్రసారం చేసినవారే! వేగుంట మోహన్ ప్రసాద్ రాసిన షేక్స్పియర్ నాటక కథలు 26 ఏప్రిల్ 1992 ఆదివారం నాడు మొదలై, వారం వారం ధారావాహికంగా - 19 జూలై' 1992 వరకూ ప్రసారం అయ్యాయి. శ్రీ కోకా సంజీవరావు గారినీ, 'మో' ని అభినందిస్తూ అప్పట్లో శ్రోతలు రాసిన ఉత్తరాలు అనేకం!

ఆ ఏప్రిల్లో కొన్ని వైవిధ్య ప్రసంగాలు ప్రసారం అయ్యాయి. గుంటూరు నుండి వెలువడే 'కాంతిరేఖలు' పత్రికా సంపాదకుడు శ్రీ మీర్జా అమీర్ చందోలి "రంజాన్ ప్రార్థనల్లోని పరమార్థం" గురించి (5.4.92), ఒంగోలు రెవరెండ్ కె.ఎల్.దుర్గ "గుడ్ ఫ్రైడే" గురించి (17.4), 'తుఫాను నుండి తీరందాకా' పేర-సైక్లోన్స్ గురించి మచిలీపట్నం సైక్లోన్ డిజాస్టర్ & రాడార్ సిస్టం వాతావరణ పరిశీలనాధికారి డా.వి.సుబ్రహ్మణ్యం (9.4), 'తీరాంధ్రదేశాన్ని పాలించిన సదావంశ రాజులు' గురించి - డా. పి.ఆర్.కె.ప్రసాద్ (8.4), 'మీరూ హోంగార్డ్ కావచ్చు' అన్న అంశంపై - శ్రీ ఆర్.డి.షా (22.4), 'నలభై ఏళ్ళుదాటాక జాగ్రత్తగానే ఉండాలి' అనే అంశంపై విజయవాడ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎన్.గంగా సత్యం (29.4), 'గౌరననవనాథ చరిత్ర - జైనతత్వం' గురించి శ్రీ ధూర్జటి వెంకట బాలాజి (15.4), ప్రబంధాల్లో చైత్ర వర్ణనలు గురించి చీరాల ప్రభుత్వ మహిళా కళాశాల లెక్చరర్ డా.వి.నాగరాజ్యలక్ష్మి (3.4) చేసిన


ఖాదర్ మొహియుద్దీన్

ప్రసంగాలు ప్రసారం అయ్యాయి. 20 ఏప్రిల్ రాత్రి "ధరల అదుపుకు దారులు లేవా" అనే అంశంపై ప్రసారమైన చర్చా కార్యక్రమంలో- తణుకు ప్రభుత్వ కళాశాలకు చెందిన శ్రీమతి ఎస్.మనోరమ, మచిలీపట్నం నోబుల్ కాలేజీ ఎకనమిక్స్ శాఖాధిపతి కె. బాలకోటేశ్వరరావు, శ్రీమతి. పి. విజయలక్ష్మి, 'ఉద్యోగపర్వం' పత్రికా సంపాదకుడు - శ్రీ అన్నాపెగడ లక్ష్మీనారాయణ పాల్గొని చర్చించారు.

తన 'పుట్టుమచ్చ' కవితా సంకలనంతో ప్రముఖుడైన ఖాదర్ మొహియుద్దీన్ - అప్పట్లో 'షేర్ కాలమ్' అనే పత్రికలో సంపాదకునిగా పనిచేస్తుండేవాడు. ఏప్రెల్ ఒకటిన 'కవితాఝురి' కార్యక్రమంలో - తన కవితాపఠనం చేసి శ్రోతలను అలరించడం నాకు గుర్తుంది. పుట్టుమచ్చ కవిగానే తాను ప్రసిద్ధుడయ్యాడు.



ఇవీ ప్రవచనాలు


| | | |
|---|---|---|
| 1. | మెషర్ ఫర్ మెషర్ | 9 |
| 2. | ది కామెడీ ఆఫ్ ఎరర్స్ | 20 |
| 3. | ది వింటర్స్ టేల్ | 32 |
| 4. | ఆల్ ఈజ్ వెల్ దట్ ఎండ్స్ వెల్ | 42 |
| 5. | సింబలిన్ | 53 |
| 6. | కొరియొలానస్ | 65 |
| 7. | యాంటనీ అండ్ క్లియోపాత్రా | 76 |
| 8. | ది టు జెంటిల్‌మెన్ ఆఫ్ వెరోనా | 88 |
| 9. | టిమాన్ ఆఫ్ ఏథెన్స్ | 98 |
| 10. | పెరిక్లిజ్, ప్రిన్స్ ఆఫ్ టైర్ | 109 |
| 11. | ట్రాయిలస్ అండ్ క్రెసీడా | 118 |
| 12. | హెన్రీ ది ఫోర్త్ - పార్ట్ 1 | 129 |
| 13. | హెన్రీ ది ఫోర్త్ - పార్ట్ 2 | 140 |


కృతజ్ఞతలు

ఈ నాటకాల ఇతివృత్తాల్ని రాయించినందుకు శ్రీ సుధామకూ,
ప్రవచించిన శ్రీ కోకా సంజీవరావుకూ,
ప్రసారించిన ఆలిండియా రేడియో
విజయవాడ స్టేషన్ డైరెక్టర్ శ్రీ కులకర్ణికీ

—'మో'






# 32

**ప్రముఖ నక్సలైట్ నాయకుడు** కీర్తిశేషులు కొండపల్లి సీతారామయ్యగారి భార్య కోటేశ్వరమ్మగారని నాకు అంతకు ముందు తెలియదు, 1992 మే 18 రాత్రి నేను రూపొందించిన సంచికా కార్యక్రమం రికార్డింగుకు ఆవిడ వచ్చేవరకు. వేదాల నుండి వర్తమానం వరకు స్త్రీ గురించి, స్త్రీల పట్ల భావన గురించి ఓ సంచికా కార్యక్రమం చేయాలని "సరసం, సమరం సమీకృతం స్త్రీ" శీర్షికన ఆ నెల కార్యక్రమం రూపొందించడం జరిగింది. నిజానికి అంతకు ముందే పరిశీలన కోసం కావలి (నెల్లూరు) జవహర్ భారతి తెలుగు శాఖాధిపతులు డా.జె.వి.సుబ్బారాయుడుగారు 'వేదాల్లో, పురాణాల్లో స్త్రీ' అని ఒక స్క్రిప్ట్ పంపించారు. అది చదివినప్పుడు సాధారణంగా అందరూ అనుకునేదానికి భిన్నంగా వాటిల్లోని స్త్రీ పట్ల ఉదాత్తత, అస్తిత్వ చైతన్యాలు కూడా ఆయన పేర్కొనడం జరిగింది. అది ఆయన చేత చెప్పించడానికి సంకల్పించి, మన ప్రబంధాల్లో మొల్ల, రంగాజమ్మ, ముద్దుపళని వంటి ప్రాచీన కవయిత్రులు స్త్రీ పట్ల వ్యక్తీకరించిన భావజాలాన్ని క్రోడీకరిస్తూ నేనే ఒక స్క్రిప్ట్ రాసాను. దానిని శ్రీమతి ప్రయాగ వేదవతిగారు, నేను కలిసి చదివాం. ప్రబంధ కవయిత్రుల భావజాలం తెలిపే పద్యాలను విజయవాడ ఆకాశవాణి సంగీత విభాగంలో పనిచేస్తున్న కుమారి ప్రియంవదగారు పాడారు. ఈ రెండు అంశాలకు తోడుగా "ఫెమినిజాన్ని అర్థం చేసుకోవడం ఎలా?" అనే ఒక సంభాషణను ఆ సంచిక కార్యక్రమంలో జతపరచడం సమంజసం అనీ, అప్పుడే వేదాలనుండి వర్తమానం వరకు ఒక విహంగావలోకనం జరుగుతుందని భావించి, ఆ సంభాషణలో పాల్గొనవలసిందిగా శ్రీమతి కొండపల్లి కోటేశ్వరమ్మగారినీ, అప్పుడు ఉదయంలో ఉన్నారో ఆంధ్రజ్యోతిలో ఉన్నారో సరిగా గుర్తులేదుగానీ ఇప్పుడు ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధం అధిపతిగా ఉన్న శ్రీమతి వేమన వసంతలక్ష్మి (మానవ హక్కుల ఉద్యమ నేత కీ.శే.బాలగోపాల్ భార్య) గారిని ఆహ్వానించడం జరిగింది. వారి సంభాషణ ఆ కార్యక్రమానికి వన్నె తెచ్చింది. కవయిత్రి, మా ఆకాశవాణిలో కార్యక్రమ నిర్వాహణాధికారి అయిన ఝాన్సీ, కె.వి.కుమారి రాసిన


శ్రీమతి వేమన వసంతలక్ష్మి

'మహిళా ఓ మహిళా' అనే పాటను కూడా ఆ సంచికా కార్యక్రమం ముగింపులో ప్రసారం చేయడం జరిగింది. 'సరసం సమరం సమీకృతం స్త్రీ' అనే ఆ సంచికా కార్యక్రమానికి శ్రోతల ప్రశంసలు ఉత్తరాల ద్వారా అధికంగా అందుకున్నప్పుడు కలిగిన తృప్తి చెప్పలేనిదే ఆ రికార్డింగుకు వచ్చినప్పుడు శ్రీమతి కొండపల్లి కోటేశ్వరమ్మగారితో జరిపిన వ్యక్తిగత సంభాషణా మరుపురానిదే ఎంతో ఆత్మీయంగా ఆవిడ స్వవిషయాలు పంచుకోవడం జరిగింది ఆరోజు మా సంభాషణలో. అదంతా ఆఫ్ ది రికార్డ్ అనుకోండి.

విజయవాడ కనకదుర్గ గుడిలో అప్పట్లో శ్రీ కుందుర్తి సత్యనారాయణమూర్తిగారని ఓ ప్రధాన అర్చకులుండేవారు. నవరాత్రుల్లో అమ్మవారికి అలంకారాలు చేసే ప్రధాన వ్యక్తి కూడా ఆయనే. ఆయనకు సాహిత్యం పట్ల ముఖ్యంగా పద్య కవిత్వం పట్ల మక్కువ ఎక్కువ.

సరస వినోదిని సమస్యా పూరణ కార్యక్రమం నిర్వహణకు ఆయన వస్తూండేవారు. కనకదుర్గ వైభవం మీద ఆయన గొప్ప గ్రంథం కూడా రాసారు. ఆ పుస్తకం నాకు కానుకగా ఇవ్వడం మాత్రమే కాదు, నేను వద్దని చెప్పినా నా మీద అభిమానంతో వారం వారం నాకు పోస్ట్‌లో అమ్మవారి కుంకుమ పొట్లం, అక్షితలు నేను విజయవాడలో ఉన్నంతకాలం పంపుతూనే ఉండేవారు. "ధవుడిల రాలెఁ దారలు విధాతను తిట్టె యుగాలు పొంగగన్", "కన్య చరణమ్మె దిక్కయ్యె కడకు పతికి" అనే తాను గూర్చిన సమస్యలనిచ్చి జూన్'92 రెండవ పక్షంలో ఆయన సరస వినోదిని నిర్వహించడం నాకు జ్ఞాపకం ఉంది. అమ్మవారి దర్శనానికి మీరెప్పుడైనా ఎవరినయినా తీసుకురండి నేను దగ్గరుండి చేయిస్తాను అనేవారు. కానీ నాకా అవసరం పడలేదు, వినియోగించుకోవాలని నేనెన్నడూ అనుకోనూలేదు.

జూన్ 15 శ్రీశ్రీ గారి వర్ధంతి కదా. ఆ ఏడాది సోమవారం అయింది. రాత్రి నాకు అరగంట 'చెంక్' కూడా ఉంది. అంచేత మంచి సంచికా కార్యక్రమం రూపొందిద్దామనుకున్నాను. కానీ ఆ ఏడు సార్క్ దేశాల సమ్మేళనంపై సార్క్ ఆడియో విజువల్ ప్రోగ్రాం ఒకటి రాత్రి ఢిల్లీ నుండి అనివార్యంగా రిలే చేయవలసి వచ్చి సంచికా కార్యక్రమం వ్యవధి పావుగంటే అయింది. దానితో శ్రీశ్రీ గారి గళంలో నేను సైతం అనే వారి కవితాపఠనం, అదే గీతం వేసి ప్రముఖ కవి శ్రీ నాగభైరవ కోటేశ్వరరావుగారిచేత 'విమర్శకునిగా శ్రీశ్రీ' అనే అంశంపై ఓ క్లుప్త ప్రసంగం చేయించడం జరిగింది. అప్పటికాయన చీరాల ప్రభుత్వ స్త్రీల కళాశాలలో రిటైరయ్యి గుళ్ళపల్లిలో ఉంటున్నారు.


శ్రీ నాగభైరవ కోటేశ్వరావు

నెలనెలా ప్రసారమయ్యే శ్రోతలు ఫోన్‌లో అడిగే ప్రశ్నలకు సమాధానాలు అప్పటికప్పుడే ఇచ్చే 'టెలిఫోన్ ముఖాముఖి' కార్యక్రమం కూడా విభిన్నంగా, విలక్షణంగా ఉండాలని ఆలోచిస్తూండే నైజం ఉండేది. అయితే ఆరోగ్య సమస్యల గురించి కూడా ఇంకేమీ తోచకపోతే ఒక్కసారి వేసెయ్యడం మామూలే. చర్మ సంబంధిత సమస్యల మీద ఏప్రిల్‌లో డెర్మిటాలజిస్టులు డా.పి.రాంబాబు, డా.ఆర్.సుబ్బారావ్‌గార్లతో ఏప్రిల్'92 కార్యక్రమం చేసేసాక, మధ్యతరగతి బ్రతుకుల్లో ఓ సరదా నెలకోసారి ఇంట్లో కాక హోటల్ కెళ్ళి భోంచేయడంగా ఉండడం అనుభవంలోని విషయమే కనుక ఆ నెల ఒకసారి మోడరన్ కేఫ్ వెళ్ళినప్పుడు 'హోటల్స్' గురించి కార్యక్రమం ఎందుకు చేయకూడదనిపించింది. రేడియోలో వాణిజ్య ప్రకటనలు మొదలయిన కొత్తల్లో వివిధ భారతిలో ముఖ్యంగా 'హోటల్ మమతా వారి సమయం ఉదయం 9 గంటలు" అనే టైంచెక్ ప్రకటన చాలా ప్రసిద్ధం కూడాను. టెలిఫోన్ ముఖాముఖి మే'92లో 'హోటల్స్'


టెలిఫోన్ ముఖాముఖి

గురించి అని ప్రపోజ్ చేసినప్పుడు అసిస్టెంట్ స్టేషన్ డైరెక్టర్‌గారు శ్రీ శబరినాధన్ (ఫోటోలో కుడిప్రక్కన ముందు ఉన్నవారు)అదెందుకు అన్నట్లు చూసినా డైరెక్టర్ గారు బాగుందని అంగీకరించారు. అంతే! 1992 మే నాల్గవతేదీ టెలీఫోన్ ముఖాముఖికి శ్రోతల నుంచి అనుకోకుండానే బోలెడు ఫోన్లు వచ్చాయి. హోటళ్ళ పరిశుభ్రత గురించి, నిర్వహణ గురించి, తినుబండారాల ధరల గురించి, ఆఖరికి బేరర్ల ప్రవర్తనల గురించి కూడా శ్రోతలు ఫోన్‌లో అడిగిన ప్రశ్నలకు విజయవాడ హోటల్ 'మమత' అధినేత ఆలిండియా హోటలియర్స్ అసోసియేషన్ ఎక్జిక్యూటివ్ సభ్యులు శ్రీకె.వి.గోపాలరావుగారు అలాగే విజయవాడ హోటలియర్స్ అసోసియేషన్ అధ్యక్షులు విజయవాడ మోడరన్ కేఫ్‌కు చెందిన శ్రీహెచ్.టి మురళీధరరావుగారు సమాధానాలిచ్చారు. ఆ తరువాత కె.వి.గోపాలరావుగారు ఎప్పుడు తటస్థపడినా గుర్తుపట్టి పలకరించేవారు. హోటల్ కృష్ణారెసిడెన్సీ కూడా గోపాలరావుగారితో ముడివడిందే అనుకుంటాను. ఓసారి మా ఆవిడతో, ఆరేళ్ళ మా అబ్బాయి స్నేహిత్‌తో కృష్ణా హోటల్‌కు వెళ్ళినప్పుడు ఆయన కనబడి పలకరించారు. ఆవేళ మా స్నేహిత్ పొరపాటున టేబుల్ మీది రెండు విలువయిన గ్లాసులు క్రిందపడేయడంతో అవి పగిలిపోయాయి. బిల్లులో వాటి ధర కట్టడానికి సిద్ధమైతే "చిన్నపిల్లల చేతిలో ఇలాంటివి మామూలే లెండి" అని నవ్వుతూ గోపాలరావుగారు వారింపచేయడం వారి సహృదయతకు నిదర్శనం.

జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్ర విశేషాలను వారం వారం ప్రసారం చేసే 'నడుస్తున్న చరిత్ర' కార్యక్రమానికి వివిధ పత్రికలకు చెందిన జర్నలిస్టులు వస్తూండేవారని చెప్పాను కదా!. సీనియర్ జర్నలిస్టులు అంటే తుర్లపాటి కుటుంబరావు, రెంటాల గోపాలకృష్ణగారి లాంటి వారికి దానికి పారితోషికం అప్పట్లో నూటపాతికరూపాయలు. ఇతరులకి వందరూపాయలు. ఆంధ్రప్రభతో పనిచేసి రిటైరయిన కూచిమంచి సత్యసుబ్రహ్మణ్యం వంటి పెద్దలు కూడా కార్యక్రమం సమర్పించడానికి స్క్రిప్ట్ సిద్ధం చేసుకుని వచ్చేవారు శ్రద్ధగా. అప్పట్లో జి.శ్రీరామమూర్తిగారు ఆంధ్రజ్యోతిలో 'లీడర్ రైటర్'గా ఉండేవారు. ప్రస్తుతం ఆయన సూర్యదినపత్రిక సంపాదకులు అనుకుంటాను. 'నిజం' పేరుతో ఆయన కవిగా, రచయితా కూడా గుర్తింపు పొందినవారే. జూన్'92లో ఆయనను 'నడుస్తున్న చరిత్ర' కార్యక్రమానికి ఆహ్వానించినప్పుడు ఉత్సాహంతో అంగీకరించి వచ్చారు. కానీ అప్పట్లో ఆయనకి మద్యపానానురక్తి అధికం అనుకుంటాను. రికార్డింగ్‌కు అదే స్థితిలో ఆయన స్టూడియోకు వచ్చారు. వాసన మాటకేమిగానీ ఆ స్థితిలో ఆయన 'మాట'లో తడబాటులేకుండా క్లారిటీతో రికార్డు చేయడానికి మాత్రం ఇబ్బంది పడవలసే వచ్చింది. 'ప్రత్యక్షప్రసారం కాక పోవడం నయం అయిందని' అనుకోకుండా ఉండలేకపోయాను. అయితే ఆయన స్క్రిప్ట్ అద్భుతం. పారితోషికం 250 రూపాయలకు పెరిగాక ఆయనపై గౌరవంతో 1993 ఏప్రిల్ 24న, 1994 ఏప్రిల్ 30 న మరి రెండుసార్లు ఇవ్వగా నేనుండగా ఆయన 'నడుస్తున్న చరిత్ర' కార్యక్రమం సమర్పించారు. అప్పట్లో విజయవాడ ఆంధ్రప్రభ దినపత్రికలో సబ్ ఎడిటర్‌గా పనిచేస్తున్న ఎ.జగన్నాధ స్వామికి నడుస్తున్న చరిత్రకు మొదటగా అవకాశం కల్పించింది నేనని తను తరువాత చెబితేనే తెలిసింది. రికార్డింగుకు వచ్చినప్పుడు తన కంఠం చాలా బాగుందనీ, వార్తాపఠనానికి ప్రాంతీయవార్తా విభాగంతో సంప్రదించమని నేనే సలహా ఇచ్చాననీ, ఆ ప్రోద్బలంతోనే తాను 'న్యూస్‌రీడర్'ని కాగలిగాననీ ఇటీవల ఒకసారి కలిసి తనే చెప్పినప్పుడు సంతోషం వేసింది. తను ఇప్పుడు ప్రాంతీయ వార్తలు చదివే న్యూస్‌రీడర్లలో ఒకరుగా పేరొందాడు. నడుస్తున్న చరిత్ర కార్యక్రమం సమర్పించిన జర్నలిస్టులు నేడెంతో మంది మంచి స్థాయిలో ఉన్నారు. నేడు ఛానెల్స్‌లో అద్భుత రాజకీయ విశ్లేషణలు చేస్తున్న తెలకపల్లి రవిగారు ప్రజాశక్తి దినపత్రికలో విజయవాడలో చీఫ్ న్యూస్ఎడిటర్‌గా ఉండి, 1992 అక్టోబర్'3న నేనుండగా వచ్చి ఆ కార్యక్రమం 'నడుస్తున్న చరిత్ర' మంచి విశ్లేషణంతో అందించడం జ్ఞాపకం. మరొకటి 1994 ఆగస్టు 20న తనదే. అలాగే 1995 జనవరి 28న. ఎంత నిష్ణాతులయిన జర్నలిస్టులయినా ఎక్కువమందికి అవకాశం ఇవ్వలనే లక్ష్యం ఆకాశవాణిది కాబట్టి ఆర్నెల్లకో, ఏడాదిలో ఒక్కసారి వారికా అవకాశాలు ఆరోజుల్లో కొందరికి లభిస్తూండేవి. ప్రతిపక్ష పత్రికలుగా



శ్రీ తెలకపల్లి రవి

ప్రభుత్వ వ్యతిరేకత ముద్రపడినవే అయినా విశాలాంధ్ర, ప్రజాశక్తి వంటి పత్రికా రచయితలను కూడా 'నడుస్తున్న చరిత్ర'కు ఆహ్వానించి వారి విశ్లేషణాలు నిష్పక్షపాతంగా ప్రసారం చేసేందుకు వెనుకంజ వేయలేదు.

డబ్బు పెంచుకునే మార్గాల్లో ఒకటిగా షేర్లు కొనడం, అమ్మడం అనే షేర్ల బిజినెస్ ఇప్పటిది కాదుకదా! షేర్లలో పెట్టుబడి పెట్టి అధికలాభాలు ఆర్జించినవారూ ఉన్నారు. నష్టపోయి దెబ్బతిన్నవారూ ఉన్నారు. నాకు బాగా గుర్తు. మేం ఏలూరు తాతయ్యగారు అనే వాళ్ళం! ఆయన పేరూ వెంకట్రావే. మా చిన్నప్పుడు హైదరాబాద్‌కి మా ఇంటికి ఒకసారి వచ్చారు. మా నాన్నగారు ఆయన తనకు బాబాయి అవుతారు గనుక ఈ షేర్ల వ్యవహారం గురించే దేనికో సికిందరాబాద్‌కు తీసుకు వెళ్ళడం జరిగింది. ఆయన తిరిగి ఏలూరు వెళ్ళిపోయాక, మా నాన్నగారు తన బాబాయి షేర్లలో పెట్టి నష్టపోవడం గురించి బాధగా మాట్లాడడం నాకు జ్ఞాపకం. మా నాన్నగారు ఏ నాడూ చీటీలు, షేర్లు అనే వాటికి తన జీవితంలో చోటివ్వలేదు. తన జీతం రాళ్ళతోనే సంతృప్తిపడ్డారు. ఆ న్యాయమైన సొమ్ముతోనే మాకు చదువులూ అవీ చెప్పించి ఆరుగురు పిల్లల్నీ ప్రయోజకుల్ని చేసారు. తలుచుకుంటే అది అసాధ్యం కాదనీ అనడానికి మా నాన్నగారు కీ.శే.కామేశ్వరరావుగారే మాకు నిదర్శనం.

1992 జూలై 20న నేను ప్రసారం చేసిన చర్చా కార్యక్రమం 'షేర్ల వ్యాపారం ఒక జూదమా?' అనే అంశం మీద. చిన్నప్పటి ఆ జ్ఞాపకాలవంటివీ భిత్తికగా కార్యక్రమాల రూపకల్పనలో ఏవో ఉండే ఉంటాయిలెండి! విజయవాడ షేర్ బ్రోకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీఎల్.నాగభూషణం, విజయవాడ కన్స్యూమర్ ప్రొటెక్షన్ సెంటర్ ట్రస్టీ ఛార్టెడ్ అక్కౌంటెంట్ శ్రీ సి.తాండవ కృష్ణగారు, ఇన్వెస్టర్స్ అసోసియేషన్ స్థాపక సభ్యులు, అడ్వకేట్ శ్రీ దోనేపూడి నాగేశ్వరరావు, శ్రీ అండవిల్లి సత్యనారాయణగారు ఆ చర్చలో పాల్గొన్నారు.

షేక్స్‌పియర్ నాటక కథలు శ్రీ వేగుంట మోహన్ ప్రసాద్‌వి 1992 జూలై 19 వరకు పదమూడు వారాలు ప్రసారమయ్యాయి అని మునుపే చెప్పాను కదా! ఉషశ్రీ రామాయణ ప్రవచనాలు వంటివి ప్రసారమయిన ఆ 'కథాలహరి' 'ఛెంక్'లో పురాణేతిహాస విషయాలేకాక, ఇలా భారతీయేతర సాహిత్య అంశాలు ప్రసారం చేయడం ఒక ఎత్తయితే, నిజానికి ఏ నవలా స్రవంతిలోనో ప్రసారం చేయవలసిన ఒక నవలా కథను కథాలహరిలో 1992 జూలై 26 నుండి అక్టోబర్'18 వరకు ఆదివారాల్లో ప్రసారం చేయడం జరిగింది. దానికి కారణం శ్రీ నండూరి సుబ్బారావుగారే. 'గణపతి' నాటకం ద్వారాను, విజయవాడ రేడియో నాటక ప్రయోక్తగానూ ఆయన ఎంత ప్రసిద్ధులో అందరికీ తెలుసు. అప్పటికి ఆయన రిటైరయిపోయి కొంచెం శరీరం కూడా వడలి కర్ర పట్టుకు నడుస్తూండేవారు. అంత పెద్దమనిషి స్వయంగా వచ్చి ఒక విధంగా తన స్వీయాత్మక కథను 'ఆరుగొలను నుండి అమెరికా దాకా" అనే పేరిట రాసారు. ఆయన జన్మస్థలం ఆరుగొలను. అంతకు కొన్నాళ్ళ ముందే అమెరికా సందర్శించి వచ్చారు. తన జీవన వృత్తాంతమే మూలకందంగా ఆయన రాసిన నవలా కథయే 'ఆరుగొలను నుండి అమెరికాదాకా'. నిజానికి అది 'కథాలహరి' కార్యక్రమ ప్రణాళిక లోకి పూర్తిగా ఒదగదు అని నాకు తెలుసు. కానీ ఆయన మీద ఉండే గౌరవం ఆయన కోరికను కాదనలేకపోయింది. డైరెక్టర్ కులకర్ణిగారు కూడా ఏ కళనున్నారో 'తప్పేం ఉంది! ఇదీ కథాలహరే ప్రసారం చేయండి' అని అనుమతి ఇచ్చారు. నండూరి సుబ్బారావుగారు అప్పుడు ఆ కథాపఠనం చేయగల గళసామర్ధ్యంతో లేరు. అందువల్ల పదమూడు భాగాలుగా నండూరి సుబ్బారావుగారు రాసిన 'ఆరుగొలను నుండి అమెరికాదాక' అనే ఆ సాంఘిక నవలా కథను అప్పుడు అనౌన్సర్‌గా పనిచేస్తున్న శ్రీ పేరి కామేశ్వరరావుగారే చదవగా ప్రసారం చేయడం జరిగింది. అందుకు నండూరి సుబ్బారావుగారు ఎంత సంతోషించారో చెప్పలేను. విజయవాడ ఆకాశవాణి కేంద్రానికి ఆ మహనీయుడు చేసిన సేవకు ప్రతిగా ఆ మాత్రమేనా చేయకపోతే ఎలా అన్న భావనకు డైరెక్టర్‌గారి ఆమోదం లభించడం వల్లనే అది సాధ్యమైంది. ఆ తరువాత 'కథాలహరి' పరంపరలో మళ్ళీ పురాణేతిహాసాల వైపు మరలి 25 అక్టోబర్'1992 నుండి శ్రీ ఎలూరి పాటి అనంత రామయ్యగారిచే 'మార్కండేయ పురాణం' రేడియో అనుసరణ గావింపచేసి కథా ప్రవచనం ప్రసారం చేయడం జరిగింది. 'కథాలహరి'లో 'ఆడ్ మాన్ ఔట్'లా ప్రసారమయ్యిందే అయినా నండూరి సుబ్బారావుగారి 'ఆరుగొలను నుండి అమెరికా దాకా' నవలా కథ శ్రీ పేరి కామేశ్వరరావు గారి


నండూరి సుబ్బారావుగారు

గళంలో కొంత హాస్య చమత్కార భరిత శైలితోనే సాగి శ్రోతలను అలరించింది. అదీ సంతోషం! నండూరి సుబ్బారావుగారికి తృప్తి కలిగించిన సంతోషం.

ప్రసంగ పరంపరల ప్రణాళికలో 'మనలోని చిత్రమైన కోణాలు' శీర్షికన మే'1992లో మూడు విలక్షణ ప్రసంగాలకు రూపకల్పన చేసి ప్రసారం చేయడం జరిగింది. ఎంత గొప్పవారయినా, లబ్ధ ప్రతిష్ఠులైనా, పదవీ అధికారాల్లో ఉన్నా మనలో కొందరికి కొన్ని చిత్రమైన వైఖరులు ఉంటుంటాయి. కొందరు అవతలి వారిమీద చాడీలు చెబుతూంటారు. అవతలి వారి మీద అనవసరంగా పడి ఏడుస్తూంటారు. అలాగే అమెరికా వంటి దేశానికి వెళ్ళి అక్కడ షాపింగ్ చేస్తూ ఏదో వస్తువును తస్కరించబోయిన మనవారి గురించిన కథనాలూ విన్నాం. అంటే ఏమిటన్నమాట. కొందరిలో ఇలాంటి 'దొంగబుద్ధి' ఉంటుంది. అలాగే సవ్యమైన పనులే అయినా చేయడంలో అపసవ్యతా లక్షణం మరికొందరిది. మనస్తత్వ శాస్త్రం ప్రాతిపదికగా సైకాలజిస్టుల కోణంలో ఈ అంశాలను విశ్లేషింపచేసే ప్రసంగాలను ప్రసారం చేసే సంకల్పంతో రూపొందించిన 'మనలోని చిత్రమైన కోణాలు' ప్రసంగ పరంపరలో మూడో మనిషిపై చాడీలు - మంతనాలు అనే అంశంపై డా.ఇండ్ల రామసుబ్బారెడ్డి (6.5.1992), 'దోబూచులాడే దొంగబుద్దులు' అనే అంశంపై శ్రీ అట్లూరి వెంకటేశ్వర రావుగారు (13.5.92), అలాగే 'అపసవ్యంగా పనులు చేయడం' గురించి పాలకొల్లుకు చెందిన సైకియాట్రిస్ట్ డాక్టర్ చల్లా భారతిగారు (20.5.1992) చేసిన ప్రసంగాలు బాగా వచ్చాయి.



డా. ఇండ్ల రామసుబ్బారెడ్డి


జి.యస్. రాజు

మే నెలలోనే మాజీప్రధాని కీ.శే. జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతిని పురస్కరించుకుని అదేరోజు "తెలుగు కవుల కవితా స్ఫూర్తిగా నెహ్రూ" అనే అంశంపై ప్రముఖ సాహిత్య విమర్శకుడు, రచయిత శ్రీ కడియాల రామమోహన్ రాయ్ ప్రసంగించారు. నెహ్రూ, ఇందిర, రాజీవ్‌ల పాలనానిరతి గురించి ఆ నెలలోనే (21.5.92) సిరీస్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీజిఎస్.రాజుగారి ప్రసంగం ప్రసారమైంది. సిరీస్ రాజుగారు నెహ్రూగారిలానే తెల్లని దుస్తుల్లో కోటుకి ఒక గులాబీపువ్వుతో రికార్డింగుకు వచ్చారు. ఆయన ఎప్పుడు రేడియోలో ప్రసంగించినా పారితోషికం తీసుకోలేదు. కాంట్రాక్ట్ ఫారం మీద ప్రసారానికి సంతకం చేస్తూనే తనకు ఆ పారితోషికం వద్దని రాసేవారు. అది ఆయన నియమం. జి.యస్. రాజుగారు స్వయంగా వాళ్ళ సిరీస్ కంపెనీకి ఆహ్వానించి అంతా చూపించడం, వారింట్లో ఒకసారి బెజవాడ గోపాలరెడ్డిగారితో బాటు అల్పాహార విందు ఆరగించడం మర్చిపోలేను. ఆ ముచ్చట మరోసారి చెబుతాను..





# 33

**ఉత్తమ చలనచిత్రాలకు రాష్ట్రప్రభుత్వం** నంది అవార్డులు ప్రదానం చేయడం అనేది 1964లో అనుకుంటా మొదలైంది. సాధారణంగా అవార్డు ప్రదానోత్సవ సభ హైదరాబాద్‌లోనే జరుగుతూంటుంది. కానీ 1991 సంవత్సరానికి గాను తెలుగు సినిమాల నంది అవార్డుల ఫంక్షన్ అప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న శ్రీ నేదురుమిల్లి జనార్దనరెడ్డి గారి అభీష్టం మేరకు అనుకుంటాను 1992 జూన్ నాల్గవ తేదీ నెల్లూరులోని ఎ.సి. సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించారు. నిజానికి ఆకాశవాణి చలనచిత్రాల నంది అవార్డు విశేషాలను వార్తలలో చెబితే చాలు. కానీ స్టేషన్ డైరెక్టర్ కులకర్ణిగారు ఫంక్షన్ హైదరాబాద్‌లో కాక విజయవాడ ఆకాశవాణి పరిధిలోని నెల్లూరులో ఏర్పాటవడంతో 1991 ఉత్తమ తెలుగు చలన చిత్రాలకు నంది బహుమతి ప్రదానోత్సవ సభను నెల్లూరు వెళ్ళి కవర్ చేసి మరునాడు రేడియో నివేదిక సమర్పించమని ఆదేశించారు. కేవలం సినిమా వాళ్ళ ఫంక్షన్ కాదుగా! ఇద్దరు ముఖ్యమంత్రులు ఇన్వాల్ అయి వున్నారాయె. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జనార్దన రెడ్డిగారు, తమిళనాడు ముఖ్యమంత్రి పైగా మాజీ సినీనటి కుమారి జయలలిత ఇద్దరూ ఆ వేడుకలో పాల్గొంటున్నారాయె! అంచేత యూనిట్‌ను తీసుకుని నెల్లూరు వెళ్ళాం. మేము దిగిన హోటల్లోనే పలువురు సినీప్రముఖులూ బసచేయడంతో వాళ్ళని తేలిగ్గా హోటల్లోనే కలిసి రికార్డింగు చేసే అవకాశం కలిగింది కూడాను. కేవలం బహుమతి ప్రదానోత్సవ సభ విశేషాలే కాక ప్రత్యేకంగా అలా బహుమతి గ్రహీతల స్పందనలను నేరుగా వారిని కలిసి రికార్డు చేసి మరునాటి రేడియో నివేదికలో శ్రోతలకు వినిపించ గలిగాం. అదో గొప్ప అనుభూతి. జయలలిత బాల్యం నెల్లూరులో కొంత గడవడం వల్ల ఆమె ఆ సమావేశంలో ప్రేక్షకులతో ఆత్మీయంగా ప్రసంగించడం ఓ విశేషం. ఆ ఏడాది అవార్డు కమిటీ ఛైర్మన్‌గా జస్టిస్ పి. చెన్నకేశవ రెడ్డిగారు వ్యవహరించారు. ప్రముఖ సినీదర్శకులు కె.విశ్వనాథ్‌గారికి ఆ ఏడు రఘుపతి వెంకటరత్నం



నాయుడు అవార్డు ఇచ్చారు. ఉత్తమ నటుడిగా శ్రీ దాసరి నారాయణరావు, ఉత్తమ నేపథ్యగాయకునిగా శ్రీ ఎస్.పి.బాలసుబ్రమణ్యం, ఉత్తమ సినీ గేయరచయితగా శ్రీ వేటూరి సుందర రామమూర్తి, బెస్ట్ డైరెక్టర్ స్క్రీన్‌ప్లే రైటర్‌గా శ్రీ రామ్‌గోపాలవర్మ, ఉత్తమ బాలలచిత్రం 'భద్రంకొడుకో' డైరెక్టర్‌గా శ్రీ అక్కినేని కుటుంబరావు, కో ప్రొడ్యూసర్ ముత్యం రెడ్డి, బెస్ట్ ఫస్ట్ డైరక్టర్‌గా శ్రీ కొండముది శ్రీరామచంద్రమూర్తిగారలు బహుమతులు అందుకోగా వారిని ప్రత్యేకంగా కలిసి రికార్డు చేసి వారి గళాలను నివేదికలో కూర్చాము. కొండముది వారు, కుటుంబరావుగారు నాకు అంతకు మునుపు కొద్దిగా పరిచయస్తులే. ఏమయినా అందరు ప్రముఖుల గళాలను ఆ అరగంట నివేదికలో ఆకాశవాణికై ప్రత్యేకించి రికార్డు చేసి ప్రసారం చేసినందుకు డైరెక్టర్ గారూ చాలా ఆనందించారు. శ్రోతలూ అభినందించారు. అలా ఓ సినిమా ఫంక్షన్ ప్రత్యేక రేడియో నివేదికగా రూపొందించి ప్రసారం చేయడం నాకు అదే ప్రథమం అదే ఆఖరు కూడానులెండి!

వినియోగదారుల కార్యక్రమానికి వేదన - నివేదన అనే పేరు నాకెందుకో అంతగా నచ్చలేదు. బహుశా ఆ పేరు నా ముందు ఆ కార్యక్రమాన్ని చూస్తూండే పాండురంగ పెట్టాడో లేక తను ఎక్కువగా ఆధారపడిన విజయవాడ వినియోగదారుల సహాయ సమితి ఛీఫ్ కో ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తూండిన సత్యనారాయణ మూర్తి పెట్టారో తెలీదు గానీ జూలై 1992లో నేను 'వినియోగదర్శిని' అని ఆ కార్యక్రమం పేరు మార్చాను. వినియోగదారులకు సలహాలు- సూచనలు ఆయన ప్రసారానికి ఉచితంగా రాసిస్తున్నారన్న పద్ధతి తొలగిస్తూ బుధవారాల్లో శ్రోతలకు వినియోగదారులకు సూచనలు, స్క్రిప్ట్ నేనే రాసి ప్రెజెంట్ చేయడం మొదలుపెట్టాను. వినియోగదారుల సంఘం అనేది మోనోపలీ కాదనీ ఎవరయినా పెట్టవచ్చనీ మంగళగిరి కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.గోవర్ధన రావు ప్రసంగం ఆ నెలలోనే ప్రసారం చేసాం (13.7.92) క్రమంగా 'వినియోగదర్శిని' కార్యక్రమానికి ఆదరణ పెరిగింది మరింతగా. ఆంధ్రజ్యోతి దినపత్రికలో అప్పట్లో కన్స్యూమర్ కాలమ్ చూసే డి. నంద కిశోర్ వంటివారు అండగా నిలిచి కార్యక్రమ విజయానికి తోడ్పడ్డారు. గుంటూరు, భీమవరం, కంచికచర్ల, మంగళగిరి, పిడుగురాళ్ళ వినియోగదారుల సంఘాలు ఆసక్తిగా కార్యక్రమాల్లో పాల్గొనేవి. కన్స్యూమర్ కోర్టు డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి గుంటూర్‌కు చెందిన జడ్జి శ్రీ వై.వెంకటేశ్వరరావుగారు కార్యక్రమాన్ని ఎంతో అభినందించడమే కాక ఆయనా స్వయంగా వచ్చి 'వినియోగదర్శిని'లో పాల్గొన్నారు. వినియోగదారుల ఉద్యమంతో అలా రేడియోలో 'వినియోగదర్శిని' కార్యక్రమంతో నేనూ బాగా ముడిపడ్డాను. పలు సంఘాలవారు వారి వారి కార్యక్రమాలకు నన్ను ప్రత్యేకించి ఆహ్వానించడమూ జరుగుతూండేది.


శ్రీ తుర్లపాటి కుటుంబరావు

శ్రీ తుర్లపాటి కుటుంబరావు గారి పేరు తెలుగువారు చాలామందికి తెలుసు. ఆయనకు సభాసామ్రాట్ అనే వ్యవహారమూ ఉండేది. జర్నలిస్టుగా అందునా తెలుగు జర్నలిస్టుగా పద్మశ్రీ వరించింది బహుశా ఆయనొక్కరినేనేమో! ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్‌గా ఉన్న ఆయన ఆ రోజుల్లోనే కాదు ఈ రోజుల్లోనూ ఆకాశవాణి అంటే అపార గౌరవం కలిగినవారే. 1992 ఆగస్టు 15న నడుస్తున్న చరిత్ర కార్యక్రమం సమర్పించడానికి ఆయన సంతోషంగా వచ్చారు. నేను ప్రముఖ జర్నలిస్టుని ఇంకా నడుస్తున్న చరిత్రలాంటి కార్యక్రమాలు వారం వారం జాతీయ అంతర్జాతీయ రాష్ట్ర వార్త విశేషాలు రాసి చదివే కార్యక్రమం నేనివ్వడమేమిటి అని ఎప్పుడూ అనుకోలేదు. ఆ రోజుల్లో అంత ఆత్మీయంగా, ఆకాశవాణి పట్ల శ్రద్ధతో ఉండేవారు ఆ పెద్దలంతా కూడా, అలాగే ఆ నెలలోనే శ్రీ రెంటాల గోపాలకృష్ణగారూ నడుస్తున్న చరిత్ర సమర్పించారు. అప్పట్లో విజయవాడ నుంచి 'ఉద్యోగవిజయాలు' అనే మాసపత్రిక వెలువడేది. అందులో ఎంప్లాయ్ మెంట్ న్యూస్ ప్రధానంగా ఉండేది. దానితో బాటు జనరల్ నాలెడ్జ్ విషయాలు, చక్కటి వార్తా

విశ్లేషణా వ్యాసాలూ ఉండేవి. ఆ పత్రిక సంపాదకులు శ్రీ ఆలూరి సుభాష్‌బాబు. ఆయన కూడా 'నడుస్తున్న చరిత్ర' కార్యక్రమం పట్ల ఆసక్తితో కోరగా ఇచ్చిన అవకాశాలను చక్కగా వినియోగించి సమర్పించేవారు. ప్రముఖ దినపత్రికల జర్నలిస్టులకే కాక గుంటూర్ ఎక్స్‌ప్రెస్, ఐక్య ఉపాధ్యాయ, సుప్రభాతం వంటి చిన్న పత్రికల సంపాదకులకు కూడా 'నడుస్తున్న చరిత్ర' సమర్పించేందుకు అవకాశం కలిగించడం వారికి ఎంతో సంతోషం కలిగించడం మాత్రమే కాదు వారం వారం కార్యక్రమం మంచి వైవిధ్యంతో రూపొంది ఆకట్టుకునేది. అలాగే వండర్ వరల్డ్ వి.నారాయణరావు, నడుస్తున్న చరిత్ర పత్రిక సంపాదకులు వి.కృష్ణారావుగారు కూడా కార్యక్రమం సమర్పించినవారే.


డా.భావరాజు నరసింహారావుగారు

మచిలీపట్నం నుండి వెలువడే 'త్రివేణి' పత్రికకు మంచిపేరుంది. ఆ త్రైమాసిక పత్రికకు సంపాదకులుగా డా.భావరాజు,నరసింహారావు ఉండేవారు. జూలై '92లో ఆయన ఆకాశవాణికి వచ్చి 'సాహిత్యం సమకాలీనత - సార్వజనీనత' అనే అంశంపై ప్రసంగించడం మరచిపోలేని సంగతి. త్రివేణిలో నా 'అగ్నిసుధ' కవితా సంకలనంపై డా.ధారా రామనాధ శాస్త్రిగారి చేత ఆయన. సమీక్ష రాయించి ప్రచురింపచేసారు కూడాను.


శ్రీ కాటగడ్డ నర్సయ్యగారు

సినిమారంగంలో పంపిణీ వ్యవస్థతో అవినాభావ సంబంధం కలవారిలో శ్రీ కాటగడ్డ నర్సయ్యగారొకరు. ఆ పెద్దమనిషికి మార్నింగ్ వాక్ అంటే మహా ఇష్టం. వాకింగ్ క్లబ్ మోజు. ఆయన అభిరుచికి అనుగుణంగా వృత్తి పరమైన అంశం కాక ప్రవృత్తి పరమైన అంశం 'నవకం తెచ్చే నడక' అని ప్రసంగించమని ఆహ్వానించినప్పుడు ఆయన ఎంతో సంతోషంగా శ్రోతలకు 'నడక'పై మంచి ప్రసంగాన్ని అందించారు (3.7.92)

ప్రసంగ పరంపరల్లో ఆగస్ట్ నెలలో 'మారుతున్న కాలం - కోరుతున్న విలువలు' అనే అంశంపై మూడు ప్రసంగాలు ప్రసారం చేయడం జరిగింది. తెనాలి వి.ఎస్.ఆర్ & ఎన్.వి.ఆర్ కళాశాలలో లెక్చరర్‌గా రిటైరయిన శ్రీ అన్నపురెడ్డి వెంకటేశ్వర రెడ్డిగారు 'మిసిమి' పత్రికకు సంపాదకులుగా ఆ పత్రికకు ఒక స్థాయిని చేకూర్చారు. బౌద్ధిజం గురించి ఆయన గొప్ప రచనలు ఎన్నో చేసారు. 'భిన్నమతాలు - సామరస్య సూత్రాలు' అనే అంశంపై ఆయన ప్రసంగించారు (12.8.92) వికసించవలసిన విద్యావిధానం గురించి గుంటూరు హిందూకళాశాల సెక్రటరీ శ్రీ మాధవపెద్ది రాధాకృష్ణమూర్తి ప్రసంగించారు (19.8.92). ప్రముఖ రచయిత, ఆంధ్రజ్యోతి వారపత్రిక సంపాదకులు అయిన శ్రీ పురాణం సుబ్రహ్మణ్య శర్మగారితో ఆ పరంపరలోనే (26.8.92) 'వ్యాపార సాహిత్యం - ప్రజాసాహిత్యం' అనే అంశంపై ప్రసంగింపచేయడం ఒక మంచి జ్ఞాపకమే. పురాణంగారు రికార్డింగుకు వచ్చినపుడు ఆయనతో ఓ గంట పిచ్చాపాటీ మాట్లాడటం మరువలేని సంగతే. 1967లో మేమి యువభారతి పక్షాన 'వీచికలు' కవితా సంకలనం వేసినప్పుడు ఆంధ్రజ్యోతిలో పురాణంగారే దానిని సమీక్షించారు. ఇరివెంటి కృష్ణమూర్తి, చక్రవర్తి వేణుగోపాల్, నేను, వంగపల్లి విశ్వనాధం నలుగురి కవితా సంకలనం అది. "మీరు అప్పుడు అసలు నా కవిత్వం చదివినట్లు నాకు అనిపించలేదు. నా కవితలు శీర్షికలు మాత్రం చెప్పి వ్యాఖ్యానించారంతే అని నేనంటే "నువ్వన్నది నిజమే! అప్పుడు చాలా పొగరుగా కూడా ఉండేవాడినిలే" అన్నారాయన నవ్వుతూ. పురాణంగారితో వ్యక్తిగత పరిచయం అదే ఆ తరువాత ఆయన రిటైరై హైదరాబాద్‌కు వచ్చినప్పుడు ఆకాశవాణికి తన సేవలు వినియోగించుకోమని కోరుతూ నాకు ఓ ఉత్తరం రాసారు కూడాను. ఆయనతో కొన్ని ఉత్తర ప్రత్యుత్తరాలు, కొన్ని కార్యక్రమాల రూపకల్పన సాగింది. ఆయన ఇచ్చిన ఓ


శ్రీ పురాణం సుబ్రహ్మణ్య శర్మగారితో

రేడియో కార్యక్రమాన్ని సమయ వ్యవధి దృష్ట్యా కూడా నేను కొంత ఎడిట్ చేసి ప్రసారం చేసినప్పుడు పత్రికా సంపాదకునిగా పనిచేసిన తన స్క్రిప్టును ఎడిట్ చేసిన ఘనత నాదేననీ, ముందుకొంత అసహనం చెందినా ఆయన అర్థం చేసుకుని అభినందించారు. పురాణంగారూ వారి కుమారులూ (శ్రీనివాస శాస్త్రి, కీ.శే. నానీ కూడా) నాకు ఆత్మీయం కావడం మంచి జ్ఞాపకమే. ప్రముఖ చిత్రకారుడు కూడా అయిన నానీ, తన భార్యతో పాటు విజయవాడలో నా శ్రీమతి ఉషారాణి చేసిన ఓ ఛాట్‌షోలో పాల్గొని ఆనందించడం కూడా బాగా గుర్తే!

1992లో కృష్ణాపురస్కారాలు వచ్చాయి. విజయవాడ ఆకాశవాణిలో చేరిన కొత్తల్లోనే గోదావరి పుష్కరాల కార్యక్రమాలు విస్తృతంగా చేసిన అనుభవంతో కార్యక్రమాల రూపకల్పన సంవిధానం సులభమైంది. కృష్ణాపుష్కరాల స్పెషల్ ఆఫీసర్‌గా శ్రీసి.ఉమామహేశ్వర రావుగారున్నప్పుడు ఆయనతో 28.8.92న పుష్కరాలకు సన్నాహాల గురించిన ప్రసంగంతో కర్టెన్ రైజర్ కావించినట్లయింది. ఆయన ఎంతగానో సహకరించారు ఆ సందర్భంగా.


శ్రీ సి. ఉమామహేశ్వరరావు గారితో

సెప్టెంబర్‌1992 ప్రసంగపరంపరను హాస్యభరితం చేయాలనే భావన కలిగింది. "చిన్నదే సంగతి - కానీ తెగ చికాకు" అనే శీర్షికన మూడు ప్రసంగాలు ప్లాన్ చేయడం జరిగింది. అప్పటికి ప్రముఖ హాస్యరచయిత, లీడింగ్ లాయర్ శ్రీ పుచ్చా పూర్ణానందంగారు ఉన్నారు. (16.9.92) 'ఆవలింతలవేళ' అనే అంశంపై ఆయనకు ప్రసంగానికి కాంట్రాక్ట్ పంపడం జరిగింది. ఆయన ఎంతో ఆనందపడి అంగీకరించారు కానీ సరిగ్గా రికార్డింగ్ సమయానికి ఆయన ఆరోగ్యం కొంచెం బాగుండకపోవడంతో ఆయన స్క్రిప్ట్ మాత్రం రాసి పంపించుతూ ఎవరి చేతనయినా చదివించేయమని కోరారు. అలా ఆయన ప్రసంగవ్యాసం నేనే చదివి శ్రోతలకు వినిపించాను. 'తుమ్ముకు తమ్ముడు లేడు' అనే అంశంపై (23.9.92) బాపట్ల ఆర్ట్స్ కళాశాల లెక్చరర్ హాస్య రచయిత శ్రీ దర్భా బాబూరావు ప్రసంగించగా 'గురకను పరకాయిద్దాం' అనే అంశంపై (30.9.92) ఏలూరు నుండి వచ్చి శ్రీ గుండు సుబ్రహ్మణ్య దీక్షితులుగారు సమర్పించారు. ఆ మూడు ప్రసంగాలూ శ్రోతలను బాగా అలరించాయి. గుండు సుబ్రహ్మణ్య దీక్షితులుగారు ప్రస్తుతం 'ఆంధ్రప్రదేశ్' మాసపత్రిక జి.వల్లీశ్వర్ గారి అన్నగారని మొన్నమొన్నటిదాకా నాకు తెలియనే లేదు.

కృష్ణాపుష్కరాలు జరిగిన 11.9.92 సాయంకాలం 6.30 నుండి ఆకాశవాణి విజయవాడ కేంద్రం నుంచి ప్రత్యక్ష వ్యాఖ్యానం ప్రసారం చేయడం జరిగింది. బ్రహ్మశ్రీ మల్లాది చంద్రశేఖర శాస్త్రి, శ్రీ మైలవరపు శ్రీనివాసరావు, శ్రీ రేమెళ్ళ సూర్యప్రకాశ శాస్త్రిగారలు వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. చంద్రశేఖర శాస్త్రిగారు హైదరాబాద్ నుండి వచ్చారు. అదే రోజు రాత్రి ప్రసారమైన 'జానపద విశ్లేషణలో గ్రామదేవతలు' అనే ప్రసంగం వెనుక ఓ చిన్న వృత్తాంతం చెప్పాలి.

ఓ రోజు యధాలాపంగా పేపర్ తిరగేస్తున్నప్పుడు నాటి దినపత్రికలో 'జన్నేష్' అనే శ్రీధర్‌కు డాక్టరేట్ వచ్చిందన్న చిన్న వార్త కనపడింది. ఆయన గ్రామదేవతలు మీద పరిశోధన చేసి డాక్టరేట్ పొందారని ఆ వార్తలో ఉంది. ఆయన విస్సన్న పేట మండలంలోని చండ్రపట్ల వాసి అనీ తండ్రి శ్రీ హుస్సేన్ అని ఉంది. నేను షెడ్యూల్ లో జానపద విశ్లేషణలో గ్రామదేవతలు అనే అంశంపై ఆయన పేరు ప్రసంగకర్తగా వేసుకుని షెడ్యూల్ అమలు చేస్తున్నప్పుడు డా.శ్రీధర్ s/o శ్రీ హుస్సేన్, చండ్రుపట్ల, విస్సన్న పేట మండలం, కృష్ణాజిల్లా అని కాంట్రాక్ట్ పంపేసాను. అది ఆయనకు అందడం, రేడియో నుంచి నాకు కాంట్రాక్ట్ రావడం ఏమిటా అని ఆశ్చర్యపోవడం జరిగింది. కాంట్రాక్ట్ ఫారం మీద ప్రసంగం నిమిత్తం వక్తకు చెల్లించే పారితోషిక fee (ఫీ) అనే కాలమ్‌లో పేర్కొనడం మామూలే. అయితే ఆయనకు ఆ సంగతి తెలియక ఆ ఫీ తాను చెల్లించలేమో అనుకుని దానికి సిద్ధపడి మరో ఫోన్ చేసి ముందుగా మాట్లాడారు. ఆ ఫీజ్ చెల్లించుకోవడం ఎలా? అని ఆయన అడిగినపుడు ఆశ్చర్యపడడం నావంతయింది. అది ఆకాశవాణి ఆయనకు చెల్లించే పారితోషికం

అనీ, ఆయన ఎలాంటి రుసుమూ లేదనీ పైగా రానుపోను ఖర్చులు కూడా పారితోషికంతో బాటు ఆకాశవాణియే చెల్లిస్తుందనీ చెప్పాను. ఎంత డాక్టరేట్ చేసిన ప్రముఖులయినా కొన్ని విషయాల్లో ఎలా అమాయకంగా ఉంటారో, ఆకాశవాణి కాంట్రాక్ట్ ఫారమ్ అర్థం చేసుకోవడంలో కూడా ఎలా తికమక పడగలరో నాకప్పుడే అవగతమయింది. మొదటిసారి అనుకోకుండా ఆకాశవాణి నుండి స్వయంగా ప్రసంగించడానికి పిలుపునందుకున్న ఆయన ఎంత సంతోషించారో, శ్రద్ధగా ప్రసంగం తయారు చేసుకుని రికార్డింగుకు వచ్చి ఎంత పొంగి పోయారో నేనెప్పటికీ మరిచిపోలేని అనుభూతియే!


కరుణశ్రీ గారు

అలాగే నేను విజయవాడ ఆకాశవాణి కేంద్రంలో కార్యక్రమ నిర్వహణాధికారిగా పనిచేస్తున్నప్పుడే అంతకుముందు ఎన్నో రేడియో కార్యక్రమలతో ఎంతో సంబంధం ఉండి తెలుగు కవిత్వరంగాన తనదైన ముద్రతో సుప్రసిద్ధులైన కవికి నా గళంతో శ్రద్ధాంజలి కార్యక్రమం రూపొందించి ప్రసారం చేయవలసి వస్తుందని ఏ మాత్రం ఊహించలేదు. జూన్ '92లో జరిగిన ఆ విషాద స్మృతి కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రిగారి మృతి. గుంటూరులో 21.6.1992 12.50కు అస్తమించిన ఆ మహనీయుడికి శ్రద్ధాంజలి కార్యక్రమం 1992 జూన్ 22 సోమవారం ఉదయం 8.30కు ఆకాశవాణి విజయవాడ కేంద్రం నుంచి ప్రసారం చేసాం. ఇంద్రగంటి శ్రీకాంత శర్మ స్క్రిప్ట్ రాయగా నా గళంతో ఆ కార్యక్రమంలో ప్రసారమైంది. కార్యక్రమంలో విశ్వయోగి విశ్వంజీ, నండూరి రామకృష్ణమాచార్యులు, సి.ఎస్.రాజు, ప్రసాదరాయ కులపతి గారల శ్రద్ధాంజలి వినిపించాం. గుంటూర్ కలెక్టర్, హైదరాబాద్ నుండి దేవులపల్లి రామానుజారావుగారల సంతాప సందేశాలు లైన్స్‌లో రికార్డు చేసి కార్యక్రమం పొందు పరిచాం. అలా పుష్ప విలాప కరుణశ్రీగారి ఆకస్మిక మృతికి శ్రద్ధాంజలి కార్యక్రమం నేను ప్రసారం చేయవలసి రావడం మరచిపోలేని విషాదమే.


శ్రీ నండూరి రామకృష్ణమాచార్యగారితో

పద్యకవిత్వంలో కరుణశ్రీగారు ఎంత అందెవేసిన చెయ్యో శ్రీ నండూరి రామకృష్ణమాచార్యగారు కూడా అంత ప్రసిద్ధులే. ఆగస్టులో నండూరి రామకృష్ణమాచార్యగారు హైదరాబాద్ నుండి పనిమీద విజయవాడకు వచ్చారు. అప్పుడాయనని విజిటింగ్ ఆర్టిస్టుగా ఆహ్వానించి "కాలం వెంట కవిత్వం" అన్న శీర్షికన ఆయనతో పరిచయ కార్యక్రమం రికార్డు చేసి 5.8.1992న ప్రసారం చేయడం బాగా గుర్తుంది. ఆంధ్రపద్యకవితా సదస్సు అధ్యక్షులుగా శ్రీ నండూరి వారు పద్యకవిత్వ వైభవ ప్రాభవాలకు ఎంతో కృషిచేసారు. వెయ్యేళ్ళ తెలుగు పద్యం గురించి అనంతర కాలంలో హైదరాబాద్ ఆకాశవాణి ఆయన నుండి ధారావాహిక కార్యక్రమం రూపొందించి ప్రసారం చేసింది కూడాను.



# 34

**రాజకీయ రంగంలో విలువలకూ,** నిరాడంబరతకూ పెట్టింది పేరుగా వెలుగొందిన తెలుగు ప్రముఖులు 'వావిలాల గోపాలకృష్ణయ్య'గారు. సాదాసీదా దుస్తులతో, ఎప్పుడూ ఒక చేతిసంచీతో, ఎక్కువభాగం కాలినడకనే సంచరిస్తూ కనిపించేవారు. 'ఆంధ్రాగాంధీ' అనిపించుకున్న అసలు సిసలు గాంధేయవాది ఆయన. గుంటూరు జిల్లా సత్తెనపల్లి ఆయన గ్రామం. ఉమ్మడి మద్రాసు రాష్ట్ర శాసనసభకు 1952లోనే 'ఇండిపెండెంట్' అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందిన ఖ్యాతి ఆయనది. ఆ 'ఇండిపెండెన్సీ' ఆయన వ్యక్తిత్వంలో చాలా నిజాయితీగా, చిత్తశుద్ధితో కానవచ్చేది. 1974-77 కాలంలో అధికారభాషా సంఘం అధ్యక్షులుగా పనిచేసిన ఆయన అవివాహితులుగానే జీవిత పర్యంతం ఉన్న విషయం చాలా మందికి తెలియదు. 1955, 1962, 1967ల్లో సత్తెనపల్లి నుండే ఆయన గెలిచి శాసనసభ్యునిగా సేవలందించారు. మద్యపాన నిషేధం గురించి పోరాడిన రాజకీయ వేత్త ఆయన. కళాప్రపూర్ణ, పద్మభూషణ వంటి బిరుదులు ఆయనను వరించినా, ఎప్పుడూ సౌమ్యంగా, నిరాడంబరంగా కనిపించేవారాయన. 96 ఏళ్ళ నిండుజీవితం అనుభవించారు.



వావిలాల గోపాలకృష్ణయ్యగారితో

నేను విజయవాడలో కార్యక్రమ నిర్వహణాధికారిగా పనిచేస్తున్న కాలంలో ఆయన గుంటూరు అరండల్ పేటలో నివసిస్తూండేవారు. ఆకాశవాణిలో ఆయన సేవలను వినియోగించుకునే

అదృష్టం నాకూ కలిగింది. 1992 ఆగస్టు 9 క్విట్ ఇండియా ఉద్యమానికి స్వర్ణోత్సవాల సందర్భం. అందువల్ల నిజమైన గాంధేయవాదీ, స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న సమరయోధులూ అయిన వావిలాల గోపాలకృష్ణయ్యగారితో ఆ రోజు ఒక పరిచయ కార్యక్రమం రికార్డు చేసి ప్రసారం చేయాలన్న నా సంకల్పాన్ని ఆయన సంతోషంగా అంగీకరించి వచ్చారు. వావిలాల మార్కు చేతిసంచీతోనే, శ్రద్ధగా ఓ కాగితం మీద నాలుగుపాయింట్లు రాసుకుని మరీ, రికార్డింగుకు వచ్చారు. ఆయనతో ఆ రోజు పరిచయ కార్యక్రమం ప్రసారం చేయడం జరిగింది. అప్పటికే ఆర్థిక సరళీకరణల ప్రభావం దేశం మీద పరచుకుంటోంది. ఒకప్పుడు విదేశీ వస్త్ర బహిష్కరణ స్వాతంత్రోద్యమంలో భాగంగా జరిగితే, ఫారిన్ సరుకుల ప్రవాహం నాటికి దేశంలో ముప్పిరిగొంటోంది. వావిలాల వారు నాటిని, నేటిని వీక్షిస్తున్న ఎనభై ఆరేళ్ళ పౌరునిగా ఆనాటి కార్యక్రమంలో తమ ఆవేదనను కూడా వెల్లడించారు. ఆ వయస్సులోనూ ఆయన కంఠంలో స్థిరత్వం, వాచికంలో స్పష్టత ఉండడం, ఏ చేతికర్ర సాయమూ లేకుండానే నడచిరావడం నాకు ఆశ్చర్యాన్నే కలిగించాయి. ఆ తరువాత పలుమార్లు ఆయనను రికార్డు చేసే అవకాశం కలిగింది. ఆ తర్వాత - పేరుతో సహా నన్ను ఆయన గుర్తుపట్టి పలకరించేవారు. 2003లో ఆయన మరణించినా - మచ్చలేని రాజకీయ ప్రముఖుడిగా, గుల్జారీలాల్ నందా, లాల్ బహద్దూర్ శాస్త్రిల వలె నిరాడంబర జీవిగా, ఆయన తెలుగువారి గుండెల్లో జీవించే ఉన్నారంటే అతిశయోక్తికాదు.

మునుపు 'ఫోటోగ్రఫీ' గురించి రేడియోలో కార్యక్రమం చేసానని చెప్పాను గుర్తుంది కదా! నలుపు తెలుపుల ఛాయా చిత్రాల నుంచి కలర్ ఫోటోలకూ, నేడు డిజిటల్ ఫోటోలకూ వచ్చేసాం. మునుపు ఫోటోలకు ఆల్బమ్‌ల్లోకి ఫోటో నాలుగువైపులా జిగురు రాసి అంటించే అట్టముక్కలాంటి పలు 'కార్నర్'లు లభించేవి. లేదా ఫ్రేమ్‌లు కట్టి గోడలకు తగిలించుకునేవాళ్ళం! పాత ఫోటోలను భద్రపరచడం ఒక కళ. ఫోటోలు పాడైపోకుండా వాటి అస్తిత్వాన్ని నిలబెట్టే ప్రక్రియ 'లామినేషన్' అనేది అప్పుడే బాగా విస్తరిస్తోంది. ఆ నేపథ్యంలోనే - "ఛాయాచిత్రాలకు జీవంపోసే లామినేషన్" అనే అంశంపై అప్పట్లో విజయవాడలో ఆర్.కె.లామినేషన్స్ నిర్వహిస్తూండే శ్రీ ఆనంద కుమార్‌తో ఓ పరిచయ కార్యక్రమాన్ని రూపొందించి (25.9.92 రాత్రి 9.16కు) ప్రసారం చేయడం జరిగింది. దానికి మంచి ప్రతిస్పందనే లభించింది.

ఆగస్టు 92లో వావిలాల వంటి సచ్ఛీల రాజకీయ వేత్తనే కాదు, ఓ మహనీయ మూర్తిని కూడా రికార్డు చేసే వీలుకలిగింది. ఆవిడ రాజకీయాలకూ, ఆ మాటకొస్తే - కేవలం లౌకికాలకూ చెందని ఆధ్యాత్మిక సంపన్న, ఆవిడే - 'స్వామిని శారదా ప్రియానంద'. ఆవిడ చిన్మయానంద శిష్యురాలు. నా చిన్నప్పుడు మా నాన్నగారితో వెళ్ళి హైదరాబాద్‌లో చిన్మయానంద ప్రసంగం (అర్థంకాకపోయినా) విన్న గుర్తుంది. శారదాప్రియానంద హైదరాబాద్‌లోనే చదువుకుని, 'లా'లో పట్టభద్రురాలయినా, 'స్వామిని'గా మారిపోయి, కడప ఓబులవారిపల్లి దగ్గర 'ఎల్లాయపల్లి'లో - 'చిన్మయారణ్య' పేర ఒక ఆశ్రమం పెట్టి సేవలందిస్తూ, 'అమ్మ'గా భక్తులు పిలుచుకునే - స్వామినిగా స్థిరపడినవారే! అప్పట్లో ఆధ్యాత్మిక ప్రసంగాలకు ఆవిడ తరలి వెడుతూండేవారు. అనుకోకుండా విజయవాడకు విజిటింగ్ ఆర్టిస్ట్‌గా ఆవిడను రికార్డు చేయడం జరిగింది. 'నిత్య జీవితంలో ఆధ్యాత్మిక స్పృహ' అనే అంశం మీద ఆవిడను మాట్లాడమని కోరి, ఆ ప్రసంగాన్ని 13.8.92 రాత్రి 8.30కు ప్రసారం చేయడం జరిగింది. ఆ తరువాతే తెలిసింది - ఆవిడ మా రేడియో అక్కయ్య శ్రీమతి. తురగా జానకీరాణి గారికి 'పిన్ని' వరస అవుతుందని. తురగా జానకీరాణిగారితో 'బాలజాగృతి' కార్యక్రమం కోసం - 'ఎల్లాయపల్లి' ఆశ్రమానికి వెళ్ళి, అక్కడ ఓ రోజు గడపడం కూడా గుర్తుంది. జానకీరాణిగారు రిటైరయ్యాకనో, ఆవడానికి కొంతముందో సరిగ్గా గుర్తులేదుగానీ.. 'చిన్మయారణ్య' ఆశ్రమంలో 'బాలజాగృతి' కార్యక్రమం చేయడం, అక్కడి ఆశ్రమ భోజనం, స్వామిని గారితో ప్రత్యేకంగా మేం ఆవిడ


స్వామిని శారదా ప్రియానంద

నివాసంలో సమావేశం కావడం గుర్తున్నాయి. ఆవిడ తెలుగులోనూ, ఆంగ్లంలోనూ కూడా నిష్ణాతురాలు. ఆశ్రమంలో అనాథబాలులెందరినో ఆవిడ చేరదీసింది. సుమారు వందమందికి పైగా పిల్లలు పదవ తరగతి వరకూ చదువుకోవడానికి పాఠశాల, వారికి వైద్య సదుపాయాలు చూసే ఆసుపత్రి, వారి వసతి భోజనాలు అన్నీ మాతాజీ పర్యవేక్షణలో నియమబద్ధంగా సాగడం చూసాం! చిన్మయామిషన్ సౌజన్యంతో నడుస్తున్న ఆ ఆశ్రమ వాతావరణం మాకెంతో ఆనందాన్నీ, ప్రశాంతతనూ ఇచ్చింది. వేదాంత ఇన్ ఎవ్విరీ డే



చిన్మయారణ్య ఆశ్రమంలో అనాథ బాలలు

లైఫ్' అనే గ్రంథం, భగవద్గీతకు ఆవిడ రాసిన వ్యాఖ్యానం చాలా ప్రాచుర్యం పొందాయి. అమెరికా వంటి విదేశాలలో కూడా ఆవిడ పర్యటించి చిన్మయానంద శిష్యురాలిగా, ఒక ఆధ్యాత్మిక గురువుగా ఎన్నో ప్రవచనాలు ఇచ్చారు. ఆవిడ మరణాంతరం ఎల్లాయపల్లిలోని ఆ ఆశ్రమాన్ని ప్రస్తుతం స్వామిని షీలానంద నిర్వహిస్తున్నారని ఆ మధ్య జానకిరాణిగారు చెప్పారు.




ఆగస్టు 15 అరవిందుని జయంతి. ఆ నెల 14 న ఉదయం తొమ్మిదిగంటలకు 'అరవిందుని ఆధ్యాత్మిక దృష్టి - జాతీయత' అనే అంశంపై శ్రీ అరబిందో సొసైటీ సెంటర్, ఆశ్రమ్ సొసైటీ, విజయవాడలో ఛైర్మన్ గా ఉన్న శ్రీ టి.యస్. రామచంద్రరావు గారితో ప్రసంగాన్నీ, ఆ నెల్లోనే కృష్ణాష్టమి సందర్భంగా (21.8.92 9.16pm) నరసరావుపేట ఎస్.కె.ఆర్.బి.ఆర్ జూనియర్ కళాశాల లెక్చరర్ అయిన శ్రీ పోలేపెద్ది రాధాకృష్ణమూర్తి గారితో 'కృష్ణావతారతత్త్వం' అనే ప్రసంగం ప్రసారం చేయడం జరిగింది.

ఇటీవల నవ్య వారపత్రికలో 'నాగుల గుట్ట కథలు' రాసిన 'నిశాపతి' పేరు తెలుగు పాఠకలోకానికి పరిచితమే. ఆయన అసలు పేరు శ్రీ ఎమ్. హెచ్.వి సుబ్బారావు. కవిగా, రచయితగా, సమీక్షకునిగా, పద్యకవితా సదస్సు కార్యకర్తగా, పజిల్స్ కూర్పరిగా 'నిశాపతి' ప్రముఖులే! అప్పట్లో ఆయన గుంటూరు సోషల్ వెల్ఫేర్ శాఖలో, సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా ఉండేవారు. సెప్టెంబర్ 28, 1992న అప్పట్లో నవీనంగా నేను ప్రసారం చేసిన 'పత్రికల్లో ఈ నెల' కార్యక్రమాన్ని - ఆ నెల పత్రికలను సమీక్షిస్తూ ఆయన ప్రసంగించారు. ఆయనతో ముఖతః అప్పుడే పరిచయం. ఆ తరువాత సహ సాహితీవేత్తగా ఆయన మంచి ఆత్మీయమయ్యారు. నాకులాగానే ఆయనకూ 'పదబంధాలు' కూర్చడం ఇష్టం! మంచి పట్టూ భాష మీద ఉన్నవారాయన. పద్యాన్నీ, వచనాన్నీ, కథనూ, విమర్శనూ కూడా చక్కగా పండించగల ప్రజ్ఞ ఉంది. ఆంధ్రభూమి ఆదివారం పత్రిక అనుబంధంలో 'పదచదరంగం' కొన్నేళ్ళుగా ఆయనే ఇస్తున్నారు. కలిసినప్పుడల్లా ఆత్మీయంగా పలకరించే ఆయనతో ముఖపరిచయం మటుకు అప్పుడే



శ్రీ నిశాపతి

ఆకాశవాణి కార్యక్రమాల పరిభాషలో - ప్రతి మూడు నెలలకూ వేసే కార్యక్రమ ప్రణాళికను 'షెడ్యూల్' అంటాం. ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్ - రాబోయే మూడు నెలల కాలపు 'షెడ్యూల్'ను ముందుగా రూపొందించి, డైరెక్టర్ అనుమతి సంతకం తీసుకోవాలి. ఆ లెక్కన 1992 సంవత్సరానికి చివరి షెడ్యూల్ అక్టోబర్ - నవంబర్ - డిసెంబర్ మాసాలది. ఆ మూడు నెలల కాలంలో ప్రణాళికా బద్ధంగా రూపొందించి ప్రసారం చేసిన కార్యక్రమాల ముచ్చట్లలోకి వెడదాం -

'షెడ్యూల్' అంటూ వేసి, దానిని అనుసరిస్తున్నా, అప్పటికప్పుడు పరిస్థితులకు అనుగుణంగా రూపొందించి ప్రసారం చేసే కార్యక్రమాలూ, షెడ్యూల్‌లో అవసరార్థం కొద్దిపాటి మార్పులూ చేర్పులూ జరుగుతూనే ఉంటాయి. ఒక షెడ్యూల్‌లో ఒక అంశంపై కార్యక్రమం అనుకున్నప్పుడు, దానిని ఎవరిచేత చేయించి ప్రసారం చేయాలి అన్నప్పుడు, కేవలం ఏ ఒక్కరి పేరో కాకుండా, ప్రత్యామ్నాయంగా ఆ అంశం గురించి ప్రసంగించడానికో, ఆ విషయంపై ఇంటర్వ్యూ చేయడానికో - అదనపు పేర్లను కూడా ముందే పేర్కొనడం జరుగుతుంది. ఒక షెడ్యూల్‌కూ మరో షెడ్యూల్‌కూ ఆర్టిస్టులు గతానుగతికంగా వచ్చేవారే కాకుండా, వీలున్నంత 'కొత్తదనానికి' చోటిచ్చేలానూ శ్రద్ధ వహిస్తూండాలి! ఒక ఆర్టిస్టు ఒకసారి కార్యక్రమం ఇచ్చాక, కనీసం తొంభై రోజుల వ్యవధి తరువాతగానీ, మరలా రాకూడదని ఆ రోజుల్లో నిబంధనను పాటించడం జరిగేది. ప్రత్యేక సందర్భాలలో - ప్రత్యేక అనుమతితోనే, ఒక ఆర్టిస్టు 'క్లోజ్ బుకింగ్'ను స్టేషన్ డైరెక్టర్ అనుమతించేవారు. అలాగే ఒక ఆర్టిస్టు రాకపోతే - ఒక కార్యక్రమం అనుకున్నది రూపొందకపోతే, చివరి నిముషంలో - 'పునఃప్రసారంగా' పాత దేదో ప్రసారం చేసేందుకూ అనుమతి తీసుకోవాల్సిందే! ముందే చెప్పినట్లుగా అప్పుడు ఆకాశవాణి విజయవాడ డైరెక్టర్ 'కులకర్ణి'గారు పునఃప్రసారాలకు ఒప్పుకునేవారు కాదు. రేపు ఉదయం వెళ్ళాల్సిన ప్రోగ్రాం కుదరలేదన్నా - "ఎంటైర్ నైట్ ఈజ్ విత్‌యు. డూ ఇట్" అంటూ, అంతగా అయితే ఆర్టిస్టు రాకపోతే, 'స్టాఫ్ చేతే కొత్త ప్రోగ్రాం ప్రసారమయ్యేలా చూడమనేవారు. అందువల్లే నిరంతరం - రిపీట్ ప్రోగ్రాం కుదరదని, కొత్తప్రోగ్రాం చేయడానికి ఉత్సహిస్తూ, సందడిగా ఉండడం సాధ్యమయ్యేది!

నాస్తికోద్యమ పితామహుడిగా పేరొందిన 'గోరా' (గోపరాజు రామచంద్రరావు) గారి అబ్బాయి 'లవణం', మహాకవి జాషువ కుమార్తె హేమలతను వివాహం చేసుకుని, కులాతీత వివాహ వ్యవస్థకు ఆనాడే ఆదర్శప్రాయమైంది ఆయనే. లవణంగారు - తండ్రి స్ఫూర్తితోనే ఎదిగినా గొప్ప గాంధేయవాది. 'సేవాగ్రామ్'లో గాంధీజీ చెంత మెలిగారు కూడాను. భూదానోద్యమంలో వినోబాభావేతో పాదయాత్ర చేసారు లవణంగారు. మూఢవిశ్వాసాల ప్రతిఘటనలో, కుల రహిత సమాజస్థాపనా చైతన్యంలో, జోగినీ వ్యవస్థ నిర్మూలన కృషిలో శ్రీ లవణం ఎంతో కృషి చేసినవారు. అమెరికా ఇంటర్నేషనల్ సర్వీస్ సొసైటీ -'లవణం' గారికి జీవిత సాఫల్యం పురస్కారం గత


శ్రీ లవణం గోరా

ఏడాది జూన్‌లో ఇచ్చి గౌరవించింది. గాంధీ ఉప్పు సత్యాగ్రహం రోజుల్లో పుట్టినందుకే గోరాగారు ఆయనకు 'లవణం' అని పేరు పెట్టారు. 1992 అక్టోబర్'2 న గాంధీ జయంతినాడు రాత్రి - 'నా స్మృతి పథంలో గాంధీజీ' అనే అంశంపై ఆయనతో ప్రసంగం ప్రసారం చేయడం జరిగింది. లవణంగారు అప్పటి మా పరిచయాన్ని గుర్తుపెట్టుకున్నారు. ఆ తరువాతే హేమలతా లవణంగారితో కూడా నేను కొన్ని కార్యక్రమాలు రూపొందించి ప్రసారం చేయడం జరిగింది. హేమలతగారు పోయిన తరువాత ఒకసారి అనుకోకుండా, హైదరాబాద్ నుండి విజయవాడ దాకా శాతవాహనా ఎక్స్‌ప్రెస్‌లో లవణంగారితో కలిసి ప్రయాణం చేసినప్పుడు, ప్రయాణం పొడుగూతా గంటల పాటు, ఆయనతో సంభాషిస్తూ గడపడం మరుపురాని విషయం! ఆ ప్రయాణంలో ఆయన, తన జీవిత ప్రయాణంలోని అనేక విషయాలను ఆత్మీయంగా నాతో పంచుకున్నారు. హేమలతగారి గురించీ, వారి దాంపత్య జీవనం గురించీ కూడా ఎన్నో ఆసక్తికరమైన అంశాలు పంచుకున్నారు. ఆ ప్రయాణంలో ముఖ్యంగా గాంధీగారి చివరి పలుకుల మీద అప్పట్లో వచ్చిన వివాదం గురించీ, ఆయన చర్చించడం గుర్తుంది! లవణంగారితో తొలి పరిచయం విజయవాడ రేడియో రికార్డింగులోనే మరి అసలుకి!

1992 అక్టోబర్ నెల ప్రసంగమాలిక 'ఎంతవారికయినా' అనే మకుటంతో హాస్య ప్రసంగాలుగా రూపొందించడం జరిగింది.

'అధికుడి ననుకోవడంలోని ఆనందం' అన్న అంశంపై శ్రీ దుగ్గరాజు శ్రీనివాసరావు (9.10.92), 'చిరునవ్వు ముఖానికి అందం' అనే అంశంపై శ్రీ కొడిమెల శ్రీరామమూర్తి (6.10.92), 'సాకులు చెప్పక తప్పదా' అనే అంశంపై శ్రీ స్వర్ణరాజు హనుమంతరావు (23.10.92) ప్రసంగించారు. మా డైరెక్టర్ కులకర్ణిగారు కన్నడిగులు, కన్నడిగుల్లో 'మధ్వ'లకు ఒక ప్రత్యేకత ఉందంటారు. నంది కొట్కూర్‌కు చెందిన శ్రీ కబలూరి వెంకటేశ్వరాచార్య గారితో ఆ నెలలోనే (6.10.92) 8.30pm) 'భారతీయ తత్త్వానికీ - సంస్కృతికీ మధ్వుల సేవ' అనే అంశంపై ప్రసంగం ప్రసారం చేసాం. అదో విలక్షణత గల ప్రసంగంగా శ్రోతలు మెచ్చారు.

ఔనా! ఒకప్పటి ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి, ఆంధ్రపత్రిక వంటి వారపత్రికల, పండుగల సంచికలు గమనించినట్లయితే - ఆ సంచికల్లో 'పద్యకవిత్వం' - ఆయా పండుగల గురించి విరివిగా వచ్చేది. అలా పండుగుల పద్యకవులుగా ప్రసిద్ధులైన పేర్లలో ప్రముఖంగా చెప్పుకునే పేర్లు - మొవ్వ వృషాద్రిపతి, శనగన నరసింహస్వామి. ఆ ఇద్దరు పండుగ కవులతోనే అక్టోబర్ 21 న 'కవితాఝరి' కార్యక్రమం ప్రసారం చేసాను. వారి పద్యాలు లేనిదే పండుగుల సంచికలకు నిండుదనం రాదనుకునేవారు ఆ రోజుల్లో. శ్రీ శనగన నరసింహస్వామిగారు ఆంధ్రా లయోలా కళాశాల తెలుగు లెక్చరర్‌గా ఉండేవారు. మొవ్వ వృషాద్రిపతిగారు రేపల్లెలో ఉండేవారు.


ఏలూరిపాటి అనంతరామయ్యగారు

మధ్యాహ్నం వేళ ఆదివారాల్లో ప్రసారం చేస్తూండే 'కథాలహరి' ధారావాహిక ప్రవచన ప్రసంగాల పరంపరలో అక్టోబర్ 25, 1992 న మొదలై 1993 కొత్త ఏడాది జనవరి 17 వరకూ పదమూడు వారాల పాటు ప్రసారమయిన కార్యక్రమం - శ్రీ ఏలూరిపాటి అనంతరామయ్యగారి 'మార్కండేయ పురాణం' కథాప్రవచనం. నిజానికి ఆయన రాసిన ఆ స్క్రిప్ట్‌ను అంతకు ఆరునెలలముందే రాయల్టీ చెల్లించి తీసుకున్నా, ఆయనకు అనారోగ్యం చేసినందువలన, కథ ప్రవచనం ఆయనచేతే చేయించాలన్న సంకల్పంతో ప్రసారం వాయిదా వేయడం జరిగింది. ఆయనకు ఏమీ కాకూడదనీ, త్వరగా కోలుకుని మార్కండేయ పురాణ కథాప్రవచనం చేయాలనీ 'పే'మెంట్ కూడా జరిగిపోవడం వలన నేను మధనపడేవాడిని! నా మొర నెరవేరినట్లుగా - ఆయన ఆరోగ్యవంతులై వచ్చి, తామే స్వయంగా అప్పుడు ఆ కథ ప్రవచనం చేసారు. గొప్ప పండితులు, సాహితీవేత్త, విమర్శకులు ఏలూరిపాటి అనంతరామయ్యగారు. దూరదర్శన్‌లో ఆయన 'పద్యాలతోరణం; కార్యక్రమం ఎంతో ప్రసిద్ధి చెందింది. అలాగే మాడుగుల నాగఫణి శర్మగారి పంచ సహస్రావధానాలకు అనుసంధానం చేసి వన్నెతెచ్చారు. ఏలూరిపాటి వారు - సుభాషితాల కార్యక్రమంగా ఉదయం ప్రసారమయ్యే 'సూక్తిముక్తావళి,' 'భావన; కార్యక్రమాలలోనూ రసవత్ లఘు ప్రసంగాలు చేసారు. అప్పట్లో ఆయనతో కలిగిన ఆ పరిచయం - ఎందుకో మొదట్లో ఆయన కొంత అహంభావిగాను, ఆర్థికలాలసునిగానూ నాకు అనిపింపచేసినా, ఆయన సాహితీ వ్యక్తిత్వం సమున్నతంగా తరువాత తరువాత నాకు అర్థమైంది! ఆయన మృతి నిజంగానే తెలుగు సాహితీ ప్రపంచం గొప్ప లోటుగా సంభావించింది. కథాలహరిలో ఏలూరిపాటి అనంతరామయ్యగారి మార్కండేయ పురాణ కథాప్రవచనం ఆ తరువాత గ్రంథంగా కూడా వెలువడిందనుకుంటాను.




# 35


శ్రీ మండలి బుద్ధప్రసాద్

**ఆంధ్రప్రదేశ్ అధికార భాషాసంఘానికి** అధ్యక్షులుగా శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారిని నియమిస్తున్నట్లు ఇందాకే టీవీలో వార్త చూసాను. నిజంగా ఆయన తగిన మనిషి. ఆయనతో విజయవాడలో పనిచేస్తూండగానే ప్రత్యక్ష పరిచయం. వాళ్ళ నాన్నగారు మండలి వెంకట కృష్ణారావుగారి సౌమ్యత, ఆదర స్వభావం బుద్ధప్రసాద్‌గారికి ఉన్నాయి. నవంబర్‌ 1992లో విజయవాడ రేడియోలో ఓ చర్చా కార్యక్రమం 'హింసావాతావరణంలో ప్రజాస్వామ్య భవిష్యత్తు' అనే అంశంపై చేసాను. శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్యగారు, శ్రీ ఏటుకూరి బలరామమూర్తిగారు, శ్రీ పరకాల పట్టాభిరామారావుగారు, శ్రీ మండలి బుద్ధప్రసాద్ ఆ చర్చలో పాల్గొన్నారు. నిజానికి చర్చలో పాల్గొన్నవారిలో వయస్సులో చిన్న అంటే బుద్ధప్రసాదే. కానీ అవనిగడ్డలో గాంధీ క్షేత్రం నిర్వాహకునిగా, తండ్రి నుంచి పుణికి పుచ్చుకున్న రాజకీయ సంస్కృతీ వారసత్వంతో చర్చలో తనదైన అభిప్రాయాలను చక్కగా వెలిబుచ్చారు. అప్పుడు జరిగిన పరిచయం ఇప్పటికీ కనబడినప్పుడల్లా నన్ను పేరుతో ఆప్యాయంగా పలకరించేలా నిలిచేవుంది. అవనిగడ్డ గాంధీక్షేత్రానికి పిలిచి తరువాతికాలంలో నా చేత ఒక ఉపన్యాసం కూడా చేయించి ఆ రోజుల్లోనే ఆయన సత్కరించారు. 16.11.92 న ప్రసారమైన ఆ చర్చా కార్యక్రమంలో మిగతా హేమాహేమీలతో ఆయనా సమ ఉజ్జీగా మాట్లాడారు.

డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డిగారు, స్టేషన్ డైరెక్టర్ కులకర్ణిగారితో



నవంబర్ నెల ప్రసారమైన ప్రసంగాలలో నెహ్రూ, ఇందిరాగాంధీల జన్మదిన మాసం నవంబరే కనుక వారిని తలుచుకోవడం విధాయకంగానే ఉండింది. అయితే


శ్రీమతి చెన్నుపాటి విద్య గారితో

విశేషం 'నెహ్రూ - ఆధునికత' అనే అంశం మీద డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డిగారితో ప్రసంగం రికార్డు చేసే అవకాశం దొరికింది. గోపాలరెడ్డిగారు ఎప్పుడొచ్చినా సిరీస్ కంపెనీ జి.ఎస్.రాజుగారింట్లో దిగేవారని ముందోసారి రాసినట్లు గుర్తు. ఆయన వారింట్లో దిగగానే ఆకాశవాణికి ఫోన్ చేసేవారు. లేదా కృష్ణాజీ గారిచేత కబురంపించేవారు. కృష్ణాజీగారు అప్పట్లో సిరీస్ రాజుగారి కంపెనీలోనే ఉండేవారు. 13.11.92 రాత్రి గోపాలరెడ్డిగారి ఆ ప్రసంగం ప్రసారం కాగా 18.11.92 రాత్రి 'ఇందిరాగాంధీ సామాజిక న్యాయశీలం' అనే అంశంపై శ్రీమతి చెన్నుపాటి విద్య గారి ప్రసంగం ప్రసారం చేసాం.

సాహితీ సమితి అధ్యక్షులు, శ్రీ శ్రీ ఆరుద్ర వంటి ఎందరో ప్రముఖులకు ప్రోత్సాహం ఇచ్చిన వారు అయిన తల్లావఝ్ఝల శివశంకర స్వామిగారి శతజయంతి సందర్భంగా 11.11.92 రాత్రి "సాహితీ శివశంకరులు" అనే అంశంపై డా.పైడిపాటి సుబ్బరామశాస్త్రిగారు ప్రసంగించారు. శాస్త్రిగారికి కూడా శివశంకరస్వామి వారిపై అపార గౌరవం. శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చినజియ్యర్ స్వామివారు కూడా అప్పట్లో ఆకాశవాణి స్టూడియోకి ఆహ్వానించగా వచ్చి ప్రసంగాలు ఇస్తుండేవారు. హిందూ ఆర్ష ధర్మ విషయాల మీదనే కాకుండా 1992 నవంబర్ 10 రాత్రి ప్రసారం చేయడానికి గురునానక్ జయంతిని పురస్కరించుకుని 'మానవాళికి గురునానక్ సందేశం' అనే విషయం చినజియ్యర్ స్వామి వారికి ఇవ్వడం, ఆయన అంగీకరించి ఆ అంశంపై ప్రసంగించడం మరచిపోలేని సంగతే. సిక్కు మతస్థాపకుని గురించి చినజియ్యర్ ప్రసంగించడం ఆశ్చర్యం కొందరికి కలిగించినా ఆయన ప్రసంగం శ్రోతల్ని ఆకట్టుకుంది.


శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చినజియ్యర్ స్వామి

నవంబర్‌లోనే కవి దాశరథి జయంతి కూడాను. 1992 నవంబర్ 4 రాత్రి సాహిత్య కార్యక్రమంగా 'కమనీయ కవితా పుష్పకం - దాశరథి' అని నేనిచ్చిన అంశంపై మచిలీపట్నం కవి మిత్రుడు శ్రీ రావి రంగారావు ప్రసంగించాడు. తన కవితా సంపుటి 'ముఖంపుల్ల' ఆ రికార్డింగ్‌కు వచ్చినప్పుడు నాకు ఇచ్చాడు.


శ్రీ రావి రంగారావు

డా.భోగరాజు పట్టాభి సీతారామయ్య ఆంధ్రాబ్యాంక్ వ్యవస్థాపకులు కూడాను. ఆయన 112వ జయంతిని పురస్కరించుకుని జయంతికి ముందురోజు 23.11.1992 రాత్రి ఆయన బహుముఖీన వ్యక్తిత్వం గురించి అప్పుడు త్రివేణి పత్రిక సంపాదకులుగా ఉన్న డా.భావరాజు నరసింహారావుగారిని పిలవగా ఆయన వచ్చి చక్కటి ప్రసంగం చేసారు. ఆ నెల్లోనే సరిగ్గా నా పుట్టినరోజునాడు 25.11.92 రాత్రి "రంగులు - భావాలు" అనే అంశం మీద మరోమారు శ్రీ సంజీవ్ దేవ్‌గారి ప్రసంగాన్ని రికార్డు చేసి ప్రసారం చేసే అవకాశం కలిగింది. 29.11.92న కొవ్వూరు గౌతమీ నగర్ వాస్తవ్యులు శ్రీ బులుసు వెంకట సత్యనారాయణ మూర్తిగారు కన్నడ వడ్డారాధనేకి ఆధారమైన జైన జానపద కథల గురించి ఒక వైవిధ్యభరిత ప్రసంగం చేశారు.

కవితాఝరి కార్యక్రమంలో ఆ నెల (6.11.92) శ్రీమతి కొండపల్లి కోటేశ్వరమ్మగారి కవితలు ప్రసారం చేసాం. ఇటీవలే ఆవిడ 'నిర్జన వారధి' పేరిట ఆమె ఆత్మ కథను వెలువరించారు. నక్సలైట్ నాయకుడు కొండపల్లి సీతారామయ్య జీవన సహచరిగానే కాక స్వయంగా సాహిత్యాభిలాష గల వ్యక్తి ఆమె అని అందరికీ తెలుసు. ఆవిడతో బాటు నాటి కవితాఝరిలో శ్రీ ఆవంత్స సోమసుందర్ కుమారుడు అప్పట్లో విజయవాడలో బాలజ్యోతి పత్రికకు సంపాదకత్వం వహిస్తున్న శ్రీ శశికాంత్ శాతకర్ణి తన కవితలు వినిపించాడు.

డా.జి. సమరంగారు, శ్రీ టి.ఎన్.రావుగారితో



నవంబర్ నెల రెండో తేదీ 'టెలిఫోన్ ముఖాముఖి' కార్యక్రమంలో మాదక పదార్థాల వ్యసనం నుండి యువత దూరంగా ఉండాలనే ఆకాంక్షతో డి. ఆడిక్షన్ సమస్యల మీద శ్రోతలతో వారి సందేహాలను తీర్చే కార్యక్రమం ప్రసారం చేయడం జరిగింది. డా.జి. సమరంగారి గురించి వేరే చెప్పాలా? ఆయన ప్రాక్టీసుకన్నా పత్రికల్లో రాతల ద్వారానే పాఠకులకు, అశేష జనావళికి పరిచితులు అనవచ్చునేమో! వాసవ్య నర్సింగ్ హోమ్ ఆయన నిర్వహణలో విజయవాడలో ఉంది. ఆ రోజు కార్యక్రమంలో ఆయనతోబాటు శ్రోతల సందేహాలకు సమాధానాలిచ్చేందుకు ప్రముఖ హిప్నటిస్టు శ్రీ టి.ఎన్.రావుగారిని ఆహ్వానించాం. అదొక విలక్షణ కార్యక్రమంగా రాణించింది. డిసెంబర్ టెలిఫోన్ ముఖాముఖి కూడా అనుకోకుండా వైద్యసంబంధిత కార్యక్రమంగానే మెదడు, నరాలు, వెన్నెముక సంబంధిత సమస్యల గురించి న్యూరాలజీ డాక్టర్లు బి.సుబ్బారావు, ఎస్.రంగారావు గార్లతో చేసాం. అయితే అది లైవ్ కార్యక్రమంగా ప్రసారం చేయడానికి డిసెంబర్ 7, 1992 రాత్రి 9.30 కు ప్రధాని పి.వి.నరసింహారావు జాతినుద్దేశించి చేసే ప్రసంగం ఉండడంతో ముందు రోజు రికార్డు చేసి ప్రసారం చేయవలసి వచ్చింది.

సిద్దార్థ కళాశాల లెక్చరర్ శ్రీ నాగళ్ళ గురుప్రసాదరావుగారు 27.11.92 రాత్రి 'గ్రంథావలోకనం' కార్యక్రమంలోశ్రీ అద్దేపల్లి రామమోహనరావు 'గోదావరి నా ప్రతిబింబం' కవితాసంకలనం, ఎండ్లూరి సుధాకర్ 'వర్తమానం' కవితా సంకలనం అలాగే శాఖమూరు అనంత పద్మనాభ ప్రసాద్ గారి పద్యకావ్యం 'పోతన హృదయం' డా.మోపిదేవి కృష్ణస్వామి రచించిన 'శ్రీ మద్భాగవతం - దివ్య జీవన మార్గం', ఫాదర్ పి.ఎఫ్.జయబాలన్ గారి 'పరమానందయ్య శిష్యుల కథల్లోని పరమార్థం' అనే పుస్తకాలపై సమీక్షా ప్రసంగం చేసారు.

డిసెంబర్ 1992 ప్రసంగాల్లో భీమవరం రామరాజభూషణ సాహిత్య పరిషత్ ప్రధాన కార్యదర్శి శ్రీ చుక్కన గంగరాజు 'వసుచరిత్రలోని వివిధ శాస్త్రాంశాల' గురించి సవివరణాత్మక ప్రసంగం చేశారు(2.12.92). అలాగే 'భారతంలో యక్షప్రశ్నలు' గురించి చీమకుర్తికి చెందిన శ్రీ స్వయంపాకుల ఎలమందల కోటేశ్వర శర్మ (6.12.92)గారు ప్రసంగించారు.

మచిలీపట్నం ప్రాతికేయులు, హిందూ పత్రిక జర్నలిస్టు అయిన ఎస్.ఎస్.కృష్ణాజీ 'నిరతాన్నదాత్రి డొక్కా సీతమ్మ' గురించి మంచి సమాచారం సేకరించి చక్కటి ప్రసంగం అందించారు (9.12.92). డిసెంబర్ 27 ఆదివారం రాత్రి మొత్తం 1992లో వచ్చిన తెలుగు కవిత్వం మీద సమీక్షాత్మ ప్రసంగాన్ని చేయమని కోరగా, ప్రముఖ విమర్శకులు డా.కడియాల రామమోహన్ రాయ్ ఆ ప్రసంగం చేసారు.

విజయవాడ ఆకాశవాణిలో కార్యక్రమ నిర్వహణాధికారిగా డిసెంబర్ 1992కు ఏడాదిన్నర కాలం గడిచింది. ఈ పద్దెనిమిది నెలలకాలంలోనూ ముఖ్యంగా స్టేషన్ డైరెక్టర్ కులకర్ణిగారి ఆధ్వర్యంలో ఒక సిస్టమాటిక్ వర్క్ కల్చర్ అలవాటయ్యిందనే చెప్పాలి. అలాగే కొన్ని ఆటుపోట్లను తట్టుకుని, అస్తిత్వాన్ని నిలబెట్టుకుంటూ, ఆయన ఆదరానికి పాత్రం కాగలగడమూ జరిగింది. ఆ తరువాత విజయవాడ కేంద్రంలోని ప్రతి ఒక్కరూ కూడా సమష్టి కృషికి సహకరించేవారు కావడం ఒక గుణాత్మకమైన విషయం. ఎవరికి వారు నిష్ణాతులు, ప్రత్యేక వ్యక్తిత్వాలు కలవారే అయినా ఒక కార్యక్రమం రూపకల్పన చేసినప్పుడు ఆ రోజుల్లో అందరూ బాగా సహకరించేవారు. ఏ కార్యక్రమం అనుకున్నా దానికి తగిన కళాకారులు చక్కగా సమయానికి అందుబాటులో ఉండే సౌలభ్యం ఎక్కువగా ఉన్నది విజయవాడ కేంద్రం అని గ్రహించాను.

1993 ఫిబ్రవరి ప్రాంతంలో అనుకుంటా కులకర్ణిగారికి ట్రాన్స్‌ఫర్ అయిపోయింది. A.S.Dగా ఉన్న శబరినాథన్ గారు వెళ్లిపోయాక డాక్టర్. పి.ఎస్.గోపాలకృష్ణగారే అసిస్టెంట్ స్టేషన్ డైరెక్టర్‌గా ఉన్నారు. ఆయన గొప్ప సాహితీవేత్త అనీ కొన్నాళ్ళు కేంద్ర

సాహిత్య అకాడమీకి కార్యదర్శిగా కూడా చేసారనీ ముందే చెప్పాననుకుంటాగా. అప్పట్లోనే ఆయన ఘంటసాల గురించి ఓ పుస్తకం రాయడం ప్రారంభించారు. మొదటి చాప్టరు కొంత నా రాతలో శుద్ధప్రతి రాసినట్లు కూడా గుర్తు. ఘంటసాలతో చాలా సన్నిహితంగా మెలిగినవారు ఆయన. అనేక విషయాలు తెలుసు. " పుస్తకం త్వరగా పూర్తిచేయండి సార్" అంటూడేవాడిని నేను. కులకర్ణిగారి తరువాత డైరెక్టర్‌గా శ్రీమతి దుర్గా భాస్కర్ మద్రాసు నుండి వచ్చారు. గోపాలకృష్ణగారు, దుర్గాభాస్కర్‌గారు మద్రాసు ఆకాశవాణిలో పనిచేసారు, కార్యక్రమ నిర్వహణాధికారులుగా. దుర్గాభాస్కర్‌గారు హైదరాబాద్ ఆకాశవాణిలో ముందు డ్యూటీ ఆఫీసర్‌గా చేరినవారే. ఆ తరువాతే కార్యక్రమ నిర్వహణాధికారిగా మద్రాసు వెళ్ళారు. ఆ తరువాత అసిస్టెంట్ డైరెక్టర్ అయ్యారు. డైరెక్టర్‌గా ఆవిడ తొలిపోస్టింగ్ విజయవాడ కేంద్రమే.






# 36

**ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో కార్యక్రమ నిర్వహణాధికారిగా** చేరిన 1991 వ సంవత్సరంలో - ఆహూతుల సమక్షంలో దీపావళి కవి సమ్మేళనం నిర్వహించిన తరువాత, మళ్ళీ 1993లో - రాష్ట్రం నలుమూలలనుండీ కవులను రావించి, 'సంక్రాంతి కవి సమ్మేళనం' నిర్వహించే అవకాశం లభించింది. కొత్త సంవత్సరం వచ్చిన వారం రోజులకే 7.1.1993 గురువారం సాయంత్రం ఆరుగంటలకు, విజయవాడ గాంధీనగర్‌లోని రోటరీ చిల్డ్రన్స్ ఆడిటోరియంలో, ఆహూతుల సమక్షంలో ఈ సంక్రాంతి కవి సమ్మేళనం నిర్వహించి, సంక్రాంతి 14 జనవరి 1993 గురువారం ఉదయం, రాష్ట్రంలోని అన్ని ఆకాశవాణి కేంద్రాలనుండీ ఆ కవి సమ్మేళనం ప్రసారం చేయడం జరిగింది. అప్పటికింకా సన్యసించని డా.ప్రసాదరాయ కులపతిగారు, తాడేపల్లి గూడెం నుండి మాన్నాప్రగడ వెంకట సుబ్బరాయకవి, గుంటూరు నుంచి డా. పాపినేని శివ శంకర్, అప్పట్లో ఆంధ్రభూమిలో పనిచేస్తున్న యువకవి బి.ప్రసేన్, ఆంధ్రజ్యోతి దినపత్రికలో సబ్ ఎడిటర్‌గా ఉన్న కవయిత్రి శ్రీమతి ఘంటసాల నిర్మల కవి సమ్మేళనంలో విజయవాడ కేంద్రం పక్షాన నాచే ఆహ్వానింపబడగా, హైదరాబాదు నుండి శ్రీ దేవులపల్లి వెంకట ప్రభాకర రావు, విశాఖపట్నం నుండి శ్రీ ఆదిభట్ల రామప్రసాద్, కడప నుండి శశిశ్రీ కొత్తగూడెం నుండి జె. సత్యనారాయణ, వరంగల్ నుండి డా. ఐ. కిషన్‌రావ్, నిజామాబాద్ నుండి శ్రీ మేడిచర్ల ప్రభాకరరావు, అనంతపురం నుండి డా.పమిడి కాల్వ చెంచు సుబ్బయ్య, తిరుపతి నుండి శ్రీ వేంపల్లి అబ్దుల్ ఖాదర్, ఆదిలాబాద్ నుండి శ్రీ బి. పురుషోత్తమరావు ప్రాతినిధ్య కవులుగా పాల్గొన్నారు. ప్రసేన్, అబ్దుల్ ఖాదర్ అనంతర కాలంలో మంచి కవులుగా స్థిరపడ్డారు. ఆధునికులలో పాపినేని, శశిశ్రీ, ఘంటసాల నిర్మల అప్పటికే మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.


డా. పాపినేని శివ శంకర్


బి.ప్రసేన్



శశిశ్రీ

నేను హైదరాబాద్‌లో డ్యూటీ ఆఫీసర్‌గా ఉండగా ఒకసారి ఆచార్య రవ్వా శ్రీహరిగారు సంస్కృతంలో హాస్యం గురించి చేసిన ప్రసంగం రికార్డు చేయడం జరిగింది. సంస్కృత సాహిత్యంలోని హాస్యం పట్ల నాకు ప్రత్యేకమైన ఆసక్తి కలిగింది. అందుకే కార్యక్రమ నిర్వహణాధికారిని అయ్యాక - వేటపాలెంకు చెందిన ప్రముఖ పండితులు డా సూరం శ్రీనివాసులు గారిని - ఆ విషయంపై ప్రసంగానికి ఆహ్వానించడం జరిగింది. 3.1.93 ఆదివారం రాత్రి "సంస్కృత సాహిత్యంలో హాస్యం" గురించిన ఆయన ప్రసంగం ప్రసారమైంది. సంక్రాంతి రోజులు కనుక 6.1.93న 'ధనుర్మాస ప్రాశస్త్యం" గురించి - కంకిపాడుకు చెందిన శ్రీ నందిరాజు దుర్గాప్రసాద్ ప్రసంగం, కావలిలో నివసిస్తూండిన శ్రీ ధూర్జటి వెంకట బాలాజీగారి ప్రసంగం "ఆధునిక క్షేత్ర కావ్యాలు" (10.1.1993), సైక్రియాటిస్ట్ డా.అయోధ్యగారు "కలలు - వాటి కథలు" గురించి చేసిన ప్రసంగం (13.1.93), శ్రీ దర్భా నరసింహ శర్మ గారిచే "శ్రీనాథుని చాటు పద్య రమ్యత" ప్రసంగం(17.1.93), నెల్లూరు సర్వోదయ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ కాళిదాసు పురుషోత్తంగారిచే - 'జాతీయోద్యమంలో తెలుగు పత్రికల సేవ" ప్రసంగం (24.1.93), బాపట్లలోని ప్రముఖ కథారచయిత శ్రీ పోలాప్రగడ సత్యనారాయణ మూర్తిగారిచే "తెలుగు కథ - మాండలికాలు" ప్రసంగం (31.1.93), ఆ జనవరి నెలలో ప్రసారమైన ప్రసంగాలు. అలాగే ఆనెల బుధవారాల్లో - "భావితరం విద్యకు బంగారు నగిషీలు' అనే పరంపరలో, గుంటూరు శ్రీ పి.వి.కె శ్రీనివాసరావు గారిచే 'ప్రాథమిక విద్యలక్ష్యాలు - విజయాలు' అనే అంశంపైనా, ఉద్యోగ పర్వం పత్రికా సంపాదకులూ, కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిటైర్డ్ రీజనల్ డైరెక్టర్ శ్రీ అన్నా ప్రగడ లక్ష్మీ నారాయణ గారిచే 'ఉపాధినిచ్చే విద్యావిధానం' అనే అంశంపై ప్రసంగం, వీర్లపాడుకు చెందిన - శ్రీ మల్లెల సూర్యనారాయణ గారిచే 'జాతీయ సమైక్యత పునాదులుగా విద్యాలయాలు' అనే అంశంపై ప్రసంగం ప్రసారం చేయడమైంది.

టి.టి.డి దేవస్థానం ఉద్యోగి అయిన శ్రీ పి. రత్నాజీరావు మైనం బొమ్మలతో సృష్టించిన అద్భుతాలు చూసి, ఎక్కడో లండన్ మేడమ్ టుస్సాడ్ మ్యూజియంలోనే కాదు, మనవాళ్ళల్లోనూ అలాంటి కళాఖండాలు సృష్టించగలవారున్నారని సంతోషించి, ''మైనం బొమ్మలనుండి మహాసౌధం వరకు'' అనే అంశంపై - ఆయనతో పరిచయ కార్యక్రమం రూపొందించి ప్రసారం చేసాను. అప్పట్లో ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్ (కో ఆర్డినేటర్)గా ఉన్న శ్రీమతి ప్రయాగ వేదవతి గారు ఇంటర్వ్యూ చేసి పెట్టారు. (27.1.93న ప్రసారమైంది)

1993 కొత్త సంవత్సరం ప్రారంభదినమైన జనవరి శుక్రవారం కావడం, ఆ రోజు తెలుగు టాక్స్ ఛెంక్ ఉండడం వలన, కవిత్వం పై గల సహజాసక్తితో - ఆ రోజు శ్రీ రసరాజు, శ్రీ అఫ్సర్‌ల కవితలు ప్రసారం చేసి నూతన సంవత్సర కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నమాట! ఆ నెల వినియోగదారుల కార్యక్రమాలను విజయవాడ కన్స్యూమర్స్ అసోసియేషన్ ట్రస్టీ శ్రీ నెల్లూరి సత్యనారాయణ (4.1.93), కంచికచర్ల కన్స్యూమర్ వెల్ఫేర్ కౌన్సిల్ ప్రెసిడెంట్ శ్రీ బి.టి.వి.ఎస్.ఎల్ కాంతారావు (ప్రజా పంపిణీ వ్యవస్థలో వినియోగదారుల పాత్ర గురించి 11.1.93న), గుంటూరు కన్స్యూమర్ వెల్ఫేర్ కౌన్సిల్ కార్యవర్గ సభ్యులు శ్రీ చదలవాడ హరిబాబు (18.1.93) సమర్పించారు. ఆ నెల టెలిఫోన్ ముఖానికిని హృద్రోగ నిపుణులు డా.కె. జాన్ సతీష్ (యూనివర్సిటీ జనరల్ హాస్పటల్), డా. పి. రమేష్ బాబు ( సిటీ కార్డియాక్ సెంటర్, విజయవాడ) గార్లతో రూపొందించి (4.1.93) శ్రోతల సందేహాలకు సమాధానాలు ఇప్పించాం.



శ్రీ రసరాజు

అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర సంఘటనల వారం వారం సమీక్షా కార్యక్రమం 'నడుస్తున్న చరిత్ర'ను - ఉదయం సబ్ ఎడిటర్ శ్రీ ఎన్.డి.రాజు (2.1.93), ఆంధ్రప్రభ సబ్ ఎడిటర్ ఎ.జగన్నాథస్వామి (9.1.93), ప్రజాశక్తి కరస్పాండెంట్ శ్రీఎం.కోటేశ్వరరావు (16.1.93), గుంటూర్ ఎక్స్‌ప్రెస్ సంపాదకులు శ్రీ సి.హెచ్.ప్రసాద్ (23.1.93), ది హిందూ కరస్పాండెంట్ శ్రీ ఎస్.ప్రభాకరరావు (30.1.93) ఆ జనవరి నెలలో సమర్పించారు.

కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారి కుమారుడు విశ్వనాథ పావని శాస్త్రి. తండ్రి గ్రంథ ప్రచురణలపై హక్కులు కూడా తనకే ఉండేవి. పావని శాస్త్రి మంచి మిత్రుడుగా ఉండేవాడు. తను కూడా సాహిత్య సృజన చేసినవాడే! ఫిబ్రవరి'1993లో పావనిశాస్త్రి 'గ్రంథావలోకనం' కార్యక్రమం నేను 'పెక్స్'గా ఉండగా మొదటిసారి ఇచ్చాడు (26.2.1993). శ్రీవావిలాల సుబ్బారావుగారి గ్రంథం



డా. వెలగా వెంకటప్పయ్యగారు



నవోదయరామమోహనరావుగా

'సుప్తాల్లేఖ', ఉషశ్రీగారి 'రామాయణంలో హనుమంతుడు', శ్రీ దయానంద్ హిందీ తెలుగు సంకలనంగా తెచ్చిన 'భక్త కబీర్ సుభాషితాలు', శ్రీ పోలవరపు కోటేశ్వరరావుగారి కథా సంకలనం 'కృష్ణా తరంగాలు' పుస్తకాలను 'పావని' - ఆనాటి కార్యక్రమంలో చక్కని గ్రంథ సమీక్ష చేసాడు.

ప్రతినెలా జనవరిలో విజయవాడలో పుస్తక మహోత్సవం జరగడం పరిపాటి. పుస్తకపఠనాసక్తి మందగిస్తోందన్న ఆర్తి అప్పటికే ఉంది. ఆ సందర్భంగానే - 18.1.1993 రాత్రి "పుస్తకాలికపై హస్తభూషణాలేనా" అనే అంశంపై ఒక చర్చాకార్యక్రమాన్ని రూపొందించి ప్రసారం చేసాను. డా. వెలగా వెంకటప్పయ్యగారు, నవోదయ ప్రచురణల ఎ.రామమోహనరావుగారు, పోరంకిలో లైబ్రేరియన్‌గా ఉండిన శ్రీమతి ప్రజారాజ్యం, విజయవాడ అశోక్ బుక్ హౌస్ శ్రీ డి అశోక్ కుమార్ గారలు ఆ చర్చలో పాల్గొన్నారు.

రాష్ట్ర సాంస్కృతిక భాషా వ్యవహారాల ప్రత్యేక సలహాదారుగా అప్పట్లో నియమితులైన డా.సి.నారాయణ రెడ్డిగారు ఆ హోదాలో విజయవాడకు రాగా, ఆయనను స్టూడియోకి ఆహ్వానించి, ఒక పరిచయ కార్యక్రమం రికార్డు చేసి, 15.2.93 రాత్రి 9.30కు ఓ అరగంట పాటు ప్రసారం చేసే అవకాశం లభించింది. అప్పట్లో మాకు అసిస్టెంట్ స్టేషన్ డైరెక్టర్‌గా ఉన్న డా.పి.ఎస్.గోపాలకృష్ణగారే ఆయనను ఇంటర్వ్యూ చేసారు. అలా ఆయనను పిలిచి రికార్డు చేయడం, ఆయనకు కూడా ఆనందం కలిగించింది. ఫిబ్రవరి'93లో ప్రసారమైన మంచి కార్యక్రమాల్లో అదొకటి.

సరే! ఫిబ్రవరిలో ప్రసారమైన ఇతర ప్రసంగ కార్యక్రమాల విషయానికి వస్తే - 'న్యాయం - చట్టం' అనే ప్రసంగ పరంపరలో ప్రముఖ న్యాయవాది శ్రీ టి.వి పురుషోత్తమరావు గారిచే 'చట్టం దృష్టిలో నేరం' అనే అంశంపై (3.2.93), 'ముద్దాయిల నిర్భంధం - పూచీకత్తులు', అనే అంశంపై మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి శ్రీ ఎస్. చంద్రారావు (10.2.93), 'తెలుసుండాలి న్యాయ పరిభాష' అనే అంశంపై న్యాయవాది శ్రీ జి.రంగనాయకులు (17.2.93)గార్ల ప్రసంగాలు ప్రసారమయ్యాయి. శ్రీ కొండముది హనుమంతరావుగారు కథా రచయితగానే కాదు, మంచి సైన్స్ రచయితగా కూడా ప్రముఖులు. 'సైన్సు రచనలు - పత్రికలు' - అనే అంశంపై 12.2.93 న ఆయన ప్రసంగించారు. శ్రీ ఆర్.వి రామారావు గారు 'శ్రీపాద వారి చిన్న కథలు' గురించి 1.2.93 న ప్రసంగించగా, 'శతక రచనల్లో వైవిధ్యం' గురించి నరసాపురంకు చెందిన శ్రీ చిలకమర్తి సుబ్రహ్మణ్య శాస్త్రి గారు ప్రసంగించారు. 'మృదుభావ రచనా శిల్పి ఆచంట జానకీ రాం' గారిపై శ్రీమతి. కావూరి సత్యవతి (21.2.93), 'పరిపూర్ణుడైన భర్త కాగల కళ' అనే అంశంపై శ్రీ అట్లూరి వెంకటేశ్వరరావు (24.2.93) ప్రసంగించారు. ఫిబ్రవరి నెల అనగానే ప్రతి ఏటా రైల్వే బడ్జెట్, సాధారణ బడ్జెట్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టబడడం మామూలే. అనివార్యంగా

వాటి ప్రవేశానికి ముందే జనావళి ఊహాపోహల కద్దం పట్టే ప్రసంగాలు ప్రసారం చేయడమూ మామూలే! ఆ ఏడాది నాగార్జున విశ్వవిద్యాలయం ఎకనమిక్స్ శాఖాధిపతి ఎన్.సుధాకరరావు గారితో రైల్వే బడ్జెట్ పరిశీలన (25.2.93), 27.2.93న కేంద్ర బడ్జెట్ పై సి.తాండవ కృష్ణ, గడ్డం సుబ్బారావు, శ్రీ ఎం.సి.దాసుగార్లతో చర్చ ప్రసారం చేయడం జరిగింది.

డా.సి.నారాయణ రెడ్డిగారికి ప్రియశిష్యుడూ, స్వయంగా కవీ, పరిశోధకుడూ అయిన డా.ఎన్ గోపి అప్పట్లో ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు విభాగాధిపతిగా పనిచేస్తూ, బహుశా నారాయణ రెడ్డిగారి వెంట విజయవాడ పర్యటనకు వచ్చినప్పుడే అనుకుంటా - ఆయనతోను ఓ పరిచయ కార్యక్రమం రూపొందించి, 7.2.93 రాత్రి ప్రసారం చేసాను. అయితే గోపిని ఇంటర్వ్యూ చేయడానికి అప్పుడు 'అఫ్సర్'ను ఆహ్వానించడం జరిగింది. 'జీవితానికి పూసిన పువ్వు - కవిత్వం'అనే శీర్షికన ఆ పరిచయ కార్యక్రమం ప్రసారం చేయడం అభినందన పాత్రమైంది.



డా.ఎన్ గోపి

ఇన్‌కమ్ టాక్స్ ఆఫీసర్ శ్రీ డి.ఎ.నరసింహారావు గారిని "చిన్న వ్యాపారస్తులు, స్వయం ఉపాధిపరులకు సరళమైన ఆదాయ పన్ను విధానం" అనే అంశం మీద విజయవాడ బ్రహ్మయ్య అండ్ కంపెనీకి చెందిన టాక్సేషన్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీ సి.వి.కె ప్రసాద్ గారితో ఇంటర్వ్యూ చేయించడం (19.2.93) జరిగింది. అప్పట్లో హర్తాళ్, బంద్ ఏదో జరిగింది. సరిగా గుర్తు లేదు గానీ, పై అధికారుల ఆదేశంతో - 'నిరసనలు - పౌరజీవనం' అనే అంశంపై 24.2.93 మధ్యాహ్నం మూడింటికి ఒక ప్రత్యేక జనాభిప్రాయ సేకరణ కార్యక్రమం రూపొందించి, ప్రసారం చేయడం గుర్తుంది. టేప్ రికార్డర్ తీసుకుని ఊరిమీదపడి రికార్డు చేసుకు వచ్చి o.b ప్రోగ్రాంగా అది ప్రసారం చేసాను. ట్రేడ్ యూనియన్ లీడర్ శ్రీ జోస్యభట్ల సత్యనారాయణగారు, ఉదయంలో అప్పట్లో పనిచేస్తున్న శ్రీమతి సి.సుజాత, విద్యార్థిని - కాశీనాధుని అపర్ణ ప్రభృతులను ఆ కార్యక్రమంలో వారి అభిప్రాయాలు అభివ్యక్తీకరింప చేయడం జరిగింది.



సి.నారాయణరెడ్డిగారు విజయవాడ ఆకాశవాణిని సందర్శించినప్పుడు

ప్రసంగ కర్తల, కళాకారుల పారితోషికాలను ఆకాశవాణి అప్పట్లో పెంపు చేసింది. కవికి మూడు వందల యాభై రూపాయలు పారితోషికం అయ్యాక - 1993 ఫిబ్రవరిలో కవితలు వినిపించిన కవులు డా.పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, శ్రీ నిశాపతి (ఎం.హెచ్.వి.సుబ్బారావు) గార్లని గుర్తు. అలాగే మద్రాసు నుంచి విజిటింగ్ ఆర్టిస్ట్‌గా విచ్చేసిన శ్రీ ఎన్.సి.రామానుజాచార్య ప్రముఖ కథకులు 'శ్రీ విరించి'గారి కథానిక 'అడగని అందం' (28.2.93న) ప్రసారమైంది. విశేషం ఏమిటంటే 1993 నుండి, 1995లో నేను తిరిగి హైదరాబాద్ బదిలీపై వచ్చేవరకూ నెలకోమారు నేను ప్రసారం చేసిన కథలన్నీ కూడా విజిటింగ్ ఆర్టిస్ట్‌ల కథలే! ప్రముఖ కథకులు విజయవాడ సందర్శించినప్పుడు అందుకే ఆకాశవాణి కేంద్రానికి వచ్చి కలుస్తూండేవారు.



శ్రీ విరించి

అలా మంచి కథలను శ్రోతలకు వినిపించడం జరిగింది.

సాధారణంగా ఎవరూ అంతగా పట్టించుకోని తూనికలు కొలతల శాఖ వారిని 'టెలిఫోన్ ముఖాముఖి' కార్యక్రమానికై ఆహ్వానించినప్పుడు వారే ఆశ్చర్యపోయారు. వినియోగదారులు తూనికలు కొలతల్లో ఎదుర్కొనే మోసాల గురించీ, వహించవలసిన జాగ్రత్తల గురించీ - 1.2.93 రాత్రి "టెలిఫోన్ ముఖాముఖి"లో శ్రోతల సందేహాలకు డిపార్ట్ మెంట్ ఆఫ్ లీగల్ మెట్రాలజీ వెయిట్స్&మెజర్స్ అసిస్టెంట్ కంట్రోలర్ శ్రీ జి.రంగారావు, సీనియర్ ఇనస్పెక్టర్ శ్రీ కె.వి.బి.శాస్త్రి గార్లతో సమాధానాలిప్పించడం జరిగింది. ఆ కార్యక్రమానికి మంచి స్పందనే లభించింది. ఈ కార్యక్రమాలన్నీ ఓ పట్టికగా రాసిపెట్టుకోవడం వల్ల ఇప్పుడిలా రికార్డు చేయగలుగుతున్నా ఆ వివరాలు సుమండీ!



నారాయణరెడ్డిగారిని ఇంటర్వ్యూ చేస్తూ



# 37

**ఆకాశవాణిలో డిప్యూటీ డైరెక్టర్** జనరల్ హోదాలో పనిచేస్తున్న వారు ఒకసారి విమానంలో ప్రయాణిస్తుంటే, పక్కన కూర్చున్నతను "మీరేం చేస్తూంటారు?' అని అడిగాడుట. ఈయన 'రేడియోలో డి.డి.జి'ని అని చెప్పారట. అతగాడు వెంటనే "మీకు అనౌన్సర్‌గా ప్రమోషన్ రావడానికి ఎంతకాలం పడుతుంది" అని అడిగాడట. డి.డి.జి అనేది అత్యన్నత స్థాయి ఉద్యోగం. కానీ అడిగినతను భావించినట్లుగా లక్షలాది శ్రోతలకు ఆ విషయం తెలియకపోవచ్చు. ఎందుకంటే వారు నిత్యం రేడియోలో వినేది 'అనౌన్సర్' గొంతునే కదా! ఆ స్వరాలతోనే వారికి పరిమితి. ఆ స్వరసుధాకరులతోనే వారికెక్కువ భావాత్మక అనుబంధం. నిజానికి అనౌన్సర్లు కొందరు 'అనవసర్లు'గా అనిపించికున్నవారూ ఉండచ్చు. కార్యక్రమానికి ముందూవెనుకా ఆ కార్యక్రమ విశేషాలు, వివరాలు రాసుకునో, కార్యక్రమ నిర్వహణాధికారి కార్యక్రమం టేప్ క్యూషీట్‌లో రాసేనో చిలకపలుకుల్లో వల్లించి కేవలం డ్యూటీగా చేసుకు వెళ్ళిపోయేవారుంటారు.

విజయవాడ రేడియో కేంద్రంలో పనిచేసిన అనౌన్సర్లతో అధికశాతం అలాంటివారు కాదు సరికదా అపారమైన ప్రజ్ఞాపాటవాలు గలవారుండేవారు. వారిలో నటులు, గాయకులు, సాహితీ పరులు, సృజన శీలురు ఎందరో. షిఫ్ట్ డ్యూటీల్లో వచ్చి ప్రోగ్రాం అనౌన్స్ మెంట్లు ఇచ్చిపోవడం కాక కార్యక్రమాలతో మమేకమైన వారుండేవారు. వారు అలాంటి ప్రతిభావంతులు కనుక వారిని కూడా కార్యక్రమాలలో భాగస్వాములు చేయాలనే తలంపు అందరు అధికారులకూ ఉండేదని చెప్పలేను కానీ వారిని అలా సమాదరంగా చూసినవారున్నారు.

అలాగే శ్రీ కోకా సంజీవరావు అనౌన్సరే అయినా మంచి ప్రతిభాసంపన్నుడైన నటులు. చలనచిత్రరంగంలో అందాల హీరో అనిపించుకున్న శోభన్ బాబు, కోకా సంజీవరావు క్లాస్ మేట్స్ కూడాను. సంజీవరావు కూడా చిన్నా చితకా సినీ వేషాలు వేసారు. రంగస్థలంపై హీరోగా పలుపాత్రలు వేసారు. వేగుంట మోహన్ ప్రసాద్ చేత కథావాహినికై ధారావాహిక ప్రసారానికై షేక్స్‌ఫియర్ నాటక కథలను అనువదింపచేసినప్పుడు అవి తన కంఠంలో వినిపించి కార్యక్రమాన్ని రక్తికట్టించింది సంజీవరావే. చిత్రసీమలో విలన్ పాత్రలనూ




వెండి తెరపై సి.ఎస్సార్ తరువాత శకుని పాత్రకు జీవం పోస్తూ నటించి మెప్పించిన 'ధూళిపాళ'గారు ఆ తరువాత ఫక్తు ఆధ్యాత్మిక వేత్తగా మారిపోయాడు. మార్చి 27 ప్రపంచ రంగస్థల దినోత్సవం పురస్కరించుకుని 1993 మార్చి 26 రాత్రి ధూళిపాళ సీతారామశాస్త్రితో పరిచయ కార్యక్రమం. పరిచయకర్త శ్రీ కోకా సంజీవరావుగా ప్రసారమైంది. తన రంగస్థల అనుభవాలనెన్నింటినో ఆ కార్యక్రమంలో ధూళిపాళ తలుచుకున్నారు. దూరదర్శన్ సప్తగిరివారు గత రెండు మూడు నెలలుగా సోమవారం మధ్యాహ్నం 2.30కు 'మదిలో మాట' శీర్షికన రేడియో ప్రముఖులతో పరిచయం చేస్తున్న పరిచయ కార్యక్రమాలకు పరిచయకర్తగా నన్ను ఎన్నుకోవడం సంతోషం కలిగించిన సంగతి. గత నవంబర్‌లో శ్రీ కోకా సంజీవరావు గారితో 'మదిలో మాట' కార్యక్రమం దూరదర్శన్ ప్రసారం చేసింది కూడా.




మార్చిలో అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా జిల్లా స్త్రీ సంక్షేమశాఖాధికారి శ్రీమతి డి. సావిత్రీదేవితో పరిచయం వంటివి నేను చేసి నాకు ఇష్టమైన అయిన రాజనాల, ధూళిపాళ వంటి వారి పరిచయాలు ఆ అనౌన్సర్ల చేత చేయించడం శ్రోతలకై ప్రసారం చేస్తున్న కార్యక్రమాలతో ఉన్నంతలో పూర్తి న్యాయం కలిగించాలనే.

మార్చి 1993లో ప్రసంగమాలికను హాస్య ప్రసంగాల కూర్పుగా చేయడం జరిగింది. 'పాతపేరు - కొత్త తీరు" అన్న మకుటంతో శుక్రవారాల్లో మూడు హాస్య ప్రసంగాలు శ్రోతలను అలరించాయి. మార్చి నెలలోనే. రంజాన్ పండుగ, ఉగాది పండుగ వచ్చాయి ఆ ఏడాది. విశాఖపట్టణం కేంద్ర ఆహూతుల సమక్షంలో ఆ ఏటి ఉగాది కవిసమ్మేళనాన్ని కాకినాడ సూర్య కళామందిరంలో శ్రీ ఆవంత్స సోమ సుందర్ గారి సమన్వయంలో నిర్వహించి 24 వ తేదీ ఉదయం పదిగంటలకు ప్రసారం చేసింది. అద్దేపల్లి రామమోహనరావు, మాడుగుల నాగఫణి శర్మ, ఎస్. రాజన్న కవి, కొలకలూరి ఇవాన్, ఆదూరి సత్యవతీదేవి ప్రభృతులు పాల్గొన్న ఆ కవి సమ్మేళనానికి విజయవాడ ఆకాశవాణి ప్రతినిధులుగా శ్రీ ఇంద్రగంటి శ్రీకాంత శర్మ, శ్రీ శిరీష్ గారలు వెళ్ళి పాలుపంచుకున్నారు.

మార్చి పదిహేనునే విజయవాడ రోటరీ ఆడిటోరియంలో జరిగిన వినియోగదారుల రక్షణపై జిల్లా స్థాయి సెమినార్‌పై ఈనాడు సీనియర్ సబ్ ఎడిటర్, జర్నలిస్ట్ అయిన జి.కేశవరామయ్య నివేదికను ఆ మరునాడు ప్రసారం చేయడమైంది.

అటవీ దినోత్సవ నేపథ్యంలో విజయవాడ అటవీశాఖాధికారి శ్రీ కె.ఎస్.రావు గారి ప్రసంగం 'మానవుల సేవలో అడవులు' ఆదివారం మార్చి 21 రాత్రి ప్రసారమైంది.

రంజాన్ అనగానే విజయవాడలో జరిగిన ఓ ఘటన గుర్తొస్తుంది. గుంటూరు నుండి 'కాంతిరేఖలు' అనే పత్రికను జనాబ్ మీర్జా అమీర్ చందోలీ తన సంపాదకత్వంలో నిర్వహించేవారు. ముస్లిం పర్వాలు వచ్చినప్పుడు ప్రసంగించడానికి ఎంపిక చేసుకునే ప్రముఖుల్లో ఆయనా ఒకరు. ఒక్కోసారి ముందుగనే కొన్ని స్క్రిప్ట్స్ కూడా అందినప్పుడు వాటిల్లోంచి ప్రసారానికి ఎంపిక చేయడమూ జరిగేది. కానీ ప్రతిసారీ ప్రతి ముస్లిం పండగకూ ఒక్కరినే ప్రసంగించడానికి ఆహ్వానించడం కుదరదుకదా! అది నిబంధనలకు విరుద్ధం కూడాను. మీర్జా అమీర్ చందోలీగారు ఒకసారి ఒక స్క్రిప్ట్‌ను పంపుతూ తనకు అవకాశం కల్పించడం లేదంటూ ఆ స్క్రిప్ట్ వెంట అప్పట్లో కేంద్రంలో పార్లమెంట్ సభ్యునిగా ఉన్న శ్రీ లాల్ జాన్ పాషాగారి రికమండేషన్ లెటర్ కూడా జతచేసారు. ఎం.పి.గారి ఉత్తరం ప్రతిని తను స్క్రిప్ట్ పంపినా అవకాశం ఇవ్వలేదన్న ఆరోపణతో స్టేషన్ డైరెక్టర్ గారికి పంపారు. ఎం.పి నుంచి లెటర్ అనేసరికి డైరెక్టర్ నన్ను పిలిచి మీర్జా అమీర్ చందోలీగారికి రంజాన్ ప్రసంగానికి అవకాశం ఇవ్వకుండా వేరొక ముస్లిం ప్రముఖునికి ఎందుకు ఇచ్చావని అడిగారు. ఆయన

పంపిన స్క్రిప్ట్ ఏడాది క్రితం ఆయన గళంతో ఆ పర్వానికి రికార్డు చేసి ప్రసారం చేసిందేననీ అదే స్క్రిప్ట్ యథాతథంగా పంపి కొత్త కాంట్రాక్ట్‌ను పారితోషికంతో బాటు ఆశించడం సరికాదుకదా అని నేను గత ఏడాది స్క్రిప్ట్‌ను డైరెక్టర్‌గారి చూపగా యథాతథంగా అదే మళ్ళీ ప్రసారానికి సరికొత్త స్క్రిప్ట్‌లా పంపపడిందని తెలిసి ఆయనా నివ్వెరపోయారు. లాల్ జాన్ పాషాగారికి మీర్జా అమీర్ చందోలీగారిని నిరాదరిస్తున్నదేమీ లేదనీ ఆయనకీ అవకాశాలు కల్పించబడుతూనే ఉన్నాయనీ ఒకరినే ఏటేటా వరుసగా ఆహ్వానించడం ఒకే విషయంపై కుదరకపోవచ్చుననీ వివరిస్తూ లేఖ పంపడం కూడా జరిగింది. అదృష్టవశాత్తూ అలా ఆ సమస్య పరిష్కారం అయ్యింది. 1993 మార్చి 21న రంజన్ మాస ప్రాముఖ్యం గురించి విజయవాడ సిటీ కాంగ్రెస్(ఐ) మైనారటీ సెల్ కన్వీనర్ శ్రీ షేక్ మస్తాన్ గారి ప్రసంగం 24వతేదీ రాత్రి రంజాన్ ప్రార్థనల ప్రాముఖ్యం గురించి జనాబ్ మీర్జా అమీర్ చందోలీ గారి ప్రసంగమూ ఆకాశవాణి విజయవాడ కేంద్రం నుండి ప్రసారం అయ్యాయి. 'ఆధునిక కవుల వసంత వర్ణనల' గురించి అదే రోజు డా.పి.నాగమల్లేశ్వరరావు 28 వతేదీ రాత్రి 'కాళిదాసు రఘువంశ సుధ' గురించి తణుకు మండపాక శ్రీ తాడేపల్లి పతంజలి గారి సాహిత్య ప్రసంగాలు ప్రసారమయ్యాయి.

కవితాఝరి కార్యక్రమంలో (10.3.93) శ్రీ కాజ లక్ష్మీ నరసింహం, శ్రీమతి మందరపు హైమవతి పాల్గొన్నారు. హైమవతి ప్రముఖ కవయిత్రిగా పేరు గాంచి అనంతరం కాలంలో ఆకాశవాణి జాతీయ కవి సమ్మేళనంలో కూడా పాల్గొన్నారు. 1993 నాటికి ఆవిడ ఇంకా వర్ధిష్ణు కవయిత్రిగానే పేరు తెచ్చుకుంటూ ఉన్నారు. ఆ నెల టెలిఫోన్ ముఖాముఖి కార్యక్రమం (73.93) నేత్ర సమస్యల గురించి డా.వెలగపూడి సాంబశివరావు, బి.సుబ్బారావు గార్లతో రూపొందించి శ్రోతల సందేహాలకు వెనువెంటనే సమాధానాలు ప్రసారం చేయడం జరిగింది. సార్క్ సమావేశాల ప్రత్యేక ప్రసారం పార్లమెంట్ ప్రశ్న సమయం ప్రసారం కారనంగా ఆ నెల మార్చి 15న వెళ్ళవలసిన చర్చా కార్యక్రమం ఛెంక్ రద్దయ్యింది.

మార్చి నెల అంతర్జాతీయ మహిళా దినోత్సవం, మహిళా వారోత్సవం పాటింపబడే మాసం కనుక ఆ నెల సరస వినోదిని నిర్వహణ స్త్రీ విదుషీమణులిద్దరిచే నిర్వహింపచేయడం ఓ ప్రత్యేకం అనే శ్రోతలు మెచ్చారు. 'పతి జూచిన పడతి గుండెభగ్గున మండెన్' అనే సమస్య శ్రీమతి. పి. భానుమతిగారిచ్చి పూరణలు రావింప చేయగా 18, 25 తేదీల్లో సరస వినోదిని నిర్వహించిన శ్రీమతి జి. గిరిజాకుమారి గారు 'శ్రీముఖ నామ సంవత్సరము శీఘ్రమె కూర్చుగాక శ్రేయముల్' అనే సమస్యను, కొంటె - మింటె - వింటె - దింటె అనే పదాలతో 'దత్తపది'ని ఇచ్చి సమస్యా పూరణలు రావించి ప్రసారం చేసారు.


చావా సుధారాణి

వినియోగ దర్శిని కార్యక్రమంలో 'వినియోగదారుల ఉద్యమంలో మహిళల పాత్ర' గురించి రాష్ట్ర కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్, విజయవాడ సభ్యురాలయిన కుమారి. చావా సుధారాణి గారి ప్రసంగం (8.3.93) మంగళగిరి కన్స్యూమర్ కౌన్సిల్ ప్రెసిడెంట్ శ్రీ ఎం. గోవర్ధనరావుగారిచే వినియోగదారుల వార్తా కదంబం (15.3.93) ప్రసారమయ్యాయి. నెలనెలా వినియోగదారుల విజయవార్తలతో రూపొందిస్తూండిన ఆ వార్తా కదంబం అంశాలు ఎందరికో స్ఫూర్తిదాయకంగా ఉండేవి. వినియోగదారుల ఉద్యమానికి విజయవాడ ఆకాశవాణి వినియోగ దర్శిని కార్యక్రమాలు శ్రోతలలో చైతన్యవంతాలుగా ఉన్నాయని అప్పట్లో జిల్లా కన్స్యూమర్ కోర్టు న్యాయధిపతి పేర్కొనడం మరచిపోలేని సంగతి.




# 38

**ఆటు పోట్లనేవి జీవితంలో సహజం.** పరిస్థితులు ఎప్పుడూ సజావుగానూ, సానుకూలంగానూ సాగిపోతూ ఉండవు. ఉద్యోగ జీవితమూ అంతే! వ్యక్తిగత జీవితంలో ఉద్యోగ జీవితం పాత్ర ఎక్కువే! ఉద్యోగ జీవితం బాగుంటే వ్యక్తిగత జీవితం బాగుంటుందనుకోలేం! ఎటొచ్చీ ఇంట్లోనూ బాగుండక ఆఫీసులోనూ బాగుండకపోతే తట్టుకోవడం కష్టం. విజయవాడ ఆకాశవాణిలో నేనూ, నా శ్రీమతి ఉషారాణి కార్యక్రమ నిర్వహణాధికారులుగా పనిచేసిన నాలుగేండ్ల కాలంలోనూ ఆఫీసులో పని విషయంలో ఇబ్బందేమీ లేకపోయేది. కానీ ఉష ఆరోగ్యమే ఇబ్బంది పెడుతూండేది. తన ఆయాసం రాత్రిళ్ళు నిద్రలేని స్థితిని ఎన్నోసార్లు కల్పించింది. పొద్దున్న ఆఫీసు పనులకు మాత్రం తను ఎంతో ఉషారుగా పనిచేసేది. నిన్న రాత్రి ఇబ్బందిపడింది తనేనా అన్నట్లుండేది. ఉద్యోగ జీవితం ఇద్దరికీ ఎంత బాగున్నా వ్యక్తిగత జీవితంలో ఈ అనారోగ్యం, కొన్ని విషాదాలు విజయవాడ రోజుల్లో తప్పలేదు. రెండు సార్లు అబార్షను జరిగి 92 సెప్టెంబర్‌లో ఉషకు హిస్టెక్టమీ ఆపరేషన్ జరిగి ఆడపిల్ల కావాలనే సరదాకు పులిస్టాప్ పడింది. లబ్బీపేట పైడయ్య వీధిలోని అద్దె ఇంట్లోంచి 1993 ఫిబ్రవరి 19న రేడియో స్టేషన్‌కు ఎదురుగానే పున్నమ్మ తోట సాగర్ అపార్ట్‌మెంట్స్‌లోకి ఇల్లు మారడంతో ఆఫీసుకు కూతవేటు దూరంలో రోడ్డు దాటితే ఇల్లు అన్నంత సమీపంగా వచ్చేసాం. మా అబ్బాయి స్నేహిత్ స్కూల్‌కు కూడా నడిచి వెళ్ళగలిగే వీలువచ్చింది. దాంతో ఆఫీసులో ఉద్యోగ బాధ్యతలు ఎన్ని అదనంగా వచ్చినా చేయడానికి దూరాభారం అనేది లేక సమయం మరింతగా వెచ్చించగల వీలు లభించింది. విజయవాడలో చేరిన ఏడాదికే 1992లో ఏప్రెల్లో ఉష పెద్దక్క రాధామోహన్ మద్రాస్‌లో మరణించడం, సెప్టెంబర్‌లో ఉషకు ఆపరేషను జరగడం చేదు జ్ఞాపకాలే. 1993లో శ్రీమతి దుర్గాభాస్కర్ స్టేషన్ డైరెక్టర్‌గా వచ్చాక పబ్లిసిటీ విభాగం అనేది ఏర్పరచి దానికి నన్ను కార్యక్రమనిర్వహణాధికారిని చేసారు. సెప్టెంబర్ 25‘ 1993న పున్నమ్మ తోట సాగర్ అపార్ట్‌మెంట్స్‌లోని ఇంట్లో మొదటిసారిగా ఆఫీస్ ఫోన్ అనే సౌకర్యం కల్పించబడింది. పబ్లిసిటీ సెల్ ఇన్ ఛార్జిని కనుక రోజూ అన్ని దినపత్రికలూ నా దగ్గరకు వచ్చేవి. ఆకాశవాణి విజయవాడకు సంబంధించిన పబ్లిసిటీ అంతా దినపత్రికలలో రోజువారీ కార్యక్రమాల వివరాలే కాక ప్రత్యేక

కార్యక్రమాల వార్తలు కూడా ప్రచురింపబడుతూ వుండేవి. తెలుగు విభాగం చూస్తూ 'నడుస్తున్న చరిత్ర' వంటి వార్తా విశ్లేషణ కార్యక్రమాల నిర్వహణ కూడా చూస్తుండేవాడిని కాబట్టి ఆ కార్యక్రమం కోసం వచ్చే పత్రికా సంపాదకులు, విలేఖర్లతో పరిచయాలు రేడియో కార్యక్రమాల పబ్లిసిటీకి దోహదపడ్డాయనక తప్పదు. అలాగే ప్రముఖులు విజయవాడ ఆకాశవాణిని సందర్శించినప్పుడు ఫోటోలు తీయించడం వంటి బాధ్యత, ఆకాశవాణిలో వాటిని సందర్శకులకు ఆహ్లాదకరంగా డిస్‌ప్లే చేసే బాధ్యతా అప్పచెప్పబడ్డాయి. నా చేతిరాత క్యాప్షన్లతో ఫోటోలు డిస్‌ప్లే బోర్డులో అమరుస్తూండడం, ఫోటో ఆల్బమ్‌లు రూపొందింపచేయడం సరదాగానే ఉండేది. సందర్శకులు కూడా మెచ్చుతూండేవారు. "ఆవగింజంత ప్రతిభవున్నా గుమ్మడికాయంత ప్రచారం తమిళులకు అలవాటు. చేసిన పనులకు పబ్లిసిటీ ఇవ్వకపోతే ఎలా?" అంటూ స్టేషన్ డైరెక్టర్ దుర్గా భాస్కర్ అంటూండేవారు. విజయవాడ ఆకాశవాణి కేంద్రానికి తొలి మహిళా డైరెక్టర్‌గా పనిచేసిన ఖ్యాతి శ్రీమతి దుర్గా భాస్కర్ గారికే దక్కింది. ఇంటిని అలంకరించినట్లే ఆఫీసూ ఆహ్లాదకరంగా ఉండాలనేవారావిడ.


శ్రీమతి దుర్గా భాస్కర్

ఆకాశవాణి విజయవాడకు సంబంధించి దినపత్రికలలో వచ్చిన వార్తలు, ఫోటోలు కార్యక్రమాల సమీక్షలు వంటి పేపర్ కటింగ్స్‌తో కూడా ఆల్బమ్‌లు తయారు చేస్తూ ఉండేవాడిని. లిఖిత పత్రిక నడిపిన యవ్వనానుభవం కూడా అందుకు దోహదం చేసిందని చెప్పచ్చు మరి. స్టేషన్ డైరెక్టర్ గారి ఆఫీస్ రూంలో ఫోటోల ఆల్బమ్‌లు, పేపర్ కటింగ్స్ ఆల్బమ్‌లు భద్రపరచబడేవి. అలాగే విజిటర్స్ బుక్ కూడా చక్కగా నిర్వహింపబడుతూ పెద్దలెవరు వచ్చినా వారి అభిప్రాయాలు అందులో రాయిస్తూండేవాళ్ళం.

1993 ఏప్రిల్ 28న అప్పుడు డి.డి.జిగా ఆకాశవాణిలో పనిచేస్తూండిన సుబ్రమణిగారు వచ్చారు. ఆయన నా పనితీరుని అభినందించడం గుర్తుంది. సరే! 1993 ఏప్రెల్ కార్యక్రమాల గురించిన ముచ్చట్లలోకి వస్తే నేను రూపొందింపచేసి ప్రసారం చేయించిన వాటి వివరాలు మీకు తెల్పుతున్న క్రమంలో 1993 ఏప్రెల్ 'మిసిమి' సంపాదకులుగా చాలాకాలం అందరూ ఎరిగిన అన్నపురెడ్డి వెంకటేశ్వర రెడ్డిగారు 'సాంస్కృతిక వికాసానికి జైనుల సేవ' గురించి ఒక చక్కని ప్రసంగం అందించారు. (ప్రసారం 4.4.93 రాత్రి 9.16) అలాగే విశాలాంధ్ర దినపత్రికకు చెందిన మంచి మేధావి, సుప్రసిద్ధ చారిత్రకశీలి శ్రీ ఏటుకూరి బలరామమూర్తిగారు 'కందుకూరి వారి సాహిత్య సేవ' పై ప్రసంగించారు (16.4.93). 'కవిత్వంలో మార్మికత' గురించి 24.4.93న శ్రీ వేగుంట మోహన్ ప్రసాద్ చక్కని ప్రసంగం చేయడం గురించి - 'మో' కవిత్వం అర్థం కాదనే మాట అప్పటికీ ఇప్పటికీ కొత్తదేమీ కాదు. 'మార్మికత' కవిత్వంలో ఎందుకో, ఏ మేరకో ఆ ప్రసంగంలో ఆ నాడు కీ.శే మోహన్ ప్రసాద్ వివరించిన జ్ఞాపకం ఇంకా తాజాగానే నా మదిలో ఉంది. ఏప్రెల్ 24 ఉగాది సందర్భంగా ఉగాది కవిసమ్మేళనం ఆ ఏడాది విశాఖపట్నం కేంద్రం వారు 18వ తేదీన ఆహూతుల సమక్షంలో కాకినాడ సూర్యకళామందిరంలో నిర్వహించి ఉగాదిరోజు ఉదయం పదిగంటలకు ప్రసారం చేసారు. ఆ కవిసమ్మేళనానికి విజయవాడ కేంద్రం నుండి అప్పుడు సబ్ ఎడిటర్ స్క్రిప్ట్స్‌గా కేంద్రంలోనే పనిచేస్తున్న శ్రీ ఇంద్రగంటి శ్రీకాంత శర్మగారినీ, విజయవాడలో మెడికల్ రంగంలో పనిచేస్తున్న కవి 'శిరీష' శ్రీ వేదుల శ్రీరామశర్మను పంపించడం జరిగింది. శ్రీ ఆవంత్స సోమసుందర్‌గారి ఆధ్యక్షంలో నాటి కవిసమ్మేళనం జరిగింది.


శ్రీ వేగుంట మోహన్ ప్రసాద్

28 ఏప్రిల్ 1993 రాత్రి 'వలస' అనే కథ ప్రసారం చేసాం. విశాఖ నుండి విజిటింగ్ ఆర్టిస్టుగా వచ్చిన భరాగో శ్రీ భమిడిపాటి రామగోపాలం రాసి సమర్పించిన కథ అది. ఏప్రిల్ 30న 'సామాజిక సామరస్యానికి వివాహ సూత్రలు' అనే అంశంపై అప్పట్లో సిరీస్ కంపెనీ లయ్‌జాన్ ఆఫీసర్‌గా ఉండిన శ్రీ జె.ఎన్.టి.సాయి ప్రసంగించారు.

'సరసవినోదిని' సమస్యా పూరణ కార్యక్రమం, ఆకాశవాణి విజయవాడ కేంద్రం కార్యక్రమాలలో సుప్రసిద్ధమైన ఒక కార్యక్రమం అని వేరుగా చెప్పనక్కర లేదు. శ్రీముఖ నామ సంవత్సరం ప్రవేశించిన ఆ ఏప్రెల్ నెలలో 'సరసవినోదిని'లో నేను ఒక ప్రయోగాన్ని ప్రవేశపెట్టించాను. కార్యక్రమం సమర్పించే కవిపండితులు సమస్యలు కూర్చడం, అవి పూరణకై శ్రోతలకు సంధించడం మామూలే. ప్రాచీన కావ్య పద్యాలలోని పద్యపాదం ఒకటిచ్చి, నవీన పూరణలు చేయించడం ఆ ప్రయోగం. ఏప్రెల్ నెలలో 'సరసవినోదిని' నిర్వహించిన శ్రీ రాళ్ళబండి నాగభూషణ శాస్త్రి, శ్రీ కావూరి పూర్ణచంద్రరావు గార్లకు ఈ విషయం చెప్పినపుడు, బాగుందని వారు అలాంటి సమస్యలు ఇచ్చారు. ఉదాహరణలివి -

*"చెల్లునె యో మరాళపిక శేఖరులార వచింపుడింపుగన్"*

*"కాంచని వస్తువున్ దెలిసి కాంచినయట్లనురక్తి గాంచుచున్"*

*(విజయవిలాసం)*

*"ధనము వ్యయింపగల్గుటకదా జననైక ఫలం బెరుంగగన్"*

*(హరివిలాసం)*

*"వావిరిచర్చ చేయుదురు వారికి వారలు దొడ్డవారలై" (భాగవతం 6-470)*

ఆ ప్రయోగానికి మంచి స్పందనే లభించింది. అయితే ప్రయోగాలు ప్రయోగంగానే చేయడం జరిగింది కానీ, దానిని ఒక మూసగా కొనసాగించడం ఎప్పుడూ చేయలేదు. కార్యక్రమాలన్నింటా ఒక నవీనత, ఉత్సుకత ఎప్పటికప్పుడు పెంచాలన్నదే తపన అంతే!

ఏప్రెల్ నెల చర్చాకార్యక్రమంగా 'స్త్రీల గౌరవం నిలబెట్టడం ఎలా' అనే అంశాన్ని తీసుకుని 19.4.93 రాత్రి అరగంట చర్చను ప్రసారం చేయడం జరిగింది. అంగన్ వాడి వర్కర్స్ ట్రైనింగ్ సెంటర్, కంట్రీ ఉమెన్స్ క్లబ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా కార్యదర్శి పి.రజని, ఆంధ్రాబ్యాంకుకు చెందిన శ్రీమతి అరుణజ్యోతి, మాంటిస్సరీ కళాశాల చరిత్ర ఉపన్యాసకురాలు శ్రీమతి. ఎన్.బాలసేరస్వతి ఆ కార్యక్రమంలో పాల్గొని చర్చించారు. అదేనెల ఫిక్కీ (ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఇనిస్టిట్యూట్ లేడీస్ ఆర్గనైజేషన్) ప్రెసిడెంట్‌గా ఉన్న శ్రీమతి వి.ఎల్.ఇందిరా దత్తుగారు మద్రాసు నుండి రాగా, విజిటింగ్ ఆర్టిస్టుగా, వారిని ప్రయాగ వేదవతి గారిచే ఇంటర్వ్యూ రికార్డు చేసి ప్రసారం చేయడం జరిగింది (24.93). ఆ ఏడాది ప్రయాగ వేదవతిగారిని బదిలీ చేస్తూ ఆర్డర్లు వచ్చాయిగానీ జూన్'93లో అసిస్టెంట్ స్టేషన్ డైరెక్టర్‌గా ఉన్న డా.పి.ఎస్.గోపాలకృష్ణ మద్రాసుకు బదిలీ అయి వెళ్ళిపోవడంతో, వేదవతిగారిని విజయవాడలోనే అసిస్టెంట్ స్టేషన్ డైరెక్టర్‌గా ఉంచుతూ, జూలైలో ఆర్డర్లు రావడం, ఆవిడ జూలై'14న అసిస్టెంట్ డైరెక్టర్‌గా పునర్నియామకం కావడం జరిగింది. విజయవాడలో జూలై 17కు కార్యక్రమ నిర్వహణాధికారిగా నాకూ రెండేళ్ళ సర్వీసు పూర్తయ్యింది. ఏప్రెల్ నెలలో ముగ్గురు స్వాతంత్ర్య సమరయోధులతో పరిచయ కార్యక్రమాలు చేసాను. దండి మార్చి వార్షికోత్సవ సందర్భంగా 'నా జ్ఞాపకాల్లో ఉప్పు సత్యాగ్రహం' అనే విషయంపై, స్వాతంత్ర్య సమరయోధులు శ్రీ మంగళంపల్లి చంద్రశేఖర్ గారితో పరిచయం (6.4.93), డా.బి.ఆర్.అంబేద్కర్ గారితో ప్రత్యక్ష పరిచయం ఉండిన శ్రీ కోనాడ సూర్యప్రకాశరావుగారితో 'అంబేద్కర్ ఆదర్శం' గురించిన పరిచయ కార్యక్రమం (14.4.93), గుంటూరుకు చెందిన స్వాతంత్ర్య సమరయోధులు శ్రీ పాలపర్తి వెంకట కోనయ్య శర్మగారితో జాతీయ జ్యోతి కార్యక్రమం (23.4.93) ప్రసారం చేయడమైంది. కవితాహారంలో (7.4.93) ముసునూరు ఏ.పి.రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీ పాతకోట రాధాకృష్ణమూర్తి, బాలజ్యోతి అసోసియేట్ సంపాదకుడిగా ఉన్న శ్రీ శశికాంత్ శాతకర్ణి గార్ల కవితలు ప్రసారమయ్యాయి.


శ్రీ జంధ్యాల శంకర్‌గారు

'రేడియో బ్రిడ్జ్' అనే కార్యక్రమం సాంకేతికంగా అభివృద్ధి చెందిన క్రమంలో భాగంగా రూపొందినదే. ఒకే సమయంలో ఆకాశవాణికి చెందిన వివిధ కేంద్రాలలో విషయ సంబంధి నిపుణులు ఆసీనులై, ఆ అంశంపై ప్రత్యక్ష ప్రసారంలో చర్చించడం జరిగేది. తెలుగులో పర్యావరణం గురించి, అలాంటి రేడియో బ్రిడ్జి కార్యక్రమం మే 7, 1993 రాత్రి 7.45 నుండి 8.45 వరకు ప్రసారమయింది. విజయవాడ మేయర్‌గా ఉన్న శ్రీ జంధ్యాల శంకర్‌గారు ఆ కార్యక్రమంలో పాల్గొని, కార్యక్రమానికి సొబగునీ, ప్రయోజనాన్నీ సంతరించిపెట్టారు.

మే'1993లో అప్పట్లో కేంద్రమంత్రిగా ఉన్న శ్రీమతి మార్గెట్ ఆల్వా, విజయవాడ కేంద్రాన్ని సందర్శించారు. 26.5.93న ఆవిడతో ఈ ఇంటర్వ్యూ అదేరోజు ప్రసారం చేసాం. మద్రాసు ఆకాశవాణి డైరెక్టర్ శ్రీ తిరువెంగళం గారు కూడా ఆ నెల్లోనే విజయవాడకు వచ్చారు. అంతకు మునుపు కడపలో డ్యూటీ ఆఫీసర్‌గా పనిచేసిన ఉష ఆయనకు తెలుసు. ఆ అభిమానంతో స్వయంగా ఉషను వచ్చి పలకరించారాయన. మే నెల కవితాహారంలో నరసాపూర్ ట్రైలర్ హైస్కూల్ తెలుగు పండితులు, అవధాన విద్యలో పేరొందుతున్న కడిమిళ్ళ వరప్రసాద్ శతావధాని, కవి సాంధ్యశ్రీ గారల కవితలు ప్రసారమయ్యాయి.

మే'1993లో కొన్ని మంచి ప్రసంగాలు ప్రముఖులు శ్రోతలకు అందించినవి ఉన్నాయి. తెలుగు లెక్చరర్‌గా రిటైరై కావలిలోనే ఉంటూండిన డా. ఎస్వీ భుజంగరాయశర్మగారు 'నాట్య రూపక సాహిత్యం' అనే అంశంపై అద్భుతమైన ప్రసంగం చేసారు (9.5.93) ఆయన స్వయంగా అనేక డ్యాన్స్ బ్యాలేలకు రచన చేసిన విషయం, రంగుల రాట్నం సినిమాలో 'ఇంతేరా ఈ జీవితం' వంటి అద్భుతమైన పాట రాసిన విషయం తెలిసిన సంగతేకదా!


డా.ఎస్.సంజీవదేవ్‌గారు

అలాగే ఆ నెలలోనే మరోసారి ప్రముఖ చిత్రకారులు రచయిత డా.ఎస్.సంజీవదేవ్‌గారిని ఆహ్వానించుకునే అవకాశం కలిగింది. శాంతినికేతన్‌లో స్వయంగా కొంతకాలం ఉన్నవారాయన. 'రవీంద్రుని చిత్రకళ' అనే అంశంపై సంజీవదేవ్ గారి ప్రసంగం 7.5.93 రాత్రి 9.16కు ప్రసారమైంది. సరసవినోదినిలో ప్రయోగం గురించి ఇంతకు ముందు చెప్పానుగా! ప్రసంగాల రూపకల్పనలోనూ అలాంటి ప్రయోగమే ఒకటి "హేతువు - కల్పన" అనే శీర్షికన ప్రవేశపెట్టడం జరిగింది. 14.5.93న ప్రసారమైన 'హేతువు - కల్పన' తొలి కార్యక్రమంలో 'గులాబి' అనే అంశంపై ప్రసంగద్వయం ప్రసారమైందన్నమాట! 'శాస్త్ర విజ్ఞానంలో గులాబి' గురించి గులాబీ యొక్క శాస్త్రీయ అంశాలను, ఉపయోగాలను డా.దుగ్గరాజు శ్రీనివాసరావుగారు చెప్పగా, 'కవుల కల్పనల్లో గులాబి' గురించి, ఆహ్వానించగానే వచ్చి డా.నాగభైరవ కోటేశ్వర్రావుగారు చక్కటి ప్రసంగం చేసారు. ట్విన్‌టాక్స్ అనే ఈ ప్రసంగద్వయ ప్రయోగం శ్రోతలను అలరించింది. రెండు మూడు నెలలు 'హేతువు - కల్పన' ప్రసంగద్వయ ప్రయోగం కొనసాగించడమైంది.


డా.నాగభైరవ కోటేశ్వర్రావుగారు

వేటపాలెంకు చెందిన డా.అన్నదానం చిదంబర శాస్త్రిగారు 'రాయబారిగా హనుమంతుడు' అనే అంశంపై ప్రసంగించారు. (16.5.93). సిరీస్ రాజుగారుగా చెప్పుకునే జి.ఎస్.రాజుగారు 'నెహ్రూ కళాహృదయం' అనే అంశంపై 26.5.93న ఉచిత ప్రసంగం చేసారు. సీతారాం మంచి కవి, విశ్లేషకుడు కూడాను. ప్రసేన్ కేరాఫ్ అడ్రస్‌తో సీతారాం ప్రసంగం 'తెలుగు కవులు దర్శించిన వేసవి' 30.5.93 రాత్రి 9.16కు ప్రసారమయింది. మే 28 రాత్రి స్వాతంత్ర్య సమరయోధులు శ్రీ మాలె కృష్ణారావు పరిచయ కార్యక్రమం ప్రసారం చేసాను. ఆయన ఏలూరు నుండి వయోభారాన్ని లెక్కించక వచ్చి, కార్యక్రమంలో పాల్గొన్నారు. 'టెలిఫోన్ ముఖాముఖి' కార్యక్రమంలో 5.4.93న డ్రైవింగ్ లైసెన్స్‌ల గురించిన శ్రోతల సందేహాలకు - రవాణాశాఖ డిప్యూటి కమీషనర్ టి.కృష్ణారెడ్డి, మోటర్

వెహికల్స్ ఇన్స్పెక్టర్ కె.వి.ఎస్.శర్మ సమాధానాలిచ్చారు. మే నెలలో 2.593 న విజయవాడ అర్బన్ డెవలెప్మెంట్ అథారిటీ ఛైర్మన్ శ్రీ కంచి రామారావు, ప్లానింగ్ ఆఫీసర్ జి.వెంకటేశ్ గారల సమాధానాలు ప్రసారమయ్యాయి.



# 39



డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డిగారు

**డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డిగారు** ఢిల్లీనుండి విజయవాడ ఎప్పుడొచ్చినా ఆకాశవాణిని పలకరించేవారు. ఒకప్పుడు కేంద్ర సమాచార ప్రసారాల శాఖా మంత్రిగా చేసినవారు కూడా కావడం వల్లనేమో రేడియో అంటే ఆయనకు అభిమానం ఎక్కువగా ఉండేది. ఆయన సాహిత్య వైదుష్యం కూడా ఆ అభిమానానికి కారణమే. రేడియోలో ప్రసంగించడం పట్ల ఎప్పుడూ ఉత్సుకత చూపేవారు. రాయలసీమ స్వాతంత్ర్య సమరయోధులు కడప కోటారెడ్డిగారు ఆ సమయంలో విజయవాడకు వచ్చినప్పుడు ఆకాశవాణిలో కడప కోటిరెడ్డి గారి శతజయంతి కాబోలు 1993 జూన్‌లో జరిగింది. డా. బెజవాడ గోపాలరెడ్డిగారుపై ప్రసంగించడానికి జూన్ 17న విజయవాడ కేంద్రానికి వచ్చారు. 1927 నుండి 1947 వరకు స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న కోటిరెడ్డిగారు 1952 నుండి 1968 వరకు రాష్ట్రశాసన సభలో కడపకు ప్రాతినిధ్యం వహిస్తూ ప్రజాసేవారంగంలో నేతగా రాణించారు. గాంధీ, టంగుటూరి ప్రకాశం గార్లకు ఆయన పరమ సన్నిహితులు. ఇందిరా రమణ పిక్చర్స్ పేరిట గూడవల్లి రామబ్రహ్మం గారితో కలిసి 'ఇల్లాలు' చిత్రాన్ని నిర్మించింది ఆయనేనని చెబుతారు. చిరస్మరణీయులు కడప కోటిరెడ్డి అనే అంశంపై డా.బెజవాడ గోపాలరెడ్డిగారి ప్రసంగం 20.6.93 ఆదివారం రాత్రి 9.16కు ప్రసారమయింది.

హరి అని సాహితీవేత్తలు ఆత్మీయంగా పిలుచుకుంటూండే హరి పురుషోత్తమరావు అద్భుతమైన వ్యాసాలు రాసారు. ఆయన పోయాక అనుకుంటా 'విభిన్న' పేరిట ఆ వ్యాసాలన్నీ సంకలనంగా వెలువడ్డాయి. మరీ ముఖ్యంగా కన్యాశుల్కం గురించి ఆయన రాసిన విశ్లేషణా రచనలు, గిరీశం సంస్కృతి గురించి వివరించిన వైనాలు అనితర సాధ్యాలు. ఆయన విజయవాడ వచ్చిన సందర్భంగా

'కన్యాశుల్కం - సామాజిక ప్రస్థానం' అనే అంశంపై వరితో ఓ ప్రసంగం చేయించిన విషయం బాగా జ్ఞాపకం ఉంది. 6.6.93 రాత్రి 9.16కు ఆ ప్రసంగం ప్రసారమైంది. ఆ తరువాత హైదరాబాద్‌లో కూడా హరిగారిచేత ఒకటి రెండు ప్రసంగ రచనలు చేయించే అవకాశం కలిగింది నాకు. ఎంతో నిరాడంబరంగా ఎటువంటి భేషజాలూ లేకుండా సంచరించే ఆయన నచ్చిన మనుషులతో ఎంతో సన్నిహితంగా ఉండేవారో నచ్చకపోతే అసలు పట్టించుకునేవారు కాదు. ఆయనచేత రేడియోకి రాయించడం గొప్పేనని కొందరు నాతో అన్నప్పుడు ఆశ్చర్యానందాలు కలిగాయి.

ప్రస్తుతం హైదరాబాద్ నుండి వెలువడుతున్న 'తెలుగువిద్యార్థి' మాసపత్రిక అప్పట్లో మచిలీపట్టణం నుండి వెలువడుతూండేది. విద్యారంగానికి చెందిన గవర్నమెంట్ ఆర్డర్లు (జి.వోలు) అదీ అందులో వేస్తూండడం జరిగేది. ఎం.ఎల్.సీగా కూడా కొంతకాలం పనిచేసిన శ్రీ కొల్లూరి కోటేశ్వరరావుగారు దాని సంపాదకులు. 9.6.93 బుధవారం రాత్రి 'దేశభక్తిభావన నాడు - నేడు' అనే అంశంపై కోటేశ్వరావు గారి ప్రసంగం ప్రసారమైంది. కవి మిత్రుడు అఫ్సర్ 13.6.93న 'శ్రీశ్రీ కవిత్వంలో పురాణ ప్రతీకలు' అనే అంశంపై జూన్ 15 శ్రీశ్రీ వర్ధంతిని పురస్కరించుకుని ఓ ప్రసంగం చేసాడు.

పంచ వర్ష ప్రణాళికలన్న మాట ఇప్పుడు పాతబడింది గానీ అప్పట్లో ఎనిమిదవ పంచవర్ష ప్రణాళిక ప్రధాన అంశాల గురించి శ్రోతలకు ఏలూరు సి.ఆర్.ఆర్. కళాశాల ఎకనమిక్స్ లెక్చరర్ శ్రీమతి. ఎల్. కృష్ణవేణిగారిచే ఓ ప్రసంగం చేయించి 18.6.93 న ప్రసారం చేయడం జరిగింది. నెహ్రూగారి హయాంలో పంచవర్ష ప్రణాళికల గురించి ఉండిన ప్రాధాన్యం, ఉత్కంఠ ఆ తరువాత మందగించాయనక తప్పదు మరి. హేతువు - కల్పన శీర్షికన జంట ప్రయోగాల ప్రసారం గురించి చెప్పానుగా! జూన్ నెల 30 వతేదీ 'చంద్రుడు' అనే అంశం తీసుకుని 'ఖగోళ శాస్త్రంలో చంద్రుడు' గురించి చైతన్య రెసిడెన్షియల్ కళాశాలలో అప్పుడుండిన శ్రీ కొండముది హనుమంతరావుగారి చేత, 'బాల సాహిత్యంలో చంద్రుడు' గురించి 'బాలబంధు'గా ఖ్యాతికెక్కిన గుడివాడలో ఉండిన శ్రీ బి.వి.నరసింహారావుగారి చేత ప్రసంగద్వయం చేయడం జరిగింది. పండుగ ప్రత్యేక సంచికల కవిగా విశిష్టులైన శ్రీ మొవ్వ వృషాద్రిపతిగారు 22.6.93న "కరుణశ్రీ కవితాశ్రీ" గురించి ప్రసంగించారు.

అప్పట్లో వి.ఎస్.రమాదేవిగారు ఛైర్ పర్సన్ ఆఫ్ మీడియా యూనిట్‌గా ఢిల్లీలో ఉంటూండేవారు. ఆవిడ 23.6.93న ఆకాశవాణి విజయవాడ కేంద్రాన్ని సందర్శించారు. అదే రోజు మా డా.పి.ఎస్.గోపాలకృష్ణగారు అసిస్టెంట్ స్టేషన్ డైరెక్టర్‌గా ఆకాశవాణి విజయవాడ కేంద్రం నుండి మద్రాస్ కేంద్రానికి బదిలీ అయి రిలీవ్ అయ్యారు. ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో ఎన్నో హాస్య ప్రసంగాలు చేసి విజయవాడలో న్యాయవాదిగా పేరు గడించిన ప్రముఖ హాస్యరచయిత 'ఆనందభైరవి' వంటి చిత్రాలలో నటుడిగానూ రాణించిన శ్రీ పుచ్చా పూర్ణానందంగారు 28.6.1993న విజయవాడలోనే పరమపదించారు. ఆయనకు తుదినివాళులు ఘటించాం.

నాటి ప్రధాని శ్రీ పి.వి.నరసింహారావుగారు గిద్దలూరు పర్యటనకు రాగా ఆ సభను రికార్డు చేయడానికి నేను గిద్దలూరు వెళ్ళడం జరిగింది. నాటి సభలో విద్యుత్ పొదుపు గురించి నరసింహారావుగారు ఎంతో జనరంజకంగా మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాల్లో లైట్లు, ఫ్యాన్లు అనవసరంగా ఎవరూ లేకున్నా ఎలా వెలిగిపోతూ తిరుగుతుంటాయో చమత్కార భరితంగానూ ప్రసంగించారు. రాష్ట్రపర్యటనపై ప్రధాని సభల నివేదికను హైదరాబాద్ కేంద్రం రూపొందించి ప్రసారం చేసే నిమిత్తం నాటి సభ రికార్డింగ్‌ను లైన్స్‌లో హైదరాబాద్‌కు ఫీడ్ చేసాను.

జూన్'1993లో ప్రసారమైన ఇంటర్వ్యూల విషయానికి వస్తే తెలుగు విభాగం నుండి 4.6.93 శుక్రవారం రాత్రి 'ప్రత్యామ్నాయ ఇంధన వనరులు' అనే అంశంపై ఉయ్యూరు ఎ.జి అండ్ ఎస్.జి కళాశాల బాటనీ శాఖ అధిపతి డా.పి.కేశవరావు గారితో ఇంటర్వ్యూ ప్రసారం చేయడమైంది. అలాగే జాతీయ జ్యోతి శీర్షికన గుంటూరు జిల్లా పొన్నూరుకు చెందిన స్వాతంత్ర్య సమర యోధులు శ్రీ టి.కోటయ్యగారితో పరిచయ కార్యక్రమం వినిపించాం. అప్పట్లో జాతీయ చలన చిత్ర అవార్డుల్లో 1992కుగాను ఉత్తమ ప్రొడ్యూసర్‌గా

శ్రీ టి.సుబ్బిరామిరెడి అవార్డు గెలుచుకున్నారు. 'భగవద్గీత' చిత్రానికిగాను వారికి ఆ పురస్కారం లభించింది. శ్రీపి.వి.రమణగారు హైదరాబాద్‌లో ఆయనను ఇంటర్వ్యూ చేసారు. ఆ కార్యక్రమం టేపును తెప్పించి విజయవాడనుండి 11.6.93న ప్రసారం చేయడమైంది. ఆ నెల ప్రముఖ కథకులు శ్రీ అవసరాల రామకృష్ణారావుగారు విశాఖ నుంచి రాగా ఆయన చేత 'ఒకరికొకరు తోడు' అనే కథ రాయించి శ్రీ మాడుగుల రామకృష్ణ (అనౌన్సర్) చేత చదివించి 27.6.93న ప్రసారం చేయడం జరిగింది.

ఇక నెలసరి చర్చా కార్యక్రమంలో 21.6.1993 రాత్రి 9.30కు 'దేశానికి వెన్నెముకై గ్రామసీమ నిలుస్తుందా?' అనే అంశంపై గ్రామాల స్థితిగతులపై ఒక చర్చాకార్యక్రమం రూపొందించి ప్రసారం చేయడమైంది. హిందూ కాలేజ్ పి.జి.సెంటర్ ఎకనమిక్స్ లెక్చరర్ డాక్టర్ ఐ. సత్యసుందరం, విజయవాడ కె.బి.ఎన్. కళాశాల పొలిటికల్ సైన్స్ ఉపన్యాసకులు శ్రీ సి.హెచ్.రామారావు, నేషనల్ హెరాల్డ్ పత్రిక కరస్పాండెంట్ శ్రీ కూచి గోపాలకృష్ణగారు ఆ చర్చలో పాల్గొన్నారు.

విజయవాడ మానవధర్మ శిక్షణా సంస్థ నిర్వాహకులు శ్రీ మోపిదేవి కృష్ణస్వామిగారి 'భాగవత కథా సుధ' పది భాగాల ఆదివారాల 'కథాలహరి' కార్యక్రమం ఆయన రేడియో అనుసరణ, కథా ప్రవచనంగా 27 జూన్‌తో ముగిసింది. ఆయన ప్రవచనానికి శ్రోతల నుంచి మంచి స్పందనే లభించింది. ఇక జూలైలో ఆదివారాలు మధ్యాహ్నం 'కథాలహరి'లో వినిపించడానికి పదమూడు భాగాలుగా విజయవాడ శాతవాహన కళాశాల తెలుగు ఉపన్యాసకులు డా.జంధ్యాల మహతీ శంకర్ గారిచే 'స్కంధపురాణాన్ని' రేడియో అనుసరణ చేయించి ఆ ప్రవచన భాగాలను రికార్డు చేయడం జరిగింది. 4 జూలై'93 నుండి 26 సెప్టెంబర్'93 వరకు 'స్కంధపురాణం' కథాలహరి కార్యక్రమంగా ప్రసారమై శ్రోతలను అలరించింది.



వంట గ్యాస్ ప్రాధాన్యం అందరికీ తెలిసిందే. అయితే గ్యాస్ కనెక్షన్ లభించడం కూడా ఆరోజుల్లో కష్టంగా ఉండేది. మధ్య తరగతి వారికి గ్యాస్ సంపాదించుకోవడం ఎలా అన్నది ఒక పెద్ద యజ్ఞంలానే ఉండేది అప్పటికీను. ఆ విషయాన్ని దృష్టిలో ఉంచుకునే జూన్'93 నెల 'టెలిఫోన్ ముఖాముఖి' కార్యక్రమాన్ని ఎల్.పి.గ్యాస్‌కు సంబంధించిన శ్రోతల ప్రశ్నలకు, సందేహాలకు సమాధానాలుగా ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్ ఏరియా మేనేజర్ శ్రీ ఎ.రంగరాజు, అసిస్టెంట్ మేనేజర్ శ్రీ ఎస్.అన్నామలై గార్లతో ప్రత్యక్ష ప్రసారంగా రూపొందించి ప్రసారం చేయడం జరిగింది.

సాహిత్య సభలు - సమావేశాల్లో పాల్గొనడం రేడియోలో చేరకముందునుండి కూడా నాకు అలవాటే. రేడియోలో చేరాక అందునా కార్యక్రమ నిర్వహణాధికారిగా పదోన్నతి పొంది విజయవాడొచ్చాక సభల్లో పాల్గొనమని కోరేవారి సంఖ్య సహజంగానే పెరిగింది. ఆకాశవాణిలో నా హోదాని బట్టికాక నన్ను నన్నుగా, కవిగా, రచయితగా, వక్తగా అభిమానించి ఆహ్వానించేవారిని




కాదనడం ఇష్టంలేకపోయేది. కార్యనిర్వహణాధికారిగా తెలుగు విభాగాన్ని చూస్తున్న సమయంలో ఎన్నో ఆహ్వానాలు వచ్చినా నియంత్రించుకుని కేవలం కొన్ని ముఖ్యమైన ఆత్మీయమైన సభలలోనే పాల్గొంటూండేవాడిని. విజయవాడలో ఉండగానే 1995లో తిరిగి హైదరాబాద్ వచ్చేయడానికి ముందు ఆర్.ఎ.పద్మనాభరావు గారు డైరెక్టర్‌గా ఉండగా, నేను తెలుగు విభాగాన్నుండి వివిధభారతి వాణిజ్య ప్రసార విభాగానికి కార్యక్రమ నిర్వహణాధికారిగా మారాక సాహిత్య సభలకు వచ్చిన ఆహ్వానాలను అనేకం ఆనందంగా అంగీకరించి పాల్గొన్నాను. సాహిత్య విభాగం, తెలుగువిభాగం చూసే రోజుల్లో మాత్రం ఎంపిక చేసుకుని నియమిత కార్యక్రమాల్లోనే పాల్గొనేవాడిని.



యువభారతిలో ఉండగా 1974లో మిత్రుడు డా.నాగినేని భాస్కరరావ్, నేను 'మేం'

కవితాసంకలనం వెలువరించాం. భాస్కర్ డాక్టర్ కోర్స్ పూర్తిచేసుకుని ఖమ్మం మధిరలో 'నాగినేని నర్సింగ్ హోం' స్వయంగా నిర్వహిస్తూండేవాడు. సాహితీ సాంస్కృతిక కార్యక్రమాల పట్ల తన అభిరుచిని వదులుకోక మధిరలో 'అధ్యయన వేదిక' పేరిట ఒక సంస్థను తను కార్యదర్శిగా నిర్వహిస్తూండేవాడు. విజయవాడలో చేరినప్పటినుంచీ మధిరకు రమ్మనమని కోరుతూండేవాడు. మిత్రునిగా కలుసుకోవడానికి ప్రత్యేకంగా కుదిరింది కాదు. ఇక ఇలా కాదని తమ అధ్యయన వేదిక దశమ వార్షికోత్సవాల సందర్భంగా 'మానవత' అనే ఒక సంస్థ సభ్యుల కవితా సంకలనాన్ని ప్రచురించి దాని ఆవిష్కరణకు, వార్షికోత్సవ ఉపన్యాసానికి నన్ను ఆహ్వానించారు. జూలై 11, 1993 ఆదివారం సాయంత్రం మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాల హైస్కూల్ విభాగం ఆవరణలో జరిగిన ఆ సభకు వెళ్ళడం భాస్కర్‌కు ఎంతో ఆనందం కలిగించింది. తనకే కాదు నాకున్నూ. తన ఆత్మీయత, ఆతిథ్యం ఆనాటివి నేటికీ మరిచిపోలేనివే. ఆ సభలో ఆంధ్రభూమి సబ్ ఎడిటర్‌గా ఉండిన ప్రసేన్ కూడా నాడు పాల్గొన్నాడు.


ప్రారంభసభ
ఉదయం గం॥ 8-30 ని॥లకు


రాష్ట్ర మనోరంజని ఆర్ట్సు ఆధ్వర్యంలో
సాహితీ సంబరాలు
స్వాగతాలు!
ఉత్పల వరదరాజా

జూలై నెలలోనే విజయవాడలో రాష్ట్రమనోరంజని ఆర్ట్స్ ఆధ్వర్యంలో 20.7.93న ఉదయం నుండి సాయంకాలం వరకు శ్రీ వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో జరిగిన సాహితీ సంబరాలకు మనోరంజని ఆర్ట్స్ అధ్యక్షుడు ఉత్పల వరదరాజా మాటలకు లొంగి కాదనలేక ప్రారంభకులు, ముఖ్య అతిథిగా పాల్గొన్నాను. అయితే సభలు బాగా జరిగాయి. కవితా చిత్రప్రదర్శన, పుస్తక ప్రదర్శన, జానపద, లలితగీతాలు, సాహితీ ప్రసంగాలు సినిమా పాటలు, మిమిక్రీ పోటీలు మనోరంజని అవార్డ్స్ ప్రదానం జరిగాయి. వరదరాజాయే రాసిన 'ప్రియురాలు' అనే నాటక ప్రదర్శన కూడా జరిగింది. ఉత్పల వరదరాజాతో ఆ సందర్భంగానే నిజానికి పరిచయం. ఆ తరువాత ఆ పరిచయాన్ని పెంచుకునే అతని ప్రయత్నాలకు నేను స్వభావరీత్యా గ్రహించి మొగ్గు చూపలేదు. అలాగని తనపై రకరకాల వ్యాఖ్యానాలు, వార్తలు విన్నా నేను పట్టించుకోలేదు.


కన్నుల పండువగా సాహితీ సంబరాలు

12 జూలై 1993న (డా.పి.ఎస్.గోపాలకృష్ణగారు అసిస్టెంట్ స్టేషన్ డైరెక్టర్‌గా మద్రాస్ బదిలీపై వెళ్ళిపోయాక) ప్రయాగ వేదవతి గారిని విజయవాడ ఆకాశవాణిలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా నిలుపుతూ ఢిల్లీనుండి ఆర్డర్స్ రావడం ఆవిడ 14న తిరిగి ఆ పోస్ట్‌లో జాయినవ్వడం జరిగింది. భారత రాష్ట్రపతిగా చేసిన మన తెలుగువారు డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి అబ్బాయి ప్రొఫెసర్ సర్వేపల్లి గోపాల్ జూలై 26న ఆకాశవాణి విజయవాడ కేంద్రాన్ని సందర్శించినప్పుడు డైరెక్టర్‌గారే ఆయనను స్వయంగా ఇంగ్లీషులో ఇంటర్వ్యూ చేసారు. ఆ రోజు ఆయన తండ్రిగారి గురించి చెప్పిన కొన్ని విషయాలు మమ్మల్ని దిగ్భ్రమకు గురిచేసాయి. అవి ఆయన ఆ తరువాత గ్రంథస్తం కూడా చేసి సంచలనం సృష్టించారు కూడాను.


ప్రొఫెసర్ సర్వేపల్లి గోపాల్




# 40

**విజయవాడ ఆకాశవాణి ముందునుంచీ** ఒక ఉమ్మడి కుటుంబంలా, ఉద్యోగుల పరస్పర సంబంధ బాంధవ్యాలతో విరాజిల్లుతుండేది. ఒకరినొకరు వరుసలు పెట్టి పిలుచుకోవడం ఎక్కువగా అక్కడే చూసేవాళ్ళం. తెలుగు విభాగానికి నేను కార్యక్రమ నిర్వాహణాధికారిగా ఉండగా సెక్షన్‌కు ప్రొడక్షన్ వర్క్‌కు డ్యూటీ ఆఫీసర్‌గా ఉండిన సి.హెచ్.మహేష్‌ను అటాచ్ చేశారు. మంచి చురుకైన కుర్రాడు. నెమ్మదస్తుడూను. 1993 జూలై 24న తన వివాహం జరిగింది. ఆ పెళ్ళికి కుటుంబ సమేతంగా వెళ్ళాను కూడా. జూలైలో స్టేషన్ డైరెక్టర్ శాఖల్లో మార్పులు చేస్తూ నా తెలుగు శాఖకు అటాచ్‌గా డి.రాజారెడ్డిని వేసారు. రాజారెడ్డి కూడా డైనమిక్ యువకుడే తనకు అప్పటికే వివాహమైంది. రాజారెడ్డి శ్రీమతి లలిత కూడా ఆకాశవాణిలోనే అడ్మిన్ వైపు స్టెనోగా పనిచేస్తూండేది. వారిద్దరిదీ ప్రేమ వివాహం అని గుర్తు. అన్యోన్య దంపతులు.


సి.హెచ్.మహేష్ పెళ్ళి రిసెప్షన్‌లో నేనూ, ఉష

నెలనెలా ప్రసారం చేసే టెలిఫోన్ ముఖాముఖి కార్యక్రమాలకు ఆగస్టు 2, 93తో మంగళాశాసనం పలికాం. విజయవాడ ఆకాశవాణి కార్యక్రమాలు, సాంకేతికతలపై శ్రోతలు టెలిఫోన్‌లో అడిగిన ప్రశ్నలకు ఆకాశవాణి విజయవాడ స్టేషన్ డైరెక్టర్ శ్రీమతి దుర్గాభాస్కర్, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీ పేరి విశ్వనాధంగారలు ఇచ్చిన సమాధానాల కార్యక్రమమే నెలనెలా ఒకరోజు రాత్రి 10.30కు స్టూడియోలో విషయనిపుణులు ప్రత్యక్షంగా ఆసీనులై ఉండగా శ్రోతలు ఫోన్‌లో అడిగిన ప్రశ్నలను అప్పటికప్పుడే రికార్డు చేసి వెంటనే విషయనిపుణలుకు, శ్రోతలకు వినిపిస్తూ వెనువెంటనే సమాధానాలిప్పించే టెలిఫోన్ ముఖానుఖి జరుగుతున్నంతసేపు


స్టేషన్ డైరెక్టర్ శ్రీమతి దుర్గాభాస్కర్, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీ పేరి విశ్వనాధంగారలతో ఆఖరి టెలిఫోన్ ముఖాముఖి

స్టూడియోలో కూడా సందడి సందడిగా ఉండేది. రికార్డు చేయడానికి, రికార్డు చేసిందాన్ని వెంటనే ప్లే చేసి విషయనిపుణులకు వినిపించడానికి, ఫోన్‌లో ప్రశ్నలు రావడానికి మధ్య వ్యవధి ఉంటే విషయనిపుణులతో అనుసంధానం నెరపడానికీ యూనిట్ అంతా కలిసి కృషిచేసేది. నెలనెలా టెలిఫోన్ ముఖాముఖి ప్రసారం రోజు అందు నిమిత్తం ఓ డ్యూటీ ఛార్ట్ తయారయ్యేది. ఏమయినా మూడున్నరేళ్ళు నెలనెలా నిరాఘాటంగా నడిచిన, టెలిఫోన్ ముఖానుఖి రెండేళ్ళు నా ఆధ్వర్యంలో నడిచి 1993 ఆగస్టు 2న విజయవంతంగా పరిపూర్ణమైంది.

శ్రోతల టెలిఫోన్ కాల్స్‌ని రికార్డు చేసి వాటిని విషయనిపుణులకు వినిపించి శ్రోతల సందేహాలు తీర్చే శ్రమ ఇప్పుడు లేదు. ఇప్పుడు నేరుగా స్టూడియోనుండే శ్రోతలతో టెలిఫోన్‌లో సంభాషిస్తూ అదే సమయంలో ప్రసారం జరిగే సాంకేతికత అభివృద్ధి చెందింది. ప్రస్తుతం ప్రైవేట్ ఎఫ్.ఎం. రేడియోల్లో రేడియో జాకీలతో సెల్‌ఫోన్ సంభాషణలూ, అయినదానికీ కానిదానికీ ఆ తరహా 'సొల్లు' సారీ! సెల్లు కబుర్లే పెరిగిపోయాయికదా! మారుతున్న సాంకేతిక ప్రగతిని అందిపుచ్చుకుని దానిని ప్రయోజనమంతంగా మలుచుకోవడంలో ఆకాశవాణి ఎప్పుడూ ముందంజలోనే ఉంది. అయితే ఆ సాంకేతిక లాభాలు, ఉపకరణాలు అందిపుచ్చుకోవడంలో మిగతా ఛానెల్స్‌తో పోలిస్తే ఎప్పుడూ కొంత ఆలస్యమేనని ఒప్పుకు తీరాలి. ఏమయినా చివరి 'టెలిఫోన్ ముఖాముఖి' ఆకాశవాణి గురించే ప్రసారం చేయడం శ్రోతలకు సంతోషం కలిగించింది. శ్రోతల రెస్పాన్స్‌కు డైరెక్టర్, సూపరింటెండెంట్ ఇంజనీరు కూడా ఆనందించారు.

శ్రీమతి దుర్గాభాస్కర్ విజయవాడ స్టేషన్ డైరెక్టర్‌గా ఉండగానే ఆకాశవాణి మార్కాపురం స్టూడియో నిర్మాణమూ అదీ పూర్తయ్యి ఆగస్టు 9, 1983న మార్కాపురం ఆకాశవాణి ప్రారంభోత్సవం జరిగింది. ఆ రాత్రి 7.45కు విజయవాడ ఆకాశవాణి నుండి ప్రారంభోత్సవంపై ప్రత్యేక రేడియో నివేదిక ప్రసారం చేసాం.

1993 ఆగస్టు నెలలోనే తిరుపతి కేంద్రంనుండి బదిలీ అయి విజయవాడ కేంద్రలో నాల్గవతేదీన ఎస్.ఎ . పద్మనాభరావు ( మేం ఎస్.ఏ.పీ అనే అంటాం) కార్యక్రమ నిర్వహణాధికారిగా వచ్చిచేరాడు. పొడగరి అయిన ఎస్.ఏ.పి గడసరి కూడాను. మంచి నిర్వహణాదక్షుడు. అదే నెల ఆరవతేదీన విశాఖపట్నం ఆకాశవాణి నుండి శ్రీమతి ముంజులూరి కృష్ణకుమారి కార్యక్రమ నిర్వహణాధికారిగా విజయవాడకు తిరిగి వచ్చి జాయినయ్యారు. కృష్ణకుమారి మంచి బాలసాహితీ వేత్త. ఎన్.సి.ఇ, ఆర్.టి బహుమతిని కూడా గెలుచుకున్నారు. ఆంధ్రప్రభ దినపత్రిక అప్పట్లో 'చిన్నారి' అని శనివారం శనివారం చిన్న అనుబంధ పుస్తకం ప్రచురించేది. అందులో 'ప్రభ ఆంటీ'గా తను తన రచనలతో పాఠకలోకంలోనూ ప్రసిద్ధి. స్త్రీ, శిశు కార్యక్రమాలే కాదు నాటక విభాగ నిర్వహణలోనూ మంచి సమర్థురాలు. విశాఖలో ఉండగా 'జీవని' వంటి నాటికతో జాతీయ స్థాయి బహుమతి పొంది గుర్తింపు పొందినవారు. 'కృష్ణక్క' అని సహోద్యోగినులు ఆప్యాయంగా పిలుచుకునేవారు. కృష్ణకుమారి భర్త శ్రీ పన్నాల సుబ్రమణ్య భట్టు ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో అనౌన్సర్. చెప్పకోడుగానీ రేడియోకు తను చేసిన సేవ అపారం. మంచి హాస్యప్రియుడు. ఆయన భోజన ప్రియత్వం అవతలివారికి పెసరట్టు వేసి పెట్టడంలోనూ ఉంది. ముళ్ళపూడి వెంకట రమణే భట్టు అట్టు తిని ప్రశంసించకుండా ఉండలేకపోయాడు. 'రేడియోచెళుకులు' అంటూ విజయవాడ ఆకాశవాణి కేంద్రంలో శ్రవ్యరూపక కార్టూన్‌లు అందించిన భట్టు మంచి కార్టూనిస్టు. అదే సమయంలో 'షేర్స్' గురించి కూడా గొప్ప విషయపరిజ్ఞానం కలిగి 'షేర్‌సింగ్' పేర పత్రికల్లో కాలమ్ కూడా రాసాడు. అంతేకాదు ఎందరెందరో ప్రముఖుల గళాలను ధ్వని ముద్రితం చేసి నిక్షేపమైన శ్రవ్యనిధిని విజయవాడ ఆకాశవాణికి సమకూర్చిపెట్టిన సృజనశీలి. రజని శిష్యపరంపరలోని వాడు. అతని మాట, తీరు మాత్రం ధిషణాహంకార బ్రాహ్మీమయమూర్తి అన్న చందానే ఉండేవి. అనుకున్నదేదో నిర్మొహమాటంగా అనేసేయడమే అలవాటుగానీ నాన్పుడు వ్యవహారం ఉండదు.


శ్రీమతి ముంజులూరి కృష్ణకుమారి


శ్రీ పన్నాల సుబ్రమణ్య భట్టు

శ్రీమతి దుర్గా భాస్కర్ స్టేషన్ డైరెక్టర్‌గా వచ్చాకే చెప్పానుగా పబ్లిసిటీ విభాగం అనేదొకటి సృజించి ఆగస్టు 17, 1993 న దానికి కార్యక్రమ నిర్వహణాధికారిగా నాకు బాధ్యతలప్పగించారు. అఫీషియల్‌గా ఉదయం దినపత్రిక ఆగస్టు 25 నుంచే నా ఇంటికి రావడం అప్పుడే ఆఫీసులో నేను రూము మారడం, కొత్త టేబుల్, చైర్ 27 వ తేదీన ఏర్పాటై అదనపు బాధ్యతలు వచ్చాయి. సెప్టెంబర్ ఒకటిన స్టేషన్ డైరెక్టర్ ఆదేశం మేరకు నాల్గవ తేదీ నా ఇంట్లో టెలిఫోన్ అఫీషియల్‌గా పెట్టడానికి ఆఫీస్ అప్రూవల్ తీసుకుని సెప్టెంబర్ 25న ఇంట్లో ఆఫీస్ ఫోన్ ఏర్పాటైంది. అలా విజయవాడ ఆకాశవాణి పి.ఆర్.ఓ విభాగం ఏర్పడి నిర్వహణ నాకు అప్పచెప్పబడింది. 28.8.1993న సిరీస్ రాజుగారింట్లో డా.బెజవాడ గోపాలరెడ్డిగారి ఆహ్వానం మేరకు స్టేషన్ డైరెక్టర్‌తో బాటు నేనూ వెళ్ళి ఆయనతో అల్పాహారం చేయడం, కేంద్ర సమాచార ప్రసారాల శాఖామంత్రిగా చేసిన ఆయన సూచనలు, సలహాల కబుర్లు వినడం మరచిపోలేని జ్ఞాపకమే.



స్టేషన్ డైరెక్టర్ శ్రీమతి దుర్గా భాస్కర్ గారితో

ప్రముఖ హాస్యరచయిత, న్యాయవాది పుచ్చా పూర్ణానందంగారు 1993 జూన్ 28న అస్తమించారని ముందు చెప్పాను కదా! ఒక హాస్య ప్రసంగం కోసం అంతకు ముందే ఆయనకు ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్ గా ఒక కాంట్రాక్ట్ పంపించాను. జూలై 14 న ప్రసారం కావాలి. కానీ ఆయన ముందుగా స్క్రిప్ట్ పంపించారు కానీ రికార్డింగ్‌కు రాలేని తీరానికి తరలిపోయారు. 'ఎంతో సులభం ఉచితసలహాలు' అని ఆఖరుగా రేడియోకి ఆయన రాసిన ప్రసంగాన్ని నేనే చదివి ఆయన పేర అనుకున్నట్లుగా జులై 14 బుధవారం రాత్రి ప్రసారం చేయడమైంది. ఆ నెలలో ఎంతో సులభం శీర్షికన ప్రసారమైన మరో ప్రసంగం 'ఎంతో సులభం తులనాత్మక పరిశీలనం' అనేది శ్రీ మన్నవ గిరిధరరావుగారు చేసింది. (28.7.93) ఆ నెలలో 'కవిత్వంలో అన్యోక్తులు' గురించి శ్రీ చివుకుల సుందరరామ శర్మ (4.7.93) అప్పటికే మోతబరువు ఎక్కువైన విద్యార్థుల పరిస్థితి మీద 'పిల్లలకు మోత బరువు తప్పదా?' అనే శ్రీ మల్లెల సూర్యనారాయణ ప్రసంగం (9.7.93), 'అజ్ఞాతాంధ్ర కవి - మోటూరి వెంకటరావు' గురించి గుంటూరు జిల్లా నగరంకు చెందిన తెలుగుశాఖాధ్యక్షులు డా.ఆకుల వి. పానకేశ్వర రావుగారి ప్రసంగం (18.7.93) 'రాయలసీమ శిల్ప కళా సంపద'పై 30.7.93 న నెల్లూరు ఆర్కియాలజీ మ్యూజియం రిజిస్టరింగ్ ఆఫీసర్ డా.జి.జవహర్‌లాల్ ప్రసంగం ప్రసారమయ్యాయి. అలాగే ఆగస్టు నెలలో శ్రీ పోలవరపు జగదీశ్వరరావుగారు 'కృష్ణుని రాజనీతి' పై ఒక చక్కని ప్రసంగం చేశారు (8.8.93). ఆ ఏడాది క్విట్ ఇండియా ఉద్యమ స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని తెనాలిలో జరిగిన సభలపై ఆగస్టు 10 రాత్రి ఓ రేడియో నివేదికను విజయవాడ ఆకాశవాణిలోనే డ్యూటీ ఆఫీసర్‌గా ఉండిన ఐ.వి.రమణయ్య చేత రూపొందింప చేసి ప్రసారం చేయడం జరిగింది.



పుచ్చా పూర్ణానందంగారు

ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం నాడు రాత్రి ఆకాశవాణి హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, కడప కేంద్రాలు సంయుక్తంగా ఉదయం పదిగంటలకు జాతీయోద్యమంపై ఒక రేడియో బ్రిడ్జ్ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం చేయడం జరిగింది. విజయవాడ స్టూడియోలో కూర్చుని ఆ రేడియో బ్రిడ్జి కార్యక్రమంలో నెల్లూరు సర్వోదయ కళాశాల ప్రిన్సిపాల్ డా.కాళిదాసు పురుషోత్తం జాతీయోద్యమంలో తెలుగు పత్రికల గురించి ఆసక్తిదాయకమైన ప్రసంగం చేశారు. అదే రోజు ఆదివారం రాత్రి 9.16కు స్వాతంత్ర్యోద్యమాన్ని ప్రతిబింబించిన తెలుగు నవలలుపై ఆంధ్రలయోలా కళాశాల విజయవాడ లెక్చరర్ డా. గుమ్మా సాంబశివరావు ప్రసంగించారు.

ఆగస్టు 20న ప్రముఖ పత్రికా రచయిత శ్రీ తుర్లపాటి కుటుంబరావుగారు 'రాజీవ్ గాంధీ ఊహల్లో రానున్న శతాబ్దం' అనే చక్కని ప్రసంగం అందించారు. అరవిందుని సావిత్రి కావ్యం అందించే ప్రబోధంపై తెనాలి శ్రీ అన్నపురెడ్డి వెంకటేశ్వర రెడ్డిగారు 29.8.93 రాత్రి ప్రసంగించారు.

పశ్చిమగోదావరి పాలకొల్లుకు చెందిన స్వాతంత్ర్య సమరయోధులు డా. మాడుగుల సూర్యనారాయణ మూర్తిగారితో 'జాతీయజ్యోతి'లో నేనే స్వయంగా ఇంటర్వ్యూ చేసిన కార్యక్రమం 23.7.93న ప్రసారమైంది. వర్తమాన కథాధోరణులపై "కథకంచికెళ్ళిందా" శీర్షికన ప్రముఖ రచయిత శ్రీ పోలాప్రగడ సత్యనారాయణ మూర్తిగారితో పరిచయ కార్యక్రమం 11.7.93న ప్రసారం చేసా. అలాగే 'బాలసాహిత్యం భవిష్యత్తేమిటి? అనే అంశంపై బాలసాహిత్య రచయితలు డా.గుడివాడ ప్రభావతి (గుంటూరు) అవనిగడ్డకు చెందిన శ్రీ గుడిసేవ విష్ణుప్రసాద్ గార్ల సంభాషణం 25.7.93న ప్రసారమైంది.

మహాకవి జాషువాగారి కుమార్తె హేమలతగారు గోరాగారి అబ్బాయి లవణంగారి భార్య. హేమలతా లవణంగారిని మొదటిసారి వాళ్ళ నాన్నగారి అనగా జాషువా గారి భావజాలం గురించి ఇంటర్వ్యూ చేసి, నేను చేసిన ఆ పరిచయ కార్యక్రమం 1993 ఆగస్టు 1న ప్రసారం చేయడం మరిచిపోలేని జ్ఞాపకమే. అలాగే తెనాలి వడ్లమూడికి చెందిన స్వాతంత్ర్య సమరయోధులు శ్రీ గుర్రం లక్ష్మయ్యగారి పరిచయకార్యక్రమం 'జాతీయ జ్యోతి'లో 27.8.93న వినిపించడమైంది. సరసవినోదిని సమస్యాపూరణ కార్యక్రమం జూలై, ఆగస్టు నెలల్లో ప్రముఖులు డా.కుందుర్తి సత్యనారాయణమూర్తి, శ్రీ బాపట్ల రాజగోపాల శర్మ, వై.సోమసుందరరావు, శ్రీ కొత్తపల్లి విశ్వేశ్వర శాస్త్రి, శ్రీ పింగళి వెంకట కృష్ణారావుగారలు శ్రోతృజనరంజకంగా నిర్వహించారు.


హేమలతా లవణంగారు

జూలై'1993లో పాఠశాలలు తెరిచాక ఆ నెల చర్చా కార్యక్రమంగా "ప్రభుత్వపాఠశాలలు ప్రాచుర్యం కోల్పోతున్నాయా" అనే అంశంపై 19.7.93 రాత్రి ప్రసారం చేసా. పశ్చిమ గోదావరి జిల్లా కాకరపర్రుకు చెందిన రిటైర్డ్ డి.ఇ.ఓ శ్రీవి.సత్యనారాయణ, విజయవాడ విజ్ఞాన వికాస్ డైరెక్టర్ శ్రీ జోస్యుల రాధాకృష్ణ, కృష్ణాజిల్లా పరిషత్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ శ్రీ పెండ్యాల రామారావు, రాజస్థానీ తెలుగు విద్యాలయ హైస్కూల్, విజయవాడ హెడ్మాస్టర్ డా.జె.నాగేశ్వరరావు ఆ చర్చలో పాల్గొన్నారు. అలాగే ఆగస్టు నెల చర్చా కార్యక్రమంగా 16.8.93 రాత్రి "ఆర్థికాభివృద్ధికి పొదుపు తోడ్పడుతుందా" అనే అంశంపై చర్చ ప్రసారమైంది. రిటైర్డ్ నేషనల్ సేవింగ్స్ ఆర్గనైజేషన్ రీజనల్ డైరెక్టర్ శ్రీ ఎం. ప్రకాశం, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అధికారిణి శ్రీమతి. డి.సావిత్రీదేవి, ఎకనమిక్స్ లెక్చరర్ శ్రీఏ.రాజశేఖర్(గుంటూరు) ఆ చర్చలో పాల్గొన్నారు. 'పుస్తకదర్శిని' అని నేను ప్రవేశపెట్టిన కొత్త పుస్తకాల సమీక్షా కార్యక్రమాన్ని ఆ రెండునెలలూ అప్పట్లో హిందీ ఆఫీసర్గా పనిచేస్తూ అనంతరం కార్యక్రమ నిరహణాధికారి అయిన శ్రీమతి. వై. సరోజా నిర్మలగారు సమర్పించారు. నడుస్తున్న చరిత్ర పేర అంతర్జాతీయ, జాతీయ రాష్ట్ర సంఘటనలపై వారం వారం విశ్లేషణలను పెద్దపత్రికల వారికే కాక చిన్న పత్రికలవారికి కూడా సమర్పించే యత్నం చేసాను. అలాగే అప్పట్లో గుంటూరు 'సుప్రభాతం' పత్రిక కరస్పాండెంట్ శ్రీవి.వెంకటరావు (24.7.93) 'ఉద్యోగ విజయాలు' పత్రికా సంపాదకులు శ్రీ ఆలూరి సుభాష్ బాబు (7.8.93) 'ఐక్యోపాధ్యాయ' ఇన్ఛార్జ్ ఎడిటర్ శ్రీ కేశవరెడ్డి (28.8.93) ఆ విశ్లేషణలు సమర్పించినవారిలో ఉన్నారు. ఆలూరి సుభాష్ బాబు 'ఉద్యోగ విజయాలు' మంచిపేరు సంపాదించుకుని కమర్షియల్గా కూడా విజయవంతమైంది అప్పట్లో.

విజయవాడలో ఫిలిమ్ రీసెర్చి సెంటర్ నొకదానిని నెలకొల్పి శ్రీ భైరవభొట్ల వెంకట నారాయణరావు సినీ గేయ సాహిత్యానికి చేసిన సేవ అనుపమానమైనది. వేలాది పాటల పుస్తకాలను. చిత్రాలను, సినీగీతాల రికార్డింగులు ఆడియో, వీడియోలను ఆయన సేకరించి ఒక క్రమబద్ధమైన రీతిలో భద్రపరచిన రీతి నిజంగా ప్రశంసనీయమైనది. ఫిలిం రీసెర్చి సెంటర్ ఆధ్వర్యంలో విజయవాడలోని మహిళా మాంటిస్సోరి కళాశాలలో సెప్టెంబర్ 12 ఆదివారం ఆచార్య ఆత్రేయ చతుర్థ వర్ధంతి సభ జరిగింది. ఆ సభలో ఆకాశవాణి నుండి

కార్యక్రమ నిర్వహణాధికారులమైన పి.పాండురంగ, నేను పాల్గొన్నాం. అలాగే సెప్టెంబర్ 1993లోనే ముగ్గురు ప్రసిద్ధ కథకులు శ్రీమధురాంతకం రాజారాం, శ్రీ మునిపల్లె రాజు, శ్రీ శ్రీపతిగార్లతో మరుపురాని ఓ గోష్ఠి రికార్డు చేసి ప్రసారం చేసే అవకాశం లభించింది. సెప్టెంబర్‌లో స్త్రీల కార్యక్రమం కోసం ఆ విభాగం చూస్తున్న నా శ్రీమతి ఉషారాణి కోరగా డైరెక్టర్‌గారి ప్రోత్సాహంతో ఓ పాట రాసాను. అది ఆ నెలలోనే ప్రసారమైంది.



# 41

**తెలుగు కథకు ప్రాణప్రతిష్ఠ చేసిన కథారచయితల్లో** మధురాంతకం రాజారాంగారు ఒకరు. సీమ నేపథ్యంగాగల రచయితే అయినా, కథా రచయితగా ఆయన ప్రతిభాపాటవాలు సీమలు లేనివి. మధ్యతరగతి జీవితానికి మానవీయ విలువలతో మరుపురాని మంచి కథలు రాసిన మహనీయుడాయన. అలాగే మునిపల్లె రాజుగారు మ్యాజిక్ రియలిజంతో అద్భుతమైన కథలు రాసారు. కేంద్రసాహిత్య అకాడమీ అవార్డును అందుకున్నారు. నేను చదువుకునే రోజుల్లో యువభారతిలో శ్రీపతిగారి మంచుపల్లకి - మరి తొమ్మిది కథలు చదివి


కుడి మధురాంతకం, శ్రీపతి, ఎడమ మునిపల్లెరాజు

పుస్తక చర్చ కూడా చేసాం. నాకు ఇష్టమైన ముగ్గురు కథా రచయితలతో ఒకేసారి భేటీ అయ్యే సందర్భం సెప్టెంబర్‘1993లో జరిగింది. ఏ సందర్భంగానో సరిగా గుర్తులేదుగానీ వారు ముగ్గురూ విజయవాడ వచ్చారని తెలిసి పన్నెండవ తేదీ వారిని ఆకాశవాణి స్టూడియోకి ఆహ్వానించాను. వారు ముగ్గురితో ఒక చర్చాకార్యక్రమాన్ని రికార్డు చేయాలని, అది కొంచెం వినూత్నంగా ఉండాలనీ వర్తమాన కథను, కథన రీతులను చర్చిస్తూనే భవిష్యత్తు కథలు ఎలా ఉంటాయి? ఎలా ఉండాలి అని వారనుకుంటున్నారు అనే విషయాలు రాబట్టాలని ఆ చర్చాకార్యక్రమానికి "రాబోయే శతాబ్దంలో రాగోరే కథలు" అని పేరెట్టడం జరిగింది. హేమాహేమీలైన ముగ్గురు కథకులూ చాలా ఉత్సాహంగా ఆ చర్చలో పాల్గొన్నారు. జనాభా పెరిగిపోవడం అనేక సమస్యలకు మూలకారణమవుతోంది అంటూ మధురాంతకం రాజారాంగారు ఆ చర్చలో చెప్పిన ఒక సంగతి నాకింకా గుర్తుంది. సిటీ హోటళ్ళలో మధ్యాహ్నం లంచ్ టైంలో, రాత్రి డిన్నర్ టైంలో వచ్చినవారు సీటు దొరక్క ఎదురుచూడడం, బయట పడిగాపులు పడడమే కాకుండా, లోపల టేబుల్ ఖాళీ అవుతోందని తెలిసిన మరుక్షణమే, ఆ తింటున్నవారు ఇంకా లేవకుండానే, వాళ్ళ కుర్చీల వెనుక

ఎప్పుడు లేస్తారా అని అసహనంగా నిరీక్షిస్తూండడం, "తిన్నది చాల్లే లే" అన్నట్లు తింటున్నవారిని చూస్తూ ఉండడం, వెనకాల తరుముకు వస్తున్నట్లు మనుషులు నించుని ఉండగా, కూర్చున్నవారు భోంచేయవలసి రావడం అనే సున్నితమైన విషయాన్ని ఆయన వివరించిన కథనాత్మక తీరుని మరిచిపోలేను. ఆయన అబ్జర్వేషన్స్ ఎలా కథలుగా ఆయన మలిచే వీలున్నదీ గొప్పగా చెప్పారు. 20.9.93 రాత్రి "రాబోయే శతాబ్దంలో రాగోరే కథలు" అనే ఆ చర్చ ప్రసారమై శ్రోతలను బాగా ఆకట్టుకుంది. 'మంచి శీర్షిక పెట్టావోయ్' అని శ్రీపతి ప్రశంసించడమూ గుర్తుంది.

సెప్టెంబర్ 10 విశ్వనాథ సత్యనారాయణగారి పుట్టినరోజు. డా.జి.వి సుబ్రహ్మణ్యంగారు పుట్టిందీ సెప్టెంబర్'10నే. సెప్టెంబర్ 10 విమర్శకుల దినోత్సవంగా తెలుగు సాహితీపరులు జరుపుకోవాలనే ప్రతిపాదన కూడా వచ్చింది. జి.వి.సుబ్రహ్మణ్యంగారు తాను జీవించి ఉండగానే సాహితీ పీఠం నెలకొల్పి, ఏటా ఒక విమర్శకుడిని పదివేల రూపాయల నగదుతో సత్కరించారు. ఆయన పోయాక ఒకటి రెండేళ్ళు ఆ సంప్రదాయం కొనసాగినా, వారి కుటుంబ సభ్యుల మధ్య సమస్యలతో అది ఆగిపోయింది. సరే! అదలా ఉంచుదాం. 'మా నాన్నగారి సాహితీయాత్ర' అని విశ్వనాథ సత్యనారాయణగారి గురించి, అప్పట్లో జీవించేవున్న విశ్వనాథ పావనిశాస్త్రి నేను ఒక ఇంటర్వ్యూ రికార్డు చేయడం జరిగింది. విశ్వనాథ వారి పుట్టినరోజున ఆ పరిచయ కార్యక్రమం శ్రోతలకు వినిపించడం సంతోషమనిపించింది.

ఒక్కోసారి కొన్ని కార్యక్రమాలు అనివార్యంగా తలకొస్తుంటాయి. అప్పట్లో విజయవాడ స్టేషన్ డైరెక్టర్‌గా ఉన్న దుర్గా భాస్కర్‌గారు అంతకుముందు విశాఖలో పనిచేశారు. దుర్గాభాస్కర్ గారింట్లో దొంగలు పడి నగలు కొన్ని దోచుకుపోయారు. ఆవిడ పోలీస్ రిపోర్ట్ ఇచ్చారు. అప్పట్లో విజయవాడ పోలీస్ కమీషనర్‌గా శ్రీ నారాయణరావు దేశ్‌ముఖ్ ఉన్నారు. ఆయనకు పోలీసు ఆఫీసర్‌గా గట్టివాడన్న పేరుంది. విషయం ఆయన చెవినబడితే ఆయన పోయిన తన సొమ్ము రాబట్టగలరని ఆవిడకు అనిపించడంలో అనౌచిత్యం ఏమీలేదు. అందుకోసం అన్నట్లుగానే ఆయనతో ఒక కార్యక్రమం రూపొందించమని ఆదేశించారు. విజయవాడ రౌడీనగరంగా ప్రసిద్ధికెక్కిన సంగతి చాలా మందికి తెలిసినదే. అయితే కత్తులు కటార్లు తుపాకులు పట్టుకు తిరగడం బెజవాడలో అంత సులభమా అనిపించేది? నిజానికి ఆయుధాలు కలిగి ఉండాలంటే లైసెన్స్ ఉండాలి. ఆయుధం కలిగి ఉండటానికి చట్టబద్ధత ఉండాలి. కానీ విచ్చలవిడిగా ఆయుధాలు కలిగి నగరంలో సంచరించేవారు ఎక్కువగా ఉన్నారంటే, వ్యవస్థలో లోపం ఏదో ఉన్నట్లే కదా! 17.9.93న ప్రసారం నిమిత్తం "చట్టబద్ధం కాని ఆయుధాల నియంత్రణ" అనే అంశంపై విజయవాడ పోలీస్ కమీషనర్ నారాయణ్‌రావ్ దేశ్‌ముఖ్‌గారిని ఇంటర్వ్యూకు ఆహ్వానించి ఆ పరిచయకర్తగా డైరెక్టర్ శ్రీమతి దుర్గాభాస్కర్‌గారినే కార్యక్రమంలో పాల్గొనమని కోరగా, ఆవిడ స్వతహాగా కార్యక్రమాభిలాషి గనుక అంగీకరించి ఇంటర్వ్యూ చేసారు. ఆ రికార్డింగ్ రోజు పనిలో పనిగా కమీషనర్‌గారి చెవిన తన సమస్య ముందుంచారు. మొత్తానికి ఎలాగైతేనేం కొద్దినెలలకు ఆవిడ నగలు ఆవిడకు లభించాయి. ఇలా వి.ఐ.పిల విషయంలో యథాతథంగా పోయిన నగలే రాబట్టడం లేక పోయినా, దొంగ సరుకుగా పట్టుకున్న వాటిని చూపి క్లెయిమ్ చేయబడక ఉండే వాటిల్లోంచి తమనగలుగా గుర్తించిన వాటిని ఇచ్చేస్తారనీ పోలీసు శాఖలో ఇది మామూలేననీ చెప్పుకున్నవారున్నారు. ఏమయితేనేం స్వార్థం - పరమార్థం కలిసివచ్చే పనుల్లో భాగస్వామ్యం కాక తప్పదని ఉద్యోగరీత్యా అప్పుడు నాకు తెలియవచ్చింది. సరే! కార్యక్రమ రూపకల్పన, ప్రసారం మేరకే నా బాధ్యత గనుక, అది ఒక మంచి పరిచయ కార్యక్రమమే శ్రోతలకు. వెనుక ఉద్దేశ్యాలు ఏవయినా మనకనవసరం అనుకోక తప్పలేదు.

బాధ కవిత్వానికి పర్యాయపదం అన్నాడు శ్రీశ్రీ 'అలాగని పెద్ద బాధాలేదు' అంటూ ఒక కవిత ఎత్తుగడలోనే అన్నాడు కవి 'మో' వేగుంట మోహనప్రసాద్. 'కవిత్వంలో బాధ' అనే అంశం ఇచ్చి ఒక ప్రసంగం రాసుకురమ్మన్నాను అప్పట్లో విజయవాడ ఆంధ్రభూమి దినపత్రికలో సబ్ ఎడిటర్‌గా ఉన్న ప్రసేన్‌ను. 19.9.93 రాత్రి ప్రసేన్ రాసిన ఆ సాహిత్య ప్రసంగం ప్రసారమైంది. పోలీస్ కమీషనర్ ఇంటర్వ్యూ ప్రసారమైన ఆ నెలలోనే ఆర్.టి.ఓ డిప్యూటీ కమీషనర్‌తో (శ్రీ టి. కృష్ణారెడ్డిగారు అప్పుడా హోదాలో

పనిచేస్తున్నారు) "రోడ్డు ప్రమాదాలు - డ్రైవింగ్ లైసెన్స్ విధానం" అన్న అంశంపై నేనే ఇంటర్వ్యూ చేసి 29.9.93 రాత్రి ప్రసారం చేయడం జరిగింది. 'కవితాహారం' కార్యక్రమంలో సెప్టెంబర్ 1నే వేగుంట మోహనప్రసాద్, సిద్దార్థ కళాశాల ఇంగ్లీష్ ఉపన్యాసకులు శ్రీ.బి.వెంకటరామిరెడ్డి గారల కవితలు ప్రసారం చేయడమైంది.

1993 సెప్టెంబర్ 9న 'భారత్‌బంద్' జరిగింది. ఆరోజు ఆకాశవాణి కేంద్రంలోనే చాలాసేపు గడిపాం. సెప్టెంబర్‌లో ప్రసారమైన ప్రసంగాల్లో 'డంకెల్‌ప్రతిపాదనలు' గురించి నాగార్జున విశ్వవిద్యాలయం ఎకనమిక్స్ డిపార్ట్‌మెంట్ అధినేత డా. ఎన్. సుధాకరరావుగారిదీ (3.9.93 ప్రసారం) అలాగే, 'ప్రాచీన గ్రంథ పరిష్కారణం' గురించి శ్రీ నాగళ్ళ గురుప్రసాదరావు గారిది (ప్రసారం 26.9.93) రెండు మంచి ప్రసంగాలుగా శ్రోతలు అభినందించినవే!

హైదరాబాద్‌లో డ్యూటీ ఆఫీసర్‌గా ఉండగానే డ్రామా ఆడిషన్‌లో 'బి' గ్రేడ్ పొందివున్నాను కాబట్టి, రేడియో నాటకాల్లో నా కంఠం వినియోగించుకోడానికి ఎలాంటి అభ్యంతరమూ ఉండదు. విజయవాడ నాటకాల్లో కూడా అలా నా గళం ఇస్తూనే వచ్చాను. 7.9.93న ప్రసారమైన 'రుద్రమదేవి', 11.9.93న ప్రసారమైన 'నీ పాదములె నమ్మితి' అలా ఆ నెల నేను చిన్నపాత్రలు ధరించిన నాటకాలు. సెప్టెంబర్ 12న తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆకాశవాణి విజయవాడ కేంద్రం రేడియో సంగీత సమ్మేళనం ఆ ఏడు నిర్వహించడం జరిగింది.

12వ తేదీ సాయంత్రం నేను, పాండురంగ భైరవభట్ల మాంటిస్సరీ స్కూల్ ప్రాంగణంలో నిర్వహించిన ఆచార్య ఆత్రేయ నాల్గవ వర్ధంతి సభలో పాల్గొన్నాం. సైక్రియాట్రిస్ట్ ఇండ్ల రామసుబ్బారెడ్డిగారు ఆచార్య ఆత్రేయ పాటలు మానసిక వైక్లబ్యాలకు మందుగా ఎలా పనికివస్తాయో మాట్లాడటం నాకు నచ్చింది. నేనూ, పాండురంగా కలిసి ఒక సభలో పాల్గోడం అదే మొదలని గుర్తుమరి.


GOVERNMENT OF INDIA
ALL INDIA RADIO : VIJAYAWADA
* * *

No.Vij.29(3)93.P3 / 155 / Dated : 01.10.1993.

Sri A. Venkata Rao-'Sudhama',
Programme Executive,
All India Radio,
VIJAYAWADA.

Dear Sir / Madam,

Subject :- Audition Test held on 25.9.93.

* * *

With reference to your Audition test for Upgradation held on 25.9.93 at our studios, we are pleased to inform you that you are upgraded to the next higher grade in the Drama category. Please note that you will be offered engagements as and when suitable opportunity arise.

Thanking you,

Yours faithfully,

( P. PANDURANGA RAO )
PROGRAMME EXECUTIVE( DRAMA )
for STATION DIRECTOR.

కార్యక్రమ నిర్వహణాధికారినే అయినా నా కలాన్నీ, గళాన్నీ విస్మరించలేదు. నాటకాల్లో పాత్రలు ధరించడమే కాదు. నేను రాసిన "అడ్రస్ ప్లీజ్" నాటకం 21.9.93 ఉదయం 7.30కు ప్రసారమైంది. అన్నింటి కంటే ప్రముఖంగా చెప్పుకోవలసింది ఆ సెప్టెంబర్ నెలలోనే ఆకాశవాణి విజయవాడ కేంద్రం నిర్వహించిన 'డ్రామా ఆడిషన్'కు అప్‌గ్రేడేషన్‌కు పెట్టుకుని, స్టాఫ్‌గా ఉంటూనే 25.9.93న జరిగిన ఆడిషన్స్‌లో 'బి హై గ్రేడ్' పొందాను. ఆడిషన్ల సందర్భంగా ఆ సాయంత్రం స్టూడియోలో మా హడావుడి చెప్పక్కర్లేదు. పన్నాల సుబ్రమణ్య భట్టు కూడా అప్పుడే బిహైగ్రేడ్ పొందారు. నా శ్రీమతి ఉష డ్రామా ఆడిషన్లో పాసయ్యి బిగ్రేడ్ సాధించింది. కారిడార్లలో వాయిస్ టెస్ట్ స్క్రిప్టులు పట్టుకుని ఒకళ్ళకొకళ్ళు ముందు పరీక్షకు తయారవడం, డైలాగులు చదివి వినిపించుకోవడం, ఒకరికొకరం సలహాలిచ్చుకోవడం అదంతా నిజంగా ఒక తీపి జ్ఞాపకమే! కీర్తి శేషుల్లో 'మురారి' డైలాగులు భట్టు విన్పిస్తూంటే నిజంగా గొప్ప థ్రిల్లే అనిపించింది. మాలాగే ప్రసార దంపతులుగా అప్పుడు విజయవాడలో ఉన్న మరో జంట మంత్రవాద మహేశ్వర్, వసుమతిల కొడుకు 'శ్రీకాంత్' మొదటి పుట్టినరోజుకు 24.9.93న మిత్రబృందం వారింటికెళ్ళి పాల్గొనడమూ గుర్తుంది.

17.9.93న స్త్రీల కార్యక్రమంలో మధ్యాహ్నం 1.30కు నేను రాసిన 'వద్దుపొమ్మన్నారు' అనే పాటను శ్రీమతి శారద తన మధుర కంఠంతో ఆలపించగా ప్రసారం కావడమూ గుర్తే! బహుశా విజయవాడ వెళ్ళాక కోరగా నేను రాసిన మొదటిపాట అదే అనుకుంటాను.

దానికి మంచి స్పందనే శ్రోతలనుండి లభించింది. సెప్టెంబర్ 29 నుండి నా ఇంట్లో అఫీషియల్‌గా ఏర్పరచిన టెలిఫోన్ మ్రోగడం


FORMAT - 3

OFFICE OF THE GENERAL MANGER, TELECOM DISTRICT, VIJAYAWADA - 10

This is to inform you that orders have been issued for providing New Phone Connection/Carrying out shift of your tele-No. 473934 vide our O.T. No. 2051 and Advise No. 52 dated 16.9.93.

The work is likely to be carried out in 15/30 days.

Yours faithfully,

COMMERCIAL OFFICER
OFFICE OF G.M.T.D. VJ

To, DEPARTMENT OF TELECOMMUNICATIONS
Sri/Smt/Ms All India Radio
A. Venkata Rao Sudhama
G.F.1 South Block
Sagar apartment
Punnamathota VJ-10

మొదలయింది. టెలిఫోన్ ముఖాముఖి కార్యక్రమం ఆగస్టులో సమాప్తమై సెప్టెంబర్ నుండి నా ఇంట్లో టెలిఫోన్‌ముఖాముఖులు కవులు, రచయితలు, కళాకారులతో మొదలవడం ఓ చిత్రమైన అనుభూతియే మరి.

ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో మార్నింగ్ ఇన్ఫర్మేషన్ సర్వీస్‌గా 'ఉదయతరంగిణి' కార్యక్రమం చాలా ప్రసిద్ధం. విజయవాడ కేంద్రంలో మటుకు నేను వెళ్ళేటప్పటికి ఉదయం వేళ అలాంటి కాంపోజిట్ ప్రోగ్రాం ఏమీలేదు. విడివిడి కార్యక్రమాలే ఉండేవి. ప్రతి ఆరునెలలకూ ఒకసారి "ఫిక్స్‌డ్ పాయింట్ ఛార్ట్"లో మార్పులు చేసి ఢిల్లీ నుండి అనుమతి, తీసుకుని ప్రసారం చేసే కార్యక్రమాల్లో, వేళల్లో కొత్తదనం తెచ్చే అవకాశం ఉంది. అక్టోబర్ నుండి ప్రారంభం కాబొయ్యే ఫిక్స్‌డ్ పాయింట్ ఛార్ట్ కోసం చర్చలు జరిగినప్పుడు, ఉదయం వేళల్లో అలా కాంపోజిట్ ప్రోగ్రాం ఉంటే బాగుంటుందన్న డైరెక్టరేట్ సూచనలు కూడా ఉండడం వల్ల, శ్రీమతి దుర్గాభాస్కర్ స్టేషన్ డైరెక్టర్‌గా ఉండగానే, 'ఉదయరేఖలు' కార్యక్రమం 2.10.1993 నుండి అమలులోకి వచ్చింది. పలు అంశాల కలయికగా అనౌన్సరే మధ్యలో యాంకరింగ్ చేసే పద్ధతిలో 'ఉదయరేఖలు' కార్యక్రమం ప్రారంభమైంది. హైదరాబాద్ పద్ధతి విజయవాడలో రావడానికి కారణమని నన్నూ భట్టులాంటివాడు ముందుగా తిట్టుకున్న మాట నిజమేగానీ, రాను రాను 'ఉదయరేఖలు'కు శ్రోతృ జనాదరణ బాగా పెరిగింది. అప్పట్లో ఉదయరేఖల్లో వారం వారం 'నాడు - నేడు' లాంటి లఘు నాటికలుకూడా ప్రసారమయ్యాయి. ఒకనాటికీ నేటికీ ఒక అంశంలోని పరిణామాన్ని విశదపరుస్తూ ప్రసారమైన 'నాడు - నేడు'కు నేనూ స్క్రిప్టులు రాశాను. ఉదాహరణకు 6.10.93 ఉదయం ఉదయరేఖల్లో వచ్చిన నాడు - నేడు లఘునాటిక నా రచనయే. 'గృహప్రవేశం' అన్న శుభకార్యం ఒకప్పుడు ఎలావుండేది నేటికి ఎలాపరివర్తనం చెందింది చూపుతూ చేసిన రచన అది. 'లైటర్ వీన్'లో సాగేదే!




ఫిక్స్‌డ్ పాయింట్ ఛార్ట్ మార్పుల్లోనే నా తెలుగు విభాగం ఛెంక్స్‌లోనూ కొత్త మార్పులు ప్రతిపాదించాను. సుదీర్ఘ ప్రసంగాలు తగ్గించి పలు సాహిత్య సాంస్కృతిక అంశాలకు వేదికగా 'సమాహారం' అనే కార్యక్రమాన్ని రూపకల్పన చేయడం జరిగింది. వారం వారం ప్రసారమయ్యే 'సమాహారం'లో కనీసం మూడు నాలుగు అంశాలు ఉండేలా, వైవిధ్యం ఉండేలా రూపకల్పన చేయడం జరిగింది. 8.10.1993 శుక్రవారం రాత్రి 9.16కు పావుగంట కార్యక్రమంగానే మొదటి 'సమాహారం' కార్యక్రమం ప్రసారమై శ్రోతలను ఆకట్టుకుంది. నేను తెలుగు విభాగంలో కార్యక్రమ నిర్వహణాధికారిగా ఉన్నన్ని రోజులూ హైదరాబాద్‌లో కూడా ఈ 'సమాహారం' కార్యక్రమం ప్రసార వైఖరి కొనసాగించాను. 7,8 తేదీల్లో విజయవాడలోనే గ్రూప్ ఫోర్ స్టేషన్ల కో ఆర్డినేషన్ మీటింగ్ జరిగింది. ఈ కొత్తమార్పులు అందరి దృష్టికీ వెళ్ళాయి.

ఆకాశవాణి జాతీయ స్థాయిలో ఆ ఏడు తెలుగు నాటక రచనల పోటీని నిర్వహించింది. దానికి విజయవాడ కేంద్రాన్ని నిర్దేశించి బాధ్యతలప్పచెప్పింది. అనేకంగా వచ్చిన నాటకాల స్క్రిప్టులు చదివి శ్రీ రమామోహనరావుగారు, నేను, ఇంద్రగంటి శ్రీకాంతశర్మ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించి నివేదిక నివ్వడం గుర్తుంది. అక్టోబర్ 13వ తేదీ దినపత్రికల్లో నాటక రచన పోటీ ఫలితాలు ప్రచురింపబడ్డాయి.

అక్టోబర్‌లో 'కవితా హారం'లో శ్రీ పైడిపాటి సుబ్బరామశాస్త్రి, జగాష్విలి (శ్రీఆర్.శరభలింగాచారి) తమ కవితలు వినిపించారు (7.10.93). అక్టోబర్‌లో నేను చేసిన రెండు పరిచయ కార్యక్రమాలూ నాకు తృప్తినిచ్చాయి. 'కొల్లాయి గట్టితేనేమి' వంటి సుప్రసిద్ధ నవలా రచయిత, కథకుడు శ్రీ మహీధర రామమోహనరావుగారితో రచయితగా, స్వాతంత్ర్య సమరయోధునిగా ఆయన తలుచుకునే




తరుణాలను రికార్డు చేసి 21.10.93 ఉదయం 7.45 కు ప్రసారం చేయడమైంది. అలాగే 'మతాతీత రాజకీయాలు' గురించి ప్రముఖ పాత్రికేయులు, విశాలాంధ్ర జర్నలిస్టు శ్రీ సి.రాఘవాచారితో ఇంటర్వ్యూ 26.10.93 రాత్రి 9.16కు ప్రసారమైంది. తిరుపతి వెంకట కవులలో ఒకరయిన శ్రీ చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రిగారి సమకాలీనులైన శ్రీ మంచావఝుల సీతారామ శాస్త్రిగారితో 'నేనెరిగిన చెళ్ళపిళ్ళ' అనే అంశంపై మల్లాది సూరిబాబు పరిచయకర్తగా పరిచయ కార్యక్రమం 28.10.93 ఉదయం 7.45 కు ప్రసారం చేసాం. సుశర్మ, కవి సీతారాంల కవితలు 4.11.93న ప్రసారమయ్యాయి.



# 42

"యూ కాంట్ ఛూజ్ యువర్ బాస్ ఆర్ యూ కాంట్ ఛూజ్ యువర్ సబ్ ఆర్డినేట్" అన్నమాట ప్రభుత్వ కార్యాలయాలకు బాగా వర్తిస్తుంది. మనకు పై అధికారులుగా ఎలాంటి వారొస్తారో తెలియనట్లే పై అధికారులు మనకు సహాయకులుగా పనిచేయడానికి ఎవరిని నియమిస్తారో కూడా చెప్పలేం. ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్‌లకు సహాయకులుగా పనిచేయడానికి ప్రొడక్షన్ అసిస్టెంట్‌లు నియమింపబడతారు. ప్రొడక్షన్ అసిస్టెంట్ పోస్టులలో తగినంతమంది లేకపోవడం వలన డ్యూటీ ఆఫీసర్లుగా పనిచేసేవారిలో ఎవరినయినాగానీ అలాగే అనౌన్సర్లలో ఎవరినయినాగానీ సహాయకులుగా కార్యక్రమ విభాగాలకు కేటాయించే అధికారం స్టేషన్ డైరెక్టర్‌దే. అలాగే అడ్మినిస్ట్రేటివ్ వర్క్‌కు ప్రోగ్రాం సెక్రటరీని కూడా కేటాయించడం గ్రేడ్ వన్ లేక గ్రేడ్ టూ క్లర్క్‌ను అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌ను సంప్రదించి స్టేషన్ డైరెక్టరే కార్యక్రమ విభాగాలకు కేటాయిస్తారు. నేను విజయవాడలో కార్యక్రమ నిర్వహణాధికారిగా తెలుగు విభాగం చూసినంత కాలం ప్రోగ్రాం సెక్రటరీగా ఇందిర ఉండేది. ఇందిర శ్రీ గోపాల్ కూతురు. శ్రీ గోపాల్ అంటే ఎవరో మీకు బాగా తెలియాలంటే శంకరాభరణం సినిమాలో బ్రోచేవారెవరురా అన్న కీర్తను కొత్త రకం విరుపులతో అమ్మాయికి నేర్పిస్తూ శంకరశాస్త్రిని ఎద్దేవా చేసే సంగీతం మాస్టారుగా నటించిన ఆయన అంటే తెలుస్తుంది. శ్రీ గోపాల్ ఆకాశవాణిలో కార్యక్రమ నిర్వహణాధికారిగా పనిచేస్తూండేవారు. పలు సినిమాల్లో చిన్నా చితకా పాత్రలు వేశారు. ఆయన అకాలమరణంతో కంపెన్‌సేటివ్‌గా ఇందరకు రేడియోలో ఉద్యోగం వచ్చింది. ఇందిర మంచి సౌమ్యురాలు, పనిమంతురాలు, నెమ్మదయిన మనిషి. కుమారిగా ఉండిన ఇందిర మేం విజయవాడలో ఉండగానే అనౌన్సర్ జయప్రకాశ్‌ని ప్రేమించి పెళ్ళిచేసుకుంది. అది కులాంతర మతాంతర వివాహం వంటిదే


ప్రోగ్రాం సెక్రటరీ ఇందిర

అలాగే తెలుగు విభాగం ప్రొడక్షన్ వర్క్‌కు డ్యూటీ ఆఫీసర్‌గా పనిచేస్తుండే రాజారెడ్డి నాకు పనిచేస్తూండేవాడు. నవంబర్‘93లో డ్యూటీలు మార్పులు చేస్తూ స్టేషన్ డైరెక్టర్ తెలుగు విభాగానికి రాజారెడ్డి స్థానంలో టి.వసంత కుమారి


రాజారెడ్డి

అనే డ్యూటీ ఆఫీసర్‌ని వేశారు. ఆమెకు అప్పట్లో అంత మంచి పేరుండేది కాదు. భయపడేవారు. గ్రామీణ కార్యక్రమాల విభాగానికి చెందిన ఒక వ్యక్తిని చెప్పుతో కొట్టిందని అప్పట్లో విజయవాడ పేపర్లలో వార్త కూడా వచ్చింది. ఆమెను తమ సెక్షన్‌కు నియమిస్తే తాము పనిచేయ(లే)మని కొందరు ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్‌లు స్వయంగా స్టేషన్ డైరెక్టర్‌కు రాసిచ్చారట కూడాను. ఆమెను నా తెలుగు విభాగానికి కేటాయించడంతో విజయవాడ రేడియోలోనే ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న మా ఆవిడ ఉషారాణిని కొందరు భయపెట్టారు కూడాను, నా గురించి జాగ్రత్తపడమని. కానీ వసంతకుమారి తెలుగు విభాగానికి శ్రద్ధగా పనిచేసింది. రూల్స్ ప్రకారం పోవడం, అనవసరంగా మెరమెచ్చులు మాట్లాడటం చేయకపోవటం ఆమె లక్షణం ఆకాశవాణిలో పనిచేసే ఒక ఉద్యోగితో ఆమె సంబంధ బాంధవ్యాలు నెరుపుతోందని అనేవారు. ఏమయినా వసంతకుమారి చక్కగా పనిచేసింది. తను చేయవలసిన రికార్డింగులూ అవీ అయిపోతే సెక్షన్‌లోనే కూర్చుని ఏ పుస్తకమో చదువుకునేది గ్రూప్ -2 పరీక్షలకు ప్రిపేర్ అవుతూ అలా నానుండి కొన్ని తెలుగుపుస్తకాలు, సాహిత్యవిషయాలు తెలుసుకుని ఒక్కగా పరీక్షలు రాసి ఉత్తీర్ణత చెంది అనంతరం ఆకాశవాణిని వదిలిపెట్టి రాష్ట్రప్రభుత్వోద్యోగినిగా వెళ్ళిపోయింది. 1993 నవంబర్ 22న తను నా తెలుగు విభాగంకు డ్యూటీ ఆఫీసర్‌గానే ప్రొడక్షన్ వర్క్‌కు నియమించబడి పనిచేసింది.


రావిశాస్త్రిగారు

నవంబర్ 1993లోనే అప్పట్లో పిల్లల కార్యక్రమాలు నా శ్రీమతి ఉషారాణి చూస్తూండేది కనుక నవంబర్ 14 బాలల దినోత్సవ సందర్భంగా ఆహూతుల సమక్షంలో 9వ తేదీ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో పిల్లల ప్రోగ్రాం నిర్వహించింది. ఆ కార్యక్రమ ఆహ్వాన పత్రాన్ని నేనే డిజైన్ చేసినట్లు గుర్తు! ప్రముఖ కథా, నవలా రచయిత రావిశాస్త్రిగారు నవంబర్ 10నే విశాఖలో అస్తమించారు. ఆ రాత్రి 8.30కు శ్రద్ధాంజలి కార్యక్రమం ప్రసారం చేస్తూ అందులో నండూరి రామమోహనరావు, భమిడిపాటి జగన్నాథరావుగార్ల శ్రద్ధాంజలిని విజయవాడ నుండి చేర్చడం జరిగింది.

ఆకాశవాణిలో సాంకేతికంగా కొత్తమార్పులు, అభివృద్ధి చోటుచేసుకుంటున్న కాలం అది. అందులో భాగంగానే దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని 13.11.93న ఉదయం 9.45 నుండి 11వరకు రేడియో బ్రిడ్జి కార్యక్రమంగా అవధాన కార్యక్రమం రూపొందించబడింది. ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో పృచ్ఛకులు, సమన్వయకర్తగా డా.జి.వి.సుబ్రహ్మణ్యంగారు ఉండగా విజయవాడ, కడప, విశాఖ కేంద్రాలలోనూ ఒకొక్క అవధానిని నిలిపి ప్రత్యక్ష ప్రసారంగా జరిగిన ఆ అవధాన కార్యక్రమం శ్రోతల అభిమానాన్ని చూరగొంది. సాహిత్య కార్యక్రమాలలో రేడియో బ్రిడ్జ్ అవధానం ఒక వినూత్న ప్రయోగం. విజయవాడ కేంద్రం నుండి శ్రీ కడిమిళ్ళ వరప్రసాద శతావధానిని ఆ కార్యక్రమంలో పాల్గొనేందుకు పిలిచాను. అప్పటికింకా తను యువకుని కిందే లెఖ్ఖ. కానీ అవధాన కార్యక్రమంలో తన ప్రజ్ఞాపాటవాలతో సమయస్ఫూర్తితో చక్కగా రాణించారు. నరసాపురం టైలర్ హైస్కూల్‌లో తెలుగు పండితునిగా పనిచేస్తూండేవారు.


శ్రీ కడిమిళ్ళ వరప్రసాద్

నాటి అవధానం 'రేడియో అనుసంధాన అవధానం'. విశాఖపట్నం నుండి శ్రీ బేతవోలు రామబ్రహ్మం, కడప కేంద్రం నుండి శ్రీ ఆశావాది ప్రకాశరావు అవధానులుగా పాల్గొనగా ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో డాక్టర్ ముకురాల రామారెడ్డి, ఆచార్య తిరుమల, డాక్టర్ రుక్నుద్దీన్, డాక్టర్. కసిరెడ్డి వెంకటరెడ్డి, డా.కిళాంబి జ్యోతిర్మయి, శ్రీ ఉత్పల సత్యనారాయణాచార్య పృచ్ఛకులుగా ఉండి డా.జి.వి సుబ్రహ్మణ్యంగారి అనుసంధానంలో కార్యక్రమాన్ని రక్తికట్టించారు.

శుక్రవారాల్లో రాత్రి 9.16కు ప్రవేశపెట్టిన 'సమాహారం' విషయవైవిధ్య కదంబం కార్యక్రమంలో 5.11.93 న ఆ మర్నాడు అనగా 6.11.93న ఖగోళంలో జరగనున్న రవి మీదుగా బుధగ్రహ సంచార సన్నివేశం పురస్కరించుకుని శ్రీ కొండముది హనుమంతరావుగారు

'బుధుని అంతర్యానం' అనే విషయ విశ్లేషణా ప్రసంగాన్నందించగా, శ్రీ దూర్జటి వేంకట బాలాజీ "దాశరథి పద్యగేయ కవిత్వం" గురించి ప్రసంగించారు. విజయవాడకు విజిటింగ్ ఆర్టిస్టుగా వచ్చిన శ్రీ కనమలూరి వెంకట శివయ్యగారి 'గోల్కొండ వైభవం' అనే కవితను సమాహారంలోనే 26.11.93 న వినిపించడం జరిగింది.

18.11.93 గురువారం ఉదయం 7.45కు 'తిథులెరుగని అతిథులు' అనే హాస్యప్రసంగాన్ని బాపట్ల ఆర్ట్స్ కళాశాలలో పనిచేస్తుండిన శ్రీ దర్భా బాబూరావు అందించగా 23.11.93 రాత్రి 'ఓజోన్ కథ' అని పర్యావరణ నేపథ్యంలో డాక్టర్. దుగ్గరాజు శ్రీనివాసరావు ప్రసంగించారు.

నవంబర్ 1993లో నేను రూపొందించి ప్రసారం చేసిన కార్యక్రమాల్లో శ్రీ గొర్రెపాటి వెంకటసుబ్బయ్య 2.11.93న వినిపించిన 'బౌద్ధధర్మ సారాంశం' ప్రసంగం, 11.11.93 గురువారం ఉదయం 'రసరాజు' అందించిన 'తెలుగు కవుల దీపావళి' ప్రసంగం కూడా పేర్కొనదగినవే.

గుంటూరు నల్లచెరువు గ్రామంలో శ్రీ పీలా రామకృష్ణగారు ఆంధ్రప్రదేశ్ జీవరక్షా సంఘం నిర్వహిస్తూ 'జీవబంధు' అనే మాసపత్రికను తన సంపాదకత్వంలో వెలువరించేవారు. నేను రేడియోలో చేరకముందు నుంచీ 'జీవబంధు' పత్రిక తెలుసు. కంచంలో కలకలం' అని నేను యువకునిగా శాఖాహార ప్రాశస్త్యంపై రాసిన కవిత 'జీవబంధు'లో ప్రచురితమైంది కూడాను. పీలా రామకృష్ణగారికి నేను కాంటాక్ట్ పంపగానే ఆయన ఎంతో ఆసక్తితో తరలి వచ్చి 'జంతు సంరక్షణకు జనచైతన్యం" అనే అంశంపై 30.11.93 (9.16p.m)కు నేను రూపొందించిన పరిచయ కార్యక్రమంలో పాల్గొన్నారు. నిజంగా ఆంధ్రప్రదేశ్ జీవరక్షా సంఘం తరపున ఆయన చేసిన కృషి అభినందనీయం. గోవధ నిషేధం, జంతు బలుల నిలుపుదలలో ఆయన పాత్ర, కలిగించిన చైతన్యం, చేసిన పోరాటం గుర్తించదగినదే

'సరసవినోదిని' సమస్యాపూరణం కార్యక్రమం ప్రసారవేళలు ఉదయం ఉండేవి. అయితే డైరెక్టర్‌గారు అప్పటి కొత్త ఫిక్స్‌డ్ పాయింట్ ఛార్ట్‌లో 1993 అక్టోబర్ నాలుగు నుండి ఆ ప్రసారవేళను శనివారాలు రాత్రి 8.15కు మార్చారు. నాకు ఆ మార్పు నచ్చకపోయినా ఔదలదాల్చక తప్ప(లే)దు కదా 'వనజభవుండు ఫాలమున వ్రాసిన వ్రాత విధానమయ్యెడున్' అనే సమస్యతో శ్రీ కావూరి పూర్ణచంద్రరావుగారు మారినవేళల ఆ సమస్యాపూరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నవంబర్‌లో శ్రీ మెట్టా వెంకటేశ్వరరావు, శ్రీపి.ఉమానాథ శర్మ, డిసెంబర్'93లో శ్రీ డి.ఆర్.చక్రవర్తి, శ్రీ యం.పి.జానుకవిగారలు 'సమస్యాపూరణం' నిర్వహించారు.


డాక్టర్.ప్రసాదరాయ కులపతిగారు

శ్రీ జంధ్యాల మహతీ శంకర్‌గారి స్కాంధపురాణం ముగిసాక ఆదివారాలు మధ్యాహ్నం 12.05కు అరగంట వ్యవధితో ప్రసారమయ్యే 'కథాలహరి' కార్యక్రమంలో 1993 అక్టోబర్ 3 నుండి వరుసగా పదమూడు వారాలపాటు 'ప్రబంధపాత్రల కథలు' ప్రసారం చేయడం జరిగింది. డాక్టర్.ప్రసాదరాయ కులపతిగారు వివిధ ప్రబంధాలనుండి ప్రముఖ పాత్రలపరంగా ఆ కథలను ఆసక్తిగా శ్రోతలకు అందించారు. 26.12.93 వరకూ ఆ కథలు ఆయన గళంలో విని శ్రోతలు ఆనందించారు.

చర్చాకార్యక్రమాల ప్రసారంలో భాగంగా 18.10.93న మహాత్ముని "నవీన విద్యాభావన మాసిపోయిందా" అనే అంశంపై ఆ ఏటి జాతీయ, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీతలు కొందరి అభిప్రాయాలను ప్రసారం చేయడం జరిగింది. శ్రీ సోమంచి రామం, శ్రీ ఎ.వి.రంగారావు, శ్రీమతి సి.హెచ్.హైమవతి, శ్రీ ఎం.నాగవీరభద్రశాస్త్రి, శ్రీ డి.అప్పారావ్ ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు. అందరూ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు కావడం విశేషం. అలాగే 15.11.93 రాత్రి "చేతి కళలకు చేయూత ఉందా?" అనే అంశంపై చర్చలో శ్రీమతి వేమా మంజులవాణి, శ్రీ ఎన్.సంజీవరావు శ్రీ నందగిరి శ్రీనివాసరావు, శ్రీమతి. జి.లలితారాణి పాల్గొన్నారు. నాకు

ఆసక్తికరమైన వార్షిక కార్యక్రమంగా 20.12.93న 1993 తెలుగు సాహిత్యం - ఒక అవలోకన అనే కార్యక్రమాన్ని రూపొందించి ప్రసారం చేయడం జరిగింది. 1993లో తెలుగు కవిత గురించి డా. కడియాల రామమోహనరాయ్, 1993లో తెలుగు కథ గురించి డా.పాపినేని శివశంకర్, 1993లో తెలుగు పత్రికలో వివిధ శీర్షికలు అనే అంశంపై శ్రీ పొనుగోటి కృష్ణారెడ్డి విశ్లేషాత్మక ప్రసంగాలు చేసారు.


డాక్టర్ బొడ్డుపల్లి పురుషోత్తంగారు

30 డిసెంబర్'93 ఉదయం 7.45కు ఆ ఏటికి వీడ్కోలు ప్రసంగంగా 'ప్రాచీన కవిత్వంలో కాలచిత్రణ' అనే అంశంపై డాక్టర్ బొడ్డుపల్లి పురుషోత్తం (గుంటూరు) చక్కటి ప్రసంగం చేసారు. విద్యాకార్యక్రమాలను చూస్తూండే శ్రీ పి.విజయభూషణ శర్మ (ప్రొడ్యూసర్)గారిని కోరగా నేనిచ్చిన నాలుగు పుస్తకాలపై ఆయన చక్కని సమీక్ష రాయగా ఆ స్క్రిప్ట్ 27.12.93 పుస్తకదర్శిని కార్యక్రమంగా నా గళంలోనే ప్రసారం చేశాను. ఆ గ్రంధాలు సూరపనేని వేణుగోపాలరావుగారి 'గూఢ చిత్ర రహస్య ప్రణాళిక', శ్రీ కొండూరి వీరరాఘవాచార్యులుగారి 'జీవబ్రహ్మయోగం', శ్రీ శిష్టా చంద్రమౌళిశాస్త్రిగారి 'సుందర హనుమద్వైభవము'. విజయ భూషణ శర్మగారు సంస్కృత ఆంధ్ర ఆంగ్లాల్లో మంచిపండితులు.


ఆంధ్రప్రదేశ్ గవర్నర్ శ్రీ కృష్ణకాంత్

శ్రీ కృష్ణకాంత్ అప్పట్లో ఆంధ్రప్రదేశ్ గవర్నర్గా ఉండేవారు. 'మద్యపాన నిషేధం'పై జరిగిన ఓ సభలో పాల్గొనేందుకు డిసెంబర్11, 1993 ఆయన వచ్చినప్పుడు ఆ రాత్రి 8 గంటలకు రేడియో నివేదిక ప్రసారం చేస్తూ ఆ కార్యక్రమాన్ని నా వ్యాఖ్యానంతో ప్రసారం చేయడమైంది. అలాగే 1993 డిసెంబర్ 15 ప్రముఖ చిత్రకారులు సినీదర్శకులు బాపుగారి అరవయ్యవ పుట్టినరోజు సందర్భంగా విజయవాడ ఠాగూర్ లైబ్రెరీలో ఒక సమావేశం జరిగింది. ఆ సభలోనే జనవరిలో జరగబోయే విజయవాడ పుస్తక ప్రదర్శనకు 'బాపు'గారు రానున్నారన్న వార్త తెలిసింది. చిన్నప్పటి నుండీ బాపుగారి అభిమానినైన నేను అంత వరకూ ఆయనను ప్రత్యక్షంగా చూడడం జరగనే లేదు. 1994 కొత్త సంవత్సరం ప్రారంభంలోనే తొలిసారి 'బాపు'గారిని ప్రత్యక్షంగా చూడడం జరిగింది. అప్పటి నా ఆనందం ఏమని చెప్పను?



# 43



చా.సో గారు

**1994 నూతన సంవత్సరం వస్తూనే -** తెలుగు కథా ప్రియులకు ఓ విషాదాన్ని కలిగించింది. ప్రముఖ కథా రచయిత, 'చా.సో'గా సుప్రసిద్ధులైన చాగంటి సోమయాజులు గారు 1994 జనవరి'2 ఆదివారం మద్రాసులో కన్నుమూసారు. ఆయన విజయవాడ వచ్చినప్పుడు - వాకాటి పాండురంగారావుగారితో ఆయనను ఇంటర్వ్యూ చేయించి, ప్రసారం చేసిన జ్ఞాపకం కదలాడుతూనే ఉంది. సోమవారం 3వ తేదీ ఉదయమే ఏడుంబావుకు 'ఉదయరేఖలు' కార్యక్రమంలో - 'చా.సో భావశకలలు' పేర ఆయన గళం కూడా చేర్చి, ఓ కార్యక్రమం ప్రసారం చేయడం జరిగింది. అదే ఆయనకు నివాళి!

కథా ప్రియులకే కాదు, పుస్తక ప్రియులందరికీ కూడా - ఏటా విజయవాడ 'పుస్తకమహోత్సవం ఓ గొప్ప వేడుక! జనవరిలో జరిగే ఆ పుస్తక మహోత్సవం వైపు ప్రజల దృష్టిని మరల్చేందుకు, 'విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ' అధ్యక్షులు శ్రీ నవోదయ రామమోహనరావు, కార్యదర్శి శ్రీ బాబ్జీ, ఆ ఏడు నాల్గవ తేదీ సాయంత్రం, నగరంలో పుస్తకప్రియుల పాదయాత్ర' నిర్వహించారు. ఆ 'పాదయాత్ర'కు ప్రముఖ రచయిత శ్రీ ముళ్లపూడి వెంకటరమణ నాయకత్వం వహించారు. ముళ్ళపూడి ఉన్నప్పుడు 'బాపు' ఉండకుండా ఎలా ఉంటారు? ఆ పాదయాత్రలో మొదటిసారిగా - 'బాపు'గారిని నేను కలుసుకోవడం, ఆయన పక్కనే కాసేపు నడవడం మరపురాని మధుర ఘట్టమే. నా కబుర్లు చిరునవ్వుతో వినడం తప్ప, బాపు నాతో పెద్దగా మాట్లాడింది లేదు. అసలు ఆయన మాటకోసం - అప్పటికీ, ఇప్పటికీ ఎందరో ఎదురుచూస్తూనే ఉంటారన్నది వాస్తవం! విజయవాడ లెనిన్ విగ్రహం నుంచి ప్రారంభమైననాటి ఆ 'పుస్తకప్రియుల పాదయాత్ర' బీసెంట్ రోడ్, ఏలూర్ రోడ్, విజయాటాకీస్, డోర్నకల్ రోడ్ మీదుగా పి.డబ్ల్యు.డి గ్రౌండ్స్‌లోని బుక్ ఎక్జిబిషన్ ప్రాంగణం చేరుకుంది. పుస్తకం విలువను తెలిపే పలు ప్లేకార్డ్స్ చేతబూని, ఆ పాదయాత్రలో నగరంలోని పిన్నలు, పెద్దలు, మేధావులు అనేకమంది పాల్గొన్నారు.



శ్రీ ముళ్లపూడి వెంకటరమణ గారు, బాపు గారితో

ఆ బృందంలో నేనూ ఉండడం ఆనందం కలిగించిన విషయం. ముళ్ళపూడివారినీ, బాపుగారినీ ప్రత్యక్షంగా తొలిసారి చూసిన ఆ జ్ఞాపకం మనసులో పదిలంగా ఉండిపోయింది. ఆ ఏటి పుస్తక ప్రదర్శనం'లోనే - అయిదోతేదీన 'కవితా ఓ కవితా' అనే సంకలనం ఆవిష్కృతమైంది. ఇంద్రగంటి శ్రీకాంతశర్మ సంపాదకత్వంలో, కవులందరి ప్రాతినిధ్య కవితలతో వెలువడిన సంకలనం అది. ఆ సంకలనంలో నా కవితా చోటు చేసుకుంది.


అఫ్సర్

ఆకాశవాణిలో ఏటా జరిగే 'జాతీయ కవి సమ్మేళనం తెలుగు అనువాదానికి విజయవాడ కేంద్రానికి అవకాశం ఇమ్మన్న ప్రతిపాదన మన్నించి, ఆ ఏడాది ఒరియా భాషకు ఎన్నికైన - శ్రీ హరిప్రసాద్ దాస్ కవితను శ్రీ సితేష్ ఆలోక్ హిందీ అనువాదంతో బాటుగా, హైదరాబాద్ కేంద్రం పంపించగా, దాని తెలుగు అనువాదానికి - అప్పట్లో ఆంధ్రభూమి దినపత్రిక ఛీఫ్ సబ్ ఎడిటర్‌గా విజయవాడలో పనిచేస్తున్న కవి మిత్రుడు 'అఫ్సర్' చేత అనువాదం చేయించి, రికార్డు చేసి పంపడం జరిగింది. గణతంత్ర దినోత్సవం ముందు రోజు 25.1.94 రాత్రి పది గంటలకు జాతీయకవి సమ్మేళనం ప్రసారం కాగా, అందులో ఒరియా కవితకు తెలుగు అనువాద కవితగా అఫ్సర్ అనువాదం ప్రసారమైంది. అది నాకు సంతోషదాయకమైన సంగతే!


శ్రీ ఆవంత్స సోమసుందర్ గారితో

'పుస్తకమహోత్సవం' సందర్భంగా విజయవాడ విచ్చేసిన ప్రముఖకవి శ్రీ ఆవంత్స సోమసుందర్‌ను జనవరి నాలుగునే స్టూడియోకి ఆహ్వానించి వారి కవితను రికార్డు చేయడం కూడా గుర్తుంది.


Radhakrishna Bhamidipati

తెలుగు సాంఘిక నాటకాలలో గొప్పగా చెప్పుకునే ఓ అద్భుతనాటకం 'కీర్తిశేషులు' దాని రచయిత శ్రీ భమిడిపాటి రాధాకృష్ణగారు. 1960 లో రాసిన ఆ నాటకం - ఆ రోజుల్లో రంగస్థలం మీద ఎంత ప్రాచుర్యం పొందిందో చెప్పనవసరంలేదు. ఒక నటుడి జీవితానికి దర్పణం పట్టే ఆ నాటకంలో, 'మురారి' పాత్ర అతి ప్రసిద్ధం! సుప్రసిద్ధ సినీ నాటక రచయిత శ్రీ భమిడిపాటి రాధాకృష్ణగారిని స్వయంగా కలుసుకోవడం మాత్రమే కాక, ఆయన ప్రధానోపన్యాసం చేసిన ఓ సభకు అధ్యక్షత వహించే అవకాశం కలిగింది నాకు. స్వర్గీయ డాక్టర్. కొొట్టపాటి గంగధరరావుగారి అష్టమ వర్ధంతి సందర్భంగా - 'కళాభారతి' సంస్థవారు బాపట్లలో 27.1.94 సాయంత్రం ఏర్పాటు చేసిన సభకు, కార్యదర్శి డా.కె.వి.యస్. ఆచార్యగారి ఆహ్వానం మేరకు, నేను అధ్యక్షత వహించాను. విజయవాడనుండి కారులో రాధాకృష్ణగారూ, ప్రసిద్ధ సినీరంగస్థలనటులు జానపద కళాప్రవీణులు శ్రీ కర్నాటి లక్ష్మీ నరసయ్యగారూ నేనూ బాపట్లకు ప్రయాణించి, అక్కడ అతిథిగృహంలో బసచేసి చెప్పుకున్న కబుర్లు, తనివి తీరనివి. తెలుగు సాంఘిక నాటకంలో పెనుమార్పులు తెచ్చిన కొర్రపాటి వారిని గూర్చి నాటి సభలో ప్రసంగాలు జరిగాయి. 'సినిమాలకు సంభాషణలు రాయడం లేదేమని అడిగినదానికి' రాధాకృష్ణగారు - అశ్లీల సంభాషణలు రాయడం ఇష్టంలేక గత అయిదేళ్ళుగా కేవలం సినిమాలకు స్క్రీన్‌ప్లే, కథ మాత్రమే సమకూరుస్తున్నానని చెప్పారు. తెలుగు సినిమారంగం బయ్యర్స్ మార్కెట్ అయిందనీ, సినీ


కళాభారతి - బాపట్ల.

ఆహ్వానము

ది 27-1-94 గురువారం సాయంత్రం 6-30 ని.లకు

స్వర్గీయ డా॥ కొొట్టపాటి గంగాధరరావుగారి

అష్టమ వర్ధంతి సభ జరుగును.

శ్రీ ఎ. వెంకటరావు "సుధామ" గారు

అధ్యక్షత వహించెదరు.

శ్రీ భమిడిపాటి రాధాకృష్ణ గారు

శ్రీ కర్నాటి లక్ష్మీనరసయ్యగారు

డా॥ కె.వి.యస్. ఆచార్య

కార్యదర్శి

వ్యాపారుల గొంతెమ్మ కోరికలను సినీ రచయితలు తీర్చవలసిన దుస్థితి దాపురించిందనీ, అప్పట్లోనే భమిడిపాటి రాధాకృష్ణగారు ఆవేదన వెల్లడించారు.

భమిడిపాటి ఇంటిపేరుగా గల మరో ప్రముఖ తెలుగు కథారచయిత - శ్రీ భమిడిపాటి జగన్నాధరావుగారు. జీవితాలని రంగు రంగుల అద్దాలలోంచి కాకుండా, మామూలు బతుకుల్లోంచి చూపెట్టడమే ఆయన కథలు చేసేపని. కథలు రాయడం కన్నా, చదవడమే ఎక్కువ ఇష్టం అని చెప్పుకుంటారాయన. బుచ్చిబాబుగారి సంస్మరణగా వేదగిరి కమ్యూనికేషన్స్ తరపున మిత్రుడు వేదగిరి రాంబాబు



శ్రీ భమిడిపాటి జగన్నాధరావుగారితో

1996లో భమిడిపాటి జగన్నాధరావుగారి కథలను సంపుటీకరించాడు. 'నన్ను వెంటాడే కథలు' పేరిట 1994లోనే - విజయవాడ మారుతీనగర్ అపురూప అపార్ట్‌మెంట్స్‌లో ఉంటూండిన శ్రీ భమిడిపాటి జగన్నాధరావుగారిని స్టూడియోకి పిలిచి, జనవరి 17న ఓ ఇంటర్వ్యూ రికార్డు చేసి, 20.1.94 గురువారం ఉదయం 7.45కు ప్రసారం చేయడం జరిగింది. ఆ పరిచయ కార్యక్రమానికి శ్రోతల ప్రశంసలెంతగానో అందాయి.

జనవరి 1994లో నేను తెలుగు విభాగం నుండి ప్రసారం చేసిన మరికొన్ని కార్యక్రమాల వివరాల్లోకి వెడితే - 4.1.94 మంగళవారం రాత్రి 9.16కు మచిలీపట్నం నోబెల్ కాలేజ్ ఎకనమిక్స్ శాఖ అధిపతి శ్రీ.కె.బాలకోటేశ్వరరావుగారు చేసిన ప్రసంగం 'దారిద్ర్యరేఖ దాటి రావడం ఎలా?'. 6.1.94 ఉదయం 'ఆదిభట్లవారి చమత్కార వైభవం' గురించి శ్రీ కర్రా ఈశ్వరరావు గారు రాసిన ప్రసంగ వ్యాసాన్ని నా గళంతోనే శ్రోతలకు వినిపించాను. ఏలూరుకు చెందిన శ్రీ కొడిమెల శ్రీరామమూర్తిగారు 11.1.94 రాత్రి 9.16కు 'లాల్ బహదూర్ శాస్త్రి అనుపమాన వ్యక్తిత్వం' గురించి ప్రసంగించారు. 25.1.94 రాత్రి 9.16కు 'చరిత్రలో శాసనాల ప్రాముఖ్యత' గురించి - గుంటూరుకు చెందిన డా.వి. సుందరరామశాస్త్రి ప్రసంగించారు.




తమాషాగా చిత్రకారులు పలువురు ప్రసంగకర్తలు కారు. బొమ్మలు వేసుకోవడం తప్ప అంతగా కబుర్లు చెప్పలేని ఆర్టిస్టులు ఉన్నమాట నిజం. ప్రముఖ చిత్రకారుడు 'బాలి' (శ్రీ మేడిశెట్టి శంకరరావు) చేత 27.1.94 గురువారం ఉదయం 7.45కు 'సాల్వడార్ డాలీ కవితాత్మక చిత్రాలు' అనే అంశం మీద ప్రసంగం చేయించడం మరిచిపోలేను. 'బాలి' మాత్రం మంచి మాటకారి. కొంచెం నటనానుభవమూ ఉన్నవాడు. బొమ్మలేకాక, తన కథలతోనూ ఇప్పటికీ అలరిస్తున్నాడు! ఆంధ్రజ్యోతి వీక్లీకి బొమ్మలు వేస్తూ, 'బాలి' అప్పట్లో విజయవాడ వాసిగా ఉన్నాడు. తనకు మొదటిసారిగా రేడియోలో అవకాశం కల్పించింది నేనేనని ఇప్పటికీ అంటూంటాడు తను.

ప్రతి శుక్రవారం అప్పట్లో రాత్రి 'సమాహారం' పేర నేను ప్రసారం చేసిన కదంబ కార్యక్రమాల్లో జనవరి '94లో మల్లంపల్లి, పింగళి లక్ష్మీకాంతం, రాళ్ళపల్లి, మధునాపంతుల ప్రభృతులపై లఘు ప్రసంగాలు వినిపించాను.

'పరీక్షించాల్సిన పరీక్షా విధానం' అనే అంశంపై 17.1.94 రాత్రి 9.30కు చర్చా కార్యక్రమం ప్రసారం చేయడం జరిగింది. అప్పట్లో పత్రికల్లో విద్యావిధానంపై విరివిగా వ్యాసాలు రాస్తూండే కృష్ణాజిల్లా వీర్లపాడుకు చెందిన శ్రీ మల్లెల సూర్యనారాయణ, ఎలకుర్రుకు చెందిన ఎం.నాగవీరభద్రశాస్త్రి, గుంటూరు శ్రీ పి.వి.కె శ్రీనివాసరావు, కె.నాగేశ్వరరావు ఆ చర్చలో పాల్గొన్నారు.

విజయవాడ కనకదుర్గ దేవాలయం ప్రధాన అర్చకులు, అమ్మవారి అలంకరణ నిర్వాహకులు అయిన శ్రీ కుందుర్తి సత్యనారాయణ మూర్తిగారు 1994 జనవరి 1, 15న 'సరసవినోదిని' సమస్యాపూరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డా.చివుకుల సుందరరామ శర్మగారు, శ్రీమతి పి.భానుమతిగారు కూడా ఆ నెల 'సరసవినోదిని' నిర్వాహకులుగా పాలుపంచుకున్నారు.

బడ్జెట్ సమస్యలనేవి ఆకాశవాణికే వస్తూంటాయి. అలాంటప్పుడు కొత్తకార్యక్రమాలు రూపొందించడం అనేది తగ్గించి, పునఃప్రసారాల మీద ఆధారపడడం జరుగుతూంటూంది. ఏప్రెల్‌లో కొత్త బడ్జెట్ రుసుము అందేవరకూ, ఒక్కోసారి సంవత్సరారంభ మాసాల్లోనే ఇలాంటి పునఃప్రసారాలు తప్పవు. ఒక్కోసారి అదీమంచికే అవుతూంటుంది. పదమూడు వారాల ధారావాహికగా ప్రతి ఆదివారం మధ్యాహ్నం 12.05నుండి ప్రసారం చేసే 'కథాలహరి' కార్యక్రమంలో - 1994 జనవరి 2 నుండి, మార్చి 27 వరకు గతంలో ప్రసారమైన కార్యక్రమాన్నే, అప్పట్లో తెలుగు విభాగంలో నాకు ప్రొడక్షన్ అసిస్టెంట్‌గా ఉన్న - వసంతకుమారిచే ఎడిటింగ్, డబ్బింగ్ చేయించి, భాగవతం ఆధారంగా ఉషశ్రీ ప్రవచించిన 'కృష్ణకథాతరంగిణి' నుండి ఒక భాగం ప్రసారం చేయడమైంది. ఉషశ్రీ ఏది చెప్పినా రేడియో శ్రోతలకు అది ఆహ్లాదమేగా! ఆయనను ఎప్పుడు విన్నా, సరికొత్తగానే శ్రోతలు ఆనందించడం జరిగేది. 'పుస్తకదర్శిని' జనవరి నెల 31న నేను స్క్రిప్ట్ రాయగా, శ్రీమతి వై.సరోజానిర్మల చదివి ప్రసారం చేసారు. అలాగే సోమవారం ఉదయాలు వినియోగదర్శిని'లో, వినియోగదారులకు సూచనలు స్క్రిప్ట్‌గా నేను రాయగా, ప్రయాగవేదవతిగారు, టి.వసంతకుమారి చదివి ప్రసారం చేసారు. శనివారాల్లో రాత్రి 9.16కు ప్రసారమయ్యే జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్ర సంఘటనల విశేషాల 'నడుస్తున్న చరిత్ర' కార్యక్రమాన్ని సమర్పించిన ప్రాత్రికేయుల్లో జనవరి '1994లో - విశాలాంధ్ర దినపత్రిక ఎడిటోరియల్ బోర్డులోని శ్రీ గూడవల్లి నాగేశ్వరరావుగారు కూడా ఉన్నారు.

1994 జనవరి 29న శ్రీ బాలాంత్రపు రజనీకాంతరావుగారి 'అమృతోత్సవం', అంటే 75వ జన్మదినోత్సవం రోటరీ సిద్ధార్థ ఆడిటోరియంలో జరిగింది. ఆ సందర్భంగా జరిగిన కవి సమ్మేళనంలో నేనూ పాల్గొన్న గుర్తుంది. ప్రముఖ కవులు శేషేంద్ర, కె.శివారెడ్డి, దేవీప్రియ విజయవాడకు రాగా జనవరి 30 వ తేదీ వారిని ఆకాశవాణి స్టూడియోకి ఆహ్వానించాను. అదీ తియ్యని జ్ఞాపకమే!







ఫిబ్రవరి నెలలో చెప్పుకోదగిన మంచి ఇంటర్వ్యూలు చేసాను. గుంటూరు శేషేంద్ర శర్మగారితో చేసిన ఇంటర్వ్యూ 'పువ్వెడు కవిత్వం కోసం' పేరున 15.2.94 మంగళవారం రాత్రి 9.16కు ప్రసారమైంది. అలాగే ప్రముఖ కథారచయిత, నేటి కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత శ్రీ పెద్దిభొట్ల సుబ్బరామయ్యగారితో - 'తలచుకునే తరుణాలు' శీర్షికన 17.2.94 గురువారం ఉదయం 7.45కు పరిచయ కార్యక్రమం ప్రసారం చేయడమైంది. ప్రకాశం జిల్లా నీలకంఠపురంకు చెందిన ధారణావధాని డా.వొలుకుల శివశంకరరావుగారితో పరిచయం 3.2.94 గురువారం ఉదయం 7.45కు ప్రసారం కాగా, 'పారిశ్రామిక ప్రదర్శనల ప్రాధాన్యత' గురించి - అఖిలభారత పారిశ్రామిక వస్తుప్రదర్శనల బోర్డు డైరెక్టర్ శ్రీ చలసాని దత్తుగారితో పరిచయం 8.2.94 మంగళవారం రాత్రి 9.16కు ప్రసారం చేసాం.







ఇక ఫిబ్రవరి '94లో ప్రసారం అయిన ప్రసంగాలలో - 'నాణేనికి అటూ - ఇటూ' శీర్షికన, 'అమ్మబోతే అడవి' గురించి శ్రీ గుండు సుబ్రహ్మణ్య దీక్షితులు, 'కొనబోతే కొరివి' గురించి కొవ్వూరు కుమారదేవం నుండి గ్రామపంచాయితీ ఎక్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీ పి.వి.ఎస్.ఎస్.ఆర్ శాస్త్రి చక్కని హాస్య ప్రసంగాలు చేసారు. (10.2.94 7.45 AM). 'స్మరణీయ ఆంధ్రులు - కన్నెగంటి హనుమంతు' గురించి శ్రీ దరువూరి వీరయ్యగారి ప్రసంగం 22.2.94 మంగళవారం రాత్రి 9.16కు ప్రసారమైంది. శ్రీ దరువూరి వీరయ్యగారు ఆచార్య ఎన్.జి.రంగా

గారికి సన్నిహితులు. వీరయ్యగారు రికార్డింగుకు వచ్చినప్పుడే - ఆకాశవాణి 'ఆర్కైవ్స్' కోసం, ఎన్.జి.రంగాగారిని రికార్డు చేయాలనుకుంటున్నాం అనీ, రంగాగారు పొన్నూరులోనే ఉన్నారని తెలిసిందనీ, అందుకు తగిన అవకాశం ఆయనతో మాట్లాడి కలిగించవలసిందనీ కోరాము. వీరయ్యగారు సరేనన్నారు. గొప్ప పార్లమెంటేరియన్‌గా ఆచార్య ఎన్.జి.రంగా ప్రసిద్ధులు. దేశానికి ఆయన చేసిన సేవ, వ్యవసాయరంగంలో ఆయన కృషి అనుపమానాలు. అప్పటికే వృద్ధులైన రంగాగారు తుంటిఎముక నొప్పితో పొన్నూరులో విశ్రాంతి తీసుకుంటున్నారు అప్పుడు. దరువూరి వీరయ్యగారి సహకారంతో - ఫిబ్రవరి 4, 1994న పొన్నూరులో రంగాగారి స్వగృహానికి రికార్డింగ్ యూనిట్‌తో, ఉదయమే చేరుకున్నాం. మధ్యాహ్నం భోజనాలు రంగాగారే - ఇంట్లో ఏర్పాటు చేయించారు మాకు. ఆచార్య ఎన్.జి.రంగా గారి అనుభవాలు - జ్ఞాపకాలు గంటన్నరకు పైగా ప్రసారానికి వచ్చేలా, రికార్డు చేయడం మరచిపోలేని అనుభవం. అప్పటికే ఆయన గళంలో కొంత స్పష్టత తగ్గినా, వినడానికి ఆయన మాటలు వీలుగానే ఉండడం, రికార్డింగ్‌కు దోహదపడింది. ఆ రోజంతా దాదాపు రంగాగారితో గడిపి, రాత్రి 9 గంటలకు తిరిగి విజయవాడ వచ్చాం.




ప్రముఖ కవి సోమసుందర్‌తో జనవరి చివర్లో చేసిన కవితల రికార్డింగ్ - 24.2.1994 గురువారం ఉదయం 7.45కు ప్రసారం చేయడం జరిగింది. శ్రీ బసవరాజు సుబ్బారావుగారు నాటి కార్యక్రమంలో పాల్గొన్న మరోకవి. ఫిబ్రవరి 14న బడ్జెట్‌లోటు కారణంగా కార్యక్రమాలు కుదించుకోమన్న డైరెక్టర్‌గారి ఆదేశంతో - 'సరసవినోదిని' సమస్యాపూరణ కార్యక్రమాన్ని 26.2.94న 5,12.3.94న ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్ కో ఆర్డినేషన్‌గా ఉన్న శ్రీమతి ప్రయాగ వేదవతి చేయించి 19,26 మార్చి 2 ఏప్రిల్ నాటి కార్యక్రమం స్వయంగా నేనే నిర్వహించి ప్రసారం చేయడం జరిగింది. అలా విజయవాడలో ఆకాశవాణి ప్రతిష్ఠాత్మక కార్యక్రమాల్లో ఒకటైన 'సరసవినోదిని' నిర్వహణా బాధ్యతలే కాక, సమర్పణ చేయడం కూడా జరిగిందన్నమాట! ఫిబ్రవరి 13, 1994 నాడే నాకు ప్రోగ్రాం సెక్రటరీగా తెలుగు విభాగంలో పనిచేస్తూండిన శ్రీ గోపాల్ కూతురు ఇందిర వివాహం తను ప్రేమించిన అనౌన్సర్ జయప్రకాశ్‌తో జరిగింది. ఆ వేడుకకు మేమంతా తరలి వెళ్ళాం.




## 44

**అభిరుచికి అనుగుణమైన పనులు చేయగల** అవకాశం అన్ని వృత్తులలోనూ ఉండకపోవచ్చు. చదువుకున్న చదువుకీ చేసే ఉద్యోగానికీ పొంతనలేని వ్యవహారాలు అనేకం ఉంటూనే ఉంటాయి. రేడియోలో కార్యక్రమ విభాగంతో ముడిపడిన వారికి, అందునా సాహిత్య సంగీతాది లలితకళల పట్ల అభిరుచి కలిగిన వారికి, చేసే పనిలో సంతృప్తి పొందగల అవకాశాలు మెండు. అయా రంగాలకు చెందిన ప్రముఖులను కలుసుకోగలగడం, తమలోని తత్సంబంధిత అభిరుచులను పెంచుకుని, తమకు ప్రవేశం ఉంటే ఆయా కళల్లో అభివృద్ధి చెందగలగడం వీలవుతుందనే చెప్పాలి. అలాగని అదేమీ నల్లేరు మీద బండినడక కాదు. మాట పడకుండా, స్వార్థం చూసుకోకుండా వృత్తిలో నెగ్గుకొస్తూనే కళల్లో వికాసం పొందగలగడానికి వైయుక్తిక సాధన ఉండాలి. రేడియోలో రాకముందు సాహిత్యాది రంగాలలో నిష్ణాతులైన కొందరు ఆకాశవాణిలో చేరాక అంతగా రాయలేకపోవడం వృత్తిప్రతిబంధకం అనలేంగానీ అది వారి వైయుక్తిక సమర్థతకు చెందినదే అవుతుంది. కానీ తమ రచనా ప్రతిభకు ఆకాశవాణి ద్వారా వన్నెవాసి తెచ్చుకుని సంస్థకు గౌరవం తెచ్చిన హేమాహేమీలెందరో ఆ రోజుల్లో ఉండేవారు.

రేడియో ఉద్యోగంలో చేరకముందు నుండీ నాకు సాహిత్య వాసనలు అంటి ఉన్నాయి. కవిగా ఓ చిన్నపాటి గుర్తింపు సాహితీలోకంలో నాకూ ఉంది అనిపిస్తూండేది. ఆకాశవాణిలో నేను చేస్తున్న ఉద్యోగం వల్ల కాక వైయక్తికంగానే నన్ను అభిమానించి, సాహితీమూర్తిగా ఆదరించేవారుండేవారు. అందుకే నేను బయట సభలూ సమావేశాల్లో పాల్గొనడం అనేది అంగీకరించేటప్పుడు అలా నన్ను నన్నుగా ఒక కవిగా, వక్తగా, రచయితగా గుర్తించి ఆహ్వానిస్తున్నారా, ఏవేనీ ప్రయోజనాలనాశించి పిలుస్తున్నారా అనేది గమనించుకుంటూ జాగ్రత్త పడేవాడిని. నేను కూడా కార్యక్రమాలను రూపొందించేప్పుడు శ్రోతలను వారి అభిరుచులను దృష్టిలో ఉంచుకుని మంచి కార్యక్రమాల రూపకల్పనకే ప్రాధాన్యం ఇచ్చేవాడినని చెప్పగలను.


కె.శివారెడ్డి, దేవిప్రియ, శ్రీకాంత శర్మ గార్లతో ఇష్టాగోష్టి

కె.శివారెడ్డి, దేవిప్రియ నాకు హైదరాబాద్‌లో ఉన్నప్పటినుంచీ తెలుసు. శివారెడ్డి తెనాలికి చెందినవాడే అయినా హైదరాబాద్ వచ్చాక జనమమేకమైనవాడే . 'వేకువ' వంటి సాహిత్య పత్రిక సంపాదకుడిగా, కవిగా శివారెడ్డి పాదుకుని, వివేకవర్ధనీ కళాశాలలో ఆంగ్లోపన్యాసకునిగా వృత్తి నిర్వహించుకుంటూ కవిత్వమే జీవితంగా ఎదిగినవాడు. దేవీప్రియ పాత్రికేయునిగా వచ్చి వివిధపత్రికలలో సంపాదకునిగా పనిచేసాడు. వారిరువురితో తెలంగాణ జిల్లాల్లో అనేక సభలకు నేనూ ఆరోజుల్లో వెళ్ళి పాల్గొంటూ ఉండేవాళ్ళం. కవులుగా వారిద్దరూ సుప్రతిష్ఠితులు. విజయవాడ ఏదో పనిమీద (ఇంకేం పని లెండి! ఏవో సాహిత్య సభలకనే) వారిద్దరూ రాగా మిత్రులు ఇంద్రగంటి శ్రీకాంత శర్మ వారితో ఒక కార్యక్రమం చేయవచ్చుకదా అని సూచించగా 'కవిత - నేపథ్యం' అనే ఒక చర్చాగోష్ఠిని శివారెడ్డి, దేవీప్రియ, ఇంద్రగంటి శ్రీకాంత శర్మలతో కలిపి నిర్వహించి 21.2.1994 రాత్రి 9.30కు ప్రసారం చేయడం జరిగింది. ఆ ఇష్టాగోష్టిలో అనుభూతివాద కవిత్వం నుండి సమకాలీన కవిత్వ ధోరణులవరకూ అసలు కవిత్వం యొక్క నేపథ్యాల గురించి ముచ్చటించడం జరిగింది. శ్రోతలు మెచ్చిన కార్యక్రమాల్లో అది ఒకటి.

యువభారతి పక్షాన ఇరివెంటి కృష్ణమూర్తి, వంగపల్లి విశ్వనాథం, చక్రవర్తి వేణుగోపాల్, నేను కలిసి 1967లో వెలువరించిన 'వీచికలు' కవితా సంకలనం డా.సి.నారాయణ రెడ్డిగారు ఆవిష్కరిస్తూ "కవితలో బొమ్మ గీస్తాడు. బొమ్మలో కవిత రాస్తాడు" అని నా గురించి అన్నమాటలు ఆయన వాత్సల్యంతో అన్నవే అయినా అప్పటికీ ఇప్పటికీ నాకు అక్షరాలతో బాటు చిత్రాలూ ఇష్టమే. రేడియోలో


డా.టి.సాయికృష్ణగారితో

చిత్రకళ గురించి ఏం చెబుతాం అని ఎప్పుడూ నేను అనుకోలేదు. టీ.వి.కి ఉన్న సౌలభ్యం లేకపోయినా, పలువురుచిత్రకారుల అనుభవాలను, విశ్లేషణలను రేడియోలో ప్రసారం చేసే అవకాశాలు నాకు లభించాయి. అప్పట్లో ఆంధ్రజ్యోతి వార పత్రికలో మూడో కవరు మీద కావ్య ప్రబంధాది అంశాలను రేఖాచిత్రాలుగా సాయికృష్ణ వేస్తుండేవారు. 'రసభావ రమ్యాలు రేఖాచిత్రాలు' పేరిట డా.టి.సాయికృష్ణతో ఒక ఇంటర్వ్యూ 7.4.94 గురువారం ఉదయం ప్రసారం చేయడం, సాయికృష్ణ అందుకు ఎంతగానో ఆనందించడం గుర్తుంది. అలాగే గుంటూరు కేంద్రీయ విద్యాలయ సెంట్రల్ స్కూల్ డ్రాయింగ్ టీచర్‌గా ఉంటూ జాతీయ స్థాయిలో అవార్డు పొందిన ఆర్. పుటాచారిగారితో 30.6.94 ఉదయం ప్రసారం చేసిన ఇంటర్వ్యూ కూడా డ్రాయింగ్ పట్ల శ్రోతలకు విశేషించి యువతకు ఆసక్తిని కలిగించగలిగాయి.


ఆర్. పుటాచారిగారితో

దుర్గాభాస్కర్ గారు స్టేషన్ డైరెక్టర్‌గా 1994 ఏప్రెల్‌కు విజయవంతంగా విజయవాడలో ఒకే ఏడాది పూర్తి చేసుకున్నారని మేం అభినందించగా వారు ప్రత్యాభినందనం రాయడం కూడా గుర్తుంది.



Smt. Durga Bhaskar IBS
Station Director
All India Radio
Vijayawada 520 010

Telephone :
Off : 476218
Res : 476214

Date : 26.4.1994

Dear Smt.Usha & Sri Sudhama,

I thank you verymuch for your greetings on my completion of one year as Station Director at Vijayawada. You both also have a share in my success. I will remember your nice gesture for ever.

With Best Wishes,

Yours sincerely,

(SMT.DURGA BHASKAR)

ఆకాశవాణిలో కార్యక్రమ నిర్వహణాధికారులకు ఢిల్లీలో ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతుంది. దాదాపు నెలరోజులపాటు సాగే బేసిక్ ట్రైనింగ్ అది. నిజానికి పదోన్నతి కలగగానే ఇవ్వవలసిన ఆ ట్రైనింగ్, మూడేళ్ళు ఆ పదవిలో పనిచేశాక నాకు ఢిల్లీ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ నుండి అందుకోవడానికి పిలుపువచ్చింది. విజయవాడలో సబ్ ఎడిటర్గా పనిచేస్తున్న ఇంద్రగంటి శ్రీకాంత శర్మగారికి, హిందీ ఆఫీసర్గా కూడా ఉండిన శ్రీమతి సరోజా నిర్మలగారికి ఫిబవరి 1994లోనే కార్యక్రమ నిర్వహణాధికారులుగా ప్రమోషన్ వచ్చి, శ్రీకాంతశర్మ గారు నిజామాబాద్కు బదిలీ అవుతూ ఆ నెలలోనే రిలీవ్ అయ్యారు. అయితే ఢిల్లీలో బేసిక్ ట్రైనింగ్కు శ్రీకాంత శర్మగారు నాతో బాటే రావడం జరిగింది. ఫిబవరి 1994లోనే హైదరాబాద్లో నాకు పిల్లనిచ్చిన మా మామగారి హఠాన్మరణంతో దాదాపు పథ్నాలుగు రోజులు సెలవులో ఉండి మార్చి మూడున తిరిగి జాయిన్ కాగానే ఈ ప్రమోషన్ల వార్తలూ అవీ తెలిసాయి. మా ట్రైనింగ్ మాత్రం 1994 జూన్ 13 నుండి జూలై 15 వరకు ఢిల్లీలో జరిగింది. ఆ ట్రైనింగ్కు వెళ్ళడానికి ముందుగా ఏప్రెల్ నెలలో 'వసంతభావాహేల' పేరిట ఆహూతుల సమక్షంలో 11 వతేదీ ఉగాదినాడు ప్రసారం చేసే నిమిత్తం ఆరవ తేదీ సాయంకాలం రోటరీ ఆడిటోరియలో నిర్వహించిన కార్యక్రమంలో ఉగాది కవిసమ్మేళనాన్ని నేను ఆధ్వర్యం వహించి నిర్వర్తించాను.

ఆ నాటి కవి సమ్మేళనంలో పైడిపాటి సుబ్బరామశాస్త్రి, శ్రీఎస్.వి.భుజంగరాయశర్మ (రంగులరాట్నం చిత్రంలో ఇంతేరా ఈ జీవితం తిరిగే రంగులరాట్నం పాట రచయిత), శ్రీ శనగన నరసింహస్వామి, శ్రీ దాసి బసవయ్య, శ్రీ రసరాజు, డా.కె.వి.సత్యనారాయణాచార్యులు పాల్గొన్నారు. ఉగాదినాటి మధ్యాహ్నం ఆ కవి సమ్మేళనం రేడియోలో ప్రసారమైన శ్రోతలను అలరించింది. కవిసమ్మేళనంతో పాటు ఓ నాటకాన్ని ఆహూతుల సమక్షంలో ప్రదర్శింపచేసినట్లు గుర్తు.




ఏప్రెల్లో ఉగాది రోజే ఉదయం 9.45కు రేడియో బ్రిడ్జి ప్రోగ్రాంగా యువతకు ఓ క్విజ్ కార్యక్రమాన్ని నాలుగు కేంద్రాల అనుసంధానంతో ఆ ఏడాది ప్రసారం చేయడం జరిగింది. ఏప్రెల్ నెలలోనే ఆ ఏడాది ఆకాశవాణి జాతీయ వార్షిక పోటీలలో డైరెక్టర్ దుర్గాభాస్కర్గారి 'అమ్మా నన్ను చంపకు' నాటికకు అవార్డు లభించిన సందర్భంగా బాల్రాత్రపు రజనీకాంతరావుగారు ముఖ్య అతిథిగా నాల్గవ తేదీ ఆకాశవాణి విజయవాడ కేంద్రంలోనే అభినందన సభ జరిగింది. ఉగాది సందర్భంగా విజయవాడ సాంస్కృతీ సమాఖ్య ఠాగూర్ స్మారక పౌర గ్రంథాలయంలో పదవ తేదీ ఆదివారం సాయంత్రం నిర్వహించిన కవిసమ్మేళనానికి నేనే అధ్యక్షత వహించాను. అంతకు ముందు రోజు కృష్ణాపత్రిక దర్బార్ హాలులో జరిగిన 'భావ' ఉగాది కవిసమ్మేళనంలో నేనూ కవిగా పాలుపంచుకున్నాను. అలాగే మేడే సందర్భంగా 1994 మే 1న గుంటూరులో 'అవగాహన' సామాజిక సాంస్కృతిక వేదిక నిర్వహించిన ఆధునిక కవితాగోష్టిలో కె.శివారెడ్డి ప్రభృతులతో బాటు పాల్గొన్నాను. ఆనాటి సభలో నేను వినిపించిన 'చిత్రగంధి' కవిత అటుపై ఆంధ్రజ్యోతిలో



'అమ్మా నన్ను చంపకు' బహుమతి ప్రదానోత్సవ సభ

విజయవాడ, ఏప్రిల్ 4: ఆకాశవాణిలో కుటుంబసంక్షేమ విభాగం క్రింద 1993-94 సంవత్సరానికి ప్రదర్శించిన అమ్మా నన్ను చంపకు నాటికకు జాతీయ స్థాయిలో ద్వితీయ బహుమతి వచ్చిన సందర్భంగా సోమవారం సాయంత్రం స్థానిక ఆకాశవాణి స్టేషన్లో బహుమతి ప్రదానోత్సవ సభ జరిగింది. ఈ సభకు ఆకాశవాణి విజయవాడ స్టేషన్ మాజీ డైరెక్టర్ శ్రీ రజనీ కాంతారావు అధ్యక్షత వహించారు. జాతీయస్థాయిలో ఈ నాటిక బహుమతి పొందేలా స్టేషన్ డైరెక్టర్ శ్రీమతి దుర్గాభాస్కర్, కోకా సంజీవరావు, పాండురంగారావులు కృషి చేశారని, వీరికి సిబ్బంది సహకరించారని ఆయన చెప్పారు. ఆకాశవాణి విజయవాడ క్లబ్ కార్యదర్శి శ్రీ కొప్పుల సుబ్బారావు అతిథులకు మెమెంటోలు అందజేశారు. రచయిత దుర్గా మల్లేశ్వరరావు, ప్రధాన పాత్రకు డబ్బింగ్ చెప్పిన పాప మధులతకు, ఎస్.వి.కృష్ణారావు, ఎం.విజయలక్ష్మిలకు శ్రీమతి దుర్గాభాస్కర్ యోగ్యతాపత్రాలు అందజేశారు. శ్రీమతి వేదవతి తొలుత స్వాగతం పలికారు. సుధామ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రజాశక్తి
దినపత్రిక * 5.4.1994

ఈ వారం కవితగా రావడం, 2011లో ఆ కవిత పేరిటనే నేను 'చిత్రగంధి' కవితా సంకలనం వెలువరించడమూ జరిగాయి. ఢిల్లీ ట్రైనింగ్‌కు వెళ్ళడానికి మే'15 న టికెట్స్ బుక్ చేసుకోవడం జరిగింది. ఈలోగా స్నేహిత్‌కు వేసవి సెలవలు కదాని ఓ పన్నెండు రోజులు సెలవుపెట్టి మద్రాసుకు వెళ్ళాలని నిశ్చయించుకున్నాం. 18వ తేదీ పినాకినిలో బయలుదేరి కుటుంబ సమేతంగా మద్రాసు చేరాను. అంతే! 20 వ తేదీ ఉషను ఆకాశవాణి విజయవాడనుండి కొత్తగూడెం బదిలీ చేస్తున్నట్లుగా మేం అనుకోని వార్త అందింది.


స్వాగతం! సుస్వాగతం!!

కృష్ణాపత్రిక

'భావ' ఉగాది కవి సమ్మేళనం

9-4-1994 శనివారం సాయంకాలం గం. 5-30లకు

| | |
|---|---|
| డా. ప్రసాదరాయ కులపతి | కవిసామ్రాట్ పైడిపాటి సుబ్బరామ శాస్త్రి |
| శ్రీ ఆదిగోపుల వెంకటరత్నం | శ్రీ మహతీ శంకర్ |
| శ్రీ విశ్వనాథ పావని శాస్త్రి | శ్రీమతి కోకా విమల కుమారి |
| శ్రీ పింగళి వెంకటకృష్ణారావు | డా. బాపట్ల రాజగోపాలం శర్మ |
| డా. చెన్నకేశవ | శ్రీమతి మాధామణి |
| శ్రీ కాటూరి రవీంద్ర విక్రమ్ | శ్రీ "సుధామ" |
| శ్రీమతి సరోజా నిర్మలం | శ్రీమతి పద్మావతి |
| శ్రీ కొర అప్పలరావు | శ్రీ పి.వి. శ్రీనివాసబాబు |
| శ్రీ రామచంద్ర రావు | శ్రీ రమణశ్రీ |
| శ్రీ డి.ఎస్.ఆర్ | శ్రీ వి. సాధుబాబు |

ఇంకానలుపురు వర్ధమాన కవులు పాల్గొంటారు!

స్థలం: కృష్ణాపత్రిక దర్బారు హాలు, శేషాద్రి శాస్త్రి వీధి

గవర్నర్‌పేట(సింగర్ కంపెనీ పక్కవీధి), విజయవాడ, ఫోన్:61450

ఇదే అందరికీ మా హృదయపూర్వక ఆహ్వానం!


సాంస్కృతీ సమాఖ్య - విజయవాడ

ఆహ్వానము

ఉగాది సందర్భముగా

ది. 10-4-94 ఆదివారం సాయంత్రం 6 గంటలకు



# 45

**ప్రభుత్వ ఉద్యోగం అన్నాక బదిలీలు అన్నది సహజమే!** భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగస్తులైనప్పుడు రాష్ట్రప్రభుత్వమైనా, కేంద్ర ప్రభుత్వమైనా బదిలీలు అనివార్యాలే! ఇద్దరూ ఒకే డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగస్తులైతే ఒక్కచోటే కలసి పనిచేసే అవకాశం కలిగించాలన్నది సాధ్యమైనంతమటుకూ బదిలీల నియమనిబంధనల్లో ఉన్నమాటా నిజమే! కానీ అన్నివేళలా అది సాధ్యం కాకపోవచ్చు. మే'1994లో సరదాగా మద్రాసు ప్రయాణమై వెళ్ళినప్పుడు విజయవాడ ఆకాశవాణిలో పనిచేస్తున్న మా ఇద్దరిలో శ్రీమతి ఉషను కొత్తగూడెం బదిలీచేసినట్లు వార్త రావడం ఆందోళన కలిగించింది. తనకు అసలే ఆయాసం. కొత్తగూడెం, మార్కాపురం వంటిచోట్ల వాతావరణం ఒకటి బొగ్గుగనులు, రెండోది పలకల పరిశ్రమల కారణంగా తన ఆరోగ్యానికి సరిపడదని భయం. అందునా తను ఒకరూ వెళ్ళి అక్కడ ఉద్యోగం చేయడం అసాధ్యం. నన్ను కూడా అక్కడికి బదిలీచేసి ఉంటే అది వేరు సంగతి అదీకాక ఉష టెన్యూర్ పూర్తికాకుండానే ఈ బదిలీ జరగడం వేరే ఒత్తిడులవల్లేనని డైరెక్టర్ గారే అన్నారు. సరే ఎలాగూ వెళ్ళాం కనుక మద్రాసు, మహాబలిపురం, కంచి అన్నీ స్నేహిత్‌కు వాడి కజిన్స్‌కు చూపించాం. 20వతేదీ మద్రాసు ఆకాశవాణిలో అసిస్టెంట్ స్టేషన్ డైరెక్టర్‌గా విజయవాడ నుండి వెళ్ళిచేరిన పి.ఎస్.గోపాలకృష్ణగారిని కలిసాం. ఆయన మాకు ధైర్యం చెప్పారు. విజయవాడలోనే ఉషను ఉంచేందుకు ప్రయత్నాలు చేద్దామన్నారు. విజయవాడ డైరెక్టర్ దుర్గా భాస్కర్‌గారు సుముఖంగానే ఉన్నారనీ, ఆవిడ స్వయంగా ఢిల్లీకి ఉషను ఉంచమని లేఖ రాసారనీ చెప్పారు. మే 23 కల్లా మేం తిరిగి విజయవాడ చేరుకున్నాం. కానీ ఆ మర్నాడే దుర్గాభాస్కర్ గారు ఉషను రిలీవ్ చేసేసారు. కానీ బదిలీ నిలుపు చేయమనీ, లేక కొత్తగూడెం కాక మరే కేంద్రానికైనా పంపమనీ ఇచ్చిన రిప్రజెంటేషన్ తీసుకుని ఫార్వర్డ్ చేశారు.

నెల్లాళ్ళు ఢిల్లీలో ట్రైనింగ్‌కు నాకు ముందే ఆహ్వానం రావడం వల్ల జూన్ 13 నుంచి ప్రారంభమై జూలై 15 వరకు సాగే ఆ బేసిక్ ట్రైనింగ్‌కు ఎలాగూ వెళ్ళాలి కనుక కొంచెం ముందుగా వెళ్ళి డైరెక్టరేట్‌లో ఉష బదిలీ నిలుపుదల లేక మార్పు అభ్యర్ధన గురించి కనుక్కుందామని నేను టికెట్ ప్రీపోన్ చేసుకుని జూన్ 6వతేదీనే బయలుదేరి ఢిల్లీ వెళ్ళాను. గోపాలకృష్ణగారు, దుర్గాభాస్కర్‌గారు ఇచ్చిన సలహా మేరకు ఢిల్లీ ఆఫీస్‌లో కొందరు తెలుగు పెద్దలను కలవడం జరిగింది. డైరెక్టరేట్‌లో ఈ ట్రాన్సఫర్ వ్యవహారాలు డీల్ చేసే

కార్యాలయాధికారి రాజ్ మోహన్‌ను కూడా కలవడం జరిగింది. అతను కూడా టెన్యూర్ కాకుండా బదిలీ కావడం పొరపాటేననీ పైగా ఉద్యోగిని భర్తకూడా అక్కడే ఉన్న విషయం గుర్తించకపోవడం సరికాదనీ, అనివార్యంగా అలా జరిగిందనీ ఇద్దరూ కలిసి మరెక్కడికైనా వెడతారా అనీ అడిగారు. తన ఆరోగ్యం గురించీ అదీ వివరించి చెప్పాను. ఢిల్లీ ఆకాశవాణి డైరెక్టరేట్‌లో అధికారహోదాల్లో పనిచేస్తున్న పెద్దలు పురుషోత్తమరావు, ఎ.ఆర్.కృష్ణమూర్తి, సుబ్రమణ్యం, చలపతిరావు, బి.ఆర్ పంతులు, డి.డి.జి సుబ్రమణి ప్రభృతులను వ్యక్తిగతంగా కలిసాను. రాజకీయపు ఒత్తిడులు బదిలీల గురించి తెలుగువారినుంచే బలీయంగా ఉంటున్నాయనీ, అలా కాక నేరుగా అధికారులను కలిసి విన్నవించుకోవడం నిన్నే చూస్తున్నాననీ ఒకాయన చమత్కరించారు కూడాను. అలాంటి పలుకుబడులు ఏమీలేని సాధారణ ఉద్యోగులమేనని విన్నవించాను. ఏమయిన నిర్ణయానికి సమయంపడుతుందనీ, సానుకూలతకు ప్రయత్నిస్తామనీ చెప్పారు.

ముందుగా వెళ్ళడం వల్ల కరోల్ బాగ్‌లో హోటల్లో నాలుగురోజులుండి ఆ తరువాత మా ట్రైనింగ్ హాస్టల్‌లో 11వ తేదీ వెళ్ళి నాకు కేటాయించిన రూములో చేరాను. అప్పుడప్పుడే ట్రైనింగ్ మేట్స్ అంతా ఒక్కొక్కరూ రాసాగారు. రాజస్తాన్ నాగోర్ నుంచి ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్‌లు నాలా ముందుగా చేరారు. 13 నుంచి ట్రైనింగ్ మొదలైంది. చెప్పానుగా ట్రైనింగ్‌లో తెలుగువాళ్ళం నిజామాబాద్ నుంచి, ఇంద్రగంటి శ్రీకాంత శర్మగారు, హైదరాబాద్ నుంచి మెండు బాబూరావ్, విశాఖపట్నం నుంచి కాకరపర్తి సత్యనారాయణ, ట్రైనింగ్ క్లాసులు ముఖ్యంగా ట్రైనింగ్ సెంటర్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీ ఎస్. ఎన్. మిశ్రా నిర్వహించారు. సెంటర్‌కు ఇద్దరు డైరెక్టర్లున్నారు అప్పుడు. కానీ అందులో కె.సి.స్వామి సెలవుపై వెళ్ళడానికి సిద్ధంగానూ మరొకరు మహావీర్ సింగ్ బెంగుళూర్ బదిలీకి తట్టా బుట్టా సర్దుకున్నాక అది క్యాన్సిల్ అయి రిటైన్ అయివున్నారు. మొత్తం ట్రైనింగ్ బ్యాచ్ ఇరవై అయిదు మందిమి. 17 వ తేదీ మధ్యాహ్నం క్లాస్కు DDG (s) పురుషోత్తమరావుగారు రావడంతో ఆయనకు మళ్ళీ ఉష బదిలీ నిలుపుదల గురించి గుర్తుచేసాను. మిత్రుడు కాకరపర్తి సత్యనారాయణకు ఆయన బాగా పరిచితులు కావడంతో వారింటికి ఆయన వెంట వెళ్ళాడు ఆ రోజు. 'మీ పని జరిగిందని విన్నానే!' అన్నారావేళ ఆయన. క్లాసులు క్రమబద్ధంగా జరుగుతూండడం వల్ల ఏ రోజూ మళ్ళీ డైరెక్టరేట్‌కు వెడదామన్నా కుదిరేది కాదు. జూన్ 13 నుంచి జూలై 15 వరకు ఆ ట్రైనింగ్‌ను హాస్టల్లో మెస్ వసతీ అదీ సరిగ్గా లేకున్నా, మధ్యలో మూతపడినా, మొత్తానికి మిత్రులు నలుగురం కబుర్లతోనూ కలిసిమెలసి గడిపి బానే ఎంజాయ్ చేశాం. దుర్గాభాస్కర్ గారు జూనియర్ టైమ్ స్కేల్ ఆఫీసర్ ASD పోస్ట్‌లో ఉషను విజయవాడలో రిటైన్ చేయమనీ, తను బాగా పనిచేస్తుందనీ మా రిప్రజెంటేషన్ మీద రాసారని తెలిసింది. అందువల్ల పనిసానుకూలమవుతుందన్న ఆశ కలిగింది. 21 వ తేదీ మంగళవారం అనుకుంటాను మామీద అభిమానంతో కాకరపర్తితో మమ్మల్ని డి.డి.జి. సెక్యూరిటీ పురుషోత్తమ రావుగారు వారింటికి భోజనానికి ఆహ్వానించారు. ఆయన శ్రీమతి రాజశ్రీ గారు ఢిల్లీ ఆకాశవాణిలో తెలుగులో వార్తలు చదివేవారు ఆ రోజుల్లో. చాల ఆప్యాయంగా ఆ దంపతులు మాకు ఆతిధ్యం ఇచ్చారు. కాకరపర్తి సత్యనారాయణ వల్లనే ఆ ఆతిధ్యం మాకు సమకూడింది. ట్రైనింగ్ ఇంకో పన్నెండు రోజుల్లో ముగుస్తుందనగా విజయవాడలోనే JTSO పోస్ట్‌లో ఉషను రిటైన్ చేస్తూ ఆర్డర్స్ రాబోతున్నాయన్న శుభవార్త తెలిసింది. మొత్తానికి జూలై ఆరవతేదీ డైరెక్టరేట్‌లో ఆర్డర్ కాగితం చేతికి అంది అమితానందం కలిగింది. స్పీడ్ పోస్ట్‌లో విజయవాడలో అప్పటికే రిలీవ్ అయిపోయి సెలవులో ఉన్న ఉషకు ఆర్డర్ కాగితం పంపించాను. లాస్ ఆఫ్ పే కాకుండా ఆ ఆర్డర్స్‌తో డైరెక్టర్ గారికి కృతజ్ఞతలతో వెంటనే జాయిన్ కమ్మని లేఖ రాసాను. జూలై 11 వ తేదీ ఉష తిరిగి విజయవాడ ఆకాశవాణిలోనే కార్యక్రమ నిర్వహణాధికారిగా మళ్ళీ చేరింది. ట్రైనింగ్ అనంతరం తిరుగు ప్రయాణానికి అంతకు నెల్లాళ్ళ ముందే ఇంద్రగంటి శ్రీకాంత శర్మగారు, నేను 16వతేదీ రాత్రికి రైలు టిక్కెట్లు బుక్


డిల్లీ ట్రైనింగ్‌లో

చేసుకున్నాం. అయితే అవి అప్పటికి కన్ఫర్మ్ కాలేదు. ఖచ్చితంగా అవుతాయని నమ్మాం. ట్రైనింగ్ ముగిసాక జూలై 16 రాత్రి న్యూఢిల్లీ స్టేషన్‌కు చేరాం. ఆ రోజు ఏదో ర్యాలీ అదీ కూడా జరుగుతోంది. బి.జె.పి కార్యకర్తలతో రైలు కిటకిటలాడుతోంది. మా టిక్కెట్లు కన్ఫర్మ్‌కాలేదు. దాంతో శర్మగారూ, నేను మర్నాడు 17వతేదీ కేరళ ఎక్స్‌ప్రెస్‌కు టిక్కెట్టు కొనుక్కుని తిరిగి హాస్టల్‌కు వచ్చి 16 రాత్రి ఖాళీచేసిన రూములోనే మళ్ళీ అభ్యర్థించి చేరి 17 వ తేదీకి అలా ట్రైనింగ్ ఘట్టం ముగించుకుని విజయవాడ చేరాం. అలా ఆ ట్రైనింగ్ కాలం ఉష బదిలీ నిలుపుదలకు నాకు సహకరించి జీవితంలో మరపురానిదయింది. జూలై 19న శిక్షణ పొందిన కార్యక్రమ నిర్వహణాధికారిగా తిరిగి ఆకాశవాణి విజయవాడలో చేరాను.

అప్పట్లో మద్రాసునుండి యువ, చందమామ ప్రచురించే డాల్టన్ పబ్లికేషన్స్ విజయావారే 'వనిత' అనే స్త్రీల మాసపత్రిక ప్రచురించేవారు. అందులో 'ప్రముఖదంపతులు' అనే శీర్షిక ఉండేది. వనిత దీపావళి సంచిక కోసం ముందుగా అడిగారని అంటూ అరుణ అనే 'వనిత విలేఖరి'గా ఉషను, నన్నూ ఇంటర్వ్యూ చేయడానికి 1994 జూలై 24న ఇంటికి వచ్చారు. ఆ ఇంటర్వ్యూ వనిత దీపావళి సంచికలో ప్రముఖంగా వచ్చి మాకు మంచి గుర్తింపు తెచ్చింది.

ఆగస్ట్ 1994లో టైఫాయిడ్ జ్వరానికి గురి అయ్యాను. ఆగస్టు 27న వచ్చిన జ్వరం ఇరవైరోజులకుగానీ తగ్గలేదు. జ్వరం నుంచి కోలుకుని సెలవునుంచి మళ్ళీ సెప్టెంబర్ 16న మళ్ళీ చేరాను.


తంగిరాల సుబ్బారావుగారితో


కోవెల సంపత్కుమారాచార్య గారితో


విశ్వనాథవైజయంతిక రికార్డింగు రోజున


డాక్టర్ సి.నారాయణరెడ్డిగారితో


శ్రీ పేరాల భరత శర్మగారితో


మల్లంపల్లి శరభయ్యగారితో

సెప్టెంబర్‌లో తిరిగి చేరగానే విశ్వనాథ సత్యనారాయణగారి శతజయంతి వేడుకల గురించి విశ్వనాథ పావనిశాస్త్రి కలిసి ఆకాశవాణిలో కూడా ప్రత్యేక కార్యక్రమాల గురించి అభ్యర్థించాడు. శతజయంత్యుత్సవాల సందర్భంగా విజయవాడ ఎలాగూ ప్రముఖ పండితులు తరలివస్తున్నారని తెలిసింది. ఆ అవకాశాన్ని సద్వినియోగం చేయాలని తలపోసి ఆ సందర్భంగా 'విశ్వనాథవైజయంతిక' పేరున రేడియోలో ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించి ప్రసారం చేయడం జరిగింది. ఆ సందర్భంగా మల్లంపల్లి శరభయ్య, పేరాల భరత శర్మ, డా.జి.వి.సుబ్రహ్మణ్యం, కోవెల సంపత్కుమారాచార్య, తంగిరాల సుబ్బారావు, ఆనందన్ ప్రభృతులనే కాక డాక్టర్ సి.నారాయణరెడ్డిగారిని కూడా రికార్డు చేయడం జరిగింది. విశ్వనాథవారికి ఆ విధంగా

సముచితంగా ఆకాశవాణి సమార్చనం చేసుకున్నట్లయింది. అప్పుడే పావనిశాస్త్రి చాలా సన్నిహితంగా మిత్రుడయ్యాడు. అక్టోబర్‌లో డైరెక్టర్‌గారు సెక్షన్ల మార్పిడీ చేసినప్పుడు 'వినియోగదర్శిని' కార్యక్రమం మాత్రం కృష్ణకుమారి గారికి నానుంచి ఇచ్చి, ఉషకు ఎడ్యుకేషనల్ బ్రాడ్ కాస్ట్, అడల్ట్ ఎడ్యుకేషన్, రూరల్ స్త్రీలు పిల్లల కార్యక్రమాలను కేటాయించారు.



డా.జి.వి.సుబ్రహ్మణ్యంగారితో

94 అక్టోబర్ పన్నెండు, పదమూడు తేదీల్లో హైదరాబాద్‌లో జరిగిన అన్ని తెలుగు కేంద్రాలవారి కో ఆర్డినేషన్ మీటింగ్‌కు డైరెక్టర్‌గారి ఆదేశం మేరకు నేనూ హాజరయ్యాను. పధ్నాలుగో తారీఖు హైదరాబాద్‌లో సి.బి.ఎస్ డైరెక్టర్ రాళ్ళపల్లి విశ్వనాధంగారి అమ్మాయి పెళ్ళికి అందరం హాజరయ్యాం కూడాను.

నేను ఢిల్లీ ట్రైనింగుకు వెళ్ళిన కాలంలో ఆ నెల్లాళ్ళకు చాలా మటుకు కార్యక్రమాలు ముందే రికార్డు చేసి నేనే ఇచ్చి వెళ్ళాను. అలా ఇచ్చివెళ్ళిన వాటిలో జూన్ 21 రాత్రి ప్రసారమైన కరుణశ్రీగారి కవితా విజయశ్రీ గురించి డా. జంధ్యాల మహతీ శంకర్, ఆధునిక శిల్పకళ గురించి 28.6.94 రాత్రి ప్రసారమైన శ్రీ 'ఉల్చి'గార్ల ప్రసంగాలు పేర్కొనతగినవి. బాపట్ల కళాశాలలో ఉల్చి పనిచేస్తూండేవారు. మంచి చిత్రకారుడు, శిల్పి. ఆయన ఈ మధ్య దివంగతులయ్యారని ఎవరో చెప్పారు వాస్తవం తెలియదు.

అలాగే జూలై '94 లో డా. ఆముళ్ళదిన్నె వెంకటరమణ ప్రసాద్ 14 వతేదీ చేసిన నాయని సుబ్బరావుగారి కవిత్వ వేదన ప్రసంగం ముక్కామల నాగభూషణం గారి సాహితీ కృషీవలత్వం గురించి 21న డా. జి.వి.పూర్ణచంద్ చేసిన ప్రసంగమూ చెప్పుకోదగినవి. అలాగే ఇవాళ కుర్రాళ్ళు 'కెమిస్ట్రీ కుదిరింది' అంటున్న దానికి ప్రాతిపదిక అన్నట్లుగా, అసలు 'ప్రేమ' అనేది ఏమిటనే విశ్లేషణతో, అది ఒక రసాయనిక చర్యగా డా.అన్నపురెడ్డి వెంకటేశ్వర రెడ్డి గారిచే 28 జూలై ఉదయం 'ప్రేమైక రస రసాయనం' అనే ప్రసంగాన్ని ప్రసారం చేసాం. దానికి ఒక మంచి ప్రసంగంగా శ్రోతల ప్రశంసలు బాగా అందాయి. అలాగే ఆగస్టులో 16 వతేదీ ఉదయం శ్రీ కొప్పుల హేమాద్రిగారు ఔషధగుణాలుగల సాధారణమైన మొక్కలు గురించి మంచి ప్రసంగం చేశారు. అలాగే టంగుటూరి ప్రకాశంగారి వద్ద పనిచేసిన తుర్లపాటి కుటుంబరావుగారు ఆగస్టు 28 నాటి ప్రసంగంలో 'ప్రకాశం జ్ఞాపకాలు' శ్రోతలతో పంచుకున్నారు. ఆగస్టులోనే కృష్ణాష్టమిని పురస్కరించుకుని 25వ తేదీన నిడదవోలు పురుషోత్తమపల్లి పరిషత్ హైస్కూల్‌కు చెందిన డా.ధూళిపాళ ప్రభాకర్ కృష్ణమూర్తిగారు 'కృష్ణుని రాసలీలల పరమార్థం' పై ప్రసంగించారు. సెప్టెంబర్ నెల ప్రసంగాలతో పేర్కొనదగినవి సోమంచి రామంగారు ఆరవతేదీ ప్రసంగించిన 'ఉత్తమ ఉపాధ్యాయుడు అంటే' అనే ప్రసంగం, డాక్టర్ పాపినేని శివశంకర్ 22వతేదీ ప్రసంగించిన 'సీమకథల జీవన వాస్తవికత' అనే ప్రసంగం, అలాగే 27వతేదీ ఉదయం ప్రసారమైన శ్రీమతి హేమలతా లవణంగారి 'జాతి జాడ్యాలకు జాషువా సాహితీ వైద్యం' అనే ప్రసంగం. నేనిచ్చిన ఆ ప్రసంగ శీర్షిక హేమలతగారికి ఎంత నచ్చిందో! ఆవిడ రికార్డింగుకు వచ్చినపుడు పదే పదే దాన్ని గురించి ఆనందపడ్డారెందుకో! విశ్వనాథ సత్యనారాయణగారి శతజయంతి ఉత్సవాలు సెప్టెంబర్ 25, 26, 27 తేదీల్లో విజయవాడ సిద్ధార్థ కళాపీఠంలో పెద్ద ఎత్తున జరిగాయి. ఆ మూడు రోజుల ఉత్సవ విశేషాలపై సెప్టెంబర్ 28వతేదీ రాత్రి 8.30కు ప్రత్యేక నివేదిక ప్రసారం చేశాం. శ్రీ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ ఆ నివేదికను సమర్పించారు. సెప్టెంబర్ 28వతేదీన రేడియో బ్రిడ్జిగా నాలుగు కేంద్రాలనుండి ప్రసారమైన సాహిత్య కార్యక్రమంలో నుండి డాక్టర్ వావిలాల సుబ్బారావు గారు 'అరుణాచలంలో చలం' గురించి ప్రసంగించారు. 29వతేదీ 'ఏ సాహితీ విలువలకీ ప్రస్థానం' అన్న ఆలోచనాత్మక ప్రసంగం అందించారు సిద్దార్థ కళాశాల, విజయవాడ ఇంగ్లీష్ లెక్చరర్ శ్రీ బి. తిరుపతిరావుగారు.



శ్రీ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్

జూన్ నెలలో 20 వతేదీ భావకవితా రసరాజు బసవరాజు పేరిట బసవరాజు అప్పారావు గారిపై సంచిక

కార్యక్రమం ప్రసారం చేసాం. శతజయంతి సాహితీమూర్తిగా ఆయన గురించి ఆవంత్స సోమసుందర్, నేనెరిగిన మా బసవరాజు బావ అని వారి బావగారు జి.వి.రామారావుగారు ఆ సాహిత్య సంచికలో పాల్గొన్నారు. అలాగే జూలై 17న 'స్వాతంత్ర్యోద్యమ దీప్తి గరిమెళ్ళ' అని మాకొద్దీ తెల్లదొరతనము అని నినదించిన కవిపై సంచికా కార్యక్రమంలో గగుర్పాటు కలిగించే ఆయన గీతాలపై ఆర్.వి.రామారావు మంచి ప్రసంగం అందించారు. ఆగస్టు 21న కరుణశ్రీగారిపై, సెప్టెంబర్ లో 'విశ్వనాధ కవితా విశ్వం' అని 18 వ తేదీన సంచిక కార్యక్రమాలు వినిపించి శ్రోతల ప్రశంసలు అందుకున్నాం.





వనిత

ప్రముఖ దంపతులు


సుధామ - ఉషారాణి



# 46

**అక్టోబర్'1994లో ఏడవ తేదీనుండి -** మూడు రోజులపాటు అఖిలభారత రచయితల సమ్మేళనం జరిగింది. ప్రభుత్వం ఆధ్వర్యంలో కాక, ఇలాంటి రచయితల సభలు ప్రైవేట్ సంస్థలు నిర్వహించడం తదాదిగా జరుగుతూనే వచ్చింది. "మైత్రేయ" (పి.కృష్ణమూర్తి) గారి చేత ఆ సభలపై 10 వ తేదీ రాత్రి 8.30 కు నివేదిక మాత్రం ప్రసారం చేయడం జరిగింది.



శ్రీ మల్లంపల్లి శరభయ్యగారు

'విశ్వనాధ' వారి శతజయంతి ప్రారంభోత్సవం జరగడంతో, నెలనెలా ఆయన గురించి ఏడాదిపాటు కార్యక్రమాల్ని ప్రసారం చేయాలని సంకల్పించి ప్రముఖులను రికార్డు చేయడం జరిగిందని చెప్పాను కదా! 7.10.94, 4.11.94న 'నేనెరిగిన విశ్వనాధ' అన్న విషయంపై శ్రీ మల్లంపల్లి శరభయ్యగారి వివరణాత్మక ప్రసంగాలు రాత్రి ప్రసారమయ్యాయి. 'ఆ వ్యాసునికి గణపతివలె' శీర్షికన విశ్వనాధ సత్యనారాయణగారికి వ్రాయసకాడిగా సేవలందించిన శ్రీ పేరాల భరత శర్మగారితో ఆ విశేషాలను ఒక పరిచయ కార్యక్రమంగా నేను ఇంటర్వ్యూ చేసి 2.12.94న వినిపించడం జరిగింది. 'దృక్పథం' అనే కొత్త కార్యక్రమంలో 11.10.94 ఉదయం.. 'మతము విజ్ఞానము కలసి మనగలవా?' అనే అంశంపై 'ఎక్స్‌టెంపోర్ ఒపీనియన్ పోల్'గా శ్రీ ఏటుకూరి బలరామమూర్తి, శ్రీ కొండముది హనుమంత రావుగారు, విశ్రాంత ప్రధానోపన్యాసకులు శ్రీ పి.గోపిరెడ్డిగార్ల అభిప్రాయాలు ప్రసారం చేసాం.

అక్టోబర్ దసరా మాసం కావడంతో - విజయవాడ దుర్గగుడి అమ్మవారి ప్రధాన అలంకారాలు చేసే డా.కుందుర్తి సత్యనారాయణమూర్తిగారితో 13.10.94 ఉదయం 'సాహిత్యంలో దుర్గా వైశిష్ట్యం' గురించి ప్రసారం చేసిన కార్యక్రమం శ్రోతలను అలరించింది. 'అనుకున్నంత తేలికకాదు' శీర్షికన ఆ త్రైమాస్తికంలో హాస్య ప్రసంగాల పరంపర ప్లాన్ చేసి, 14.10.94 గురువారం రాత్రి 'గొడుగుతో అడుగు' శీర్షికన పుచ్చాపూర్ణానందంగారి అబ్బాయీ, స్వయంగా హాస్యరచయితా అయిన భార్గవ రామోజీ ప్రసంగాన్ని

తొలుతగా ప్రసారం చేయడమయింది. నవంబర్ 10న ఆ పరంపరలోనే 'అపార్ట్‌మెంట్ కాపురం' గురించి దర్భా బాబూరావు హాస్యప్రసంగం వినిపించాం. నవంబర్ 11న 'వేమన, కబీరుల భావసామ్యం' గురించి ఆర్.వి.ఎస్ సుబ్బారావుగారిది ఒక మంచి ప్రసంగం.

ఆ నవంబర్‌లోనే రాష్ట్ర శాసనసభకు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చింది. అప్పట్లో కృష్ణాజిల్లా కలెక్టర్‌గా ఉన్న శ్రీమతి లక్ష్మీ పార్థసారథిగారు ముందు బెట్టుచేసినా, చివరకు స్వేచ్ఛాయుత ఎన్నికలకు జరుగుతున్న ఏర్పాట్లు గురించి రేడియో ద్వారా వివరించడానికి వచ్చారు. 25.11.94 ఉదయం ఆ కార్యక్రమం ప్రసారమైంది. రికార్డింగుకు వచ్చినప్పుడు మాత్రం లక్ష్మీ పార్థసారథిగారు ఆకాశవాణి సేవలను ప్రశంసిస్తూ, తాను చిన్నతనంలో పిల్లల కార్యక్రమంలో పాల్గొన్న తీపి జ్ఞాపకాలను వివరించారు మాకు.

1994 నవంబర్ 2 దీపావళి. ఆ బుధవారం ఉదయం పదినుండి ఓ గంటపాటు ప్రసారం చేసేందుకు ఒక ప్రత్యేక కార్యక్రమం




రూపకల్పన చేసి, దానిని అక్టోబర్ 29 శనివారం సాయంత్రం ఆరుగంటలకు విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆహూతుల సమక్షంలో ముందుగా ప్రదర్శింపచేసి, రికార్డు చేసి ప్రసారం చేయడం జరిగింది. 'భావదీపికలు' పేరిట రూపొందించిన ఆ కార్యక్రమం ఒక వైవిధ్యభరితమైన కదంబంగా తీర్చిదిద్దాం. అలాంటిది జరగడం అదే మొదలు అన్నవారున్నారు. రాష్ట్రంలోని ఆకాశవాణి కేంద్రాలన్నింటినుంచీ కళాకారులను రావించడం జరిగింది. అయితే ఒక్కో కేంద్రం నుంచి, ఒక్కో అంశం, వైవిధ్యంతో ఆహ్వానించాం. హైదరాబాద్ కేంద్రం నుంచి డా.ముకురాల రామారెడ్డిగారు 'తెరలేనినాటకం' అనే తన కవిత వినిపించగా, ఆదిలాబాద్ నుంచి డాక్టర్. ఎన్.సురేంద్ర 'అధోముఖం' అనే స్కెచ్ వినిపించారు. విజయవాడ నుండి ప్రముఖ మిమిక్రీ కళాకారుడు 'సిల్విస్టర్' మిమిక్రీతో అలరించగా, అనంతపురం నుండి ఆమళ్ళ దిన్నె గోపీనాథ్ తన బృందంతో 'కాదరయ్యపాట' అనే జానపద ప్రదర్శన ఇచ్చారు. నిజామాబాద్ కేంద్రం పక్షాన వచ్చిన 'వాలాగ్ని' (టి.సుదర్శన్ వర్మ) 'యాక్సిడెంట్' అనే కథను వినిపించగా, కడప కేంద్రం పక్షాన ప్రొడ్యూసర్ ఎమిరటస్‌గా ఉండిన శ్రీ పులికంటి కృష్ణారెడ్డిగారు 'నా కంత చోటు కావాలి నవ్వుకోడానికి' అని తన కవితతో అలరించారు. 'సినిమావేషం' అనే కథానికను మార్కాపురం కేంద్ర ప్రతినిధిగా శ్రీమతి. ఎం.మహాలక్ష్మి అందించగా, విశాఖపట్నం పక్షాన డా.అవసరాల రామకృష్ణారావుగారు 'సుస్తీమే సవాల్' అనే కథను సమర్పించారు. తిరుపతి ఆకాశవాణి ప్రతినిధిగా మధురాంతకం నరేంద్ర 'వేరుతెగిన చెట్టు' అనే కథానిక అందించారు. వరంగల్ నుండి ప్రముఖ మిమిక్రీ కళాకారులు డా. నేరెళ్ళ వేణుమాధవ్ గారు వచ్చి 'హైదరాబాద్‌లో ఒక వీధి' అనే మిమిక్రీప్రదర్శన ఇచ్చారు. కొత్తగూడెం, కర్నూల్ కేంద్రాలవారు మాత్రం ప్రతినిధి కళాకారులను పంపలేని తమ ఆశక్తతను వెల్లడించారు.


నేరెళ్ళ వేణుమాధవ్ గారు

ఆహూతుల సమక్షంలో వైవిధ్యభరితంగా జరిగిన ఆ కార్యక్రమం నాడు ప్రేక్షకులను, ప్రసారం రోజు శ్రోతలను కూడా చక్కగా ఆకట్టుకుంది. పరిచయ కార్యక్రమాల్లో భాగంగా అక్టోబర్ 27న 'ముఖేముఖే సరస్వతి' శీర్షికన బెంగుళూరు విశ్వవిద్యాలయం తెలుగు ప్రొఫెసర్ తంగిరాల వెంకట సుబ్బారావుగారితోనూ, 18.11.94న 'బహుముఖీనం కావాల్సిన బాలసాహిత్యం' గురించి డా. గుడివాడ ప్రభావతి గారితోనూ, 22.11.94న ప్రముఖ సాహితీవేత్త హితశ్రీ (ఎం.వి.ఎన్.ప్రసాదరావు) గారితోనూ నేను చేసిన పరిచయ కార్యక్రమాలు ప్రసారమయ్యాయి.


తంగిరాల వెంకట సుబ్బారావు గారు

అలాగే ప్రముఖ కథ నవలా రచయిత్రి శ్రీమతి పవని నిర్మల ప్రభావతి గారిని ప్రయాగ వేదవతిగారు ఇంటర్వ్యూ చేయగా - 'ముఖేముఖే సరస్వతి' శీర్షికన 22.12.94 ఉదయం ఆ పరిచయ కార్యక్రమం శ్రోతలకై ప్రసారం చేయడమైంది.

'వినియోగదర్శిని' వినియోగదారుల కార్యక్రమ నిర్వహణను శ్రీమతి ఎం.కృష్ణకుమారిగారికి బదలాయించడంతో నేను ఆ విభాగంలో 3.10.94న ప్రసారం చేసిన 'వినియోగదారుల ఉద్యమంలో మహిళల ప్రాముఖ్యత' అనే శ్రీమతి పి.శాంతిగారి ప్రసంగమే చివరిదైంది. కాకతాళీయంగా వినియోగదారుల కార్యక్రమ నిర్వహణ మహిళకే బదలాయించడం జరిగిందన్నమాట! ఆ సెక్షన్ రికార్డులన్నీ 3.10.94న కృష్ణకుమారిగారికి 'హేండోవర్' చేసేసాను. అలా ఒక ఘట్టానికి అక్కడితో పులిస్టాపు. శాసన సభ ఎన్నికల కారణంగా 'నడుస్తున్న చరిత్ర' కార్యక్రమానికి అక్టోబర్, నవంబర్ డిసెంబర్ 94 త్రైమాసికంలో తాత్కాలిక విరామం ఇవ్వడం జరిగింది. ఎన్నికల కోడ్‌లో భాగంగా తీసుకున్న చర్య అది.


డాక్టరు జి.లవణంగారు

సంచికలు, చర్చాకార్యక్రమాల 'ఛెంక్'లో 16.10.94 ఉదయ 7.15కు 'కుటుంబ జీవనం - ఆనంద సంధానం' అనే అంశంపై గోష్ఠి ప్రసారం చేయడం జరిగింది. డాక్టరు జి.లవణంగారు 'ఉమ్మడి కుటుంబం వైశిష్ట్యం' గురించీ, 'స్వతంత్ర్యవైయుక్తిక జీవనం' గురించి శ్రీమతి మంగళగిరి ప్రమీలాదేవి, 'వృద్ధాప్య జీవనం' గురించి శ్రీ పోలవరపు జగదీశ్వరరావుగారు, అలాగే గృహిణిగా శ్రీమతి జి. అరుణగారు ఆ గోష్ఠిలో పాల్గొనగా, అనౌన్సర్ శ్రీ ఎస్.బి శ్రీరామమూర్తి 'సినిమా పాటల్లో కుటుంబ జీవన చిత్రణ' గురించి వినిపించారు.

నవంబర్ 20వ తేదీ ఆదివారం ఉదయం 7.15కు 'జ్ఞానపీఠం గురించి జ్ఞానపీఠం' పేరిట విశ్వనాథవారి గురించి డా.సి.నారాయణరెడ్డి గారితో నేను చేసిన పరిచయ కార్యక్రమం ప్రసారమైంది. నేను ఆనవాయితీగా చేసే వార్షిక సాహిత్య సమీక్షగా 18.12.94న '1994 తెలుగు సాహిత్యం - ఒక అవలోకన' అనే సంచికా కార్యక్రమంలో - ఆ ఏటి 'సంప్రదాయ కవిత' గురించి శ్రీ మొవ్వ వృషాద్రిపతి, '1994లో తెలుగు వచన కవిత్వం గురించి శ్రీ జి.లక్ష్మీనరసయ్య, 'తెలుగు కథ' గురించి డా. పాపినేని శివశంకర్, '1994లో తెలుగు సాహిత్య విమర్శ - పత్రికలు' గురించి శ్రీ బి. తిరుపతిరావు సమీక్షా ప్రసంగాలు చేసారు. సంపాదకీయాన్ని నేను సంతరించాను.

డిసెంబర్ 13 మంగళవారం సాయంత్రం విజయవాడ మాంటిస్సోరి మహిళా కళాశాల ఆడిటోరియంలో ప్రముఖ భావకవి


Gnare addressing a function in connection with centenary celebration of Basavaraju Appa Rao in Vijayawada on Tuesday. Bezwada Gopala Reddy, Sudhama, Turlapati Kutumba Rao, Vavilala and Mikkilineni Radhakrishnamurthy besides D Koteswaramma are on the dais. A Newstime picture.

NEWS TIME
14-12-94
WEDNESDAY

రచయిత, పాత్రికేయుడు, న్యాయవాది, శ్రీ బసవరాజు వెంకట అప్పారావుగారి శత జయంత్యుత్సవ సభ జరిగింది. డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డిగారి అధ్యక్షతన డా.సి.నారాయణరెడ్డిగారు సభా ప్రారంభకులుగా జరిగిన ఆ సభలో - 'భావ కవితా యుగవైతాళికుడు బసవరాజు అప్పారావు' అనే గ్రంథాన్ని (గోవిందరాజు వెంకట రామారావుగారు రచించినది) వావిలాల గోపాలకృష్ణయ్యగారు ఆవిష్కరించారు. తుర్లపాటి కుటుంబరావుగారితో బాటు, నేనూ ఆ సభలో పాల్గొని ప్రసంగించడం ఓ మరపురాని జ్ఞాపకమే! బసవరాజు గేయ విభావరి కూడా ఆకాశవాణికి చెందిన ప్రియంవద, మోహనకృష్ణ ప్రభృతులు అందించారు. ర్తి

9.12.94 రాత్రి రేడియోలోనూ 'బసవరాజు అప్పారావు ప్రతిభామూర్తిత్త్వమత్వం' గురించి ఆవంత్స సోమసుందర్ ప్రసంగాన్ని శ్రోతల కందించాం. 'అనుకున్నంత తేలికకాదు'లో 8.12.94న 'బేరసారాలు చేయడం'పై పి.వి.ఎస్.ఎస్సార్.శాస్త్రి (కొవ్వూరు) హాస్యప్రసంగం, 16.12.94న 'ధాశరథి కవితాగ్నిధార' గురించి ఆర్.వి.రామారావు ప్రసంగం శ్రోతలను అలరించిన వాటిలోనివే. భారత రాష్ట్రపతిగా చేసిన జ్ఞానీ జైల్‌సింగ్ 1994 డిసెంబర్ 25



ఆదివారం మృతి చెందడంతో సంతాపదినాలుగా మూడురోజులు పాటింపబడ్డాయి. ప్రసారాలలోనూ ఆ ఛాయలు శ్రోతలు గుర్తించారు. సంవత్సరాంతం కాబట్టి 29.12.94 నాడు 'ప్రాచీన సాహిత్యంలో కాలచిత్రణ' గురించిన ఓ ప్రసంగం డా.బొడ్డుపల్లి పురుషోత్తంగారిది శ్రోతలకు వినిపించాం. 30.12.94 రాత్రి 'జాషువా గారి ఫిర్‌దౌసి' గురించి వి.వెంకట చలపతిరావు ప్రసంగించారు.

డిసెంబర్ ఒకటి 1994న శాసన సభకు ఎన్నికలు జరిగాయి. అయిదవతేదీతో విజయవాడలోనూ అసెంబ్లీ ఎన్నికల ఘట్టం ముగిసింది. విజయవాడ ఆకాశవాణి కేంద్రంలో 1994లో విశ్వనాథ, బసవరాజుల శతజయంతి సంవత్సరాల సందర్భంగానూ, శాసన సభ ఎన్నికల సందర్భంగానూ తెలుగు విభాగపు కార్యక్రమ నిర్వహణాధికారిగా ఉండటం మరుపురాని సంగతులే. దీపావళికి చేసిన 'భావదీపికలు' కార్యక్రమం నేరెళ్ళ వేణుమాధవ్ వంటి కళాకారుడు బాగా గుర్తుంచుకుని, తదనంతరకాలంలో కనబడినప్పుడల్లా స్మరించి అభినందించడం కూడా తీపి జ్ఞాపకమే! 1994 ముగిసి 1995లోకి అడుగుపెడుతున్నప్పుడు - ఆ ఏడాదే విజయవాడ ఆకాశవాణికి గుడ్‌బై చెప్పాల్సి వస్తుందని ఊహించనేలేదు. 1995 ఆగస్టు వరకే విజయవాడ నీళ్ళు రాసిపెట్టి ఉన్నాయని ముందే ఎలా తెలుస్తుంది.





# 47

**1995 జనవరి రిపబ్లిక్ దినోత్సవం** సరిగ్గా మా వివాహదశమ వార్షికోత్సవం. కొత్త సంవత్సరం ఆరంభంలోనే ఆకాశవాణి విజయవాడ లలిత సంగీత పాఠం కోసం –

**"గుప్పిటలో ఇసుకలాగు**
**జారిపోవుకాలం**
**కాలరేఖ అసాంతం**
**మహా ఇంద్రజాలం"**



'మల్లిక్' గారు

అని నేను రాసిన గీతానికి, ప్రముఖ సంగీత దర్శకులు 'మల్లిక్'గారు సంగీతం కూర్చి, 'లలిత సంగీత పాఠంగా' నేర్పించడమే కాకుండా, స్వయంగా ఆయనే ఆలపించారు. ఆ తరువాత కొద్దికాలానికే 'మల్లిక్' గారు అస్తమించినా నా ఆ పాట వారి అజారమరగళంలో ఉండిపోయింది. జనవరి 30 ఉదయం 7.45కు ఆయన గళంలో ఆ పాట ప్రసారమైంది. డిసెంబర్‌లో ఎప్పటి నుంచో అడుగుతున్నారని – ముంబయ్ మా తోడల్లుడు గారి దగ్గరకు ఎల్.టి.సిలో వెళ్దామనుకున్నా, కుదరలేదు. కేవలం హైదరాబాద్ వెళ్ళి వచ్చేయడం మాత్రం జరిగింది. కొత్త సంవత్సరంలో నా శ్రీమతిని కన్న తల్లితండ్రులు నాగపూర్ నుంచి విజయవాడ రావడం చెప్పుకోదగిన సంగతే మాకు.

అంతవరకూ ఆకాశవాణి విజయవాడ కేంద్రానికి తొలి మహిళా స్టేషన్ డైరెక్టర్‌గా పని చేసిన శ్రీమతి దుర్గాభాస్కర్‌గారికి ఫిబ్రవరి 8 వతేదీ ఆకాశవాణి మద్రాసు కేంద్రానికి బదిలీ చేస్తూ ఆర్డర్లు వచ్చాయి. రెండేళ్ళపాటు విజయవాడలో పనిచేసిన ఆవిడ తనదైన ముద్ర వేసుకున్నారు. పట్టువిడవని మనస్తత్వంగల వ్యక్తి అయినా, ఆవిడ ఆదరణకు పాత్రం కావడం, విశ్వాసాన్ని చూరగొనడం మాకు సంతోషదాయకాలే. అయితే 'చేసేవారికే పనిభారం' అన్నది ఎక్కడయినా సహజమేనేమో! 'ఫిలిప్స్ డివిజన్

విజయవాడలో ఏవో పోస్టులకు ఇంటర్వ్యూ బోర్డు సభ్యునిగా ఫిబ్రవరి 6న ఆవిడ, వారు కోరగా నన్ను పంపించడం కూడా గుర్తుంది. ఆకాశవాణి కార్యక్రమ నిర్వహణాధికారిగా ఉంటూ ఇలా 'ఫిలిమ్స్ డివిజన్', సాంగ్స్ అండ్ డ్రామా డివిజన్స్‌లో కొన్ని ఉద్యోగ నియామకాలకు ఎంపిక చేసే సభ్యునిగా రెండు మూడు పర్యాయాలు నేనూ వ్యవహరించవలసి వచ్చింది. ఫిబ్రవరి 11న ఆకాశవాణి ఉద్యోగులం కొందరం కలిసి నాగార్జున సాగర్ విహార యాత్రకు వెళ్ళాం. బదిలీ అయిన దుర్గా భాస్కర్‌గారు కూడా ఆ యాత్రకు వచ్చారు. వారి అమ్మాయి గాయత్రితో బాటుగా. వెళ్ళిపోయేముందు కూడా ఆకాశవాణి విజయవాడ మీటింగ్ హాల్‌కు ఫిబ్రవరి 14న కొత్త కుర్చీలు అలంకరింపచేసారు ఆవిడ. అసిస్టెంట్ స్టేషన్ డైరెక్టర్‌గా ఉన్న వేదవతిగారు ఆ ఫిబ్రవరిలోనే ఓ పదిరోజులు సెలవుపెట్టడంతో ఆవిడ సెలవు పిరియడ్‌లో ఆ బాధ్యతలను నేను నిర్వర్తించడం జరిగింది. ఫిబ్రవరి 16న ఆకాశవాణి విజయవాడ వార్తా విభాగంలోని శ్రీ ఎం.వి.ఎస్. ప్రసాద్ గృహప్రవేశానికి మేం వెళ్ళడం కూడా గుర్తుంది.

శ్రీ సాయికృష్ణ యాచేంద్ర ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో 'లలిత సంగీత గేయధార' కార్యక్రమాన్ని ఫిబ్రవరి 19న నిర్వహించడం ఓ మంచి జ్ఞాపకమే! ఆకాశవాణి విజయవాడ కేంద్ర ఉద్యోగుల 'క్లబ్‌డే' మరియు 'క్రీడాదినోత్సవం' ఫిబ్రవరి 25న చానాళ్ళ తర్వాత నిర్వహించడం కూడా ఓ చెప్పుకోదగిన విశేషం అనాలి.

ఇక జనవరి 1995లో విజయవాడ నుండి తెలుగు విభాగం అధికారిగా నా ఆధ్వర్యంలో ప్రసారమైన కార్యక్రమాల కొన్నింటి విశేషాలు చెప్పుకోవాలంటే - 12.1.1995 గురువారం ఉదయం డాక్టర్ ధారా రామనాథ శాస్త్రిగారు 'భారతంలో సహనశీలురు' అనే అంశంపై ప్రసంగించారు. కీ.శే. మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రిగారు 1965లో శ్రీపాదకృష్ణమూర్తి శాస్త్రిగారి గురించీ, వారి కవిసార్వభౌమత్వం గురించీ చేసిన ప్రసంగం రికార్డింగు 'స్మృతిస్వరాలు'గా సంపాదించి ప్రసారం చేసాం. అలాగే ఫిబ్రవరి 9న 'చెళ్ళపిళ్ళ


ఈనాడు విజయవాడ 20.3.1995

ఆకాశవాణి అందించిన ఆనంద హేల

వారి ఛలోక్తులు' గురించి - డా. ఆకొండి విశ్వనాథంగారు ఒంగోలు నుండి వచ్చి ఓ చక్కని ప్రసంగం చేసారు. 'స్మృతిస్వరాలు'లోనే 1979నాటి కీ.శే. దీపాల పిచ్చయ్యశాస్త్రిగారి 'నా సాహితీ యాత్ర' ప్రసంగాన్ని 16.2.95 ఉదయం శ్రోతలకు వినిపింపచేశాం. డా.జి.వై ప్రభావతీదేవి 17.2.95 రాత్రి 'జాషువా ముంతాజ్ మహల్ కావ్య సౌందర్యం' పై ఓ ప్రసంగం చేశారు.

మద్రాస్‌కు శ్రీమతి దుర్గాభాస్కర్‌గారు వెళ్ళిపోయాక మా విజయవాడ ఆకాశవాణి కేంద్రానికి ఫిబ్రవరి నెలాఖరులోనే అనుకుంటా డాక్టర్ రేవూరి అనంత పద్మనాభరావుగారు స్టేషన్ డైరెక్టర్‌గా వచ్చి చేరారు. ఆయనను 'ఆర్.ఏ.పి'గారుగా ఆకాశవాణి కుటుంబం సంభావించేది! గొప్ప విద్వాంసులు. మంచి హాస్యచతురులు. స్వయంగా అవధానాలు చేసినవారు. కందుకూరి రుద్రకవి మీద తెలుగులోనే పి.హెచ్.డి చేశారాయన. ఆయన చేరగానే 'ఉగాది' వచ్చింది. ఏప్రెల్ 1న 'యువ' ఉగాది అయినా, ఆహూతుల సమక్షంలో మార్చి 28నే విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో 'చైత్రవిభావరి' పేర ఉగాది ప్రత్యేక కార్యక్రమం పద్మనాభరావుగారి పర్యవేక్షణలోనే రూపుదిద్దుకుంది. 'వసంతగానం' పేర లలితగీతాలు, 'మావుచివుళ్ళు' పేర కవి సమ్మేళనం, 'నవ్వుల పందిరి' హాస్య కదంబం ప్రేక్షకులకు రసానుభూతినందించాయి 'మావిచివుళ్ళు' కవి సమ్మేళనానికి నేనే వ్యాఖ్యాతగా వ్యవహరించాను. డాక్టర్ పైడిపాటి


డాక్టర్ రేవూరి అనంత పద్మనాభరావుగారు

సుబ్బరామశాస్త్రి, డా. ధారా రామనాథశాస్త్రి, శ్రీ శనగన నరసింహస్వామి, డాక్టర్ ప్రసాదరాయ కులపతి, డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు, శ్రీ దాసి బసవయ్య, డాక్టర్ ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ, శ్రీ మొవ్వ వృషాద్రిపతి, డాక్టర్ వి.బి.సాయికృష్ణ యాచేంద్ర, శ్రీ రాచగుండ్ల చెంచలరావు, శ్రీ బండ్లమూడి సత్యనారాయణ, శ్రీ కడిమిళ్ళ వరప్రసాద శతావధాని, రసరాజు, డాక్టర్ పాపినేని శివశంకర్ ఆనాటి కవిసమ్మేళనంలో పాల్గొన్నారు.

ఆ తరువాత జరిగిన - 'నవ్వుల పందిరి' హాస్యవల్లరి - కార్యక్రమానికి స్టేషన్ డైరెక్టర్ శ్రీ ఆర్. అనంత పద్మనాభరావుగారే వ్యాఖ్యాత గా వ్యవహరించారు. శ్రీ భమిడిపాటి రాధాకృష్ణ 'భయం', శ్రీ ఆదివిష్ణు 'పి.ఆర్.ఓ', శ్రీ భమిడిపాటి రామగోపాలం 'పెన్షన్ ధ్రువాలు', శ్రీ ధర్మవరపు సుబ్రహ్మణ్యం 'లోకాభిరామాయణం', శ్రీ మన్నవ గిరిధరరావు విద్యార్థుల ప్రతిభాపాటవాలు, శ్రీ జంధ్యాల(సినీదర్శకులు) 'భలే చౌకబేరం', శ్రీ గుండు సుబ్రహ్మణ్యదీక్షితులు 'ఉగాది పచ్చడి - యజమాని అవస్థ', శ్రీ జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు 'రూపాయిదండకం,' శ్రీ గుడిపూడి శ్రీహరి 'పెళ్ళిళ్ళోయ్ పెళ్ళిళ్ళు', శ్రీ దర్భా బాబూరావు 'వేపపూత - కోయిల కూత' హాస్య కార్యక్రమాలు ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తించాయి. ఉగాది శనివారం మధ్యాహ్నం రేడియోలో ఈ కార్యక్రమాలన్నింటినీ ప్రసారం చేశాం.



విశాఖ రేడియో 1995 ఉగాది ప్రోగ్రాం

యువ నామ సంవత్సరం ఉగాది పర్వదిన సందర్భగానే - ఆకాశవాణి విశాఖపట్టణం కేంద్రం స్థానిక కళాభారతి ఆడిటోరియంలో 29 మార్చి సాయంత్రం 'యువవసంతం' పేర కవితాంజలి, రసవాహిని, లయహొయలు కార్యక్రమాలను నిర్వహించింది. ఆ కవిసమ్మేళనంలో పాల్గొనమని 'అఫీషియల్‌గా' నాకు ఆహ్వానం అందింది. ఆన్ డ్యూటీగా డైరెక్టర్‌గారు - వెళ్ళి నేను పాల్గొనడానికి అనుమతించారు. 28 వ తేదీ రాత్రే ఇక్కడ మా కార్యక్రమం పూర్తయ్యాక బయలుదేరి విశాఖ వెళ్ళాను. ఆఫీస్ ఆర్డర్ ప్రకారమే 31న బయలుదేరి తిరిగి విజయవాడ వచ్చాను. కానీ రైలు ఆలస్యంగా వచ్చేసరికి ఆ రోజు ఆఫీసుకు వెళ్ళడం కుదరలేదు. డైరెక్టర్‌గారు నేను 31న ఎందుకు డ్యూటీలో చేరలేదని, ఏప్రెల్ ఒకటిన ఒక 'నోట్' ఇవ్వడమూ, 31న రైలు దిగి రావడానికి వ్యవధానం లేకపోయిందని నేను బదులువ్వడము కూడా గుర్తుంది. కానీ 'ఉగాదిపూట' - ఆయనే ప్రోత్సహించి నన్ను విశాఖ కవిసమ్మేళనానికి పంపి, 'నోట్' ఇవ్వడం కొంచెం మనస్సు 'చివుక్కు'మనిపించిన మాట వాస్తవం. ఆఫీస్ ఆర్డర్‌లో 31న విశాఖలో బయలుదేరి రమ్మనమన్న విషయం స్పష్టంగా ఉండడం వల్ల - అదే రోజు బయలుదేరి వచ్చానని, ఆఫీస్ ఆర్డర్ జతచేసి స్పష్టంగా రాసి ఇచ్చాను. దాంతో ఆయన మిన్నకున్నారు.

'యువ' ఉగాది నన్ను చాలా బిజీచేసింది. ఉగాది సందర్భంగా 'రసభారతి' సాహితీ సంస్థ విజయవాడలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ భవనంలో అధ్యక్షులు శ్రీ గడ్డం సుబ్బారావుగారు ముఖ్య అతిథిగా 6.4.95 సాయంకాలం నా నిర్వహణలో కవిసమ్మేళనం ఏర్పాటుచేసింది. ఎం.పి.జానుకవి, శనగన నరసింహస్వామి, అడిగోపుల వెంకటరత్నం, పురాణ పండ రంగనాథ్, ఘంటసాల నిర్మల ప్రభృతులు ఆ కవిసమ్మేళనంలో పాల్గొన్నారు.


ఉదయం

సమాజానికి దిక్సూచి కవి

రసభారతి ఉగాది కవిసమ్మేళనం

ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో తెలుగు విభాగం కార్యక్రమ నిర్వహణాధికారిగా మార్చి'1995లోనే డైరెక్టర్ ఆర్.ఏ.పద్మనాభరావుగారు నన్ను వివిధభారతి వాణిజ్య ప్రసార విభాగానికి బదిలీ చేయడంతో, ఆ బాధ్యతలకు విముక్తి కలిగింది. శ్రీమతి డి. పద్మావతిని నా స్థానంలో ఆర్.ఏ.పీగారు నియామకం చేసారు. ఆకాశవాణిలో ఏ కార్యక్రమ విభాగాన్ని ఎవరు నిర్వహించాలన్నది నిర్దేశించేది స్టేషన్ డైరెక్టరే! నిర్దేశించిన విభాగాన్ని సమర్థంగా నిర్వహించడమే మేం చేయాల్సిన పని. తెలుగు విభాగం నా నుండి తొలిగించినందుకు నేనేమయినా ఆయనను కలిసి అడుగుతానని - ఆయననుకున్నారేమో తెలియదు కానీ, నేను నా సెక్షన్ పద్మావతిగారికి అప్పచెప్పి వివిధభారతి బాధ్యతలు చేపట్టాక ఆయనే నన్నొకరోజు తన రూములోకి పిలిచి సి.బి.ఎస్ (వివిధభారతి వాణిజ్య ప్రసార విభాగం) నిర్వహణపట్ల తాను అసంతృప్తిగా ఉన్నాననీ, అందువల్ల నేనయితే సమర్థంగా, బయట నుంచి ఆరోపణలు రాకుండా నిర్వహించగలననే విశ్వాసంతో నాకు ఆ బాధ్యతలు కేటాయించాననీ, నా ఇంట్లో ఎలాగూ ఆఫీస్ ఫోన్ ఉంది కనుక 'సి.బి.ఎస్' నిర్వహణకు దానిని తొలిగించాల్సిన అవసరం ఉండదనీ చెప్పుకొచ్చారు. నేను మార్పు పట్ల చాలా సంతృప్తిగా ఉన్నాననీ నేనేమీ అనుకోలేదనీ, అనుకోననీ, ఏ సెక్షన్ అయినా సరేననీ ఆయనకు విశదపరిచాను. నిజంగానే నాకు మేలు జరిగింది. అంతకు ముందు తెలుగు విభాగం అధిపతిగా బయటి సాహిత్యకార్యక్రమాలకు ఎక్కువ వెళ్ళకుండా నియంత్రించుకున్న నేను, ఇప్పుడు అలాంటి 'లింక్' అంటూ ఏమీ లేకుండా - నిజంగా నా సాహిత్య వ్యక్తిత్వంతో అందుకున్న ఆహ్వానాలు కావడం వల్ల, విరివిగా కార్యక్రమాల్లో బయట ఊళ్ళలోనూ పాల్గొన గలిగాను.

విజయవాడలో తెలుగు సాహిత్య విభాగం, తెలుగు విభాగం కార్యక్రమ నిర్వహణాధికారిగా ఏప్రెల్'95లో నేను ప్రసారం చేసిన కార్యక్రమాల అనంతరం - ఆ మూడు నెలల షెడ్యూల్ అనగా ఏప్రెల్, మే, జూన్'95లో తరువాతి రెండు నెలలూ నేను ప్లాన్ చేసినవి కొన్ని అమలు పరిచినా పద్మనాభరావుగారిచే మే నుండి సరికొత్తదనాలు సంతరించారు. పద్మనాభరావుగారికి మార్నింగ్ వాక్‌లో విజయవాడలో వి.ఐ.పి గెస్ట్ హౌస్ వైపు వెళ్ళడం అలవాటు. అలా గెస్ట్ హౌస్‌లో ఏ ప్రముఖులు దిగినా ఆయన ఆకాశవాణికి వారి సేవలు వినియోగింపచేయడంలో నిష్ణాతులు. ఓసారి సినీనటి 'రోజా'ను అలా ఆకాశవాణి కేంద్రానికి తీసుకురావడానికి గెస్ట్ హౌస్ వద్ద చాలాసేపు ఎదురు చూడడానికి కూడా ఆయన వెనుకాడలేదు అంటే ఆయన కార్యదీక్ష, నిబద్ధత ఎంత గొప్పదో అర్థం చేసుకోవచ్చు.






ఏప్రెల్ నెలలో 28.4.95 రాత్రి 'చాటుపద్యాల్లో చమత్కారాలు' గురించి శ్రీ సూర్యమంచి సాంబశివరావుగారి ప్రసంగం, 4.4.95 ఉదయం మానాప్రగడ వెంకట సుబ్బరాయకవి, సురభి నరసింహం, ఘంటసాల నిర్మలగార్ల 'కవితాహారం', అలాగే పరిచయ కార్యక్రమాల్లో 21.4.95 రాత్రి 'మానస సరోవరయాత్ర' గురించి శ్రీ శీలేపల్లి రవికుమార్‌తో, 25.4.95 ఉదయం కందుకూరి గురించి ఏటుకూరి బలరామమూర్తిగారితో, 28.4.95 శుక్రవారం ఉదయం నాగార్జున విశ్వవిద్యాలయం - నాటి వైస్ ఛాన్సలర్ ఆచార్య ఎస్.వి.జె. లక్ష్మణ్‌గారితో నేను చేసిన పరిచయాలూ; మార్చిలో పదవతేదీ పొనుగోటి కృష్ణారెడ్డితో చేయించిన పుస్తక సమీక్షా కార్యక్రమం, 'నడుస్తున్న చరిత్ర'లో ఆ ఏప్రెల్ లో 'ఉదయం' నీలం దయానందరాజు, 'విశాలాంధ్ర'


వైస్ ఛాన్సలర్ ఆచార్య ఎస్.వి.జె. లక్ష్మణ్‌గారితో

ఎం.సుబ్బారావు, 'వండర్ వరల్డ్' ఎం.నారాయణరావు, 'నేషనల్ హెరాల్డ్' కె.గోపాలకృష్ణ, 'ఆంధ్రప్రభ' ఎస్.వి.డి.వి ప్రసాదరావులచే చేయించిన జాతీయ అంతర్జాతీయ రాష్ట్ర సంఘటనల వారాంతపు సమీక్షలూ, ఏప్రెల్ 16 ఉదయం జనబాంధవుడు డా. అంబేద్కర్ ప్రసంగం, 'నేనెరిగిన అంబేద్కర్' అని ఆయనతో పనిచేసిన కోనాడ సూర్యప్రకాశరావుగారితో నే చేసిన ఇంటర్వ్యూ, అంబేద్కర్ గళం, ఏప్రెల్ 'సరసవినోదిని'లో శ్రీ పింగళి వెంకటకృష్ణారావు, డా.వై సోమసుందరరావు గార్ల నిర్వహణ - నేను నా రిజిష్టర్లలో చివరిగా నమోదు చేసుకున్న ప్రసారాంశాలు.



నేను డిటైల్స్ రాసుకున్న ఫైల్స్

ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో తెలుగు విభాగాన్ని కార్యక్రమ నిర్వహణాధికారిగా పదోన్నతి పొందీ పొందడంతోనే నిర్వహించడంతో - కొత్త ఉద్యోగపు శ్రద్ధాసక్తులతో నేను ప్రసారం చేసిన అంశాలన్నింటినీ తేదీలవారీగా రాసిపుంచుకోవడం వల్ల నా 'రేడియో జ్ఞాపకాలు'లో ఆ విశేషాలన్నీ మీకు పూసగుచ్చినట్లుగా చెప్పగలిగాను. నిజానికి ఇవన్నీ పఠితలకు అంత ఆసక్తిదాయకాలు కాకపోవచ్చుగానీ, రేడియో ప్రసారాల గురించి తెలుసుకోగోరేవారికి కొంత మేరకు రికార్డుగా ఉంటాయని ఏదో 'టైంటేబుల్స్; రాసినట్లుగానే నాకూ అనిపించినా, మీకు అందించడం జరిగింది. విజయవాడ నుండి జూలై నెలాఖరుకు హైదరాబాద్ ట్రాన్సఫర్ అయి, హైదరాబాద్‌లోనూ వెనువెంటనే 'తెలుగుశాఖనే' నిర్వహించినా ఆ వివరాలేవీ రాసి పెట్టుకునే వీలుకలగలేదు. విజయవాడలో ఉన్న సౌలభ్యాలు - ఇంతపెద్ద హైదరాబాద్‌లో పని ఒత్తిడుల భారం వల్ల - రాసిపెట్టుకునే అవకాశమూ ఇవ్వలేదు! అంచేత ఇకనుంచీ చెప్పబోయే అంశాలు కేవలం నా స్మృతి పథంలో ఉండినవి మాత్రమే పంచుకోగలుగుతాను. అంచేత ఇంకెన్ని నెలలు ఈ శీర్షిక కొనసాగించగలనో చూడాలి మరి!

సరే! మార్చి'95 చివరనుంచి దాదాపుగా విజయవాడలో వివిధభారతి వాణిజ్య ప్రసార విభాగం కార్యక్రమ నిర్వహణాధికారిగా ఆ ప్రకటనలు, రెవిన్యూ, ప్రాయోజిత కార్యక్రమాలు, సినిమా పాటలు.. ఆ ప్రపంచమే వేరు! రోజువారీ వాణిజ్యప్రకటనలు, ప్రకటన కర్తలు బుక్ చేసుకున్నవి సమయానికి ప్రసారమయ్యేలా చూడడం, హైదరాబాద్ వాణిజ్య విభాగంతో అనుసంధానం చేయడం, ముంబయ్ నుంచి రావల్సిన టేప్స్ అవీ సరిగా వస్తున్నాయో లేదో చూడడం, తెలుగు సినిమా పాటలు ('జనరంజని' మొదలైన కార్యక్రమాల్లో) ప్రసారమయ్యేందుకు షెడ్యూల్స్ సరిగా జరుగుతున్నాయో లేదో పర్యవేక్షించడం, అనౌన్సర్లు, డ్యూటీ ఆఫీసర్ల డ్యూటీల పర్యవేక్షణ, స్పాట్స్ డబ్బింగ్.. ఇవన్నీ ఆ విభాగ నిర్వహణలోని భాగాలు. ఆ పనుల్లో సాగుతూండగా -


ట్రాన్స్‌ఫర్ టు మార్కాపురం

1995 మే 9 వ తేదీన ఆకాశవాణి డైరెక్టరేట్ న్యూఢిల్లీనుండి వివిధ కేంద్రాల నుండి మొత్తం 73 మంది ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్‌లను వేర్వేరు కేంద్రాలకు బదిలీ చేస్తూ 'ట్రాన్స్‌ఫర్ ఆర్డర్లు వెలువడ్డాయి.' అందులో విజయవాడ నుంచి నన్నూ, విజయవాడలో 'రిటైన్' అయ్యి కొద్ది నెలలే అయినా, నా శ్రీమతి ఉషారాణిని కూడా మా ఇద్దరినీ 'మార్కాపురం' బదిలీ చేస్తూ - ఆర్డర్లు వెలువడ్డాయి. శ్రీమతి ఆరోగ్యరీత్యా మార్కాపురం, కొత్తగూడెం వంటి చోట్ల ఉద్యోగించడం కష్టం అని డైరెక్టరేట్‌కు అంతకుముందే తెలియచేసుకున్నా, మార్కాపురానికి ఇద్దరినీ పోస్ట్ చేయడం బాధ కలిగించింది! మేం కష్టపడి చేసిన సేవలకు ఇదా ప్రతిఫలం అనిపించింది. డైరెక్టర్ పద్మనాభరావుగారు "పోనీ ఇద్దరూ కడప ప్రయత్నించుకుంటారా" అని అడిగారు. అదయినా ఫరవాలేదనుకున్నాం! అప్పుడు హైదరాబాద్‌లో శ్రీ వి.వి.శాస్త్రిగారు

డైరెక్టర్‌గా ఉన్నారు. ఆయన పెక్స్(కో)గా ఉండగా కూడా మా గురించి ఆయనకు తెలుసు. "ఆయన తలుచుకుంటే మీకేదైనా సహాయపడగలరేమో" అన్నారు పద్మనాభరావుగారు. డైరెక్టరేట్‌కు - మమ్మల్నిద్దరినీ కడపకుగానీ, హైదరాబాద్‌కుగానీ బదిలీ చేయగోరుతూ, పద్మనాభరావుగారి ద్వారా విన్నపం పంపించుకున్నాం. సమాధానానికి ఎదురుచూస్తూ కొనసాగాం.




# 48

**మంగళాదీని, మంగళమధ్యాని,** మంగళాంతాని అన్నట్లు ఆకాశవాణి వివిధభారతి వాణిజ్యప్రసార విభాగంతో నా వృత్తిజీవితం ముడిపడడం ఒక విశేషమే మరి! 1978లో ట్రాన్స్‌మిషన్ ఎక్జిక్యూటివ్‌గా ఆకాశవాణి హైదరాబాద్ వివిధభారతి వాణిజ్య ప్రసార విభాగంలో చేరిన నేను 1985లో ప్రధాన కేంద్రానికి బదిలీ అయి 1991లో కార్యక్రమ నిర్వహణాధికారిగా పదోన్నతి మీద విజయవాడ ఆకాశవాణికి బదిలీపై వెళ్ళి తెలుగు విభాగాధిపతిగా ఉంటూ 1995లో మళ్ళీ ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రానికి వచ్చేముందు మార్చి '9 నుంచి ఓ అయిదు నెలలు అప్పటి విజయవాడ స్టేషన్ డైరెక్టర్ ఆర్. ఎ. పద్మనాభరావుగారు చేసిన మార్పుతో విజయవాడ ఆకాశవాణి వివిధభారతి వాణిజ్య ప్రసార విభాగం కార్యక్రమ నిర్వహణా బాధ్యతలు వహించాను. అదే 'మంగళ మధ్యాని' అన్నమాట!

ఆకాశవాణిలో వివిధభారతి ప్రసారాలు అసలు 1962లో ప్రారంభం అయ్యాయి. అప్పటి కేంద్ర రేడియో సమాచార శాఖ మంత్రిగా డా.బెజవాడ గోపాలరెడ్డిగారు ఆ ప్రసారాలను ప్రారంభించారు. జూలై '19కు ముప్పైమూడు సంవత్సరాలు పూర్తయ్యాయి. డైరెక్టర్ ఆర్.ఎ.పద్మనాభరావుగారు రేడియోలో ఆ వేడుకల సభను నిర్వహింపచేసారు. అలాంటి చక్కటి ఆలోచనలు ఆయన సొంతం.


వివిధభారతి 33వ వార్షికోత్సవ సభలో డా.బెజవాడ గోపాలరెడ్డిగారు

విశేషం ఏమిటంటే ఆ వేడుక సభకు ముఖ్య అతిధిగా డా.బెజవాడ గోపాలరెడ్డిగారినే ఆహ్వానించడం. గోపాలరెడ్డిగారు విజయవాడ ఆకాశవాణి వివిధభారతి వాణిజ్యప్రసార విభాగం తరఫున ఏర్పాటుచేసిన ఆ నాటి సభలో ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. అది కేవలం ఆకాశవాణి ఉద్యోగుల బృందంకే పరిమితమైన సభ అయినా చక్కగా జరిగింది. వివిధభారతి కార్యక్రమ నిర్వహణాధికారిగా డైరెక్టర్ పద్మనాభరావు గారి అధ్యక్షంలో నేను నివేదిక సమర్పించాను. వివిధభారతి ప్రసారాల 33వ వార్షికోత్సవం అలా నేను ఆ విభాగాధికారిగా ఉండగా జరగడం ఒక మధురస్మృతియే!




విజయవాడ పూర్ణానందంపేటలోని సుమధుర కళానికేతన్ హాస్యనాటకోత్సవాలకు పెట్టింది పేరు. ఆ సంస్థ ఇరవై రెండవ వార్షికోత్సవాల సందర్భంగా విజయవాడ తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో 1995 జూలై 7,8,9 తేదీలలో రాష్ట్రస్థాయి హాస్యనాటికోత్సవాలు నిర్వహిస్తూ డైరెక్టర్‌గారిని ప్రారంభోత్సవ సభకు ముఖ్యఅతిధిగానూ, నన్ను ప్రధానవక్తగానూ ఆహ్వానించారు. కార్యదర్శి శ్రీ హెచ్.వి.ఆర్.ఎస్ ప్రసాద్ పరిషత్ కార్యవర్గంలో గౌరవ సభ్యుడైన మా ఆకాశవాణి విజయవాడ అనౌన్సర్ శ్రీ మాడుగుల రామకృష్ణ ప్రోత్సాహంతో. నేనొక కార్టూనిస్టునీ, హాస్య రచయితనీ అనే గౌరవంతో సాహిత్యంలో హాస్యం గురించి ప్రారంభోత్సవ సభలో ప్రధాన వక్తగా ప్రసంగించమని కోరారు. వాణిజ్యప్రసార విభాగం చూస్తున్నా నన్ను నన్నుగా అలా పిలిచినందుకు ఆనందంతో అంగీకరించాను. సినీరచయిత ఎం.దివాకర్ బాబు విశిష్ట అతిధిగా శ్రీయుతులు గుండు హనుమంతరావు, చిట్టిబాబు, గౌతంరాజు, జెన్నీ వంటి సినీ హాస్యనటులు ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేసిన ఆ సభలో నా ప్రసంగం ప్రేక్షకులను ఆకట్టుకున్నట్టుంది. మరునాడు పేపర్లలో ప్రధానవక్తగా నా ప్రసంగమే పతాక శీర్షికలకెక్కడం ఎంతో సంతోషాన్నిచ్చింది. ఆ రోజు జరిగిన నాటికల ప్రదర్శనల్లో నరసరావుపేట అభినందన ఆర్ట్స్ వారు వేసిన 'కలహాలకాపురం' నాటిక ఆడిటోరియం అంతా నవ్వుల జల్లులు కురిపించడం ఇప్పటికీ మరిచిపోలేను.

అలాగే వివిధభారతి విజయవాడ కార్యక్రమ నిర్వాహకుడిగా ఉన్న ఆ సమయంలోనే అవనిగడ్డలో స్థానిక భారతీయ సాహిత్య పరిషత్ శాఖ ఆధ్వర్యంలో జూలై, 9, 1995 శనివారం రాత్రి 'నేటికవితాధోరణులు' అనే అంశంపై సాహితీ సమాలోచన కార్యక్రమానికి ప్రధానవక్తగా శ్రీ మండలి బుద్ధప్రసాద్‌గారితో ఆహ్వానింపబడ్డాను. దివిసీమ సాహితీ సమితి అధ్యక్షులుగా, గాంధీ క్షేత్రం మాసపత్రిక సంపాదకులుగా మండలి బుద్ధప్రసాద్‌గారే ఆ సభకు అధ్యక్షత వహించారు. బుద్ధప్రసాద్‌గారి ఆతిధ్యం స్వీకరించడం కూడా మరుపురాని మధురస్మృతి. శ్రీ గుడిసేవ విష్ణుప్రసాద్ పరిషత్ ప్రధాన కార్యదర్శిగా, నాపట్ల చూపిన ఆదరాభిమానాలూ మరుపురానివే. సమావేశం చాలా ఆత్మీయంగానూ, నిండుగానూ జరిగింది.

మార్కాపురం బదిలీ నిలుపుదల జరుగుతుందా లేదా అనే ఆందోళన ఓ వంక అప్పుడు ఉండనే ఉండింది. హైదరాబాద్ ఆకాశవాణి కేంద్ర సంచాలకులుగా ఉన్న శ్రీ వి.వి.శాస్త్రిగారు ఏమైనా సహాయపడతారేమో ప్రయత్నించమనీ ఆయనకు టి.ఆర్.జి.కృష్ణమాచార్యులు, వ్యాస్ కుమార్, నాగ పద్మినిగారలు కుడిభుజాలుగా ఉన్నారనీ పనులు సానుకూలమయ్యే పద్ధతులు వారినడిగితే తెలుస్తుందనీ రావూరి అనంతపద్మనాభరావుగారు ఒకేసారి నవ్వుతూ అన్నారు నాతో. వి.వి.శాస్త్రిగారు పెక్స్(కో)గా ఉండగా నేను హైదరాబాదులో ఆయనవద్ద డ్యూటీ ఆఫీసర్‌గా పనిచేసినవాడినే. ఆయన సూటిగా ఉంటూనే సరదాగా ఉండేవారు. 'డైరెక్టరేట్ ఎన్ని సార్లు కృష్ణమాచార్యులుగారిని హైదరాబాద్ నుండి బదిలీ చేసినా శాస్త్రిగారు అడ్డుపడి డైరెక్టరేట్ ఆదేశాలను ఖాతరు చేసేవారుకారనీ ఆయన తలచుకుంటే డైరెక్టరేట్‌లో చెప్పి ఏమయినా సాధించగలరనీ నమ్మికగా చెప్పుకునేవారంతా. అమ్మను అన్నదమ్ములినీ, చెల్లెళ్ళనీ చూడడానికి అప్పుడప్పుడు విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్ళడంలో భాగంగా ఆ మాటు వెళ్ళినప్పుడు హైదరాబాదులో డైరెక్టర్ వి.వి.శాస్త్రిగారిని కలిసి మార్కాపురం వద్దని అప్లికేషన్ పెట్టుకున్నామనీ, ఉష ఆరోగ్యం దృష్ట్యా సహకరించమని అడిగినప్పుడు "రేయ్! మీ ఆవిడని హైదరాబాద్ తీసుకొస్తాగానీ, నువ్వు అదిలాబాద్ వెళ్ళి కొన్నాళ్ళు పనిచేయ్" అన్నారు శాస్త్రిగారు నవ్వుతూ. నేను అలాగేనని

అంగీకరించాను. అప్పట్లో డి.జి.గా ఉన్న 'కృష్ణన్'గారు హైదరాబాద్ వచ్చినప్పుడు శాస్త్రిగారు ఆయనతో మా విషయం చెప్పారట. "మీరు విడిగా ఉన్నంతమాత్రాన ఆ భార్యాభర్తలను విడదీయాలా" అనికూడా ఆయనతో అనేసారట! ఏమయితేనేం! పెద్దల ఆశీస్సులతో, సంస్థ సమాదరణంతో ఉషనూ, నన్నూ ఇద్దరినీ మార్కాపురంకు కాక హైదరాబాద్‌కే బదిలీ చేస్తూ జూలై 13, 1995 తేదీన ఆకాశవాణి డైరెక్టరేట్ జనరల్ నుండి ఆర్డర్లు వచ్చాయి. అదెంతటి ఉపశమనమో, ఆనంద సంధాయకమో వేరే చెప్పాలా?

31 జూలై' 1995న ఆకాశవాణి విజయవాడ కేంద్రం నుండి హైదరాబాద్‌కు బదిలీ అయిన మా ఇద్దరినీ రిలీవ్ చేసారు. ఆ సందర్భంగా జరిగిన వీడ్కోలు సభ నిజంగా అత్యంత ఆత్మీయంగానూ, ఆర్ద్రంగానూ జరిగింది. మాకు హోటల్లో విందు ఇచ్చారు. ఎస్.బి.శ్రీరామమూర్తిగారు (రామంగా ప్రసిద్ధులైన అనౌన్సర్) మాకు గ్రాంఫోన్, గ్రాంఫోన్ రికార్డుల్లా ఉండే ఒక 'పెన్‌స్టాండ్'ను ప్రత్యేకించి వీడ్కోలుకు జ్ఞాపికగా అందించడం బాగా గుర్తుంది. అలాంటి సభల్లో ఆ తీరు మామూలే అయినా మా గురించి మాట్లాడినవారంతా ఆత్మీయంగా నిజమైన ప్రేమతో మాట్లాడిన ప్రశంసావాక్యాలు తృప్తినివ్వక ఎలా ఉంటాయి. ఆఫీసులోనే కాదు సాగర్ అపార్ట్‌మెంట్స్‌లో


GOVERNMENT OF INDIA
ALL INDIA RADIO :: VIJAYAWADA-520 010.

No.Vij.1(3)95-P DATED:8.8.95.

TO WHOMSOEVER IT MAY CONCERN

This is to certify that Shri A. Venkata Rao, Programme Executive, All India Radio, Vijayawada has been transferred in the same capacity to All India Radio, Hyderabad vide New Delhi Order No.4(172)91-SI(B) dated 13.7.95. His transfer is in the interest of service. A list of house-hold articles are being transported by Lorry to Hyderabad is also enclosed here with.

1. Refregirator Allwyn -1
2. Almarahs -2
3. Wooden Almirah -1
4. Book Racks -2
5. Folding Chairs -4
6. Folding Cots -2
7. Double Cot with Plank -1
8. Gunny Bags with Utensils -15
9. Big card Board Boxes with Books & cloths -18
10. Wooden Boxes with Utencils -2
11. Godrej Table & Chair -1
12. Folding Dining Table -1
13. Bed Rolls -7
14. Water Drums -2
15. Tea Pai -1
16. Sewing Machine -1
17. Videocon Tape Recorder -1
18. Philind TV Set in Card Board Box and Antenna -1
19. Wooden Boxes with Crockery -2
20. Table Fans -2
21. Suit Cases -3
& other miscellaneous

(B.GANESH KUMAR)
ADMINISTRATIVE OFFICER
ALL INDIA RADIO
VIJAYAWADA

Room No. 13
SRI SRINIVASA LORRY SUPPLY OFFICE
Lorry Supplier & Contractor
Bhanu Complex, Room No. 13. Lorry Stand, Bhavanipuram.
VIJAYAWADA - 520 012
Date. 8/8/1995
A. P16U 1863
2770-00

మా ఇంటికి ఎదురుగా ఉండే నాగార్జున విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ దొరగారు వారి శ్రీమతి గీతగారు ఇచ్చిన ఆత్మీయ వీడ్కోలూ మరువరానిదే అంతేకాదు! విజయవాడ నుంచి ఆగస్టు మొదటివారంలో హైదరాబాద్‌కు సామాను లారీద్వారా తరలించినప్పుడు దొరగారు సామాన్లపట్టిక అంతా స్వహస్తాలతో రాసి, ప్యాకింగ్‌లో సహకరించిన వైనం ఎలా విస్మరించగలం. మేం హైదరాబాద్ వచ్చిన కొద్ది కాలానికే ఆయన హఠాత్తుగా మరణించారన్న వార్త మాకెంత దిగ్భ్రమను కలిగించిందో! ఆయన రూపం ఇప్పటికే కనులముందు కదలాడుతూ ఉంటుంది.

ఆ ఆగస్టు' 1995 నాడే ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో విజయవాడనుండి బదిలీ అయి వచ్చి కార్యక్రమ నిర్వహణాధికారులుగా జాయిన్ అయ్యాం ఉష, నేనూ. ఆ తరువాత సామాన్లు తరలించడానికి సెలవుపై విజయవాడ వెళ్ళాం. అప్పుడు కూడా ఆగస్టు 6, 1995 ఆదివారంనాడు సాహితీ సంస్థలు - కళా సంస్థలు విజయవాడలో విశిష్ట సాహితీ స్రష్టల అభినందన సభ, వర్ణచిత్రకళా ప్రదర్శన బందర్ రోడ్‌లోని ఠాగూర్ లైబ్రేరీ హాలులో నిర్వహించిన సభకు ప్రారంభకులుగా నన్ను ఆహ్వానించగా వెళ్ళి పాల్గొన్నాను. 'టి.వీ' ప్రముఖ చిత్రకారుడు. ఆయన పెయింటింగ్‌ల ఎగ్జిబిషన్ కూడా జరిగింది. అలా వచ్చేసేముందు కూడా విజయవాడ ఆకాశవాణిలో రిలీవ్ అయిపోయాక కూడా విజయవాడలో ఓ సాహితీ సభలో ప్రారంభకులుగా పాల్గొనే గౌరవం ఇచ్చారు. అందుకు నేను సదా అధమర్ణుడినే! ఆకాశవాణిలో అడ్మినిస్ట్రేషన్‌లోని కృష్ణ వంటివారి సహకారంతో ఆగస్టు 8న సామానుతో విజయవాడ నుంచి హైదరాబాద్ తరలి వచ్చేసాను. విజయవాడ నుంచి హైదరాబాద్ లారీలో ఇద్దరు మనుషులతో రావడానికి అప్పట్లో రెండువేల ఏడువందల డెబ్బై రూపాయలే ఖర్చయిందంటే ఇప్పుడూ




ఆశ్చర్యం వేస్తుంది. ఫోన్, ఆఫీస్‌లో నా సెక్షన్లూ, పబ్లిసిటీ విభాగం అంటూ నెలకొల్పచేసి నాకు అప్పగించిన బాధ్యతలూ, వాటి తాలుకు రికార్డులు సామగ్రి అంతా భద్రంగా అప్పచెప్పవలసిన వారందరికీ అప్పచేప్పేసి విజయవాడలో వృత్తిజీవితం సంతృప్తిగా గడిపి హైదరాబాద్‌కు తరలివచ్చేశాం. ఆగస్టు'1995 నుంచి హైదరాబాద్‌లో కార్యక్రమ నిర్వహణాధికారులుగా ఆకాశవాణిలో మా కొత్త జీవితం మొదలయ్యింది. విజయవాడ అనుభూతులకు హృదయపు గదులు పదిలమయ్యాయి. కొత్త రోజులు మొదలయ్యాయి.

## విశ్వమానవ శ్రేయస్సే కవిత్వ లక్ష్యం కావాలి




ఆంధ్రప్రభ 10.7.95




ఆంధ్రజ్యోతి 10.7.95



హాస్యనాటికోత్సవాలను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న యు.ఎల్. నరసింహం. ...

## భారతీయ సాహిత్యంలో హాస్యం పరిమితం

ఈనాడు 8/7/1995 శనివారం

ఆంధ్రజ్యోతి విజయవాడ 8-7-1995 శనివారం 5వ పేజీ

## హాస్య నాటికోత్సవాలు ప్రారంభం



హాస్య నాటికోత్సవాలను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న శ్రీ యు.ఎల్.నరసింహం

## సాహిత్యంలో హాస్యంపాలు తక్కువ

(ఆంధ్రప్రభ ప్రతినిధి)

విజయవాడ, జూలై 7 : భారతీయ సాహిత్యంలో హాస్యంపాలు తక్కువగా ఉన్నదని ఆకాశవాణి ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్ శ్రీ సుధామ అన్నారు. సుమధుర కళానికేతన్ 22వ వార్షికోత్సవం' సందర్భంగా స్థానిక తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఏర్పాటుచేసిన మూడు రోజుల హాస్య నాటికోత్సవాల ప్రారంభసభలో ఆయన ప్రధానవక్తగా పాల్గొన్నారు. నిరంతరం మానసిక వత్తిడుల మధ్య జీవించే సగటు మానవుడికి ఉల్లాసం కలిగించే వాతావరణం కరవవుతోందని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు.

ప్రస్తుత పరిస్థితులలో నాటక రచయితలు సింహావలోకనం చేసుకోవలసిన అవసరం మీదపడిందని శ్రీ సుధామ గుర్తు చేశారు. మానసికంగా విరామంలేని జీవితాన్ని గడుపుతున్న విజయవాడ నగర ప్రజలకు సుమధుర కళానికేతన్ మానసికోల్లాసాన్ని, వికాసాన్ని కలిగించే హాస్య నాటికల విందు చేయడం అభినందనీయమని ఆయన అన్నారు.

ముఖ్యఅతిథిగా పాల్గొన అకాశవాణి స్టేషన్ డైరెక్టర్ శ్రీ ఆర్.ఎ. పద్మనాభరావు తన ప్రసంగంలో నాటక ప్రదర్శనలకు తగ్గుతున్న ఆదరణను ఒక సన్నివేశాన్ని ఉటంకించి చమత్కారంగా చెప్పారు. అనంతపురంలో కొద్ది కాలం క్రితం నాటకోత్సవాలు నిర్వహిస్తే ఆడిటోరియం జనంతో కిక్కిరిసిందని, 'నాటకాలకు ఇంతటి ఆదరణ ఉన్నదా?' అని తాను ఆశ్చర్యపోతే అక్కడి నిర్వాహకులు "ప్రేక్షకులకు తిరుగు ప్రయాణపు ఛార్జీలు చెల్లిస్తామని ప్రకటిస్తే ఇందరు వచ్చి ఆ ఛార్జీలు వసూలుచేసుకోవడం కోసం చివరి వరకూ కూర్చున్నా"రని సమాధానమిచ్చార్రని ఆయన చెప్పారు.

హాస్య నాటికోత్సవాలను విజయవాడ ఆదాయం పన్ను శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీ ఉపాధ్యాయుల లక్ష్మీనరసింహం జ్యోతి వెలిగించి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన, కళాకారుల్లోని, కళాబృందాలలోని ప్రజ్ఞాపాటవాలకు ప్రోత్సాహమిచ్చే ఈ తరహా పోటీలు అవసరమన్నారు.

సభకు అధ్యక్షత వహించిన 'సుమధుర' అధ్యక్షుడు శ్రీ కౌతా పూర్ణానందం కళానికేతన్ కార్యక్రమాలను 'కొద్దికాలం విరామం తర్వాత పునరుద్ధరిస్తున్నా'మని చెప్పారు.

సుమధుర కళానికేతన్ వార్షికోత్సవాల సందర్భంగా నగరానికి చెందిన నాటక ప్రచురణకర్త శ్రీ ఉప్పలపాటి రాజేంద్రప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. సినీ నటీనటులు కుమారి పూజిత, శ్రీయుతులు గుండు హనుమంతరావు, చిట్టిబాబు, ఉపసలూరు సుబ్బరాయశర్మ, సినీ రచయిత శ్రీ మాడ భూషిది వాకర్‌బాబు, ప్రభృతులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రభ 8/7/1995 శనివారం







# 49

**దాదాపు నాలుగు సంవత్సరాలకు** పైగా విజయవాడ కేంద్రంలో పనిచేసి, స్వస్థలం హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రానికి - డైరెక్టరేట్ వారి పుణ్యమా అని తిరిగి వచ్చి, 1995 ఆగస్టు 1నే చేరడం సంతోషం కలిగించింది. ఒకప్పుడు 'డ్యూటీ ఆఫీసర్'గా చేసిన చోటే - ఇప్పుడు అందుకు పైపదవి - 'ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్'గా చేయడం ఒక థ్రిల్లే! అయితే - అప్పటికీ, ఇప్పటికీ బోలెడు మార్పులు వచ్చేశాయి. విజయవాడలో ఆఫీసుకు దగ్గరగానే ఇల్లు. అక్కడ సిబ్బందితో సాన్నిహిత్యం. ఇక్కడ హైదరాబాద్‌లో అంతా దూరాభారాలు. పైగా పని ఒత్తిడులూ ఎక్కువే. అప్పటికీ - ఆఫీసుకు మూడు నాలుగు కిలోమీటర్ల దూరంలోనే ఏ.సి.గార్డ్స్ అపెక్స్ అపార్ట్ మెంట్‌లో ఇల్లు అద్దెకు తీసుకున్నాం. ఆ అపార్ట్ మెంట్ పక్కనే ఒకప్పుడు నేను ఆకాశవాణిలో చేరిన - వివిధభారతి వాణిజ్యప్రసార విభాగం ఆఫీసు ఉండేది. ఇప్పుడు వివిధ భారతి ఆఫీసూ, రీజనల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఆఫీసూ కూడా అక్కడనుండి మారిపోయాయి. అక్కడేదో పోలీసు వారి కార్యాలయం వచ్చింది.



ఆలిండియా రేడియో పాతభవనం - రాక్‌ల్యాండ్స్

అంతెందుకు! అసలు పాత ఆకాశవాణి భవనం కూడా అసెంబ్లీ ఎదురుది మారిపోయింది. దానిస్థానంలో మూడంతస్తుల భవనం వచ్చింది. ఒకప్పుడు పచ్చని లాన్స్ ముందుండి, ఎత్తయిన మెట్లెక్కి, రాజసం ఉట్టిపడే ద్వారం నుండి, స్టూడియోలోకి అడుగుపెట్టేవాళ్ళం. అలాంటిది ఇప్పుడు - బహుళ అంతస్తుల భవంతిగా మారిపోయింది. 'మున్సిపల్ ఆఫీసు'లాగా అయిపోయింది.




కొత్త రేడియోస్టేషన్ భవనం




రాజధానిలోని 'క్యాపిటల్ స్టేషన్' కనుక - సిబ్బందిగానీ, పనుల ఒత్తిడులుగానీ ఎక్కువే! ఆఫీసులో ఉన్నంతసేపూ హడావుడిగా పనులు చేసుకుని, ఇళ్ళు దూరాభారాల్లోనివి కనుక ఎప్పటికప్పుడు, ఎప్పుడెప్పుడు బయటపడదామా అన్నట్లే ఉద్యోగులెందరో హడావుడి పడుతూంటారు.

ఆగస్టు 1న జాయిన్ అయ్యానే గానీ - నాకొక రూమ్, సెక్షన్, వెంటనే కేటాయించబడలేదు. అప్పుడు ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం స్టేషన్ డైరెక్టర్‌గా ఉన్న శ్రీవి.వి.శాస్త్రి గారు 'రీజనల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్'కు కూడా అదనపు బాధ్యతలు వహిస్తున్నారు. ఆ ఆర్.టి.ఐ ఆఫీసు - ఆదర్శనగర్ దమయంతి ఛాంబర్స్‌లోని మూడోఫ్లోర్‌లో ఉండేది. శాస్త్రిగారి పూనికవల్లనే మా దంపతులం హైదరాబాద్‌కు రాగలిగాం. అందుకు ఆయనకు మేము సదా కృతజ్ఞులం మరి.


भारत सरकार
Government of India
आकाशवाणी
ALL INDIA RADIO
क्षेत्रीय प्रशिक्षण संस्थान (कार्यक्रम)
REGIONAL TRAINING INSTITUTE (PROGRAMMES)

| | |
|---|---|
| प्रमाणित किया जाता है कि | This is to certify that |
| ए. वेंकट राव | A. Venkata Rao |
| ने इस संस्थान द्वारा आयोजित | attended a Course on |
| साक्षात्कार कला सहित उच्चरित शब्द पर कार्यशाला | Spokenword Including Art of Interviewing |
| में प्रशिक्षण प्राप्त किया। यह कार्यक्रम | organised by this institute at |
| क्षेत्रीय प्रशिक्षण संस्थान, आ., हैदराबाद | Regional Trn. Institute, AIR, Hyderabad |
| में 21-8-95 से 25-8-95 तक सम्पन्न हुआ। | from 21st Aug. 95 to 25th Aug. 95 |

हैदराबाद
Hyderabad
25.8.95

निदेशक
Director

స్పోకన్ వర్డ్ ఇన్ క్లూడింగ్ ఆర్ట్ ఆఫ్ సర్టిఫికెట్

ఆర్.టి.ఐ తరపున ఆంధ్రప్రదేశ్, కర్ణాటకకు చెందిన ఆకాశవాణి కేంద్రాల ఉద్యోగులకు ట్రైనింగ్‌లు, వర్క్‌షాప్‌లు జరుగుతూండే నేపథ్యంలో - ఆగస్టులోనే 21 నుండి 25 వరకూ 'స్పోకన్ వర్డ్ ఇన్‌క్లూడింగ్ ఆర్ట్ ఆఫ్ ఇంటర్వ్యూయింగ్' పై వర్క్‌షాప్ ఉండడంతో - మా ఇద్దరినీ కూడా, శాస్త్రిగారు - దానికి ముందు అటెండ్ అవమన్నారు. కోర్స్ డైరెక్టర్‌గా రిటైర్డ్ డైరెక్టర్ జి.రఘురాంగారు వచ్చారు. ఆ సందర్భంగానే 21 మధ్యాహ్నం, 22 ఉదయం కూడా క్లాసులు తీసుకోవడానికి రిటైర్డ్ డైరెక్టర్ జి.సెల్వంగారు కూడా వచ్చారు. ఆయన హయాంలోనే కొంత ఇబ్బంది పడిన విషయం గతంలోనే రాసానుకదా! అలాంటిది, ఆయన తరగతులు అయ్యాక - ప్రత్యేకంగా నన్ను పిలిచి, తాను డైరెక్టర్‌గా ఉండగా నన్ను అర్థం చేసుకోవడంలో ఇతరుల చెప్పుడు మాటలు విని కొంత పొరబడి ప్రవర్తించాననీ, అప్పుడు బాధ కలిగించినందుకు 'సారీ' అని చెబుతూ, "టాలెంట్ మాత్రమే కాక, నిజాయితీగా పనిచేసే నీవైతేనే దీనిని చక్కగా ఉపయోగించుకోగల్గుతావ్" అంటూ - తాము ఆ రెండు రోజులూ ట్రైనీలకు వర్క్‌షాప్‌లో చెప్పడానికి స్వహస్తాలతో తయారు చేసుకొచ్చిన 'నోట్స్'ను నాకు ఇచ్చేసి వెళ్ళడం - ఆశ్చర్యానందాలు కల్గించింది. రిటైరయ్యాకయినా నన్ను అర్థం చేసుకున్నానని, ఔదార్యం ప్రకటించినందుకు మనఃస్ఫూర్తిగా నమస్కరించాను.

నేను చేరిన 1995 ఆగస్టు నెలలోనే ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం నాటక విభాగానికి చెందిన ప్రఖ్యాత డ్రామా ఆర్టిస్ట్, 'రేడియో హీరోయిన్' అనిపించుకున్న, శ్రీమతి శారదా శ్రీనివాసన్‌గారు రిటైరయ్యారు. శారదగారి గురించి ఎంతని రాయగలను? ఎంతరాసినా తక్కువే! ఆవిడవంటి కళాకారిణి ఆవిడే! మొదట్లో విజయవాడ కేంద్రంలోనే ప్రవేశించిన శారదగారు - 1959 మే 1 న హైదరాబాద్ కేంద్రంలో డ్రామా విభాగంలో చేరారు. ఆవిడ కేవలం డ్రామా ఆర్టిస్టేకాదు, మంచి గాయని కూడాను. 'భక్తిరంజని'కీ, 'లలితసంగీతానికీ' గొంతు ఇచ్చారు. ఆకాశవాణిలో వారు పనిచేసిన కాలం అంతా బంగారు కాలమే! కృష్ణశాస్త్రి, బుచ్చిబాబు, గోపీచంద్ వంటి ప్రముఖుల రచనలకు ఆవిడ గళం - పాటల్లో, నాటకాల్లో ప్రాణప్రతిష్ఠ చేసింది. అన్ని సెక్షన్స్ వాళ్ళకీ ఆవిడ ఫేవరెట్ ఆర్టిస్ట్!

పిల్లల కార్యక్రమాలు, స్త్రీల కార్యక్రమాలకు కూడా సహకరించారు. ఏ సెక్షన్స్‌లో నాటకాలయినా - ప్రధాన పాత్రలకు ఆవిడ గళం కోసం ఆరాటపడేవారు. చిన్నా, పెద్దా వేల నాటకాలు వేసి ఉంటారలా! అంతేకాదు - ఎన్నో మంచి మంచి నాటకాలు ప్రొడ్యూస్‌చేశారు. నండూరి విఠల్, కె.చిరంజీవిగార్లతో ఆవిడ నటించిన నాటకాలన్నీ దాదాపు సుప్రసిద్ధాలే! అంతెందుకు? చలంగారి 'పురూరవ' నాటకంలో

ఆవిడ పాత్రధారణ, ఆవిడ నవ్వూ, చలంగారికే ఎంతో నచ్చేశాయి! సంగీత రూపకాలు ఎన్నింటికో ఆవిడ గాత్రధారణ చేశారు. నేనన్నా, ఉష అన్నా ఆవిడకెంతో ఆప్యాయత. మా అబ్బాయి స్నేహిత్ పుట్టినప్పుడు ఉషకు ఆవిడ రాసిన లేఖ భద్రంగా దాచుకున్నాం. నా స్క్రిప్ట్, చేతిరాత అంటే ఆవిడకు ఇష్టం' మాటా మంతీ' స్క్రిప్ట్, ఉదయ తరంగణి స్క్రిప్ట్ నేను రాసినప్పుడు - ఆవిడ ఉత్సాహంగా వాటిని అందుకుని, కార్యక్రమానికి జీవం పోసేవారు. నేను రాసే 'ఉదయతరంగిణి'కి ఆవిడే మొదట యాంకరింగ్ చేసేవారు. 'గుడ్ మార్నింగ్' అంటూ ఉదయమే రేడియోలో ఆవిడ పలకరింపు శ్రోతలను ఝల్లుమనిపించేది. శారదా శ్రీనివాసన్ గారి తర్వాత దానిని అనౌన్సర్ జ్యోత్స్న అందిపుచ్చుకుంది.

స్టాఫ్ ఆర్టిస్టుగా శారదగారు ఆ నెలలో రిటైరవడం - నిజానికి 'ఒక శకం ముగిసినట్లే' అనిపించింది నాకు. అయితే ఆవిడతో కలసి పలు కార్యక్రమాల్లో పాల్గొనడం, రవివర్మ, ఆవిడ, నేను కలసి ఒక నాటకంలో మూడే పాత్రలుగా నటించడం, ఆవిడతో కలసి పి.ఎస్.గోపాలకృష్ణగారు తమ 'తలపుల పందిరి' కార్యక్రమానికి వ్యాఖ్యాతగా చేసే అవకాశం నాకూ కల్పించటం - ఎప్పటికీ మరపురాని మధురస్మృతులే కాగా, మరో గొప్ప ఆనందానుభూతి ఒకటి, ఆ నెలలోనే అందివచ్చింది.


శ్రీ గుడిబండి వెంకటరెడ్డిగారు

హైదరాబాద్‌లో 'ఆరాధన' అనే ఒక సాహితీ సాంస్కృతిక సంస్థ 1995 ఆగస్టులోనే ఏర్పడుతూ, తన శుభారంభ సంరంభ కార్యక్రమంగా ఆకాశవాణి, టివీ రంగాలకు చెందిన కళాకారులకు నీరాజనంగా అవార్డులిచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. శ్రీ గుడిబండి వెంకటరెడ్డిగారు దాని స్థాపక అధ్యక్షులు - ఈ నాటికీ ఆ సంస్థ ఏటేటా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తూ, జంటనగరాల సాహితీ సాంస్కృతిక సంస్థల్లో ఒక మేటి సంస్థగా అలరారుతోంది. 'ఆరాధన' సంస్థ ప్రారంభోత్సవం నాడే - సాంస్కృతిక రంగంనుండి వంశీరామరాజుగారిని, దూరదర్శన్ నుండి దర్శకులు శ్రీ దేవదాస్ కనకాల, క్యారెక్టర్ యాక్టర్ శ్రీ సుబ్బరాయశర్మ, ఛాయాగ్రహకుడు మీర్, నిర్మాతగా మల్లాది శైలజా సుమన్, నటుడు అశోక్‌కుమార్‌లకూ, ఆకాశవాణి నుండి ఆ నెలలో రిటైరవుతున్న శ్రీమతి శారదా శ్రీనివాసన్ గారితో బాటుగా ఆకాశవాణి నుంచి నన్నూ సన్మానానికి ఎంపిక చేసి, సత్కరించడం గొప్ప గౌరవంగానూ, ఆనందంగానూ భావించాను. శారదగారితోబాటు సన్మానం అందుకోవడం నిజంగా ఎంతో సంతోషాన్నిచ్చింది. 1995 ఆగస్టు 14 సోమవారం సాయంత్రం రవీంద్ర భారతిలో ఆరాధన సంస్థ ప్రారంభోత్సవం నాడే - ఆకాశవాణి నుంచి అలా శారదగారితో బాటు నేనూ ఆ సత్కారాన్ని అందుకున్నాను.







శ్రీమతి శారదాశ్రీనివాసన్‌గారు నేను కౌముదిలో రేడియోజ్ఞాపకాలు మొదలు పెట్టిన కొన్నాళ్ళకే - ఆవిడ అద్భుతమైన స్మృతుల సమహారంగా 'నా రేడియో అనుభవాలు - జ్ఞాపకాలు' అనే పుస్తకం రాసి, 2011 లో విడుదల చేశారు. వారి పుస్తకంలో నా గురించి కూడా రాస్తూ, ప్రత్యేకించి ఓ పుటలో తలచుకోవడం - నా వృత్తి జీవితానికే ఒక గొప్ప తృప్తి! బోలెడు సంతోషమున్నూ!

సరే అలా హైదరాబాద్‌కు తిరిగి రావడంతోనే ఆకాశవాణి కార్యక్రమ నిర్వహణాధికారిగా, శారదగారితో బాటు 'ఆరాధన' సన్మానితుడైన నాకు - అప్పటి డైరెక్టర్ శ్రీ వి.వి.శాస్త్రిగారు ఏం తర్జన భర్జనలు పడ్డారో తెలియదుగానీ, హైదరాబాద్ కేంద్రం తెలుగు

విభాగానికే అధిపతిని చేశారు. క్యాపిటల్ స్టేషన్‌లో తెలుగు విభాగం అంటే – అలాంటి ఇలాంటి బాధ్యత కాదు. పెద్ద బరువే! తెలుగు విభాగం అంటే కేవలం 'సాహిత్యం' మాత్రమే కాదు మరి! 'డెవలప్ మెంట్ ప్రోగ్రామ్స్', 'ఎలక్షన్ బ్రాడ్‌కాస్ట్', వర్తమాన రాజకీయ, సాంఘిక, ఆర్థికాంశాలపై చర్చలు వంటివన్నీ అందులో భాగాలే! సాహిత్య కార్యక్రమాలు సరేసరి!


శ్రీ వి.వి.శాస్త్రిగారు

నేను వచ్చేసరికి ఆ విభాగాన్ని శ్రీ చలపతిరావుగారు ఎంతో సమర్థవంతంగా నిర్వహిస్తూ ఉన్నారు. చలపతిరావుగారి వంటి నిజాయితీగల వర్క్ మైండెడ్ అధికారులు, ఆకాశవాణి చేసుకున్న అదృష్టమే అనాలి. కార్యక్రమాల గురించి మంచి ప్లానింగ్, ఎక్జిక్యూషన్ రెండూ కలవారు. ఆయన చాలా సీనియర్. అసిస్టెంట్ స్టేషన్ డైరెక్టర్‌గా అప్పటికి ఆయనకింకా ప్రమోషన్ రాలేదు. కానీ చలపతిరావుగారు చూస్తున్న ఆ విభాగాన్ని నా భుజస్కందాల మీద పెట్టి డైరెక్టర్ శాస్త్రిగారు చలపతిరావుగారికి వేరే సెక్షన్స్ బాధ్యతలు అప్పచెప్పారు. "తెలుగు విభాగం టాకర్స్ స్క్రిప్ట్స్ చూడడం, ఏవయినా


చలపతిరావుగారు

సరిచేయడం కష్టమేనండి బాబూ! ఈ కవులూ రచయితలూ, యూనివర్సిటీ ప్రొఫెసర్లూ వాళ్ళ స్క్రిప్ట్‌లో ఏమైనా మార్పులు చెబితే – "మీకేం తెలుసు? మీరేమైనా రచయితలా" అని నాబోటివాడిని అనేస్తారు. మీకయితే ఆ ఇబ్బంది లేదుకదా!" అని చలపతిరావుగారు నవ్వుతూ, తెలుగువిభాగం బాధ్యతలు నాకప్పచెప్పేసారు. అయితే – ఎప్పుడు ఏ అవసరమైనా ఎంతో ఆదరంతో ఆదుకునేవారు, మంచి మంచి సలహాలనిస్తూండేవారు. రావూరి భరద్వాజగారూ, మధుసూదనరావ్ గారూ, చలపతిరావుగారూ తమ హయాంలో చేసిన మంచి కార్యక్రమాలను అలానే ఉంచుతూ, కొత్త కొత్త రికార్డింగులు చేయాలంటే, 'టేప్స్' చాలా అవసరం. సాధారణంగా అప్పట్లో పాత టేప్స్‌ని చెరిపి, అందులో కొత్తవి రికార్డు చేయడం జరుగుతూండేది. అప్పటికింకా కంప్యూటర్లూ, డిజిటల్ రికార్డింగులూ, సౌండ్ ఫోర్జ్ ఎడిటింగ్‌లూ ఏవీ మొదలు కాలేదు ఆకాశవాణిలో. అంచేత ఇండెంట్ పెట్టి కొత్త టేప్స్ తెప్పించుకోవడం – డైరెక్టరేట్ నుండి ఏటికేడుగా జరుగుతూనే ఉన్నా, వచ్చిన కొత్త టేప్స్ నుండి సెక్షన్‌కు తగిన సంఖ్యలో 'టేప్స్' అలాట్ చేయించుకోవడం, అంత ఈజీయేం కాదు. లైబ్రేరీలో – నేను తెలుగు విభాగం తీసుకునేసరికి ఓ రెండు రాక్స్ మేరకు ఉండే సెక్షన్ టేప్స్ సంఖ్యను, నా హయాంలో మంచి కార్యక్రమలు అలాగే ప్రిజర్వ్ చేస్తూ, దాదాపు రెట్టింపు చేయగలిగాను. తెలుగుతో బాటు సంస్కృత విభాగాన్నీ, ఓ రోజు ఉదయతరంగిణినీ కూడా నాకు కేటాయించారు.

నాకు ప్రమోషన్ రాకముందు నాతోబాటు డ్యూటీరూంలో సహ డ్యూటీ ఆఫీసర్‌గా పనిచేసిన ముళ్లపూడి భాస్కర్‌ను నేను చూస్తున్న తెలుగువిభాగానికి – ప్రొడక్షన్ వర్క్ కోసం సహాయకునిగా కేటాయించారు. సెక్షన్ సెక్రటరీగా శ్రీమతి పుష్పవేణి పనిచేశారు. పుష్పవేణి చక్కగా పనిచేసేవారు. తనకు టైప్ రైటర్ మీద పని చేయడమే ఎక్కువ అలవాటు. అప్పుడప్పుడే సెక్షన్ వర్క్ కోసం కేటాయించబడుతున్న కంప్యూటర్ వర్క్ ఆవిడకు అప్పటికింకా రాదు. అంచేత తెలుగు విభాగం కాంట్రాక్ట్‌లూ అవీ, టైప్ చేసిపంపేవారు. ఆఫీసుకు రావడం అదీ కొంచెం ఆలస్యమైనా,


శ్రీమతి పుష్పవేణి


ముళ్ళపూడి భాస్కర్

పనివిషయంలో ఆమె శ్రద్ధగా, సమయానికి అందేలా చేసేవారు. తెలుగువిభాగంతో బాటు ఆమెకు అదనపు సెక్షన్లు ఉన్నా, షెడ్యూల్స్, కాంట్రాక్ట్‌లు పంపడానికి నేను ముందస్తుగానే సిద్ధం చేయడంతో, సమయానికే పంపేవారు.

ముళ్ళపూడి భాస్కర్ తెలివైనవాడు. సాహిత్యం కంటే అతనికి రాజకీయాలు బోలెడు ఆసక్తి. తెలుగుదేశం పార్టీలోని ఎర్రంనాయుడు బాగా తెలుసుననుకుంటాను. సాహిత్యేతర అంశాల రికార్డింగులయితే సరేగానీ, లేకపోతే నేనే చూసుకుంటాననులే ఎలాగూ అనే ధీమాతో, 'లైట్' తీసుకునేవాడు ఒక్కోసారి. సెక్షన్

వర్క్‌తో పాటు రికార్డింగు వర్క్‌లూ చేసుకోక తప్పనప్పుడు, పనిభారం అధికంగా అనిపించేది. హైదరాబాద్ పెద్ద స్టేషన్ కావడంతో, రికార్డింగులు ఎక్కువ కావడం వల్ల, 'స్టూడియో బుక్ చేస్తూ, కంట్రోల్ రూంలోని రిజిస్టర్లో నమోదు చేసినా, రాసుకున్న టైంకు - ఆ స్టూడియో రికార్డింగుకు రెడీగా దొరుకుతుందన్న నమ్మకం ఉండేది కాదు. 'టాకర్' రికార్డింగుకు వెయిట్ చేయక తప్పదు సరేకానీ, ప్రముఖులను పిలిచినప్పుడు వారిని అలా వెయిట్ చేయించలేం కదా ఎక్కువసేపు! అందునా తెలుగువిభాగంకు వచ్చే పెద్దలందరూ హైదరాబాద్‌లో నాకు తెలిసినవారే అయినా - వారిలో గురుస్థానీయులే ఎక్కువ. చనువుతో ఓ మాట అనేయగలవారే! అంచేత వారికి అనుకూలంగా రికార్డింగులు పెట్టి, శని, ఆదివారాలు ఆఫీసుకు సెలవయినా, ఆకాశవాణి స్టూడియోకి వెళ్ళి రికార్డింగులు చేసేవాడిని. "అలా అలవాటు చేయకుండా ఉండాల్సింది. వాళ్ళకేం హాయిగానే ఉంటుంది. మీకే కదా ఇబ్బంది! సెలవు రోజుల్లో వెళ్ళి పనిచేసే అదనపు బరువును మీకు మీరే విధించుకుని నెత్తినెత్తుకోవడం ఎందుకు" అంటారు గానీ - శ్రోతలకు మంచి కార్యక్రమాలు అందించాలనే తపన, ప్రముఖులను ఈ హైదరాబాద్ కేంద్రంలో పిలిచి రికార్డు చేయాలంటే ఇక్కడి దూరాభారాలూ, వారి పనిఒత్తిడులు కూడా దృష్టిలో పెట్టుకుని, రికార్డింగు వేళలను నాకు 'అననుకూలం' అయినా, అవలంబించేవాడిని. అంచేత ఆకాశవాణి ఇచ్చే పారితోషికాలను మటుకే దృష్టిలో ఉంచుకోక, నా మీద కూడా ఆదరంతో కూడా అంగీకరించి, రికార్డింగుకు వచ్చి సహకరించిన మహనీయులైన పెద్దలెందరో ఉన్నారు. వారికి సదా నే కృతజ్ఞుడినే!



# 50

**1995 నాటికి** సాంకేతికంగా ఆకాశవాణి పురోగమన పథంలోకి బాగా అడుగుపెట్టింది. నేను హైదరాబాద్ ఆకాశవాణికి విజయవాడ నుంచి తిరిగి వచ్చిన ఆగస్టు'95లోనే మద్రాసులో మల్టీట్రాక్ రికార్డింగ్ స్టూడియోస్ మొదలయ్యాయి. ఆకాశవాణి హైదరాబాద్ కొత్త టైప్‌ఫోర్ కార్యక్రమాల రూపకల్పన, ప్రసారాలు మొదలెట్టింది. అంతకు ముందు కన్నా స్టూడియోలు పెరిగాయి. మ్యూజిక్.1, మ్యూజిక్.2, డ్రామా, యువవాణి, టాక్స్.1 టాక్స్.2 స్టూడియోలు, మూడు ప్లేబాక్ స్టూడియోలు (అనౌన్సర్ బూత్స్), రీడోవర్ రూమ్, ఆడిషన్ రూమ్, నాలుగు డబ్బింగ్ రూములు, మెయిన్ స్టేషన్ కే కాక సి.బి.ఎస్ టేప్స్ లైబ్రెరీ, డ్యూటీ రూం, కంట్రోల్ రూం సర్వీస్ రూం, ఓ.బి ఎక్విప్‌మెంట్ రూమ్ ఇలా అనేక సౌకర్యాలు సమకూరాయి. 1997 నాటికి 2X100 kw మీడియం వేవ్ ట్రాన్సమీటర్ల ప్రసార శక్తి కూడా ఒనగూడింది. రికార్డింగ్ వాడడంలో పురోగమనం కనిపించింది. ఇంకా అప్పటికి కంప్యూటర్ల మీద రికార్డింగులు మాత్రం హైదరాబాద్ ఆకాశవాణిలో పూర్తిగా మొదలు కాలేదు. ట్రాన్స్‌మిషన్, రికార్డింగులు, డబ్బింగులు కొత్త స్టూడియోల్లోనే జరగడం సాగింది.




మార్చి 1990లో ఆకాశవాణి ఢిల్లీ కేంద్రంలో మొదలైన దక్షిణ తూర్పు ఆసియా శ్రోతలకు ఉద్దేశించిన విదేశీ తెలుగు ప్రసారాలు 1995 అక్టోబర్ రెండు నుండి హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రం నుండే ప్రసారం చేయడం మొదలైంది. అంతకుముందు అందుకోసం ఢిల్లీకి తెలుగు కార్యక్రమాలు టేప్ చేసి రూపొందించుతూ పంపడం జరిగేది. హైదరాబాద్ నుండే ఆ ప్రసారాలు ప్రతిరోజూ సాయంకాలం 5.45 నుండి 6.15 వరకూ 2.10.1995 నుండి ట్రాన్స్‌మిట్ అవడం మొదలయ్యింది. 21,82 మీటర్లు 13750 కిలో హెడ్జ్‌పై, 19.02 మీటర్లు, 15770కిలో హెడ్జ్‌పై అప్పట్లో ప్రసారమయ్యే ఆ విదేశీ కార్యక్రమాల్లో తెలుగు వార్తలు కూడా

అయిదునిముషాలపాటు సాయంకాలం 6.10కి ప్రత్యేకంగా ప్రసారమయ్యేవి. తెలుగు విభాగంతో బాటు ఎ.ఎస్.డి (ఎక్సటర్నల్ సర్వీసెస్ డివిజన్) అనబడే ఆ దక్షిణాసియా శ్రోతలకు ఉద్దేశించిన తెలుగు ప్రసార విభాగాన్ని కూడా కార్యక్రమ నిర్వహణాధికారిగా కొన్నాళ్ళు నేనూ చూసాను. హైదరాబాద్ కేంద్రం అనౌన్సర్లలోనూ ఒకరు ఆ ప్రసారాలకూ అనౌన్స్‌మెంట్స్ ఇస్తూండేవారు. తెలుగువార్తలు వార్తావిభాగం చూసినా వార్తావాఖ్య వంటి కార్యక్రమానికి విదేశీప్రసారాలన్నింటి నిమిత్తం ఢిల్లీనుండీ వచ్చే అంశాన్ని తెలుగులో అనువదించి ప్రసారం చేయడానికి పాత్రికేయులను కాంట్రాక్ట్ పద్ధతిపై బుక్ చేయవలసి వచ్చేది.


పేజర్

సెల్‌ఫోన్లు అప్పటికి విస్తృతం కాలేదు. 'పేజర్లు' మాత్రమే ఉండేవి. 1995 జనవరి 15 నుండి ఆకాశవాణి రేడియో పేజింగ్ సర్విస్‌ను మొదలుపెట్టింది. అది వన్‌వే కమ్యూనికేషనే. ఇ.సి.ఐ.ఎల్, పంజాబ్ వైర్‌లెస్ ఏజెన్సీలు హైదరాబాద్ కేంద్రం ఎల్.పి.టిలో ఎఫ్.ఎం ట్రాన్స్‌మీటర్ ద్వారా ఆకాశవాణి కల్పించిన ఈ ప్రైవేట్ పేజింగ్ సర్విస్ వాడుకునేవి. లోకల్ కస్టమర్స్ చేసిన పేజింగ్ కాల్స్ ఆకాశవాణి ప్రసారం చేసే కార్యక్రమాలకు అవరోధం లేకుండానే రేడియో పేజింగ్ ద్వారా వెళ్ళేవి. ఏడాదికి నలభై లక్షలదాకా ఆ రెండు ఏజెన్సీలు రేడియో పేజింగ్‌ను వినియోగించుకుని పేజర్ సర్వీసింగ్‌తో లాభపడ్డాయి ఆ రోజుల్లో.

ఇదంతా సాంకేతిక పురోగమనమే. అది రేడియో కార్యక్రమాలకు కూడా ఫోన్‌ఇన్ ప్రోగ్రాంలుగా, రేడియో బ్రిడ్జి ప్రోగ్రాములుగా అప్పటికప్పుడు ప్రత్యక్ష ప్రసారం చేసుకునే సాంకేతికాభివృద్ధిని అందించింది. సాటిలైట్ ద్వారా ఆకాశవాణి కేంద్రాలమధ్య అనుసంధానం చేసి ఆయా కేంద్రాలలోనే కార్యక్రమంలో పాల్గొనేవారు కూర్చుని చర్చలో పాల్గొంటూండగా అందరినీ నేరుగా శ్రోతలు వినగలగడం అనే 'రేడియో బ్రిడ్జి' అనుసంధాన కార్యకరమం శ్రోతలకు అప్పట్లో ఒక గొప్ప ఆసక్తిదాయక విషయమే మరి!

అలాగే ఎఫ్. ఎం. రేడియో ప్రసారాల సాంకేతిక నైపుణ్యం వల్ల 'రేడియో పేజింగ్'కు అవకాశం ఏర్పడింది. ఎఫ్.ఎం ట్రాన్స్‌మీటర్లు ఉన్న రేడియో కేంద్రాలలో వాటికి నిర్దేశించిన ఫ్రీక్వెన్సీ బ్యాండ్‌లలో కొంత ఖాళీ జాగా ఉండేది. అందువల్ల ఆ సబ్ క్యారియర్లపై 'డాటా' రూపాన అదనపు సిగ్నల్స్ చొప్పించే అవకాశం ఉండేది. అందువల్ల స్టీరియోఫోనిక్, మోనోఫోనిక్‌గా ప్రసారమవుతున్న కార్యక్రమాలకు అవరోధం కలగకుండానే ప్రజోపయోగమైన సమాచారాన్ని విద్యాసంబంధ సమాచారాన్ని ప్రసారం చేసుకునే వీలుండేది. అలా అదనపు డేటా సర్విస్ వినియోగం ఎఫ్.ఎం బ్రాడ్‌కాస్ట్ ఛానల్‌లో చొప్పించే ఆర్.డి.ఎస్ నే రేడియో పేజింగ్ అనేవారు. అత్యవసర సంకేతాలు, సందేశాలు, పిలుపులు, సమాచారం విద్యా, వైద్య, వ్యాపార, వాణిజ్య రంగాలకు సంబంధించినవారు పంపుకుని వినియోగించుకోవడానికి రేడియో పేజింగ్ సాయపడేది. ఈ పేజింగ్ సర్వీసులు వినియోగించుకునేందుకు వీలుగా ఎఫ్.ఎం.ట్రాన్స్‌మీటర్లున్న అప్పటి 17 కేంద్రాలలో ఆకాశవాణి లైసెన్సులిచ్చి ఆపరేటర్లని నియమించింది. ఆంధ్రప్రదేశ్‌లో ఇ.సి.ఐ.ఎల్, పంజాబ్ వైర్‌లెస్ సంస్థలు ఈ ఏజెన్సీని పొందాయి.

1995వ సంవత్సరమే ప్రైవేట్ టీ.వీ ఛానెళ్ళ హవా మొదలయ్యింది. 1995 లో జెమిని టీ.వి ప్రసారాలు మొదలయ్యాయి. 1995 ఆగస్టు 27న 'ఈటీవి' ప్రవేశించడంతో దృశ్యమాధ్యమం ఆకర్షణ బలీయం కాసాగింది.

ఆకాశవాణి కేవలం శ్రవ్యమాధ్యమమే! ఏమయినా కొత్తదనం పట్ల జనం ఆకర్షితులవడం సహజం. అప్పటికే దూరదర్శన్ ప్రసారాలు సాగుతున్నా ఆకాశవాణి, దూరదర్శన్‌లు ప్రభుత్వ ఆధీనలోని సంస్థలనీ అనివార్యంగా అవి అధికారంలో ఉన్న ప్రభుత్వం నెరపుతున్న పార్టీకే అనుకూలంగా వ్యవహరిస్తాయనే అపప్రథ రానే

వచ్చింది. ప్రైవేట్ సంస్థలు ఆకాశవాణి దూరదర్శన్‌లను ప్రభుత్వ బాకా సంస్థలుగా ప్రచారం చేయడం ద్వారా తమ అస్తిత్వాన్ని పెంచుకునే యత్నం సహజంగానే సాగిస్తాయి. అదే జరుగుతూండేది.

ఆకాశవాణి, దూరదర్శన్‌లను ప్రభుత్వ అజమాయిషీ నుండి విముక్తం చేసి, వాటికి ఒక స్వతంత్ర ప్రతిపత్తి కలిగించాలన్న ఆలోచన అప్పుడే ఊపందుకుంది. ప్రసారభారతి కార్పోరేషన్ అన్న ప్రతిపాదన ముందుకు వచ్చింది. 1967లో వివిధభారతి వాణిజ్యప్రసారాలు ప్రారంభించి, 1982లో నేషనల్ నెట్‌వర్క్‌లోనూ 1985 నుండి ప్రైమరీ ఛానల్స్ మీద వాణిజ్యప్రకటనలను ప్రసారం చేయడం మొదలుపెట్టిన ఆకాశవాణి, వాణిజ్య ప్రకటనలద్వారా ఆర్జించిన సొమ్ముతో స్వయం సమృద్ధం కావాలన్న భావన పెరిగింది. 'బహుజన హితాయ - బహుజనసుఖాయ' అంటూ జనహితమూ ప్రజలందరకూ సమాచారం, విద్య, వినోదం లక్ష్యంగా కళలకు, కళాకారులకు పరిపోషకంగా ఉంటూ వచ్చిన రేడియోలోనూ వాణిజ్యం ద్వారా 'ఆర్థిక సముపార్జన' అదనపు ప్రధాన లక్ష్యంగా చోటుచేసుకోవడం మొదలయ్యింది. అంతవరకూ లేని ఒక కొత్త విధాయక నిర్వహణం తోడవసాగింది. ఆకాశవాణిలో కార్యక్రమ సంబంధితులయిన వారందరూ కూడా 'మార్కెట్ ఫ్రెండ్లీ' కార్యక్రమాలను రూపొందించాలనే ధోరణులు ఒకరకంగా కొంత ఒత్తిడి కలిగించడం మొదలైందని ఒప్పుకోవాల్సిందే కార్యక్రమాలకు ప్రాయోజితులను అన్వేషించమని అధికారులు చెప్పక తప్పని స్థితి క్రమేపీ రాసాగింది. అయితే 1997 నవంబర్ 23న ప్రసారభారతి కార్పొరేషన్ ఏర్పాటై 1998 జూలై 31న పార్లమెంట్ ప్రసారభారతి బిల్లు ఆమోదించడంతో 29 ఆగస్టు 1998న ప్రసారభారతి వ్యవస్థ రూపుదిద్దుకుంది. ప్రసారభారతి ఇండియన్ బ్రాడ్ కాస్టింగ్ సర్వీస్‌లోకి ఆకాశవాణి, దూరదర్శన్‌లు పరివర్తితమయ్యాయి.




అయితే రాత్రికి రాత్రే కొట్టవచ్చినట్లుగా ఏ మార్పులూ చోటుచేసుకోవన్నది, అందునా వ్యవస్థీకృతమైన సంస్థల్లో అంగీకరించాల్సిన విషయం. నిజానికి ప్రైవేట్ రేడియో, టీవీ ఛానెల్స్ విపరీతంగా పెరుగుతున్నప్పుడు ప్రభుత్వం తనకంటూ ఛానెల్స్ కలిగివుంటే తప్పేమిటనీ ప్రసారభారతి వ్యవస్థ వద్దనీ, తమను సెంట్రల్ గవర్నమెంట్ గానే 'రోల్‌బ్యాక్' చేయమన్న ఆందోళనలూ జరిగాయి. ఉద్యోగంలో పదోన్నతీ, వేతన సంవిధానం, కొత్త నియామకాలూ ఇవన్నింటిలో బోలెడు అసంతృప్తులు ఆకాశవాణి ఉద్యోగుల్లోనూ పెరుగుతూ వచ్చాయి. ఉద్యోగుల సంక్షేమం మందగించిందని భావన పెరిగింది. ప్రతిభాపాటవాలు, సృజన అన్నవాటికి గుర్తింపు లేని ధోరణులు పొడచూపిన బాధ కొందరిలో కలగజొచ్చింది. 'పనిచేసే సంస్కృతి' అనేదే పెద్ద మార్పుకు గురికాసాగింది. అయినా వీటన్నింటిని తట్టుకుంటూ, అధిగమిస్తూ రేడియో కార్యక్రమాల రూపకల్పనలో ఉత్సాహంగా, సృజనాత్మకంగా ముందుకు దూసుకుపోతే తప్ప 'ఉద్యోగంలో తృప్తి' పొందడం ఎలా? జీతం రాళ్ళకోసమే పనిచేసే సంస్థగా 'ఆకాశవాణి'ని తీసుకోలేం కదా! ప్రతికూల పరిస్థితులు తొంగి చూస్తున్నా, మార్పులెన్నో సరికొత్తగా పొడుచుకు వస్తున్నా, సమష్టిగా సృజనాత్మకంగా శ్రోతలను అలరించే రేడియో కార్యక్రమాల రూపకల్పనకై ఆసక్తిగలవారంతా ఉత్సాహంగా పనిచేయడం మానలేదు. రేడియోను శ్రోతలు విడవకుండా, ఆకాశవాణి పట్ల తమ అభిరుచిని అలాగే నిలుపుకునేందుకు, కొనసాగించేందుకు కార్యక్రమాలు రూపొందించడం, రేడియో కార్యక్రమాల విశిష్టత ప్రైవేట్ రేడియోల్లో జరిగే ప్రసారాల్లో ఉండదనీ,

ఆకాశవాణి ప్రజోపయోగ కార్యక్రమాల నెలవనీ నిరూపించుకునేందుకు మరింతగా శ్రద్ధగా శ్రమించడం అనివార్యమయ్యింది. మనుషులు తక్కువవుతూ పనిభారాలు పెరగడం, పదోన్నతి లేకపోవడం సరికదా పనిలో సహాయకులూ - కొత్త నియామకాలు లేక కరువవుతూ, ఒకరే అన్ని పనులు చేసుకోవలసి రావడమూ జరుగుతూనే ఉంటుంది. వేగంగా మారుతున్న సమాజ అవసరాలకు, శ్రోతల అభిరుచులకు అనుగుణంగా రేడియో కార్యక్రమాల్లోనూ మార్పులు చోటుచేసుకున్నాయి. వినోదానికీ, శ్రోతలు నేరుగా ఫోన్ ద్వారా మాట్లాడటం వంటి కార్యక్రమాలకీ ప్రాధాన్యం ఇవ్వడం జరిగింది. తక్షణ అవసరాలకు అనుగుణంగానూ జరుగుతున్న ఘటనలకు సద్యః స్పందనలకు అనుకూలంగానూ 'ఫోన్ఇన్' వంటి కార్యక్రమాల సంఖ్య పెరిగింది. హైస్పీడ్ ఇన్ఫర్మేషన్ ఇన్‌పుట్ అవసరమైంది. ఇంటర్నెట్ వినియోగం కూడా క్రమేపీ అందిపుచ్చుకుంది.

నిజానికి ఒక రకమైన సంధి అవస్థ అది. మార్పును అందిపుచ్చుకుంటూ, అంతవరకూ ఉన్న విలువలను పరిరక్షిస్తూ, సాంకేతికతనూ, సత్సంప్రదాయాలనూ అనుసంధానం చేస్తూ, ఆకాశవాణికి అలవాటుపడిన శ్రోతలను నిరాశపరచకుండా నిలబెట్టుకుంటూ, కొత్తతరాన్ని ఆకర్షించే ప్రయత్నాలు చేయడం అంత సులభసాధ్యమైన విషయంకాదు. అలవాటులేని పనులూ, ప్రతికూల పరిస్థితులూ, మందగిస్తున్న పని సంస్కృతీ వీటన్నింటి మధ్యా కార్యక్రమ నిర్వాహణాధికారిగా రాష్ట్రరాజధాని కేంద్రమయిన హైదరాబాద్ ఆకాశవాణిలో పనిచేయడం గొప్ప సవాలుగానే ఉండింది. తెలుగు విభాగంతో బాటు, సంస్కృత విభాగం, నవలాస్రవంతి, హాస్యకార్యక్రమాలు, వయోధికుల కార్యక్రమం, బైబిల్ సూక్తులు ఇలా ఒక సందర్భంలో దాదాపు ఎనిమిది విభాగాలను కార్యక్రమ నిర్వహణాధికారిగా చూడవలసివచ్చింది.









# 51



నాలుగేళ్ళు విజయవాడ ఆకాశవాణిలో కార్యక్రమ నిర్వహణాధికారిగా చేసి, 1995 ఆగస్టు 1 న తిరిగి హైద్రాబాద్ లో చేరేనాటికి, హైదరాబాద్ లో కొత్త కొత్త 'పరిణామాలు' ఎన్నో చోటు చేసుకున్నాయి. కాలం వెంట మార్పులు సహజమే కదా! రాజకీయంగానూ నేను చేరిన నెలలోనే - రాష్ట్రంలో సంచలనాత్మక పరిణామం జరిగింది. 23 ఆగస్టు 1995 న - తెలుగుదేశం పార్టీలో ఫైనాన్స్ అండ్ రెవిన్యూ మంత్రిగా వున్న నారా చంద్రబాబునాయుడు గారు, పార్టీ అధినేత, ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావుపై తిరుగుబాటు జండా ఎగరేసి, ఆయన స్థానంలో తానే ముఖ్యమంత్రిగా 1995 సెప్టెంబర్ ఒకటిన రాష్ట్ర నాయకత్వ పగ్గాలు చేపట్టారు. లక్ష్మీపార్వతిని ఎన్.టి.ఆర్ వివాహమాడాక పార్టీలోనూ, ప్రభుత్వ వ్యవహారాల్లోనూ ఆవిడ జోక్యమే - తెలుగుదేశం పార్టీలో ముసలానికి కారణమైందని చెప్పుకుంటారు. తమదే అసలైన 'తెలుగుదేశం' పార్టీగా చంద్రబాబు బలాగాన్ని కూర్చుకోగలిగారు. లక్ష్మీపార్వతి టీ.డీ.పీ (ఎన్) అని సింహం గుర్తుతో తదనంతర కాలంలో పార్టీని సాగించినా, అది పరాజయం పాలయింది.

జరిగిన పరిణామాలతో ఖిన్నుడయిన ఎన్.టి.రామారావు 1996 జనవరి 18 న మరణించారు. తెలుగు చలనచిత్ర సీమనేలిన మహానటుడిగా, అనంతరం తెలుగువారి ఆత్మగౌరవాన్ని నిలుపుతూ తొమ్మిది నెలల కాలంలోనే 'తెలుగుదేశం' పార్టీని - రాష్ట్రంలో కాంగ్రెస్ ని ఎదుర్కొని అధికారపగ్గాలు చేజిక్కించుకునే దిశగా ఉద్యమించి, ఆ పార్టీస్థాపకునిగా, ముఖ్యమంత్రిగా, ఖ్యాతినందుకున్న

ఎన్.టి.ఆర్ అంతిమయాత్రను ఆకాశవాణి హైదరాబాద్ ప్రత్యక్ష ప్రసారం చేసింది. అంతిమయాత్ర సాగే ప్రధాన కూడళ్ళలో - ప్రత్యక్షవ్యాఖ్యానానికై ఇద్దరేసి వ్యాఖ్యాతలతో నిర్వాహకబృందాలు పనిచేసాయి. దహనసంస్కారాలు జరిగే ఘాట్ వద్ద కూడా వ్యాఖ్యానం ప్రసారం చేయడానికి ఏర్పాట్లు చేశాం. కార్యక్రమ నిర్వహణాధికారిగా ఆ ప్రత్యక్ష వ్యాఖ్యాన ఏర్పాట్లలో బాధ్యత వహించడం జ్ఞాపకమే! గోవాడ సత్యారావు, జీడిగుంట రామచంద్రమూర్తి, వేదగిరి రాంబాబు మొదలైనవారు అంతిమయాత్ర ప్రత్యక్ష వ్యాఖ్యానం చేసినవారిలో




ఉన్నట్లు గుర్తు. ఏమయినా తెలుగు చలనచిత్ర రంగంలోనే కాదు, రాష్ట్ర రాజకీయ రంగంలోనూ 'ఎన్.టి.ఆర్' మృతితో - 'ఒక శకం' ముగిసినట్లయింది. 1983 లో ట్రాన్స్మిషన్ ఎక్జిక్యూటివ్ గా - ముఖ్యమంత్రిగా రామారావు ప్రమాణస్వీకారోత్సవాన్ని ఆకాశవాణికి రికార్డు చేయడంలోనూ, 1996 లో ఆయన అంతిమయాత్రను కార్యక్రమ నిర్వహణాధికారిగా నిర్వహింపచేయడంలోనూ నా పాత్ర ఉండడం - యాదృచ్ఛికమే అయినా, మరపురాని విషయం!




ఆంధ్రసాహిత్యరంగంలో విమర్శకులుగా, అధ్యాపకులుగా, వక్తగా, పరిశోధకులుగా, సాహితీసంస్థ నిర్వాహకులుగా, రచయితగా, సౌజన్యమూర్తిగా ప్రసిద్ధి పొందినవారూ, నాకు ఆంధ్ర సారస్వత పరిషత్ ప్రాచ్య కళాశాలలోనూ, ఉస్మానియా విశ్వవిద్యాలయంలోనూ బోధన చేసిన గురువులే కాక, నేను ఆకాశవాణికి ట్రాన్స్మిషన్ ఎక్జిక్యూటివ్ పోస్ట్ ఇంటర్వ్యూకి వెళ్ళినప్పుడు, అందులో 'సబ్జెక్ట్ ఎక్స్పర్ట్' గా ఇంటర్వ్యూ బోర్డ్ సభ్యులుగా కూడా వుండిన - డా. జి.వి.సుబ్రహ్మణ్యం గారి షష్ట్యబ్దిపూర్తి సాహిత్యోత్సవాలు 1995 సెప్టెంబర్ 10 వ తేదీ నుండి 1996 సెప్టెంబర్ 10 వ తేదీ వరకూ నిర్వహించాలని వారి మిత్రులు, శిష్యులు, అభిమానులు, సాహిత్యసంస్థల కార్యకర్తలు కలిసి ఒక సారథ్యసంఘంగా ఏర్పడ్డారు. 1995 డిసెంబర్ 24, 25 తేదీలలో ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం గారి సాహితీ సమాలోచన సదస్సులు రెండు రోజుల పాటు హైదరాబాద్ చిక్కడపల్లి నగరకేంద్రగ్రంథాలయంలో పెద్ద ఎత్తున జరిగాయి.

సుబ్రహ్మణ్యం గారిది రేడియోతో విడదీయలేని బంధం. ఆడిషన్ లో ప్యాసయి గ్రేడెడ్ ఆర్టిస్టు అయితే గానీ, రేడియో నాటకాల్లో పాత్రధారులు ఎవరూ కాలేరు. కానీ 'యామినీపూర్ణతిలక' నాటకంలో - 'బిల్హణుడి'గా ఆయన ప్రతిభావిశేషాల వల్లే - ప్రత్యేకించి

ఆయనను ఆహ్వానించి ఆ పాత్రను వేయించారని చెబుతారు. నార్ల చిరంజీవి గారి 'భాగ్యనగరం' నాటకం రేడియోలో ప్రసారం చేసినపుడు కూడా అందులో 'రుద్రకవి'గా జి.వి.సుబ్రహ్మణ్యంగారే నటించారట! అయితే ఆయన గ్రేడెడ్ ఆర్టిస్టే, 'అంతకన్నా ఎక్కువే' అని భాగ్యనగరంలో 'భాగమతి' గా నటించిన, 'యామినీపూర్ణతిలక' నాటకం ప్రొడ్యూస్ చేసిన శ్రీమతి శారదాశ్రీనివాసన్ గారు అన్నారు. 'యామినీపూర్ణతిలక' లో శారదాశ్రీనివాసన్ పక్కన జి.వి.సుబ్రహ్మణ్యం గారే ప్రధానపాత్రధారి. ఆ నాటకం ఎంతగానో శ్రోతల ఆదరణకు నోచుకుంది. అనేక సాహిత్యప్రసంగాలు, అవధాన నిర్వహణలు రేడియోలో కావించిన సుబ్రహ్మణ్యం గారు ఆకాశవాణికి సంబంధించిన పలుకమిటీల్లో కూడా సభ్యులుగా ఉండేవారు. 'పొలిటికల్ బ్రాడ్ కాస్ట్' సందర్భంలో - పార్టీల 'ఎన్నికల స్క్రిప్ట్స్' పరిశీలనలో కూడా వారు భాగస్వాములు. ఆయన షష్ట్యబ్దిపూర్తి ఉత్సవాలలో 25 డిసెంబర్'95 నాడు జరిగిన జి.వి.ఎస్ 'సృజనాత్మక సాహిత్యం' గురించిన (నాల్గవ) సమావేశంలో "ఆకాశవాణితో జి.వి.సుబ్రహ్మణ్యం గారి అనుబంధం" గురించి ప్రసంగించడానికి నన్నే ఎన్నుకున్నారు సారథ్యసంఘం వారు. వాసిరెడ్డి సీతాదేవి గారి అధ్యక్షతలో జరిగింది ఆ సమావేశం. జి.వి.ఎస్ రూపకాల గురించి డా. పి.వి.రమణ నవలలు, కథలు గురించి డా.ముక్తేవి భారతి, కవితలు గురించి ఆచార్య తిరుమల, 'ఆకాశవాణితో అనుబంధం' గురించి నేను , దూరదర్శన్ తో వారి అనుబంధం గురించి ఓలేటి పార్వతీశం ఆ సమావేశంలో ప్రసంగించాం.

హైదరాబాద్ వాస్తవ్యులకు ఏటా జరిగే 'నుమాయిష్' గురించి బాగా తెలుసు. అదో గొప్ప ఉత్సాహం. అఖిల భారత పారిశ్రామిక వస్తు ప్రదర్శనం - 'ఎక్జిబిషన్' ఏటా జనవరిలో జరుగుతుంది. ఎక్జిబిషన్ గ్రౌండ్స్ 'ముఖరం జాహి రోడ్' లో ఉంది. జనవరి ఒకటి నుండి ఫిబ్రవరి 15 వరకూ, నేటికీ ఏటేటా జరుగుతూనే ఉంది. ఎక్జిబిషన్ సొసైటీ హైదరాబాద్ వారు సాంస్కృతిక కార్యక్రమాలను కూడా నిర్వహిస్తుంటారు. ఆకాశవాణి 'నగరవాణి' కార్యక్రమంలో పారిశ్రామిక ప్రదర్శన విశేషాలు ప్రసారం చేస్తూండటం మామూలే. ఎవరు చెప్పారో తెలీదు గానీ - 1996 జనవరిలో 56 వ అఖిల భారత పారిశ్రామిక వస్తుప్రదర్శనలో, సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా 14 వ తేదీ రాత్రి 'కవి సమ్మేళనం' చేస్తూ, అందులో పాల్గొనవలసిందిగా కార్యదర్శి యం. నిహాల్ సింగ్ నాకో లేఖ రాశారు ఆ ఏడాది. ఉత్పల సత్యనారాయణాచార్య గారి అధ్యక్షతలో పాల్గొనడం గుర్తుంది. ఇలాంటి కవి సమ్మేళనాలకూ, సాహిత్యసభలకు వెళ్ళినప్పుడు అక్కడ తారసపడే కొత్త కవులు, రచయితలు, కళాకారుల పరిచయం - ఆకాశవాణిలో కార్యక్రమాల రూపకల్పనకు ఎంతో దోహదపడుతుంది. ఏటా ఆకాశవాణిలో కాన్ఫిడెన్షియల్ రిపోర్ట్ (సి.ఆర్) రాసేటప్పుడు, కార్యక్రమ



నిర్వాహణాధికారిగా 'సెల్ఫ్ ఎసెస్మెంట్' రాసుకోవాలి. అందులో 'న్యూటాలెంట్' ని ఆకాశవాణికి ఏ మేరకు చేశామనేది కూడా ఒక ప్రధానాంశమే! ఆ 'కాలమ్' 'నిల్' అని అని ఎప్పుడూ నింపకూడదనే నేను చూసుకునేవాడిని. తదనంతరకాలంలో వాళ్లెప్పుడో చెబితే తప్ప - రేడియోలో మొదటిసారి వారికి నేనే అవకాశం కల్పించానని నాకే తెలియనివారి సంఖ్య బహుళంగానే ఉండడం, ఉద్యోగజీవితంలో నాకెంతో తృప్తిని కలిగించే అంశం!



ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రానికి స్టేషన్ డైరెక్టర్ గా శ్రీ వి.వి.శాస్త్రి గారికి (శ్రీ వేమూరి విశ్వనాథశాస్త్రి) 1996 రిటైర్మెంట్ సంవత్సరం. చక్కని నిర్వహణాసామర్థ్యం చూపిన ఆయన కనీసం రెండేళ్ళు పదవికి పొడిగింపు వస్తుందని ఆశించారు. వారి రిటైర్మెంట్ ఏడాదిలోనే రాష్ట్రంలో 'పార్లమెంట్ ఎన్నికలు' వచ్చాయి. ఎన్నికల ప్రసారాల నిర్వహణ కత్తి మీద సాములాంటిదే! 1996 ఏప్రిల్ 27, మే 2, 7 వ తేదీల్లో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ జరిగింది. ప్రధాన రాజకీయ పార్టీల ఎన్నికల ప్రసంగాలను రికార్డు చేసి ప్రసారం చేయడం, ఏ పార్టీల ప్రతినిధులు ఏ రోజు ఎంతసేపు ప్రసంగించాలో లాటరీ ద్వారా నిర్ణయించడం, రెండు విడతల్లో ప్రసంగించడానికి పార్టీలకు సమయం కేటాయించడం, ఇదంతా ఒక పెద్ద తతంగం! ప్రసారానికి వారం రోజుల ముందుగానే - ఆయా పార్టీల నాయకులు ఆకాశవాణి స్టూడియోకి వచ్చి, ఎన్నికల ప్రసంగం రికార్డు చేస్తారు. వారలా రికార్డింగుకు రావడానికి మూడు రోజుల కన్నా ముందుగానే ఎన్నికల ప్రసంగపాఠాన్ని ఆకాశవాణికి సమర్పించాలి. ఆ 'స్క్రిప్ట్' లోని అభ్యంతరాలు పరిశీలించి, ఆమోదించడానికి, ఎన్నికల సంఘం ఆమోదంతో ఒక 'స్క్రిప్ట్ అప్రూవల్ కమిటీ' నియమిస్తారు. రాజకీయలకు అతీతులైన సామాజికవేత్తలు, విద్యానిపుణులు సభ్యులుగా ఉంటారు. పార్టీలు సమర్పించిన ప్రసంగపాఠంలో అభ్యంతరాలుంటే, వాటిని ఆయా పార్టీలకు ముందుగా తెలియచేస్తారు. ఆకాశవాణికీ, పార్టీలకూ మధ్య స్క్రిప్ట్ విషయంలో అభిప్రాయభేదాలేవయినా తలెత్తితే - ఎన్నికల సంఘం తుదినిర్ణయం తీసుకుంటుంది. ఒక పార్టీ ప్రసంగ పాఠం మరో పార్టీ చూసే అవకాశం ఉండదు. మొదటి విడత ప్రసారాలు తర్వాత, రెండో విడత ప్రసారం వుంటుంది. ఎన్నికల ప్రసంగాల ప్రసార వేళ విద్యుత్ అంతరాయం కలిగినా, మొత్తం ప్రసంగం మళ్ళీ పునఃప్రసారం చేయాల్సి వుంటుంది. ఎన్నికల సంఘం పార్టీలకు ఇచ్చిన 'టైం ఓచర్ల' అనుగుణంగా, వారి ప్రతినిధులు ఈ ప్రచార సమయాన్ని ఉచితంగా వాడుకునేవారు. ఏ పార్టీ తరపున ఎవరు మాట్లాడాలి అన్నది, ఆ పార్టీలే నిర్ణయించుకుంటాయి. ప్రసంగాలు ముందుగా పంపడం, ఆమోదం పొందిన వాటిని, ఆయా నాయకులకు చేర్చడం, వారితో ఆకాశవాణి సిబ్బంది సంప్రదిస్తూ, రికార్డింగు చేయడం, రికార్డు సంతృప్తికరంగా ఉందని వారి దగ్గర సంతకాలు తీసుకోవడం, జరిగేది. ఆకాశవాణి రాష్ట్రంలోని అన్ని కేంద్రాల నుండీ ప్రసారం అవ్వాలి కనుక - కేవలం రిలే మీద ఆధారపడకుండా, ఆయా స్థానిక కేంద్రాలకు కూడా, రికార్డింగు కాపీలను 'టేప్స్' మీద పంపడం జరిగేది. అది కూడా ఏ పోస్ట్ ద్వారానో అయితే ఇబ్బంది కనుక, ఆయా కేంద్రాల నుండి ఆకాశవాణి ఉద్యోగియే స్వయంగా వచ్చి, ఎన్నికల ప్రసంగం ప్రసారాల టేప్స్ ను తీసుకు వెళ్ళే వారు. ఈ ఎన్నికల ప్రసార బాధ్యత అంతా డైరెక్టర్ గారి భుజస్కంధాల మీదనే కదా! శ్రీ వి.వి.శాస్త్రి గారు ఆ బాధ్యతలను నమ్మకంగా పనిచేసే వారందరికీ పంచి, సామర్థ్యంతో నిర్వర్తించారు.

రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ చంద్రబాబు అధికారంలో వున్న - 1996 పార్లమెంట్ ఎన్నికల్లో, పార్లమెంట్ 42 స్థానాలకు గాను 22 స్థానాలలో కాంగ్రెస్ పార్టీ గెలుపొందింది. తెలుగుదేశం 16 స్థానాలను, సి.పి.ఐ రెండు స్థానాలను, సి.పి.ఐ (ఎం) ఒక స్థానాన్ని పార్లమెంట్ కు ఆ ఏడు గెలుచుకున్నాయి. 1996 పార్లమెంట్ ఎన్నికల ప్రసారాల రికార్డింగుల్లో - కాంగ్రెస్, సి.పి.ఐ, బి.జె.పి పార్టీ రికార్డింగుల్లో కార్యక్రమ నిర్వహణాధికారిగా వృత్తిధర్మాన్ని నేను నిర్వర్తించాను. అది ఒక మంచి అనుభవమే!




కేంద్రంలో భారతీయ జనతాపార్టీ పక్షాన శ్రీ అటల్ బిహారీ వాజ్ పేయ్ మే 17 నుండి కేవలం 13 రోజులు ప్రధానమంత్రిగా పనిచేసి, తగిన మెజారిటీ లేదని అవిశ్వాసాన్ని తీర్మానం దాకా రాకుండానే, తానే స్వయంగా రాజీనామా చేసేశారు. ఆ తరువాత 'యునైటెడ్ ఫ్రంట్' శ్రీ దేవెగౌడ ప్రధానిగా దేశపాలనను చేపట్టారు. జూన్ 1 వ తేదీ దేవెగౌడ ప్రధానిగా పదవీస్వీకారం చేశారు. కమ్యూనిస్టులు భారత స్వాతంత్ర్యానంతరం తొలిసారి ప్రభుత్వంలో చేరింది అప్పుడే! శ్రీ పి.వి.నరసింహారావు గారు 27 సెప్టెంబర్ ' 1996 న కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. డిసెంబర్ 19 న కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ లీడర్ గా కూడా రాజీనామా చేశారు. 23 సెప్టెంబర్ న శ్రీ సీతారాం కేసరి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులయ్యారు.

తెలుగు సాహిత్య కార్యక్రమాలే కాక, డెవలప్మెంట్ టాక్స్ కార్యక్రమ నిర్వహణాధికారిగా వున్న నేను - ఈ ప్రధాన సంఘటనలన్నింటికీ 'కార్యక్రమ రూపకల్పనలో' చోటు కల్పించాను. జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్ర సంఘటనల సమాహారంగా 'నడుస్తున్న చరిత్ర' కార్యక్రమాన్ని ఇక్కడా నిర్వహించాను.



కార్యక్రమ నిర్వహణలో హైదరాబాద్ ఆకాశవాణిలో ఎంత పని ఒత్తిడులు ఉన్నా, నా సృజనాత్మక కృషిని కూడా - వెనుకపడకుండా చూసుకునేవాడిని. శ్రీ వి.వి.శాస్త్రి గారి హయాంలోనే - 1996 'ఉగాది' నాడు లలిత సంగీత విభాగానికి కార్యక్రమనిర్వహణాధికారిగా ఉన్న మిత్రుడు శ్రీ కలగా కృష్ణమోహన్ - 'పూలపల్లకి' పేరున, ఒక 'లలిత సంగీత విభావరి'ని, 20.3.1996 సాయంకాలం 6:30 కు రవీంద్ర భారతి నుండి 'ప్రత్యక్ష ప్రసారం' చేశాడు. ఆహుతుల సమక్షంలో జరిగే 'లలిత సంగీత కార్యక్రమం' - అలా నేరుగా ప్రత్యక్ష ప్రసారం కావడం నాడు ఒక విశేషమే! శ్రీ బిజుమళ్ళ మాధవ సూర్యనారాయణ సిద్ధాంతి గారి పంచాంగశ్రవణం ముందుగా ప్రసారం చేసి, లలిత సంగీత విభావరిని సుమారు పన్నెండు లలిత గీతాలతో, ప్రత్యక్ష ప్రసారం చేయడం జరిగింది. అందులో భాగంగానే - కృష్ణమోహన్ నా చేత ఒక పాట రాయించాడు. 'తలపు తలుపు తట్టినంత' అనే పల్లవితో నేను రాసిన 'ఉగాది గీతం' - ఆర్. గోపాలకృష్ణ సంగీత దర్శకత్వంలో, వి. కనకదుర్గ, సి.రమణ, ఖాసిం నూర్ శేష్, జి. దినకరరావు, సి. నర్మద, నాగేశ్వరరావు ప్రభృత గాయనీ గాయకుల గళంలో ఆ 'పూలపల్లకి' లో చోటు చేసుకుంది. శశాంక, సి.నా.రె, శేషేంద్ర శర్మ, ఇంద్రగంటి శ్రీకాంత శర్మ,

ఆచార్య తిరుమల, ఎం.కె రాము, కృష్ణమోహన్, ఎం. పద్మినీదేవి, (జానపద సంప్రదాయం) రచించిన గీతాలు ఆ ఉగాది నాడు - శ్రీ పాలగుమ్మి విశ్వనాథం, ఎం. చిత్తరంజన్, బొబ్బిలి భాస్కరరెడ్డి, కె రామాచారి, పి.వి.సాయిబాబా, ప్రఖ్యా ఆంజనేయశాస్త్రి, కలగా కృష్ణమోహన్, బి. శోభారాణి, ఎం.ఆర్.కె. ప్రభాకరరావు, ఆర్. సంపత్ కుమార్, వింజమూరి సీతాదేవి గార్ల సంగీత దర్శకత్వంలో - ప్రముఖ గాయనీ గాయకుల గళాల్లో, ప్రత్యక్ష ప్రసారమై శ్రోతలను అలరించాయి.



1 జూన్ ' 1996 న ఓ 'శ్రద్ధాంజలి' కార్యక్రమం ప్రసారం చేయడం కూడా గుర్తుంది. ఔను! భారతదేశానికి ఆరవ రాష్ట్రపతిగా పని చేసిన మన తెలుగువాడు డా. నీలం సంజీవరెడ్డి ఆ రోజు అస్తమించారు. విశాలాంధ్ర ఏర్పడి 'ఆంధ్రప్రదేశ్' రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా పని చేసిందీ ఆయనే! నవంబర్ 1956 నుండి జనవరి 1960 వరకూ, మళ్ళీ మార్చి 1962, నుండి ఫిబ్రవరి 1964 వరకు రెండు పర్యాయాలు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఆయనే. మధ్యలో రెండేళ్ళ కాలంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా కూడా చేశారు. అయితే 1969 లో ఇందిరాగాంధీ హయాంలో రాష్ట్రపతిగా ఎన్నిక కాకుండా, ఆవిడ వి.వి.గిరిని బరిలోకి దింపి, 'అంతరాత్మ ప్రబోధం' పేర, శ్రీ వి.వి.గిరి రాష్ట్రపతిగా ఎన్నిక అయ్యేలా చూడడంతో, నీలం సంజీవరెడ్డి గారు క్రియాశీల రాజకీయాల నుంచి వైదొలగి సొంతూరు 'అనంత పూర్' వెళ్ళి పోయారు. అయితే - 1975 లో జయప్రకాశ్ నారాయణ్ 'జనతా పార్టీ' చైతన్యోద్దీపనంతో, తిరిగి రాజకీయాలలోకి వచ్చి, 21 జూలై 1977 నుండి 1982 వరకూ 'భారత రాష్ట్రపతి' గా దేశానికి సేవలందించారు. నాగార్జున సాగర్, శ్రీశైలం డామ్ ల రూపకల్పన, నిర్మాణాలతో ఆయన పాత్ర అవిస్మరణీయం. నీలం సంజీవరెడ్డి మాజీ రాష్ట్రపతిగా 1996 జూన్ 1 న అస్తమించారు. 2005 లో తెలుగుదేశం ప్రభుత్వం 'శ్రీశైలం డ్యాం' కు సంజీవరెడ్డి గారి పేరు పెట్టిన విషయం తెలిసే ఉంటుంది! సంజీవరెడ్డి గారి మృతికి శ్రద్ధాంజలి కార్యక్రమంలో - కొందరి ప్రముఖుల అభిప్రాయాలను రికార్డు చేయడం జరిగింది. 1996 అక్టోబర్ 31 న ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం స్టేషన్ డైరెక్టర్ గా శ్రీ వి.వి.శాస్త్రి గారు రిటైరయ్యారు.




# 52

**1996 అక్టోబర్ 31న** ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం స్టేషన్ డైరెక్టర్‌గా శ్రీ వి.వి.శాస్త్రిగారు తనకు కనీసం రెండు సంవత్సరాల పదవీకాలం పొడిగింపు లభిస్తుందని ఆశించినా, అది జరగకపోవడంతో రిటైరైనారు. సాధారణంగా పదవీ విరమణ సందర్భంగా వీడ్కోలు సమావేశం లాంటిది చేయడం ఆనవాయితీ! కానీ శాస్త్రిగారు తనకు పొడిగింపు లభించగలదన్న ఆశతో ఉండి అలాటిదేమీ వద్దనేసారు. దానితో అలాంటి సభ ఏదీ జరగకుండానే ఆయన స్టేషన్ డైరెక్టర్‌గా నిష్క్రమించారు. నిజానికి మంచి డైనమిక్ వ్యక్తి ఆయన. గొప్ప అడ్మినిస్ట్రేటర్. ఎంత కచ్చితంగా ఉండేవారో ఎదుటివారి సాధకబాధకాలను అర్థం చేసుకుని అంతగా సర్దుబాట్లూ చేసేవారు. ఎందరికి ఎన్ని ఉపకారాలు చేశారో!


శ్రీ కబీర్ అహ్మద్‌గారు

1996 నవంబర్ ఒకటినే శ్రీ కబీర్ అహ్మద్‌గారు హైదరాబాద్ ఆకాశవాణి స్టేషన్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు ఆయన కాశ్మీర్ స్టేషన్‌లో డైరెక్టర్‌గా చేశారు. ఆయనది నిజానికి హైదరాబాదే ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్‌గా గతంలో హైదరాబాద్‌లో ఉర్దూవిభాగాన్ని కూడా కొంత కాలం చూశారు. కొత్తగూడెం స్టేషన్ డైరెక్టర్‌గా ఆ తరువాతి కాలంలో పనిచేసి అక్కడనుండి కాశ్మీర్ కేంద్రానికి వెళ్ళారు. ఆయనకూ రిటైర్ మెంట్ వయసు దగ్గర పడుతూండడంతో కోరుకుని హైదరాబాద్‌కు బదిలీ చేయించుకుని వచ్చారు.

కబీర్ అహ్మద్‌గారు చాలా సౌమ్యులు. ఒకరకంగా కొంచెం మెతకమనిషి. అందువల్ల కొందరు బాగా స్వేచ్ఛ తీసుకునేవారు. చాయ్ బిస్కట్లు, మిర్చిబజ్జీ ఆయనకు చాలా ఇష్టం. సాయంత్రాలు ఉర్దూ మిత్రులతో ఆ భేటీలు జరిగేవి. ఆయన గొప్ప చదవరి. బోలెడు పుస్తకాలు చదివేవారు. స్వయంగా ఆయన రచయిత కూడాను. ఉర్దూలో రచనలు చేశారు. మంచి పుస్తకం ఎక్కడ కనబడినా దాని ప్రతి ఒకటి తన దగ్గర ఉండాలనేంత కుతూహలం, ఆసక్తి వారికుండేది. అందువల్ల ఆయన దగ్గరి జిరాక్స్ మిషన్‌కు ఎప్పుడూ పుస్తకాల ప్రతులు తీయడమే పని అని చెప్పుకునేవారు. అంతకు ముందు కొత్తగూడెంలో ఆయన దగ్గర కార్యక్రమ నిర్వహణాధికారిగా పనిచేసిన శ్రీ సుమనస్పతి రెడ్డి వంటివారు ఇక్కడ ఆయనకు సన్నిహితంగా ఉండేవారు. వారి

విశ్వాసాన్ని చూరగొని వ్యవహర్తలుగా ఉంటూండేవారు. సుమనస్పతిరెడ్డి మంచి కథకుడు. తెలుగు సాహిత్యం పట్లా, భాషా సంస్కృతులపట్లా, సినిమాల డాక్యుమెంటేషన్ల పట్లా మంచి అభిరుచి, అభినివేశంగలవాడు. శాస్త్రిగారు డైరెక్టర్‌గా ఉన్న కాలంలో ఎక్కువకాలం యువవాణి సెక్షన్సే చూశాడు. కబీర్‌గారు డైరెక్టర్‌గా వచ్చాక మార్నింగ్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ ఉదయతరంగణి కార్యక్రమాల నిర్వహణ చేపట్టాడు.




తెలుగు విభాగం కార్యక్రమ నిర్వహణాధికారిగా నేను కబీర్ అహ్మద్ గారి కాలంలోనూ కొనసాగాను. అయితే ఉదయతరంగిణిలో సమాంతరంగా సుమనస్పతిరెడ్డి కూడా కార్యక్రమాలు రూపొందించి ప్రసారం చేసేవాడు. అది సంతోషదాయకం కావచ్చుగానీ వక్తలకు నిర్దేశించిన పారితోషికాన్ని నిబంధనలను తనకు అనుకూలాంగా ఆరోపించుకుని, వారికి చెల్లింపచేస్తుండడంతో ప్రముఖులైన ప్రాసంగికులు కొందరు తను చెల్లింపచేసే దానికి తెలుగు విభాగం చెల్లింపచేసేదానికి గల వ్యత్యాసం గురించి ఆరోపిస్తూ మాట్లాడడంతో కబీర్‌గారికి దృష్టికి తీసుకువెళ్ళడం జరిగింది. చిత్రంగా ఆయన తన విధానాన్ని సమర్ధించడం ఆశ్చర్యం కలిగించింది. ఆ తరువాత ఎప్పుడో ఇది డైరెక్టరేట్ దృష్టికి వెళ్ళి వారే తిరిగి ఖచ్చితమైన పాటించవలసిన పారితోషికం చెల్లించవలసిన ప్రమాణతా సూత్రాలను పంపడం జరిగింది.

తెలుగు విభాగం ప్రసారం చేసే కార్యక్రమాలలో గ్రంథ సమీక్ష ఒకటి. నెలకు ఒకసారి కొత్త పుస్తకాలను సమీక్షింపచేసే ఆ కార్యక్రమంలో సమీక్షార్థం రచయితలు, కవులు, ప్రచురణకర్తలు పత్రికలకు పంపినట్లే రెండు ప్రతులు పంపే నియమం ఉంది. సమీక్షకుడికి సమీక్షార్థం ప్రతి ఇవ్వడం ఎలాగూ జరుగుతుంది. రెండోప్రతి ఆకాశవాణి గ్రంథాలయంకు వెళ్ళేవి. ఏటా గ్రంథాలయం నిమిత్తం ఆకాశవాణి పుస్తకాలు కొనే ఆనవాయితీ కూడా ఉంది. అనేక మంచి తెలుగుపుస్తకాలు సమీక్షార్థం ఎలాగూ అందేవి కనుక ఉపయుక్తమైన రిఫరెన్స్‌బుక్స్ ఆ బడ్జెట్ సొమ్ముతో కొనే వీలయ్యేది. విశాలాంధ్ర ప్రచురణాలయం వారు సమీక్షార్థం క్రమం తప్పక ఆ రోజుల్లో పుస్తకాలు పంపేవారు. ఓ పావుగంట గ్రంథ సమీక్ష కార్యాలయంలో రెండు మూడు పుస్తకాలు మినహా సమీక్షించడం సాధ్యం కాదు కనుక మంచి పుస్తకాలను క్లుప్తంగానైనా పరిచయం చేసేందుకు పత్రికల్లో 'స్వీకారం' చందాన వారం వారం ఉదయతరంగిణిలో 'పుస్తకదర్శిని' పేర అయిదు నిమిషాల కొత్తపుస్తకాల సమాచారం తెలిపే కార్యక్రమం నేను ప్రవేశపెట్టాను. పెద్దగా సమీక్ష అవసరంలేని కొత్తపుస్తకాల గురించిన సమాచారం అందులో అందించడం జరిగేది. పుస్తకసమీక్ష చేసినప్పుడు ముందుగా ఆ విషయాన్ని రచయితకు తెలియచేయడం కూడా చేసేవాడిని. అందువల్ల రచయితలనుండి కూడా కార్యక్రమానికి మంచి ఆదరణ, స్పందన లభించేది. 20.9.96న శ్రీ భమిడిపాటి జగన్నాథరావుగారి లేఖ అందుకు ఓ చిన్న దాఖలా. రేడియోలో గ్రంథ సమీక్షలు బయటి విమర్శకుల చేతనే చేయించడం జరిగేది. పత్రికల్లో గ్రంథసమీక్షలు చేయడం 1976లో అనుకుంటాను నా చేత కుందుర్తిగారే ఆంధ్రప్రదేశ్ మాసపత్రికలో స్వీకారం చేయించారు. తదాదిగా పలు తెలుగుపత్రికా సంపాదకులు నన్నొక సమీక్షకునిగా వారి పత్రికల్లో పుస్తకసమీక్షలు చేయిస్తూనే వచ్చారు వస్తున్నారు.


FFS, 'APURUPA' Apartments
1st Line, Maruthi Nagar
Vijayawada - 520 004
(A.P.)
[Phone: 431 465]

B. Jagannadha Rao
Press Secretary to Governor

Vijayawada
20.9.96

Dear Sri Sidhhama garu,

Namaste.

[illegible] Communication (dated 6th September) - about Review of my short story collection - [illegible] 12th September [illegible] programme 9th September [illegible] Communication [illegible]

[illegible] I was away at Delhi for 20 days from 20th August to 10th September on some personal work. [illegible]

Anyhow - Thanks a lot for your gesture. [illegible] (Reviewer) [illegible] hyderabad [illegible] Contact [illegible]

[illegible]

20.9.96.

Rajbhavan, Hyderabad - 500 041. Phone: 210621

ఆకాశవాణి జాతీయకవి సమ్మేళనం గురించి మునుపే రాశాను కదా! అసలు రేడియోలో ప్రసారం చేసే ప్రతికవితా అందుకు పరిశీలనకు పంపేటంతటి స్థాయిలో ఉండేలా చూడమని డైరెక్టరేట్ వారి సూచన కూడాను. ఏటా జనవరి 26 గణతంత్ర దినోత్సవ సందర్భంగా ముందురోజు ప్రసారమయ్యే

వివిధభాషా కవుల సమ్మేళనానికి తెలుగు భాషా కవితలను పరిశీలనార్థం పంపే బాధ్యత హైదరాబాద్ కేంద్రానిదే త్రైమాసికంగా జరిగే కో ఆర్డినేషన్ మీటింగ్స్‌లో రాష్ట్రంలోని వివిధ ఆకాశవాణి కేంద్రాల నుండి వచ్చిన ప్రాతినిధ్య కవితలను పరిశీలించి రెండు కవితలు ఢిల్లీ కేంద్రానికి ప్రధాన ఎన్నిక నిమిత్తం హిందీ, ఇంగ్లీష్ అనువాదాలతో పంపే బాధ్యత మా ఆకాశవాణి కేంద్రానిదే 1997 జాతీయకవి సమ్మేళనంకు పంపిన కవితల్లో సిద్ధిపేటకు చెందిన యువకవి ఐలేని గిరి 'వృద్ధాప్యపు బాల్యం' ఆ ఏడు ఎన్నికయ్యింది. ఆహూతుల సమక్షంలో ముందుగా ఢిల్లీలో జరిగిన 1997 జాతీయ కవిసమ్మేళనంలో తెలుగు ప్రాతినిధ్య కవిగా పాల్గొని వచ్చిన ఐరేని గిరి 29/1/1997న తన ఆనందాన్ని ఒక లేఖలో వ్యక్తీకరించడం, ఆ లేఖ ఒక మధుర జ్ఞాపకమేననాలి.

తెలుగు నవలా ప్రపంచంలో చైతన్యస్రవంతి పద్ధతిలో సంచలనం కలిగించిన 'అంపశయ్య' నవలా రచయిత పేరు నిజానికి శ్రీ దొంగరి మల్లయ్య. కానీ అలా అంటే ఎవరికీ తెలియదు. నవీన్ అన్న కలంపేరుతో ప్రముఖుడైన మల్లయ్య అంపశయ్య నవీన్‌గానే


2-1-1997

వినుతికెక్కారు. నేను కరీంనగర్‌లో రేడియోలోకి రాకముందు జూనియర్ లెక్చరర్‌గా చేసినప్పటినుంచీ నవీన్ బాగా పరిచయం నాకు. 1997 జనవరిలోనే అప్పటికి అంపశయ్య నవల వెలువడి పాతిక సంవత్సరాలై పోయిన నేపథ్యంలో 'అంపశయ్య నేపథ్యం' అని తనతో ఓ పరిచయ కార్యక్రమం రూపొందించి వరంగల్ హనుమకొండనుండి ప్రత్యేకించి ఆహ్వానించి ప్రసారం చేయడం జరిగింది. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి ఎవరికయినా ఆ నవల చదివితే నాటికీ నేటికీ ఓ గొప్ప గగుర్పాటు, గొప్ప చైతన్యం అనే చెప్పాలి. ఆ పరిచయ కార్యక్రమం నవీన్‌కూ బాగా నచ్చింది. ముందే చెప్పానుగా! విజయవాడనుండి హైదరాబాద్ వచ్చాక కార్యక్రమ నిర్వహణాధికారిగా కార్యక్రమాల రికార్డింగు వేళలను పనిదినాలకే కాక అవసరమైతే శని, ఆదివారాల్లో కూడా వెళ్ళి చేయాల్సి వస్తూండేది. రికార్డింగుకు తేదీ, సమయం ఇచ్చినా వాయిదా గురించి ప్రముఖులు అడిగినప్పుడు కాదని అనలేదు. ప్రసారతేదీ వాయిదా వేయడం కుదరదుగానీ ఆ ప్రసారానికి రికార్డింగు చేయడం అనేది అనుకూలతను బట్టే చేసుకునే వీలుది కనుక ఆయా ప్రాసంగికుల, విషయ నిపుణుల సమయానుకూలంగా మార్చిచేయడం విధాయకం కాదుగానీ శ్రోతలకు మంచి కార్యక్రమం అందించదలిచినప్పుడు ఔదలదాల్చదగిందిగానే భావించాను. నాదగ్గర ఉన్న చనువువల్ల రికార్డింగు వాయిదా కోరుతూ అలా లేఖలు కూడా రాస్తూండేవారు (చూడుడు 14


715 2440
1997

ఫిబ్రవరి' 1997 నాటి చే.రా చేకూరి రామారావుగారి లేఖ అని తమాషాగా ఇక్కడ ఓ ఉదాహరణగా ఉటంకిస్తున్నాను అంతేసుమండీ!) అలా ఆ ప్రముఖుల సహకారంతోనే మంచి మంచి కార్యక్రమాలు రూపొందించినా నేను, కాదని నిరాకరించక అలా పెద్దలెందరో తోడ్పడిన కారణం వల్లనే తెలుగు విభాగానికి, ఆకాశవాణికి సాహితీప్రియుల, శ్రోతల ప్రశంసలు అందుతూ వచ్చాయి. ఎందరో కొత్తకవులు, కథకులు, సమీక్షకులు, విమర్శకులు, వివిధరంగాల విషయ నిపుణులు రేడియోకి పరిచయం అయ్యారు. అందుకు నేనొక వాహిక కాగలిగాను.

విజయవాడనుంచి 1995లో తిరిగి వచ్చిన ఉష, నేను అపెక్స్ అపార్ట్‌మెంట్స్‌లో అద్దె ఇంట్లో ఉండే వాళ్ళం. తమాషా ఏమిటంటే మా వివాహం అయిన 1985 నుంచి కూడా ప్రతి రెండేళ్ళకీ దాదాపుగా ఒక అద్దె ఇల్లు మారుతూనే సాగింది మా సంసారం. ఒక సొంత ఇంటి కలను కనడం తప్పేంకాదనీ, అది భవిష్యత్ భద్రత దృష్ట్యా విధాయకం అనీ ఉష పట్టుబట్టసాగింది. తను కూడా ఆకాశవాణిలో సహకార్యక్రమ నిర్వహణాధికారి అయిన ఉద్యోగినిగా అప్పుడు స్త్రీలు, పిల్లల విభాగాన్ని నిర్వహిస్తూ వచ్చింది. తురగా జానకీరాణిగారు రిటైర్ అయ్యాక, మహిళా శిశు సంక్షేమ కార్యక్రమాలు చూస్తూ తాను 'రేడియో అక్కయ్య'గా అయింది. ఇద్దరం పనిచేస్తున్నాం కనుక, కేంద్రప్రభుత్వ ఉద్యోగులమే కనుక, ఇలా అద్దె ఇళ్ళలో మగ్గేబదులు, కనీసం ఒక సొంత అపార్ట్‌మెంట్‌ను కొనుగోలు చేసుకోవాలంటే 'హౌసింగ్‌లోన్' దొరకడం కష్టం కాదనీ, ఏ ఎల్.ఐ.సి హౌసింగ్ లోన్ అయినా తీసుకోవచ్చనీ అనిపించింది. 'ఎంతచెట్టుకు అంతగాలి' కనుక మేము వెనుకవేసిందీ, పెద్దగా సేవింగ్స్ చేసిందీ ఏమీలేదు. కానీ "అప్పుచేయకుండా సొంతిల్లు ఏర్పాటు చేసుకోగలగడం కల్ల" కనుక కల నెరవేరాలంటే కొత్తగా నిర్మాణమవుతున్న అపార్ట్‌మెంట్స్ కాకున్నా, ఈసరికే నిర్మితమైన, కొనుగోలుకు వీలున్నదేదయినా ఫ్లాట్ చూడాలనుకున్నాం. ఏ.సి.గార్డ్స్‌లోనే మా పక్క అపార్ట్‌మెంట్స్‌లో ఉండే ప్రముఖ ఇంద్రజాలికలు బి.వి.పట్టాభిరాం గారు కూడా మమ్మల్నో సొంత ఇంటి (అపార్ట్‌మెంట్) వాళ్ళను చేయాలని ఒకటి రెండు స్వయంగా చూపారు కూడా! అననుకూలతవల్లో, ఆర్థికంగా రేంజ్‌లో లేకనో ఆ ప్రాంతంలోనే ఇల్లు ఏర్పరచుకోవడం సాధ్యం కాలేదు.

ఇళ్ళ అన్వేషణలో 'అమ్మకానికి ఇల్లు' అని పేపర్ ప్రకటనలు కూడా చూడడం మొదలుపెట్టాం. ఆఫీస్‌ద్వారా ఇంటిలోన్ సంపాయించడం కష్టం అనేసారు కొందరు. ఎల్.ఐ.సి డెవలెప్ మెంట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న మిత్రుడు రామలింగయ్య మా పాలసీల ఆధారంగా 'హౌసింగ్‌లోన్' సంపాదించవచ్చని ప్రోత్సహించసాగాడు. మలకపేట సలీంనగర్ కాలనీలో ఓ అపార్ట్‌మెంట్స్‌లో ఓ రెండు బెడ్ రూమ్స్ ఫ్లాట్ అమ్మకానికి ఉందని, డెక్కన్ క్రానికల్ దినపత్రికలోని ఆంగ్లంలో వచ్చిన ప్రకటన ఉషని ఆకర్షించింది. "మీరు చిన్నప్పటినుంచీ పెరిగిన లొకాల్టీ కదా! విజయవాడ వెళ్ళేముందు సలీంనగర్ కాలనీలోనే ఓ ఇంట్లో అద్దెకున్నాం. కనుక ఆ ప్రాంతంలో ఆఫీసుకు దూరమైనా పర్లేదు చూద్దాం పదండి" అంది.


DEVARAJU RAVI
Journalist & Film Critic
6-2/213, Behind Hotel SARADA
Kukatapalli Bus Stand
Hyderabad-500072
PH-885518 PP






# 53

ఒకొక్కసారి నాకు ఆశ్చర్యం వేస్తుంది. వెనుక ఏ ఆస్తులూ లేకుండా, ప్రభుత్వోద్యోగులుగా పనిచేసే కొందరు వచ్చిన జీతం రాళ్ళతో పెద్ద పెద్ద భవంతులు ఎలా కట్టగలుగుతారా అని? "వాడికి 'జీతం' కంటే 'గీతం' ఎక్కువ తెలుసుకోవే" అని ఓ సినిమా పాటలో చరణంలా, అవినీతికి పాల్పడిన వారికి తప్ప అది సాధ్యం కాదేమో! ఓ సగటు ప్రభుత్వోద్యోగి నిజాయితీగా పనిచేస్తూ ఏ బ్యాంకో, ఎల్.ఐ.సీయో ఇచ్చే ఋణంతోనో కొద్దిపాటి సేవింగ్స్‌తో ఓ అపార్ట్‌మెంట్ కొనుక్కోవడానికో, ఓ చిన్నఇల్లు కట్టుకోవడానికో అప్పటి జీతాలననుసరించి కనీసం పది పదిహేనేళ్ళు కష్టపడితేగానీ ఓ సొంత ఇంటికల సాకారం చేసుకునే అవకాశం ఉండేది కాదు అనడానికి నేనే ఉదాహరణేమో! 1978లో కేంద్రప్రభుత్వోద్యోగినై 1983లో కేంద్రప్రభుత్వోద్యోగిని అయిన ఉషను వివాహమాడి, ఇద్దరం కలిసి ఒక్క బాబుని కని పెంచుకుంటూ 1997లోగానీ ఒక సొంత ఇంటివారం కాలేకపోయామంటే.. మాకే చిత్రంగా ఉంటుంది గానీ అప్పటి పరిస్థితుల దృష్ట్యా మా జీవనవిధానం అంతే!


సొంత ఇల్లు

1996 డిసెంబర్‘25 సరిగ్గా క్రిస్మస్‌రోజు మలకపేటలో ఉండే మా అన్నయ్య ఇంటికి వచ్చి డెక్కన్‌క్రానికల్‌లో మేం చూసిన అపార్ట్‌మెంట్ ఫ్లాట్ ప్రకటన గురించి చెబితే దగ్గరే కదా చూద్దాం పదమని సలీంనగర్ కాలనీలోని పద్మావతి అపార్ట్‌మెంట్స్‌కు వచ్చాం. మా ఫ్లాట్, బిల్డర్స్‌లో ఒక ఓనర్‌గారి కొడుకుకి సంక్రమించింది. అతను వేరే చోట ఇల్లు అమర్చుకుంటూ తన తండ్రికి అంతగా ఇష్టంలేకపోయినా ఇది అమ్మకానికి పెట్టాడు. ఫ్లాట్ ఓనర్‌తో, అబ్బాయితో మాట్లాడాక అయిదు లకారాలకు ఇస్తామనీ, ఎల్.ఐ.సి లోన్ కోసం, కొంత చెల్లించాక పేపర్లు ఇస్తామని చెప్పారు. ఎల్.ఐ.సి పాలసీల మీద హౌసింగ్‌లోన్ ఇప్పించేందుకు మిత్రుడు ఎల్.ఐ.సి డెవలప్‌మెంట్ ఆఫీసర్

మా రేడియో శకుంతల భర్త రామలింగయ్య ప్రోత్సహించాడు. ఉష మిత్రురాలు అడ్వొకేట్ అయిన శ్రీమతి మామువాణి ఇబ్బందులధిగమించేందుకు మాట సాయం చేశారు. అలా ఎల్.ఐ.సి హౌసింగ్‌లోన్‌తో, కొంత పొదుపుసొమ్ముతో మొత్తానికి 1997 మేలో ఓ సొంత ఇంటివారమై గృహప్రవేశం చేసాం. ప్రతిరెండేళ్ళకి అద్దె ఇళ్ళు మారే స్థితి తప్పి నెల నెలా హౌసింగ్‌లోన్ చెల్లించుకుంటూ నేను స్వచ్ఛంద పదవీ విరమణ 2008లో తీసుకోవడానికి కొంచెం ముందుగానే ఇంటి ఋణవిముక్తులం కాగలిగాం కూడా.

నిజానికి హైదరాబాద్ ఆకాశవాణి ఆఫీసుకు ఇల్లు ఎనిమిది కిలో మీటర్ల దూరమే. కానీ హైదరాబాద్‌లో అంతకన్నా దూరాల నుంచి వస్తున్నవారున్నారు. ఎటొచ్చీ బస్సులు పట్టుకునీ, ఆటోలు చేజిక్కించుకునీ ఇంటినుంచి ఆఫీసుకు, ఆఫీసునుంచి ఇంటికి ప్రయాణించడం కూడా బోలెడు అలసట వ్యవహారమే! తిట్టుకున్నా ఏమయినా ఉష సొంత ఇల్లు కూర్చోగలిగామన్న సంతోషంతో ఆ కష్టాలన్నీ పడింది ఇప్పటికీ తానింకా పడుతోంది. ప్రతిరోజూ మీటింగు 10.15 కంటే పది గంటలకల్లా ఎట్టి పరిస్థితుల్లోనూ ఆఫీసులో ఉండేలాగానే ఇంటినుంచి ప్రయాణంచేసి వెళ్ళేవాళ్ళం.

నా సాహితీ వ్యాసంగం కూడా సొంత ఇంటికి వచ్చాక కొంత ప్రణాళికాబద్ధం చేసుకున్నాను. శివారెడ్డి, దేవిప్రియ ప్రభృతులతో తెలంగాణాలో అనేక సభలకు వెళ్ళి పాల్గొనగలిగాను.


డా. రావూరి భరద్వాజగారితో

మిత్రుడు డా.నందిని సిద్ధారెడ్డి ప్రభుతులు స్థాపించిన మంజీరా రచయితల సంఘం పదేళ్ళ మహాసభలు 1996 జూలై 20, 21 తేదీల్లో సిద్ధిపేటలో జరిగినప్పుడు కవిసభను నేనే నిర్వహణ చేయడం గుర్తుంది. ఆగస్టు 1996లో డా. రావూరి భరద్వాజగారి సాహితీ స్వర్ణోత్సవం సాధన సాహితీ స్రవంతి నిర్వహించినప్పుడు రేడియోనుంచి రిటైరయిన ఆయన దగ్గర సహాయకునిగా పనిచేసిన అనుభవంతో కూడా రావూరి సాహిత్యసమాలోచనంలో పాల్గొని ప్రసంగించే వీలుకలిగింది. ఏ తెలుగు విభాగానికి ఆయన ప్రొడ్యూసర్‌గా ఉండగా అసిస్ట్ చేసానో అదే తెలుగు విభాగానికి నేను అధిపతిని కావడం ఆనందదాయకమేకదా!


డా.సి.నారాయణ రెడ్డిగారితో

తెలుగులో జ్ఞానపీఠ అవార్డు గ్రహీతులయిన ముగ్గురు ప్రముఖులతోనూ సంబంధం కలిగి ఉండటం నాకు ఎంతో సంతోషం కలిగించే సంగతి. తొలి తెలుగు జ్ఞాపీఠమైన విశ్వనాథ వారిని హైదరాబాద్ కృష్ణదేవరాయ ఆంధ్రభాషా నిలయంలో జ్ఞానపీఠం వచ్చిన సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రసంగాలను రికార్డు చేయటానికి రేడియో తరుఫున నేను వెళ్ళినవాడిని. విశ్వంభరా జ్ఞానపీఠకవి డా.సి.నారాయణ రెడ్డిగారికి ఎం.ఎ, ఎం.ఫిల్ తరగతుల్లో ప్రత్యక్ష విద్యార్థిని ఆయన పాఠాలు చెప్పిన గురువుగారు. అనేక సభల్లో వారితో వేదిక పంచుకునే అవకాశాలు లభించాయి. అలాగే భరద్వాజగారికి రేడియోలో సహాయకునిగా పనిచేశాను.


UNITED ARTISTS' SYNDICATE, Hyderabad
Cordially extends an invitation to attend with family and friends the Book Release function on 15-3-97 ( Saturday)

Shri G.S.R. Anjaneyulu garu, Director
(State Bank Institute of Information and Communication Management, Hyderabad)
has kindly consented to release the Book.
"Tips & Techniques on Cartooning" by B.V.Satya Murty,
(Cartoonist, Graphic Designer & Advertising Consultant)

Shri Jandhyala garu, (Eminent Producer, Director and Humorous Writer)
has kindly agreed to be the Chief Guest

Shri C.Kanakambara Raju garu,
(Senior Journalist and Eminent Writer)
will preside over the function.

Shri Sudhama garu,
(Programme Executive, All India Radio, Hyderabad)
and
Shri Chandra garu,
(Artist, Illustrator & Writer)
will speak on the occasion.

Venue & Time :
City Central Library
Ashok Nagar,
Chikkadpally,
at 6:00 P.M.

Kindly make the Function A grand Success

V.V. Satya Prasad : Secretary (UAS)
S.V. Sai Bhaskar : President (UAS)

1997లో జాతీయ కవి సమ్మేళనంలో పాల్గొని వచ్చాక ఆ ఏటి తెలుగుకవి ఐలేనిగిరి నాకు రాసిన లేఖ ఓ సంతోష వీచిక. రేడియోలో కవులకూ, కథకులకే కాదు కార్యక్రమాలలో వీలున్నప్పుడల్లా కార్టూనిస్టులనూ,

చిత్రకారులను కూడా ఆహ్వానించే అవకాశాలుండేలా రూపొందించేవాడిని. బాపు ఏకలవ్య శిష్యత్వం తప్ప కార్టూనింగ్‌లోగానీ, చిత్రకళలోగానీ ఏమీ నేర్చినవాడిని, డ్రాయింగ్ స్కూల్స్‌కు వెళ్ళిన వాడినీకాను. నాదంటూ ఒక రేఖ సంతరించుకోకున్నా ఇప్పటికీ కార్టూనిస్టుగా ఇంకా నన్ను గుర్తిస్తూండడం ఆనందం కల్గిస్తుంది. ముఖ్యంగా కార్టూన్ల గురించి సైద్ధాంతిక వ్యాసాలు, ప్రసంగాలు చేయడం కూడా ఓ కారణమై ఉండవచ్చు దానికి. 1997 మార్చిలో కార్టూన్లు గీయడం ఎలా అని ప్రముఖ కార్టూనిస్టు బి.వి.సత్యమూర్తిగారు ఆంగ్లంలో 'TIPS & TECHNIQUES ON CARTOONING అనే పుస్తకం ప్రచురించి ప్రముఖ హాస్యదర్శకులు జంధ్యాలగారితో అవిష్కరింపచేసినప్పుడు ఆ సభలో నేను, చంద్రయే ప్రముఖ ప్రసంగాలు చేశాం.

డైరెక్టరేట్ ఆఫ్ ఆకాశవాణి ఆదేశాల ప్రకారం శ్రోతలు పంపిన జోక్స్‌తో ఓ కార్యక్రమం రూపొందించి ప్రసారం చేయమన్నప్పుడు అందుకే ఆ కార్యక్రమం నిర్వహణా బాధ్యతను డైరెక్టర్‌గారు నాకు అప్పచెప్పారు. చిత్రకళా సంబంధిత చర్చలు కూడా ప్రసారం చేసిన సందర్భాలున్నాయి. 'హ్యూమరసం' పేర నా నిర్వహణలో కొన్నాళ్ళు వారం వారం ప్రసారమైన హాస్య కార్యక్రమం శ్రోతలను బాగా ఆకట్టుకుంది. నేటి ప్రముఖ కార్టూనిస్టు 'సరసి'చే అప్పట్లో ఆ కార్యక్రమం రూపొందింపచేయడమూ మంచి జ్ఞాపకమే.

శ్రీ కబీర్ అహ్మద్‌గారు స్టేషన్ డైరెక్టర్‌గా ఉన్న కాలంలోనే 1997 మేలో సొంతగూడు నేర్పరుచుకోగలగడం, అలాగే 1997 అక్టోబర్‌లో 'రివైజ్‌డ్ పేరూల్స్ 1997' ప్రకారం జీతం 'ఫిక్సేషన్' జరగడం జీవితంలో చిరు అభివృద్ధికర అంశాలుగానే చెప్పుకోవాలి. 'సొంతగూడు' ఏర్పడడంతో - నా 'పుస్తకాల సంసారానికి' ఓ భద్రత ఏర్పడింది. హాలులో ఓ వైపంతా విశాలమైన 'గూడు'లు



ఉండడం చూసే, అసలు అపార్ట్‌మెంట్ ఫ్లాట్ కొనుగోలుకు మొజుపడడం జరిగింది. నెమ్మదిమీద ఉడ్‌వర్క్ చేయించుకోవచ్చని భావించి, తదనంతర కాలంలో ఆ 'ముచ్చటా' తీర్చుకోవడం వీలయ్యింది. శ్రీ కబీర్‌గారు అచంచల విశ్వాసం ఉంచి ఫ్రీ హ్యాండ్ ఇవ్వడం వలన తెలుగు విభాగం ద్వారా మంచి మంచి కార్యక్రమాలు రూపొందించి ప్రసారం చేయడం జరిగింది. ఆకాశవాణి లైబ్రేరీలో 'రెండుర్యాక్'లు ఉండే తెలుగువిభాగం ప్రోగ్రాం టేప్స్ మూడుర్యాక్‌లు వరకూ పెరిగాయి. అలాగే సంస్కృతవిభాగం 'అమరవాణి' కార్యక్రమాలు కూడా నేనే చూశాను. ముఖ్యంగా 'సంస్కృతపాఠాలను' కేవలం 'కాదంబరి', 'రఘువంశం' అంటూ కాక నిత్యజీవితంలో సంస్కృతంలో సంభాషించే తీరు తెన్నులకు వీలుగా ఒకరోజు పాఠాలను 'నిత్యవ్యవహార సంస్కృతం'గా మలచడం జరిగింది. అందుకు ఆనందించి మహామహోపాధ్యాయ శ్రీ పుల్లెల శ్రీరామచంద్రుడు, డా.రవ్వా శ్రీహరి వంటి వారలు' కూడా ఎంతో సహకారం అందించారు. రైల్వేస్టేషన్లో, కూరగాయల మార్కెట్లో, ఇంట్లో బంధువుల వద్దా సంస్కృత సంభాషణం చేసుకునేలా సరళ సంస్కృత పాఠాలతో శ్రోతలను ఆకట్టుకోవడం జరిగింది. సంస్కృతం మీద ఆసక్తితో ఎం.ఏ చేసి డాక్టరేట్ కూడా చేసిన రాష్ట్ర పోలీసు అధికారి శ్రీ అరవిందరావుగారిని ఉస్మానియా విశ్వవిద్యాలయం సంస్కృతోపన్యాసకులు నీలకంఠంగారిచేత 'అమరవాణి'లో సంస్కృతంలోనే పరిచయ కార్యక్రమం ప్రసారం చేయడం ఓ తీయని జ్ఞాపకమే.


ఆంధ్రభూమి
సోమవారం 16 నవంబర్ 1998
సంసారాలు

రేడియోలో 'కాలం' వినియోగించే సామర్థ్యం ఒక ఎత్తయితే పత్రికల్లో 'కాలమ్' నిర్వహించడం ఒక ఎత్తు. కాలేజీలో చదువుకునే రోజుల్లోనే అప్పట్లో చుక్కాని వారపత్రికలో 'గుసగుసలు', 'డైరీలో ఓ పేజీ' (1970 ప్రాంతాలలో) ఆ తరువాత ఉదయం దినపత్రిక 1985లో మొదలైనప్పుడు మొదటిసారి ఓ దినపత్రికలో 'హ్యామర్‌మరాలు' 'పదమవ్యూహం' (పజిల్) శీర్షికగా నిర్వహించాను. అలాగే 'సితార' సినీ వారపత్రికలో 'సినీటాక్', 'టాకీవాకీ' వంటి కాలమ్స్ నడిపాను. అయితే అవన్నీ రెండుమూడేళ్ళ కాలపరిమితిలో సాగినవి. 1998లో దసరాల వేళ డెక్కన్ క్రానికల్ గ్రూప్ తెలుగు దినపత్రిక ఆంధ్రభూమి నుండి రామ్‌లాల్ అనే సబ్‌ఎడిటర్ ఆకాశవాణికి వచ్చి నన్ను కలిసి "మా ఎడిటర్‌గారు ఎం.వి.ఆర్. శాస్త్రిగారు మిమ్మల్ని ఒకసారి రమ్మనమన్నారు. పత్రికలో కొత్తమార్పులు, శీర్షికల గురించి ఆలోచిస్తున్నారు" అన్నాడు. ఆంధ్రభూమి ఆఫీస్ సికింద్రాబాద్‌లో ఉందని తెలుసుగానీ ఏ పత్రికా కార్యాలయాలకూ వెళ్ళే అలవాటు అంతగా లేనివాడిని అప్పుడు. పైగా 'సికరాజు'తో ముడిపడిన ఆంధ్రభూమి మీద అప్పట్లో నాకంత సదభిప్రాయమూ ఉండేది కాదు. కానీ రామ్‌లాలే ఓ శనివారం ఆఫీసులో కలుసుకుని స్వయంగా ఆంధ్రభూమికి తీసుకువెళ్ళి ఎం.వి.ఆర్ శాస్త్రిగారిని పరిచయం చేశాడు. ఒక 'లైటర్‌వీన్' కాలమ్‌గా వారం వారం ఏదయినా రాయమని శాస్త్రిగారు అడిగారు. సరదాగా అలా 'సం.సా.రాలు' అంటే సంస్కృతి, సాహిత్యం, రాజకీయాలు అంటూ రాసినది చూసి 'సుధామ చిలికించే కొత్త శీర్షిక. మామూలైన అల అలవరుసలతో.. ఇలవరసల ఇంటింటి సరదా' అని ప్రకటించి నవంబరు 16, 1998 సోమవారం ఎడిట్ పేజీ మిడిల్ కాలమ్‌గా నా శీర్షిక 'సం.సా.రా.లు' మొదలైంది. ఆ తరువాత వారంతపు శీర్షికగా శనివారాల్లో, నేను వరంగల్‌లో ఉద్యోగించిన కాలంలో 'మంగళవారాల్లో' ప్రస్తుతం ఇప్పటికీ 'శుక్రవారాల్లో' (మధ్యలో ఓ ఏడాదిపైగా కొంత విరామం వచ్చినా) సాగుతున్న 'కాలమ్' నా 'సం.సా.రా.లు' ఇంత సుదీర్ఘ కాలం నేను నిర్వహిస్తూవస్తున్న రచన ఏదయినా ఉంటే ఈ 'కాలమ్'. వారం వారం ఫోన్లు చేసేవారు, ఉత్తరాలు రాసేవారు, పలకరించేవారు 'సంసారాలు'కు అభిమానులైన పాఠకులున్నారు.

విద్యార్థి దశనుండి గణించుకుంటే వచ్చే ఏడాది 2015కు నా సాహిత్య వ్యాసంగానికి స్వర్ణోత్సవం. అయితే పుస్తకాలు




వేసుకోవడం ముందునుండీ పెద్ద శ్రద్ధలేదు. అప్పట్లో ఆర్థికవనరుల లోపం సరేసరి! 1990లో నా తొలి కవితాసంకలనం 'అగ్నిసుధ' వెలువడగా 2001లో పదకొండేళ్ళ తర్వాత అప్పటివరకూ వచ్చిన కాలమ్ వ్యాసాలనుండి ఓ యాభై ఎంపిక వ్యాసాలతో 'సం.సా.రా.లు' ముద్రించాను. అదికూడా నా యాభైవ పుట్టినరోజు సందర్భంగా నవంబర్‌లో మిత్రుడు డా.నాళేశ్వరం శంకరం పట్టుదల సహాయసహకారాలతో ముద్రించిందే. 2004లో తెలుగు విశ్వవిద్యాలయం సాహిత్య పురస్కారాలులో 'ఇతరాలు' విభాగంలో సంసారాలుకు అవార్డు లభించి ఓ 'కాలమ్'కు కూడా ఇంతటి గుర్తింపు లభించగలదన్న సంతోషాన్ని సొంతం చేసింది. నన్ను ఒక 'కాలమిస్టు'గా స్థిరీకరించింది.




కేంద్రప్రభుత్వ ఉద్యోగులకు ఎల్.టి.సి (లీవ్‌ట్రావల్ కన్సెషన్) అనే సౌకర్యం ఉంది. నాలుగేళ్ళకోసారి దేశంలో ఎక్కడికయినా కుటుంబ సమేతంగా వెళ్ళిరావచ్చు. కానీ నా సర్వీస్ మొత్తంలో ఆ అవకాశాన్ని తక్కువగా వినియోగించుకున్నది నేనేనేమో!

ఎలాగయితేనేం 1998లో నేను, ఉష మా అబ్బాయి స్నేహిత్ ఏప్రిల్ నెలాఖరు వేసవిలో 'ఊటీ'కి వెళ్ళివచ్చాం. 1997 నవంబర్ 14 నుండి - 23 వరకు హైదరాబాద్‌లో జరిగిన 10వ ఇంటర్నేషనల్ చిల్డ్రన్స్ ఫిలిం ఫెస్టివల్ సందర్భంగా మా స్నేహిత్ వెలిబుచ్చిన కోరిక అలా 98లో తీర్చగలిగాను. చిల్డ్రన్స్ ఫిలిం ఫెస్టివల్‌ను రేడియోద్వారా 1997లోనే మొదటిసారి విస్తృతంగా కవర్

చేయడంలో పాలుపంచుకునే అవకాశం నాకు లభించింది.

రేడియో మాధ్యమంలో ఎఫ్.ఎం.ల హవా మొదలయ్యింది. ప్రైవేట్ రేడియో ఛానెళ్ళకు ప్రభుత్వం అనుమతి నివ్వడం మొదలుపెట్టింది. ఉన్న ఆకాశవాణి కేంద్రాలకు అదనంగా ఎఫ్.ఎం. ఛానెళ్ళను అందునా మెట్రో ఎఫ్.ఎంల గురించి ప్రసారభారతి ఉద్యుక్తమైంది. అందుకోసం ఎఫ్.ఎం. మెట్రో సాఫ్ట్‌వేర్‌లో ఎంపిక చేసిన కొందరు కార్యక్రమ నిర్వహణాధికారులకు ఢిల్లీలో ట్రైనింగ్ తలపెట్టింది. 1999 జూలైలో జరిగిన అయిదురోజుల ఆ ప్రత్యేక వర్క్‌షాప్‌కు. హైదరాబాద్ నుండి నేను వెళ్ళడం జరిగింది. చెన్నయ్, ముంబయ్, బెంగుళూర్, ఢిల్లీ, కటక్, వారణాశి, త్రివేంద్రం పాండిచ్చేరి మొదలైన ప్రాంతాలనుండి కార్యక్రమ నిర్వహణాధికారులం ఆ వర్క్‌షాప్‌లో కలుసుకున్నాం. మెట్రో ఎఫ్.ఎం కార్యక్రమాలు ఎలా ఉండాలి అన్నది చర్చించారు. యువతను ఆకట్టుకునేలా ఎఫ్.ఎం ప్రసారాల రూపకల్పన గురించిన ప్రణాళికలు వేసారు.




WORKSHOP ON FM/METRO SOFTWARE
26 th TO 30 th JULY 1999 AT STI(P) DELHI

SITTING (L-R) : A.N.GOEL(PEX), S.M.PANDHI(ASD), K.C.MALHOTRA(DD), P.P.SETIA(DIR.), M.D.GAIKWAD(DDG,P), J.K.DAS(CP) ANIL K. RAM(DD)

STANDING(L-R) IST : RAMGOPAL(MATHURA), M.R.CH...LA(PATIALA), G.R. RATAN PRUI(R.K. SRINAGAR), USHA VISWASRAO(CBS MUMBAI), A.VENKATA RAO(HYDERABAD), RAJAT SEN GUPTA (RAIPUR), K.S.DASGUPTA(CALCUTTA), S.K.PARIH ARI(JALANDHAR) T.SIDDARTHAN(CHENNAI), T.P.S. BALACHANDRAN(CHENNAI) CHANDRADEV PRASAD(RANCHI)

IInd ROW MADAN LAL MEENA(ALWAR), SAYED KAWSAR JAMAL(AGARTALA) SURESH CHANDRA DAS (PURI), DR. S.K. MISHRA (VARANASI), G. VIJAYA KUMAR (KURNOOL), N. TAMIL VANAN (TIRUCHIRAPALLI) S.K. DEODHAR (CHHATRAPUR), DR. U.S. JHA (SASARAM) G.K. RAVENDRA KUMAR (KARWAR), C.D. PRASAD (RANCHI),

IIIrd ROW VARUN (STIP), SAJAN VENIYOOR (PANAJI), SANTOSH K. ROY (PORT-BLAIR), MRITUNJAY SAMAL (CUTTAK), SIVA PRAGSAM (PONDICHERY), DANISH IQBAL(N. DELHI), M.L. VYAS(GODHRA)


प्रसार भारती
(भारतीय प्रसारण निगम)
आकाशवाणी
कर्मचारी प्रशिक्षण संस्थान (कार्यक्रम)

प्रमाणित किया जाता है कि
श्री ए. वैंकट राव
ने इस संस्थान द्वारा आयोजित
एफ./एम. मैट्रो साफ्टवेयर पर कार्यशाला
में प्रशिक्षण प्राप्त किया। यह कार्यक्रम
दिल्ली
में 26/7/99 से 30/7/99 तक सम्पन्न हुआ।

PRASAR BHARATI
(Broadcasting Corporation of India)
ALL INDIA RADIO
STAFF TRAINING INSTITUTE (PROGRAMMES)

This is to certify that
SHRI A. VENKATA RAO, PROGRAMME EXECUTIVE
attended
WORKSHOP ON FM/METRO SOFTWARE
Organised by this institute at
DELHI
from 26.07.99 to 30.07.99

दिल्ली
Delhi
30.07.99

(P.P.SETIA)
निदेशक
Director






# 54

**ఎఫ్.ఎం మెట్రో ట్రైనింగ్‌కు ఢిల్లీ వెళ్ళడం** గురించి ప్రస్తావించాను కదా! దానికి ముందే ఒక విషయం చెప్పుకోవాలి. కేంద్రప్రభుత్వం ప్రైవేట్ రేడియో, టీవీ ఛానెల్స్ పెట్టుకోవడానికి లైసెన్స్‌లు మంజూరు చేయడం మొదలుపెట్టడం, నిజానికి ప్రసారరంగంలో తనకు తనే పోటీ తెచ్చుకోవడం కాదా అని భావించినవారున్నారు. రేడియో, టీవీలుగా ఆకాశవాణి, దూరదర్శన్ ప్రభుత్వ బాకాలుగా పడిన ముద్ర ప్రసారభారతి నెలకొనడంతో ఏమీ మాసిపోలేదు. ఆకాశవాణి దూరదర్శన్‌లకు స్వయం ప్రతిపత్తి కల్పించే సంకల్పంతో 1997 సెప్టెంబర్‘15 నుండి ప్రసారభారతి అమల్లోకి వచ్చేట్లుగా యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం శ్రీ ఐ.కె.గుజ్రాల్ ప్రధానిగా ఉండగా సమాచార ప్రసారశాఖా మంత్రిగా ఉన్న శ్రీ ఎస్. జైపాల్‌రెడ్డి ప్రకటించారు. అనంతరం శ్రీ నిఖిల్ చక్రవర్తి అధ్యక్షులుగా ప్రసారభారతి బోర్డు ఏర్పాటయింది. శ్రీ ఎస్.ఎస్.గిల్ సి.ఇ.ఓ (ఛీఫ్ ఎక్జిక్యూటివ్ ఆఫీసర్)గా శ్రీయుతులు బి.జి.వర్గీస్, డా. అబిద్ హుస్సేన్, ప్రొఫెసర్ యు.పి.రావ్, డా.రొమిల్లా థాపర్, శ్రీ రాజేంద్రయాదవ్, శ్రీ ఎ.పద్మనాభన్ సభ్యులుగా తొలి ప్రసారభారతి బోర్డుకు నియమితులయ్యారు. అప్పుడు దూరదర్శన్ డైరెక్టర్ జనరల్‌గా ఉన్న శ్రీకె.ఎస్.శర్మ, ఆకాశవాణి డైరెక్టర్ జనరల్ డా.ఓ.పి.కేజరేవాల్ ప్రసారభారతి బోర్డుకు ఎక్స్ అఫీషియో సభ్యులుగా నియమితులు కాగా, ప్రభుత్వ ప్రతినిధిగా సమాచార ప్రసార మంత్రిత్వశాఖ అడిషనల్ సెక్రటరీ శ్రీవి.కె.మల్హోత్రా ఉన్నారు.


శ్రీ ఎస్.ఎస్.గిల్


శ్రీకె.ఎస్.శర్మ

కేంద్రంలో వాజ్‌పేయ్ ప్రభుత్వం వచ్చాక ప్రసారభారతి సి.ఇ.ఓ పోస్ట్‌కు వయస్సు 62 దాటకూడదని నిర్ణయించాక 1998లో ఎస్.ఎస్.గిల్ తొలగవలసి వచ్చింది. ఆ తర్వాత కేంద్రసమాచార ప్రసార మంత్రిత్వశాఖలో అడిషనల్ సెక్రటరీగా ఉండిన అనిల్ బైజాల్‌గారు తాత్కాలికంగా ఆ పదవిలో ఉన్నారు. నిజానికి ఒక పర్మనెంట్ సి.ఇ.ఓ.గా ప్రసారభారతికి నాలుగేళ్ళ తరవాత కృష్ణకాంత్ ఉపరాష్ట్రపతిగా నియామకం

చేసిన వ్యక్తి శ్రీకె.ఎస్.శర్మగారు. 1968 బ్యాచ్ ఐ.ఏ.ఎస్ ఆఫీసర్ అయిన శర్మగారు తెలుగువారు. 1996 నుండి 1998 వరకు దూరదర్శన్ డైరెక్టర్ జనరల్‌గాను, బ్రాడ్ కాస్టింగ్ జాయింట్ సెక్రెటరీగానూ చేశారు. ఆయన డి.జి.గా ఉండగానే దూరదర్శన్ కార్యక్రమాలకు అత్యధిక ప్రజాదరణ వీక్షణతో పాపులారిటీ లభించింది. ఆయన సి.ఇ.ఓ అయినది మటుకు 2002లో అనుకోండి.

ఇంతకీ చెప్పవచ్చే విషయం ప్రైవేట్ రేడియోలకు అవకాశం కల్పించాక, అందునా టీ.వీ ప్రైవేట్ ఛానెల్స్ ముఖ్యంగా ఈ.టీవి వంటివి రంగప్రవేశం చేయడంతోనే రేడియో, దూరదర్శన్‌ల కళాకాంతుల సంగతి ఎలా ఉన్నా జనంలో ఆదరణ, ప్రభావం మందగిస్తూ వచ్చాయన్నమాట అంగీకరించ తప్పనిదే ఆకాశవాణి కూడా ఎఫ్.ఎంల పట్ల అనివార్యంగా ప్రత్యేకశ్రద్ధ పెట్టింది. ఎల్.ఆర్.ఎస్‌లు అంటే లోకల్ రేడియో స్టేషన్లు ఎఫ్.ఎం. బ్యాండ్లమీదనే పనిచేస్తున్నా నగరాల్లో కూడా ఎఫ్.ఎం. మెట్రో ఛానెల్స్ ఆవశ్యకత గుర్తించింది. అందులో భాగంగానే జూలై '99లో జరిగిన శిక్షణా కార్యక్రమం కూడాను.

నిజానికి మంచి యంగ్ పెక్స్‌లను అందునిమిత్తం పంపితే బాగుండేది. కానీ అప్పటికే నలభై ఏళ్ళలోపు పెక్స్‌లే ఆకాశవాణి కేంద్రాలలో లేకుండాపోయారు. యాభైలకు దగ్గరకు పడుతున్న మా బోటివారిలోనే ఉత్సాహశీలురు ఇంకా ఉన్నారు. ఎఫ్.ఎం మెట్రో సాఫ్ట్‌వేర్ ఢిల్లీ ట్రైనింగ్‌లో బెటర్ హార్డ్‌వేర్ ఫర్ బెటర్ సాఫ్ట్‌వేర్, స్ట్రక్చరింగ్ ప్రోగ్రామ్స్ టు సూట్ పీపుల్స్‌నీడ్, మెట్రోఛానల్ ఎ ఛానల్ ఫర్ ఆల్, ఇన్ఫొటైన్‌మెంట్ నారోకాస్టింగ్ ది ఎల్ ఆర్ ఎస్ మంత్ర, ప్రెజెంటేషన్ ఎఫ్ ఎం స్టైల్, సెల్లింగ్ ద ప్రోగ్రామ్స్, ఫ్యూజింగ్ కమర్షియలిజమ్ అండ్ పబ్లిక్ బ్రాడ్‌కాస్ట్, పీపుల్ పార్టిసిపేటరీ ప్రోగ్రామ్స్ మొదలైన అంశాలపై శిక్షణా తరగతులు ప్రాక్టికల్స్ సాగాయి.

శ్రీ కబీర్ అహ్మద్‌గారు డైరెక్టర్‌గా ఉండగానే ఈ శిక్షణకు నాపేరు ప్రతిపాదన పంపబడిందిగానీ కబీర్‌గారు 1999 ఏప్రిల్ 30న రిటైరయ్యారు. ఆయనకూ ఎక్స్‌టెన్షన్ ఏమీరాలేదు. అసలు వి.వి.శాస్త్రిగారి తర్వాత అప్పట్లో మద్రాస్‌లో ఉన్న శ్రీమతి దుర్గాభాస్కర్‌గారే హైదరాబాద్ డైరెక్టర్‌గా వస్తారనుకున్నారుగానీ కబీర్‌గారు రిటైరయ్యాక శ్రీమతి దుర్గాభాస్కర్‌గారినే స్టేషన్ డైరెక్టర్‌గా ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రానికి పోస్ట్ చేశారు. గతంలోనే ఒకసారి ఆవిడ హైదరాబాద్ వచ్చి ఇక్కడ ఆకాశవాణిలో పనితీరు ఎలా ఉంటుంది అని వాకబ్ చేసుకుని వెళ్ళారు కూడాను.

దుర్గాభాస్కర్‌గారు వస్తున్నారు అనేసరికి అంతకుముందు ఆవిడతో విజయవాడ కేంద్రంలో నాబోటివాళ్ళం పనిచేసిన అనుభవం ఉంది కనుక హైదరాబాద్ స్టాఫ్ చాలామంది ఆవిడ గురించి మమ్మల్ని వాకబు చేశారు కూడాను. ఆవిడకు కొంత 'స్ట్రిక్ట్' అనీ, 'పట్టు' తప్ప అంతగా విడుపులేని వారనీ అప్పటికే కొందరనుకుంటూండేవారు. శ్రీ కబీర్‌గారు రిటైరయాక మే 5, 1999న దుర్గాభాస్కర్ గారు డైరెక్టర్‌గా ఛార్జి తీసుకున్నారు. డా.కె.బి.గోపాలం డిప్యూటీ డైరెక్టర్‌గా, శ్రీ కె.ఎం.శర్మ, టి.ఆర్.జి కృష్ణమాచార్యులు, ఇ.ఎల్.నారాయణ అసిస్టెంట్ డైరెక్టర్లుగానూ ఆవిడ చేరేటప్పటికి ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో ఉన్నారు. దుర్గాభాస్కర్‌గారి హయాంలోనే దూరదర్శన్ నుంచి ప్రొడ్యూసర్లుగా ఉండి ప్రమోషన్ కోసం అనివార్యంగా ఆకాశవాణికి వచ్చినవారు శ్రీమతి మల్లాది శైలజా సుమన్, శ్రీ బి.వెంకట్రావ్‌గారలు. ఆకాశవాణికి వచ్చాకే అసిస్టెంట్ డైరెక్టర్లుగా, డిప్యూటీ డైరెక్టర్లుగా, పదోన్నతులు పొందారు వారు. దూరదర్శన్‌లో చాలాకాలం చేసినవారికి ఆకాశవాణిలో, ఆకాశవాణి వారికి దూరదర్శన్‌లో పనితీరు కొత్తలో కొత్తగానే ఉంటుంది. బ్రాడ్‌కాస్ట్‌కు, టెలికాస్ట్‌కు వ్యత్యాసం ఉందికదా!


శ్రీ బి.వెంకట్రావ్


శ్రీమతి మల్లాది శైలజా సుమన్

శ్రీమతి దుర్గాభాస్కర్‌గారు మేలో బాధ్యతలు చేపట్టాకే జూలైలో నేను ఎఫ్.ఎం ట్రైనింగ్‌కు వెళ్ళిరావడం జరిగింది. సాధారణంగా యాభైలు దాటినవారిని ట్రైనింగ్‌లకు పంపడం తగ్గించాలని ఓ నియమం ఉంది. 2001కు నాకు యాభై ఏళ్ళు నిండుతాయి కనుక ఈలోగానే వచ్చిన ట్రైనింగ్ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నది నా సంకల్పం.

జూలైలో ఢిల్లీ ట్రైనింగ్ నుండి రాగానే ఆగస్టులో హైదరాబాద్ రీజనల్ ట్రైనింగ్ సెంటర్‌లో అయిదురోజుల 'ఓరియంటేషన్ కోర్స్ ఆన్ రేడియో డ్రామా' శిక్షణలో పాల్గొన్నాను. ఆకాశవాణిలో నాటక విభాగానికి నేను ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్‌గా ఎన్నడూ పనిచేయలేదు. కానీ రేడియోనాటకాలు రాయడంలో, నాటకాల్లో పాత్ర/గాత్రధారణ చేయడంలో, కొన్ని నాటకాలను ప్రొడ్యూస్ చేయడంలోనూ నా పాత్ర ఉంది. 'బి' హై గ్రేడ్ డ్రామా వాయిస్‌గా గుర్తింపు పొందిన వాడిని నేను. ఆడిషన్‌లో అలా గ్రేడ్‌వున్నా రేడియో నాటకంలో పాలుపంచుకోమన్న ఆహ్వానం రిటైరయ్యాక నాకు రానూలేదు. ఇంతవరకూ నేను అడగనూలేదు.


प्रसार भारती
PRASAR BHARATI
BROADCASTING CORPORATION OF INDIA
आकाशवाणी
ALL INDIA RADIO
क्षेत्रीय प्रशिक्षण संस्थान (कार्यक्रम)
REGIONAL TRAINING INSTITUTE (PROGRAMMES)

प्रमाणित किया जाता है कि / This is to certify that
ए. वेंकटराव / A. Venkata Rao
ने इस संस्थान द्वारा आयोजित / attended a Course on
रेडियो नाटकों पर अनुस्थापन पाठ्यक्रम / Orientation Course on Radio Drama
में प्रशिक्षण प्राप्त किया। यह कार्यक्रम / organised by this institute at
क्षेत्रीय प्रशिक्षण संस्थान, आकाशवाणी, हैदराबाद / RTI(P), AIR, Hyderabad
में 9-8-99 से 13-8-99 तक सम्पन्न हुआ। / from 9-8-99 to 13-8-99

हैदराबाद
Hyderabad

उप निदेशक
Deputy Director




ఎక్కువగా తెలుగు విభాగంతోనే నా కెరీర్ ముడిపడి సాగింది. కానయితే డ్రామా విభాగానికి చెందిన నవలాస్రవంతి, హాస్యవల్లరి వంటి కార్యక్రమాలను ఆ విభాగం నుంచి నాచేత నిర్వహింపచేసిన డైరెక్టర్లు ఉన్నారు.

1999 సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా 20వ శతాబ్దానికి ఆఖరు సంవత్సరంగా, కొత్త శతాబ్ది 2000కు ఆహ్వానంగా గొప్ప సంరంభం జరిగింది. నిజానికి 1901 నుండి 2000 పూర్తయ్యేవరకు గల వందసంవత్సరాలు 20వ శతాబ్ది అయితే 2001 నుండి 21 వ శతాబ్దం మొదలవుతుంది. కానీ 2000 సంవత్సరమే కొత్తశతాబ్ది ఆరంభంగా గొప్ప సంరంభాలు జరిగాయి. కంప్యూటర్‌లో 31 డిసెంబర్ 1999 తరువాత 2000 ఎలా వస్తుందా అన్న ఉత్కంఠ ఆ రోజుల్లో తెగ చెలరేగింది కూడాను. నూతన శతాబ్దికి స్వాగతం పలకడానికి ముందు 1999ను 20 వ శతాబ్ది వీడ్కోలు సంవత్సరంగా శతాబ్ది సింహావలోకన కార్యక్రమాలకు రూపకల్పన చేశా. అందులో భాగంగానే నేను తెలుగు విభాగం కార్యనిర్వహణాధికారిగా 'నూరేళ్ళ తెలుగు వెలుగులు', 'మహతి' అనే ధారావాహిక కార్యక్రమాలు రూపకల్పన చేసి ప్రసారం చేశాను. పదమూడు భాగాల ధారావాహికలుగా కవిత్వం, విమర్శ, కళల గురించి ప్రసంగమాలికలను నిర్వహించడమైంది.

డా.జి.వి సుబ్రహ్మణ్యం, డా.డి.చంద్రశేఖర రెడ్డి, ఆర్వియార్, చలసాని ప్రసాద్, ఇంద్రగంటి శ్రీకాంత శర్మ వంటివారు 'నూరేళ్ళ తెలుగు వెలుగులు,' 'మహతి' పరంపరలకు తమ సహకారం అందించారు. వారి రేడియో ప్రసంగ వ్యాసాలను అనంతర కాలంలో గ్రంథరూపేణా వెలువరించారు కూడాను. విశ్వసాహిత్య విమర్శ గురించి డా.జి.వి సుబ్రహ్మణ్యంగారు, తెలుగులో నూరేళ్ళ విమర్శపై తెలుగు విమర్శకుల గురించి డా.డి.చంద్రశేఖరరెడ్డి, అలాగే చిత్రశిల్పకళల నూరేళ్ళ పరిణామం గురించి చలసాని ప్రసాద్ విలువైన ప్రసంగాలు అందించారు. చలసాని ప్రసాద్ (చతుర, విపుల ఈనాడు గ్రూప్ పత్రికల ఎడిటర్) గారి స్క్రిప్టులను శ్రోతలకు నా గళంలోనే అందించడం ఒక విలువైన జ్ఞాపకమే.

శ్రీమతి దుర్గాభాస్కర్ హైదరాబాద్ స్టేషన్ డైరెక్టర్‌గా కుదురుకోగానే అంతకు ముందు విజయవాడ కేంద్ర అనుభవంతో ఇక్కడా పబ్లిసిటీ విభాగం అనేది ప్రత్యేకంగా ఏర్పరచి దాని నిర్వహణా బాధ్యతలను నాకే అప్పగించారు. ప్రముఖులు కేంద్రానికి విచ్చేసినప్పుడు, ప్రత్యేక కార్యక్రమాల రికార్డింగులు జరిగినప్పుడు ఫోటోలు తీయించడం వాటిని ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం ప్రవేశ ప్రాంగణంలో ప్రముఖంగా ప్రదర్శిస్తూండడం, ఆల్బమ్ రూపొందించడం, అలాగే ప్రెస్ క్లిప్పింగ్స్‌ను డిస్‌ప్లే చేయడం వంటి అదనపు పనులు తెలుగు

విభాగం నిర్వహణతో బాటు నిర్వహిస్తూండేవాడిని అయితే ఆ ఛాయాచిత్రప్రదర్శనను వీక్షించిన వారు అభినందిస్తూండడం, వారం వారం కొత్త ఫోటోల డిస్ప్లే కోసం అంతా ఆసక్తిగా ఎదురుచూస్తూండడం నాకు సంతోషం కలిగిస్తూండేది.

1999 సెప్టెంబర్ 5 నుండి అక్టోబర్ 3 వరకు దేశంలో సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. 1999 ఏప్రిల్ 17న అటల్ బిహారీ వాజ్‌పేయ్ నేతృత్వంలోని (బి.జె.పి) ప్రభుత్వం విశ్వాస తీర్మానం నెగ్గలేకపోవడానికి ఒక్క ఓటు కారణమైంది. జయలలిత మద్దతు ఉపసంహరించుకుంది. లోక్‌సభ నిర్వహించే సంఖ్యాబలం నాటి ప్రతిపక్షనేత సోనియాగాంధీ కూడా కూడబెట్టుకోలేకపోవడంతో నాటి రాష్ట్రపతి కె.ఆర్.నారాయణన్ పార్లమెంటును రద్దుచేసి ఎన్నికలు ప్రకటించారు. 1999లో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీకి ఎన్నికలు జరిగాయి. ఎన్.టి.ఆర్ అస్తమయం తర్వాత రాష్ట్రంలో జరిగిన తొలి అసెంబ్లీ ఎన్నికలయినా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలోని తెలుగుదేశమే, అధికారంలోకి వచ్చింది. వై.ఎస్ రాజశేఖర రెడ్డి ప్రతిపక్షనేతగా కాంగ్రెస్ పక్షాన నిలిచారు. కేంద్రంలో తెలుగుదేశం మద్దతుతోనే ఎన్.డి.ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వాజ్‌పేయ్ మరల ప్రధాని అయ్యారు. 13 అక్టోబరు 1999న మూడోపర్యాయం ప్రధానిగా అటల్‌జీ ప్రమాణ స్వీకారం చేశారు. సోనియా లోక్‌సభలో, మన్మోహన్ సింగ్ రాజ్యసభలో మళ్ళీ ప్రతిపక్షనేతలయ్యారు. అరుణ్‌జైట్లీ




స్టేట్‌మినిస్టర్‌గా ఇండిపెండెంట్ ఛార్జితో కేంద్ర సమాచారప్రసారశాఖా మంత్రిగా నియమితులయ్యారు. సెప్టెంబర్ 2000లో ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్ కాస్టింగ్ క్యాబినెట్ మినిస్టర్‌గా శ్రీమతి సుష్మాస్వరాజ్ నియమితులై జనవరి 2003 వరకూ ఆ పదవిలో కొనసాగారు. కేంద్రంలో సుష్మాస్వరాజ్, ఇక్కడ హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రంలో దుర్గాభాస్కర్ ఇద్దరు స్త్రీల సారథ్యమన్నమాట! ఫిబ్రవరి 2005లో రిటైరయ్యేంతవరకూ దుర్గాభాస్కర్‌గారు సుమారు ఆరేళ్ళపాటు అప్రతిహతంగా తన నిర్వహణను ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో కొనసాగించారు.

డిప్యూటీ డైరెక్టర్‌గా ఉండిన డా.కె.బి.గోపాలంగారు తన పదవి నుండి, ఆకాశవాణి నుండి తప్పుకోవలసి వచ్చింది. అంత స్థాయిలోకి వచ్చిన వ్యక్తి అలా తొలిగిపోవలసిరావడం ఒక శోచనీయ అంశమే. 2000 సంవత్సరం కొత్త శతాబ్ది ఆరంభంగా జరిగిన సంరంభంలో రేడియో కూడా తన వంతు పాత్రపోషించింది.

**కంటి చూపులం మింటి ఆశలం**

**అమ్మా నాన్నల కలల రూపులం పిల్లలం మేం పిల్లలం**

అంటూ రాబోవు యుగం దూతలుగా ఆ ఏడాది పిల్లల కార్యక్రమానికి నేను రాసిన పాట కె.రామాచారి స్వరపరచగా మంచి ప్రశంసలను అందుకుంది.

2000 సంవత్సరంలోనే శ్రోతలు పంపిన జోక్స్ ఆధారంగా ఒక హాస్యరస ప్రధానకార్యక్రమం వారం వారం ప్రసారం చేయాలన్న డైరెక్టరేట్ ఆదేశాలను అనుసరించి ఆ బాధ్యత నాకు అప్పచెప్పబడగా 'హ్యూమరసం' పేరిట ప్రతి బుధవారం రాత్రి ఎనిమిదిన్నరకు అనుకుంటా ఓ పావుగంట కార్యక్రమానికి రూపకల్పన చేసి సుమారు రెండేళ్ళు నేను నిర్వహించాను. జంధ్యాల, ఆదివిష్ణు, శంకరనారాయణలతో మొదలుపెట్టి శంకు, సరసి వంటి ప్రముఖ కార్టూనిస్టుల చేత కూడా రూపకల్పన చేయించి ప్రసారం చేయడం, నా తెలుగు విభాగానికి అసిస్ట్ చేసిన అనౌన్సర్ శ్రీమతి సాధన, శ్రీ మల్లాది చంద్రశేఖర్ ఆ కార్యక్రమానికి వెన్నుదన్నుగా నిలవడం, ఎందరో శ్రోతలు దానిని ప్రశంసించడం, సరిగ్గా ఆ టైంకు బయటకెళ్ళిన పిల్లలు



ఆదివిష్ణు






కూడా ఇల్లు చేరగా అంతా కలిసి కార్యక్రమం వింటూ హాయిగా భోంచేస్తున్నాం అంటూ పెద్దలు ఫోన్లు కూడా చేస్తూండటం జరిగేది. తలుచుకుంటే అదీ మధురానుభూతే!


శ్రీ కళాకృష్ణ

శ్రీమతి దుర్గాభాస్కర్ ముందు శ్రీ కళాకృష్ణను కోఆర్డినేషన్ పెక్స్‌గా చేశారు. కోఆర్డినేషన్ అనేది కత్తిమీద సాములాంటిదే సాటి కార్యక్రమ నిర్వహణాధికారులను కూడగట్టుకుంటూ అధికారులు చెప్పే పనులను వారికి సరిగా పంపిణీ చేసి నిర్వహింపచేస్తూ, డైరెక్టరేట్‌కు పంపవలసిన స్టేట్‌మెంట్స్ అవీ సక్రమంగా పంపుతూ, డ్యూటీరూమ్‌లో డ్యూటీ ఆఫీసర్లు, అనౌన్సర్ల విధుల బాధ్యతలు పర్యవేక్షిస్తూ, ప్రోగ్రాం అడ్వైజరీ కమిటీ, గ్రూప్‌ఫోర్ స్టేషన్ల కోఆర్డినేషన్ మీటింగ్స్ వంటివి నిర్వర్తిస్తూ ఒక అనుసంధాన కర్తగా వ్యవహరించడం జరిగేది. రోజువారీ మీటింగ్‌లో క్యూషీట్స్ చదవడం, ప్రసార కార్యక్రమాలు వివరాలు సరిచూడడం కూడా ఒక బాధ్యతే. ఈ నిర్వహణలో డైరెక్టర్ ఆగ్రహావేశాలకు గురికాకుండా చూసుకోవడం సామాన్యమైన సంగతేమీకాదు. నవ్వుతూ నవ్విస్తూ జోయల్‌గా ఉండే కళాకృష్ణ మేడమ్‌తో విభేదించే స్థితి రావడం విచిత్రమే. ఆ తరువాత అతను దూరదర్శన్‌కు ట్రాన్స్‌ఫర్‌కు ప్రయత్నించి అక్కడకు వెళ్ళిపోయాడు. ఆ తరువాత కళాకృష్ణ కోఆర్డినేషన్ నిర్వహిస్తున్నప్పుడు అదేదో అలవోకవ్యవహారం అనుకున్న జయపాల్‌రెడ్డికి ఆ బాధ్యతలు అప్పచెప్పబడ్డాయి. కో ఆర్డినేషన్ పెక్స్ కష్టనష్టాలు అప్పుడు తెలిసివచ్చాయి తనకు. ఆ తరువాత జయపాల్‌రెడ్డి కూడా వరంగల్‌కు ట్రాన్స్‌ఫర్ మీద వెళ్ళిపోయాడు. 2000 సంవత్సరం ప్రవేశించాక రెండుమూడేళ్ళలో జరిగిన పరిణామాలివి. స్టేషన్ డైరెక్టర్‌కు విశ్వాసపాత్రమైన కార్యనిర్వహణాధికారుల బృందంలో నా పేరూ ఉండటం ఆనందదాయకమే అయినా, అది ఎంతో బాధ్యతాయుతమైనదిగానూ, నిర్వహణా శ్రమతో కూడినదిగాను ఉంటూండేది. అయితే ఆవిడ స్వయంగా సాహిత్యాభినివేశం కలవారుగా, నటిగా, జానపద లలితగేయ కళాకారిణిగా సృజనశీలి కూడా కావడంతో కార్యక్రమాలలో ఓ భాగస్వామ్యం వహిస్తూండేవారు. ఎన్నో మంచి కార్యక్రమాలు అప్పట్లో రూపొంది ప్రసారమయ్యాయన్నది సత్యం.






# 55

**1999 మేలో ఆకాశవాణి హైదరాబాద్** కేంద్రం స్టేషన్ డైరెక్టర్‌గా పదవీబాధ్యతలు చేపట్టిన శ్రీమతి దుర్గాభాస్కర్‌గారికి కార్యక్రమ నిర్వహణాధికారులుగా నేను, ఉష ఎలా పనిచేస్తామో అంతకుముందు విజయవాడ కేంద్రంలో ఉన్నప్పుడే తెలుసు. ఆవిడకు ముందు డైరెక్టర్‌గా ఉన్న కబీర్ అహ్మద్‌గారి సమయంలో ప్రొడక్షన్ అసిస్టెంట్ లేకుండానే తెలుగు విభాగంతో బాటు సంస్కృత విభాగం, డెవలప్‌మెంట్ టాక్స్, స్వాతంత్ర్యవాణి, స్రవంతి, (వృద్ధులకార్యక్రమం), నవలాస్రవంతి, బైబిల్ సూక్తులు, స్తుతిమాల, హాస్యకార్యక్రమాలు వంటి ఎనిమిదికి పైగా సెక్షన్స్ నిర్వహిస్తూ వచ్చాను. అప్పుడు మాకు అసిస్టెంట్ డైరెక్టరయిన శ్రీకొట్రా మల్లికార్జున శర్మగారితో ఎన్నోమార్లు సెక్షన్‌కు ఒక అసిస్టెంట్‌ని ఇమ్మనమనీ, పనిభారం అధికంగా ఉందనీ చెబుతూనే వచ్చాను. 1999 ఫిబ్రవరి చివర్లోనో, మార్చి ఆరంభంలోనో సరిగ్గా గుర్తులేదుగానీ ఒక రోజు కవితాస్రవంతి రికార్డు చేసి మెట్లు దిగుతూటే కళ్ళు గిర్రున తిరిగి, చెమట్లు పట్టి

## ‘నరా’వతారం

సుఖంతీపు ఆరవేసే తీగా ఇదే
బాధా సుమం పెనవేసే లతా ఇదే
దేహమంతా దారులుగా విస్తరించి
రక్త చైతన్యాన్ని రవాణా చేస్తున్న ప్రాణవ్యవస్థా ఇదే

ఒకరి నాలుకవద్ద తెగి చెవుల్ని పోటెత్తించేదీ
ఒకరి కరస్పర్శతో అరచేతనే ఉబ్బి తబ్బిబ్బు చేసేదీ ఇదే
ఓ మెడవంపులో ముద్దాడిన క్షణం అంగరంగాన
రతీదేవి నర్తనాన్ని ఆవర్తింపచేసేదీ ఇదే

దవడ కందరం వద్ద బిగిసి ఆగ్రహించేదీ
కంటి చివళ్ల అదిరి అద్భుతమయ్యేదీ
కాంక్షా సత్తువలో బిగిసి ఫలప్రద తృప్తితో ఒదిగేదీ
ఆలోచనా బీజాలను అణువిస్ఫోటనం చేసి
శాంతినీ, విప్లవాన్నీ పండించేది ఇదే ఇదే

మెదడులో భూగోళమంత వైశాల్యం
హృదయంలో సముద్రమంత అగాధం
బుద్ధిలో ఆకాశమంత సమున్నతం
పొలంలో నాగేటి చాలు
కర్మాగారంలో శ్రామికుడి విన్నాణపు శ్రమవాలు –
నరం.
అవును – నరం.

97 సుధామ కవిత్వం

నరం కలవాడు కనుకే నరుడు
నరం – ఇహం పరం, మానవ పరిణామ స్వరం

హృదయానికేమీ ఢోకాలేదు
మానవీయ స్పర్శ, మమత ఇగిరిపోలేదు కదా!
సంకోచాలూ, చిల్లులూ లేవు
కానీ తలకుమించిన భారాలు తలకెత్తడం వల్లనే
వెన్నెముక ఉన్న మనిషికి
ఎప్పుడో ఎక్కడో సన్నటి నరం చతికిలబడినట్లవుతుంది
అప్పుడు ట్రాక్షనే రియాక్షన్ – ఆత్మబలమే ఎట్రాక్షన్
దిమ్మవమ్మయిపోతుంది

హెర్క్యులస్ భుజం మార్చుకుంటాడంతే
బరువు పరులనెత్తిన వేయడు
వెన్నెముక హృదయమంత మెత్తనిదయినా
హృదయం వెన్నెముకంత గట్టిది
చైతన్యరక్త సంచలన జీవన సంగీత తంత్రి – నరం
మ్రోగుతూనే ఉంటుంది.
లక్ష్యించిన దారి సాగుతూనే ఉంటుంది
‘నరా’ వతారం ముగియదు.

*
(సెర్వికల్ డిస్క్ సింథ్రోమ్ ‘వర్టిగో’తో పడిలేచి)
(‘ఆంధ్రప్రభ’ దినపత్రిక ‘సాహితీ గవాక్షం’, 4 ఏప్రిల్ 1999)

దబ్బున కూలబడి పోయాను. డైరెక్టర్‌గారు విషయం తెలిసి వెంటనే వచ్చారు. అపోలో డాక్టర్ ఎవరో రికార్డింగుకు వచ్చినాయన పరీక్షించి హార్ట్‌ఎటాక్ కాకపోవచ్చనీ అయినా వెంటనే హాస్పటల్‌కి తరలించడం మంచిదనీ ఆదేశించారు. వెంటనే ఆఫీస్ కార్‌లో సెక్రటేరియట్ ఎదురుగా ఉన్న మెడిసిటీ ఆస్పత్రికి తరలించారు. ఉష ఆఫీసులోనే ఉండడంవల్ల తోడొచ్చింది. మిత్రులు శ్రీనివాసరెడ్డి ప్రభృతులు సి.జి.హెచ్.ఎస్ పేపర్ వ్యవహారాలు చూశారు. దాదాపు పదిరోజులు ఆసుపత్రిలో ఉన్నాను. సెర్వికల్ డిస్క్ సిండ్రోమ్ 'వర్టిగో' సమస్య. తలంతా గిర్రున తిరుగుతున్నట్లుండేది 'ట్రాక్షన్' పెట్టారు మందులిచ్చారు. బస్సుల్లో వెనుక సీట్లలో, ఆటో బ్యాక్ ఇంజన్ కాని వాటిల్లో ప్రయాణించవద్దనీ, అంతవరకూ వాడుతున్న టీ.వీ.ఎస్ ఇంక వాడవద్దనీ చెప్పారు. ఇంటికొచ్చాక కూడా కొద్దిరోజులు ట్రాక్షన్‌తో, ఓ రెండు నెలలు పైగా 'వర్టిన్' మాత్రలతో గడిపాను. అప్పట్లో అలా పడిలేచి రాసిందే 'నరా'వతారం అనే కవిత ఆంధ్రప్రభ దినపత్రిక 4 ఏప్రెల్' 1999 'సాహితీ గవాక్షం'లో అచ్చయింది.



ఆఫీసులో చేరాక దుర్గాభాస్కర్‌గారు తెలుగు విభాగం నా వద్దే ఉంచినా ఒకటి రెండు సెక్షన్లు తగ్గించారు. అనౌన్సర్‌గా పనిచేస్తున్న వేమూరి సాధనను నా సెక్షన్‌కు ప్రొడక్షన్ వర్క్‌కు డ్యూటీరూం నుంచి రిలీవ్ చేసి అటాచ్ చేసారు. అనౌన్సర్ చంద్రశేఖర్ మల్లాది కూడా రికార్డింగ్ వర్క్‌ల్లో ఆదుకుంటూండేవాడు. మాలతీచందూర్ 'హృదయనేత్రి', బలివాడకాంతారావు 'దగాపడిన తమ్ముడు,' ఘండికోట బ్రహ్మాజీరావు 'శ్రామికశకటం' వంటి నవలలు నవలాస్రవంతిలో నేను నిర్వహింపచేసిన వాటిలోవని మునుపోసారి చెప్పానేమో కదూ! బ్రహ్మాజీరావుగారు 'శ్రామికశకటం' ప్రసారాన్ని ఎంతగానో అభినందిస్తూ ఏప్రిల్' 99లో లేఖ రాశారు కూడాను.

ఇంతకీ చెప్పవచ్చే విషయం ఏమిటంటే దుర్గాభాస్కర్‌గారు కళాకృష్ణ, జయపాల్‌రెడ్డిలు ఒకరు దూరదర్శన్‌కు ఒకరు వరంగల్‌కు హైదరాబాద్ ఆకాశవాణి నుండి తరలి వెళ్ళాక 2002 సెప్టెంబర్‌లో నన్ను 'పెక్స్‌కో' - కార్యక్రమ నిర్వహణాధికారుల 'కో ఆర్డినేషన్'గా చేశారు. రోజువారీ మీటింగులు నిర్వహించడం, హఠాత్తుగా వచ్చే కార్యభారాలను పెక్స్‌ల మధ్య సమర్థంగా పంచడం, డ్యూటీరూములో అనౌన్సర్స్, డ్యూటీ ఆఫీసర్ల షిఫ్ట్ డ్యూటీల పర్యవేక్షణం, గ్రూప్‌ఫోర్' స్టేషన్ల కార్యక్రమాల సమన్వయాలు, సమావేశాలు, ప్రోగ్రాం అడ్వైజరీ కమిటీ మీటింగ్‌లు నిర్వహింపచేయడం, డైరెక్టర్‌గారు ఎప్పుడు ఏ పనులు చెప్పినా వాటిని సజావుగా నిర్వహింపచేయడం, అసిస్టెంట్ డైరెక్టర్లకు సహాయపడుతూ కార్యక్రమ నిర్వహణాధికారులందరి పనుల సమన్వయం చూస్తూండటం ఇవన్నీ వృత్తిలో బాధ్యతలే. పనులు చేయడం కన్న చేయించడం మరీ కష్టం. అందునా సాటి పెక్స్‌లతో కో ఆర్డినేటర్‌గా ఉంటూ సజావుగా కేంద్రకార్యక్రమాలన్నీ సాగేలా స్టేషన్ డైరెక్టర్ ముందు సమాధానం చెప్పుకునేవాడిగా ఉండడం తేలికయిన వ్యవహారమేమీ కాదు. డైరెక్టరేట్ ఉత్తరప్రత్యుత్తరాలు, ఐ.ఎం.పి.సి.సి. సమావేశాలలో ఆకాశవాణి ప్రాతినిధ్యం సంగతులు, ఫిక్స్‌డ్ పాయింట్ ఛార్ట్‌లు,



प्रसार भारती
(भारतीय प्रसारण निगम)
0544 Course No.102137
आकाशवाणी
कर्मचारी प्रशिक्षण संस्थान (कार्यक्रम)
प्रमाणित किया जाता है कि
श्री ए. वेंकटराव
ने इस संस्थान द्वारा आयोजित
कार्यशाला: उच्चरित शब्द की आधुनिक प्रवृत्तियाँ
में प्रशिक्षण प्राप्त किया। यह कार्यक्रम
दिल्ली
से 11/11/2002 से 15/11/2002 तक सम्पन्न हुआ।

PRASAR BHARATI
(Broadcasting Corporation of India)
ALL INDIA RADIO
STAFF TRAINING INSTITUTE (PROGRAMME)
This is to certify that
Sh. A. Venkata Rao
attended
Workshop on Modern Trends in Spoken Word
organised by this Institute at
Delhi
from 11-11-2002 to 15-11-2002

दिल्ली
Delhi
15-11-2002
(H.C. Veram)
निदेशक
Director

స్పోకెన్ వర్డ్ వర్క్ షాప్ సర్టిఫికెట్

సెక్షన్లు పాటించవలసిన ఫెస్టివల్ అండ్ యానివర్సరీ ప్రోగాం ఛార్ట్ల తయారీ, వారం వారం పి.ఆర్.పి మీటింగ్లు ఇలా నిరంతరం పనుల సందడి ఉండేది. అలాగే హైద్రాబాద్ ప్రధాన కేంద్రం కనుక రాష్ట్రంలోని మిగతా కేంద్రాలకు ఆర్.ఎన్.ఛానల్ మెసేజ్లు ముఖ్యకార్యక్రమాలవి నిత్యం పంపడం, రిలేల గురించి రిమైండ్ చేయడం ఇవన్నీ ఉండేవి. విశాఖలోనో, కడపలోనో, విజయవాడలోనో, తిరుపతిలోనే మూడునెలలకోసారి జరిగే కో ఆర్డినేషన్ మీటింగ్లకు డైరెక్టర్గారితో, వారు వచ్చినా రాకున్న పెక్స్కో విధిగా వెళ్ళవలసివస్తూండేది.

పెక్స్కో అయిన వెంటనే - అంటే సెప్టెంబర్ 2002లో అయితే, నవంబర్లోనే - ఢిల్లీకి 'మోడరన్ ట్రెండ్స్ ఇన్స్పోకెన్వర్డ్' అనే వర్క్షాప్కు ఓ అయిదురోజులు అంతకుముందు వరకూ ఏళ్ళుగా తెలుగు టాక్స్ విభాగాధిపతినయినందువలన వెళ్ళే అవకాశం వచ్చింది


నేషనల్ వైడ్ పెక్సెస్ వర్క్షాప్ 'మోడ్రన్ ట్రెండ్స్'

మారుతున్న కాలానికనుగుణంగా రేడియోలో స్పోకెన్వర్డ్ కార్యక్రమాల గురించి దేశంలోని దాదాపు 15 కేంద్రాలనుంచి జమ్మూ కాశ్మీర్, కలకత్తా, ముంబయ్, ఢిల్లీ, గౌహతి, మధురై, షిల్లాంగ్, తురవంటి ఆకాశవాణి కేంద్రాల నుంచి స్పోకెన్ వర్డ్ సెక్షన్ల అధిపతులు రాగా ఆంధ్రదేశం నుంచి హైదరాబాద్ నుండి నేనొక్కడినే ప్రాతినిధ్యం వహించాను. అది ఒక మంచి అనుభవం.


PRASAR BHARATI
BROADCASTING CORPORATION OF INDIA
DEPUTY DIRECTOR GENERAL (SR I & II)
ALL INDIA RADIO: CHENNAI-4

NO.DDG/SRI & I /1(2)2003-SI(B) Dated:15.10.2003

O R D E R NO.35/2003

The following transfers in the cadre of Programme Executives in Southern Region I & II are ordered with immediate effect.

| Sl.No. | Name | FROM | TO |
|---|---|---|---|
| 1. | Shri A.Venkata Rao | AIR Hyderabad | AIR Nizamabad |
| 2. | Shri D.Raja Reddy | AIR Vijayawada | AIR Adilabad |
| 3. | Shri P.G.K.Murthy | AIR Vijayawada | AIR Kothagudem |
| 4. | Shri K.Sathyanaranaya Murthy | AIR Visakhapatnam | AIR Nizamabad |
| 5. | Smt N.Padmaja Nirmala | AIR Chennai | AIR Hyderabad |
| 6. | Smt M.Jothimani | AIR Madurai | AIR Tirunelveli |
| 7. | Shri M.Sivaprakasam | AIR Pondicherry | AIR Merkapuram |
| 8. | Shri K.Venkatesh | AIR Hospet | AIR Bijapur |

The above mentioned Officers may be relieved immediately & compliance reported to this office under intimation to DG,AIR,New Delhi.

No representation will be entertained in this regard.

(B.RAJAPPA)
DEPUTY DIRECTOR ADMINISTRATION
For DEPUTY DIRECTOR GENERAL (SR I & II)

Copy forwarded for information to:
1.The Officers concerned
2. The Director General (By name – Smt V.L.Sinha,DDG(P),AIR New Delhi.
3. The Director General,(Shri C.P.S.Nonghulo,DDA(P) by name, SI(B) Section, All India Radio, Akashvani Bhavan, New Delhi 110 001.

ఓ ఏడాది పెక్స్కోగా పనిచేశానో లేదో అక్టోబర్ 15, 2003 న డైరెక్టరేట్ నుంచి ఎనిమిది ట్రాన్స్ఫర్ ఆర్డర్ల లేఖ వచ్చింది. అందులో హైదరాబాద్ నుంచి నన్ను నిజామాబాద్కు బదిలీ చేస్తూ ఆర్డర్లు వచ్చాయి. విశాఖనుంచి కాకరపర్తి సత్యనారాయణ మూర్తికి కూడా నిజామాబాద్ వేశారు. విజయవాడనుండి రాజారెడ్డి, పి.జి.కె మూర్తిలను అదిలాబాద్, కొత్తగూడెంలకు మద్రాసునుంచి పద్మజా నిర్మల గారిని హైదరాబాద్కు ట్రాన్ఫుర్ చేస్తూ ఆర్డర్లు విడుదలయ్యాయి.

నిజానికి ( 1999లో వచ్చిన) వర్టిగో సమస్య సంపూర్తిగా సద్దుమణగలేదు. స్పాండిలైటిస్ తరుచుగా ఇబ్బంది పెడుతూనే ఉంది.


PRASAR BHARATI
BROADCASTING CORPORATION OF INDIA
O/O DEPUTY DIRECTOR GENERAL (SR I & II)
ALL INDIA RADIO:CHENNAI-4

NO.DDG/SR.I/1(2)/SI(B)-2004 Dated:02.01.2004

O R D E R NO. 1/2004

Transfer of Shri A.Venkata Rao, Programme Executive, from All India Radio, Hyderabad to AIR, Nizamabad ordered vide this office order No.35/2003 issued in F.No.DDG/SRI/1(2)/SI(B)/2003 dated 15.10.03 is hereby cancelled.

(B.RAJAPPA)
DEPUTY DIRECTOR ADMINISTRATION
For DEPUTY DIRECTOR GENERAL (SR I & II)

Copy forwarded for information to:

మా అబ్బాయి స్నేహిత్ బి.టెక్లో కొత్తగా చేరాడు. వయోధికులైన మా అమ్మగారిని, అత్తగారిని, స్నేహిత్ని ఉషపై మొత్తం భారం వేసి నా ఆరోగ్య సమస్యతో నిజామాబాద్ వెళ్ళి పనిచేయగలనన్న ధీమా చిక్కలేదు. రిలీవ్ చేయకుండా ఉండలేనని డైరెక్టర్ దుర్గాభాస్కర్ గారు ఏ ఒత్తిడుల కారణంగానో ఏమో నవంబర్ 10, 2003 నన్ను రిలీవ్ చేసేశారు. నేను డైరెక్టరేట్కు రిప్రజెంటేషన్ పంపి నిజామాబాద్లో జాయిన్ కాకుండా మెడికల్ లీవ్ పెట్టాను. నా రిప్రజెంటేషన్ అభ్యర్థనను త్రోసిపుచ్చుతూ నవంబర్ 6న డైరెక్టరేట్ లెటర్ కూడా రావడంతో రిలీవ్ అయ్యి నిజామాబాద్లో జాయిన్

కాకుండా ఓ అసహాయస్థితిలోనే పడ్డాను.

ఒక్కొక్కసారి మన మంచియే మనకు మేలు చేస్తుంది. అప్పట్లో ప్రసారభారతి సి.ఇ.ఓ.గా ఉన్న కె.ఎస్.శర్మగారికి ఆంధ్రప్రదేశ్ జెన్కో యం.డి. మంచి మిత్రులు. ఆకాశవాణి నుంచి డిప్యుటేషన్‌పైన ఎవరినైనా పి.ఆర్.ఓ.గా ఇమ్మనమని ఆయన శర్మగారిని అడిగారట. అందుకు తగిన వారు హైదరాబాద్ ఆకాశవాణిలో ఎవ్వరైనా ఉన్నారా అని అడిగితే పెక్స్ మిత్రుడు సుమనస్పతి దరఖాస్తు ఇచ్చాడు. అదే విషయంలో నా పేరు కూడా ప్రతిపాదనకు వచ్చిందట. ఓ రోజు కె.ఎస్.శర్మగారు ఆకాశవాణికి స్వయంగా వస్తూ సుమనస్పతిని, నన్నూ కూడా తమను కలవమన్నారని డైరెక్టర్‌గారు చెప్పారు. ఆ రోజు డైరెక్టర్‌గారి రూములోనే సి.ఇ.ఓ శర్మగారు సుమనస్పతిని, నన్నూ విడివిడిగా ఇంటర్వ్యూ చేశారు. నేను చేసిన కృషిని, నా సాహిత్యాభిరుచులను, ఆకాశవాణికి చేసిన వాటిని ఆయనకు వివరించాను. డైరెక్టర్ గారు కూడా ఆకాశవాణికి నా సేవలు ఉపయుక్తాలని చెప్పారు. శ్రీ శర్మగారు ఏ కళనున్నారో "నిజామాబాద్ ఎందుకు హైదరాబాద్ ఆకాశవాణిలోనే నీ సేవలు కొనసాగించు. జెన్కోకు సుమనస్పతిరెడ్డిని పంపుదాంలే" అని సుమనస్పతిరెడ్డిని డిప్యుటేషన్ పై ఆ సంస్థకు పంపారు. నవంబర్ 10 న రిలీవ్ అయిన నేను జనవరి రెండు, 2004న డైరెక్టరేట్ నుండి నిజామాబాద్ బదిలీ రద్దు చేస్తూ తిరిగి హైదరాబాద్‌లో పోస్ట్ చేస్తూ ఆర్డర్స్ రావడంతో అదే రోజు అంటే 2004 నూతన సంవత్సరం రెండో రోజు హైదరాబాద్ కేంద్రంలో తిరిగి కార్యక్రమ నిర్వహణాధికారిగా జాయిన్ అయ్యాను. మళ్ళీ తెలుగు విభాగం, పబ్లిసిటీ ఇన్‌ఛార్జ్ పెక్స్‌గా బాధ్యతలు చేపట్టాను.



విదుషి శరణ్‌రాణి నేషనల్ అవార్డు అందుకుంటున్నప్పుడు

నేను పెక్స్‌కోగా ఉండగా ఆ సంవత్సరాల్లోనే ఆసియాక్రీడలు, ఆఫ్రో ఆసియాగేమ్స్ రావడం, వాటి ప్రసారాల నిర్వహణ కో ఆర్డినేషన్ చూడడం మరచిపోలేని అనుభవాలే. 2004 జనవరిలో నేను చేరగానే హైద్రాబాద్‌లో ఆకాశవాణి మార్చిలో ప్రతిష్ఠాత్మకంగా నేషనల్ ఆర్టిస్ట్‌ల అవార్డ్ ఫంక్షన్ నిర్వహించింది. జాతీయస్థాయిలో సంగీత రంగానికి చెందినటువంటి 23మంది కళాకారులకు లక్షరూపాయల చొప్పున నగదును కూడా ప్రదానం చేసింది. ఆ సభ హైదరాబాద్‌లోనే జూబ్లీ హాల్‌లో వైభవోపేతంగా జరిగింది. 23 మార్చి 2004న జరిగిన ఆ సభ ఆకాశవాణి హైదరాబాద్ చరిత్రలో చెప్పుకోదగింది. భీంసేన్ జోషి, భూపేన్ హజారికా, బిస్మిల్లాఖాన్, డి.కెపట్టమ్మాళ్, గంగూ భాయ్‌హంగల్, కిషన్ మహరాజ్, విదుషి కిషోరి అమోన్‌కర్, లతా మంగేష్కర్, బాలమురళీ కృష్ణ, ఎం.ఎస్.సుబ్బలక్ష్మి, ఎం.ఎస్.విశ్వనాధన్, మన్నాడే, ఎన్.రమణి, నేదునూరి కృష్ణమూర్తి పాలఘాట్ ఆర్.రఘు, పండిట్ జస్‌రాజ్, రవిశంకర్, స్రబిఖాన్, విదుషి శరణ్‌రాణి, టి. ముక్త, టి.ఎన్.కృష్ణన్, టి.కె మూర్తి ఆ గౌరవం పొందినవారు.




2004 వ సంవత్సరంలోనే ఆకాశవాణి D.T.H సర్వీస్‌లు మొదలయ్యాయి. డైరెక్ట్ టు హోమ్ ప్రసారాలు. దీనిద్వారా టీవీలలో 'రేడియో కార్యక్రమాలు వినే వీలు ఏర్పడింది. రేడియో సెట్స్‌లో D.T.H ప్రసారాలు వినబడవు. సెట్ టాప్ బాక్స్‌లు అమర్చుకుని టీవీల్లో రేడియో కార్యక్రమాలు ఆడియోగా వినవచ్చునన్నమాట. 24 గంటల D.T.H ప్రసారాలకు ఆకాశవాణి సంకల్పించింది. D.T.Hలో ప్రసారమయ్యే కార్యక్రమాలను ప్రత్యేకంగా రూపొందించడం, వివిధ కేంద్రాలనుండి రూపొందించినవి క్రమబద్ధీకరించి ప్రసారం చేయడానికై సంకల్పించారు. D.T.H ప్రసారాలకు ఒక స్టూడియోను, రాత్రంతా ప్రసారం చేసేందుకు క్యాజువల్ సిబ్బందిని కూడా

నియమించసాగారు. D.T.H ప్రసారాల్లో వివిధభారతి వినోదకార్యక్రమాలకూ స్థానం ఉంది. ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం D.T.H ప్రసారాల రోజువారీ క్యూషీట్స్ తయారీ, కార్యక్రమ రూపకల్పన ప్రాధమికంగా నిర్వహించిన కార్యక్రమ నిర్వహణాధికారిని హైదరాబాద్‌లో నేనే కావడం నాకు సంతోషం కలిగించే విషయం. దాదాపు నెల్లాళ్ళు D.T.H స్పేడ్ వర్క్ ఆఖరికి ఇంటికి తెచ్చుకుని కూడా చేయడం ఎప్పటికీ మరుపురానిదే అలాగే డి.టి.హెచ్ ప్రసారాలకై టేప్స్‌లోని కార్యక్రమాలను సి.డి.లకు కన్వర్ట్ చేయడం కూడా మొదలుపెట్టాం. టేప్ డెక్ నుండి సి.డి.రైటర్‌కు ప్రత్యేకంగా కన్వర్ట్ చేయడానికి ఒక రూములో R.O.R దగ్గర నెలకొల్పి టేప్స్‌లోని కార్యక్రమాలను సి.డి.లకు బదలాయించడం మొదలయింది. అడ్మిన్ నుంచి నీలా సురేష్ D.T.H పనులకు ఎంతగానో సహకరించాడు. దానికి ప్రత్యేకమైన మానిటరింగ్ సిస్టమ్ అదీ లేకపోవడం వల్ల బాధ్యతతో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మరీ చేసేవాళ్ళం. D.T.H ప్రసారాలు ఇప్పుడు బాగా ఊపందుకున్నాయి కూడాను.

తెలుగు విభాగం బాధ్యతలనుండి మొత్తంగా D.T.Hకు, మెయిన్ ఛానెల్ మీద కూడా వాణిజ్య ప్రకటనల విస్తృతి పెరగడంతో ప్రైమరీ ఛానెల్ కమర్షియల్స్ బ్రాడ్‌కాస్ట్‌కు నన్ను కార్యక్రమ నిర్వహణాధికారిని చేశారు. వివిధభారతి వాణిజ్య ప్రసార విభాగం, మార్కెటింగ్ డివిజన్లతో సమన్వయం చేసుకుంటూ హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రంలో ప్రకటనల ప్రసార నిర్వహణా బాధ్యత, లైబ్రేరీల నిర్వహణా పర్యవేక్షణల వైపు డైరెక్టర్‌గారు నా విధులను మార్పుచేశారు. ఒక విధంగా అక్షరాల నుండి అంకెలవైపు తిరిగినట్లయ్యింది.

పనిచేసే సంస్కృతిలో కేంద్రంలో మార్పులు కొట్టవచ్చినట్టు కనబడడం మొదలైంది.

1995 ఆగస్టులో విజయవాడ నుండి హైదరాబాద్ కేంద్రానికి బదిలీ అయివచ్చి తదాదిగా పనిచేస్తూండడం వలన సీనియారిటీ దృష్ట్యా బదిలీల ప్రస్తావన వచ్చినప్పుడల్లా మా పేర్లు ముందుకు రాసాగాయి. అది సహజమే కదా! 2004 జూన్‌లో ఈ ఆఫీసు పని ఒత్తిడుల నుండి రిలాక్సింగ్‌కు చాలా ఏళ్ళ తర్వాత ఎల్.టి.సి సౌకర్యం వాడుకుని కుటుంబసమేతంగా కన్యాకుమారి దాకా ప్రయాణం చేసి వచ్చాను.

హైదరాబాద్ ఆకాశవాణిలో నిత్యం ఉరుకులు పరుగులు అన్నట్లుగానే పనిచేస్తూ రావడం వలన చేసినవాటిని గుర్తుంచుకోవడం, నమోదు చేసుకోవడం కూడా కుదరనంత వేగంగా రోజులు గడిచాయి. 2001లో యాభై సంవత్సరాలు నిండాయి వయసు రీత్యా కూడాను. మారుతున్న కాలం, పరిస్థితులు, ఉద్యోగంలో ఒత్తిడులు, క్రమంగా రేడియో కొంత 'ఫేడౌట్' అవుతున్న భావన మనసును ప్రభావితం చేయడం మొదలుపెట్టాయనే అనాలి.



Fax sent by : 0891 044 24996077 SD AR CHENNAI 28/11/03 01:19 Pg: 1

PRASAR BHARATI
BROADCASTING CORPORATION OF INDIA
DEPUTY DIRECTOR GENERAL (South) - I
ALL INDIA RADIO: CHENNAI-4

NO.DDG-(SR I) /1(?/2005 Dated :1.8.2005

ORDER NO. 13/2005

The following transfer in the Cadre of Programme Executive is ordered with immediate effect.

| Sl. No. | Name of the PEX | From | To | Remarks |
|---|---|---|---|---|
| 1. | Smt Usha Rani | AIR Hyderabad | RTI(P) Hyderabad | against ASD post of RTI(P), Hyderabad |
| 2. | Shri A.Venkat Rao | AIR Hyderabad | AIR Warrangal | Eligible for TA/DA |
| 3. | Smt M.K.Sandhyashree | AIR Cuddappah | AIR Chennai | Not eligible for TA/DA etc. |

(D.UMA)
INSPECTOR OF ACCOUNTS
for Deputy Director General(S-I)

Copy forwarded to:

1. The Officers concerned
2. The Director General, SI(B) Section, All India Radio, Akashvani Bhavan, New Delhi 110 001
3. The Station Director, All India Radio, Chennai/Cuddappah/Hyderabad/Warangal /RTI (P) Hyderabad
4. PA to DDG
5. President, PSA, C/o 1 & PES, All India Radio, New Delhi
6. President, ALPO, R.No.62, ESD,All India Radio, New Delhi
7. The General Secretary,AIR & DD,SC/ST Employees Welfare Association, 2579-80 Bagichi Reghunath Sadar Thana Road, Delhi 110 006.
9. Spare copies

For DEPUTY DIRECTOR GENERAL

2005 ఆగస్టు 1న డైరెక్టరేట్ నుండి మళ్ళీ ట్రాన్సఫర్ ఆర్డర్లు వచ్చాయి. హైదరాబాద్ నుండి నన్ను వరంగల్ ఆకాశవాణి కేంద్రానికి, ఉషను హైదరాబాద్‌లోనే ఆకాశవాణి భవన్ రెండో అంతస్తులోని రీజనల్ ట్రైనింగ్ సెంటర్‌కు బదిలీ చేస్తూ వచ్చిన ఆర్డర్స్‌లో మా ఇద్దరి బదిలీలే ప్రధానంగా ఉన్నాయి. ఇంకోపేరు ఎం.కె సాంధ్యశ్రీ కడపనుండి చెన్నైకు బదిలీ చేస్తున్నట్లు ఉంది. హైదరాబాద్ నుండి వరంగల్‌కు బదిలీచేయడం అదృష్టంగానే భావించాలి. వెంటనే మమ్మల్ని రిలీవ్ చేసేశారు కూడాను.. ఆగస్టు 3, 2005న ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రనుండి బదిలీ అయి రిలీవింగ్ టైం వాడుకుని ఆగస్టు 8న వరంగల్ ఆకాశవాణి కేంద్రంలో కార్యక్రమ నిర్వహణాధికారిగా జాయిన్ అయ్యాను.



# 56

ఆకాశవాణి వరంగల్ కేంద్రానికి ఒక ప్రత్యేకత ఉంది. దేశంలో నెలకొల్పబడిన 'నూరవ' రేడియోకేంద్రం అది. 1990 ఫిబ్రవరి 17న వరంగల్ ఆకాశవాణి - 2x5 కిలోవాట్స్, ఎఫ్.ఎం.ట్రాన్స్‌మీటర్‌పై ప్రసారాలు ప్రారంభించింది. హనుమకొండలో కాకతీయ విశ్వవిద్యాలయం క్యాంపస్ దగ్గర, ఆకాశవాణి వరంగల్ కేంద్రం ఉంది. 103.5 మెగా హెర్ట్జ్‌పై, వరంగల్ రేడియోప్రసారాలు - దాదాపు యాభైలక్షల శ్రోతలను చేరి అలరిస్తుంటాయి. వరంగల్ - 'లోకల్ రేడియోస్టేషన్' కనుక, అక్కడి కళాకారులకు ముఖ్యంగా డ్రామా, సంగీతంకు సంబంధించి ఆడిషన్లు ఉండవు. ప్రతిభప్రాతిపదికగానే కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం ఉంది. అన్ని విభాగాల్లో కలిపి సిబ్బంది ముప్పైమూడు మందే! ఎక్కువగా క్యాజువల్ సిబ్బందే కార్యక్రమ నిర్వహణలో భాగస్వామ్య వహిస్తుంటారు. వార్తలు వంటివి రిలే



ఆర్.వెంకటేశ్వర్లుగారు

చేసుకున్నా, జానపద సంగీతం, చిత్రసంగీతం, 'కిసాన్‌వాణి' పేర వ్యవసాయ కార్యక్రమాలు, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ కార్యక్రమాలు, స్త్రీల కార్యక్రమాలు, యువవాణి కార్యక్రమాలు, ప్రసంగాలు, పరిచయ కార్యక్రమాలు కేంద్రం స్వయంగా రూపొందించి ప్రసారం చేస్తుంది. ఇప్పుడంటే 'రెడ్ ఎఫ్.ఎం' అని ప్రైవేట్ రేడియో కూడా వరంగల్‌లో తన ప్రసారాలు చేస్తోంది కానీ, అప్పట్లో ఆకాశవాణి ఒక్కటే! వరంగల్ కేంద్రం ప్రారంభంలో - పి.ఆర్.రెడ్డిగారు డైరెక్టర్‌గా సేవలందించారు. తదనంతరకాలంలో డి.జి అయి ఇటీవలే పదవీ విరమణ చేసిన ఆర్.వెంకటేశ్వర్లుగారు, శ్రీ పాలకుర్తి మధుసూదనరావుగారు, శ్రీ రాజారావుగారు, ప్రస్తుతం హైదరాబాద్ కేంద్రంలో డి.డి.జి.గా ఉన్న మంగళగిరి ఆదిత్య ప్రసాద్‌గారు వరంగల్ రేడియో కేంద్ర వికాసానికి దోహదపడిన సంచాలకులు. డైరెక్టర్లు లేనప్పుడు వరంగల్ కేంద్రాన్ని



శ్రీ పాలకుర్తి మధుసూదనరావుగారు,

సీనియర్ ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్‌లే నిర్వహిస్తూ వచ్చిన సందర్భాలూ చాలానే ఉన్నాయి. నేను వరంగల్ ఆకాశవాణి కేంద్రంలో కార్యక్రమ నిర్వహణాధికారిగా - 2005 ఆగస్టు 8న చేరినప్పుడు, పి.రాజారావుగారు కేంద్ర సంచాలకులుగా పనిచేస్తున్నారు. ఎస్.జయపాల్‌రెడ్డి, పుట్టపర్తి నాగపద్మిని, విల్సన్ హెరాల్డ్ సహకార్యక్రమ నిర్వహణాధికారులుగా ఉన్నారు.

హైదరాబాద్ కేంద్రం నుండి బదిలీ అనగానే - చాలామంది కోరుకునేది 'వరంగల్' కేంద్రమే! ట్రాన్సఫర్ 'ఆప్షన్లు' అడిగితే ముందుగా వరంగల్ అనే అంటారు. ఎందుకంటే - హైదరాబాద్ నుండి ఉద్యోగం నిమిత్తం ఫ్యామిలీ హైదరాబాద్‌లోనే ఉన్నా, వరంగల్‌కు షటిల్ చేసి రాగలవీలుంది. ఉదయం ఏ ఈస్ట్‌కోస్ట్‌లోనో బయలుదేరి, పదిగంటల్లోగానే కాజీపేటలో దిగి, ఆఫీసుకు వెళ్ళచ్చు. అలాగే సాయంత్రం అయిదున్నరకు 'తెలంగాణా ఎక్స్‌ప్రెస్'ను పట్టుకుని, రాత్రిలోగా హైదరాబాద్‌లో ఇల్లుచేరుకోవచ్చు' లేదూ! - వరంగల్‌లోనే ఓ రూమో, చిన్న ఇల్లో అద్దెకు తీసుకుని వారాంతానికి హైదరాబాద్ వచ్చి పోతూండవచ్చు.



PRASAR BHARATI
(BROADCASTING CORPORATION OF INDIA)
O/o THE DEPUTY DIRECTOR GENERAL (SR I & II)
ALL INDIA RADIO:: CHENNAI-600 004

31 OCT 2005

No. DDG/S-I/21(2)/MS Dated: 25.10.2005

**OFFICE ORDER**

Sub: Declaration of Head of Office in respect of AIR WARRANGAL
Ref: AIR, Warrangal Letter No. SE-3/2005 dated 4.10.2005

In exercise of the powers conferred by Rule 14 of the DFPRs 1978, ex-post facto approval of the competent authority is hereby conveyed declaring Shri A.Venkat Rao, Programme Executive, as Head of Office and controlling Officer in respect of All India Radio, Warrangal during the leave period of Shri M.Someswara Rao Station Engineer from 5.10.2005 to 10.10.2005.

(D.UMA)
Deputy Director (Admn.)
for Deputy Director General (South) - I

Shri A.Venkat Rao
Programme Executive,
All India Radio,
Warrangal

Copy to:
Station Engineer, AIR Warrangal

for Deputy Director General

వరంగల్ కేంద్రానికి ఒక 'అసెట్' - అనిల్ ప్రసాద్. కేంద్ర సంచాలకులకు తను 'స్టెనో' అయినా, నిజానికి బరువు బాధ్యతలు ఎన్నో మొదటినుండీ వహిస్తున్న సహృదయుడైన 'పనిజీవి' అనిల్ లేని వరంగల్ కేంద్రాన్ని నేనయితే ఊహించలేను! నెమ్మదిగా ఉంటూ, చిర్నవ్వుతో - డైరెక్టర్లకు తలలో నాలికలా ఉంటూ, కేంద్ర అభివృద్ధికి తోడ్పడిన తన నైపుణ్యం నేటికీ కొనసాగుతున్నదే! అనిల్ ఉంటే అందరికీ అదో ధైర్యం! స్వయంగా తానూ మంచి కథారచయిత. నేను వరంగల్ కేంద్రంకు బదిలీ అయ్యేటప్పటికి - మా అబ్బాయి ఇంకా చదువుకుంటున్నాడు. 80 ఏళ్ళ మా అత్తగారు మాతోనే ఉంది ఉషను రీజనల్ ట్రైనింగ్ సెంటర్‌కు వేయడం కొంతలో కొంత రిలీఫ్. అయినా పిల్లాడినీ, మా అత్తగారినీ, తన భారంగా వదిలివేసి నేను వరంగల్‌లో ఉండి వారాంతాల్లో రావడం సమంజసంగా తోచక - నేను రోజూ షటిల్ చేశాను. ఉదయం 6.30 కల్లా నాంపల్లి (హైదరాబాద్) స్టేషన్‌లో ఈస్ట్‌కోస్ట్ ఎక్కి వెళ్ళడం, సాయంత్రం 'తెలంగాణా ఎక్స్‌ప్రెస్' ఎక్కి ఏ రాత్రికో ఇల్లుచేరడం జరిగేది. ఉదయం 6.30కే వెళ్ళిపోవాలి కనుక బ్రేక్‌ఫాస్ట్ రైల్లోనూ, మధ్యాహ్నం లంచ్ హనుమకొండ ఆఫీస్ ఎదురుగా హోటల్లోనూ! రాత్రి ఇంటికొచ్చాకే భోజనం. రైల్లో రిజర్వ్‌డ్ బోగీల్లో ప్రయాణం చేయడానికిలేదు. రైల్వే పాస్ తీసుకున్నా, నెలసరి రుసుము చెల్లించి, జనరల్ బోగీల్లోనే వెళ్ళాలి. వచ్చేటపుడు 'ఎ.పి.ఎక్స్‌ప్రెస్'లాంటిది ఎక్కడం అస్సలు కుదరదు. పొద్దున్న రైల్లో తొందరగా వెళ్ళడం వల్ల కూర్చోడానికి సీటు దొరికేదిగానీ, సాయంత్రం 'తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌లో' సీటు దొరకడం నిత్యం ఘర్షణే! నిలబడి రావాల్సిన పరిస్థితులూ ఉండేవి. ఉదయం ఆలేరు స్టేషన్ రాగానే టీకోసం ఆత్రం! 'ఆలేరు'లో టీ బాగుండేది. భాస్కర్ అని టీ పంపిణీచేసే అతనుండేవాడు. ఆలేరు రావడం సరి - 'ఆగలేరు టీ కోసం' అనేలా ఉండేవారు ప్రయాణీకులు. ప్లాట్‌ఫారం ఎక్కడాలు, దిగడాలు, రైలుకోసం ఎదురుచూపులు, లేక వేళకు అందాలని పరుగులు, హైదరాబాద్‌లో ఇంటినుంచి స్టేషన్‌కూ, స్టేషన్ నుంచి ఇంటికి రావడానికి బస్సు పట్టుకోవడాలు, కాజీపేటలో రైలు దిగాక కూడా హనుమకొండలోని ఆకాశవాణి ఆఫీసుకు చేరడానికి షేర్ ఆటోనో, బస్సునో ఎక్కడం, అలాగే సాయంత్రం ఆఫీసునుండి కాజీపేట



శ్రీ అనిల్ ప్రసాద్

స్టేషన్‌కు ఆటోను దొరకబుచ్చుకోవడం... ఇదంతా యాభై అయిదేళ్ళ వయసు చేరిన నాకు స్ట్రెయిన్ అవసాగింది. అంతకు ముందే స్పాండిలైటిస్ వర్టిగో సమస్యతో పడిలేచిన వాడినేమో, అది తిరగబెట్టి, ఇబ్బంది పెట్టడం మొదలెట్టింది. అప్పటికీ - ఎప్పుడూ 'వర్టిన్' మాత్రలు దగ్గర పెట్టుకుని, రైలు ప్రయాణంలో మెడకు 'కాలర్' కూడా, తరచుగా పెట్టుకు ప్రయాణించినా, ఏమిటో ఇబ్బందిగానే ఉండేది. అందునా రోజువారీ వ్యవహారమాయె!

ఇక అసలుకి - లోకల్ రేడియో స్టేషన్లు అంటే స్థానిక కేంద్రాలలో, స్టూడియో రికార్డింగులకన్నా - 'ఫీల్డ్‌బేస్‌డ్' కార్యక్రమాలకే ప్రాధాన్యం ఇవ్వాలనీ, కనీసం 70 శాతం అటువంటి కార్యక్రమాలే రూపొందించి ప్రసారం చేయాలనీ డైరెక్టరేట్ నిబంధనలున్నాయి. స్థానిక కేంద్రాలలో తగిన ఉద్యోగ సిబ్బంది లేకపోతే, క్యాజువల్స్ ద్వారానైనా ఓ.బీ ప్రోగ్రాంలు (ఔట్‌సైడ్ బ్రాడ్‌కాస్ట్) చేయాలని 'పాలసీ' ఉంది. అంచేత ఆఫీస్‌కు వెళ్ళాక కూడా - ఆఫీస్ కార్ తీసుకుని, దగ్గర్లోని ఊళ్ళకు వెళ్ళి, రికార్డింగులు చేయాల్సి వచ్చేది. నేనున్న కాలంలోనే మేం నలుగురమే కాకుండా, ప్రమోషన్లు కొత్తగా వచ్చి 'జనార్దనన్' అని కేరళనుంచీ, హైద్రాబాద్ నుంచే రామారావు కూడా అక్టోబర్'05 నాటికి కార్యక్రమ నిర్వహణాధికారులుగా చేరారు. అయితే పేరుకి ఆరుగురున్నారన్నమాటేగానీ, నిత్యం సెలవులో ఎవరో ఉంటూనే ఉండేవారు. 'జనార్ధనన్'కూడా లాంగ్‌లీవ్ తీసుకున్నాడు కొన్నాళ్ళు. నేను చేరగానే 'కిసాన్‌వాణి' వ్యవసాయకార్యక్రమాల విభాగం అప్పచెప్పారు డైరెక్టర్‌గారు. హైదరాబాద్, విజయవాడలలో పనిచేసినప్పుడు నేను ఎప్పుడూ ఆ విభాగం నిర్వహించలేదాయె! నాకు ఆ వ్యవసాయం' కొత్త! దానికి షెడ్యూల్ వేయాలంటే - అవగాహన, పరిజ్ఞానం కావాలికదా! హైదరాబాద్‌లో వ్యవసాయకేంద్రం స్టేట్ గవర్నమెంట్‌లో పనిచేసే, మేం పెద్దన్నయ్యగా భావించే - శ్రీ ఎ.వి.ఎల్.ఎన్.మూర్తిగారి సహకారం తీసుకుని, ఖరీఫ్ అంటే ఏమిటో దగ్గర్నుంచీ తెలుసుకుని, వ్యవసాయ సంబంధిత అంశాల అవగాహన వారి నుండి కలిగించుకున్నాను. మూర్తిగారు కుటుంబ మిత్రులకన్నా ఎక్కువ. కనుక నేను అడిగే వాటినన్నిటినీ వివరించి చెప్పడమే కాక - షెడ్యూల్‌కి సహకరించేవారు. వరంగల్ వ్యవసాయకేంద్రపు జలపతిరావుగారు వంటివారూ - ఎంతో సహకారం అందించారు. అక్టోబర్‌లో మటుకు డైరెక్టర్ రాజారావుగారు సెక్షన్లు మార్చి, ఆరోగ్య కార్యక్రమాలు, క్విజ్‌ప్రోగ్రాంలు, మలుపు, పుస్తకసమీక్షలు, మధురగీతాలు వంటి కార్యక్రమాల బాధ్యత నిచ్చారు. ఐతే విల్సన్‌హెరాల్డ్



Prasar Bharati
(Broadcasting Corporation of India)
Regional Training Institute(P)
II Floor : All India Radio
Hyderabad-500 004
***

No.Hyd.RTI(P)/405103/

Date:21.10.2005

ATTENDANCE CERTIFICATE

Certified that the following officials have attended the "Workshop on Information Service Programmes" for Programme Executives / Announcers / Transmission Executives and allied cadres of All India Radio stations in Andhra Pradesh, Maharashtra and Goa from 17th October 2005 to 21st October 2005 at Regional Training Institute(P), All India Radio, Hyderabad:

| S.No. | Name | Designation | Station |
|---|---|---|---|
| 1. | Shri K.C.Nandanpawar | Trex | AIR, Nagpur |
| 2. | Shri B.D.Mistry | Pex | AIR, Mumbai |
| 3. | Shri S.M.Thakare | Announcer | AIR, Akola |
| 4. | Shri Vijay G.Sapkale | Pex | AIR, Jalgaon |
| 5. | Shri M.Chandrasekhar Srinivas | Announcer | AIR, Hyderabad |
| 6. | Shri Pralhad Yadav | Pex | AIR, Pune |
| 7. | Shri N.D.Deshpande | Announcer | AIR, Nanded |
| 8. | Shri Sumanaspati Reddy | Pex | AIR, Kurnool |
| 9. | Shri A.Malleswara Rao | Pex | AIR, Tirupati |
| 10. | Shri A.S.Ramteke | Pex | AIR, Chandrapur |
| 11. | Shri Satish Lothe | Pex | AIR, Nasik |
| 12. | Shri A.Venkat Rao | Pex | AIR, Warangal |
| 13. | Shri Sudhir Okhade | Pex | AIR, Dhule |

(P.Vedavathi)
Deputy Director

Copy to:
1.Concerned Official
2.The Station Director / Head of office, All India Radio..Warangal..........
3.The Director, Staff Training Institute(P), All India Radio, Delhi - 110 009 for kind information.

సెలవులో ఉంటే మళ్ళీ ఆ వ్యవసాయ కార్యక్రమాలూ అవీ తప్పేవి కావు!

వరంగల్ స్థానిక రేడియో కేంద్రమే అయినా అక్కడ ఒనగూరిన గొప్పమేలు ఏమిటంటే - కంప్యూటర్ ద్వారా రికార్డింగు చేయడం, కార్యక్రమాలు స్టూడియో కంప్యూటర్‌కు లాన్ చేయడం, డబ్బింగు కూడా 'సౌండ్‌ఫోర్జ్' ద్వారా కంప్యూటర్‌లోనే చేయడం వంటివి అక్కడే నేర్చుకోవడం జరిగింది. అది విధాయకం కనుక - కొత్త సాంకేతిక పద్ధతులకు మరలక తప్పని స్థితి. అది కూడా కొత్తపని కనుక ఉత్సాహదాయకమే అయినా, షటిల్ చేయడం వల్లా, శారీరక శ్రమ ఒత్తిడులవల్లా ఒక్కోసారి విసుగుకలిగించేది. తగిన అసిస్టెన్స్ కూడా ఒక్కోసారి లభించేదికాదు. వీటన్నిటివల్లా, కొంత అధికారుల నైజం వల్లా, హైదరాబాద్, విజయవాడ వంటి పెద్ద కేంద్రాలలో చేసి



PRASAR BHARATI
(BROADCASTING CORPORATION OF INDIA)
O/o DEPUTY DIRECTOR GENERAL (SOUTH)-I
ALL INDIA RADIO::CHENNAI-4

No. DDG(SZ-I)/Warrangal/2005

Dated:22.11.2005

MEMO

It has been reported by SD AIR Warrangal that Shri A.Venkat Rao, PEX was requested to attend the office on Saturday to take part in the discussions for planning of Programmes to ensure better Radio adaptation as programmes are being planned under Sponsored Category.But he has refused to come to Office, as 15th October being Saturday which amounts to insubordination. He is hereby required to submit his explanation on or before 25th of this month for not cooperating with the Station Director for smooth functioning of office.

Deputy Director of Administration
for Deputy Director General

Shri A.Venkat Rao
PEX
AIR,
Warrangal

Copy to: SD AIR Warrangal

for Deputy Director General

ఉండి, స్థానిక కేంద్రంలో, అరకొరవనరులతో, నాకంతగా ఆసక్తిలేని రంగ విభాగాల పనుల కార్యక్రమాల నిర్వహణ వంటి బాధ్యతలు క్రమంగా నిరాసక్తతను కలిగించసాగాయి. వాటిని అధిగమించడానికి ఎంత ప్రయత్నించినా అననుకూల పరిస్థితులే ప్రాబల్యం చూపసాగాయి.

అక్టోబర్ 2005లోనే - అయిదురోజులు మళ్ళీ ఓ ట్రైనింగ్ ప్రోగ్రాం నిమిత్తం, హైదరాబాద్ రీజనల్ ట్రైనింగ్ సెంటర్‌కు హాజరయ్యాను. 'ఇన్ఫరేషన్ సర్వీస్ ప్రోగ్రాం'లు పై వర్క్‌షాప్ 17 నుండి 21 వరకూ జరిగింది. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, గోవాల నుంచి పదమూడుమంది సిబ్బంది పాల్గొన్నాం. అప్పుడు ఆర్.టి.ఐ హైదరాబాద్‌కు ప్రయాగ వేదవతిగారు డిప్యూటీ డైరెక్టర్‌గా బాధ్యతలు వహిస్తూండగా, శ్రీమతి ఉష కార్యక్రమ నిర్వహణాధికారిగా అక్కడ ఉండింది. 15 అక్టోబర్ శనివారం ఆఫీసుకు సెలవే. అంతకు ముందు వరంగల్‌లో ఆ నెలలో డైరెక్టర్, ఇంజనీరింగ్ అధిపతి కూడా సెలవులపై వెళ్ళడంతో, నేను కొద్దిరోజులు 'స్టేషన్‌హెడ్'గా ఉండవలసి వచ్చింది. డైరెక్టర్‌గారు సెలవు నుండి చేరి, ఏదో కార్యక్రమం నిమిత్తం నన్ను 15వ తేదీ ఆఫీసుకు రమ్మన్నారు. మరో స్థానిక ప్రోగ్రాం ఆఫీసర్ ఎలాగూ ఉండడం వల్లా, నా అనారోగ్యం కారణంగా కొంతా, నేను వెళ్ళలేదు. అది సాకుగా - ఆయన పై అధికారికి నాపై ఫిర్యాదు చేసినట్లుగా, నాకు - 'వివరణ' ఇమ్మనమని లేఖరాగా తెలిసింది. "ఈ ఆఫీసుకి ఎంతచేసినా ఇంతేనని" ఆ ఘటన నా మనసు విరిచింది. నిజానికి ఆ అక్టోబర్‌లోనే శ్రమ అధికమైంది. దసరా ఉత్సవాలకు భద్రకాళి ఆలయం వరంగల్ వారి కార్యక్రమం రూపొందించడం ఓ మంచి జ్ఞాపకం. అదే నెలలో ఆఫీసులో డి.డి.ఓగా కూడా అదనంగా పనిచేశాను. ఆ నెలాఖరుకు నా 'స్పాండిలోసిస్' తిరగబెట్టడంతో, హెరిటేజ్ హాస్పటల్‌లో డా.కృష్ణగారి సలహా మేరకు సెలవు పెట్టడం జరిగింది. నా వివరణ లేఖ మద్రాసు (సౌత్) అధికారికి జనవరిలో కానీ ఇవ్వడం కుదరలేదు.

అప్పట్లో ప్రసారభారతి సి.ఇ.ఓగా ఉన్న శ్రీ కంభంపాటి సుబ్రహ్మణ్యశర్మగారు (కె.ఎస్.శర్మ)గారు తెలుగువారేగాక సహృదయులు, సాహిత్యాదిరంగాల అభిరుచి, అభినివేశం కలవారు కూడాను. హైదరాబాద్‌లో ఒకసారి ఆయనను కలుసుకుని మార్చి'2006లో హైదరాబాద్ బదిలీకై డైరెక్టరేట్‌కు రిప్రజెంటేషన్ పంపించాను. మద్రాస్ సౌత్‌జోన్ అధికారులు మిన్నకున్నా, ఢిల్లీలో ప్రసారభారతి సి.ఇ.ఓ. కె.ఎస్.శర్మగారు అత్యున్నత అధికారి కావడం వల్ల - ఆయన మాటమీద, హైదరాబాద్ వివిధభారతి వాణిజ్య ప్రసార విభాగంలో మిత్రుడు శేషం రామానుజాచార్య కార్యక్రమ నిర్వహణాధికారిగా రిటైరవడంతో, ఆ పోస్టు ఖాళీకావడంతో, నన్ను వరంగల్ నుండి హైదరాబాద్ వివిధభారతి వాణిజ్య ప్రసార విభాగానికి బదిలీచేస్తూ, జూన్ రెండున ఆర్డర్లు రావడం, అవి కొంచెం ఆలస్యంగా అంది, నేను వరంగల్‌లో రిలీవ్ అయ్యి, 27 జూన్'2006న హైదరాబాద్ వివిధభారతి వాణిజ్య ప్రసార విభాగంలో కార్యక్రమ నిర్వహణాధికారిగా చేరడం సంభవించింది. 1978లో నేను డ్యూటీ ఆఫీసర్‌గా ఆకాశవాణిలో చేరింది వివిధభారతిలోనే! నా రేడియో ఉద్యోగం మొదలయ్యిందే అక్కడ. అప్పుడు కార్యక్రమ నిర్వహణాధికారిగా సి.బి.ఎస్‌లో ఉన్నది ఎన్.సి.నరసింహాచార్యులుగారు. ఇప్పుడు నేను కార్యక్రమ నిర్వహణాధికారిగా ఆకాశవాణి వరంగల్ నుండి హైదరాబాద్ సి.బి.ఎస్‌లో చేరినప్పుడు - నరసింహాచార్యులుగారే 'అసిస్టెంట్ డైరెక్టర్'గా సి.బి.ఎస్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయనకే నా జాయినింగ్ రిపోర్ట్ ఇచ్చి అక్కడే చేరడం ఒక చంక్రమణాన్నే గుర్తుతెచ్చింది.

వరంగల్ కేంద్రంలో సాహిత్య కార్యక్రమాలు కొంతమేరకే చూసినా - సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్‌లో 'తెలంగాణ కవులు' అని, పాల్కురికి సోమనాధుని నుండి కాళోజీ, దాశరథి వరకు పదమూడు భాగాలుగా ప్రసంగ కార్యక్రమాలు రూపొందించి ప్రసారం చేయడం



PRASAR BHARATI
BROADCASTING CORPORATION OF INDIA
ALL INDIA RADIO, WARANGAL

NO. WGL.1(2)/2005-S/ Dated. 03.10.2005.

The Branch Manager,
State Bank of India,
Hanamkonda Main Branch,
HANAMKONDA.

Sub: Declaration of Drawing & Disbursing Officer, AIR, Warangal.

Sir,

Sri C. Jayapal Reddy, Programme Executive, AIR, Warangal who is functioning as Drawing & Disbursing Officer is proceeding on leave from 3rd October, 2005, the duties of Drawing & Disbursing Officer in respect of All India Radio, Warangal will be looked after by Sri A. Venkata Rao, Programme Executive with effect from 3.10.2005. He will sign all the cheques issued by this office and DDs received from other stations. The specimen signatures of Sri A. Venkata Rao, Programme Executive are attested below:

SPECIMEN SIGNATURES OF SRI A.VENKATA RAO, PROG.EXECUTIVE.

1.
2.

Yours faithfully,

(P. RAJA RAO)
STATION DIRECTOR.

Copy to: Sri A.Venkata Rao,,Programme Executive, All India Radio, WARANGAL.

The Pay & Accounts Officer, All India Radio, Mylapore, Chennai – 600 004.
Cheque writer/Cashier.

మరపురాని జ్ఞాపకమే. అప్పటికింకా తెలుగు యూనివర్సిటీ వి.సి.కాని శ్రీ అనుమాడ్ల భూమయ్యగారు, సుప్రసన్న, బండ్ల అయిలయ్య, గిరిజామనోహర్ బాబు, కాత్యాయని విద్మహే వంటివారు అందులో పాలుపంచుకుని, చక్కని ప్రసంగాలు అందించడం గుర్తే! అలాగే ఎల్.ఐ.సి వరంగల్ ఆఫీసులో సెప్టెంబర్ 2005లో జరిగిన 'హిందీవర్క్‌షాప్' ఒక మధురజ్ఞాపకం. 'మలుపు' కార్యక్రమంలో సినీనటుడు నూతన్‌ప్రసాద్ వచ్చి పాల్గొనడమూ గుర్తుంది! డైరెక్టర్ రాజారావుగారి డైనమిజం, ఆయన నిర్భీతి మరపురానివే.

హైదరాబాద్ వివిధభారతి వాణిజ్య ప్రసార విభాగంలో కార్యక్రమ నిర్వహణాధికారిగా 27 జూన్ 2006న చేరినా, అక్షర ప్రపంచం నుండి అంకెల ప్రపంచంలోకి వచ్చినట్లయింది. కార్యక్రమాలకన్నా వ్యాపార ప్రకటనలు రెవెన్యూ జనరేషన్, ప్రాయోజితకార్యక్రమాలు, టార్గెట్స్ ప్రధానాంశాలు అయ్యాయి. నరసింహాచార్యులుగారు నన్ను 'డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ ఆఫీసర్'(డి.డి.ఓ)గా చేసి, ప్రత్యేకంగా నాకు ఓ 'ఛాంబర్' కేటాయించారు. స్వచ్ఛంద పదవీ విరమణ చేయాలని ఉందని ఆయనతో అన్నప్పుడు - తాను ఓ ఏడాదిలో రిటైరవుతున్నాననీ, అంతవరకూ నన్ను దాన్ని గురించి ఆలోచించవద్దనీ ఆదేశించారు. ఆయన సహకారం వల్ల నాకు అంతగా రుచించని అంకెల ప్రపంచంలో టారిఫ్‌లు, ప్రకటనలు, కాంట్రాక్ట్‌లు, బిల్లుపాసింగ్‌లు, చెక్కులు, ప్రకటనల ప్రసారాలు, స్పాట్స్ ఛార్ట్ తయారీలు అంటూ తిరగక తప్పలేదు. వివిధభారతిలో జనరంజని, జనప్రియ వంటి కార్యక్రమాలు చూసినా, వాణిజ్య ప్రసారవిభాగం కనుక వాణిజ్యాంశాలకే ప్రాధాన్యం. వాణినుంచి వాణిజ్యానికి మరలడం సుతరామూ రుచించడం మానేసింది. అయినా నరసింహాచార్యులు గారివల్ల సజావుగానే సాగింది.



PRASAR BHARATI
(BROADCASTING CORPORATION OF INDIA)
COMMERCIAL BROADCASTING SERVICE
ALL INDIA RADIO : HYDERABAD
***

NO.HYD/CBS/1(5)2006-S/ Dated:27th June,2006

The Director General,
(S-I (B) Section,
(Kind Attention: Sri Ashok Kumar, Section Officer by Name),
All India Radio,
Akashvani Bhavan,
Parliament Street,
**NEW DELHI – 110 001.**

Sub:-Transfer in the Cadre of Programme Executive - Reg.
Ref:-DG, New Delhi Order No.42/2006-SI(B) dated 02.06.2006.
* * *

Sir,

Consequent on his transfer in the same capacity from AIR, Warangal to Commercial Broadcasting Service, All India Radio, Hyderabad vide Directorate General Order No.42/2006-S.I(B) (in file No.4/1/2006-S.I(B) Pt File/300 dated 02.06.2006), Shri A.Venkata Rao, Programme Executive had assumed charge of the post of Programme Executive at this station on the forenoon of 27th June, 2006

The C.T.C. in duplicate is enclosed herewith.

Yours faithfully,

S/-
(N.C.NARASIMHACHARYULU)
ASST. STATION DIRECTOR

Copy to:

1. The Deputy Director General (SR-I), All India Radio, Mylapore, Chennai - 600004.
2. The Pay and Accounts Officer, All India Radio, Mylapore, Chennai. His CTC is sent herewith.
3. The Station Director, All India Radio, Hyderabad for kind information.
4. The Station Director, All India Radio, Waraangal. It is requested that the Service Book and LPC of the official may kindly be sent to this office at an early date.
5. Sri A.Venkata Rao, Programme Executive, CBS, All India Radio, Hyderabad.
6. Accounts Sections ( 2 Copies)
7. PA to ASD/Hindi Translator for Hindi Version
8. Personal File/Service Book.

ASST.STATION DIRECTOR

'పులిమీద పుట'లా నేను వరంగల్‌నుండి హైద్రాబాద్ సి.బి.ఎస్.లో జాయిన్ అయిన కొన్నాళ్ళకే, ప్రసారభారతి సి.ఇ.ఓ శ్రీ కె.ఎస్.శర్మగారు రిటైరవడం, ఆయన మాటపై నా బదిలీ జరిపిన ఉక్రోషం ఉండికాబోలు, సౌత్ అధికారులు - హైదరాబాద్ రీజనల్ ట్రైనింగ్ సెంటర్‌లో పనిచేస్తున్న నా శ్రీమతి ఉషారాణిని వరంగల్‌కు బదిలీ చేయడం జరిగిపోయాయి. వరంగల్‌లో డైరెక్టర్‌గా ఉండిన పి.రాజారావ్‌కు బయటకు బదిలీ జరిగింది. ఆయన ట్రాన్స్‌ఫర్‌కు కె.ఎస్.శర్మగారే కారణమనీ, ఆయనకు నేనే చెప్పానని - రాజారావ్ గారు అనుకున్నారనీ అన్నవారూ ఉన్నారు. కార్యక్రమ నిర్వహణాధికారులలో ఉషారాణి సీనియర్ కావడంవల్ల, వరంగల్‌లో డైరెక్టర్‌ని ఎవరినీ నియమించకపోవడం వల్ల, ఆ బాధ్యతలను ఉషయే అక్కడ నిర్వర్తించవలసి వచ్చింది. విధిలేని పరిస్థితుల్లో తనుకూడా వరంగల్ రోజూ 'షటిల్' చేయవలసి వచ్చింది. ఆఫీసు నిర్వహణా బాధ్యతలూ, ఈ నిత్యపు రాకపోకలూ, తననూ శారీరకంగా, మానసికంగా శ్రమపెట్టాయి. అయినా తను విజయవంతంగా నెగ్గుకురాసాగింది.




# 57

**1978లో** ఆకాశవాణి వివిధభారతి వాణిజ్య ప్రసారవిభాగంలో చేరిన నేను, ట్రాన్స్‌మిషన్ ఎక్జిక్యూటివ్ నుండి ఒకే ఒక్క ప్రమోషన్ (ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్‌గా) పొంది, 2006 జూన్‌లో ఆ హోదాలో, తిరిగి వివిధభారతి వాణిజ్య ప్రసారవిభాగానికే చేరడం ఓ తమాషాయే మరి! మేము చేరినప్పుడు మాకున్న ఆశలు వేరు. అయిదేళ్ళకో ప్రమోషన్ పొంది, అరవయ్యో ఏట రిటైరయ్యేనాటికి, కనీసం 'సెలక్షన్ గ్రేడ్ స్టేషన్ డైరెక్టర్' హోదాలోనైనా రిటైరవుతామనేవారు! అలాంటిది డిపార్ట్‌మెంట్‌లో జరిగిన అనేక పరిణామాల వలన పదమూడు సంవత్సరాలు ట్రాన్స్‌మిషన్ ఎక్జిక్యూటివ్‌గానే ఉండి, 1991లో పొందిన ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్ పోస్ట్‌లోనే ఇంకా కొనసాగుతూ ఉండడం - ప్రమోషన్స్ మాట ఎలా ఉన్నా, ప్రతి మూడు నాలుగేళ్ళకూ ఎక్కడికి బదిలీ అంటారో అనే విచికిత్సలోనే ఉంటూ ఉండడం, వేతనంలో కూడా ఒక స్టాగ్నెంట్‌కు రావడం, అన్నిటికన్నా ముఖ్యంగా ఒకప్పుడు మేం చేరిన నాటి ఆకాశవాణి వైభవ ప్రాభవాలు క్రమేపీ మందగించడం, హేమాహేమీలు అంతా వెళ్ళిపోయి - కళా, సృజనలకు పెట్టింది పేరయిన సంస్థ, అటువంటి వాతావరణాన్నీ, మనుషులనూ, పనిచేసే సంస్కృతినీ ప్రతిబింబించక పోవడం, బయట ప్రైవేట్ రేడియోలూ, టీవీ ఛానెళ్ళ హోరూ పెరిగి, కొత్త తరంలో ఆకాశవాణి పట్ల మోజు మందగించడం వంటివన్నీ - ఉద్యోగంలో సంతృప్తిలేనప్పుడు ఇక స్వచ్ఛందంగా పదవీ విరమణ చేయడమే మేలు అన్న భావనని ఉద్దీపనం చేశాయి. శ్రీ నరసింహాచార్యులుగారు 2007 జనవరిలో రిటైరయ్యారు. డి.డి.ఓగా - ఆయన రిటైర్‌మెంట్ పేపర్లు డైరెక్టరేట్‌కు నా చేతే సంతకాలు చేయించి పంపారు ఆయన. హైదరాబాద్ కేంద్రం డైరెక్టర్‌గా ఉన్న డా.పి.ఎస్.గోపాలకృష్ణగారితో కూడా వాలంటరీ తీసుకోవాలనుకుంటున్న నా అభిప్రాయాన్ని వెల్లడించాను. "తొందరపడకు. పోనీ! వివిధభారతినుండి ఇక్కడకు మళ్ళీ ప్రయత్నిద్దామా?" అని అడిగారాయన. కానీ ఎందుకో అదీ నాకు మనస్కరించలేదు. వివిధభారతి వాణిజ్య ప్రసారవిభాగానికి నరసింహాచార్యులు గారు రిటైర్ అయ్యాక, అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉన్న శ్రీ ఎన్.బాబూరావ్‌ను పోస్ట్ చేయడం, ఆయన బాధ్యతలు స్వీకరించడం జరిగింది. నేను డి.డి.ఓగా ఉండనని తప్పుకున్నాను. హైదరాబాద్ కేంద్రంలో నేను పెక్స్‌కోగా ఉండగా, బాబూరావ్‌గారు అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉండేవారు. దుర్గాభాస్కర్‌గారు డైరెక్టర్‌గా ఉండి నా మాటకు విలువ ఇస్తూండేవారు.



శ్రీ ఎన్.బాబూరావ్

శ్రీ బాబూరావుగారికి కూడా వివిధభారతి కొత్త. రెవెన్యూ పెంచాలన్న టార్గెట్‌లు ఉండేవి. కనుక, ఆయన అందుకోసం శతధా పాటుపడేవారు. ఆ ఒత్తిడులు మా మీద పడేవి! "ఢిల్లీలోని 'క్లైయింట్'నయినా ప్రకటనలు మనదగ్గర బుక్ చేసుకునేలా చేస్తే - ఆ రెవెన్యూ సంపాదించిన ఘనత మన ఖాతాలో పడుతుంది కదా" అనేవారు. "అయ్యా! ఆ క్లైయింట్ నేరుగా డబ్బు చెల్లించేవాడు కాదు. అప్పుపెట్టేవాడే. ఆ అప్పు వసూలు చేసుకునే తలనొప్పులు మనకెందుకు? ఢిల్లీవాడు ఎలాగూ పడుతూ ఉన్నాడుకదా! వాడిని మనవైపు తిప్పుకోవడమెందుకు" అని నాబోటివారంటే ఆయనకి నచ్చేదికాదు. అలాగే - మార్కెటింగ్ డివిజన్ వారు ప్రయత్నాలు చేస్తున్న చోట తాము చొరబడి, ఆధిక్యత చూపుకోవాలనీ, ఆ రెవెన్యూ సంపాదించిన ఖ్యాతి తన క్రెడిట్‌లో పడాలనీ, భావించి ఘర్షిస్తూండేవారు. ఆయన అస్తిత్వం దృష్ట్యా ఆయన భావనలో ఆయన చేసేది సరైనదే కావచ్చుకానీ, ఒక సంఘర్షణాయుతవాతావరణం, ఉద్రిక్తతలూ, టెన్షన్స్ ఉంటూండేవి. ఆఫీసు సిబ్బంది అందరూ ఇబ్బంది పడుతున్నారా, నేనేనా అని విచికిత్సకు లోనయ్యేవాడిని. కానీ చాలామంది పరిస్థితి అదేనని తెలుస్తూండేది. వారికి అనివార్యం! కానీ ఈ టెన్షన్స్‌తో, అనారోగ్యం పాలవడం కంటే, స్వచ్ఛందంగా ఉద్యోగం విరమించుకుంటే మంచిదనిపించింది. ఉషకూడా నన్నూ, నా పరిస్థితినీ చూసి "మీ ఆరోగ్యం ముఖ్యం. మీకెలా అనిపిస్తే అలా చేయండి. నాకు అభ్యంతరం లేదు." అని వెన్నంటి భరోసా ఇచ్చింది. ఆర్థికంగా నా వి.ఆర్.ఎస్ (వాలంటరీ రిటైర్‌మెంట్) వల్ల పరిస్థితులు ఎలా ఉంటాయో తెలీదు. నేను వి.ఆర్.ఎస్ తీసుకుని కాలం ఎలా వెళ్ళదీయగలను అన్న బెంగమటుకు నాకు లేదు. ఎందుకంటే నా సాహితీ వ్యాసంగం నాకు కాలాన్ని భారమనిపించనీయదన్న విశ్వాసం ఉంది. ఆర్థిక పుష్టి లేకపోవచ్చుగానీ, నన్ను నేను 'రికామీ'గా ఏమీ ఉంచుకోను. అయినా కొన్నాళ్ళు సెలవు తీసుకుని, సగం జీతం వచ్చినప్పుడు ఎలా రోజులు వెళ్ళమారుతాయో కూడా చూద్దామని, నా ఆరోగ్యం దృష్ట్యాకూడా, 'హెచ్.పి.ఎల్' అనగా 'హాఫ్ పే లీవ్' వాడుకోవడం మొదలుపెట్టాను. శ్రీ బాబూరావ్ గారికి కూడా త్వరలో నేను వాలంటరీ తీసుకుంటానని ఖచ్చితంగా చెప్పి - సగం జీతం మీద సెలవు వాడుకోవడం చేశాను. ఆ సెలవు శాంక్షన్ చేయడానికి పలుమార్లు ఆయనకున్న ధోరణుల దృష్ట్యా, ఆయన ఇబ్బంది పెట్టిన మాట నిజమే అయినా, నాకు సెలవులో ఉండడం అనివార్యమైంది. ఉష వరంగల్ కేంద్రంలో పనిచేస్తూండడం, ఇంట్లో ఎనభై పైబడిన మా అత్తగారు ఒంటరిగా ఉండకుండా, ఆవిడ ఆరోగ్యం దృష్ట్యా కూడా నేను సెలవుపై ఇంట్లో ఉంటూండడం లాభించాయి. 2007 జూన్‌లో మా అబ్బాయి చిరంజీవి స్నేహిత్ తన ఇంజనీరింగ్ పూర్తిచేసి, 'ఇన్ఫోసిస్' కంపెనీ ఉద్యోగి కావడం కూడా, నా స్వచ్ఛంద పదవీ విరమణ సంకల్పానికి బలాన్ని ఇచ్చింది. చేసినన్నాళ్ళు ఉద్యోగం తృప్తిగా, ఆనందంగా చేశాను. 2011 నవంబర్‌లో రిటైరవుతా నిజమేగానీ, ఇంతలో నాకు కలిగే పదోన్నతి ఏమీలేదు, వేతనంలో ఆధిక్యతేమీ రాదు. దానికి తోడు బదిలీవేటు మాత్రం తలపై వ్రేలాడుతూనే ఉంటుంది. 2008 నాటికి ఆకాశవాణిలో ముప్ఫై ఏళ్ళ సర్వీసు పూర్తవుతుంది. 'ఫుల్‌పెన్షన్'కు అర్హత ఎలానూవుంది! ఉండడానికి ఏదో సొంతగూడు ఉంది. తినడానికి ఇబ్బంది లేదు. కొడుకూ ఉద్యోగస్తుడయ్యాడు. ఒక్కడే అబ్బాయి కాబట్టి వాడి వివాహం అనే బాధ్యత - నెరవేర్చలేని సమస్య ఏమీకాదు! వీటన్నింటి దృష్ట్యా 'స్వచ్ఛందపదవీ విరమణ' చేసి తీరాలని, గట్టిగా సంకల్పం చేసుకుని, శ్రీమతి ఉషకూడా అందుకు మనస్ఫూర్తిగా అంగీకరించడంతో, 2008 ఏప్రెల్ 21న స్వచ్ఛంద పదవీ విరమణ లేఖ, ఆఫీసులో ఇచ్చాను. అది డైరెక్టరేట్‌కు పంపారు. మూడు నెలల ముందు నోటీసు ఇవ్వాలన్న నిబంధననుసరించి జూలై 1, 2008 నాటికి నన్ను బాధ్యతలనుండి విముక్తం చేయమని కోరాను. జూన్ 26న చెన్నయ్ 'పే అండ్ అక్కౌంట్స్' ఆఫీసునుంచి నా క్వాలిఫైయింగ్ సర్వీస్ వెరిఫికేషన్ గురించి లేఖ రావడం దానికి మా ఆఫీసు వారు సమాధానం రాయడం కూడా జరిగినా, నా 'వి.ఆర్.ఎస్' అంగీకరిస్తున్నట్లు డైరెక్టరేట్ లేఖ, నేనడిగిన జూలై 1 నాటికి కూడా రానేలేదు. దానితో జూలై 16 న మరో లేఖ పంపించాను. అయినా ఉలుకూ పలుకూ

లేదు. సెప్టెంబర్ 8న మరో లేఖ పంపడం జరిగింది. చివరకు 2008 సెప్టెంబర్ 16న - ఆగస్టు 1 నుండే నా స్వచ్ఛంద పదవీ విరమణ అంగీకరిస్తున్నట్లుగా లేఖ రావడం, దానిని సెప్టెంబర్ 24న ఆఫీసువారు నాకు అందించడం జరిగింది. జూలై 1 నుండి అడిగినా, ఆగస్టు 1 నుండి అంగీకరిస్తున్నట్లు లేఖ రావడంతో, జూలై నుండి అమలయిన కొత్త వేతన స్కేల్ నా రిటైర్‌మెంట్‌కు వర్తింప చేయడం, ఆకాశవాణి సంస్థ నాకు చేసిన మహోపకారం! డి.డి.జి. శ్రీ జయలాల్‌గారు సహకరించడం వల్లనే నేను కోరిన స్వచ్ఛంద పదవీ విరమణ పొందగలిగాను. డా.పి.ఎస్.గోపాలకృష్ణగారి సహకారమూ తులలేనిది. స్వచ్ఛంద పదవీ విరమణ చేసినా, నా 'పెన్షన్' ఏడాదిపాటు సెటిల్ కానేలేదు. మద్రాస్ పే అండ్ అక్కౌంట్స్ ఆఫీసు నుండి కాగితాలు కదిలి ఢిల్లీకి వెళ్ళడం, ఢిల్లీ నుండి ఆమోదం లభించి బ్యాంక్‌కు వర్తమానం రావడం, నా నెలసరి పెన్షన్ అమలు కావడం, ఏడాది పట్టింది. చివరకు సెంట్రల్ పెన్షన్ అక్కౌంట్ ఆఫీసు నుంచి 27.5.2009న లేఖ అంది, అప్పటినుంచీ 'పెన్షనర్' అయ్యాను. 1978 నుండి 2008 వరకూ ముప్పై సంవత్సరాల ఆకాశవాణి ఉద్యోగ జీవితం - మొదలుపెట్టిన వివిధభారతి నుండి వివిధభారతిలో ముగింపు దాకా - అన్నట్లుగానే ప్రస్థానించింది. ఈ ఉద్యోగజీవితంలో ఎందరు మనుషులు, ఎన్ని సంఘటనలు, ఎన్ని ఆటుపోట్లు!! ఏమయినా నా ఉద్యోగ జీవితం ఎంతో సంతృప్తికరంగా సాగింది. 2011 నవంబర్‌లో 60 సంవత్సరాల వయస్సులో రిటైరవవలసిన వాడిని, ముందుగా 57వ ఏటనే - 2008 ఆగస్టు 1న స్వచ్ఛందంగా రిటైరయ్యాను. ఆకాశవాణితో ముడిపడిన జీవితం - 'ఉద్యోగి'గా స్వచ్ఛందంగా ముగిసింది. ఒకసారి వెనక్కి తిరిగి చూసుకుంటే - ఎంతో తృప్తి! సమస్యలు ఎన్ని వచ్చినా తాత్కాలికంగానే ఉండి బాధించాయి కానీ, ఆ తరువాత దూదిపింజల్లా విడిపోయి, సుఖశాంతులనే అందించాయి. సంస్థలో పేరుపేరునా కృతజ్ఞతలు ప్రకటించవలసిన వారందరికీ నమోవాకాలు!! శ్రోతల అపారమైన ఆదరాభిమానాలు, కవులు, రచయితలు, కళాకారుల సహకారం, సహోద్యోగుల సమాదరణం, ఇవన్నీ మరుతుమన్న మరుపురానివే. నిజానికి 57వ ఏట రేడియోలో ఉద్యోగ జీవితం స్వచ్ఛందంగా విరమించిన - నా 'రేడియోజ్ఞాపకాలను' ఈ 57 నెలలుగా - నా చేత రాయించిన 'కౌముది' అంతర్జాలపత్రిక సంపాదకులు శ్రీ కిరణ్‌ప్రభగారికీ, శ్రీమతి కాంతి కిరణ్‌గారికీ ఎంతగానో కృతజ్ఞతలు. చెప్పాలనుకుని చెప్పలేనివీ, ఇంకా చెప్పవలసినవీ, నా మరుపువల్ల మిగిలిపోయినవీ లేవని అనను! కానీ ఈ ప్రస్థానంలోని చాలా విషయాలను రికార్డు చేయగలిగాను. నా మెయిల్‌కు ఈ కాలమ్ చదివి అభిప్రాయాలు పంపిన పాఠకులకూ ఫోన్లు చేసిన వారికీ, అందరికీ నా ధన్యవాదాలు! రేడియోలోని వ్యక్తులగురించి 'పరి పరి పరిచయాలు' మరికొన్ని వీలువెంట విపులంగా రాయాలని సూచించిన పాఠకమిత్రులకూ కృతజ్ఞతలు. 'చేతవెన్నముద్ద' నుండి 'చేతపెన్షన్' దాకా, ఇదీ నా 'రేడియోజ్ఞాపకాలు' ప్రస్థానం. ఇక సెలవామరి! నమస్తే!






Prasar Bharati
Broadcasting Corporation of India
Directorate General: All India Radio
SI (B) Section

F.No. 4/343/91 -SI(B)/1111 New Delhi, dated 16.09.2008

ORDER No. 53/2008-SI(B)

The competent authority has accepted the notice of Sh. A. Venkata Rao, PEX, CBS, AIR, Hyderabad for voluntary retirement from Government service w.e.f. 01.08.2008 (FN) under Rule 48 A of CCS (Pension) Rules, 1972.

(S. C. Sharma)
Dy. Director of Admn. (P)
For Director General

Copy to:-

1. Sh. A. Venkata Rao, PEX, CBS, AIR, Hyderabad.
2. Station Director, CBS, AIR, Hyderabad. The CTC of handling over the charge may be sent to this Directorate.
3. PS to CEO/DG/DDG (A)/DDG (P).
4. The Pay & Accounts Officer, AIR, Chennai.
5. The President, Programme Staff Association of AIR & Doordarshan, T&PES, AIR, New Delhi.
6. The President, Programme Staff Welfare Association of AIR & Doordarshan 11, BH Annexe, AIR, New Delhi.
7. Order Folder
8. Spare copies – 2

For Director General

**(అయిపోయింది)**

Caution : Only the Payments authorised in this SSA, are to be honoured

केन्द्रीय पेंशन लेखा कार्यालय
भारत सरकार, नई दिल्ली
**CENTRAL PENSION ACCOUNTING OFFICE**
Government of India
TRIKOOT-2, BHIKAJI CAMA PLACE, NEW DELHI-110066
WEBSITE : http://cpao.gov.in
EPABX No. 26174438, 26174596, 26174456 Fax: 011-26167326
**(CENTRAL CIVIL PENSIONS)**

PENSIONER COPY

विशेष मोहर प्राधिकार/सं.
SPECIAL SEAL AUTHORITY: 285540900104/619668

दिनांक
Date: 27/05/2009

To/सेवा मे
THE MANAGER,
STATE BANK OF INDIA,
SBI BUILDING ,
P.B. NO.10,BANK STREET,KOTI HYDERABAD,
HYDERABAD, ANDHRA PRADESH, PIN-500095

Diary No.: **PN10904779**

STNY No.: CC601489A

पे. अ. आ. से कभी भी अलग न किया जाए
THIS SHOULD NOT BE DETACHED FROM PPO

आपसे अनुरोध है कि निम्नलिखित प्राधिकार के अनुसार भुगतान करें।( जिसका विवरण पे. अ. आ. में दिया गया है। )
*You are requested to make payment as per this authorisation below.(Details are given in enclosed P.P.O) to*

**Mr. A VENKAT RAO**

धारक पे. अ. आ. स. Holder of P.P.O. No.:
**285540900104**

पेंशन की श्रेणी Category of Pension:
VOLUNTARY RETIREMENT

जन्म तिथि( पेंशनर)
Date Of Birth(Pensioner).:25/11/1951

वेतन सीमा
Pay Band.: 9300-34800 (6PC)

---

From
A.Venkata Rao
Programme Executive
C.B.S.All India Radio
Hyderabad.500004

The Director General
All India Radio ( S.I(B) Section)
Akashvani Bhavan
Parliament Street
New Delhi-110001

Date: 21.4.2008

Through : Asst.Station Director, Commercial Broadcasting Service, All India Radio, Hyderabad

and Deputy Director General (SR) ,All India Radio,Annasalai marg,Chennai. 600004
Mylapore

Sub: Request for Voluntary Retirement

Respected Sir,

I joined All India radio on 1.6.1978 as Transmission Executive and had the privilege of working for the organization for the last 30 Years and I am thankful to the organization for the opportunity given to me.

Presently I am working as a programme executive at CBS, All India Radio, Hyderabad. Of late I am not keeping good health because of hypertension, Vertigo and Back pain. In view of my ill health I am forced to take leave frequently. Apart from my ill health, I have many domestic problems.

In view of the difficulties faced by me I am not in a position to serve the organization to the best of my abilities. While thanking the organization for the consideration shown to me all these years, I request that I may please be permitted to take Voluntary retirement from Service by 1st July 2008.

I request you to kindly treat this as my notice for the Voluntary retirement and oblige.

Thanking You

Yours faith fully

A.Venkata Rao 21/4/08

(A.Venkata Rao)

Copy to : Deputy Director General (SR), All India Radio , Anna Salai Marg, Chennai. 4
Mylapore

---

From

A.venkata rao
Programme Ececutive
C.B.S,All India Radio
Hyderabad.500004

To
The Director General
(S-1(B) Section)
Prasar Bharati
All India Radio
Akashvani Bhavan
Parliament street ,New Delhi.110001

Dated:8.9.2008

Through : Proper Chaannel i.e: Asst.Station Director,C.B.S,All India Radio,Hyderabad.500004 and Deputy Director General (SR) ,All India Radio,Annasalai marg,Mylapore,Chennai.600004

Sub: Acceptence of my Voluntary Retirement from Service

Ref: 1)My Request for Voluntary retirement letter dated:21.4.2008
2) My Reply on 2.6.2008 to the Directorate letter No.F.no 4/343/91-S1(B) section dated 5.5.2008(sri:K.K.Oberoy,Secton officer for D.G.)
3) My letter dated 16.7.2008 in reply to the S.D.C.B.S,AIR,Hyd office order dated 30.6.08

Respected Sir,

I have submitted my V.R.S. letter on 21st April '08 requesting to accept my voluntary retirement from service from 1st July'2008 and also gave a reminder 0n 16.7.2008.The stipulated three months period is also over by 21st July'2008. Pending acceptance from Directorate I presume that my representation for Voluntary Retirement from Service has been approved by the Directorate but not communicated me so far .

Sir, I request you to kindly Communicate the acceptence of my Voluntary retirement from service and please arrange payment of emoluments which are accrued to me on my Voluntary retirement at the earliest.

Thanking You

Yours faithfully

A.Venkata Rao 8/9/08

(A.Venkata Rao)

Copy to: Deputy Director General (SR),All India Radio,Annasalaimarg,Mylapore,Chennai.600004